# కథల పంట 3



విరసం

# కథల పంట
# 3

విప్లవ రచయితల సంఘం

కథల పంట 3

Kathala Panta 3

విరసం ప్రచురణలు
Website : www. virasam. in
Mail Id : arunatara1977@gmail. com
Like Page://arunatara viplava rachayitala sangham

మొదటి ముద్రణ : జనవరి, 2015
ప్రతులు : 1000
వెల : 120/-
కవర్‌పై బొమ్మ : అశోక్ భౌమిక్
కవర్ డిజైన్ : క్రాంతి
డిటిపి, లేఅవుట్ : ఆర్. భాగ్యలక్ష్మి

చిరునామా :
ఎం.ఎ. బాసిత్,
నెం. 6-38/1, వివేక్‌నగర్ కాలనీ,
కె.సి. కాలనీ, హనుమకొండ,
వరంగల్, తెలంగాణ.
ఫోన్ : 9441348111

ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో

ముద్రణ :
చరిత ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్.
ఫోన్ : 040-27678411

# కొత్త కథ ఆవరణంలోకి...

విరసం కథా వర్కుషాపులు నిర్వహించి ఆ వర్కు షాపులో చదివి పరిష్కరించుకున్న కథలను సంకలనంగా తెస్తున్నది. ఆ వరుసలో ఇది మూడవ రచయితల సమిష్టి సేద్యపు కథల పంట. ఈ వర్కుషాపుల నిర్వహణలో రాష్ట్ర వ్యాపితంగా ఉన్న విరసం రచయితలతో పాటు మిత్ర రచయిత/త్రులు – ఏ ప్రాంతంలో నిర్వహిస్తే అక్కడి వాళ్లు పాల్గొంటున్నారు. ఈ వర్కుషాపుల వలననే కథకు సంబంధించిన విస్తృతి, అధ్యయనం పెరిగి – ప్రాంతాల వారిగా, జిల్లాలవారిగా కథా సాహిత్యం సేకరణ, అధ్యయనం ముందుకు వచ్చింది. బహుశా అన్ని ప్రక్రియల కన్నా కథ అనేక రకాలుగా నేడు చర్చలోకి రావడమే కాక పరిధి, విస్తృతి పెరిగింది. ఇలాంటి కథల వర్కు షాపులు విరసం మాత్రమే కాక ఇతర సోదర రచయిత/త్రుల ఏర్పాటు చేసుకోవడానికి ప్రేరణ అయ్యింది. 1980 నుండి ఇప్పటి దాకా జరుగుతున్న ఇలాంటి వర్కుషాపుల్లో రాచకొండ విశ్వనాథ శాస్త్రి, కాళీపట్నం రామారావు, భూషణం లాంటి ఎందరో పాల్గొన్నారు. దాదాపుగా విరసంలో కథలు రాసేవాళ్లందరు ఏదో ఒక సందర్భంలో పాల్గొన్న వాళ్లే. నా మట్టుకు నేను ఎక్కువ భాగం వర్కు షాపుల్లో పాల్గొని – తెలుగు కథల గురించే కాదు – ఇతర భారతీయ భాషలల్లో వస్తున్న కథల గురించి, ప్రపంచ వ్యాపితంగా వచ్చిన కథా సాహిత్యం గురించి తెలుసుకున్నాను. ఈ వర్క్‌షాపుల నిర్వహణ రూపం అనేక విధాలుగా మారి ఇప్పుడు కొనసాగుతున్న కథ చదవడం – ఆ కథ మీద హాజరైన వాళ్లు తమ అభిప్రాయాలు చెప్పడంగా ఇప్పుడు కొనసాగుతున్నది. మూడు నుంచి నాలుగు రోజులుగా ఈ సమావేశాలు జరగడం, కథ మీద చర్చ జరిగినప్పుడు 'కాదేదీ కథకనర్హం' అన్నట్టు కథాంశం, వస్తువు, శిల్పం, భాషల విషయంలోనే కాక రాజకీయాలు, దృక్పథం, చరిత్ర, వైరుధ్యాలు, సినిమాలు, భారతీయ సాహిత్యం, ప్రపంచ సాహిత్యం మొదలగు అనేక విషయాలు సందర్భానుసారంగా చర్చలోకి వస్తాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే – సమిష్టి అధ్యయనం, నేర్చుకోవడం, రాయడంగా ఈ వర్కుషాపులు నడుస్తున్నాయి.

సినిమాల గురించి సత్యజిత్‌రే మాట్లాడుతూ "ఒక మంచి, ఒక చెడు అనే భారతీయ సాంప్రదాయిక కథా చట్రము (బహుశా ఇది భారతదేశంలో కొనసాగిన బ్రాహ్మణీయ భావజాలం అంత పురాతనమైంది, జఠిలమైంది, రామాయణ, మహాభారతంలాంటి పురాణాల సాంప్రదాయం) మన సమాజంలో పాతుకపోయి ఉంది. జన్యువుల్లో పెనుమార్పులు జరిగితే తప్ప ఇది బద్దలు కాదు" అంటారు. ఆయనే చెప్పినట్టు "సినిమా (కథ)లో వైరుధ్యాలు, ఘర్షణలు ఉండాలి, అవెంత చిన్నవైనా, సూక్ష్మమైనవైనా సరే, ప్రశాంతతలో అలజడి కలగాలి, మూసలు కదిలిపోవాలి, ఆందోళన కలగాలి."

ఈ సంకలనంలో పందొమ్మిది కథలున్నాయి. "డోలీ" ఉదయమిత్ర కథ చత్తీస్‌ఘర్ – మహారాష్ట్ర సరిహద్దు ఆదివాసీలకు సంబంధించినది... ఒక పక్క తీవ్రమైన నిర్బంధం – పోలీసులు, సల్వాజుడుం పాశవిక దాడులు – కనీస వసతులు లేని అడవిలోని గ్రామాలు – ప్రసవవేదన పడే అమ్మాయిని డోలీ మీద హాస్పిటల్‌కు చేర్చేలోగా మరణిస్తుంది. అతి హృదయ విదారకమైన కథ. ఇది ఎంతో అభివృద్ధి సాధించామని ఊదరగొట్టే భారతదేశంలో ఆదివాసీ గ్రామాల స్థితి.

"గొర్లు" గీతాంజలి కథ ఒక నవలకు సరిపడ వస్తు వైవిధ్యం కలిగింది... కథ మహబూబ్‌నగర్ కరువు పల్లెలు, బొంబాయి కూలి జీవితం – మళ్లీ ఏటూరు నాగారం అటవీ ప్రాంతాలల్లో గొర్రెలు మేపడం – అనేక వైవిధ్యమైన వివరాలతో నడుస్తుంది.

"అడిగేటోళ్లు" పి. చిన్నయ్య కథ పల్లెలు విధ్వంసమై పట్టణాలు బలుస్తున్న నాగరికతలో పల్లెలచుట్టూ ఉన్న ఇసుక తరలింపు – పర్యావరణ విధ్వంసం కాపాడుకోవడానికి ఒకప్పటి అన్నల స్ఫూర్తి.

"ఈస్ట్‌విండ్" సోమయ్య కథలో కరువు దాడిలో పాల్గొని జైలుకు పోయిన బుడగ జంగాల కళాకారుడు ప్రజల పాటలు నేర్చుకుంటాడు...

"నర్సిం" ఇక్బాల్ కథ నర్సిం అనే చిన్న పిల్లవాడి కథ. ఎయిడ్స్ సోకిన కుటుంబాల లోలోపలి హింస.

"రాళ్లుగొట్టి" బాసిత్ కథ బంగారు తెలంగాణ సాధిస్తామనే తెలంగాణలో, రాళ్లుగొట్టి బతికేవాళ్ల గుడిసెల కబ్జా.

ఇందులో ఏడు కథలు మహిళలకు సంబంధించిన అనేక కోణాలు తడిమినవి... అతి సంక్లిష్టమైన పితృస్వామిక సమాజపు భావజాలం గురించి వివిధ కోణాల్లో చర్చించినవి... కనుక ఒక్కొక్క కథను కొద్ది మాటల్లో వివరించడం కన్నా చదువాల్సిందే...

భారత దేశంలోని చట్టం జైళ్లు – మహిళల పట్ల ఎంత అమానుషంగా ఉన్నాయో

– మొత్తం భారతీయ మహిళల స్థితికి అద్దంపట్టే కథ హజారిబాగ్ జైలు నేపథ్యంలో రాసిన అనూరాధ కథ "ఒక పారో కథ"...

"డిశంబర్ 3" శశికళ వికలాంగుల మానసిక స్థితుల మీద రాసిన కథ. "కొన్ని రంగులు ఒక కల" స్వాతి విద్యార్థుల మీద రాస్తే, రాజ్యం కుందేలును కూడా సింహంగా మారుస్తుందనే కథ "సింహంగా మారిన కుందేలు కథ" కూర్మానాథ్.

"ఎ4" పాణి కథ అవినీతి కుంభకోణంలో ఇరుక్కపోయిన హోం మినిష్టరు కథ. "విభజన రేఖలు" వెంకటకృష్ణ కథ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నేపథ్యంలో – రాయలసీమలో నడిచిన ఆందోళనలకు సంబంధించినది.

చివరి కథ – "కాంత–పున్నం–వెన్నెల" ఉత్తర తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన కీలకమైన దశకు సంబంధించినది. పైగా ఈ కథలో విప్లవ పోరాట క్రమంలో చలనంలో ఉండే వైరుధ్యాలు – మానవ సంబంధాలు – ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాలు – తల్లిదండ్రులు – పిల్లల సంబంధాలు చర్చించిన కథ.

గ్రామీణ ప్రాంతాలల్లో అప్పటికే విప్లవ పోరాట క్రమంలో ఏర్పడి పనిచేస్తున్న ప్రజారాజ్య కమిటీలు ఉత్తర తెలంగాణలో పై నుండి తీవ్రమైన శత్రు నిర్బంధం, లోపలి నుండి, ఆర్థిక వాదం, అతివాదాలకు లోనై సాయుధ దళాలు తీవ్రమైన నష్టాలకు లోనయ్యాయి. అలాంటి సందర్భంలో ఆదివాసి పున్నం – దళిత కాంత దళంలో సహచరులు. దళ జీవితంలో కాంత గర్భం దాలుస్తుంది. కన్నతల్లి ఊగిసలాట కాంతకు ఆరోగ్యం సహకరించక వెన్నెల పుడుతుంది. చిన్నారి వెన్నెల పెంపకం చుట్టూ తిరిగే ఈ కథ... అనివార్యం. పున్నం దండకారణ్యంలోకి వెళ్లి మరింత పెద్ద బాధ్యతతో అమరుడౌతాడు. కన్న పేగు కోసం బయటకొచ్చిన కాంత – పార్టీకోసం వెతుకులాట ఈ కథ నిండా...

విచిత్రంగా గత సంవత్సరం వరంగల్లులో జరిగిన విరసం మహాసభలకు కాంత, వెన్నెల వచ్చారు. సభలు ప్రారంభానికన్నా ముందు అమరవీరుల స్థూపం ముందు వెన్నెలకు మరెందరిరో జోహర్లు అర్పించారు. అందరు హాలు లోపలికి వెళ్లారు. లోపల సభ ఆరంభమయ్యింది... చాలా సేపు అమరవీరుల స్థూపం దగ్గర నిలుచున్న చిన్నారి వెన్నెల – ఏమి ఆలోచించిందో? లోపలికి వెళ్లి వేదిక మీద నడుస్తున్న పాటలో – బ్యాలెలో కలిసిపోయింది. అచ్చం పాట కోసం దళంలో కలిసిన వాళ్లమ్మ కాంతలాగే... జీవితం – కథ కలెగల్సి కొనసాగిన సందర్భమిది...

ఈ పందొమ్మిది కథలల్లో సాంప్రదాయిక పద్ధతితో పాటు – భిన్నంగా, గతితార్కికంగా, మూలాల్లోకి వెళ్లి ఆలోచించే కథలు ఉన్నాయి. ఇది ఒక రకంగా

విప్లవ కథా సాహిత్యంలో ఒక గుణాత్మకమైన మార్పు. సమిష్టి అధ్యయనం ద్వారా నేర్చుకోవడం కథల్లో కన్పిస్తుంది. కొత్త కథా ఆవరణంలోనికి ముఖ్యంగా, ఎక్కువగా రచయిత్రులు ప్రవేశించి కథను పరిపుష్టం చేయడం ఈ సంకలనంలో కన్పిస్తుంది.

పాఠకులు ఈ కథలన్ని చదివి చర్చించాలని కోరుకుంటూ, సంక్లిష్ట భారతీయ సమాజంలో – విప్లవోద్యమాలు, ప్రజల పురోగమనానికి సంబంధించి – అన్ని రకాల చీకటి కోణాల్లోకి కొత్త వస్తువుతో, శిల్పంతో – తగిన భాషతో కథ ప్రయాణం చేయగలదని – బహుశా ఆ దశ, దిశలో ఇందులోని పందొమ్మిది రచయిత/త్రులు ఉన్నారని తలుస్తూ...

**– అల్లం రాజయ్య**

1 ఫిబ్రవరి, 2015

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | డోలి | ఉదయమిత్ర | 9 |
| 2. | గొర్లు | గీతాంజలి | 23 |
| 3. | నర్సిం | ఇక్బాల్ | 49 |
| 4. | ఈస్ట్ విండ్ | సోమయ్య | 58 |
| 5. | అడిగెటోళ్లు | పి. చిన్నయ్య | 63 |
| 6. | రాళ్లు గొట్టి... | బాసిత్ | 70 |
| 7. | కుక్క | పి. వరలక్ష్మి | 80 |
| 8. | గూటికి చేరిన వేళ | పి. విజయలక్ష్మి | 85 |
| 9. | తోడు | ఎం. శ్రీనివాసరావు | 93 |
| 10. | రమాదేవి కొడుకు | సుభాషిణి | 103 |
| 11. | పెళ్ళి సందర్భం... | నల్లూరి రుక్మిణి | 115 |
| 12. | బాధ్యత | తాయమ్మ కరుణ | 136 |
| 13. | ఒక పారో కథ | బి. అనూరాధ | 148 |
| 14. | డిసెంబర్–3 | ఆర్. శశికళ | 164 |
| 5. | కొన్ని రంగులు.. ఒక కల | స్వాతి | 171 |
| 16. | సింహంగా మారిన కుందేలు కథ | కె వి కూర్మనాథ్ | 182 |
| 17. | ఏ4 | పాణి | 186 |
| 18. | విభ'జనరేఖలు' | జి.వెంకటకృష్ణ | 201 |
| 19. | కాంత పున్నం వెన్నెల | పద్మకుమారి | 211 |

# డోలీ

## ఉదయమిత్ర

'గీ దరిద్రపోడు ఎప్పుడొస్తడో ఏమో... యాడికన్న పంపిస్తే ఏట్ల రాయేసినట్లే"... అనుకుంట మైనాబాయి ఇంట్లకూ బయటకూ కాలు గాలిన పిల్లిలా తిరుగుతోంది. ఆ ముసల్దానికి ఎక్కడా మనసు కుదురుతలేదు. పిచ్చిదానిలా చేయి నులుముకుంటూ అటూ ఇటూ తిరుగుతోంది. బయటికొచ్చి నొసలు మీద చేయి దాపుపెట్టుకోని తేరిపారజూస్తోంది. ఎంత కళ్లు చికిలించుకోని జూసినా... కనుచూపుమేరా ఆమెకు చెట్లూ గుట్టలు దప్ప.. ఆమె అల్లుడి జాడ మాత్రం కానరావడం లేదు... కుమ్మాంగోల్ పక్షి ఒకటి ఏదో అశాంతితో ఆ చెట్టు నుంచి ఈ చెట్టు మీదకి ఎగురుతూ అలిసిపోతోంది.

* * *

కన్నెమర్క ఓ ఆదివాసీ గ్రామం. అది ఛత్తీస్‌ఘడ్ మహారాష్ట్ర సరిహద్దులో ఉంది. ఊళ్లో ఉన్నది ఒక్కటే ఇల్లు.. ఇలాంటి "ఒక్కిల్లు" ఊర్లు, ఆదివాసీ ప్రాంతాలలో మామూలే.

ఆ ఊరికి పక్కలోనే కొండల నుంచి పారే నీళ్లలో ఓ వాగు పోతుంటది. ఊరికి ఎటు జూసినా ఎత్తయిన కొండలే దర్శనమిస్తాయి. దట్టమైన అడవీ... కొండల మధ్య 'కన్నెమర్క' ఉంటది.

ఆ ఇంట్ల తల్లి (మైనాబాయి), తండ్రి (కజ్జం)లతో బాటు అల్లుడు (బండు) పోగా మిగిలింది ముగ్గురు పిల్లలు. పెద్ద పిల్ల మోతీ వయస్సు 16-17 సంవత్సరాలుంటాయి. ఆమె తన ఇష్టంతో పొరుగున ఉన్న సిరొంచ యువకుడు 'బండు'ని పెళ్లి జేసుకుంది. చిన్నమ్మాయి సంబరంలో ఆహిరిజూసొద్దామనిపోయి వారం రోజులు దాటుతోంది. పిల్లోడు జుగ్ను ఏదో పని మీదున్నాడు. ముసలాయన 'కజ్జం' మాత్రం పొద్దున్నే లేచి... మైలు దూరంల ఉన్న గోర్గ చెట్టు కల్లు దింపటాన్కి పోయివొచ్చాడు.

ఆ రోజు కుటుంబ సభ్యుల సంఖ్య ఏడుకు పెరుగుతుందని లెక్కలయితే వేసుకుంటున్నారు గాని, సంబరపడడం మాత్రం లేదు. పైగా ఇంటి పెద్దల ముఖాలల్లో విపరీతమైన ఆందోళన ఉంది... వర్షం వెలిసి వాతావరణం చల్లగా ఉన్నా, వాళ్ల ముఖాలకు చెమటలు పడ్తున్నాయి...

* * *

రాత్రి నుంచి తన కూతురు మోతీ నొప్పులు పడ్తోంది గాని ప్రసవంగావడం లేదు.. ఆ పిల్లనొప్పితో నిప్పుల మీద పొర్లుతున్నట్టుగా ఉంది. గావుకేకలు పెట్టి పెట్టీ ఆ పిల్ల అలసిసొమ్మసిల్లిపోయింది. ఆ పిల్లకు కలుగబోయే సంతానంతో, ఆ సంఖ్య ఏడుకే పెరుగుతుందో... లేక "ఆదివాసీ ప్రసవం మరో జన్మతో సమానం" కాబట్టి, అది తల్లి ప్రాణానికే ముప్పుదెచ్చి, ఆ సంఖ్య అయిదుకే పడిపోతుందో తెలియదు.

* * *

చుట్టుపక్కల నిర్బంధం కమ్ముకొస్తున్న వాతావరణం. అసలే శిశుమరణాలు ఎక్కువగా ఉన్న దండకారణ్యంలో ఎంతమంది తల్లులు సుఖంగా పురుడు పోసుకుంటారో తెలీదుగాని, వాళ్లకు ప్రతిదీ దిన దిన గండమే. వాళ్లకు గర్భం ధరించడమూ, దాని మధుర జ్ఞాపకాలు ఇట్లాంటివేమీ తెలీవు... ఉన్నదల్లా రెండు చేతులూ అడ్డంపెట్టి దీపాన్ని గాపాడుకున్నట్టు గర్భాన్ని గాపాడుకోవడమే.

ఆదివాసీ స్త్రీలకు రక్తహీనత అతిపెద్ద సమస్య... నెలలు బాగా పెరిగితే దప్ప... వాళ్లు గర్భంతో ఉన్నట్టు తెలియదు. స్త్రీలకు కనీసం 11 గ్రాములు రక్తం ఉండాల్సిన చోట, 5 లేదా 6 గ్రాముల రక్తం ఉండటం భీతిగొలిపే విషయంగా అరుంధతీరాయ్ లాంటి వాళ్లు చెబుతుంటారు.

ఈ రక్తహీనతతో బాటు, నిత్యం తమ గూడేలపై సల్వాజుడుం మూకలు, పోలీసులు గల్సి చేసే దాడుల్తో ఆదివాసీ స్త్రీల జీవితం కకావికలమైపోయింది.

కాండానికి పట్టిన తెగులు ఆకుల దాంకా పాకినట్టు, జుడుం ప్రభావం... ఆ కాలంలో పుట్టిన పసికందులపైనా పడింది. గర్భిణీ స్త్రీలు, ప్రశాంతత లేని జీవితాన్ని గడపడం వల్లా, చాలాసార్లు పరుగెత్తాల్సి రావడం వల్లా, సరైన తిండిలేకపోవడం వల్లా, గర్భంలో ఉన్నప్పుడు దెబ్బతినడం వల్లా, అత్యాచారానికి గురి అవడం వల్లా, పిల్లలు నెలలు నిండకుండానే పుట్టడం, కడుపులోనే చనిపోవడం, పుట్టగానే చనిపోవడంలాంటివి జర్గుతుంటాయి. సరైన పోషకాహారం లేకపోవడం వల్లా... బతికున్న పిల్లలకు పాలు దొర్కకకపోవటం వల్ల... తల్లులూ పిల్లలూ బలహీనంగా ఉంటారు... సరిగ్గా చెప్పాలంటే ఏదో శాపగ్రస్తుల్లా ఉంటారు.

చలికాలంలో పోలీసులు దాడికొస్తే... అడవిలో ఉండాల్సి రావటం నరకమే... పురాణాల్లో చెప్పినట్లు దీన్ని "రౌరవాదినరకం" అనాలేమో... బట్టలు తీసుకెళ్లలేకపోయే వాళ్లుగాబట్టి, కప్పుకోవడాన్కి ఇబ్బందిగా ఉండేది. నీళ్లు లేక, తిండిలేక, సరైన బట్టలు లేక ఆకలితో నేలమీదనే పడుకునే వాళ్లు.

అడవిలో ఆకూ అలమూ వెతికి తిందామంటే, పిల్లల్ని విడిచిపొయ్యే పరిస్థితి లేదు. ఈ విషయంలో ఆడవాళ్ల దారి ఆడవాళ్లదీ, మగవాళ్ల దారి మగవాళ్లదీ... పిల్లల్ని ఎక్కడన్నా పెట్టిపోదామంటే, పోలీసులు ఎత్తుకుపోతారనే భయం...

ఇంక కొంత పరిస్థితి చల్లబడ్డాంక, ఇంటి దగ్గరకొస్తే అదో నరకం. ధ్వంసమైన ఇంటిని ఒక కొలిక్కి ఎట్లా తీరాల్నో, ఏడ్చే పిల్లల్ని ఎట్లా సముదాయించాల్నో తెలీక వాళ్లు గురయ్యే మానసిక ఒత్తిడి ఏ అక్షరానికీ అందనిది.

* * *

సముద్రంలో ద్వీపాలున్నట్టు అడవిలో 'కన్నె మర్క'లాంటి ఊర్లు చాలానే ఉంటాయి. అవి ఒకదానికొకటి దూరంగా ఉన్నా, గతంలో రాకపోకలు సవ్యంగా ఉండేవి. వాళ్లకు కాలిబాటలే కల్ప తరువులు... నోటి మాటలే సెల్‌ఫోన్లు.. ఎవరికి ఏ ఆపదొచ్చినా, సమిష్టిగా ఆదుకునే తీరు ఓ అద్భుతం... సమిష్టిగా భూములు పంచుకోవడం, సమిష్టిగా పంటలు పండించుకోవటం, పండుగలు నృత్యాల్లాంటి ఉమ్మడి సంస్కృతిని మనం ఆదివాసీల నుండి అందిపుచ్చుకోవాల్సిందే...

ఇప్పుడా సంస్కృతీ లేదు... ఆనంద కోలాహలమూ లేదు. ఆదివాసీలు అడవిని విడిచిపెట్టేది లేదన్న పాపానికి, రాజ్యమూ, కార్పొరేట్ కంపెనీలు, జుడుంమూకలు గల్సి చేస్తోన్న దాడిలో వాళ్లు చెట్టుకొకరు పుట్టుకొకరుగ చెదిరిపోతున్నారు...

* * *

వర్షం పూర్తిగా తగ్గింది.

దూరంగా కొండపోడులో కోసిన పంట కుప్పలు, నూర్పిళ్లుగాకుండా అలాగే మిగిలి ఉన్నాయి. వర్షంలో తడిసిన ధాన్యం ముతకపడిపోతున్నది. అకాల వర్షాల్తో రైతులకెన్ని తిప్పలో...

"బండు ఇంకా రాడేందే?" అడిగాడు కజ్జుం...

"వొస్తడేమో... అసలే వానాకాలం... బాటంతా బుర్దగదా... కొండెక్కి దిగాలె... వాగు దాటాలె... మాటలా ఏంది"... విసుగ్గా అంది మైనాబాయి...

"అది సరే... ఐదు కిలోమీటర్లు నర్సుబాయి నడ్సివొస్తదంటవా"...

"ఏమో... గీసర్కారీ నౌకరీ జేసెటోల్లు... ఆదివాసీల మాట ఇంటరా మరి..."

"అది సరే... బందు తోటి ఏమన్న పైసలిచ్చి పంపినవా..."

"నాతాన యాడున్నయి... మొన్న ఆమె సిన్నాయినొచ్చి, గిన్ని పైసలిచ్చి పోలీసులొస్తరన్న భయంతోటి గుట్టలల్లకుర్కిండు... గాపైసలల్లకెల్లి ఓ రొండొందలిచ్చి పంపిన."

"అంత దాంక... గా నర్సుబాయి వొచ్చే దాంక, పిల్ల బతికితే చాలు..."

"ఏమో... దేవుని దయ"...

* * *

కాళ్ళీడ్చుకుంటూ వొచ్చాడు బందు.

ఆతని కళ్లలో దిగులు కన్నీళ్ళుగా కారిపోతోంది.... వాడు విషాదానికి తోబుట్టువులా ఉన్నాడు... గుండెల్లో గూడు కట్టుకున్న బాధతో మాటలు పెకలకపోయినా, రెండు మాటలు చెప్పగలిగాడు... "నర్సుబాయి లేదు... సంక్రాంతి పండుగకు ఇంటికి వోయింది" అని. అతనలా చెబుతూ చెబుతూ గుడిసె మొదట్లో కుప్పగూలిపోయాడు. కడుపులో ఉన్నప్పుడు ఒకటి రెండు సార్లు మోతీని కొట్టడాన్ని తల్చుకొని బిగ్గరగా ఏడ్వసాగాడు... తాను ఆ ఇంటికి ఇల్లరికం అల్లుడు (లాడమ్)గా రాకున్నా బాగుండేదేమోనని, అట్లానన్నా ఆమెకీ తిప్పలు తప్పేవేమోనని గుండెలు బాదుకుంటూ ఏడ్చేశాడు....

చెట్ల ఆకుల మీద నుండి వర్షపు నీరు బొట్లు బొట్లుగా రాలుతుంటే, చెట్లు ఏడుస్తున్నట్టుగా ఉన్నాయ్. అసలు చెట్లేమిటి? ఆ పిల్ల పరిస్థితి జూసి, సమస్త ప్రకృతీ ఏడుస్తున్నట్టే ఉంది.

* * *

అవతల మోతీకేమొ అంతకంతకూ నొప్పులు ఎక్కువవుతున్నాయి. ఆ పిల్లకు జీవితం ఏడుపునే మిగిల్చినట్టుగా ఏడుస్తోంది... మైనా బాయి ఓదార్చడం తప్ప ఏమీ చేయలేకపోతోంది. దుఃఖం... పాత అప్పులోడిలాగ వాళ్లను విడిచి పెట్టడం లేదు. ఇప్పుడేం చేయాలి? చూస్తుండగానే, పిల్ల కళ్లముందరే చచ్చిపోయేటట్టుంది.

అందరూ కల్సి ఓ నిర్ణయానికొచ్చేరు..

పిల్లను 'సిరొంచ'కు దీస్కపోవాలె... అది పెద్ద ఊరు... అక్కడైతే వైద్య సిబ్బంది ఉంటరు... కానీ... అదీ అయిదు కిలోమీటర్ల దూరం ఉంటది... ఇంట్ల ఉన్నది ముసలాయన "కజ్జుం" – అల్లుడు "బందు" సిన్నపోరడు. మైనాబాయి దూరం నడువలేదు. ఫర్లాంగు దూరం నడిస్తే పడిపోతుంది.. ఏది ఏమన్నాగాని పిల్లను "సిరొంచ"కు తీసుకుపోవాలె.

* * *

“డోలీ” తయారయ్యింది.

‘ఓ పొడవాటి కట్టెకు దుప్పటిలాంటిది గట్టి, దానిలో మనిషిని పడుకోబెట్టి, ఇద్దరు మనుష్యులు మోసుకుపోతారు. అడవిలో ఎమర్జెన్సీలో మోసుకుపోవడాన్కి ఆదివాసీలకు అదొక్కటే సాధనం. వాళ్లకు “డోలీ” అనేది, మనకు ఆటో లేదా 108 వంటిదన్నమాట... మోసుకుపోయే వాళ్లు ఎక్కువుంటే, మంచం మీద గూడా తీసుకుపోతారు.

ఎడతెగక మూల్గుతున్న మోతీని దానిలో పడుకోబెట్టి. ఏవేవో పొడి పొడి ధైర్యాలు జెప్పి వాళ్లు బయలుదేరారు. తడికె నానుకొని గాజు కళ్లతో అట్లా చూస్తూ ఉండిపోయింది మైనాబాయి.

* * *

గాలి వీచినపుడు కొమ్మలు ఊగుతున్న మంద్రమైన చప్పుడు తప్ప, అడవి అంతా నిశ్శబ్దంగా ఉంది. వడ్లపిట్ల తనబలమైన ముక్కుతో చెట్టుకు బొరియజేస్తోంది. భూమి భూమంతా పచ్చి బాలెంతరాలిలా ఉంది... ఏడవడాన్కి సిద్ధంగా ఉన్న మనిషిలాగ... కురవడాన్కి సిద్ధంగా ఉన్న ఆకాశం నల్ల నేరేడు పండులా ఉంది.

“ఇయ్యాల సంక్రాంతి రోజంట మామా” అన్నాడు బండు, పంగల కర్రల్తో ఊడుగు కొమ్మల్ని ఒడుపుగా జరుపుతూ...

“ఔనంట”... ముక్తసరిగా జవాబిచ్చాడు కజ్జుం...

సంక్రాంతి ముగ్గులూ, పిండివంటలూ, కొత్త బట్టలూ ఇవేమీ తెలీవు వాళ్లకి... ఆదివాసీలకు సంతోషంగా ఉండుడే పండుగ... అదేమో చాలా అరుదు.

వాళ్లు సుదీర్ఘ ప్రయాణంలో మజిలీలు లేని బాటసారుల్లా ఉన్నారు. చాలా పెద్ద పెద్ద అర్థాలను చిన్న చిన్న మాటల్లో చెప్పగలిగే కవితా చరణాల్లాగ ఉన్నారు. పల్చటి కాలిబాటెంబడి, వెదురు కొమ్మలు తగలకుండా నానా అవస్థలు పడుతూ నడుస్తున్నారు వాళ్లు. భూమి బురదగా ఉండడంతో అడుగు తీసి అడుగు వేయడం చాలా కష్టంగా ఉంది... నిశ్శబ్దం... అది బయటిదో లోపలిదో తెలియదు...

“దీనమ్మ కడుపు గాల... పద్దెనిమిదేళ్లాయే... మోతీ పుట్టకముందు మొదలాయె. ఇంకా గీ ‘టాడా’ కేసు తిరుగుతలేదు...” అన్నాడు కజ్జుం భారంగా. ఆ మాటలు అతను కజ్జుంతో అన్నాడో, చెట్లతో అన్నాడో తెలియదు.

‘‘ఔను మామా... గీ‘టాడా’ను తీసేసిన్రన్నరుగానీ, ఇంకా మన మీద నడుపుడేందో’’ అన్నాడు బండు డోలీ భుజం మార్చుకుంటూ...

“వెదురుకూపులల్ల, తునికాకుసేతలల్ల వొచ్చే డబ్బంతా కోర్టు ఖర్చులకే గావట్టే...

ఆఖరికి గొడ్లను, మ్యాకలను అమ్ముకున్నా గీ దరిద్రపు "టాడా" కేసు తెగుతలేదు."

"ఔనుమామా... ఇది మనకు కొండ శిలువలాగా సుట్టుకున్నది. ఇది ఇడిస్తేగాని మనకు ఊపిరాడదు."

"గదెప్పుడో... ఇల్లు గడ్సుడే కష్టమయ్యింది. గీనడుమ గోర్ల కల్లుగూడ అమ్ముడు మొదలెడ్తి. రోజూ పొద్దునే లేసి, ఐదు కిలో మీటర్లు నడ్సి కల్లుదేవాలె. గాసిరొంచోల్లు నా దగ్గెర లీటరు పదిరూపాయలకు కొని గక్కడి పోలీసోల్లకు మస్తు లాభాన్కి అమ్ముకుంటరు... గీకల్లు కోసమేనేమొ. పోలీసోల్లు జర్ర మనల్ని చూసీ చూడనట్టుంటరు.

"సిరోంచల పోలీస్ స్టేషన్ గట్టేటప్పుడు మనం గూడ పని జేసినం గద."

* * *

అడివంతా ఎటు జూసినా సారంగి చెట్లె... ఇవి సాల వృక్షాలుగా ప్రసిద్ధి. ఇవి అనేక రకాలుగా ప్రజల్ని ఆదుకుంటాయి... ఆకుల్తో డొప్పలు, ఇస్తరాకులు కుట్టుకుంటారు. దీని నుండి బంక తీసి అమ్ముకుంటారు. ఊదు (గుగ్గిలం)గా మార్కెట్లో దొర్కుతుందిదే... దీని గింజల్నుండి తీసే నూనె "వనస్పతి"గా విరివిగా ఉపయోగిస్తారు.

"అవ్ మామా – అడవిల దొరికే వొస్తువులనమ్ముకొని, కలోగంజో దాగి బత్కుతుంటిమి... గిప్పుడు గీ భూమిల రాగి, అల్యూమినియంలు ఏవేవో దొర్కుతున్నయ్యంట..." అన్నాడు బండు చెట్లవైపు చూస్తో – అవి తనకు దూరమవుతున్న ఆత్మబంధువుల్లా భావించాడతను.

"ఔనురా... గవే మనకు ముప్పుదెచ్చె... మనకాల్ల కింద సంపద మనకే ఉరి తాడవుతున్నది... దానిమీద పెద్ద పెద్ద కంపెనీల కన్ను వడ్డది. కంపెనీలు, సర్కారోల్లు గల్సి మనమీదికి పోలీసుల్ను పంపిస్తున్నరు..." – అన్నాడు కజ్జుం నిట్టూర్చుతూ...

"మనల్ని అడవిలకెల్లి ఎల్లగొట్టనీకె ఎన్నెన్ని జేస్తున్నరో... జుడుమోల్లను ఉసిగొల్పిరి, గూడేలు తగులవెట్రి, ఆడోల్లను ఆగంజేసిరి, ఆఖరికి పానాలు గూడ దీసిరి... గింత పాపం... పగోల్లు గూడ జేయరు."

"ఆడవి ఇడ్సిపెట్టేది లేదని, తిర్గవడితే, నక్సలైట్లని కాల్చి చంపుతున్రు... సముద్రాన్ని మొండిసేతుల్తోటి ఈదినట్టున్నదిరా..."

* * *

వాళ్లు బరువును తట్టుకోవడాన్కి డోలీని భుజాలు మార్చుకున్నారు. మధ్య మధ్యన మోతీని పలుకరిస్తూ, పంగల కర్రతో తాటిస్తూ నడుస్తున్నారు. పంగల కర్ర అంటే డాక్టర్ మెడలో స్టెతస్కోప్‌లాంటిదన్నమాట... అది తాకితే చాలు, భూమి స్వభావం తెల్సిపోతుంది – తదనుగుణంగా అడుగులు పడ్తాయి..

వాళ్లకు మార్గమధ్యలో మరో ఆదివాసీ తటస్థపడ్డాడు... అతని చేతిలో కోడిపుంజు ఉంది. పక్కన ఓ పిల్లాడు ఉన్నాడు... వాడికి ఒళ్లంతా గజ్జిపుండ్లు... పైగా జ్వరం... వాడికి నయం గావాలని కొండదేవతకు కోడిపుంజును బలి ఇవ్వడాన్కి బయలుదేరారు వాళ్లు... ఏ వైద్యమూ లేని చోట... ఆదివాసీలు ఇట్లాంటి నమ్మకాలు కల్గి ఉండడం సహజమే మరి...

* * *

కొంత దూరం నడిచినాంక, ఎవరో పిల్చినట్టు ఆగిపోయాడు కజ్జం... అతడు తన తీక్షణమైన కన్నులతో చెట్లల్లోకి చూశాడు... అక్కడొక చెట్టు ఉంది... దాని చుట్టూ ఓ తువ్వాలు చుట్టి ఉంది. దాని మీద ఉన్న బండ మీద "బుద్రి" అని రాసి ఉంది.

"అది మా చెల్లె 'బుద్రి'ది – ఆ బండకు సుట్టిన తువ్వాలు మా చెల్లెది – ఈడనేమో చెల్లె పానమిడ్సింది..." అన్నాడు ముందుకు నడుస్తూ కజ్జం.

"ఏమయ్యింది."

"మా చెల్లె పూనం బుద్రి... ఈమెది చిల్నార్ గ్రామం 45 ఏళ్లకు పైనే ఉంటది. నల్గురు పిల్లల తల్లి. ఒక బిడ్డకూ, కొడుకుకూ పెళ్లి కూడా అయ్యింది. ఒక రోజు వాకిట్ల ఒడ్లు ఆరబెట్టుకుంటున్నదట. ఒక సంకల మనుమరాలు, మరో సంకల మనుమడిని ఎత్తుకొని నిల్చున్నదట. గింతలో – పోలీసులొస్తున్నరని ఉర్కపోయిందట... కానీ, ఆమె కొడుకు "నువ్వు ఉరుకొద్దమ్మా – నువ్వు ఉర్కితే ఇంటిని గాలవెట్టేస్తరు. పిల్లలనూ, ఆడోల్లనూ కొట్టి వొదిలేస్తరు గాని చంపరు... నువ్వు ఈడనే ఉండు" అని చెప్పి పారిపోయిండట... గింతల పోలీసోల్లు రానే వొచ్చిన్రు. సంకల పిల్లల గుంజి పడేసిన్రు... ఇంటిని అంటువెట్టిన్రు... పెసలు గుంజుకున్నరు... ఆమెను బట్టలూడదీసి మస్తుగగొట్టిన్రు, రొమ్ములు పిండిన్రు... అరుస్తుంటే నోట్ల చెత్తా చెదారం గుక్కిన్రు... నీల్లమడుగుల ముంచిన్రు... ఆ తర్వాత ఇప్పసెట్టుకాడ్కి దీస్కపోయి, ఒగనెంబడి ఒగడు ఆగం జేసిన్రు... ఎప్పుడు జచ్చిందో, ఆల్లకే దెల్వదు... ఆ తర్వాత ఆడవడేసి పోయిన్రు..." దీర్ఘంగా నిట్టుర్చాడు కజ్జం.

"ఆ తర్వాత?"

"తర్వాత మగ్గురు నల్గురు గల్సి, పోలీసోల్లు రాకముందే గీ మానుకాడ దబదబ గుంతదొవ్వి... గుర్తుగ తన తువ్వాలు జుట్టి... బండమీద బుద్రి పేరు రాసి పోయిన్రు..."

నిశ్శబ్దం...

* * *

చెట్టు మీదకు పాము నెమ్మదిగా పాకుతోంది. అది గమనించిన పక్షిపిల్లలు "కీస్, కీస్" మని అరవడం మొదలెట్టాయి. పిల్ల పక్షులకు ఆహారానికి వెళ్లిన తల్లి పక్షికి ఏదో మెసేజ్ అందినట్లు, అది శరవేగంతో వొచ్చి వాలింది. తల్లీ పిల్లలు గలిపి ఒక్కటే ఇదిగా అరవడం మొదలెట్టాయి. తల్లిపక్షికి పాము మీదకి దాడికే దిగింది. ఏమయ్యిందో ఏమో – మొత్తం చెట్టు మీద పక్షులన్నీ కోరస్ అందుకున్నాయి... చెట్టు విప్లవ గీతమయ్యింది. పాము తోక ముడిచింది.

"పాము చెట్టెక్కినట్టున్నదిరా..." అన్నాడు కజ్జుం...

బండు విన్నాడు గాని, ఏమీ సమాధానం చెప్పలేదు. వాడు బెదిరిపోయిన పాము చెట్టు మీద నుండి 'ధబ్'మని పడడాన్ని ఊహిస్తున్నాడు.. వాడికి ఇట్లాంటివి ఇష్టం.

* * *

గత కొంత కాలంగా కజ్జుం కుడికాలి వేళ్లు బాగా సతాయిస్తున్నాయి. వర్షంలో బురదలో తడవడం వల్ల... కాలివేళ్లు బాగా చెడిపోయి బొక్కలు పడి రక్తం గారడం మొదలయ్యింది... ఆకు పసరు అదీ ఇదీ రుద్ది... వేళ్లకు బట్టలు గట్టాడు. నీళ్లలో తడిస్తే నరకంలాగుంటది. ఎంత బాధ అంటే.. ఆ వేళ్లను కోసి పారేస్తే బావుండననిపిస్తది... చుట్టూ ముసురు... పైగా ముసురుకొస్తున్న వయస్సు... డోలీని అక్కడక్కడా ఆపేసి... సేదదీరాల్సి వొస్తున్నది.

* * *

వాళ్లు అట్లా నడుస్తూ ఉంటే... ఎడం వైపు కాలి బూడిదైన గూడెం ఒకటి కనబడ్డది...

"ఇది రేగడి గూడెం" అన్నాడు కజ్జుం ఉపోద్ఘాతంలా...

"దీన్ని పోలీసోల్లు, జుడుమోల్లు కల్సి అంటివెట్టి, బూడ్దిజేసిన్రు... వాల్లు మల్లగట్టుకున్నరు... ఈల్లు మల్ల బూడ్ది జేసిన్రు... ఇంక కుదురదని వేరే చోటుకు పోయిన్రు... వాల్లు ఎల్లిపోయినాంక.. ఇది దెల్వని హేముల సుక్కి పండుగకు తల్లి గారింటికొచ్చింది – కాలిన బూడిదల ఏవేవో దేవులాడుకుంట... పిచ్చి దానిలా ఎక్కి ఎక్కి ఏడ్సి – మల్ల అత్తగారింటికి వాపసువోయింది" అన్నాడు కజ్జుం ముగింపుగా.

నిజానికి అడవిలో విధ్వంసానికి ఒక ముగింపు లేదు. కన్ను మూసి తెరిచేలో ఒక సమాధి లేస్తుంది... అడుగు తీసి అడుగు వేసేలోపు ఒక ఇల్లు కూల్చబడ్తుంది. ఖాళీ చేయించిన గ్రామాలు, కాలిబూడిదైన గూడేలు, అడివంతా పికాసోచిత్రం "గుయెర్నికా"ను దలపిస్తుంటది.

కజ్జుం అడవివైపొకసారి సాలోచనగా చూశాడు... అతనికి రోడ్డుకిరువైపులా క్షతగాత్రులైన ఆదివాసీలు హాహాకారాలు జేస్తున్నట్టనిపించింది. భయంవల్లనో, బాధవల్లనో, మోతీమీద ప్రేమ వల్లనో నడక వేగం పెరిగింది.

చెట్ల ఆకుల మీద నుండి చినుకులు బొట్లు బొట్లుగా ముత్యాల్లా రాలుతూ... ఆకుల డప్పుల మీద చినుకు చిటికెల వాయిద్యం వేస్తోంది – మర్రి ఆకుల మధ్యన ఎర్రటి మర్రిపండ్లు... రాత్రి చెట్టుకు చుట్టిన ఎర్రటి సీరియల్ బల్బుల్లా ఉన్నాయ్.

* * *

మోతీ డోలీలో మెలుకువ వొచ్చినప్పుడల్లా బాధగా మూల్గుతోంది. జీవితంల ఆ పిల్ల సుఖపడ్డదేమిటో ఎవరికీ అర్థం గాదు... రెక్కలు మొల్చినప్పట్నుండి – బతుక్కు కాయకష్టమే... పొలమో, అడివో శరీరాన్ని చెమటకిందికి అరగదీయకపోతే, నోట్లో రొండు ముద్దలు పడేవి కావు...

ఆ పిల్లకు వయసే శాపంగా మారింది...

13–14 సంవత్సరాల వయసులో పొలం పన్లు జేసుకుంటుంటే, సల్వాజుడుం మూకకు దొర్కపోయింది. కజ్జుంను, మోతీని క్యాంపుకు దీసుకుపోయారు. అక్కడ విపరీతంగా కొట్టారు. ఒక కాలును కిందికి అదిమిపట్టి... మరో కాలును పైకిలేపారు... అట్లా చేస్తున్నప్పుడు... ఆ పిల్ల ప్రాణాలు పైపైనే పోయేవి. ఆ పిల్ల బట్టలు మొత్తం చించిపడేసి... ఎదురుగ్గా తండ్రిని నిలబెట్టి... అత్యాచారం జేశారు... ఆ పిల్లకు సిగ్గుతో చచ్చినంత పనయ్యింది... అరుస్తుందని నోట్లో గడ్డీగాదం గుక్కినారు...

పెళ్లయింతర్వాత మరోసారి పోలీసులకు దొర్కపోయింది. మార్కెట్‌కు ఇప్ప పువ్వు దీస్కపోతుంటే పట్టుకున్నారు. బాగా కొట్టి క్యాంపుకు దీసుకెళ్లారు... పెళ్లి చేసుకుంటామన్నారు... "నాకు పెళ్లయింది. పిల్ల ఉంది" అని చెప్పిన విడువలేదు.. రొమ్ముల్లో పాలు పిండి చూశారు. అందరూ సామూహికంగా అత్యాచారం చేసి వొదిలేశారు.

ఆ తర్వాత... భౌతికంగా గాయం మానడాన్కి కొంతకాలం పట్టినా... మానసికంగా గాయం మానడాన్కి చాలా సమయమే తీసుకుంది. పగలూ రాత్రీ... ఒంటరిగా సమూహంలో... పని జేస్తున్నప్పుడు అంతర్లీనంగా ఎంత సంక్షోభం అనుభవించిందో... ఎంత చెప్పినా తీరదు... నిజానికి అత్యాచారం అనేది, ఎప్పుడు భౌతిక రూపంలోనే ఉండదు... మానసిక రూపంలో ఒక ఆందోళనగా, నిరంతరం వెంటాడే ఒక అభద్రతగానూ ఉంటుందని చెబుతారు.

* * *

వాళ్లు కొండ ఎక్కడం మొదలెట్టారు.

ఒక్కసారిగా మనసులోనే కొండ దేవతకు మొక్కుకున్నాడు కజ్జుం.

వర్షం పడేలోపు కొండెక్కి దిగాలనుకున్నారు... కొండ దిగినాంక వాగు దాటాలె... ఇదెంత గండమో... అదీ అంతే... తొందరగా పోకపోతే... ఆ మనిషి ప్రాణం రక్షించుకోవడం కష్టం... ఆమెకు ధైర్యాన్నిచ్చే మాటలు చెప్పడం తప్ప... ప్రాథమిక చికిత్స చేయడాన్కి కూడా వాళ్ల దగ్గర ఏమీ లేవు. తొందరగా తీసుకుపోవాలన్న ఆకాంక్ష వాళ్లలో శక్తిని పుట్టిస్తున్నది.

బండరాళ్లను ఒడుపుగా దాటుకుంటూ వాళ్లు కొండ ఎక్కడం మొదలెట్టారు. ఒక్కోసారి అలిసినపుడు బండరాళ్లను ఆనుకొని కొంచెం సేపు సేద దీరుతున్నారు. బాట పక్కన శకలాలు చెట్ల కొమ్మలకు డోలీకి తాకకుండా వాళ్లు జాగ్రత్త పడుతున్నారు. ఒక్కోసారి వొంగుతూ... ఒక్కో చోట పంగల కట్టెతో కొమ్మల్ని ఎత్తిపడుతూ, పాములుంటాయనుకున్న చోట "ఉష్.. ఉష్" అని అరుస్తూ, అడుగు తీసి అడుగువేయడాన్కి వాళ్లు పడే బాధ ఇంతా అంతా కాదు... అంతటి చల్లని వాతావరణంలోనూ... వాళ్లకు చెమటలు పడ్తున్నాయ్... నొప్పి పుట్టినప్పుడల్లా... భుజాలు మారుస్తున్నారు.

* * *

పిలువక వొచ్చిన చుట్టంలాగ ముసురు మొదలయ్యింది.... చూస్తుంటే... ప్రకృతి గూడ వాళ్లమీద పగబట్టినట్టున్నది.

ముసురుకు జంతువులన్నీ చెట్ల మొదళ్లకు జేరుకున్నాయి. పక్షులన్నీ గూళ్లల్ల నిశ్చల చిత్రాల్లో నిల్చిపోయాయి. మనుష్యులు మాత్రమే నడుస్తున్నారు.

వాళ్లు మాట్లాడుతున్నారు. మాట్లాడటం తప్ప... ఇంకేమీ తెలీదు వాళ్లకు. ఈ అనంతమైన బాధను తట్టుకోవాలంటే... ఏదో ఒకటి మాట్లాడి తీరాలి... తప్పదు... బాధల సముద్రంలో వాళ్లకు మాటలే పడవలు...

కజ్జుం... తన పూర్వీకుల విజయగాథల్ని చెప్పడం మొదలెట్టాడు అతడు కథ చెప్పడంలో ఓ టెక్నిక్ ఉంది. (ఎక్కడో ఒక ఉత్కంఠ కల్గించే సంఘటన చెప్పి... దాని చుట్టూ కథ అల్లుతాడు.) అందరికీ వినాలనిపిస్తుంది... పూర్వపు రాజులు తమ వాళ్లని ఎట్లా పీడించారో... వాళ్లను తమ వాళ్లు ఎట్లా ఎదిరించారో... ఓడిపోయినా ఎన్నెన్ని సార్లు తిరగబడ్డారో... ఊరించి ఊరించి చెబుతున్నాడు... తన ముత్తాత చిరుతపులితో ఎట్లా కలెబడ్డాడో చెప్పుకొచ్చాడు. మార్కెండేయ చౌదరి అనబడే భూస్వామిని మట్టుబెట్టి అతని భూముల్ని ఎట్లా స్వాధీనం చేసుకున్నారో చెప్పాడు.

ఇప్పటికీ ఆదివాసీలు ఎట్లా సంఘటితమౌతున్నదీ - ఎట్లాంటి విజయాలు సాధిస్తున్నదీ... (కొన్ని కల్పనలు జోడించి) చెప్పుకొచ్చాడు.

అతనిది చెబుతుంటే శరీరంలో కొత్త రక్తం ఉరకలెత్తినట్లయ్యింది. భుజాలకు, పిక్కలకు కొత్త శక్తి వొచ్చేసింది... "జ్ఞాపకాలే నిట్టూర్పు / జ్ఞాపకాలే ఓదార్పు" అంటాడో సినీకవి... నేను జ్ఞాపకాలే శక్తి అంటాను.

* * *

వాళ్లు నిముష నిముషానికీ లెక్కలేసుకుంటున్నారు. ఒక్కొక్క అడుగు ముందుకు పడ్తున్నకొద్దీ... తాము సిరొంచకు మరింత దగ్గరవుతున్నట్టూ - మోతీని రక్షించుకోవడంలో మరింత విశ్వాసం పొందుతున్నట్టూ భావించారు. చిన్న చిన్న రాళ్లు కొట్టుకు వొచ్చి బాటలల్ల నిలువడంతో... నడవడం కష్టమయ్యింది... మొదట పడ్డ వర్షానికి బండలు జారినా... తర్వాత పడ్డ చినుకులకు బండలు కడుక్కుపోయి జారడం తగ్గింది.

ఆనిర్జనారణ్యంలో... ఆ ముసురులో... భయపెట్టే నిశ్శబ్ధంలో వాళ్లకు ధైర్యమిచ్చే వారెవరు? ఎవరుంటారు? వాళ్లకు వాళ్లే ధైర్యమిచ్చుకోవాలె... ఒకరి దుఃఖాన్ని ఒకరు పంచుకోవడం తప్ప... దించుకున్నది లేదు.

* * *

మొత్తం మీద కొండ దిగారు...

ఒక్కసారిగా గుండెల మీద బండ దీసేసినట్టయ్యింది.

అట్లా కొంత దూరం నడిచేసరికి... "ఇడ్సంమెట్ట" వాగు వోచ్చేసింది... దాన్ని దాటి కొంత దూరం నడిస్తే... "సిరొంచ" వొచ్చేస్తది.

వర్షపు నీరు చేరడంలో వాగు చిక్కని ఇరానీ చాయ్ రంగులోకి మారింది... తెగిన కొమ్మలూ, చెత్తా చెదారంలాంటివి వాగులో కొట్టుకు వొస్తున్నాయి.. కురుస్తున్న వర్షంలో వాగువేగమూ, వెడల్పూ, లోతూ పెరిగాయి.

వాళ్లు ఒక్క క్షణం ఆగి... వాగువైపు జూశారు. తన కడుపులో చేపల్నీ... ఎండ్రకాయల్నీ దాచి... ఆదివాసీల కడుపు నింపిన వాగు ఇవ్వాళ్లెందుకో శివాలెత్తిన ఎల్లమ్మలాగుంది. అది కైలాస పటంలో 'పెదపాము'లా కన్పించింది వాళ్లకు...

"మోతీ! మోతీ' - అనుమానంతో తట్టాడు కజ్జం.

"ఊ..." - అంటూ మూల్గిందామె.

ఎందుకోగాని ఆ మూలుగులో ప్రాణమే లేనట్టనిపించింది... అదేదో కొండలోయల్లోంచి వొచ్చినట్టుగా... ధ్వని బయటికి వొస్తున్నట్టుగాక, లోలోపలికి

పోతున్నట్టు... జీవం నశిస్తున్నట్టూ... ఊపిరి తెగిపడ్తున్నట్టూ.... వాగు శపిస్తున్నట్టూ అన్పించింది.

"అదో వొచ్చేసింది సిరొంచ... ఇంకెంత సేపు బిడ్డా... వాగు దాటితే... నాలుగే నాల్గు అడుగులు... అగో... అగో వొచ్చే... కనపడేది సిరించే... అంత మంచి గయితదే... తల్లీ... డాక్టర్లుంటరు... మంచిగజూస్తరు... కాన్పు మంచిగయితది... దేవుడున్నడు..." – అంటూ భరోసగ మాట్లాడాడు... తుంపర్లు తుంపర్లుగ తెగుతున్న మాటలు – బరువు మోసే బండి చక్రపు శబ్ధాల్లాంటి మాటలు. ఆ మాటలు తనలో అనుకున్నాడో, మోతీతో అన్నాడో, బండుతో అన్నాడో, వాగుతో అన్నాడో తెలీదు.

* * *

వాళ్లిద్దరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకొని... తమ ఇష్టదేవతను మనసులో మొక్కుకొని... వాగులోకి దిగారు.

సన్నటి చినుకులు, వాగుమీద తాళం వేస్తున్నాయి... అది విన్పించే శబ్దానిది ఏ రాగమో... ఇప్పటి వరకు ఏ సంగీతకారుడైనా కనిపెట్టాడోలేదో... ఆ వాన, ఆ వాగు, కవులకు ఆనందమోమొగాని... ఆదివాసీలకది ప్రాణ సంకటంగా ఉంది.

చెలిమల కోసం చేసిన గుంతల్ని పూడ్చుకుంటూ పారుతోందా వాగు – నత్తగుల్లల వీపు మీద శంఖాల్లాంటివి వాగులో కొట్టుకువొస్తున్నాయి... వాగును చాలా సార్లు దాటి ఉండటం వల్ల... దాని నెమ్మదీ, వేగమూ, ఒడుపూ దెల్సువాల్లకు...

నిజానికీ అడవిలో ప్రతి దానికీ ఓ భాష ఉంటది... వాగు ఎప్పుడు నవ్వుతుందో, ఎప్పుడు కోపగిస్తుందో, ఎప్పుడు బుజ్జగిస్తుందో వాళ్లకు బాగా తెల్సు... పగలూ రాత్రీ దాని నరాలలో సాగే సంగీత ధ్వనులతో వాళ్లు బాగా ఎదిగిపోయారు.

అప్పుడప్పుడూ మోతీ సన్నగా మూల్గుతూ... అటూ ఇటూ కదులుతోంది. ఆమె కదిలినపుడల్లా, భుజం మీద నరాలు తెగిపోతున్నట్టుగా ఉంది వాళ్లకి...

"అమ్మా – మోతీ... అయిపోయింది బిడ్డా... వొచ్చేసె... వొచ్చేసే... సిరొంచ వొచ్చేసే... అగో నాల్గు అడ్గులు... అంతమంచి గయితది..." – అంటూ ఏవేవో భరోసాలిస్తున్నాడు కజ్జుం – ఆ మాటలు మోతీ విన్నదో... లేదో...

* * *

నీటి కింద ఇసుకలో వాళ్లకేదో కాలిబాట ఏర్పడ్డట్టుగా నడుస్తున్నారు వాళ్లు... వాళ్ల కాళ్లకూ... ఇసుక దారికీ పాతకాలపు బంధమేదో ఉన్నట్టుంది.

గుడ్డివాడు తన చేతిలోని కర్రను భూమ్మీద తాటిస్తూ నడిచినట్లు వాళ్లు తమ కాళ్లను ఇసుకలో జరుపుతూ జాగ్రత్తగా నడుస్తున్నారు.

నిజానికి వాగులోకి దిగినాంక... వాళ్ల కాళ్లకు కండ్లొచ్చాయి.

* * *

ఇప్పటి దాంక... బాట పొడుగునా... అదీ ఇదీ మాట్లాడుతూ వొచ్చిన కజ్జం... ఉన్నట్టుండి నిశ్శబ్ధమయిపోయేడు... ఏ ఓదార్పులేని దుఃఖ స్థితి నుండి నిర్వేదంలోకి వొచ్చాడు... బందు కూడా అతనితో మాట్లాడించే ప్రయత్నం చేసి విరమించుకున్నాడు...

ఇప్పుడు కజ్జంలో ఏదో చెప్పరాని ఘర్షణ మొదలయ్యింది. "మోతీకి ఏం కాలేదు గదా..." అనుకుంటూ అతనికి సన్నటి చలిలాంటి వణుకు మొదలయ్యింది...

"మోతీ... మోతీ" అంటున్నారిద్దారు... ముద్దగా తడిసిన మోతీ "ఊ..." అంటోంది – ఒక్కోసారి పలుకడమే లేదు... అంతకంతకు నిశ్శబ్ధం పెరిగిపోతోంది... కురిసే వాన చినుకుల్లోనూ నిశ్శబ్ధం భయపెడ్తోంది...

"అమ్మా... అమ్మా... మోతీ... మోతీ... వొచ్చేసినం బిడ్డా వొచ్చేసినం" అంటూ పిచ్చిగా అరుస్తున్నాడు కజ్జం – అతని అరుపులకు వాగు గుండె రొండుగ చీలినట్టయ్యింది...

నాల్గు సార్లు పిల్చినా పలుకక పోయేసరికి బందుకు ఏడుపొచ్చేసింది. అతడు బిగ్గరగా ఏడ్వడం మొదలెట్టాడు... వాగును అనేక సార్లు పగలూ – రాత్రీ పగల దీసిన ధీశాలి "కజ్జం". అది గడ్డ గట్టుకుపోయి... తన చుట్టూ కొండ చిలువలా బిగుసుకు పోయినట్టనిపించింది. అయినా, అతను అడుగడుగునా మోతీకి ధైర్యమిస్తూనే ఉన్నాడు... తనకు తాను ధైర్యం చెప్పుకుంటూనే ఉన్నాడు. అతడు తన ఒంట్లోని ప్రతి రక్తపు బొట్టునూ ధైర్యంలోకి మారుస్తున్నాడు. పాకుడు రాళ్ల మీద జారిపోయి ఆత్మవిశ్వాసాన్ని పట్టి నిలబెడ్తున్నాడు... మనిషి తనలో తాను యుద్ధం జేయడమంటే ఇదేనేమొ.

* * *

వాళ్లు వాగు దాటేసరికి, తడిసిన అలుకు పిడచల్లా తయారయ్యారు. గుండెలు బరువెక్కుతుంటే మోతీని మద్దిచెట్టుకింద ఓ బండ మీదకు చేర్చారు... "మోతీ... మోతీ..." అంటూ చెంపల మీద గొట్టారు. అదే మూలుగు... లోయలోంచి వొచ్చే శబ్ధంలాగ – కళ్లు తెలేస్తోంది... "అమ్మా... మాయమ్మ... మోతీ... వొచ్చేశినం... వొచ్చేశినం... నీకేం గాదు... తెరువు... తెరువు... కండ్లు దెరువు... మోతీ... మోతీ' – కజ్జం పిచ్చిపట్టి నోడిలాగ అరుస్తున్నాడు. అతని దుఃఖం వర్షపు నీటిలో కలగల్సి భూమ్మీద బురదలో గల్సిపోతోంది.

* * *

సిరొంచ దారిలో పోయే స్త్రీలు కొందరు అక్కడికి జేరారు. మోతీని మెల్లగా పొదల మాటుకు జేర్చి దడిగట్టారు. ఆ పిల్ల బాట పొడుగునా ఎన్ని నొప్పులు దీసిందో... ఎంత నరకం అనుభవించిందో... భరోసా ఇచ్చే చేతులున్నా, బాధను భరించే శక్తి లేక పచ్చిపుండులాంటి వాతావరణంలో బిడ్డను గని కన్ను మూసింది. "విత్తనం చనిపోతూ... పంటను వాగ్దానం జేసినట్లు.." మోతీ చనిపోతూ, తన కలల పంటను వాళ్ల చేతిలో పెట్టిపోయింది... అక్కడున్న వాళ్లతో సహా... చెట్లూ చేమలూ, ఆకాశమూ, భూమీ ఒక్క క్షణం మౌనం దాల్చాయి..

మోతీ పక్కన బందు గుండె పగిలేలా ఏడుస్తుంటే, రక్తపు గుడ్డును చేతిలోకి దీసుకున్నాడు కజ్జుం – కళ్లలో వెచ్చని కన్నీరు...

ఒక చావు... ఒక పుట్టుక

ఒక అస్తమయం... ఒక ఉదయం...

ఇదేనేమొ అడివంటే... ఇదేనేమొ జీవితమంటే...

# గొర్లు

## గీతాంజలి

"నేను పోనంటే పోను. ఇక్కడ్నే ఉంట నీ తోని లేబర్ పనికొస్త. సస్తగని అడవికి వోనింగ. నా కాల్లు ఎట్ల కొచ్చగైనయి సూడు, అడవిల గుట్టలెక్కి నా కాళ్ళు ఎట్ల పుండు పుండైనయో సూడు..." కాల్లు ముంగట్కి సాప్త రాము చెప్తుండు. పద్మ కొడుకు తల్లెల ఇంకింత బువ్వేసి, "ముందుగాల తిను కొడుకా అటెన్క ఆలోశెన సేద్దం" అంది. నులక మంచం మీద పండుకున్న ఎంకటయ్య "గింత జిద్దు జేస్తున్న వేందబ్బా దుడ్లు అప్పు జేసిన, ఇంకా మిత్తే కడతాన్న, రొండేండ్లు మాట్లాడుకున్నది జెయ్యక వస్తి వంటే ఆసామి దశరథ్ ఊ కుంటడ జెప్పు? రేపే ఆయన తానకు పోవల్ల ఫోనోచ్చింది ల్యాకవోతే సీదా వుంగపేటకు పోవల్ల" అన్నడు కోపంగ.

"నా తోని కాదు నాయన నేను వోను" అంట రాము బువ్వ తల్లెను పక్కకు నూకి, పైకి లేసి గుడ్సె బయటకు పోయిండు గుడ్సె పక్కపొంటి బండల మీద ఉన్న కుండల కెల్లి నీల్లు తీస్కుని చెయ్యి కడుకున్నడు. అక్కడ్నె పక్క గుడ్సె ముంగట బీడీ తాగుతున్న శీను దగ్గర్కి పోయి కూసుండు. "ఏమైందబ్బా శీనా శానా కోపం మీదున్నవు ఏమైంది?" అడిగిండు శీను. "ఏంలే శీనూ, నాయనా మళ్ళీ నన్ను గొర్లు మేప అడవికి పొమ్మంటుండబ్బా. నాతోని కాదని సెప్తున్న". రాము బీడి అంటించుకుంట చెప్పిండి. "పా అసుంట సిటీల తిరిగొద్దాం" అని రాముని తీస్కుని అక్కడికెల్లి బయట పడిండు శీను.

ఎంకటయ్యకు బువ్వ తిన బుద్దికాలె. పద్మ తినమని ఒర్లుతున్న ఇనకుంట గుడ్సె అవతలకచ్చి 'ఓ రంగయ్య పోదాం పాబ్బా' అనుకుంట రంగయ్యను తీస్కుని కల్లు దుక్నం దారి పట్టిండు.

* * *

గుడిసె ముంగట అంత లొల్లి లొల్లి గుంది. గచ్చిబౌలిల టాటా బిల్డింగు పక్కన

ఒక వెయ్యి గజాల జాగాల పాలమూరు లేబరు అడ్డా ఉంది. ఒక ముప్పై కుటుంబాలు పాలమూరు కెల్లి ఐద్రాబాదు వలస వచ్చి ఇక్కడ ఉంటున్రు. మేస్త్రీ వాల్లందర్ని గుంపుగ తీస్కొచ్చి ఇక్కడ పెట్టిండు. మాదాపూర్ హైటెక్ సిటీల బిల్డింగులు కట్టే పనికి, మట్టి పనికి తీస్కపోతడు.

గుడిసె బయట నులక మంచంపైన పన్నడు ఎంకటయ్య. నిద్రస్త లేదు. దిమాక్ అంత పిసపిసగున్నది. గీ పిలగాడేంది గిట్ల కిరికిరి జేస్తుండు? రేపు ఆసామి దశరథ్‌కు ఏం చెప్పల్ల? నిన్ననే ఫోన్ జేసిండు. నీ కొడుకు నా గొర్లను ఒదిలి పెట్టి దెంక వొయ్యిండు. నా గొర్లు వోయినయంటే, మీ అయ్య కొడుకులని వదల" అండు. ఇంతట్ల రాము తన దగ్గర్కిరానే వచ్చే. ఎంటనే దశరథ్‌కు ఫోను జేసి "ఒక్క దినం ఆగు వాణ్ణి తీస్కస్త" అని చెప్పిండు. వాడిపుడు మళ్ళీ తన బూమి మీద పిశాచమోలె పడ్డడు. తన మూడెకరాల బూమి కబ్జా సెయ్యనీకి తయ్యారుండు, తను చేసిన అప్పు ఛుక్తజెయ్యకపోతే. ఇంకొక్క యాడాది రాము గొర్లు మేప వోతే అప్పు తీర్తది. తన బూమి తనకు దక్కుతది. ఎట్ల బుదరికిచ్చుడు వాణ్ణి? పోనంటే పోనని జిద్దు జేస్తుండు. సయినె... గొర్లు మేపుడంటే మాటలు కాదు మల్ల. పిల్లగాడు సానా కష్టపడుతుండు. ఎంకటయ్యకు దుఃఖమచ్చింది. తను పదిహేనేండ్ల సంది పాలమూరు ఒదిలిపెట్టి, దేశాలు పట్టి, బుక్కెడు బువ్వ కోసానకు... తన చెలక దక్కించుకోనీకి ఎంత కష్ట పడ్డడో మతి కొస్తున్నది. చచ్చిపోయిన, అమ్మ, నాయన. మూడెకరాలు బూమి, తన పాలమూరు యాదికొస్తున్నయ్. తల్లి యాది తీరు కమ్ముకున్న కన్న ఊరు పాలమూరు దుఃఖమై ఊరుతున్నది ఎంకటయ్య కండ్ల పొంటి.

తను ఐద్రాబాదు వచ్చి నాలుగేండ్లు ఐతున్నది. అంతకు ముంగట తను బంబైల ఉండు. బంబైల పెద్ద పెద్ద అంతరాలు కట్టే పని జేసేది. బంబైల యాదికొచ్చి ఎంకటయ్య ఎన్నుల బయం, జర జర పాకింది.

పాలమూరుకెల్లి బాంబైకు బయలెల్లిన దినం ఇంగా యాదికున్నది. నాయన సావే తనను బంబై దిక్కు తరిమింది. మూడెకరాల నల్ల రేగడి బూమిల నాయన జొన్న ఇత్నాలు ఏసిండు. వర్షాధార పంట. నిత్యం వానల కోసం ఎదురు జూసుడు. తమ ఊరికి జూరాల చానా దగ్గర కానీ నీల్లు లెవ్వు. తమకు చెరువులున్నగని పూడికలు తీపిస్త ల్యా సర్కారు. ఆ యాడాది వర్షం పంటకు సరి పడ ల్యా. వచ్చె కరెంటు, పోయె కరెంటు. నాయన అప్పు చేసి బోరు వేసిండు. అది పాడయ్యింది. రిపేరు జేపిచ్చుడు, మల్ల పాడవుడు. పంట వెయ్యనీకి ఆసామి తాన అప్పు జేసిండు. నాయన సానా దిగులు పెట్టుకుండు. జేసిన అప్పు ఛుక్త జెయ్యకవోతే తన భూమి

కబ్జా జేస్తనన్నడు ఆసామి. సర్కారు రైతులకు కరెంటు కోత... ఆల్ల పానాల మీనకు వచ్చిపడ్డది. నాయన బుగులు చూసి ఊల్లె సాలాయన నాయనకు ఐడియ ఇచ్చిండు. రాతిరి పూట కరెంటు దొంగతనం జెయ్యమండు. నాయన దిమాక్‌ల మంచిగ ఎక్కి కూసుంది సాలాయన చెప్పింది. ఏం జేస్తడు? అమ్మ ఒద్దన్న గని ఇనలె. ఒక రేత్రి చెలకకు వొయ్యి కఱ్ఱని కరెంటు తీగల మీన వేసిండు, షాకు కొట్టింది. అదే మల్ల లేవ ల్యా. సచ్చే వొయిండు.

నాయన సచ్చి వొయిండు. నాయన వేసిన పంటా ఎండి వొయ్యింది. తాము కుర్మోల్లమ్ గని, నాయన గొర్లు పెంచక వొయెది. యవసాయమే జేసేది. పేరుకె పది గొర్లుండేవి ఇంట్ల.

అప్పిచ్చిన ఆసామి వెంట వడ్డడు, బూమి రాసిమ్మంటడు. ల్యాదా పైసలియ్యమంటడు.

రూపాయలు య్యాడికెల్లి తేవ్వల్ల? నాయన చావుకంటే చేసిన అప్పే బయవెట్టింది. అమ్మ ఎంత బత్మిలాడినగని అప్పిచ్చిన ఆసామి ఇనలె. అప్పటికే ఊల్లె శానామంది దేశం వోతుంఢ్రు బతుకుతెరువుకు. దినాం ఊల్లెకి మనుషుల్ని తోల్కపోనీకి టిప్పర్లొచ్చెట్వి. దేశం వోయెతందుకు తయారైన వాళ్లు గొఱ్ఱెలెక్క అన్ల ఎక్కెటోల్లు. అయినోల్లు, అమ్మ నాయనలు, పెండ్లం పిల్లలు బొల్లు బొల్లుమని ఏడుస్త సాగనంపేది. దేశం ఎల్లిపోయెటోల్లు గుడక కండ్లు తుడుసుకునేది. అందరు గుంపు మేస్త్రికాడ అడ్వాన్సులు తీస్కుని ఆయెనతోని పోయెటోల్లె. అందరిదొక్క తీరు బాధనే. నీల్లు ల్యాక చెలకలు ఎండి వోయి పంటల్యాక, పైస ల్యాక, బువ్వ ల్యాక, ఉన్న ఊల్లె పని దొరకక, ఆకలికి అల్మటిస్తొన్న పిల్లలను, అమ్మ నాయనలను జూడ ల్యాక, సాద ల్యాక, సర్కారు వోస్తున్న అంబలి బిచ్చగాళ్ళ తీరు అడుక్కో ల్యాక దేశం వోయెటోల్లె.

ఆసామి ఆ దినం మల్ల లొల్లి వెట్టిండు. అమ్మను బూతు మాటలు మాట్లాడిండు. తను తెగ బడి ఆసామి మీదకు కొట్టనీకి వోయిండు. అమ్మ గుంజుకొచ్చింది తనను. తనకప్పుడు ఇరవై సంవత్సరాలుంటై. యవసాయం, గొర్లు మేపుడు గీ రెండు పన్లే వస్తయ్ తనకు. చదువుకోలె. య్యాం జేసుడో సమఝ్ కాలె. ఉన్న నాలుగు గొర్లు అమ్మంగ వచ్చిన దుడ్లు నాయన కర్మకాండలకు అయి వోయినయి. చేతిల దుడ్లు ల్యా. బూమి వదలద్దు. బూమి కాపాడుకోవల్ల. నాయన అందుకే గద కష్టపడ్డది. ఇంటి ముంగట గచ్చు మీద పండి ఏం జేయ్యాల్నని ఆలోశన జేస్తా, ఉండి వొయ్యిండు.

* * *

తెల్లగ తెల్లారింది. అమ్మలేశి కసుపూడుస్తున్నది. అయిన లేవ బుద్ధికాలె. అమ్మ

ముంగిట్ల నీల్లు సల్లి, ముగ్గేస్తున్నది. కోళ్ళు బొకబొక లాడ్తన్నయ్ అసుంట, ఇసుంట తిరగుకుంట.

"ఎంకా ల్యా కొడకా పొద్దు పొడ్సింది లెవ్వబ్బా" అన్నది అమ్మ. ఇంగ లేశిండు... పండ్లు తోమి... "అమ్మ ఇప్పుడే వస్తనే" అని ఒర్లి ఊల్లె ఉన్న మేస్త్రి రత్తయ్య తానకు వొయ్యిండు. తను గుడక దేశం వస్తన్ననడు. "ఈ వారం ఇంగో ఇరవై మందిని బంబై తీసుకుపోతున్నాను. అప్పుడు నువ్వు కూడా వద్దువు" అండు మేస్త్రి. ఇంటికొచ్చిండు వెంకటయ్య, దిమాక్‌ల బరువు కొంచెం తగ్గిందన్పించింది. సేటు ఇరవై వెయిల దుడ్లు అడ్వాన్సు ఇస్తనండు. పది నెలలు పని జెయ్యాల్నంట. పదిహైదు వెయిలు ఆసామికిస్తే, తమ బూమి తమకుంటది. మిగతా పది వెయిలు మెళ్ళంగియ్యచ్చు.

అమ్మ జొన్న రొట్టెల తల్లె తెచ్చి ఎంకటయ్య ముంగట పెట్టి "తిను ఎంకా యాడికి వొయినవు తెల్లారంగ" అన్నది.

మేస్త్రి తానకు వోయిన సంగతి జెప్పంగనే అమ్మ యాడుస్త, "ఒద్దు కొడుకా, దేశం వట్టి వోకుర పోయినేడాది దేశం వోయిన బాలరాజు పీనుగై వచ్చిండు అని పెండ్లం, పిల్లలు అనాథలైండ్రు, సిటీల ఇండ్లల్ల పని మనుషులైండ్రు... గా యాదగిరి ఐదేండ్ల కింద దేశం వోయిండైతే, లాపతా అయ్యిండు. ఆడు పనికి వోయిన దేశంల ల్యాడు, ఊల్లెకి గుడక రాలేదురా. ఒద్దుర కొడుక బూమి వోతే వాయె... నువ్వు నేను యామన్న జేస్కుని ఒక్కతానుండి బత్కుదాం తియ్యి... ఒద్దబ్బా నా మాటిను" అమ్మ యాడుస్త బత్మిలాడుతున్నది. మూడెకరాల బూమి అంటే ఒట్టి మాట కాదు, అది ఒట్టి బూమి కాదు. నాయన, రక్తం, సెమట, పానం ఉన్నయ్ అండ్ల. నాయన ఊపిరి ఆ మట్టి మీనే వొయ్యింది. నాయన బూమిని దక్కించుకోవల్ల. ఆ బూమిల పంటలు పండించల్ల. అమ్మ కంట్ల పొంటి ఎలుగు సూడల్ల. అమ్మ ఒద్దు ఒద్దని సెప్పి సెప్పి, ఏడ్చి ఏడ్చి ఊకుంది.

మేస్త్రి ఇచ్చిన ఇరవై వెయిలల్ల పదిహేను వెయిలు ఆసామి కిచ్చిండు. మూడు వెయిలు అమ్మకిచ్చిండు. రెండు వెయిలు తన తాన ఉంచుకుండు. ఆ ఊల్లె తనకు బందుగులు ల్యారు. దూరంగున్న బందుగులకు చెప్పబుద్ధి కాలె. తడి కళ్ళతోని పక్కింట్లుండె రంగమ్మకు అమ్మను జూస్కోమని సెప్పి మేస్త్రి ఫోను నంబరు అమ్మకిచ్చి, అమ్మ ఏడ్పులు వినుకుంట, మనసుల యాడుస్త దేశం వోయె టిప్పరెక్కిండు.

* * *

బంబైల మేస్త్రి ముందు, లేబరు అడ్డాకు తోల్కవోయిండు. అక్కడ వర్సగ

గుడ్సెలున్నయ్. "ఈ రోజు తినేసి రెస్టు తీస్కోండి. రేపట్నించి పనిలోకి వెళ్ళాలి పొద్దున్నే వస్తాను" అని చెప్పి మేస్త్రి ఎల్లి వోయిండు.

ఆడ పని చేస్తున్న లేబరోల్లను సూస్తే బయమన్పించింది. అందరు పాలమూరోల్లె ఉన్నరాడ. బూములుండి, పంటలు పండక కొందరు, బూముల్యాక, ఊల్లె కూలి దొర్కక కొందరు, వ్యవసాయం బందయ్ నాంక తమ దంద నడ్వక కుమ్మరోల్లు, కుర్మోలు, చెప్పులు కుట్టే మాదిగోల్లు ఇట్ల శానమంది దేశం వచ్చిండ్రు. అందరు ఊల్లె అప్పులు జేసినోల్లే. అప్పులు ఛుక్త జేసుకోనీకి దేశం వచ్చినోల్లె. ఒక్కల్ల మొఖంల ఆరోగ్గెం ల్యా. అందరు బలహీనంగుండ్రు. కొందరైతే పీనుగుల్లెక ఉండ్రు. కొందరాడోల్లైతే గర్బాలతోని ఉన్నరు. పాలు తాగె పసిబిడ్డలతోని, ఐదారేల్లకెల్లి పదిహేనేండ్ల పిల్లలు, ముసలోల్లు గుడక ఉండ్రు.

"ఎందుకొచ్చినవబ్బా? ఈడ యాల మంచిగుందని చాకిరీ జెయ్యలేవబ్బా సావల్ల" అన్నోల్లున్నరు. "పనెట్లుంటది"? అనడిగితే సూస్తవుగ తెల్లారినంక అన్కుంట ఎకసెక్క లాడినోల్లుండ్రు.

ఎంకటయ్య బుగులు బుగులుగ గుడిసెల పన్నడు గని నిద్రొస్త లేదు. తైదల పిండితోని జావ, చింతపండు పులుసు వంట మేస్త్రమ్మ ఇస్తే తినలేక తిన్నడు. అట్లనే మెల్లగ నిద్రబొయ్యిండు.

* * *

"లెవ్వండ్రి, లెవ్వండ్రి" అన్న అర్పులకు మెల్కచ్చింది, ఎంకటయ్యకు. రాత్రి తనతోని ముచ్చట వెట్టిన నర్సయ్య "ఇంగో గీ చా డికాషను తాగబ్బ ముంగట" అన్నడు. నల్లటి నీల్లున్న కోపు తన ముంగట వెట్ట. "గిది పాలు వొయ్యని చాయ్. మనమే చేస్కోవల్ల. ఆల్లు సెయ్యరు చా పత్తి, చక్కెర ఇస్తరంతే" అన్నడు నగుత. లేసి పండ్లు తోముకుని ఇట్ల కూసున్నడో లేదో మేస్త్రి వచ్చిండు. కొత్తగ వచ్చిన లేబరు గుంపుని వర్సగ నిలబెట్టి, పేర్లు రాస్కుని, వాల్లు యా సైటుకు పోవాల్నో సెప్పి బయల్దేర దీసిండు. ఒక పెద్ద అంత్రం పక్కన ఖాళీ జాగాల పునాదులు వేస్తున్నయ్. అక్కడ పని సెయ్యల్ల... ఈ రోజు 8 గంటలకు వచ్చారు. కానీ రేపట్నించి తెల్లవారి ఆరు గంటలకు ఇక్కడుండాలి. రేపట్నించి మిమ్మల్ని తీసుకురావడానికి ఎవరూ రారు. మీరే రావాలి. లేటుగా వస్తే బువ్వ కట్" అన్నడు మేస్త్రి బెదిరిస్తున్నట్లు సేతులూపుత. ఆంధ్రా మేస్త్రి, అదే భాష మాట్లాడుతుండు. ఇంక పనే పని. ఫుర్సత్ ల్యాకుండ ఒకల్లతో ఒకల్లు మాట్లాడద్దు. ఒకటికి, రెంటికీ మేస్త్రి నడిగిపోవల్ల. వోయి జల్ది రావల్ల. కొంచెం అలీశమైన, వోయిన చోటుకు కర్ర చప్పుడు జేస్త వచ్చేస్తడు. ఆడోలైతే

అట్ల వస్తడని బయం బయంగ ఒకల్లనొకల్లు కాపు కాస్కుంట జేర్తరు. "ఎంత సేపు లంజల్లార ఏం చేస్తున్నారే ఇంత సేపూ" అంటడు బాడ్కవు మేస్త్రి.

తొమ్మిది గంటలకు కొంచెం నూకల బువ్వ సింతపండు పులుసు వెడ్తరు. పగటికి రెండు గంటలకు మల్ల గదే వెడ్తరు. రాత్రి ఏడు ఎన్మిది దంక పని జేస్తనే ఉండల్ల... కాల్నొచ్చిన, చెయ్యినొచ్చిన కూసోనియ్యడు. ఆడోల్లనైతే పాలు తాగే బుడ్డ పోరలు ఏడుస్తున్నగని కనికరించడు. "బాంచెన్ కాల్మొక్త మేస్త్రి బుడ్డ పోరి సచ్చి వోతది" అంటా బిడ్డ ఏడ్పుకి ఎదలల్ల పాలు పొంగి, రవిక మీదకెల్లి కార్తాంటే, కన్నీల్ల తోని గోజారితే అప్పుడు గని కనికరం ఉండదిగా మేస్త్రీకి. ఆలీశమైతే బిడ్డ పాల్తాగుతుండగనే రమ్మని కట్ర బూమి కెయ్యి కొడతా అరుస్తడు.

పనిచేసే కాడ దెబ్బలు తగలనీ తరస్ ల్యా. 'మందిప్పియ్యి మేస్త్రి శానా నొస్తింది' అంటె అప్పుడు తీస్కపోయి ఆ కర్సు గుడక జీతంల కోస్కుంటడు. పొద్దెక్కినంక ఆరుగంటల దాంకనే పని చేపిచ్చుకోవల్ల, గని మేస్త్రి ఎన్మిది దంక ఇడ్సి వెట్టడు. గుడిసెల కాడికి పోయెటాలకు తొమ్మిదైతది. అప్పుడు అన్నం గింత కూర వెడ్తరు. గిదేం తిండబ్బ పప్పు, కూరలు ఇయ్యర అంటె, అల్లంత బొల్లున నగిన్రు. నర్సయ్య, జంగయ్య "మేం మేస్త్రీని అడిగినం గని గీ తిండి మారది" అన్నరు. పదిహేను దినాలకోపారి శెలవు. ఆ దినం మాత్రం పప్పుచారు, మాంసం కూర వెడ్తరు. అంతే ఇంకో పదిహేను దినాలు ఆ బువ్వ కోసావకై ఎదురు జూసుడు. కొత్తగొచ్చిన పదుచుపిల్ల వాంతులు జేస్కున్నది తైదల పిండి జావ, చింత పులుసు తిన ల్యాక. ఒక్కో తూరి మేస్త్రి కల్లు తాపేది. తాగనోల్లకు కొన్ని పైసలిచ్చేది. ఆ పైసలతోని ఆడోల్లు టవునుకెల్లి ఉల్లిగడ్డలు, కారం, ఉప్పు, బియ్యం, బొట్టు బిల్లలు తెచ్చుకునేది. ఏమైన గని కనికరం లేని పని గంటలు. పన్నెండు గంటల పని అలుపు సొలుపు ల్యాకుంట. బుడ్డ పోరలు అమ్మ, నాయనలు పని జేస్తుంటే అక్కడ్నే మట్టిల, బురదల, సిమెంటుల ఆగమాగం తిరిగేది. తానం, పానం లేకుంట పెయ్యి మీద గజ్జి రోగాల తోని తిరిగేది ఆ బుడ్డ పోరలు. జరమచ్చి శాతగాని జంగయ్య గుడిసె మీదకు వచ్చి, ముడ్సుకు వన్న జంగయ్యను కట్రతోని కొట్టుకుంట పని కాడికి గుంజుకు వొయ్యిండు. అన్ని గంటలు పని సెయ్య చాతగాక శీను పారి వొతే వాల్ల నాయన పెంటయ్యను సావగొట్టిండు. మేస్త్రి పెంటయ్య తోని డబుల్ పని జేపిస్తున్నడు. పని సాత గాక పెంటయ్య రేత్రి పూట గుడ్సె ముంగట అందర్కి సెప్పుకుంట బొలబొల ఏడుస్తుండు.

ఎంకటయ్య బేచైనైపోయిండు పని సెయ్య ల్యాక పోతుండు. కట్టెల మెట్ల మీద, సిమెంటు తోని పైకి కిందికి ఎక్కుడు దిగుడు శాతనైతే లేదు. గని తప్పది. తీస్కున్న

అడ్వాన్సు కర్సై పొయ్యింది. ఊల్లె ఆసామి కింకో పది వెయిలు బాకీ ఉన్నది. రోజులు గడుస్తాన్నె. అమ్మ ఖబర్ లేదు ఒంటిగ ఎట్లున్నదో? ఊల్ల ఎవలకు ఫోను లేదు. ఆసామి తాన ఉంది గని అమ్మను పిలుస్తడో లేదో? పని... పని... ఒక్కటే పని.

నర్సయ్య తాగి ఒర్లుతుండు. నర్సయ్యకు పెండ్లం, పిల్లలు లేరు. ముసలి అమ్మ నాయనలున్నరు. నర్సయ్య పెండ్లం పురుడు వోస్కుంటనే సచ్చివోయ్యింది, కడ్పుల బిడ్డతోని. ఊర్ల డాక్టరు ల్యాక సర్కారు దవాఖాన ఎప్పుడూ బందె. కాన్పుల డాక్టరమ్మ నెలకో తూరి వచ్చి దస్తఖత్ జేసి వోతది. ఆమెకు సిటీల పెద్ద దవాఖాన ఉన్నది స్వంతంది. సిటీ తీస్కపోయెటాల్ల కల్ల నర్సయ్య పెండ్లం తొవ్వలనే సచ్చివొయ్యింది. అప్పట్నెల్లి లగ్గం జేస్కోలె మల్ల. ఐదేండ్లు అయ్యింది గిట్లయ్యి. ఊల్లె అమ్మ నాయనలను ఇడ్సి వెట్టి తన రెండెకరాల బూమి దక్కించుకోనీకి బంబై వచ్చిండు నర్సయ్య. పాలమూరుల కేశంపేట మండలం కాకునూరు నర్సయ్యది. నర్సయ్య పానం గుడక మంచిగుండదు. ఎప్పుడు సూడు నీర్సంగుందంటడు. జరమొస్తా పోతా వుంటది. గదేదో ఎయిడ్సని, జల్ది సచ్చి వొయ్యే రోగ మొచ్చిందంట నర్సయ్యకు. దూరంగున్న ఊల్లె ఆడోల్ల తానకు వొయ్యి రోగం తెచ్చుకుండంట నర్సయ్య. తను సచ్చివోతే ఊల్లె అమ్మ నాయనలనెవరు సూస్తరనుకుంటరనీ బాధ పడ్తుంటడు నర్సయ్య. సర్కారు దవాఖానల కెల్లి తెచ్చుకున్న మందులు తింటడు.

* * *

పది నెలల పని పూర్తి గాక ముంగట్నె, మల్ల అదే పని అక్కడ్నే బంబైల జేయనీకి దుడ్లెవలకు గావల్ల అని అడిగిండు ఒకనాడు మేస్త్రీ. శానమంది తీస్కున్నరు ఊరికెల్లి ఏం చేస్తం? ఊల్లె బువ్వ దొరకది ఇక్కడ నూకలన్న తింటానం. ఇంగొక యడాది జేస్కుని వోతిమంటే అయిపాయె అప్పు తీర్తది ఊల్లె అనుకుంట. "అప్పు తీరినంక మీకు ఊల్లెపని దొర్కుతదాబ్బా అప్పు తీరినంక గుడక ఇట్లనే దేశం వోవుడే ఉంటదబ్బా. ఇది ఎంతకి తెగని యవ్వారం" అంట ఫెళ్ళుమని నగిండు పెంటయ్య. ఎంకటయ్య గుడక శానా ఆలోశెన జేసిండు. ఊల్లె ఆసామికె ఇంగొ పది వెయిలు అప్పు ఇయ్యాల్ల. మిత్తే కడతుండు. అక్కడ ఉండాల్నని లేదు. అమ్మ యాదికస్తున్నది. ఒక్కసారి చూడాలన్పిస్తున్నది.

తొమ్మిదో నెల ఇంగో పది నెలల కాంట్రాక్టు పనికి ఎంకటయ్య సేతిల ఇరవై వెయిలు వెట్టిండు మేస్త్రి. దుడ్లు తీస్కోనైతే తీస్కుడం గని, అక్కడ అస్సలుండ బుద్ధి అయిత లేదు. పాలమూరు వోయి అమ్మను సూసొస్త అని అడిగిన గని మేస్త్రి ఒప్పుకోడు. ఎందుకో అమ్మ నాయనలు కలల వద్దరు. ఊరికి రా కొడుకా అని పిలుస్తాన్నరు.

మేస్త్రి నడిగి పోవాల్ల. ఎట్లైన మల్లింకోపారి అడిగిండు. "కుదరదు పో... పోయి పని చేసోక్కే అంత దూరం ఎవరు పంపిస్తారు" అన్నడు మేస్త్రి. ఎంకటయ్య మనసు మనసుల లేకుంటయ్యింది. అమ్మ మీన మనాది పడ్తున్నడు. ఆ దినం బువ్వ తినలె. ఈ ఆలోశెనలల్ల మునిగిపొయ్యిండో ఏమో అంతరం కెల్లి దబ్బున్న కాలు జారి పడ్డడు. కింద ఇసుక సంచుల మీద మోకాల్ల మీద వడ్డడు. బత్కివోయ్యిండు గని చెంప పగిలినట్లయ్యింది. కాలి వేల్లు చితికి రక్తం కారినయ్. "కళ్ళు కనపట్టం లేదారా" అని తిట్టుకుంట మందులిప్పించిండు మేస్త్రి. రెండు రోజులు పన్నడు గని మూడో దినం మేస్త్రీ దిగ బడి పనిలకు దిగమన్నడు. "శాతనైత ల్యా మేస్త్రీ నడుము లిరిగినట్లయినయ్. ఇంగో రెండు దినాలైనంక పన్ల దిగుతాబ్బా" అంటే ఇనలె. "బాడ్కవ్, పనిదొంగై పోయావురా" నువ్వు అనుకుంట కట్టెతోని ఒకటే కొట్టిండు. "రేపట్కెల్ల వస్తనబ్బా, మేస్త్రీ గంతగనం కొట్టాకు" అని జంగయ్య ఇడ్పించిండు.

ఇగ అప్పుడొచ్చింది ఎంకటయ్యకు ఆపనంత దుఃఖం. తను పుట్టిన సంది ఇప్పటిదంక ఎవలు తన పెయ్యి మీద చెయ్యి వెయ్యలె. చదువుకోలె, బడిల పంతులు కొట్టలె. సోపతి గాల్లతోని గుడక దెబ్బలు పడలె. అమ్మ నాయనలు ఎన్నడు కొట్టలె. ఇగో గీ దినం గింత పెరిగిన తనను గీ మేస్త్రీ కొట్టిండు. కుక్కని కొట్టినట్లే కొట్టిండు. కాల్లతోని తన్నిండు ఛీ... తన బతుకెంత గబ్బైంది అన్కుంట ఎంకటయ్య శానాసేపు ఏడ్చిండు. ఇక్కడింక ఒక్క క్షణం ఉండద్దనుకుండు. అందరు పన్నంక నొప్పుల కోరుస్తనే ఉరుక్కుంట, ఉరుక్కుంట తొవ్వల, బస్సులాగె జాగల అందర్నీ అడుక్కుంట ఐద్రాబాదు బస్సెక్కిండు.

పాలమూర్ల బస్సు దిగిండు ఎంకటయ్య. అక్కడికెల్లి తన ఊరు ఉందెకోడు ప్రయానమైండు. ఊర్లె కాలు మోపినంక మనసు నిమ్మలమైంది. ఊర్లె యాడ కూడ ఇంత పచ్చదనం లేదు. అంత ఎండకపోయింది. సగం ఊరు తాలాలె ఉన్నయ్ ఇండ్లకు. దేశం పోయిన మనుషుల ఇండ్లు అవి. ఎంకటయ్య కుర్మోల్ల వాడకట్టుకు రాంగనే ముంగిలి ఊడుస్తొన్న రంగమ్మ చీపిరి కట్ట బూమి మీద పడేసి "ఓ... వచ్చినవా కొడుకా" అన్కుంట ఆస్మాన్ దిక్కు చూపించింది. అమ్మేటు వొయ్యింది. తన ఇల్లు బీగం వేసి ఉంది. ఎంకటయ్యకు సమజు కాలె. ఇంతట్ల వాడకట్టు జనమంత పోగైంద్రు. అందరు కండ్లు తుడ్సుకుంటుంద్రు. "ఏమైంది అవ్వ. మా అమ్మేటు వోయింది?" ఎంకటయ్య రంగమ్మను గావరతోని అడిగిండు "ఎటు వోతదిర కొడ్క, పాము కర్శిందిర ఎంకటయ్య మీ అమ్మకు... తెల్లారినంక గుడక ఇంటి బయటకు రాకపోతే లోపట్కి వోయి జూసినబ్బా... నోట్లె నురగల తోని పడి ఉందిర... పాము

ఇంట్లనే గా బస్తాల ఎనకనే దొర్కిందిబ్బా ఎంకటా" ఏడుస్తనే చెప్తాంది రంగమ్మ.

ఎంకటయ్య దబ్బున బూమి మీద కూల వడి వొయ్యిండు. "నాకెవలు ఎందుకు చెప్ప లేదె అమ్మ వోతే" అని అడుగత. నెత్తి మీద సేతులు తోని, దబ్బ దబ్బ కొట్టుకుంట ఏడుస్తున్నడు ఎంకటయ్య.

"మస్తే కోషిష్ జేసినం కొడక ఒక దినమంత నీ కోసం పీనిగెను ఉంచినమబ్బా... వాసనొచ్చింది. నువ్విచ్చిన మేస్త్రి నంబరు పది తూర్లయిన గని కల్వ ల్యా. కొడ్క ఏం జేద్దమని ఆలోశెన జేసి, వాసన ఎక్కువైతే, ఇక మన పక్కూర్ల మీ చిన్నమ్మకు జెప్తిమబ్బి. ఆల్లు వచ్చి కర్మకాండ జేసింద్రురా..." రంగమ్మ సెప్తనే ఉంది. "ఒద్దుర ఎంకా... ఇద్దరం ఒక్క దగ్గర్నె ఉండి పని చేస్కుని బత్కుదంరా దేశం వోకురా" అమ్మ ఇంగా అన్నట్లె ఉంది.

ఎంకటయ్య దుఃఖంతోని తాయిమాయి అయ్యిండు. బాధతోని లుంగ చుట్టక వోత ఎక్కెక్కి ఏడ్సిండు. బూమి నీల్లు నాయనను బలిదీస్కున్నయ్, ఇల్లు అమ్మను చంపింది. ఈ ఊల్లె తనెందుకింక? ఇంట్లకు పోబుద్ధి కాలె. ఇల్లా ఇది? పెద్ద పాముల పుట్ట తీరుంది. పాడుబడ్డ ఇల్లు. జొన్న బస్తల కింద, నడుమన ఇంటి మూలల రంధ్రాలల్ల, ఇంటి చూర్లల్ల ఎన్ని పాములు చంపలేదు నాయన, తను? మంచి ఇల్లు గిట్ల పాములు రాని ఇల్లు కట్టుకోవాల్నని నాయన ఎంతగనం కలగండని? ఎలుకలు, కప్పలు, పాములు దూరె పాడు బడ్డ ఇండ్లు తమవ. బాగు జేస్కుందమంటే దుడ్లేడివి? బువ్వకే గతి ల్యా. అమ్మేనా, ఊర్లె గరీబోల్ల ఇండ్లల్ల, పొలం కాడ ఎంత మంది పాముకాట్లకు చచ్చింద్రని?

రంగమ్మ రేత్రి ఎంకటయ్యకు ధైర్నం జెప్పింది. అన్నం పెట్టింది. ఎంకటయ్య సేతిల వాళ్ళమ్మ వెండి గొల్సులు పెట్టి మీ అమ్మవిరా అని ఏడ్చింది. అమ్మను ముట్టుకున్నట్లె అన్పించింది. అవ్విట్ని పట్టుకుంటె, మల్ల దుఃఖమచ్చింది. అమ్మను సూడల అని ఉర్కులాడ్త వస్తె అమ్మ సచ్చే వాయె. ఏం చేసుడు? ఎట్ల బత్కుడు? అమ్మ ల్యాకుంట, ఎంకటయ్యకు తన బత్కుల చీకటి కమ్మినట్లు అయ్యింది. ఎక్కడ సూడూ అమ్మనే కన్పిస్తున్నది. ఒక వారం దినాలు చచ్చిన పీనుగోలె ఇంటి ముంగట పడి జేరిండు. ఊర్లె తెల్సినోల్లంత వచ్చి పలకరించి పోతుంద్రు. ధైర్యం సెప్తుంద్రు. తమ ఇంటికి నాలుగిళ్ళ అవతలున్న యాదయ్య మొత్తం కుటుంబంలోని దేశం వోయిండంట ఆల్ల ముసలి అమ్మ నాయనలున్నరు ఇంట్ల. రంగమ్మ పెద్ద కొడుకు గుడక దేశం వోయిండంట.

ఎంత బత్మిలాడింది అమ్మ దేశం పోవద్దని? తను దేశం పోక వోతే అమ్మ

బతికెడిదా? తనుంటె పాము రాక వోయేడిదా? ఏమో ఇల్లు బాగు చేపిచ్చేటోడేమో? నాయన చానా సార్లన్నడు ఇల్లు కట్టక వోయినా సరే గీ ఇంటినే మరమ్మతు జేస్కుని ఎలుకలు, వాటిని తిననీకి పాములు రాకుంట జేస్కోవల్ల అని ఏమో? తనుంటే పాములు రాకుంట చూస్కునేటోడేమో?

ఊర్లె ఉండుడా? దేశం పోవుడా? ఎటూ తెలవకొచ్చింది ఎంకటయ్యకు. ఊర్లె మూడెకరాలు పండిద్దమంటే నీల్లు ల్యావు. కరెంటూ ఉండది. మేపనీకి గొర్లు ల్యావు. సేతిల ఉన్న దుడ్లు ఆసామి సేతిల వెట్టి మల్ల దేశం పోవుడా, ఏమో కని బంబై మాత్రం పోడు.

* * *

అక్కడికెల్లి మల్ల ఎంకటయ్య గుంపు మేస్త్రీతోని గుజరాత్ దేశం అహమదాబాదు బయల్దేరిండు. మేస్త్రి ఇచ్చిన డబ్బు బ్యాంకుల వేస్కుండు. అహ్మదాబాద్‌లో తొమ్మిది నెలలు బిల్డింగ్ పని, మట్టి పని జేసిండు. కొన్ని దినాలు పోడేసాద్ పని (బీడీలు కట్టెపని) జేసిండు. మల్ల పది నెలలు కాంట్రాక్టు పని చేస్కుంట అక్కడ్నే ఉండు. అక్కడ్నే పద్మను మనువు జేస్కుండు. పద్మ పాలమూరులోని నారాయణపేట మండలం, కొల్లంపల్లి కెల్లి వచ్చిన మణెమ్మ–బాలయ్యల బిడ్డ. కుటుంబమంత వలస వచ్చింద్రు. వాండ్లే అడిగింద్రు పద్మను మనువు జేస్కోమని. పద్మ అన్ని రకాలు మంచిగన్పించింది. తనకు ఒక తోడు కావల్ల అన్పించింది, జేస్కుండు. అక్కడ్నే ఒక గుడిల మేస్త్రి మనువు జేపిచ్చిండు. అక్కడ్నే రాము పుట్టిండు, పెరిగిండు. పదిహేను ఏండ్లు అహ్మదాబాదుల ఉన్నంక ఇంక ఎంకటయ్యకు ఇంటి మీన గాలి మళ్ళింది. మల్ల ఊరి యాది, అమ్మ యాది సతాంచింది.

పద్మను, కొడుకు రాముని తీస్కుని పాలమూరు ప్రయానమైండు. సంపాంచిన డబ్బుతోని ముంగట తన ఇల్లు బాగు చేపించుకుండు. తాగే నీల్లు ల్యాక వోతే వాడకట్టంత ఇంటికి పదమూడొందలు వేస్కుని బోరేపిచ్చుకుండరు.

అటెన్క వానా కాలమచ్చింది. ఎంకటయ్యల రైతు నిద్రలేశిండు ఆశవడ్డడు. చెలకల జొన్న లేసిండు. మొలకలైతే మంచి గొచ్చినై. ఎంకటయ్యకి ఆశ పెర్గింది. కానీ వానలే పడలె. బోరు పని జెయ్యలె. పంట ఎండినట్లైంది. కుర్మోల్ల ఆసామి దశరథ్ తాన అప్పు చేసి బోరేపిచ్చిండు. వచ్చె కరెంటు, వోయె కరెంటుతోని బోరు పాడయ్యింది. పంట ఎండింది. మల్ల అప్పు నెత్తిన వడ్డది. ఊర్లె పని ల్యాదు. ప్రొక్లెయినర్ల తోని పనులు చేపిస్తుండరు. ఎండిన చేన్ల కూల వడి గుండె పగల ఏడ్సిండు. వానస్తే ఎంత ఏపుగ పెరిగేడ్డి జొన్న చేను? పోనీ, గా జూరాల రిసర్వాయర్ అయినా అయితే

నీళ్లొచ్చేట్వి. చెరువులు, కుంటలు పూడికతోని, తుమ్మసెట్లతోని, కాల్వలు, తూములు పాడైనయ్ నిండుకున్నయి. సర్కారు కగ్గితగల ఎవడూ యామీ సెయ్యడు.

తెలంగానస్తే నీల్లు వస్తయ్ అంటంద్రు. గీ తెలంగాణ ఎప్పుడొస్తది? జల్దస్తే బాగుండు. అప్పుడు, ఇప్పుడున్న ఆంధ్రోల్ల సర్కారు తెలంగాణ నీల్లు ఆంధ్రకు తీస్కపోటమే ఉంది గని తెలంగాణోల్లకు ఇచ్చుడే ల్యా. తెలంగాణ సర్కారొస్తే మంచిగ నీల్లస్తయ్ అంటుంద్రు. తెలంగాణంతా పెద్ద ఉద్యమమే నడుస్తొంది. దినాం ఏదో ఒక జులూస్ తీస్తంద్రు. టీ.వీ.లల్ల గుడక గదే చూపిస్తుంద్రు. మొత్తం గాకపోయిన గీ జూరాల లిఫ్టు వైపు పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు తెస్తె నీల్లు వస్తయ్ తమకు. మొన్న ఎవరో సార్లస్తే, ఊల్లె శానామంది గిదె చెప్పింద్రు. డాము వస్తే, ఊల్లె పంటలు పండి జనం ఊల్లెనే ఉంటరు. దేశాలు వట్టి వోరు. గని గద్దె నెక్కినంక ఆంధ్రోడైన, తెలంగానోడైన ఒక్కటే... అప్పుడెవలనడగాల?

మెల్ల మెల్లగ ఊర్ల పని దొర్కుడు బందైంది... పెండ్లం పిల్లలు పస్తులుంటుండరు. ఒక పూట బువ్వ, ఇంగో పూట అంబలి అయితున్నది. రెండేండ్లు గట్లనే గడ్సివోయినయి. నీల్లు, కరెంటు ఇయ్యని సర్కారు అంబలి బిచ్చం వోస్తుంటే జనం గంజులు, తల్లెలు వట్కొని ఉర్కుతుండరు, కుక్క పిల్లల తీరు. తన భార్య గుడక ఎన్ని తూర్లు అంబలి తెచ్చుకోలె. ఊరంత బిచ్చపోల్ల తీరు అయ్యింద్రు, ఊరు ఊరంతా. గీ తలరాతంత ఎవలు రాసింద్రు? బూమి ఉన్నా, తలాపున కృష్ణమ్మ ఉన్నా, నీల్లెందుకు రావు తమకు? ఎవల తాన దీనికి సమాధానం ఉంది?

రెండు మూడు ఊర్లు దాటి అడవిల, మిరప తోటలల్ల, బుడ్ల పనికి పోవుడు. శానా కష్టం మీద ఆ పని దొరికెడ్డి. దొరికిన్నాడే బువ్వ, ల్యాక వోతే కడ్పుల గవ్వలె. అడవిల కట్టెలు కొట్టి అమ్ముదమంటే పులుల, పాముల బయం. గిట్లనే ఊర్లె మూడు ఏండ్లు గడ్సినయ్. రాముకు పదిహేను ఏండ్లు వడ్డయ్. చదువ ల్యా. తన తీరె పని కోసం ఊరి మీద వడి తిరుగుతుండడు. మద్దె మద్దెల తెలంగాణ సంఘమోల్ల మీటింగులకు పోవుడు షురు చేసిండు ఎంకటయ్య, తెలంగాణ ఎందుక్కావాల్నో సెప్తుండరు వాల్లు. మధ్యల కేసిఆర్ నిరాహార దీక్ష జేసిండు. తెలంగాణ ఇచ్చినట్లే ఇచ్చి మల్ల ఎన్కకు తీస్కుండరు. తెలంగాణ వచ్చిందని అందరెంతో సంబుర వడ్డరు. తెలంగాణస్తే నీల్లస్తయ్ బూములున్నోల్లు ఎవసాయం జేస్కోవచ్చు, బూమి లేనోడికి బూమొస్తది. బూమున్నోడి చెల్కల కూలీ దొర్కుతది. కుమ్మరోల్లు, కుర్మోల్లు, గౌండ్లోండ్లు, సాకలోల్లు, అందరు ఊర్లకే బత్కుతరు. గిట్ల దేశం కాని దేశం పోరు కద. పోయినేడాది అప్పు చేసి పత్తి పంటేసి, ఎండివోతే బోజన్న చెల్కలనే పురుగుల మందు తాగి

ఆత్మహత్య చేస్కుండు. గట్ల కాదు కద. తెలంగాణ రావల్ల, జరూర్ రావల్ల తమకి నీల్లిచ్చేవోడే తెలంగాణ రాజ్యమేలాలె. ఎంకటయ్య ఆలోశెనల తెలంగాణ తిర్గుతున్నది.

* * *

రాను రాను పని దొర్కుడు మా కష్టమైతున్నది. ఎంకటయ్య నెత్తి మీద సేతులేస్కుని కూసుండు. ఏం చెయ్యల్ల? మల్ల గుజరాతు పోదమా? అని ఆలోశెనల వడ్డడు. ఇంతల కుర్మోల్ల ఆసామి దశరథ్ కాన్నించి రమ్మని ఖబర్ వచ్చింది. ఎండకాలం ఊల్లె ఎక్కడ గుడక పచ్చని గ్రాసం ల్యా. జీవాలు గూడక ఆకలికి ఏడస్తాన్నయ్.

తన 300 గోర్లు మేపనీకి రాముని దేశం పంపనన్న పంపు ల్యాక వోలే నీ బూమైన రాసియ్యి, అని కూసుండు ఆసామి దశరథ్. కొడుకుని గొర్లు మేపనీకె దేశం తోలియ్యుడు తప్ప, ఇంగో తొవ్వ దొర్కలే ఎంకటయ్యకు, చేసిన యాభై వెయిల అప్పు ఎట్ల చుక్త జేసుడు? రెండేళ్లు గొర్లను మేపితే అప్పు చుక్త జేస్తడంట.

రాము నేను పోనంటే పోను నాయినా అని చాన జిద్దు జేసిండు గని ఎంకటయ్య తన అప్పు గురించి చెప్పి "కడ్పునిండ బువ్వ దొర్కుతదిరా కొడకా నీకు దినాం బువ్వ తినచ్చు" అని బుదరకిచ్చిండు. మన బూమి మనకు దక్కల్నంటే నువ్వు గొర్లను మేప దేశం పోవల్ల. ల్యాక వోతే గోతికాడి నక్క తీరు అప్పిచ్చిన ఆసామి కాసుకుని కూసుండడు.. నువ్వు నీ పిల్లగాండ్లు ఇప్పుడు కాకపోయినా ముంగట మంచి గుండల్నంటే, నువ్వు పోవల్లరా తప్పది... ఎంకటయ్య మాటలకు రాము సప్పిడి జెయ్యలె.

* * *

ఆ దినం రాము గొర్లు మేప తందుకు దేశం బయలెల్లిండు. రాముతోని నీనా నాయక్, యాదయ్య. దేవన్న – రమేశ్, సవరన్న, లక్ష్మన్, ఊషన్న, దొలన్న, మలతయ్య–బీసన్న, కర్నెన్న, జంగయ్య, సాయన్నలు అంతా కల్సి వెయ్యి గొర్రెలతోని దేశం బయలు దేరింద్రు. ఆ యాడాది కోసానకు ఆసామిచ్చిన రెండు జతల చెప్పులు, రెండు లుంగీలు, అంగీలు, స్నానంకు నల్ల సబ్బు, బియ్యం, కారం, ఉప్పు, నూనె అన్నీ మూటలు కర్రెకు కట్కొని గొర్ల కాపరులు బయలెల్లింద్రు. అన్ల ముగ్గురు గొర్రెల ఆసాములన్నరు. లక్ష్మన్, యాదయ్య, రమేష్లు గొర్రెల ఆసాములు. మిగిలినోల్లంత ఆల్ల పాలేర్లు. రాము గొర్లె ఆసామి మాత్రం రాలేదు. ఆయనకు ఊర్లె ఎవసాయం ఉంది. మద్దె మద్దెల వచ్చి పోతుంటడు.

'సమ్మక్క సారలక్క అడవిల మేపాల్నంట' పద్మ రాముని వట్కొని ఒకటే ఏడుపు షురు జేసింది. "సోపతి గాల్లతోనే ఉండు, అడవిల శానా దూరం వోమాకబ్బా

తోడేల్లు, పులులు, పాములుంటయ్. ఇంటాన్నవా లేదా" అనుకుంట ఏడుస్తనే మాట్లాడ్త ఉంది పద్మ. ఎంకటయ్య గుడక కళ్ళ నీల్లు తుడ్సుకుండు. గొర్ల కాపర్లు పయానమైనరు. రాము గుడక ఆ గొర్రెల మందల ఒక గొర్రె తీరె అన్పించిండు ఎంకటయ్యకు.

* * *

ఎంకటయ్య-పద్మలకు కొడుకు గొర్లె కాపరిగ దేశం పోయినంక ఊల్లె యా పని చేసి బత్కాల్నో సమజ్ కాలె. ఊరంత పిసోడి తీరే తిరిగిండు. ఎడారిల నీల్ల కోసం దేవులాడుతున్నట్లే అన్పించింది ఎంకటయ్యకు. గట్లనే ఆరు నెలలు గడ్సి పొయినయ్. ఎటు బోవాల్నో అయోమయంగుంది. ఇంతట్ల ఊల్లెకు కుమార్ మేస్త్రీ వచ్చిండని తెల్సింది. ఎంకటయ్య పొయ్యి కల్సిండు. ఐద్రాబాద్‌కి లేబర్ కావాల్నంట. లెంకకు నలభై ఏల దుడ్లు మాట్లాడుకుండరు. అడ్వాన్సు ఇరవై ఎయిలు తీస్కుండు. అగో గట్లచ్చి పడ్డడు గీ గచ్చిబౌలి లేబరు అడ్డాకు. ఇక్కడందరు పాలమూరు లేబరే ఉండరు. ముప్పై కుటుంబాలున్నయ్. ఒక్కోలదీ ఒక్కో కథ ఉంది. యాదో రాము అక్కడ గొర్లు మేప తందుకు వోతే, తమ పద్మ ఇక్కడ లేబరు పని చేసి అప్పులు చుక్త జేసెతందుకు డబ్బులు జమ జేద్దమనుకుండరు. ఈ లోపట రాము సారి వోయి వచ్చిండు. వానికి శాతనైత లేదంట. గొర్లు మేపీ మేపీ గొర్ల తీరు కాల్లు కొచ్చె వోతయని భయమైందంట. అక్కడ శానమంది గొర్లు మేపే పిలగాండ్లకు గట్లనే అయిందట. రేపు వానికి చెప్పల్ల. వారానికో పారి ఫోన్ జేసి నాయన నేను వచ్చేస్త శాతనైతలేదనె టోడు. తను సమర్ఝాయించేటోడు. ఇంగెంత కొడుకా ఒక యాడాది అయితే అయిపోతది అనుకుంట బుదరకిచ్చేటోడు. ఈ పారి చెప్ప వెట్టకుంట జీవాలను అక్కడ తన సోపతిగాల్లకు ఇడ్సి పెట్టి పారొచ్చిండు. ఆసామి దశరథ్ గొర్రెలు జతనంగ ల్యాకవోతే ఇంకింత అప్పు జేరుస్తడు. మద్దెల పారిపోయి వస్తే మిత్తి కట్టమంటడు. ఎట్లైన తను రామును సమ్ఝాయించల్ల. ముందైతే మంచి డాక్టరు తానకు కొంట వొయ్యి వాని కాండ్ల పుండ్లు చూపియ్యల్ల అనుకుండు వెంకటయ్య.

* * *

నాయన, అమ్మల తోని దేశం వోయినప్పుడు లేబరు పని మట్టి, సిమెంటు, ఇటుక తట్టలు ఎత్తుడే జేసిండు గని గిట్ల గొర్లు మేప వోలె.

కిలోమీటర్ల నడుస్త గొర్లను మేపుకుంట పోవల్ల. ఎక్కడ గ్రాసం. నీల్లు ఉంటే, ఆడ గంటల కొద్దీ ఆగల్ల. ఒక్కో తూరి రెండ్రోజుల దంక ఆడనే ఉండుడు. చెట్ల కింద ప్లాస్టిక్ కవర్లు, చద్దర్లు వేస్కుని ఉండల్ల. అక్కడ్నే వంట చేసుకొనుడు ల్యాక వోతే ఊల్లెకెల్లి అడుక్కుని తెచ్చుకొనుడు. అడుక్కుంటాంటే నాయన సెప్పేది యాది

కొచ్చేది. కడుపు నిండా బువ్వ దొర్కుతలేదండు గొర్లు మేపితే. గిదేనా నాయనా అడక్కుతినే బత్కు అని అడగాల్నని అనిపించేది. దయగల తల్లులు బువ్వేస్తరు. అందరు వెయ్యరు. ఎల్లగొడ్తరు. కిలోమీటర్ల దంక నడక... నడక... గొర్లు యా దిక్కు తీస్కవోతే ఆ దిక్కు నడక. కాల్లునొచ్చి దుఃఖం వచ్చేద్ది. నడవ ల్యాక కూల వడితే ఆసామి గద్దరించి మందిచ్చేటోడు. ఎంత నడిచిండు? గా తొవ్వ యాదికచ్చింది. య్యాడ య్యాడ దిరిగిండు? పాలమూరు, జడ్చర్ల, బిజినేపల్లి, సూర్యాపేట, నల్గొండ, ఆలియా, మిర్యాలగూడ, కోదాడ, ఖమ్మం, వైరా, కొత్తగూడం, భద్రాచలం, అడవి, ములుగు, మంగపేట, ఏటూరు నాగారం గివ్వన్నీ దాటినంక సమ్మక్క సారలక్క అడవిల గుట్టల మీన నడక యాది కొచ్చింది.

మొత్తం ఒక పన్నెండు మంది పాలేర్లు గొర్లెకు మేపుత పోవుడు. ఆ నడక ఆ గది. ఆగిన గని మల్ల సాగుతనే ఉంటది. గొర్లు తోల్కవోతనే ఉంటయ్ ముందుకు. ఆసామి కూసోనివ్వడు. నిద్ర వోనియ్యడు. గద్దరిస్తనే ఉంటడు. పాలేర్లు యామన్న అట్లిట్ల అయి రాన...? కఱ్ఱ తోని కొట్టుడే. ఒక తూరి, పదమూడేండ్లుటయ్, లంబడోల్ల పోరడు నీనానాయక్, వాని గుంపులకెల్లి గొర్రెపిల్ల కనపడకొచ్చింది. ఆసామి ఆడనే ఉండు. దేవులాడంగ అడవిల ఒక గుంటల వడి వొయ్యి లెవ్వ ల్యాక ఏడుస్తాంది. ఎట్లనో గట్ల దాన్ని అందరు కల్సి బయటకు దీసిండరు. ఇంక వాన్ని కొట్టిండు సూడూ వాని ఆసామి రమేషు, రక్తాలు కారేదంక కొట్టిండు. రాత్రి, నీవా నాయక్ "నేను మా ఊరు వోత. గొర్లు మేప. మా య్యాడి తానకు వోత" అని ఊల్లె య్యాడికి ఇనపడాలన్నంత లాజిగ (పెద్దగ) ఏడ్సిండు. బువ్వ గుడక తినలె. తెల్లారి చూసెటాల్లకల్ల నీనా నాయక్ కనపడలె. అడవిల సానా ఎతికిండరు దొర్కలె. ఆసామి గావర వడ్డడు. ఇంక పక్కన ఉన్న ఊర్లె ఎతక పోయింద్రు. తను, ఆసామి. ఊర్లె ఒక ఓటేలు ముంగట అడుక్కుంటండు నీనా నాయక్. వానితోని ఇంగో ముసలామె గుడక అడుక్కుటంది. ఆసామిని జూసి ఆ ముసలామె ఎనక పొంటి నక్కిండు. ఎంత రమ్మన్న రానంటడు. తన ఊరికి తొల్తెనే వస్తనంటడు. గా ముసలామె పక్కనే కూసుంటడు. "ఎందుకు ఆసామీ గంత గనం కొట్టినవ బుడ్డపోరన్ని... నీ తాన ఎందుకుండల సెప్పు... గట్ల రక్తం కారేతట్లు కొట్టిండవు? మనిషివి కావాబ్బ ఏంది మల్ల?" ముసలామె ఆసామిని గద్దరించింది. అక్కడ్నే కూల వడ్డడు ఆసామి.

"ఏందబ్బా అడుక్కుంటండవు, ఎవరు నువ్వు య్యా వూరు నీది?" తనడిగిండు ఆమెను జూస్తే తన నాయనమ్మ యాదికచ్చింది. 'మాది గీ జడ్చర్లబ్బా, ఊరు, పోలేపల్లి కొడుకా. నా పేరు అంజమ్మ. యైదేండ్ల కింద మా బూమిని సర్కారు గుంజుకుంది

కొడకా. మా బూమిని మందుల కంపెనీకి ఇచ్చింది. బూమి మీద బెంగతోని నా పెన్మిటి చెల్కలనే గుండె పోటొచ్చి సచ్చి వోయిండు. బత్కు తెరువుకు నా కొడ్కు కోడలు దేశం వోయిండరు. నన్ను తోల్కవోలె. యాడాదికొక తూరి వస్తరు. మల్ల యాడాది పనికి దేశం వోతనే ఉంటకు. ఆల్లిచ్చే దుడ్లు నాకు సరివోవబ్బా. ముసల్దాన్ని నాకు కూలి దొర్కది. గందుకె పగలంత గిక్కడ హోటల్ల ముంగట అడుక్కుంట కొడకా... సత్తువుంటే ఆల్లు సెప్పిన పని గుడక జేస్త. శానా తూర్లు సంఘపోల్ల తోని నా బూమి కోసానకు పోరాటం జేసినాబ్బా. పోలీసోల్ల తోని కొట్టించింర్రు గా కంపెనోల్లు...” అంజమ్మ చెప్తా పోతాంది. ఇంతల ఆసామి లేచి గా ఓటెల్ల గిన్ని చాక్లెట్లు కొని నీనా నాయక్కి ఇచ్చిండు. “రేపే మీ నాయన తానకు వంపుత రాబ్బా, ఇక్కడుంటె దారి తప్పుతవు” అని బతిమిలాడిండు. “పోరా కొడక కొంచమైతే నేను గుడక వోత. ఎవలన్న ఎత్కవోతరు నిన్ను మీ ఆసావితోని ఎల్లిపో” అన్నది. నీనా నాయక్ తప్పదన్నట్లు లేసి రాము సెయ్యి పట్టుకుండు.

అక్కడ్నించి ముందుకే మల్ల గొర్ల తోని, గొర్ల తీరంగ. దేవన్న కాల్ల నొప్పులు తెలవద్దని పాటందుకుంటడు. పిల్లంగ్రోవి ఊదుతడు. వానికి శానా పాటలు వచ్చు. పొద్దు పొద్దు గొర్ల తోని ఉర్కుతడు. అవల్ల గుంపులకెల్లి పక్కకెల్లకుండ. ఊర్లె ఉన్న తన ఆసామి లక్ష్మన్‌కు, రాముకన్ని పన్లు నేర్పియ్యమన్నడు. లక్ష్మన్ ఆసామికి రొండొందల గొర్లున్నయ్. తన మీద పెత్తనం జేస్తడు. ‘ఇంగ నువ్వు నా చేతికింద సెయ్యాలోయ్” అనుకుంట అన్ని పనులు సేయించుకుంటడు. దేవన్నకు, అన్ని పనులు వచ్చు. తను దేవన్నతోనే ఉండల్ల. దేవన్న నాయన పత్తి పంటల నుక్సాన్ వచ్చి చెల్కల ఉరి వోస్కుని సచ్చి వోయిండు. దేవన్న పది పాసయ్యిండు. ఒక అక్క ఉంది. దేవన్న అమ్మ, అక్కలిద్దరు ఎండలకాలంల బీడీలు సుడ్తరు. ఊల్లె యా పని దొర్కితే ఆ పనికి వోతరు. లేన్నాడు ఇంట్లనే ఉంటరు. దేవన్న అక్క మనువు జేసేతందుకు దేవన్న చదువు ఆపి ఆరేండ్ల సంది ఇట్ల గొర్లు మేపనీకి దేశం తోల్తాంది వాళ్ళ అమ్మ. చేసిన అప్పు చుక్త చేయలేదని వాల్ల బూమి కబ్జా జేసిండు ఆసామి. కాలేజీకి పోతనే అమ్మా అని ఏడ్సిన కొడుకుని అక్క లగ్గం సెయ్యల కొడకా అని అడవికి తోలింది దేవన్న తల్లి. ఇప్పుడు దేవన్న ఇరవై ఏండ్ల షోర పోరడైండు. గొర్లు మేపుటంలో శానా అనుభవం సంపాచ్చిండు. తన బాధ మరవనీకి దేవన్న పిల్లంగ్రోవి ఊదుతడు.

పాలమూరుకెల్లి ఏటూరు నాగారం అడవి చేరేటందుకు మూడు నెలలపైన పట్టింది. మద్దె మద్దెల ఎన్నెన్ని కథలైనయ్? తల్సుకుంటే దుఃఖమొస్తది. నీనా నాయక్ తీరు తనకు గుడక అమ్మ నాయనల తానకు పారివోవాల్నని శానా అన్పిస్తుండే

దేవన్నతోని సెప్పేది తన మనసుల ముచ్చట. "ఆసామి నరికేస్తడురో... గీ అడవిల నీ పతా గుడక తెల్వది ఒద్దబ్బా" అనెటోడు. దేవన్న తనకు గురువోలె ఉండేటోడు. గొర్ల పెంపకంల తనకు పెద్ద సార్ తీరయ్యిండు. ఒక దినం గర్భంతోని ఉన్న గొర్రె కననీకి నొప్పులు పడ్తాంటే ఆసామి గొర్రె తలను రాముతోని తీపియ్యమన్నడు. తనకు శానా బయమయ్యింది. దేవన్న దగ్గరుండి తల బయటకు తీపిచ్చిండు. చిన్న గొర్రె తలను రాము తోని తీపియ్యమన్నడు. తనకు శానా బయమయ్యింది. దేవన్న దగ్గరుండి తల బయటకు తీపిచ్చిండు. చిన్న గొర్రె పిల్ల పుట్టింది. తర్వాత మాయ లాగి గొర్రె నోట్లె వెట్టిండు, దేవన్న. తనకు ఒకరింతచ్చింది. ఎందుకట్ల జేస్తున్నవంటే, "ల్యాకుంటే అది తన బిడ్డను గుర్తు వట్టి పాలియ్యది, దూరం జర్గుతది" అన్నడు. అన్నట్లే తల్లి గొర్రె లేసి పిల్ల గొర్రెను నాకుడు షురు చేసింది. ఇంగ దినాం ఈనిన తల్లి గొర్రెల తాన, గర్భిణి గొర్రెల్ని కలిపెటోడు. అట్ల జేస్తే అవి జల్ది కంటయంట. గొర్రె కూనలకు తల్లి గొర్రె చన్నుల దగ్గర్కి వెట్టి మూడు పూటల పాలు కుడిపించేటోడు. తల్లి గొర్రెల్ని మేతకు కొంటవోతనే, గొర్రె కూనలకు వాటితో కొంచెం దూరం పాలకోసానకు తింపెటోడు. గర్భిణి గొర్రెలకు మంచి గడ్డి, ఆకులు ఎక్కువ తిన్పించెటోడు బలంగుండాల్నని. గొర్రెలకు నట్టలు, పురుగులు సచ్చేటందుకు మందు తిన్పించెటోడు. ఒక్కో తూరి మొగ గొర్రెల బుడ్డలు వాసి పొయ్యేటివి. ఆ వాపు తగ్గనీకి ఇనుప సువ్వ కాల్చి తోక మింద, తల మింద వాత వెట్టెటోడు. ఒక్కో తూరి గొర్రెలకు పుండ్లయ్యేటివి. డాంబరు గోలీలు షూరషూర జేసి ఆ పుండ్లల్ల నింపెటోడు. గొర్లు బూమికై కాల్లు కొట్టుకుంటాంటే "అరె వీటి కాల్లకు పురుగులు అయినయ్ సూడు" అన్కుంట కాండ్ల మింద ఉన్న పుండ్లకెల్లి బయటకు వచ్చే పురుగులు తీసి అన్ల డాంబరు పొడి నింపెటోడు. పెద్ద డాక్టరు తీరు కన్పిస్తుండె దేవన్న తనకు. గొర్లు ఆయాసపడ్త, ఊపిరాడనట్టు చేస్త తల బూమికై జేసే గొర్లను సూపుత "ఆటికి దొమ్మ రోగం వచ్చిందబ్బా నీల్లె దీనికి మందు అన్కుంట. వాటికి శానా దూపైతాంది చూడు" అన్కుంట అవ్విట్ని నీల్ల కాడికి తొల్కవోయి ఛాతీ మీద, నీల్లు సల్లుత చేత్తోని గుద్దెటోడు. అవి దేవన్నకి ఇనకుండ గుంజుకుంటూంటే దేవన్న, దొమ్మ రోగం వచ్చిన గొర్రెలు మాట ఇనయిరా ఇవ్విట్కి నీల్లు తాపాలె అనెటోడు. ఆసాముల దగ్గర గొర్ల మందులు, సూదులు అన్ని ఉండెట్వి. దొమ్మ రోగం ఇక తగ్గదని తెల్సినంక గొర్రెను చంపి అందరు మాంసం కూరొండుకుని తినెటోల్లు.

ఒక జాగ, ఇల్లు అని ఉండెడ్డి కాదు, తమ గొర్ల కాపర్లకు. ఎండా, వాన అన్నీ తమ మిందనే. ఊర్లూ అడవులూ దాటంగ దాటంగ ఒక్కో తూరి వాన పడేది.

కాపర్లు గొర్లతో సెట్ల కిందికి జేరేటోల్లు. చద్దర్లు, కంబళ్ళు, ప్లాస్టిక్ కవర్లు కప్పుకున్న గని తడ్సివోయేది. చీకటి పడ్డంక కూడ వాన ఆగకుంటే వరిపొలాల గట్లెంబడి అట్లే ఒక పక్కలకు ఒరిగి పండేది. పండెతందుకు జాగ దొర్కక వోతే, చెట్టు నీడ దొరికినంక, నిలబడే కర్ర కొన చేతబట్టి, దాన్ని చెంపకు ఆన్చి నిద్రపోయేది పాలేర్లంత. నిలబడి నిద్రపోయే పాలేర్లను, దేవన్నను చూస్తే తనకు చిత్రంగ అన్పించెడ్డి. ఏం కావాల్నని ఒంటి కాలి మీద తపస్సు చేస్తుంద్రు? ఈ కాపరి బత్కుపోవాల్ననా? ఊల్లె నీల్లు రావాల్ననా? పంటలు పండుత తమంత ఊర్లె తమ అమ్మ నాయనల తాన ఉండాల్నన? అన్పించెడ్డి.

కంటి నింద నిద్ర ఉండేడ్డి కాదు. జాము గొట్టల్ల. ఒక పాలేరు రెండు గంటలు నిద్ర వోతే, ఇంకొక పాలేరు గొర్లు మేపల్ల. రొండు గంటలకొక జాము. గొర్ల ఆసాములు మాత్రం నిద్రవోయేది. గొర్లెను పాలేర్లు సరిగ మేపుతున్నరా లేదా అని ఆసాములు కాపలా కాసేది. ఆసాములు పాలేర్లను బూతులు తిట్టేది. నీనా నాయకే కాదు, పదిమంది పాలేర్లు శానా కష్టాల కోర్చుకుంట గొర్లు కాసేది. ఊల్లె ఉన్న అమ్మ నాయనలను యాద్ జేసుకుంట రేత్రిపూట కుల్లికుల్లి ఏడ్చేది. పెద్ద పాలేర్లు ఆల్లకు ఊకోమని బుదరకిచ్చేది.

గొర్ల ఆసాములు ఊల్లెకెల్లి, అడవిలకొచ్చి పాలేర్లను కలిసేది. అప్పుడు పెరిగిన గొర్ల ఉన్ని తీసి రెడీగ పెట్టల్ల. వానా కాలం అయిపోతదనంగ, ఎండల కాలం ఇగ వస్తదనంగ గొర్లకు ఉన్ని తియ్యాల. ఒక గొర్రె యాడాదికి మూడొందల కెల్లి ఆరొందల గ్రాముల ఉన్నిస్తది. ఆ ఉన్నిని హర్యానా, పానీపట్‌ల కెల్లి వచ్చిన ఉన్ని కొనేటోల్లకు ఆసాములు అమ్ముకునేది. కత్తి వట్టి ఉన్ని తీసుడు కూడా దేవన్న నేర్పిండు. గొర్లు ఎసొంటి ఆకులు, గడ్డి తినివో, తినేవో సెప్పెటోడు. వాన పడితే తడ్సిన గడ్డిని గొర్లు తినవు. సెట్ల ఆకుల్ని తింటయ్. అప్పుడు ఆసాములు గొర్లను ఎనకకు మర్లమంటరు. ఆటిని మల్ల ఎనకకు మర్లించుకుంట, పొడి గడ్డి ఉన్న తానకు తేవల్ల. గివన్నీ దేవన్ననే సెప్పేది.

* * *

రేత్రి ఎటంటే అటు అడవులల్ల పండుడు. యా పాము కరుస్తదో, యా తోడేలొస్తదో దెల్వదు. పోయిన నెల దేవన్న మీదకు వచ్చిన తోడేలు యాదికస్తే ఒనుకొస్తది. గుండెలు దడదడ మంటయ్. సెట్టుకింద కాపుకాస్తున్న దేవన్న మీదకు ఎట్లచ్చిందో ఒక తోడేలు మీద వడ్డది. పెద్దగ అర్చుకుంట కర్రతోని, రాల్లతోని కొట్టుకుంట దాన్ని తర్మిండు. అది మీద మీదకు ఒచ్చింది. గొర్లను పట్టాలని జూస్తున్నది. ఊకె మంద

మీదకు పోవాల్నని జూస్తంది. కర్రతోని కొట్టతందుకు వస్తున్న దేవన్న మీద నోరు తెర్సి కోర పండ్లన్ని ఏస్కుని పడతెందుకు చూస్తంది. ఎట్లో ఒక తీరు కర్రతోని రాళ్ళతోని దాన్ని మంద మీనకు రాకుంట చూస్తుండుడు. మనిషి మొత్తం చెమటతోని నీరు నీరైండు. ఇంతట్ల ఒక ఆసామి నిప్పు వెలిగించిండు. అది అడవిలకి వుర్కింది గని ఈలోపట అది చిన్న గొర్రె పిల్లను పండ్లతోని కర్సి వట్టి అడవిలకు ఉర్కింది దాని ఎనక పొంటి దేవన్న, తను ఉర్కిను. అది ఎనకకు చూస్కుంట, ఉర్కుంట ఉర్కుంట ఒంగల్ల మాయమైంది. ఎనకెనకకు జూస్తున్న తోడేలు కళ్ళల ఎంత వెలుగు? ఎంత కసి? నా పని నేను జేస్తాన్న, నీ పని నువ్వు జేస్కో అన్నట్లుంది దాని కండ్లల్ల కత. దేవన్న ఒనికిపోయిండు ఇప్పుడు ఆసామి ఏమంటడో అని. 'సంపుతడురా.. ఏం జేద్దం' అంట అక్కడ్నే కూలవడ్డడు. దేవన్న మొఖంల ఆ చీకటి రాత్రి నల్లటి బయం నిండింది. దేవన్న కళ్ళు బయంతోని వెర్రిగ చూస్తాన్నయ్. తను, దేవన్న ఆయాస వడ్త చెట్టుకింద కూలవడ్డరు. తోడేల్ని చూసిన దానికంటే ఆసామిని తల్సుకుని ఒనుకుతుండు దేవన్న. ఏమైతే అదవుతది పోదాం పా" అన్నడు తను. గని దేవన్న గట్లనే కూల వడ్డడు. పెయ్యంత సెమటతోని తడ్సి ముద్దయింది. చేతులు సల్లంగయినయి. మోకాల్ల మీన తల వెట్కొని ఒక్కసారి లాజిగ ఏడ్పు షురు జేసిండు. దుఃఖంతోని ఆయెన చేతి దండాలు కిందికి మీదకు కదుల్తున్నయ్. తనెంత బుదరకిచ్చిన ఆ దుఃఖం ఆగలె. ఆ చీకటి రేత్రి జంగల్ల, పాములు, తోడేల్ల, పులుల బయం ల్యాకుండ కూసుని ఏడుస్తాన్న దేవన్న దుఃఖం జంగలంతా కలిదిరిగినట్లైంది. దేవన్న దుఃఖంను ఆ కౄర జంతువులు అర్థం జేస్కున్నయేమో మల్ల ఆ దిక్కు రాలె... సెట్టు మీన పాము ఒక పారి తల అవుతలకు వెట్టి ఏందో అర్థమైనట్లే మల్ల లోపల్కి ముడ్సుకున్నది. తను ఏమనక కూసుండు. దేవన్న దుఃఖం తన దుఃఖం ఒక్కటే. తనకు గుడక గుండెలు బిగవట్టినయ్ దుఃఖంతోని. దేవన్న ఏడ్చి ఏడ్చి అల్సి వొయ్యిండు. మెల్లంగ కళ్ళు తుడ్సుకుండు. రాము దిక్కు చూస్తా... 'నాయన ఉరి వోస్కోపోతే మంచి గుండేది రా'... అన్నడు ఆ గొంతు వింటే బయమైంది. ఈ దునియాల ఉన్న నాయనలంత ఏం సెయ్యాద్దో సెప్తున్నట్లన్పించింది. ఇద్దరు ఆ చీకట్ల అడవిలకెల్లి, గొర్లమంద ఉన్న కాడకి నడ్సింద్రు. కాళ్ళ కింద ఎండుటాకులు చేస్తాన్న సప్పిడి, అవి సెట్టుకెల్లి రాలినందుకు ఏడుస్తున్నట్లే ఉంది. తమ ఇద్దరి గుండెల్ల అణిగిన దుఃఖంను ఆ ఎండుటాకులు శబ్దం చేస్త జంగల్‌కి చెప్తున్నట్లు అన్పించింది.

గొర్రె కోసం తోడేలెట్ల మంద ముందు తిర్గిందో, గట్లనే దేవన్న ఆసామి దేవన్న కోసం పిచ్చి కోపంతోని తిర్గుతుండు మంద ముంగట. దేవన్న రాంగనే తోడేలు తీరె

ఆయన మీద వడ్డడు. కఱ్ర తోని, పిచ్చెక్కినట్లె ఎక్కడ వడితే అక్కడ కొట్టిండు. బూమి మీదకు నూకి కాళ్ళతోని కడ్పుల గుద్దిండు. దేవన్న కేకలకు గొఱ్ఱెలు, గావర పడి అటు ఇటు అరుస్త కదిలినయ్. పాలేర్లు ఒక్క తీరు తల్లడిల్లిండ్రు. కొద్దిమంది ఆసాములు "అరె రమేషు ఆపింక వాడు చస్తడు" అని ఇడిపించిండ్రు. తోడేలు నోట్లె వడి సచ్చిన గొఱ్ఱె తీరే దేవన్న నేల మీద వడివోయి దుఃఖం తోని ముడ్సుకు వోయిండు. సచ్చిన గొఱ్ఱె ఖరీదుని దేవన్న అప్పుల జమ జేసిండు. ఆసామి. అర్ధగంటైనంక దేవన్న మెల్లంగ లేశిండు. అంత బాధల గుడక దేవన్న తన పిల్లన గ్రోవిని మరవలే. ఏడుస్తనే ఊదుకుంట సేరిండు. అక్కడున్న పాలేర్ల కండ్లు తడ్సినయ్. ఇంతేనా? ఎప్పుడన్న ఆసాములు ల్యానప్పుడు ఊర్ల గింత బువ్వ కోసానకో, తొక్కు కొసానకో వోతే ఆసాములు తిరిగొచ్చినంక ఎందుకు ఊర్లెకు వోయిరని కఱ్రతోని శానా కొట్టేది. అడవిలకెల్లి ఊర్లకు వోతే పాలేర్లు తెల్వి మీరుతరని, బాగా కొద్దె బయవడ్తరని అట్ల జేసేది. నాయన కేం దెల్సు ఈ సంగతులు? రాము నిట్టూర్చిండు.

* * *

మందలకు మందలు గొఱ్ఱెలు య్యాడాడికి తీస్క వోతయో తెల్వది. ఊర్లు, అడవులు దాటుకుంట పోవల్ల. పోత పోతాంటె దారి పొంటి ఊల్లు, ఇండ్లు మనుషులు కన్పిస్తే అమ్మ, నాయనల యాది మనాది వెడ్తది. మనసంత అగుడు అగుడైతది.

ఒండుకున్న బువ్వ, ఎల్లివాయ కారం తొక్కు నూరుకుని సిక్కెంల వెట్కొని ఇగ గొర్లెంబడి పోవల్ల ఎండల కాలమైతే తెల్లారి ఆరుగంటలకే గొర్లను జంగల్‌కు మ్యాతకు తోల్క పోవల పగటికి పన్నెండు గంటలకు ఎండెక్కంగనే గొర్లను నీడకు పెట్టాల్ల. మల్ల పొద్దెక్కంగనే నాలుగ్గంటలకెల్లి ఏడు దంక మేపల్ల. ఒకలు గొర్లను మేపుతాంటే సిక్కం దింపి ఒకలు తినల్ల. ఒక సిక్కంల ముగ్గురు పాలేర్లు తినెటోల్లు.

గొర్లు తోలంగ, తోలంగ సడక్‌ల మీన తెలంగాన జులూస్‌లు కన్పడెటివి. టెంట్లు వేసి మీటింగులు పెట్టెటోల్లు. ఆ మీటింగుల కాడ ఆగనిచ్చేటోల్లు కాదు ఆసాములు. 'నడుండ్రి', 'నడుండ్రి' అన్కుంట గొఱ్ఱెల్ని తోలినట్లె తోలెటోల్లు. ఎప్పుడన్న "పాట, మాట ఇంటమబ్బా జఱ్ర పది నిమిషాలు ఆగుదం" అని బత్మిలాడితే ఆగనిచ్చెటోల్లు. గా మీటింగులల్ల సార్లు తెలంగాన గురించి సెప్పేది. "మన నీల్లు, భూమి, నౌఖరీలు ఆంధ్రోల్లకు పోతాన్నయ్. మన తెలంగాన మంది బికార్లైతున్రు దేశాలు వలసలు పోతుండరు. మన బూమి, నీల్లు కోసం మనం పోరాటం సెయ్యాలె" అని అర్శుకుంట ఆవేశంతోని అన్లేముందో చదివి వినిపించుకునేది. అన్ల అంత తెలంగాణల ఏమైతున్నదో, తెలంగాన కోసం ఏం జెయ్యాల్నో ఉండేది ఆ కాయితాలల్ల.

వాల్లల కొంతమంది కాల్లకు గజ్జలు కట్టి తెలంగాణ కోసం పాటలు పాడేది. దేవన్నైతే పూనకం వచ్చినట్లె గెంతేది. ఆల్లతోని 'జై తెలంగాణ' అని ఒర్లేది. ఆసామి 'నదుంౘ్రి, నదుంౘ్రి' అని గద్దరించుకుంట తమను గొర్ల మందల కలిపేది.

ఒకపారి తెలంగానోల్లు సడక్ మీదనే పొయ్యిలు పెట్టి వంటలు జేసింౘ్రు సడక్‌లన్ని పొయ్యిల్లు తీరే అయిపోయినయ్. సడక్ మీదనే వంట, సడక్ మీదనే తినుడు. ఆ దినం తెలంగాణోల్ల పున్నెమా అని పాలేర్లందరు కడుపు నిండ సన్నబియ్యం అన్నం, కంది బ్యాళ్ళ పప్పు, ఆలుగడ్డ వంకాయ కూర తిన్నరు. దినాం ఎల్లిపాయ కారం తొక్కు, తమాట కూరలతోని బువ్వ సయించుకొచ్చింది వాల్లకు. ఎప్పుడన్న ఆసాములు కోడి, మ్యాక మాంసం కూర వండుతరు. వాల్లంత తిన్నంక మిగిలింది పాలేర్లకిస్తరు ఆ దినం పండగే ఆల్లకు.

పోల పండగ రోజు గుడక పాలేర్లకు కడ్పునిండ బువ్వ వెడ్తరు ఆసాములు పాలేర్లకు. శ్రావన మాసంల ఆసాములందరు పోల పండగ జేస్తరు. గొౘ్రెపాలు పితికి పెరుగు జేసి పోలేరమ్మకు నైవేద్యం పెడ్తరు. అటెన్క ఆ పెరుగుని చల్ల చేస్తరు. ఆ చల్లను గొర్ల మీద చల్లుతరు. అట్ల జేస్తే అవి మంచిగ ఆరోగ్గెంగ ఉంటయంట.

* * *

పాలేర్లంత రాత్రిళ్ళు కూసుని, జాము కాస్తా ఆల్ల బత్కులిట్లెందుకున్నయ్ అని తీరు తీర్లు ముచ్చట్లు పెట్టుకునెటోల్లు. "ఆ తెలంగాణ సార్లు చెప్పినట్లె మన నీల్లు మనకు లెవ్వురా అవి ఆంధ్రోల్లకు వోతున్నయ్ అందుకే మన చెల్కలు ఎండివోయి పంటలు పండక మనమిట్ల దేశాలు పడ్తాన్నం" అంటడు దేవన్న. "ఆ నీల్లు మన ఊర్లెకు తెచ్చుడెట్లబ్బా?" తన ఊల్లె మూడెకరాల బూమి పడావుగా ఉన్న మలతయ్య ఆశగా అడుగుతుండడు. "అగో పోరాటం చెయ్యమంటుంౘ్రు కద" అంటడు. దేవన్న తన చేతిల ఉన్న తెలంగాన కాయితాలను సూపుతా. అదెట్లనో మరి ఎవలకు తెలవకొచ్చింది.

* * *

గొర్లెతోనే నడక, బువ్వ, నిద్ర, ఆలోశెన. రెండు నెలలైనంక గొర్లు ఖమ్మం, బద్రాచలం అడవుల్ల తేలినయ్. ఆ జంగల్‌ను దండకారణ్యం అంటరంట. అడవిల నాలుగు దిక్కులలిన్రు కాపర్లు గొర్లతోని. నడంగ నడంగ అడవిలోపల గూడాలున్నయ్ అన్ల అడవి మనుషుల తీర్లున్నరు. వాండ్ల ఒంటి మీన బట్ట గుడక మంచిగ ల్యాదు. ఆల్ల గుడిసెలు కొన్ని కాలిపోయి ఉన్నయ్. పోలీసోల్లు, ఫారెస్టోల్లు కాల్సిౘ్రంట వాళ్లను ఎల్లగొట్టనీకి. ఆల్లంత ఛత్తీస్‌ఘడ్ అడవిలకెల్లి పారొచ్చిౘ్రంట. ఆల్ల భూమి, ఇళ్ళు

అన్ని అడవిలనె ఉన్నవంట. అక్కడ జుడుమోళ్ళు కత్తులు వట్కొనివచ్చి శానామందిని సంపిద్రంట. వాళ్ళ ఆడోల్లను చెరిచింద్రంట. గర్భంతోనున్న ఆడోల్ల పొట్టల్ని గోసి పిండాలను బయటేశిద్రంట. పసిపిల్లల్ని గూడంగ చంపింద్రంట. ఆల్ల దాన్యం, డబ్బులు, కోల్లు, మ్యాకలు దోసుకున్నంక ఆల్ల ఇల్లు కాల వెట్టిద్రంట. వీల్లు పానాలు దక్కించుకొని ఈ అడవిలకచ్చి వడ్డరంట. ఈడ గుడక బద్రాచలం పోలీసోల్లు, ఫారెస్టోల్లు బత్కనిస్తలేరంట. వీల్లెక్కడుంటే అక్కడకొచ్చి వీల్ల గుడ్సెలు కూల్చి, కాల్చేసుద్రంట. ఆల్లను తరిమి తరిమి గొడ్తుండరంట. ఆన్ల ఒకామె పాపం గర్భంతోని ఉంది. ఆమె పెన్మిటిని ఛత్తీస్‌ఘడ్ అడవిల తుకుడలు, తుకుడలుగ నర్కిన్రంట. ఆమె ఏడుస్త చెప్పింది. తమ హాలత్ గుడక గిట్లనే ఉంది, సడక్‌ల పొంటి, అడవుల పొంటి అన్పించింది, రాముకి. తమనిట్ల అడవుల పొంటి తర్మిందెవలు? గొర్రెలా, మనుషులా? సమఝ్ కాలె.

* * *

బద్రాచలంల ఉన్నప్పుడు రాముకి ఒళ్ళు వగల జరమస్తే దేవన్నని తోడు తీస్కుని ఆసామి రాముని భద్రాచలం టవున్లకు వచ్చిండు. అక్కడంత జనం ఆంధ్ర యాసల మాట్లాడ్తుండ. రాముకు శానా విసిత్రంగ తోసింది. అక్కడ సానామంది తూర్పు గోదారి జిల్లావోల్లంట "ఇగ ఈ ఆంధ్రోల్లు తొందర్గనే బద్రాచలం గుడక తమదే అంటరు సూడర రాము" అంటండు దేవన్న.

అక్కడ పెద్ద జులూస్ నడుస్తుంది. పోలవరం డాముని కట్టద్దని, అడవిల ఉండే మందిని కాపాడాల్నని బట్ట మీన రాస్కోని ఒర్లుత సడక్ మీన నడుస్తుండరు. ఆన్ల అడవి మనుషులతోని, పట్నం సార్లు గుడక ఉండరు. రాము, దేవన్న నోర్లు తెర్చుకుని నిల్చుని సూస్త జేరింద్రు. దేవన్న ఆల్లిచ్చిన కాగితం జేబుల వెట్కుండు.

ఇక అక్కడికెల్లి చెల్వాయి, తాడ్వాయి ఊల్లు దాటుకుంట ఏటూరు నాగారం అడవులకొచ్చేతాలకు మూడు నెలలు వట్టింది. అక్కడికెల్లి సమ్మక్క సారలక్క అడవిల చిలకలగుట్ట మీన గొర్లను మ్యాతకు తోల్కవోవుడు. గుట్ట లెక్కంగ, దిగంగ రాళ్ళు, రప్పలతోని ఆ అడవిల కొచ్చ కొచ్చ ముళ్ళతోని కాళ్ళకు రక్తం కారి, కాళ్ళు పుండ్లు పుండ్లయ్యేట్వి. ఆసామి యావో మలాములిచ్చెటోడు. అయిన తగ్గక వోయేది. కాల్లు కింద పెట్టాల్నంటే నొప్పికి దుఃఖమొచ్చేది. ఇంగ ఆ నొప్పితోనే కిలోమీటర్ల కొద్ది నడవల్ల గొర్ల ఎనుక... ఎనుక... రాముకు దినం గడువుడు కష్టమైతున్నది.

గొర్ల మందను తోల్కుంట, తోల్కుంట మంగపేట ఊరికొచ్చింద్రు. అక్కడ నీనా నాయక్ మేనమామ కన్పించిండు. మామను వట్కొని నీనా నాయక్ బొల్లుమని

ఏడ్చిండు. నీనా నాయక్ కాండ్లన్ని పుండు పుండైనై గవ్విట్ని సూపుత "మామా నన్ను తోల్కవో యాడి (అమ్మ)ని సూడాల్నని ఉంది" అని ఆయెనను వట్కొని ఎక్కెక్కి ఏడ్చిండు.

అంతే! అదే రాత్రి నీనా నాయక్ గాయబ్ అయ్యిండు. మ్యాన మామ ఇంటికి పారిపోయిండు. అదృష్టవంతుడన్పించింది రాముకి. తన కోపం ఎవలన్న అట్లొస్తే ఎంత మంచిగుండు? నాయనున్నడు గని ఇక్కడ్నే ఉండమంటడు. తనకు గొర్లతోని కాదు మనుషులతోని ఉండాల్నని ఉంది. జంగిల్ల కాదు తన ఊర్లె ఉండాల్నని ఉంది. ఎవరు తన కోసం రాక వోతే ఏంది? తను ఎల్లి వోతే అయిపాయె...

* * *

ఊషన్న ఆ దినం శాన ఖుషీగుండు. ఆయెనకు 15 దినాల శెలవు దొర్కింది. లగ్గమైన మనిషి కద. లగ్గమైన వాల్లకు పదిహేను దినాలు శెలవిస్తరు. ఆల్లు ఊరికి వోయ్యి పెండ్లం పిల్లలతోని గడ్పి వస్తరు. లగ్గం కాని పాలేర్లకు ఆర్నెల్లకో తూరి వారం రోజులకు శెలవులకు పంపుతరు. గని మళ్ళ రారని ఆసాములే పోయి "రాజాల్లాగున్నరు మీ కొడ్కులు వాల్లకేం తక్వ అయ్యిందబ్బ" అని బుదరకిచ్చి మల్ల అడవికి తెచ్చుకుంటరు.

* * *

ఒక దినం పాలేరు జంగయ్య తన కాల్లు సూస్కుంట ఏడ్పు షురు జేసిండు. "నా కాల్లు కొచ్చె పోతున్నయ్ నాకు తెల్సు గొర్ల కాపర్ల కాల్లు గొర్లతోని నడంగ నడంగ గిట్లనే కొచ్చ వోతయంట... సూడు రామూ నేను గొర్రె తీరు నడుస్తలేను సూడబ్బా". జంగయ్య లేచి నడ్చి చూపిస్తున్నడు. "అవురా... జంగా అవు, నువు, గొర్రె తీరే నడుస్తానవబ్బా" దౌలన్న పాలేరు నగిండు "ఊకోరా దౌలన్న వాడసలె బయపడ్తుండు, అరె జంగా నీ కాల్లకేం కాలేదబ్బ కొచ్చె వోలె తిన్నగనే నడుస్తానవు.. నీ కాల్లు మంచిగనె ఉన్నయ్ ఏడ్వాకు..." అనుకుంట రాము జంగయ్యను బుదరకిచ్చిండు. గని అప్పటికెల్లి తనకు గుడక బుగులు షురువైంది. తన కాల్లు గుడక కొచ్చ వోతయ్యేమో. ఎట్ల అని ఒకటే ఫికరు వట్టింది. దానికి తోడు అరి పాదాలు పుండ్లయినయి తగ్గినట్లే తగ్గి మల్ల పుండ్లు తయ్యారు పూరాగ తగ్గుత ల్యావు. మంచి డాక్టరుకు చూపిస్త లేడు ఆసామి. మలాములే ఇప్పిస్తడు. సరిగ నడస్త లేదు. కుంటుత, ఎగురుత నడుస్తుండు. గిదేనా కొచ్చెపోవుడంటే...? ఏమో బయమైతాంది. మీదకెల్లి గన్ని గొర్లకు చాకిరి చెయ్యొస్త లేదు. దేవన్న తీరు తనకు గంత గనం ఓపిక లేదు. సాతనైత లేదు. చలికాలం అడవిలల చలికి తోలు పగిలి రక్తం కార్తంది. దినాం అనుకునుడే, ఈ దినం ఎల్లి పోవల్ల అని అమ్మని, నాయనని చూడాల్నని

ఉంది. రోజులు, నెలలు గడుస్తున్నయ్. అడవిల పగలు, రాత్రి గొర్రెలతోని నడుస్తుండు. మగ్లూరు గుట్టలు, చిలకల గుట్ట ఎక్కుడు దిగుడు... నరకంగున్నది.

"అమ్మ సమ్మక్క, సారలమ్మ తల్లి నన్ను మా ఊరి దారి వట్టియ్యు ఈడికెల్లి..." రాము చెయ్యేతి ఆ చీకట్లు ఆస్మాన్ దిక్కు సేతులు సాపుత దండం వెడ్తా మొక్కుతుండు. రాము కండ్లకెల్లి ధారగ కన్నీల్లు కారినయ్. ఆలోశెనలకెల్లి బయట వడ్డడు రాము. బస్సు ఏటూరు నాగారం దిక్కు పరిగెడ్తున్నది. ఐద్రాబాద్ దాటి సానా సేపైంది.

నాయన డాక్టరు తానకు తీస్కవోయి మంచి మందులిప్పించిండు. ఫోన్ల తన ఆసామి దస్తగిరి బెదిరించుకుంట మాట్లాడిండు. "ముసలోనివా, శరోనివాబ్బా... గట్ల పారొస్తివి ఊకోను బిడ్డా నా మందల గొర్రె ఒక్కటి వోయినా నీ అప్పు ఎక్కువైతది, నీ బూమి తీస్కుంట సప్పిడి సెయ్యక మంగపేట వోతవా ల్యాదా" అని.

ఐద్రాబాదుకెల్లి మంగపేట వచ్చి మల్ల గొర్ల మందల కల్సిండన్న మాటే గని మనసు మనసుల లేదు రాముకి. రాము ఐద్రాబాదు పారిపోయినంక దేవన్నను ఆసామి శానా గొట్టిండంట సెప్పలేదని. దినాం మల్లా గొర్లెను ఏటూరి నాగారం చుట్టూ ఉన్న అడవిలకు మ్యాతకు తోల్క వోవుడు. ఏటూరు నాగారంల సానా మంది ఆంధ్రోల్లే కన్పడతుంద్రు. అడవిల కెల్లి వస్తుంటే పోతుంటే ఆల్లె కన్పడతుంద్రు.

* * *

దేవన్న, రాముతోని మాట్లాడుడు బందు జేసిండు. తను పారిపోదమనుకున్న రేత్రి దేవన్నకు సెప్తె ఏమనలే, కొద్దిసేపు తన కండ్ల దిక్కే సూసిండు 'పోతవా, పో' అన్నడు. తిరిగొచ్చిన తనను ఎందుకొచ్చినవ్ అన్నట్లు చూసి కోపంగ మొకం తిప్పుకుండు. ఆ రేత్రి దేవన్న పిల్లంగ్రోవి ఊదుతాంటే... అది పాట తీరు లేదు. ఆయెన గుండెల ఉన్న దుఃఖం ఆయన ఊపిరికెల్లి బయటకొస్తున్నట్లుంది.

* * *

సుట్టూ చీకటి... బువ్వ తిన్నంక జాము లెక్కనే కాపలా కాస్తున్నరు. దేవన్న జాము కాస్తున్నడు. సన్నంగ, మెల్లంగ పిల్లనగ్రోవి ఊదుతుండు. దేవన్నతోని ఇంకొంతమంది పాలేర్లు గుడక కాపలా కాస్తున్నరు. ఆసాములు ఇంకొంత మంది పాలేర్లు నిద్ర వోతున్నరు. రాముది నిద్రవంతు గని నిద్రొస్తలేదు. కొన్ని గొర్లు మత్తుగ నిద్ర వోతున్నయ్ కొన్ని నిద్ర రాక సకిలిస్తానయ్. రాము తన సుట్టూ ఉన్న గొర్లెను చూస్తుండు. అన్ల కొన్ని గొర్రెలు తనను సూటిగ చూస్తున్నట్లు, కొన్ని తనను సూస్త నగుతున్నట్లు అన్పిస్తున్నయ్. ఈ గొర్లెను ఒదిలి పారిపోతే మల్ల తను తానకు రప్పించుకున్నయ్ గద? ఇవి గొర్లా ల్యాక గొర్ల రూపంల ఉన్న మాయ, మంత్రం

జేసే సాములోల్లా? నిద్రపోని గర్భిణీ గొర్రె ఒకటి తన వంక వింతగ చూస్తున్నట్లనిపిస్తున్నది. దాని కళ్ళు ఎంత మెరుస్తున్నయ్. రాము గుండె ఝుల్లుమన్నది... ఎందుకో బయమన్పించింది. అదేమన్న చెప్తున్నదా తనకు? సకిలిస్తాన్న గొర్లు ఏమంటున్నయ్ తనతోని? ఇవెటు తీస్కపోతున్నయ్ తనను? రాముకి మనసుల వింతగ అన్పిస్తున్నది. గాలి చల్లగ అమ్మ మాటతీరు తగులుతున్నది. దేవన్న పిల్లన గ్రోవి సన్నగ విన్పిస్తున్నది. ఈ గొర్లు.. వీటికి ఉన్న ఊర్లె గ్రాసం ఉంటె, గిట్ల అడవులు, ఊర్ల పొంటి సడక్‌ల మీన ఇంతింత దూరాలు ఎండకి, వానకి బాధపడ్త నడిశేవ? పశురాలకు గ్రాసం గుడక దొరకని కరువేంది. ఊర్ల? తనతోని, తన ఊరికెల్లి, వలసొచ్చిన ఈ గొర్లు తనతోని నడుస్త, తనని నడిపిస్త తనసుంటి మనుషుల కథల్ని ఎటో మోస్తున్నట్లె, కలవరంతోని, మనాదితోని కదులుతున్నట్లే అన్పిస్తున్నది... రాము మనసు భారమైంది. దూరాన దేవన్న పిల్లంగ్రోవి సన్నగా విన్పిస్తున్నది. దేవన్న ఏమన్న చెప్తున్నడ? ఈ గొర్రెలు – అడవి అడవిలో కన్పించే తోడేల్లు, పాములు, పులులు, మనుషులు తనకేమైన చెప్తుంద్రారా? నిద్రరాక రాము లేశి కూసున్నడు. తన దిక్కె చూస్తొ సేరిన గర్భిణి గొర్రె బీకరంగ అర్శింది రాము ఉలిక్కి వడ్డడు... “సిగ్గులేదురా రాము పారొచ్చినవ్... ఫో నీ ఊల్లెకు పో, నీ చెల్కలు పండియ్యి, మమ్ములను గుడక నీతోని తొల్కపో” అంటా అర్శింది. రాముకొక్కపారి బయమైంది గొర్రె తనతోని మాట్లాడ్తాంది... “పోతవా పోవా కదులు ఈడికెల్లి, అవ్ నేనే మాట్లాడ్తాన్న నడు... ఫో” అంటా గొర్రె రాము తానకు ఉరుకుత వచ్చి రాము పొట్టల కుమ్మింది... అటెన్క పెద్దగా అరుస్త కిందపడి వొర్రింది. రాము గుండెలు కొట్కున్నయ్. మెయ్యి మింద ఎంట్రికలు లేశి నిల్శున్నయ్. తనకు భ్రమైంది అన్కుండు గని... గొర్రె నిజంగనే మాట్లాడ్తంది “ఇంగొ... రాము నిన్నే ఇను...’ అంటంది. దాని దగ్గర్కి వోయిండు అప్పట్కె, నేల మీద దాని రెండు కాల్లమద్దెనించి గొర్రె కూన దబ్బుమని పడ్డది. మాయతీసి తల్లి గొర్రె నోట్ల పెట్టిండు రాము. అది గొర్రె కూనను నాకి నాకి పెట్టింది. దాన్ని చేత్లకు తీస్కున్న రాము తన ఆసామి గొర్రెలల్ల మూడొందల ఇరవైకి జేరినయ్ అని లెక్కేసుకున్నడు. తల్లి గొర్రె “కాదు మెల్లంగ మూడొందల నలభైకి పెర్గినయ్” అంది. ఇదేంది తల్లి గొర్రె ఇట్ల మాట్లాడింది తనతోని అనుకుంట ఇసిత్రవోతనే అదింక మాట్లాడ్తదేమోనని దాన్ని కదిపిండు. గని గొర్రె ఒక్క తూరి కదిలి రాముని కాలితోని తన్ని యాడాడో తిర్గుడు బందువెట్టి నల్లమల జంగిల్ నడిమి కెల్లి నీ వూరు పో!” బాధతో మూల్గుతా అని గమ్మునైంది.

* * *

ఆ రోజు రాము గొర్రెల మందలకెల్లి పది గొర్రెలు ఎటు వోయినయో పోయినయ్. ఆసామి కుక్కోలె ఒర్లుతుండడు. పది గొర్లంటే ఆయనకు పిశ లేశినట్లె అయ్యింది. “నడురా బాడ్కవ్, దేవులాడి పట్కరా ఫో” పిస కోపంతోని ఊగి వోత అర్శిండు. రాము గుండెల రాయి బడ్డట్లే అయ్యింది. పది గొర్లంటే మాటలా? ఒక్క గొర్రె పోయినా మూడు వెయిలు అప్పు రాస్తడు. పది గొర్రెలంటే ఎన్ని వెయిలు అప్పు రాస్తడో? తను ఇక్కడ్కి అప్పు తీర్చనీకి వచ్చిండా? అప్పెక్కువ సెయ్యనీకా? నాయనకు తెలిస్తే... ఎట్ల? ఎటు వోయినయ్ ఈ గొర్రెలు? ఈ పారి యా తొవ్వ సూపిస్తయ్ ఇవి తనకు? తల్లి గొర్రె పారిపొమ్మన్నప్పుడు పారిపోయ్యుంటే బాగుండెడ్డి... దాని మాట ఇనలె.

రాము తోని దేవన్న గుడక బయలుదేరిండు. పగటికి పొద్దెక్కే దంక వెతుకుతానే ఉండు రాము. గుండెల్లె కెల్లి బయం పొంగుతాంది రాముకి. ఆసామి తనను సంపుతాడా? ఇక్కడికెల్లి ఎటన్న ఎల్లిపోతే? నాయన తానకు? ఊహూ నాయన మల్ల తనను ఇటే తోల్తడు... ఎంత దేవులాడ్తున్న గొర్లు దొర్కుత లేవు. ఎండకి తీర్గనంత దప్పయితాంది. గని నీల్లు లెవ్వు. గొర్లు కన్పడ్త లేవు. దేవన్న ఇంగో దిక్కు వోయిండు. రాము అడవిల తిరిగి తిరిగి పరేశాన్ అయితుండు, గొర్లు కనపడక ఆ మండే ఎండల రాము కుప్ప కూలిండు... దుఃఖం తన్నుకొచ్చింది. ఆసామి తోడేలు తీర మీద వడ్తె ఎట్ల? అప్పెక్కువైతే ఎట్ల? రాము బూమికేసి చేతులు తప్ప తప్ప కొడ్త ఏడుస్తున్నడు. రెండైంది. గొర్లు లేవు. రాముకి దప్పెక్కువైంది. బయం ఇంకింతెక్కువైంది. ఇంకా లోపట్కి అడవిల వోతే యా తోడేలో తనను తిని పారేస్తది. రాముల ఒక్కసారి తెగింపొచ్చినట్లైంది. ధూత్, తెరికీ ఏమన్న గానీ బయటపడ్డం. ఆసామి సంపితే సంపనీ, ఏమన్న సెయ్యనీ... సైగీ బానిస బత్కు తప్పుతది అన్కుంట అడవి బయట బాట దారి వట్టిండు. ఆకలీ, దూప కమ్ముకున్నయ్ కండ్లు తిరుగుతున్నై నిలువెల్ల మనిషి చెమటతోని తడ్సి వోయిండు. అడవిలకెల్లి మెల్లంగ నడుస్త రాము సడక్ మీద కొచ్చిండు. సడక్ అంత లొల్లి లొల్లి ఉంది. తెలంగాణ పార్టీ వాల్లు మల్ల మీటింగు పెట్టినట్లుంది సడక్ మీదంతా వాల్లె. సడక్‌బంద్‌ల ఊర్ల అందరూ రావాల్నని మైకుల ఒర్లుతుండరు. రాము మెల్లగ సడక్ దిక్కు నడుస్తుండడు. ఇంతట్ల దేవన్న కల్సిండు. దొర్కినయా గొర్లు అంటే దొర్కలేదు అనుకున్నరిద్దరు. సడక్ అంతా తెలంగానోల్లే బైఠాయించిండ్రు. ఒగాయెన మైకుల మాట్లాడుతుండు ఆల్ల దగ్గర్కిపోయిన రాము తాజూబైండు. ఆనందం, దుఃఖంతోని తాయిమాయి అయ్యిండు. దేవన్నను రారమ్మని పిల్సిండు గొర్లెను సూడ. తమ గొర్రెలు గుడక తెలంగానోల్లతోని సడక్

మీన బైఠాయించినయ్. ఆరాంగ కూసున్నయ్. ఆల్లు చప్పట్లు కొడతాంటె గొర్లు గుడక సకిలిస్తాన్నాయ్.

"తెలంగాణ రాష్ట్రంలోనే మన నీల్లు మనకొస్తయ్ మన బూములు, నౌకర్లు మనకుంటయ్..." మైకు పట్టుకున్న సారు ఆవేశంతోని మాట్లాడుతుండడు.

రాముకు దూప ఎక్కువైంది అక్కడ ఒక నీల్ల బాటిల్ కనపడ్డది. ఉర్కుతవోయి నీల్లు గుటగుట తాగిండు కడుపు సల్లంగైంది.

రాము తన సేతి కఱ్ఱ పడేసిండు. అప్పట్కె దేవన్న ఆ గుంపుల కూసుండు. తన పిల్లంగ్రోవి గట్టిగ పట్కొని రాము గూడ గొర్లె తాన సడక్ మీన కూసుండు. ఒక గొఱ్ఱె మోర తిప్పి రాముని చూసింది. రాము గుండె ఝుల్లుమన్నది. ఒగ నిద్ర రాని రేత్రి తనని వింతగ చూసిన గొఱ్ఱె కాదు ఇది... తనతోని "ఊల్లెకు పో... నీల్లు తెప్పియు చెల్కలల్ల పుట్లకు పుట్లు దాన్యం పండియ్యు... మా గొర్ల కోసం గుడక గ్రాసం పండియ్యు... ఫో ఈడ ఉండకు" అని గద్దరించి, తనను కుమ్మిన తల్లి గొఱ్ఱె కాదూ ఇది? రాముని చూసిన తల్లి గొఱ్ఱె... వింతగ నగింది. మా గొర్లు తీరు మీ కాపర్లు గుడక బైలెల్లుండ్రి... ఫో నీ కాపఱ్ఱను తోల్కొని మీ ఊరు బయలెల్లు...!!! అని ఒర్లింది కద? దాని కళ్ళు అంతే మెరుస్తున్నయ్. ఆ గొఱ్ఱె మెల్లగ తల తిప్పేస్కుంది. కడపటి గొఱ్ఱెలు రాముని చూసి గుర్తుపట్టి సకిలించినయ్!

# నర్సిం

## ఇక్బాల్

వాడు రాడేమో.. వాడింకెప్పుడూ రాడేమో..

అవునా... వాడు ఎప్పటికీ కానరాడా...

వాడికోసం లోలోపలే మదనపడుతున్నా బయటికే ఎన్నిసార్లు అన్నానో!

నేను రోజూ గద్వాల్ నుండి ఈ ఊరి బడికొస్తాను. ఈ బడికి హెడ్మాష్టర్నూ.. టీచర్నూ.. స్వీపర్నూ.. అన్నీ నేనే. ఊరంటే ఇదో పెద్ద ఊరూ కాదు, చిన్న పల్లేకాదు. అలాగని గిరిజన చెంచు పెంటనో... లంబాడీ తాండనో కూడా కాదిది.

ఓ ముప్పై నలభై సంవత్సరాల కింద ఒక ఆరు రెడ్లవీ, మూడు మున్నూరు కాపువీ, ఓ రెండు బోయలవీ ఇట్లా మూడంటే మూడు కులాల పదకొండు కుటుంబాలు పొలాల దగ్గర స్థిరపడగా ఏర్పడిన అతిచిన్న సమాజమిది.

ఇప్పుడు ఓ నలభై కుటుంబాలతో సేద్యంలో అత్యాధునిక పద్ధతులతో వ్యాపార వాణిజ్య పంటలూ, పండ్లతోటలూ సాగు చేయడంలోనే కాకుండా శాస్త్రీయ వ్యవసాయంతో అత్యధిక దిగుబడులు పొందడంలో కూడా రాష్ట్ర వ్యాపిత గుర్తింపు పొందినదీ ఊరు.

అక్షరాస్యత, జనాభా నియంత్రణతో పాటు ఊరి తగాదా ఏదైనా కచేరీలు, కోర్టుల వరకు వెళ్ళకుండా ఊర్లోనే పరిష్కరించుకొనే కట్టడి... సొంత ఆధిపత్యమూ కలదిగా కూడా చెప్పుకొంటారు దీన్ని

ఇలా అనేకానేక విశేషాలతో విలసిల్లుతున్న ఈ ఊరిలో చూద్దామన్నా ఒక్క పూరిగుడిసె కనపడదు. అన్నీ మిద్దెలే... బంగళాలే..

ఇప్పటికీ ఈ ఊర్లో మిగతా ఊర్లోలాగా చాకలి, మంగలి, కోమటి, తురక, బాపని, వడ్ల, కమ్మరి, కుమ్మరి తదితర కులాలేవీ లేవు. నలభై ఏండ్లకిందటి లాగే ఇప్పుడూ అవే మూడు కులాలు.

రెడ్లవి అప్పటి ఆరు కుటుంబాలు ఇంటికో నాలుగు కొత్త కుటుంబాలుగా పెరిగి ఇరవై అయిదులోపలే. మూడున్న మూన్నూరుకాపు కుటుంబాలు ఇంటికో నాలుగు లెక్కన అందాజగ పన్నెండు. ఇక బోయలవైతే పదికుటుంబాలు. అన్నీ కలిసి నలభై.

ఈ నలభై కుటుంబాలతో రెండువేల ఎకరాలదాక పొలవిస్తీర్ణంతో, అయిదారు కోల్లలోతు నీళ్ళులేని పాడుబడ్డ బావులతో మూడు నాలుగు వందల ఫీట్లలోతు భూమిలోపలికి జొరబడి నీళ్ళులేక ఫైలయిన ఆరు వందల మీదున్న బోరు గుంతలతో.. ఉన్న ఊర్ల బతుకులేక పొట్టసేత పట్టుకొని బొంబాయి... పూనా... బెంగుళూరు.. ఇట్లా ఎక్కడెక్కడ్నో కానని దేశాలు దిర్గి బతుకేమోగాని మందులకు లొంగని మాయదారి రోగాలపాలై గుడ్లల్లో పానంతో ఊరుజేరి ఊపిరిడిసే దీన జనులతో భాసిల్లే ఊరిది.

ఊరిలో ఉత్తరం దిక్కు ఒక మూలకు బడికోసం ఎన్నబైలలో కట్టిన పాత భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. తొంబైలలోది మరొకటి ఒకే గదితో. ఇదే మా ప్రాథమిక పాఠశాల భవనం.

వీటి చుట్టూ సాలీసాలని బట్టతో కుట్టిచ్చుకున్న బిరుసైన అంగిలాగ ఇరుకిరుకు కాంపౌండ్ ఉంది. లోపల బడితోపోటీ పడి రెండింతలు పైకి ధీటుగా పెరిగిన, నీలగిరి చెట్లున్నవి. దిమ్మెకూలిన బోసినోటితో గేటులేని కాంపౌండ్ ద్వారమూ దానికి చెరోపక్క ఊరిజనంలాగా వినయంగా ఒక పక్కకు తలవాల్చిన కానుగచెట్టు నీడవుంది. మరొపక్క ఊరి రెడ్ల పౌరుషానికి గుర్తుగా ఎదలు తీసినిల్చిన కరెంటు స్థంభం ఉంది.

ఈ రెండింటి మధ్యలోనుండి నన్నూ, నా ముప్పై మంది పిల్లల్ని బడిలోనికి సాదరంగా స్వాగతంపలికే దారివుంది. ఇదీ మా బడి.

ఒకటే దగ్గర ఎనిమిదేండ్లు దాటినాయని గట్టు బడి నుండి ట్రాన్స్‌ఫర్ చేస్తే నెలరోజుల కొరకనుకొని నేను ఈ బడి కొచ్చిన. రావాల్సిన ప్రమోషన్‌రాలే. పచ్చనోట్లూ పైరవీల్ల మునిగితేలే సంఘాల పెత్తనాల పీకులాటల మూలంగా నాలుగేండ్లు దాటి అయిదేండ్లుకావొస్తున్నా ఈ ఊరు వొదిలే అవకాశం నాకు రాలే.

గద్వాల నుండి అయిజ రూట్‌లో మల్దకల్ దాటినంక మూడు కిలోమీటర్లకు మా వూరి స్టాపొస్తది. అక్కడ దిగి లోపలికి అరకిలోమీటరు నడిసివస్తే మా ఊరే! ఆ ఎదురుగా కనిపించేది మా బడే.

ఇది వరకు లేవుగాని ఈ మధ్యనే బస్టాపుదగ్గర మూడు నాలుగు ఇండ్లైనయ్. ఆ మూడిండ్ల నడుమ ఉండేదే వాడిఇల్లు. రోజూ ఈ స్టాప్‌లో బస్సుదిగి ఆ ఇంటిముందు నుంచి బడికి వెళుతుంటే నా కొరకే ఎదురుచూసుకుంటూ ఉండేది వాడు.

తను ఏం దిన్నదీ... లేచినప్పటి నుండి ఏమేమి చేసిందీ... అమ్మ ఏమేమి ఇచ్చిందీ.... అడగకుండానే చెబుతూ... ఏదో ఒకటి నాతో మాటలు కలుపుతూ ప్రతిరోజూ నాతోపాటు అడుగులు వేస్తూ వొచ్చేది వాడు.

ప్రశాంతమైన కళ్ళూ, గుండ్రటి ముఖమూ, ప్రకాశవంతమైన చామనఛాయ, పెదాలపై చిర్నవ్వు.. నాకు నడుమెత్తు ఎత్తుతో, నాతో పరుగులాంటి నడకతో.... సంకలో పలకా పుస్తకాలు పొదిగిన చేయిసంచితో వాడు. ఇదీ నా మనసులోని వాడి రూపం. రోజూ తలకు చిక్కగా నూనెరాసి నున్నగా దువ్విన నెత్తీ, తీర్చిదిద్దినట్టున్న ముఖమూ, తెల్లని పనువరుస... ఎంతని చెప్పేది ఏమని చెప్పేది. వాడితో మాట్లాడాలంటే చాలా సరదాగా ఉంటుంది. ఏం జవాబు చెప్పాలన్నా ముందు 'ఊం' అంటాడు.

స్నానం చేసినవా అంటే 'ఊం–అవును' అంటాడు. ఎవరు చేపిచ్చింద్రు అంటే 'ఊం–అమ్మ' అంటాడు. తల ఎవరు దువ్వింద్రు అంటే 'ఊం – అమ్మ' అంటాడు. ఇట్లా వాడి జవాబులో 'ఊం' అనే ఊత పదంతోపాటు 'అమ్మ' అని ఎన్నిసార్లు పలవరిస్తాడో! అమ్మ అంటే నీకు ఇష్టమా అంటే 'ఊం' అవు.. శాన అంటడు. ఈ మాటలన్నీ వాడి సుకుమారమైన నోటితో అంటుంటే మనం తనివితీరా వినితీరవలసిందే!

ఇంతకీ వాడంటే ఎవరనుకున్నారు?! వాడంటే... మంచు తునక, వాడంటే.. తేనే పలుకు, వాడంటే.. నిప్పుకణిక.. వాడే... వాడే... వాడే... 'నర్సిం'.

వెంకట్రాములు, పుష్ప, రామకృష్ణ, విశ్వనాథ్ రేణుక, బశ... వీళ్ళంతా వాడి దోస్తులు. వాడికన్నా తరగతిలోనూ వయస్సులోనూ వీళ్ళంతా పెద్దోళ్ళే. అయినా వాడిస్నేహం వీళ్ళతోనే.

మధ్యాహ్న భోజనంగా బడిలో రాములమ్మ వండి వడ్డించిన అన్నం సరిపోయేది కాదోమో ఆ చిన్నారులకు. ప్రభుత్వ లెక్కప్రకారం ఒక్కో విద్యార్థికి నూరు గ్రాముల బియ్యం రోజుకు వాడాలి. దీని ప్రకారం వండితే పిల్లలకు ఆకలి తీరేదేకాదు. ఈ లెక్క కాదని పిల్లలల పరిస్థితి చూసి కాస్త బియ్యం ఎక్కువ వేసి వండితే నెలలో పదిరోజుల బియ్యం తక్కువ పడేవి.

ఒక రోజు మా యం.ఇ.వో నర్సన్న సారు బడికొచ్చి తన సహజ ధోరణిలో అన్నం బాగుంటుందా? కడ్పునిండ తింటున్నారా? రుచిగా వండుతున్నారా? పిల్లల్ని అడిగారు.

బియ్యం ఎక్కువేపియండిసార్ అన్నారు పిల్లలందరూ ఏకకంఠంతో. 'అట్లకుదరదు'

ఒక్కొక్కరికి రోజుకు నూరు గ్రాములే ఇస్తది గవర్నమెంటు. పై లెవెల్ల పిల్లలు ఎంత తినగలరు అనేది శాస్త్రీయంగా నిపుణులు నిర్ధారించింద్రు... ఆయనమాటలు పూర్తికాక ముందే బశ బుస్సున లేసిండు.

'వానవ్వ ఎవ్వడు ఆ నిపుణుడు సార్. ఈడ్కి పిల్వండి వాన్ని ఎట్లసాల్తదో అద్గుతాం. పావు కడుపుక్కూడ సరిపోదు'....నేను వొద్దని వారిస్తున్నా వినకుండా... 'నీవ్వూకొ సార్ అక్కడ' అన్కుంట కూసున్నడు బశ.

పిల్లవాడే కాని సాలని అన్నం విషయంలో ఆగ్రహాన్ని ఆపుకోలేక పోయిండు. నిజమే అవిధేయత అనవచ్చేమోకాని ఆ ఆగ్రహం సమంజసమైనదే. పిల్లలు చాలామంది ఉదయం ఇంట్లో ఏమీ తినకుండానే బడికొస్తారు. అందులో అందరూ కాయకష్టం జేసేటోల్ల పిల్లలు టైం పన్నెండు గంటలయితే నేను చేప్పే పాఠంపై వాళ్ళ ఏకాగ్రత నిల్చేదేకాదు. వాళ్ళ కడుపుల్లో ఆకలి చేసే అలజడి అట్లావుండేది.

'ఇక ఆపుసారు నీసోది' అనేట్లుండేవి వాళ్ల చూపులు. కాదు. ధనవంతుల పిల్లలేమో దూరదూర పట్టణాల్లో హాస్టల్లలో చదువుతున్నారు. బడికి వస్తున్న వాళ్ళంతా ఈ ముప్పై మంది పేదలే. ఒకరిద్దరు రాకున్నా అందరికీ ప్రజెంటువేసి వండించినా ఏ మూలకు సరిపోయేదికాదు. ఆ చిన్నారి ఆకలికడుపులకు. లిమిటెడ్ స్ట్రెంత్ ఉండడంవల్ల మరోవిధంగా సర్దుబాటయేదే కాదు.

ఇలా బడిలో భోజనాలయ్యాక ప్రతిరోజూ ఈ ఏడుగురూ కల్సి బడిచుట్టూ ఉండే పరిసరాల్లో, పశువుల కొట్టాలో దాక్కున్న ఉడతల్ని వేటాడి కాల్చుకు తినేవాళ్ళు.

'ఒరే పాములుంటాయ్' ఏమైనా ప్రమాదాలు జరగొచ్చు. అట్లా తిరగరాదురా అని నేనుచేసే అభ్యంతరాల్ని ఏమాత్రంవినకుండా ఏంగాదులేసార్ .... ఎందుకట్ల బెదవద్దవ్... మా దగ్గరికొచ్చే దమ్ములాపాములకు అనుకుంటూ పరుగుతీసేది. ఉడతల శికారీలో పెద్ద బశ దిట్ట. ఉడతలు ఎక్కడ తిరిగేదీ, ఎక్కడ దాక్కునేదీ వాడికి బాగా తెలుసు.

ఉడతల్ని ఎట్లాపట్టాలో ఎట్లా కొట్లాలో ఎట్లా కాల్చుకుని తినాలో పిల్లలందరితో కలిసి వాడు ఉషారుగా చెబుతుంటే ఆశ్చర్యంగావినే వాణ్ణి.

ఒకరోజు అరగంటలోనే వీళ్ళంతా కల్సి పది ఉడతపోతుల్ని షికారిచేసి కమ్మగా కాల్చుకుతిన్నారట.

వీడు ఈ బుల్లి నర్సిం. నన్ను నీడలా వెంటాడే దూత. నిక్కర్‌జేబులో చేతులు పెట్టుకొని ఎగసోపుకుంటూ నాదగ్గరికి పరుగెత్తుకొచ్చి నిల్చున్నాడు. ఏమీ మాట్లాడకుండా జేబులోంచి చెయ్యితీసి నాకోసం దాచుకొచ్చిన కాల్చిన ఉడత నాటేబుల్

మీదపెట్టి 'తినుసారు కమ్మగుంటది..' అన్నాడు.

కడుపు నిండినంత పనైంది. భుజం మీద చెయ్యేసి వాణ్ని దగ్గరకు తీసుకొని ఎదకుహత్తుకున్నా! 'నాన్నా నర్సిం నువ్వేతినరా' అంటూ వాణ్ణే తినమని వత్తిడిచేశా. నా కళ్ళల్లోకే చూస్తూ కొంచం కొంచం ఇరుసుకొని తింటున్న వాణ్ణి చూస్తే ఎంత జాలి అనిపించిందో.

నేను బడికి క్యారియర్ తీసుకుపోవడం చాలా అరుదు. తెచ్చిన రోజు మాత్రం ముందు వాడికింత పెడితే చప్పరించుకుంటూ విశ్వనాథ్‌తో కలిసి అపురూపంగా తినేవాడు. పిల్లలందరితో అదో ఘనకార్యంలా చెప్పుకునేవాడు. వాడు తిన్నది పిడికెడే అయినా ఊరించి ఊరించి చెప్పుకుతిరిగేవాడు. ఊరంతా రెక్కలొచ్చిన పక్షిలాగా, పలక మీద కొత్త దిద్దపెట్టినా... పాఠం చెప్పినా... పాటనేర్పినా ఉత్సాహంతో ఊరకలు వేస్తూ పొంగిపోయేవాడు. మరిప్పుడు వాడేడీ! ఆ ఉరకలూ ఆ ఉత్సాహం ఏవీ?! ఇంతకీ వాడు ఎక్కడికెళ్ళాడు? ఏమైపోయాడు!!

ఆ రోజు నాకు బాగా గుర్తు. అవును బాగా గుర్తు.... ఏదో పనిబడి బళ్ళోంచి ఓ అయిదు నిమిషాలు అలా బయటికి నేను వెళ్ళి వచ్చేసరికి పిల్లలంతా కాంపౌండ్‌లో ఒకపక్క దూరంగా చూస్తూ నిలబడ్డారు కోపంగా, భయం భయంగా. నర్సిం మాత్రం నా టేబుల్‌ను నీళ్ళతో కడిగి తుడిచీ బట్టలన్నీ నాన్పుకుని అలసినట్లున్నాడు. కళ్ళనిండా నీళ్ళు పెట్టుకుని ఒక మూలకు తలవాల్చి నిలుచున్నాడు. వాడెప్పుడూ నేనలా చూళ్ళేదు. కండ్లు ఎర్రబారివున్నాయ్ ముక్కులోంచి చీమిడికూడా ఏకధాటిగా కారుతూవుంది.

ఏడుపూ దగ్గూ రెండూ కలగలసి ఉబికి వస్తున్నాయి వాడికి. నిప్పుల కొలిమిలా వున్నాడు వాడు. దగ్ధమౌతున్న అడవిలా వున్నాడు వాడు. పేలడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతంలా వున్నాడువాడు.

భయం భయంగా దగ్గరకెళ్ళి 'ఏమైంది రా నర్సిం' అన్న. గొంతు పెగలదు. ఒక్కమాటా బదులు పలుకడు. వాడికళ్ళు మాట్లాడుతున్నాయి. వాడి కన్నీళ్ళూ మాట్లాడుతున్నాయి. జలజలా కన్నీరు ఆలేత బుగ్గలమీంచి ధారకట్టింది. నాకు వాటి భాష అర్థం కావడంలేదు. ఆ ఘోషా అర్థంకావడం లేదు.

వాడి మిత్రుడు విశ్వనాథ్ ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు. వెంకట్రాములు వారిస్తున్నాడు. పుష్ప కనుసైగలతో చెప్పొద్దని ఆజ్ఞాపిస్తున్నది. చెప్పలేక, చెప్పకుండా ఉండలేక విశ్వనాథ్ యాతనపడుతున్నాడు.

అందర్లోకి పెద్దోడు బశ. వాడ్ని ఒంటరిగా పిలిచి అడిగిన. విశ్వనాథ్ ఉరికొచ్చి గొంతుకలిపాడు.

'... సారు ఏంలేదుసారు. నిన్న నీవు ఒక్కొక్కర్ని ఒక్కోరకం ఇత్తనాలు తెమ్మంటివిగద. అందరం గవితెచ్చి నీకు సూపినంగద పొద్దున. అవి ప్లాస్టిక్ కవర్లల్ల ద్యానికవి వేరేవేరే ప్యాక్జేస్తివిగద నీవు. అవిట్ని మల్ల డ్రాయింగ్ షీటుకు అతికిచ్చి దేనికింద ఆ గింజల పేర్లు ఒక్కొక్కరు ఒక్కొక్కటి రాయమంటివిగద. నీవు పాస్‌కు పోయినంక మేమందరం డ్రాయింగ్ షీట్‌ను నీ టేబుల్ మీద పర్చి ప్యాకెట్‌కింద గింజల పేర్లు రాస్తుంటిమి. గట్ల పుష్ప 'కందులు' రాసింది. నేను 'జొన్నలు' రాసిన, రామకృష్ణగాడు 'వడ్లు' రాసిండు, విశ్వనాథ్‌గాడు 'శనగలు' రాసిండు, వెంకట్రాములు గాడేమో 'ఉలువలు' రాసిండు, ఇంగ పెసల్లు, సజ్జలు, బుడ్డలు రాయాల్సిఉండె.

అంతట్లకు ఈ నర్సింగాడుండడుగద సేతులకెల్లి జారిపడిన అనుములు ఏరుకుంట ఏరుకుంట వాని కాలికి దెబ్బ పుండైంది గద అండ్లకెల్లి సీముగార్తుండె. ఈగలు జోపుకుంట ఆడు సీము ఏలుతోని దీసి.... అని ఆయాసపడుతూ చెప్పుకుపోతున్న బశను విశ్వనాథ్ అడ్డుకొని 'కావాలని కాదులే' అని సవరణ ఇచ్చిండు. మళ్లీ బశనే అవులే యాదోద్యాసల ఆసీముని నీటెబుల్‌కు తుడ్చిండు. అంతేజూడు సారు ఇంగ పిల్లలు అరె ఆని సీము దాకిన టేబుల్ ముట్టుకోరాదని ఆన్ని తిట్టింద్రు అన్నాడు బశ.

'అయినంక ఇంగా ఆనితోనే బోరింగ్ నీల్లు మోపిచ్చి ఆనితోని రుద్ది రుద్ది కడిగిస్తుండిరి. ఇంగ నీవొచ్చినవ్ సారు' విశ్వనాథ్ పూర్తి చేసిండు. 'సీము దాకితే ఏమైతదిరా ఆన్ని ఎందుకు బాధ పెట్టింద్రు అనవసరంగా అన్నానేను. వెంటనే బశ అందుకొని అట్లంటవ్‌సార్ ఆ పుష్పనడుగు ఊర్ల అందరూ ఏమంటరో.. నర్సింగానోల్లమ్మకు, ఏడ్సుందట. ఆల్ల నాయన దాంతోనే సచ్చిండంట. అది శానా దేంజరంట గద. ఆ సీము దాకితే మనందరికి రాదాసార్ గందుకని... ఇంకా ఏమో అంటుంటే వాన్ని ఆపి ఇంగసాల్రా బుద్ధిలేనిపని జేసి ఆన్ని గాయపర్చింద్రు. 'పాండి అందరం వానికి సారీజెబుదం' అంటూ బయటికివొచ్చిన.

ఇందాకా నాటేబుల్‌ను కడుగుతున్నది బొరింగ్ నీళ్ళతో అనుకున్నా, నర్సింగ్ కన్నీళ్ళతో అనితెల్సి నిర్తాణమైపోయాను.

బయట అంత బరువున్న టేబుల్‌ను నర్సిం ఒక్కడే ఆయాసపడుతూ ఆమూల ఈ మూల లేపి కొంచంకొంచం జరుపుకొస్తున్న దృశ్యం కన్పించింది. గబగబ వెళ్ళి వాన్ని జరిపి నేనే టేబుల్‌ను లోపలికి తెచ్చుకొన్న. పిల్లలందర్ని దగ్గరికి పిల్చుకొని చాలా తప్పుచేశారు. జబ్బులు అట్లా అంటుకోవు. ముందు వాడికి సారీచెప్పండి అని ఒప్పించాను. వెంటనే కాకుండా ముందుగా నేను నర్సింతో చేయికలిపాక ఒక్కోక్కరు

వచ్చి అందరూ చేయి కలిపారు.

అనవసరంగా మీరు భయపడి వాడ్ని బాధపెట్టారు. స్నేహం అన్నింటికన్నా గొప్పది. దయ, ప్రేమ ఉన్నచోట ఏ బాధలూ భయాలు దరిచేరవు. ఏదీ నర్సిం ఇటురా అనిపిల్చి స్కూల్ కిట్‌లోంచి ఆయింట్‌మెంట్ తీసివాడి గాయానికి పూశా ఈగలు వాలకుండా. ఇన్ని రోజులూ ఒకే కుటుంబంలా మెలిగిన మా బడిపిల్లల వదనాలన్నీ ఒక్క పులుపుచుక్క పడి పాలన్నీ విరిగినట్లు పగుళ్ళు తెలిన ఆ దృశ్యం చూసి మనసంతా వికలమైంది. నర్సిం హృదయం పగిలిన అద్దమై ఎంత విలపించిందో...

మర్రోజు వాళ్ళమ్మే వచ్చింది బడికి. వాడురాలే!

..'సారు... తప్పైంది వాన్నేమనకండి... పొటురాయి దాకి కిందపడిరటే దెబ్బతాకి సీం బట్టిండె... అంతే వానికేం గాలే... నీఎంట ఇంత గున్నప్పట్నుంచి వొస్తుండే పోతుండే ఏలువట్కోని. నీ మీద శానపానం సారు...' అవమానభారంతో కుంగిపోతూ ఆమె ఒక్కొక్క మాట అతిభారంగా గొంతుపెగిల్చి ఉచ్చరిస్తుంది.

'బడిలేనినాడు వాడు నరకమే జూస్తడు పిల్లల్తోని గూడ కల్సి ఆడుకోడు ఊర్ల. నీ వోచ్చె దినం ఆగిన బస్సులెల్ల మా సారొచ్చె అని ఎదురు జూస్తడు. బస్సు దిగిన మందిల ఓరకంట జూసుకుంట నిన్ను ఎతుక్కుంటడు. యమ్మా సారు దిగపాయె ఇయ్యాల రాడా ఏంది అని కండ్లల్ల నీల్లు వెడ్తడు.

సిన్నప్పుడు ఆనికి నోరుతిర్గకుంటే నీవే ఎంటవడి ఎట్ల పల్కాల్నో కూడ పల్కిచ్చి మాటనేర్పితివి. నీవు గా పొద్దు నా ఎంట దోల్కపోత మా ఇంటికి రా రా అన్నవంట. ఎప్పటికి ఇంట్లనే ఉందువు అన్నవంట. గాపొద్దు వాని సంతోషం సెప్పరాదు.

'యమ్మా సారు రమ్మన్నడే .. మాసార్రమ్మన్నడే అని ఎగిరి గంతేసిండు. 'రా అనింటే మల్లపోరా నీ యిష్టం' అనింటే మల్ల నీవు గూడ నాగ్గావలె గదా... నీవులేంది నేనెట్ల బోత ...ఆగు సార్నే మల్లోసారి ఎప్పుడైన నేనే అడ్గుత 'సారు... సారు.. మాయమ్మా నేనూ ఇద్దరం వొత్తుమా మీ ఇంటికి... ఎప్పడికి ఆడ్నే ఉండనీకె... అనంటడుగుత అంటుండె ఉత్త అమ్యాత్కుడాడు.

యమ్మా మా బడి ఎంత మంచిదనుకున్నవే ఎప్పుడు ఆడుకుంట పాడుకుంట గమ్మతుగుంటం. మా సారు బాగాసదివిస్తడే. సెయిపట్టి దిద్దిస్తడె. వొద్దగూసపెట్టుకోని సిన్నసిన్న మాటలు కథలు జెప్తడే. అలాయి దొక్కిస్తడు.. బొడ్డెమ్మలు గొట్టిస్తడు. నాతోని రాజు ఏశం గట్టిచ్చిండె. ఒక్క తీరుగ పిచ్చొనిలాగా ఇదే వొదురుతుండె. పెద్ద సద్వు సదువుకోని సారులెక్కసారునైత అని ఏమేమో కలగంటుండె.

బడితోని వాని జ్ఞాపకాలు చెప్పుకుంటూ ఏడ్చి కన్నీటి పర్యంతమైందా తల్లి. పిల్లందరూ కండ్ల నీల్లు నింపుకొని పశ్చాత్తాపంప్రకటిస్తున్నట్టుగా విషాద వదనాలతో నిశ్చల శిలలై నిల్చుండిపోయారు ఆమెచుట్టూ. పిల్లలందరి దిక్కూతలఎత్తి చూసి మళ్ళీ ఆమెనే అన్నది. 'ఈ పిల్లలంతా ఏమేమో అంటరంట. నాకూ వానికీ ఏదో పెద్దరోగం ఉందని, వాల్లనాయ్న వుండింటే వానిగ్గూడ ఒక ఆదెరువుంటుండె. దిక్కులేనోలం గదా అందరూ అదో తీర్గ జూస్తరు...'

ఈల్లు గూడ పిల్లలు వీల్లదేం తప్పులేదు. ఈల్లకేందెల్సు పాపం. ఇండ్లల్ల పెద్దలు అనుకున్నది ఇనింటరు అదే యదాష్టం అంటుంటరు.

ఇమానంగ జెప్తున్న సారు. పెద్దరెడ్డి పంపింటే కర్నూల్‌కు గూడ పొయి పరీక్ష జేపిచ్చు కొచ్చిన. నీగ్గావాలంటే రేపు దెస్త బడికి సూడు . గీల్లదరికీ జెప్పు ఆన్నేమనాకండని. 'పిల్లలు ఏమేమో అంటరు. నేను బోనుబడికి అని వాడు ఒకటే ఏడుస్తున్నడు. రాతిరంత సలిజరం వొచ్చింది ఆనికి ఏడ్చేడ్చి.

నిద్రలగూడ పల్వరిస్తుండడు.. 'సారు నన్ను దగ్గెరికి రానియ్యాడా... సారు నన్ను పిల్చుకోడా ... అని. నడిరాతిరి నన్నులేపి యమ్మా ఏమో రక్త పరీక్ష కాయితం ఉందంటివి గదా గది సూపిచ్చి రాపో సారుకు' అని వొకటే వొలపోస్తున్నడు.

రేపుతెచ్చి సూపుత ఆగు ఆకాయితం అనుకుంటూ కానుగచెట్టు కింది నుంచి లేచి బడి పిల్లల్లో తన బిడ్డడు లేని లోటును సూసి తల్చుకొని తల్చుకొని రోదిస్తున్నదా తల్లి.

'అమ్మా ఇక్కడ బడిల ఎవరం ఏమీ అనమమ్మా పిల్లల మాటల కేంలే నేనుండగద.. జరిగిందానికి విచారంతో నేనిస్తున్న భరోసాను పూర్తిగా వినకుండానే మౌనంగా వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోయాక మా బడిలో అంతా మౌనమే! ...భయంకరమైన మౌనం... పిల్లల్లో... నాలో... అందరిలో...

ఎక్కడో వర్షించడానికి భారంగా వెళుతున్న మేఘాల్లాగా అందరమూ ఇండ్లకైతే వెళ్ళాంగాని... మనసంతా ఒకటే దిగులు.. ఆ రాతిరెలా గడిచిందో!

ఎప్పుడో తెల్లారేముందు నిద్రపట్టినట్లుంది. కళ్ళు తెరిచి చూసేసరికి పొద్దు బారెడెక్కింది.

రోటీన్‌గా చేయాల్సిన ఇంటి పనులన్నీ లయతప్పుతున్నాయి. ధ్యాసంతా వాడిమీదనే... రోజు కన్న గంటముందుగా ఆవూరి స్టేజి దగ్గర బస్సుదిగాను. నాకోసం ఎదురు చూస్తున్న ఆ కళ్ళు... వాడి చూపులూ అక్కడలేవు. అడ్డొస్తున్న జనాల్ని తప్పించుకొని బాటపొడవునా వెతుకుతున్నాను.ముని వేళ్ళపై నిలబడి నా కోసమే చూస్తూ ఆహ్వానం పలికే వాడిలేత చేతులు కనిపించలేదు. గబగబా కదులుతూ వచ్చి

దారిలోనేవున్న వాళ్ళింటి ముందొచ్చి నిలిచాయి నా అడుగులు.

వాడులేదు వాడిపలుకూలేదు. వాడిచిర్నవ్వూ వాడి ముద్దు ముద్దు మాటలూ.... మాట మాటకూ 'ఊం అమ్మ' అని బదులిచ్చే వాడి స్వరమూ ఏవీలేవు. ఎప్పుడూ నున్నగా నూనెరాసి దువ్వినట్లుండే వాడితలలాగే నునువుగా ఊడ్చి సాంపిజల్లుకొని ముచ్చటగొలిపే ఆ వాకిలి ఊడ్చేదిక్కులేక చెత్తాచెదారంతో పర్చుకున్నది. ముగ్గుల మురిపాల శోభను కోల్పోయిన ఆ వాకిలి పొక్కిలి వారింది.

బెదురు బెదురుగా ఆ పక్కనున్న ఓ ఇంటావిడ్ని అడిగాను 'అమ్మా మా నర్సింలు లేడామ్మా..'

ఇంగ్యాడి నర్సిములు నాయనా నిన్న మొబ్బుల ఎవరికీ సెప్పకుండా తల్లీ కొడుకు ఎల్లిపోయింద్రు. ఊరిడిసి పోయింద్రు... ఏడికోయింద్రో సారూ..' ఆ కుటుంబంపై ఉన్న తన మమకారాన్నంతా గుర్తుచేసుకొని కళ్ళు తుడ్సుకున్నదామె.

ఆ తల్లీ కొడుకులు ఎక్కడికెళ్ళారో ..ఎలా ఉన్నారో.. నాజ్ఞాపకాలు వాడి అనుభూతుల్ని నెమరేసుకుంటుంటే నా అడుగులు బడిదిక్కు లాక్కుపోతున్నాయి నన్ను.

దారి పొడవునా అన్నీ సహజంగానే ఉన్నాయి. సందడిగానే ఉన్నాయి. అంగడి దగ్గర, హోటల్ దగ్గర, బోరింగు దగ్గర జనాలు ఎవరి పనుల్లో వాళ్ళు తలమునకలై ఉన్నారు.

అంగళ్ళకు సరుకులేసేటోళ్ళు, కూరగాయలమ్మేటోళ్ళు ఊర్లకు వెళ్ళేటోల్లు.. ఎవరి తొందరలు వాళ్ళవి. ఎవరి అవసరాలు వాళ్ళవి. ఊరి పెద్దరెడ్డి రోజులాగే తలస్నానం చేసి మడిగట్టుకొని సీతారాముల గుడికెళ్ళి ఇంటికి తిరిగొస్తున్నాడు చేతిలో ప్రసాదంతో..

నేనూ నా పిల్లలూ మా బడి మాత్రం దిక్కులేనివై మిగిలాం.

పిల్లలేమేమో చెప్పాలన్నా విషాదాన్ని కళ్లల్లో దాచుకొని నా కోసమే ఎదురు చూస్తున్నారు.

గేటు పక్కనున్న కానుగ చెట్టు నిన్న తడిసిన ఆ తల్లి దు:ఖం లోంచి ఇంకా తేరుకోనట్లు ఎవరికో సంతాపం ప్రకటిస్తున్నట్లు ఆకుల్ని అవనతం చేసుకొని తలవాల్చుకొని ఉన్నది. ఆ ఊర్లో అన్నీ సహజంగానే ఉన్నాయి. ఆ కుటుంబానికి ఆ దౌర్భాగ్యాన్ని అంటగట్టిన వాళ్ళు ఏమీ ఎరగనట్లు ఏమీ జరగనట్లు పూజా పునస్కారాలతో తరించిపోతుంటే ఆ తల్లీ కొడుకులు మాత్రం ఇల్లూ వాకిలీ వదిలీ ఊరూ వాడనిడ్సి ఎక్కడెక్కడ తిరుగుతున్నారో..

ఇంతకీ వాడు రాడా..? వాడెప్పటికీ రాడా..? వాడు మళ్ళీ రానే రాడా..!

అవును వాడు రాడా..? వాడు మళ్ళీ రానే రాడా..!?

మనసు మూగగా రోధిస్తున్నది.

# ఈస్ట్ విండ్

## సోమయ్య

హన్మకొండ బస్సుకు పంపితేగాని రేపటి పేపర్లో వార్తలు కవరు కావు, ఇంకో ఐదు పది నిమిషాల్లో బస్సు చౌరస్తాకు వస్తుంది, డ్రైవరుకు ఇవ్వడానికి చిల్లర చూసుకోవాలి ఒక్కోసారి చిల్లరివ్వకుంటే కవరు తీసుకోడు డ్రైవరు, తోటి విలేకర్లు రాయడం ముగించి కవర్లు అతికించే పనిలో హడావిడి చేస్తున్నారు, ఈలోపే హారన్ మ్రోగిస్తు రానేవచ్చింది బస్సు, కిటికిలోంచి చేయిసాపిన డ్రైవరుకు పోటీపడి కవర్లు ఇవ్వడంతో నిన్న సేకరించిన వార్తలు పంపించామని ఏదో తృప్తి, కష్టపడి సేకరించిన వార్తలకు టైటిల్స్, సబ్ టైటిల్స్ పెట్టి ముస్తాబు చేసి పంపడం, అవి ఫ్లాష్ అయితే చూసుకొని చర్చించడం వాటి తాలూకు వచ్చే స్పందనలు విని ఆనంద పడడం, ఆందోళన చెందడం పరిపాటి.

"ఏమోయ్ తాతా! ఏదో ముఖ్యమైన వార్త వ్రాసినట్టున్నావు, సరిచప్పుడు కాకుండా కవర్లో పెట్టి ఇచ్చావు!" అడిగాను.

మా అందరిలో పెద్దవాడు సౌమ్యుడు సగానిపైగా నెరిసిన జుట్టున్న కర్ణయ్యను.

"నీ కళ్ళు పాడుగాను ఎప్పుడు చూస్తివి నీ కండ్లల్లో మషమ్మ పొడవ" అంటూ నన్ను సరదాగా ప్రేమగా శపించాడు. కర్ణయ్యను ఆటపట్టించడమంటే మా అందరికి సరదా.

"ఏదో ఇన్వెస్టిగేషన్ వార్త రాసినట్టున్నావు కవరు నిండుగున్నది, రేపు ఫ్లాష్ అయితే ఫైన్ ఎక్కువయితది అదేదో ఇప్పుడే చెప్పి ఆనవాయితిగా చాయలు ఆర్డరియ్యేహే!"

అంటూ ఏదో రాయితి ఇచ్చినట్టు సలహా ఇచ్చాడు మరో పత్రికా విలేకరి మోయినొద్దీన్, ఏదైన ప్రత్యేక వార్త రాస్తే అందరికి చాయలు తాపడం, మా చిన్న గ్రామీణ విలేకరుల గుంపులో ఆనవాయితి, ఇక సిగరేట్లు షరా మామూలే.

"చాయలు త్రాగడం అయింది కాని సోమయ్య బాగున్నాడే తాతా!" అంటూ అడిగాడు. ఇంకో పత్రికా విలేకరి వెంకటయ్య!

"వోరి దుర్మార్గుల్లారా సోమయ్య వార్తా అందరు రాసి నాతో చాయల బిల్లు కట్టిస్తారా!" అంటూ అందరిని తరుముతూ వెంటబడ్డాడు కర్ణయ్య. ఆ రోజు సోమయ్య వార్తా ప్రత్యేకత అది.

రాత్రి పొద్దుపోయాకా సోమయ్య జైలు నుండి విడుదలై వచ్చాడని తెలిసి హడావిడిగా ఏదో వార్తలు రాసి పంపాము గాని, సోమయ్యతో కలిసి మాట్లాడి ఓ ఆర్టికల్ రాయాలని వుంది. అందరం అటువైపు నడుస్తున్నాం, సోమయ్య ఇంటివైపు ముందుకు నడుస్తున్నాను గాని నా ఆలోచనలు మాత్రం వెనక్కి నడుస్తున్నాయి.

"వార్తలు రాసే ముందు వళ్ళు దగ్గర పెట్టుకుని రాయి! ఏవో సంచలనాలకోసం వార్తలు నీ ఇష్టం వచ్చినట్టు రాస్తే పెన్ను పట్టుకోవడానికి వేళ్ళుండవు జాగ్రత్తా!" ఆ మాటలు బాగా గుర్తొస్తున్నాయి నాకు!

"బర్లు కాసే సోమయ్య ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర చేశాడా!" సోమయ్యను అరెస్టు చేసిన రోజు నేను రాసిన వార్త. మళ్ళీ ఇలాంటి వార్తలు రాయొద్దనే బెదిరింపు, ఆ వార్తకు స్పందన.

సోమయ్య...బుడగ జంగాల సోమయ్య! బర్లుకాచే సోమయ్య గొప్ప యక్షగాన కళాకారుడు సోమయ్య, ఆరడుగుడుల ఎత్తు, బుర్ర మీసాలు రింగురింగుల పొడవాటి జుట్టు చూడచక్కగుంటాడు. సమాజం వెలివేసిన మాలా మాదిగా కులాల ఇండ్లకు మరింత దూరం విసిరేసినట్టుండే బుడగ జంగాల గుడిసెలు, సమాజం ఎంత దూరం వేసిందో ప్రజలందరికి అంతే దగ్గరుంటాడు సోమయ్య.

"కౌసల్యా సుప్రజా రామా పూర్వ..." అంటూ వినిపించే సుప్రభాతంకంటే ముందే వినిపిస్తుంది సోమయ్య తాత బర్లకేక "బర్లోబర్లో ... బర్లిడిసుర్రమ్మో బర్లో...!" అంటూ ఊరంతా తిరుగుతూ బర్ల గుంపును జమచేసేటోడు.

బర్లిడిసి గుంపుల గొట్టి సోమయ్యకు అప్పచెప్పడమంటే పిల్లలకు బలే సరదా, బర్ల గాసం ఇచ్చినంతా తీసుకునేటోడు. జొన్నలు, సద్దలు ఏవిస్తే అవే తీసుకునేటోడు, పైసలు ఇచ్చేది అరుదే. అప్పుడప్పుడు పాత బట్టలిచ్చినా సర్దుకునేటోడు.

"అక్కా ఎల్లక్కా ... ఏడి బావా ! ఏం జేస్తుండు !" అంటూ మా ఇంట్లోకొచ్చి గుతుప కర్ర సంకల ఆనిచ్చి నిలబడి అమ్మనాన్నలతో కాసేపు మాట్లాడనిదే కదిలేటోడు కాదు.

"అరే సోమా ! బర్రె పాలియకుంటైంది. దూడను జర పాలు సీకకుండా చూడంటే

లెక్క చేయకపోతివి!" అని ఆప్యాయంగా అడిగేది మా అమ్మా గద్దించినట్టు "బర్రె యెదకొచ్చిందక్కా ఆ దూడ పాడుగాను అది దూడా! దున్నపోతు, సెరువు నీళ్ళల్ల పడ్డదంటే చాలు బయిటికెల్లదు, మంది సేలల్ల వడి దొరకనే దొరకదు, దాన్ని బేరంబెట్టి అమ్ముదం!" అంటూ సలహాలిచ్చేటోడు.

ఊరు చెరువుకు దూరం గుంటది. చెరువు శివార్ల బర్లమంద, ఊరు దాటి మందల గొట్టిందాక, బర్లమీదెక్కి గుంపులనే పోయెటోల్లం, బర్లెంత సతాయించినా ఒక దెబ్బయినా కొట్టకుండా "స్పృబ్ స్పృబ్" అంటూ సైగలతోనే వందల బర్లను అదుపు చేసేటోడు. సందికంతల పొంటి లేచే బర్లదుమ్ము అవి చేసే అలజడి, చెట్ల పొదలు పూనకంవచ్చినట్టు ఊగేవి, చెరువు నీళ్ళల్ల బర్లమీద ఎక్కి ఆడేటోళ్ళం, సాయంత్రం బర్లకోసం ఎదురుచూడడం కన్నా, సోమయ్య కోసం ఎదురు చూడ్డమే మాకిష్టం, అంగడికోయి అమ్మా బజ్జీలు తెచ్చినట్టు, అడవినుంచి మాకు నక్కెరపండ్లు, జానపండ్లు, నేలీతపండ్లు తుంకిపండ్లు, తెచ్చిచ్చెటోడు సోమయ్య. యాక్షగానం కళాకారుడిగా సోమయ్యలో ఇంకో మనిషి ఉన్నాడు. మా నాన్న యక్షగాన కళాకారుడు. నాన్నతో కలిసి ఎన్నో ఆటలాడిరడు. కురుక్షేత్రం, అల్లిరాణి, చెంచులక్ష్మి, వాలీ సుగ్రీవా, ఇట్లా సోమయ్య వేయని నాటకమే లేదు. ఏ నాటకంలోనైనా ప్రధాన పాత్ర సోమయ్యదే సోమయ్య విగ్రహపుష్టి అట్లాంటిది. సోమయ్య వేషం ఎప్పుడొస్తదా అని ఎదురుచూసేటోల్లు జనం. భుజకిరిటాలు కట్టి తెరచాటునుండి ఒరే! ద్వార పాలకా! అంటే చాలు, నిద్ర పట్టినోల్లు లేచికూసునేటోల్లు. సోమయ్య కీర్తన అందుకుంటే మద్దెల తాళాలు కొట్టేటోల్లకు చమటలు పట్టేవి. దరువు తప్పు పడితే కండ్లెల్లపెట్టి చూస్తేచాలు. మద్దెల తాళాలు శృతి గలిసేవి. యుద్ధ సంవాదం వంటి ఘట్టాలైతే, మద్దెల దరువుకు చెంగు చెంగున ఎగిరి ఆడేతుంటాడితె బల్లెపీటలు కదిలేవి.

పరషురాముని వేషం కడితే తెల్లవారంగనే ఇండ్లల్లోనో, దొడ్లోనో వేషం విడిపించుకోవడానికి పోటిపడేటోల్లు పెద్దింఢ్లోల్లు. వేషం ఇడిసిన ఇంట్లో బర్కతుంటదని ప్రజల విశ్వాసం వుండేది. అట్లా గడిసింది సోమయ్యతో మా బాల్యం. ఆ ఆటలు పాటలు కనుమరుగై పోతున్నాయని బాధపడేటోడు. ఆ జ్ఞాపకాలు తోడుకుంటూ సోమయ్య ఇంటి వైపు నడుస్తున్నాను.

ఎదురుబడి నలుగురు కలిసి మాట్లాడుకునే రోజులు కావవి. చీకటి రోజులు, కన్నీళ్ళతో మాట్లాడుకునే రోజులు, పల్లెలు ముళ్ళకంచెల మధ్య, తుపాకి నీడలో గుబులు పడుతున్న రోజులు, విప్లవోద్యమం బలంగా విస్తరించి ఉన్నరోజులు, నల్లమలలో ఆ ప్రభావం లేని ఊరే లేదప్పుడు, జండా ఎగరని పల్లే లేదు. ఆ రోజు

బాగా గుర్తుంది నాకు. మా ఊళ్లో ఓ పెద్ద షావుకారు దుఖాణంపై కరువుదాడి జరిగింది. దళం ఆధ్వర్యంలో ప్రజలు కరువు దాడికి దిగారు. కొన్ని గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమకు కావలసిన సరుకులు తీసుకుపోయారు. పొద్దున్నే ఊరునిండా పోలీసులు ఇల్లిల్లు గాలించి ఎవరు దొరికితే వాళ్ళను పట్టుకు పోయారు. ఏవి దొరికితే అవి ఎత్తుకు పోయారు. ఆ కరువు దాడితో సంబంధం లేనివారిని కూడా అరెస్టులు చేశారు. కరవు దాడి జరిగిన దుకాణం సోమయ్య గుడిసెకు దగ్గరే. జనం తిండి గింజలు, సరుకులు ఇస్తుంటే సోమయ్య తెచ్చుకున్నాడు. కరువు దాడికి కీలక సూత్రధారి సోమయ్యేనని అరెస్టు చేశారు. ఊరూరా దిప్పి కరువు దాడిలో పాల్గొన్న వారందరిని గుర్తుపట్టాలని చిత్రహింసలకు గురి చేశారు.

పత్రికా విలేకరిగా ఆరోజు సోమయ్యను కలిసినప్పుడు తీవ్ర గాయాలతో అచేతనంగా నా వైపు చూసి కన్నీళ్ళు కార్చాడు సోమయ్య. ఆ కరువు దాడిలో పాల్గొన్న ప్రజలందరిపై టాడా కేసులు బనాయించిండ్రు. తీవ్ర కరువు కాటకాలతో జనం ఆకలి తీర్చలేని సర్కారు, తిండిగింజ తీసుకుపోతే దేశద్రోహం కేసు పెట్టింది. ఆ నల్ల చెట్టాలు చెల్లవని ఎన్నో సంఘాలు ఏండ్ల తరబడి గగ్గోలు పెట్టి నిలదీశాయి. అనేక పోరాటాల అనంతరం ఆ టాడా రద్దయిన తర్వాత గూడా సోమయ్య రెండేళ్ళు అండర్ ట్రయల్ ఖైదిగానే జైలు జీవితం అనుభవించాడు. నిన్న రాత్రి విడుదలై వచ్చాడు.

ఎన్నాళ్ళైంది సోమయ్యను చూసి ఒకసారి సోమయ్య తాతను కలిసి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు ఏసుకోవాలని ఆతృత ఎక్కువైంది నాలో. చిన్న వెదురు తడకల గుడిసే, వంగి వంగి ఒక్కరొక్కరం ఇంట్లోకి అడుగు పెట్టినం, లోపలంతా చీకటిగా ఉన్నా, కాసేపు చూస్తే బాగానే కనిపించింది. మమ్మల్ని చూసి పోలీసులను కున్నట్లున్నారేమో, లేసి నిలబడి రెండు చేతుల నమస్కారం పెడుతుండ్రు ఆడోళ్ళు, “మేము పత్రికా విలేకరులమమ్మా పరువాలేదు కూసోండంటే” కాస్తా నిమ్మల మైనట్టున్నారు. ఎట్లాంటి సోమయ్య ఎట్లయిండు, ఆ పొడవాటి జుంపాలు లేవు, కోరమీసాలు లేవు, జైలు నిబంధనలన ప్రకారమేమో అంతా కత్తిరించినట్లున్నారు. ఎవరికి వారు తమ ప్రత్యేకతల కోసం ప్రయత్నిస్తున్నారు మా విలేకర్లు కొందరు సోమయ్య గుడిసెను ఫోటోలు తీస్తున్నారు. ఏవేవో ప్రశ్నలడుగుతున్నారు, వచ్చిన పనేదో మరిచి అదే పనిగా చూస్తున్నాను సోమయ్యను. ఎక్కడెక్కడో తిరుగుతున్నాయి ఆలోచనలు, ఇంతలో “బాగుండావానాయానా” అంటూ ఆప్యాయంగా పలుకరించాడు. ఎల్లక్క బాగుందా! అంటూ అమ్మ నడిగాడు. ఇప్పుడు సోమయ్య వేషం కట్టకున్నా, ఏదో తెలియని వేషం కనిపిస్తుంది. చూడగానే కన్నీళ్ళు పెట్టడం నా వంతయింది.

జైలు జీవితం పూర్వాపరాలన్నీ అడిగినం, ఒక యోగిలాగా సమాధానం ఇస్తుండు సోమయ్య.

"జైలుకు పోయిన కొత్తల గా జైలు పోలీసులు నాకు ఇరామ్ లేకుండా పని చెప్పేటోళ్ళు. జైలంత ఊడ్పిచ్చేది, చెట్లకు గుంతలు తీపిచ్చేది, నీళ్ళ పోపిచ్చేది పనికిమాలిన పనులన్నీ జెప్పేది. గిదీగదని కాదు ఆఖరికి పయఖానలు గూడ కడిగిచ్చేది. జైల్లో గూడ కొంతమంది రౌడిగాళ్ళు మస్తు గుండరు. గా జైలు పోలీసోల్లు ఆళ్ళు జెప్పినట్టె ఇనేటోళ్ళు, ఇగ శాతగాని మా బోటోళ్ళు ఆళ్ళేపని జెపితే గది జేసెటోళ్ళం. కొన్నాళ్ళకు జైలుకు కొత్త పోరలు వచ్చింంద్రు. ఆ పోరలు గీ పనులన్ని చేసేది లేదని రూల్స్ మార్సింంద్రు. తిండి మంచిగ పెట్టిచ్చుడు, సదువు రానోళ్ళకు సదువు జెప్పుడు, జర తీర్కె దొరికినపుడు మంచి మంచి పాటలు పాడేటోళ్ళు, మాటలు జెప్పెటోళ్ళు. జైళ్ళ బడిపంతుళ్ళ లెక్క వాళ్ళు జెప్పినవే ఇనెటోళ్ళం. మాతోని యక్షగానం ఆడిరచెటోళ్ళు. గా పోరగాళ్ళ పున్యమని సదువడం రాయడం గూడా నేర్చుకున్న. జైళ్ళ జబర్దస్తి జెసేటోళ్ళను కుయ్యనకుండా జేసింంద్రు" అంటూ తన జైలు జీవితం గురించి ఎంతో ఉత్సాహంగ జెప్పుతుండు సోమయ్య.

"సోమయ్య తాత! నీ గొంతు వినక ఎన్నేండ్లయింది. ఎప్పుడో చిన్నప్పుడు నీవేషం కోసం ఎదురుచూసినోల్లం, ఏది! ఆ గొంతుతో ఒకసారి విరాటపర్వంలోని ఒక కీర్తనందుకో!" అడిగాడు మా బృందంలోని శివయ్య.

"ఎప్పుడో! ఏండ్లకింద ఆడిన ఆట, నా తోటోలందరు పోయింంద్రు, అయినా! ఇంకా గా పద్యాలు కీర్తనలు ఇప్పుడెవరింటరు!" అంటూ నిట్టూర్చాడు.

"గా ముసలాయనకు గవేడ గుర్తుంటయి నాయన" అంటూ సావదాన పర్చుతుంది సోమయ్య భార్య.

ఏమనుకున్నాడో ఏమో! గొంతు కాస్తా సవరించుకొని "గాపాటలిప్పుడు పాడను గాని, ఇంకో పాట పాడ్త ఇనుంంద్రి బిడ్డ్య" అంటూ పాట అందుకున్నాడు.

"నీ కన్నీరు నా కన్నీరు కలిగినోళ్ళకు పన్నీరాయే...నీ కన్నీరు నా కన్నీరు కలిగినోళ్ళకు పన్నీరాయే...ఒంటిగా ఓ శోకం తీసే చిన్నీ తమ్మయ్యా.... నీ జంటగా నేనుంటారా చిన్ని తమ్మయ్యా, అంటూ పాడాడు సోమయ్య".

ఏంపాట పాడేటోడు సోమయ్య! ఇప్పుడు ఈ పాట పాడుతుండు? ఎంతో మార్పు చోటు చేసుకుంది సోమయ్య తాతలో.

# అడిగెటోళ్లు

పి. చిన్నయ్య

"ఒకసారి వచ్చిపోరాదు డాడి..."

"ఎందుకు నాన్న?"

"నిన్ను చూడాలనిపిస్తుంది" చిన్నోడు ఫోన్ల అనేసరికి భారంగ మారి, మనసంత ఎలాగో అయింది. వారం రోజులకు ఇంటికి పోదామనుకున్నోన్ని రేపే బయలు దేరాలని నిర్ణయించుకున్న.

అనారోగ్యం, దాని కోసం రకరకాల ప్రకృతి చికిత్సలు తీసుకుంటూ నెలల తరబడి కుటుంబానికి దూరంగా హైద్రాబాదో, మరో దగ్గరో ఉండాల్సి రావటం. ఇంటి మీద, ఊరు మీద ధ్యాస ఉండటం లేదు. కొన్ని రోజులుగా మిత్రులు, బంధువుల నుండి ఊర్ల సమాచారం తెలుస్తనే ఉన్న పట్టించుకోవాలనే ఉత్సాహం లేకుండ పోయింది. చివరికి మా ఆవిడ నిర్మల చెప్పేసరికి ఊరి సమస్య తీవ్రత అర్థమయింది.

నా ఆరోగ్యం ఏమోగాని ఊర్ల పరిస్థితే ఆందోళనగ తయారయింది ఒక రకంగా. ఇది ఎప్పుడో నాలుగైదు ఏండ్ల క్రితమే ఊహించిన విషయంగాని ఇంత వేగంగ మార్పులుంటాయనుకోలేదు. ఉండబట్టలేక డాక్టరు దగ్గర ఒక రోజుకు అనుమతి తీసుకొని బయలుదేరాను. బస్సెక్కిన మాటేగాని ఆలోచనలన్నీ నిర్మల, ఊరు మీదనే...

"ఈ ఊర్ల మనకు ఏముంది చెప్పు ఇల్లు తప్ప? ఒక నీళ్లా, కూరగాయలా, పాలా? ఇక్కడ ఏం సరిగ్గా దొరుకుతాయి? టౌన్‌కు మారితే బాగుంటది. పిల్లల్ని మంచి స్కూల్లో వేయొచ్చు..." ఒకటికి రెండుసార్లు వత్తిడి తీసుకొచ్చింది టౌన్‌కు మారుదామని. ఆమె కొలిగ్స్ కొంతమంది భువనగిరి నుండి వచ్చి పోతుండటం చూసి.

"నాకు మారాలనే ఉంది. నీ గురించే ఆలోచన. రోజు యాభై కిలోమీటర్ల ప్రయాణం, ఎయిడెడ్ స్కూల్. అయిదు నిమిషాలు లేటయినా మేనేజ్‌మెంట్ ఊరుకోదు.

బస్సులు సమయానికి పోవు, పైగా నీకు ప్రయాణం పడదు ఆలోచించుకో...” అనే సరికి ఏ కారణాలు ఎలా ఉన్నా ప్రయాణ భయం వల్ల తన ఆలోచన విరమించుకుంది నిర్మల. పట్టణాలు, నగరాలంటేనే ఊపిరాడని నాకు, ఊపిరి పీల్చుకున్నట్టయ్యింది. కానీ, ఊర్ల వచ్చిన ఈ ఉపద్రవమే ఎటు దారి తీస్తుందో అర్థం కావడం లేదు.

ఊరు నగరానికి అరవై కిలోమీటర్లే. త్వరగానే చేరుకున్న. వేసవి కాలం కావటం వల్ల ఏడు గంటలకే ఎండ తన ప్రతాపం చూపిస్తోంది.

ఊర్ల దిగగానే చూస్తే పరిస్థితులు భిన్నంగా ఏమీ లేవు. నిర్మల చెప్పినట్టుగానే ఉందంత. వయో, లింగభేదం లేకుండ సైకిళ్ళు, మోటారు సైకిల్ల, ట్రాక్టర్ల, కార్ల మీద ఎవరి తాహతును బట్టి వాళ్ళు బిందెలను, క్యానులను, డ్రమ్‌లను వేసుకొని చుట్టు ప్రక్కల వ్యవసాయ బాయిల దగ్గరకు చీమలదండుల్లా కదులుతున్నరు. దారిలో ఒకరిద్దరు పలుకరించినా ఆ పలుకరింపులో ఏదో తేడాగా ఉంది. ఇంటికి చేరుకునే సరికి నిర్మల ఇంటిపక్క వాళ్లతో మాటల్లో ఉంది.

‘ఇప్పుడేనా అన్నా రావడం?” పక్కింటి లలిత పలుకరించింది.

“అవునురా...” అనుకుంటు ఇంట్ల బ్యాగు పెట్టి, గ్రామ పంచాయితీ దగ్గరకు బయలుదేరబోతుండగానే, పిల్లలు నీళ్ల క్యాన్లను సైకిలుకు కట్టుకొని గేటు దగ్గర ఎదురయి.

“డాడీ, రెండు క్యాన్ల నిండ నీళ్లు తెచ్చినం!” ఎగబోసుకుంటు, ఆనందంతో చెబుతున్నరు. ఈ స్థితికి ఆనందపడాలో, బాధపడాలో అర్థం కావడం లేదు.

“మంచిదమ్మా...” ఇద్దరిని ముద్దు పెట్టుకొని బయటకొచ్చిన.

“ఇంటికొస్తే చాలు ఇంటి పట్టునుండవు. దేశంలో ఎవనికి లేని పనులు పెట్టుకుంటవు...”

మామూలుగా నిర్మల నోటి నుండి వచ్చే మాటలేదు. పైగా నేను బయటకు పోతున్నాననే స్పృహ లేనట్టుంది. నీళ్ళ గురించి మాటల్లో ఉన్నారు.

గ్రామ పంచాయితీ దగ్గరకు చేరుకునే సరికి అంతా గందరగోళంగా ఉంది.

“వస్తరో, రారో అనుకున్నం సార్ మీరు...” ఒకరిద్దరు దగ్గరకొచ్చి పలుకరించినరు. అక్కడి పరిస్థితులు అర్థమయ్యేసరికి అయిదు, పది నిమిషాలు పట్టింది.

నాలుగైదు రోజుల నుండి ఏదో ఒక కార్యక్రమం చేస్తూనే ఉన్నరు ప్రజలు. ఒకరోజు మండల కేంద్రంల యమ్.ఆర్.ఓ. కార్యాలయం ముందు ధర్నాయితే, మరో రోజు హైవే రూట్‌ల బస్సులు ఆపడం, నిన్న ఊర్లకు వచ్చిపోయే బస్సులను నిలబెట్టడం, ఈ రోజు సర్పంచ్‌ను, వార్డు మెంబర్లను గ్రామ పంచాయితీ దగ్గర

నిలబెట్టి నిలదీస్తున్నరు.

మండలాధికారులొచ్చి పడావు పడున్న చేతి పంపులను ఆగమేఘాల మీద బాగు చేయించినా, వాటి నుండి చుక్కనీరు రావడం లేదు. ఎన్ని ఆలోచనలు చేసినా లాభం లేకుండయింది. చివరికి మిగిలిన మార్గాలు రెండే. ఒకటి ఊర్ల ఒకటో రెండో ఇంటి బోర్ల నుండి ఆడికాడికి వస్తున్న నీళ్ళు ఊరంతా వచ్చేటట్లు చూడటం, రెండోది ఊరు పక్కనే ఉన్న రాంరెడ్డిబాయిల నుండి పైపుల ద్వారా నీళ్ళను ఊర్లకు తీసుకురావడం. దీనివల్ల మొత్తం సమస్య తీరకపోయినా కొంతలో కొంతన్నా నీటి సమస్య తీరొచ్చు ఈ వేసవిలో.

"థూ, నీయవ్వా, ఈ ఊర్ల పుట్టి పెరిగినగాని గింత కరువు ఎప్పుడు సూడ్లే..." డెబ్బయి ఏండ్లకు పైబడిన ఓ ముసలాయన గట్టిగ అన్నడు గుంపుల నుండి.

అదే అదునుగా మల్లేశం అనే యువకుడు అందుకున్నడు.

"ఇపుడనుకుంటే ఏమొస్తది, చేసిందంత చేస్తిరి, ఇప్పుడు చూడు ఎట్ల కూర్చున్నరో పత్తిత్తులాగా..." కోపంతో సర్పంచ్, వార్డు మెంబర్ల వైపు చూస్తూ...

ఈ మాటల వాళ్ల చెవుల బడ్డ విని విననట్లున్నరు సర్పంచ్, వార్డు మెంబర్లు. నెల రోజులుగా ఇటువంటి మాటలిని విని మొద్దుబారిపోయి, దేనికి స్పందించని జడపదార్థాల్ల తయారయినరు.

ఈ సమస్యను ఎట్ల సమన్వయం చేయాలో అర్థం కావడం లేదు. వీళ్లకు ఈ శాస్తి జరగాల్సిందే. కొట్టడం ఒక్కటే లేదుగాని, సూటిమాటలతో వాళ్ల మొఖాల్లో నెత్తుటి చుక్కలేదు. నన్ను చూసి తలవాల్చినరు. ఎందుకువాల్చినరో వాళ్లకు నాకు అర్థమైన విషయమే, కానీ అందరికి తెలియాలి గదా...

సర్పంచ్‌తో సహా నలుగురు వార్డు మెంబర్లు నా పూర్వ విద్యార్థులే. తెలంగాణ ఉద్యమం తీవ్రమవుతున్న సమయంలోనే ఎన్నికలు రావడం, ఎన్నికలంటేనే సరిపడని నాలాంటోళ్లం తెలంగాణ ఆకాంక్ష తెలపటం కోసమన్న ఇంటింటికి తిరిగి అర్థం చేయించాల్సొచ్చింది. ఫలితంగ సర్పంచ్‌తో సహా ముగ్గురు వార్డు మెంబర్లు తెలంగాణ సమితోళ్ళు, ఒకటి సిపిఐ, మరొకటి సిపిఎం, మిగిలినవి కాంగ్రెసు, టిడిపి అభ్యర్థులు గెలుపొందినరు. అప్పటిదాక కాంగ్రెస్‌కు, టిడిపికి కంచుకోటగా ఉన్న ఆ ఊరు తెలంగాణ సమితి పరం కావడం సంచలనమే.

మహిళా అభ్యర్థులు మినహా మిగతా వాళ్ళందరు అనేక సార్లు సమస్యల మీద సలహాలు తీసుకున్నవాళ్లే. ముఖ్యంగా తెలంగాణ సమితి, సిపిఐ, సిపియం అభ్యర్థుల సాన్నిహిత్యం వల్ల తీవ్రంగా చర్చలు నడుస్తుండేవి.

"... వేరే పార్టీలకు ప్రజలపట్ల, సమాజం పట్ల బాధ్యత లేకపోవచ్చు, మీరట్లగాదు. మిమ్మల్ని ప్రజలు నమ్మి గెలిపించినరు. మనూరును కాపాడుకున్న వాళ్లవుతం. ఈ విషయంలో ఎంత పెద్ద ఎత్తున హైద్రాబాద్ నుండి ప్రయత్నాలు జరుగుతున్నయో మనకు తెలుసు. ఇటువంటి సందర్భంలోనే నిజాయితీగ నిలబడాలి మనం. రైతులు గూడ కలెక్టర్ దగ్గరకు పోయినరు. ఇసుక తవ్వొద్దని కలెక్టరు ఉత్తర్వులున్నయి. విప్లవం, తెలంగాణ రెండూ అవసరమే మనకు. కానీ, వాటిని అనుభవించడానికి వనరులుండాలిగ ముందు మనకు! అందుకే మనం వాటిని దేనికైన తెగించి కాపాడుకోవాలి..." వాగు ఊరుకు ఎంత ప్రాణాధారమో వివరిస్తూ ఉండేవాణ్ని.

పిల్లలకు పాఠాలు చెప్పినట్లు చెప్పినా ఫలితం లేకుండయింది. ఎం.ఎల్.ఎ., దగ్గరి నుండి ఇసుక మాఫియా పైరవీలు. డబ్బు మహత్యం, సర్పంచ్‌తో సహా వార్డు మెంబర్లంత లొంగిపోయినరు. వాళ్లను చూడాలన్న అసహ్యమనిపించ సాగింది. వాళ్లుగూడ నన్ను తప్పించుకొని తిరుగుతున్నట్టనిపించింది. ఊర్ల పరిస్థితులు వేగంగా మారుతున్నయి. అడిగే వాళ్లను లేకుండ చేస్తున్న కాలం, దోచుకున్నోనికి దోచుకున్నంత అన్నట్టున్నది. ఒక్కసారిగా నిరాశతో పాటు అనారోగ్యం ఆవహించినట్టయింది.

సర్పంచ్ కూర్చున్న దగ్గరకు వెళ్లాను. పక్కనే ఉన్న వార్డు మెంబర్ లేచి స్థలం చూపించాడు.

"ఈ వేసవిలో ఎట్లయిన ఈ గండం నుండి బయటపడెటట్లు చూస్తే బాగుంటది..." సర్పంచ్‌తో అన్న కూర్చుంటూ.

"అదే సార్. రాంరెడ్డి బాయి నుండి ఊర్ల టాంక్‌కు నీళ్లు ఎక్కిద్దామనుకుంటున్నం. ఎంఎల్ఎ గూడా..." సర్పంచ్ ఏదో చెప్పబోతుండగా, మరోసారి అందుకున్నడు మల్లేష్.

"ఎన్ని రోజులొస్తయనుకుంటున్నవు ఆ బాయిల నీళ్లు. నెలరోజులొస్తే మా ఎక్కువ. ఆ తర్వాత ఎట్ల?"

"ఎట్లేంది పక్కూరోని ఉచ్చతాగి బతకాల్సిందే ఇంగా..." కోపంతో ఓ నడీడు మనిషి అందుకున్నడు. అంత కోపం రాకపోవతనికి, వారం రోజుల నుండి స్నానం లేదు, గంపెడు సంసారానికి తాగడానికే నీళ్లు అతి కష్టంగా సంపాదించవలసి వస్తుంది.

ఈ మాటలు ఆడున్న వాళ్లందరినీ గట్టిగా తాకినట్టయింది. లోపలి నుండి ఆవేదన, ఆవేశాలు తన్నుకొస్తున్నా దీనికి ఎవరిని బాధ్యుల్ని చేయాలో అర్థం కావడం లేదు. మొత్తం మీద ఈ పరిస్థితికి కారణాలేమిటో వాళ్ల అనుభవంలోకి రాసాగాయి. ఈ సమయం కోసమే ఎదురుచూస్తున్నట్టుంది మల్లేశం, సరిగ్గా మేం కూర్చున్న

దగ్గరికొచ్చి పెద్దగా చెప్పడం మొదలుపెట్టిండు.

"వాగులున్న ఇసుకను జాగర్తగ కాపాడుకోవాలని అప్పుడు ఎంత మొత్తుకొని చెప్పితిరి వాళ్లు.* అవసరానికి ఊరోళ్ళు వాడుకోండిగాని, అడ్డగోలుగ పట్నానికి పోనియొద్దని ఈ అరుగుమీదనే మీటింగ్ పెట్టి మరీ చెప్పితిరి. ఇసుక లేకుంటే మనకు కరువొస్తదని అయిదారేండ్ల కిందట్నే చిలక్కు చెప్పినట్టు చెప్పితిరి. వాళ్ళున్నంత కాలం కుక్కిన పేనులా ఉన్నోడు, వాళ్ళు లేకుండ పోయేసరికి ఎవరిష్టమొచ్చినట్లు వాళ్లు చేసుకుంటిరి. ఇగో ఈ సర్పంచ్, వార్డు మెంబర్లు చేయబట్కెగదా ఈ పుణ్యమంత. ఇసుక కాంట్రాక్టర్లు, ఇష్టమొచ్చినట్లు తవ్వుకొని పోతిరి. తాటి చెట్లంత గుంతలు, పిడికెడు ఇసుక లేదు. ఒక చెట్టు చేమన్న లేదు. ఈ వాగు పొంటున్న ఊర్లల్లనే గిట్ల ఎందుకయిందో తెలుసా?" కొద్దిసేపాగి తిరిగి చెప్పడం మొదలు పెట్టిండు.

"వాగుల ఇసుక లేకపోవడం వల్లే గిదంత. గదే ఆలేరు వాగు పొంటున్న ఊర్లల్ల కరువు రాలే, ఎందుకంటే ఆ వూర్లల్ల ప్రజలు గట్టిగా నిలబడి ఇసుకను తవ్వనియ్యలేదు. మనం చేసుకున్న తప్పుకు ఫలితం అనుభవించాల్సిందే..." ఈ మాటలతో ఆలోచనల పడ్డరు ఆడున్నవాళ్ళు.

పదింటికే ఎండలు చిటపటలాడుతున్నయి. గ్రామ పంచాయితీ ముందు అన్ని వేపచెట్లున్నా ఉక్కబోతగా ఉంది. దాంతో చెమటలు కారుస్తున్నారు జనం. వేపచెట్ల నుండి వస్తున్న పూవాసన, చెమట వాసనలు కలగలిసి పోయి ఓ వింత స్థితి ఏర్పడినట్టయింది.

సరిగ్గా ఆ సమయంలోనే ఫిల్టర్ వాటర్ అమ్ముకుంట అక్కడికి చేరుకుంది ఓ ట్రాలి బండి. ఈ వూర్ల నీళ్లలేమి చుట్టుపక్కల గ్రామాల ఫిల్టరోళ్ళకు మంచి వ్యాపారమయింది. క్యాన్‌లలోని నీటిని చూసేసరికి మరిచిపోయిన దూప గుర్తుకొచ్చినట్లయింది.

"ఏం సర్పంచ్, గొంతెండుక పోతుంది. నీళ్లన్న ఇప్పియరాదు...' గుంపుల నుండి ఎవరో అన్నరు.

మారుమాటాడకుండ రెండు క్యాన్ల నీళ్ళు తీసుకున్నడు సర్పంచ్. దూపున్నోళ్ళు పోయి తాగొచ్చి కూర్చుంటున్నరు. చూస్తుండగానే నీళ్లన్ని అయిపోయినయి.

ఇండ్ల దగ్గర పనులేమీ లేవు. తీరిక చేసుకొనొచ్చి కూర్చుంటున్నరు జనం. గ్రామ పంచాయితీ ముందు దృశ్యం చూస్తుంటే సభనో, సదస్సునో అర్థంగాకుంటుంది. అడిగేటోళ్ళు అడుగుతున్నరు, మాట్లాడేటోళ్ళు మాట్లాడుతున్నరు. ప్రశ్నలు అక్కడి నుండే వస్తున్నయి, జవాబులు వాళ్లనుండే పుడుతున్నయి. ఏ పంద్రాగస్టుకో, రిపబ్లిక్

దేకో ఉపన్యాసాలు దంచే సర్పంచ్, వార్డు మెంబర్లు ప్రేక్షకులయ్యారు వాళ్లముందు.

ఇంత ఉద్విగ్నమున్న సమయంలో ఈ ఆలోచనలకు ముగింపో, కొనసాగింపో గాని, జనం మాటల్ని శ్రద్ధగా వింటూ, తెలంగాణ ఉద్యమంలో తీవ్రంగా పాల్గొంటున్న ఓ యూనివర్సిటీ విద్యార్థి ముందుకొచ్చి,

"ఈ తార్పుడు గాళ్లు చేయబట్టికే ఈ బాదంత మకు..." సర్పంచ్, వార్డు మెంబర్లనుద్దేశించి గట్టిగా అరవటంతో వాతావరణం నిశ్శబ్దంగా మారింది. తిరిగి ప్రారంభించిండు.

"ఇసుకతో వచ్చిన డబ్బులతో ఊరును మస్తు అభివృద్ధి చెయొచ్చంటిరి. ఊర్ల అందరికీ పని దొరుకుతుందని ప్రచారం చేస్తిరి. ఇప్పుడు ఏమయింది? అభివృద్ధి ఎవనికి జరిగింది? సైకిలున్న వార్డు మెంబరుగాడు సైకిల్ మోటారుగొనె, బైకున్నోడు కారును గొనె. వాస్తు బాగలేదని ఇండ్లను కూలగొట్టి మెరిసేటట్టు కట్టుకొంటిరి. వీళ్లకు మించినోళ్లు వీళ్ల మీదున్న ఎంఎల్ఎ, ఎంపి గాళ్లు తమకు లాభం ఉందనుకుంటే ఏదైనా చేస్తరు. వీళ్ల తప్పుడు పనులను మనం చూస్తూ ఊరుకున్నా, ప్రకృతి ఊరుకోదు. మన మీద ప్రతీకారం తీర్చుకుంటుంది. మన ఊర్ల జరిగిందిదే. ప్రకృతి వనరులను జాగ్రత్తగా కాపాడుకోకుంటే మొత్తం నాశనమవుతం..." ఏయే రాష్ట్రాలలో, దేశాలలో జాతీయ, బహుళజాతి కంపెనీలు కలిసి అడవులను, ఖనిజ సంపదను ఎట్ల కొల్లగొడుతున్నయో, అక్కడి ప్రజలు ఎట్ల నాశనమైతున్నరో లెక్కలతో సహా వివరించుకుపోతున్నడు.

ఆ విద్యార్థి చెబుతున్న వివరాలకు ఆశ్చర్యమనిపించింది. అకస్మాత్తుగా నేను ఏడకూర్చున్నానో అన్న జ్ఞానం కలిగిందప్పుడు.

"ఎందుకు సార్ లేస్తున్నరు, కూర్చోండి" లేవబోతున్న నన్ను సర్పంచ్ చేయి పట్టుకుండు ఆపటానికి.

"కొద్దిగా పనుంది మళ్ళొస్తాను..." అని చెప్పి వాళ్ల దగ్గర నుండి బయటపడి, వేరే వైపు కదిలాను. చాలా సేపటికిగాని నాకు అర్థంగాలే, వాళ్ల పక్కన కూర్చుని ఎంత పొరపాటు చేశానని.

"ఇంతకు వీళ్ల సంగతి ఏం చేద్దామో చెప్పుండ్రి ముందు?" కోపంతో ఎవరో ఒకతను అన్నడు.

"చేసేది ఏముంది, వీళ్లు ఏం చేస్తరో, ఎట్ల చేస్తరో పోయి ఎంఎల్ఎ, ఎంపిగాని కాళ్లు పట్టుకుంటరో ఊరు చుట్టుపక్కల ఏడ నీళ్ళు పడితే ఆడ బోరు ఏయించి ఊర్లకు నీరు తీసుకురావల్సిందే..." ఒకతను.

"అంతేగాదు, పుణ్యానికొచ్చింది గదాని మింగి కూర్చున్నరు. దేని దేనికి ఖర్చు పెట్టినరో లెక్కలు తేలేదాక ఎవన్ని వదలొద్దు ఈళ్లను..." ఇంకొకతను.

ఆవేశంలో నానా రకాల మాటలొస్తున్నాయి గుంపుల నుండి. ఎవరిని ఆపేటట్టు లేదు. ఎండకాలపు ఎండల్లాగే కుత కుత ఉడుకుతున్నరు జనం. ఆడ పరిస్థితి చూస్తుంటే, ఆ విద్యార్థి చెప్పినట్టు తార్పుడు గాళ్లంతొకవైపు, ప్రజలంతొకవైపు గిరిగీసినట్టున్నరు. ప్రజలు ఎప్పుడు ఇలాగే ఉంటే బాగుండనిపిస్తుంది. జనం మాటలింటూ కలియ తిరగసాగాను గుంపుల. ప్రజల మాటల వల్లో, వేపపూత వాసన వల్లో ఒకలాంటి మైకం కమ్మినట్టయింది నాలో.

చాలా రోజులుగ అనారోగ్యంతో, అస్థిర మనస్సుతో అలసిపోయి, 'ఊర్లల్ల ఏముందికా, అంతా అయిపాయెనన్న' నిరాశతో ఉన్న నాకు ఆ మల్లేశం, విద్యార్థి లాంటి అడిగేటోళ్లు ఇంకా ఊర్ల ఉన్నందుకు పోయేపాణం తిరిగొచ్చినట్టయింది..."

నోట్ : వాళ్ళు = అన్నలు

# రాళ్లు గొట్టి...

## బాసిత్

"హలో!"

"సార్. . ."

"ఎవరూ?"

"నేను మహేంద్రను, సార్!"

"ఏమైంది, మహేంద్ర? బాగేనా?"

"ఘోరం జరిగింది, సార్. . ."

"అయ్యో! ఏం జరిగిందీ?"

"మా కాలనీ గుడిసెల్నీ కూలగొట్టిండ్లు, సార్" అవతలి గొంతులో ఆందోళన.

"ఎందుకూ?"

"భద్రకాళి గుడి సుట్టూ ఇంకేవో కడతారట! అందుకోసం మా గుడిసెలను కూల్చేసిండ్లు, సార్ !" అట్నుంచి మహేంద్ర బోరున విలపిస్తున్న విషయం తెలుస్తూనే ఉన్నది.

"గుడిసె లన్నీకూల్చేసారా?"

"ఒక్కటి లేకుంట, సార్."

"ఇప్పుడెట్లా? ఏం చేయాలనుకుంటున్నారు?"

"దిక్కుతోస్త లేదు, సార్."

గూడు చెదిరి, గుండేలదిరిన స్థితిలో ఉన్న వాళ్ళతో ఏం మాట్లాడాలో, రఫీకి తోచలేదు.

"సరే, నే నక్కడికి వస్తున్నాను," రఫీకి అంతకు మించి అపుడు ఏం మాట్లాడినా ప్రయోజనం లేదనిపించింది.

* * *

మాగి ఎండ మొఖం మీద కొడుతోంది. పొద్దున ఎన్మిది గొట్టేదాక చలి వణికించింది. ఇప్పుడేమో ఎండ అదో మాదిరిగా వాయించేస్తోంది. వికాస్ నగర్ నుంచి యూనివర్సిటీ క్రాస్ మీదుగా బైక్ మీద చెరబండరాజు నగర్‌కు బయలు దేరిండు రఫీ. లాల్ బహదూర్ కాలేజీ వెనుక ఉన్న భద్రకాళి గుడి పక్కనే చెరబండరాజు నగర్ కాలనీ ఉంది. లాల్ బహదూర్ కాలేజిని చూడగానే రఫీ మనసెందుకో పులకరించింది. అదే కాలేజీలో రఫీ డిగ్రీ చదివిండు. కాలనీ చేరే సరికి పది నిమిషాలే అయినా అక్కడికి చేరేంత వరకు రఫీకి మనసున మనసు లేదు. కుప్ప కూలిన గుడిసెలను ముందేసుకొని కాలనీ వాసులందరూ గుండెలవిసేలా రోదిస్తున్నారు. రెండు, మూడు వందల మంది దాకా ఉన్నట్టున్నారు. పరిస్థితి బీభత్సంగా ఉంది. అక్కడే శ్రామిక సంఘాల సమాఖ్య నాయకుడు ప్రవీణ్ కూడా ఉన్నాడు.

"నైజామోడి కాలం నుండి ఈ చుట్టు పక్కలే బండ కొట్టికొని పడి చస్తున్నామయ్యా" ఒంటి మీద బుడ్డ పంచె తప్ప ఏమి లేని ఓ పెద్దాయన, 'బతుకు ఓ చావైంది' అన్నంత విరక్తితో మాట్లాడుతున్నాడు.

"నైజాం జమాన నుంచి అంటే? అందాజా ఎప్పటి నుంచి?" రఫీ సందేహం తీరక అడిగాడు.

"ఎనభై, తొంభై ఏళ్ల నుంచి ఈ కాలేజి వెనుకా, భద్రకాళి గుడి పక్కనా, గుడి చుట్టూ ఉన్న రాతి గుట్టలను పగల గొడుతూ, భూమి చదును చేస్తూ వీళ్ళు తమ తండ్రి, తాతల కాలం నుంచీ ఇక్కడే, ఈ చుట్టు పక్కలే రంగంపేట, పెద్దమ్మగడ్డ వీధుల్లోనే బతుకీడుస్తున్నారన్నా" ప్రవీణ్ వివరించాడు. ప్రవీణ్ కొంతకాలంగా శ్రామిక హక్కుల కోణంలో సామాజిక పరిస్థితులను అధ్యయనం చేస్తున్నాడు.

"మీ గుడిసెలు కూలగొట్టడంలో ఎవరి హస్తం ఉందని అనుకుంటున్నారు?"

"ఇంకెవ్వరిదయ్యా, ఆ బాపని దొరసాని అంజనమ్మ పనేనయ్యా"

"అంజనమ్మ ఎవరూ?"

"అంజనీ దేవి గారని, భద్రకాళి గుడి ఎగ్జిక్యూటివ్ అధికారిణి అన్నా" ప్రవీణ్ ఆమె గురించిన వివరం అందించాడు.

"గుడి అధికారిణి అవుతే కార్మికుల హక్కుల్ని హరిస్తుందా?"

"గుడి పక్కన, మాదిగోళ్ల ఇండ్లు ఉండొద్దట. . ."

"హాఁ! మరీ, ఇంత అన్యాయమా? పై అధికారులకు ఫిర్యాదు చెయ్యొచ్చు గదా?"

"వెనుకట ఓసారిలాగే జరిగితే, కలెక్టర్ కు చెప్పుకున్నం"...

"మరప్పుడేమయ్యింది?"

"అప్పుడే, మా 150 స్టోన్ కట్టర్స్ అసోసియేషన్ కుటుంబాలకు కలక్టర్ పట్టాలు రాసిచ్చిండ్లు".

"ఎప్పుడు?"

"పదేళ్లయ్యింది..."

"మరింకేం? చలో, పదండి, కలక్టర్‌కు ఫిర్యాదు చేద్దాం!" ప్రవీణ్ తొందర పెట్టసాగిండు.

ప్రవీణ్ ఈ మధ్య ఖిలా వరంగల్ కోట లోపటి కుమ్మరికుంట చెరువును కొందరు అధికార, ప్రతిపక్ష నాయకుల అండతో కబ్జా చేసుకొని రియల్ ఎస్టేట్ దందా చేస్తుంటే "కాకతీయ మిషన్" కింద చెరువును పునరుద్ధరించాలని పోరాడుతున్నాడు. అట్లాగే కొందరు దొంగ హక్కుల సంఘాల నాయకులు, ఆజం జాహి మిల్లు మూసి నందున ఉపాధి కోల్పోయినోళ్లకు పునరావాసం కింద ప్లాట్లు ఇప్పిస్తామని చెప్పి ఇప్పటికీ, జేబులు నింపుకుంటున్న వాళ్ల బండారం బయట పెట్టే పనిలో ఉన్నాడు. కాని సర్కారు, దళారుల కొమ్ము కాస్తూనే ఉంది. చెరువు చుట్టూ నీళ్లు చేరకుండా అడ్డుకొనే అక్రమ కట్టడాలను తొలగించాలనే పాత జీ.వో.ను కొత్త రాష్ట్ర మంత్రి వర్యులు హరీష్ ఎత్తేసినాడు.

"ఇప్పుడేం చేసినా అంజనమ్మ ఎత్తులకు పై ఎత్తులు ఏత్తది". ఇప్పటి దాకా ఏం పట్టనట్టు కూర్చున్న ఓ ముసలయ్య, జీవిత పర్యంతరం ఇట్లాంటి ఎన్నో సర్కార్ దురాగతాలను కళ్ళారా చూసిన అనుభవంలోంచి తన అంచనాను ప్రకటిస్తాడు.

"ఏహే ముసలోడ, నీకేం తెల్సు, మనం ముందుగాల కలకటేరు దగ్గరికి పోదాం పాంఢ్రి!" ఒకావిడ ఆశ చావక అందర్నీ కలియజూస్తూ అంటుంది.

"ఒహో! వయస్సు పిల్లో! ఆ అంజనమ్మ సంగతి నీకు తెలియదు. ఆమెకు, మట్టేవాడ సీ. ఐ. కి లింకున్నదీ"

"లింకంటే...? ఓ యువకుడి ఆరా.

"ఛ... ఛా...! పాపపు మాటలు మనకెందుకు? వాళ్ళిద్దరూ సుట్టాలైతరట!"

"సుట్టాలంటే? ఈమె లాగా సీ. ఐ. కూడా బాపనోడేనా?"

"మరేమనుకుంటాండ్లు?"

"వార్నీ! తాతా, నీకు చాలా సంగతులు తెలుసునే!"

"ముసలోడని ఎక్కిరిత్తివి గదా? గంతే గాదూ, గీ ఎల్బీ కాలేజోల్లు కూడా గీమే తోని కలిసింద్రని ఎరుకే గదా? మనం బండల్ గొట్టి సాపు చేసుకున్న ఏడెకరాలు,

ఈ కాలేజోళ్లు కబ్జా చేసుకున్నది ఎరుకే గదా? గా అంజనమ్మ, గీ ఎల్బీ కాలేజోళ్ళు ఒక్కటి కాకుంటా ఉంటారా? ఎల్బీ కాలేజోళ్లకు కేంద్ర సర్కారు నుంచి కూడా గవేవో యూజీసీ పైసలత్తయట గదా? గా వాటితోటి అధికారులను, రాజకీయ నాయకులను కొని మన ముడ్డి మీద తన్ని ఎల్లగొడుతరు."

"ఎల్బీ కాలేజీ యాజమాన్యానికీ మీ జాగానే కావాల్సి వచ్చిందా?" తను చదువుకున్న కాలేజీ యాజమాన్యానికి ఇంత దోపిడీ, దురాక్రమణ స్వభావం ఉందా? రఫీ దిగ్భ్రాంతికి గురయ్యాడు.

"మా రెక్కల కష్టానికి నోసుకున్నరు. గీ గుడీ, గా కాలేజీ అంతా మేం రెక్కలు, ముక్కలు చేసుకుంటేనే నిలబడ్డాయి. ఎనుకటి నుంచి గీ వంద ఎకురాల భూజాగంతా మేం కొట్టినదే. పెద్ద, పెద్ద కొండల్ని, గుట్టల్ని పగలగొట్టి సాపు చేసిత్తే గిప్పుడు మమ్మల్నే గింత గూడ నెనరు లేకుండా ఎల్లగొట్టాలని సూత్తాండ్లు. గీ మనుషుల కన్నా గా బండలు నయం."

"బడి, గుడి రెండూ మీ గుదిబండలయ్యాయి." రఫీ పరిస్థితిని అర్థం చేసుకున్నవాడుగా అన్నాడు.

"అంతే కాదయ్యా! మాకు 2003లో వచ్చిన పట్టాలను ఎల్బీ కాలేజీ యాజమాన్యం గుండాలను బెట్టి గుంజుకున్నదయ్యా!"

"నిజమా! ఇంత ఘోరమా! , అసలేందట, వాళ్ల ఉద్దేశం?"

"ఏముంది? కబ్జా చేసేయ్యటం...మాకు "లే-అవుట్" లేదని వాళ్లు లాక్కుంటారట!?"

"మీరు ఎవ్వరికి చెప్పుకోలేదా?"

"అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీకి 'లే-అవుట్' చేసివ్వమని అర్జీ పెట్టుకున్నాం."

"గుడ్. ఏమయ్యింది?"

"ఏమయ్యింది? ... గా అంజనమ్మ గింతాంతది కాదు. ఆలయ ప్రాంగణంలో అంటరానోళ్లకు, ముదనష్టపు ముస్లిం బాడుఖావ్లకు ఇండ్లు ఉండడం అపచారం కదా! అని అర్బన్ అధికారుల దగ్గర కొర్రి పెట్టింది."

"మీతో పాటు ముస్లింలు కూడా ఉన్నారా?"

"పది, పదకొండు ఇండ్లు, వాళ్లయ్ కూడా ఉన్నాయి."

"వాళ్ళూ, మేమూ ఎప్పుడైనా బక్క గొడ్డేదైనా దొరికితే కోసుక తింటం. వాళ్లే హలాల్ చేస్తరు. మాతో పాటే బండకొట్టే పని కూడా బరాబరే చేస్తరు."

"సరే, ఇంత గోస పెట్టిందా, అంజనమ్మ?"

"అంతటితో ఆగిందా, ఆ యమ్మా...."

"ఏం జేసింది?"

"చట్ట ప్రకారం గా కలక్టర్ ఆర్డర్ తోటి వచ్చిన పట్టాలను, చట్టప్రకారమే ఊడ పీకాలని ఎత్తుగడ వేసింది."

"అంటే...? ఏం చేసింది?"

"అది 1976 'రి-పీలింగ్' చట్టమట. దాని ప్రకారం, ఇచ్చింది ఎన్కకు తీసుకోవచ్చట. దాన్ని ముంగట బెట్టి అంజనమ్మ మా తోడుకలు ఒలిపిచ్చింది. 'బహు సక్కంది' కాదూ గా అంజనమ్మ."

రఫీ ఒక్కసారిగా షాక్ తిన్నాడు! ఈ ముసలాయన "రి-పీలింగ్" అంటే అర్థం తెలిసి మాట్లాడుతున్నాడా? లేక అనుభవించిన కష్టం వల్ల చట్టం అర్థాన్ని పోల్చుకుంటున్నాడా?

"షెడ్యూల్డ్ కులాలకు రాజ్యాంగం కొన్ని ప్రత్యేక హక్కులు ఇచ్చింది, కదా?"

"అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద మిగులు భూమిని ఇండ్లకు ఇవ్వొచ్చు, కదా? అని అడిగాం"

"ఏమన్నారు?"

"గుడి మిగులు భూమి", అర్బన్ ల్యాండ్ సీలింగ్ కిందికి రాదన్నారు"

"ఏంటీ? గుడి మిగులు భూమా!? గుడి ఎక్కడిది? గుడికి మిగులు భూమి ఎవరి నుంచి లాక్కొని ఇస్తరు? మీ భూమి.... మీరు, మీ తాత, ముత్తాతల కాలం నుండి బండలు కొట్టి సాపు చేసి ఇచ్చిన భూమి, మీది కాకుండా గుడి భూమి ఎలా అయ్యింది? అర్బన్ సీలింగ్ చట్టం దోపిడీకి ఎంత అనుకూలంగా ఉంది!? ఆశ్చర్యం!

రఫీ, మరో సారి షాకయ్యాడు. షాక్ బయటపడి, "ఇదెక్కడి చట్టం? ఎప్పుడి చట్టం?"

"నైజామోడి చట్టమట. 1908 నాటిదట."

"అంటే, 1976 నాటి పట్టణ భూ గరిష్ట పరిమితి చట్టం ద్వారా మీకేమైనా లబ్ది జరుగుతుందని, మీకు నిలువ నీడ లేకుండా చేయడానికి నైజాం బూజు పట్టిన చట్టాల దుమ్ము కూడా దులుపుతున్నారన్న మాట?!"

"అందుకే మా జాగాలకు మూడు ఎకురాలకు పైగా చొచ్చుకు వచ్చి కట్టిన గోడను అందరం కలిసి కూలగొట్టినం."

"మంచిపని చేశారు."

"గట్ల చేస్తేనే, ఇగ అప్పుడు, అందరు కలిసి చర్చలకు వచ్చిండ్లు."

“అందరూ అంటే?”

“ఎల్బీ కాలేజోళ్ళు, గుడి అధికారి అంజనమ్మ, వాళ్ళ మూతి నాకేటోల్లు వచ్చిండ్లు.”

“ఆఖరికి ఏమయ్యిందీ?”

“ఒకళ్ళ జోలికి, ఇంకొకళ్ళు వెళ్లొద్దు అని ఒప్పందం రాసుకున్నాం”

“ఎప్పుడు?”

“ఐదేళ్లయ్యింది.”

“మల్లిప్పుడేమయ్యింది?”

“చూసిండ్లుగా, అయ్యా! ఒప్పందాన్ని ఎవరు తుంగలో తొక్కిండ్లో?”

“ఆమెకు తగిన బుద్ధి చెప్పాలి” మౌనంగా వింటున్న ప్రవీణ్ నోరు విప్పిండు.

“మనం, ఆమెకు బుద్ధి చెప్పుడు కాదు. ఆమే, మనకు బుద్ధి చెబుతుందట.”

“ఎట్లా?”

“వరంగల్లులో నాలుగు రోజులు ఉండడానికి ‘కేసీయార్’ ఇక్కడికి అచ్చిండు కదా. రేపు గా ముఖ్యమంత్రితో ఇక్కడ భూమి పూజ చేపిస్తాదట. అందుకే ఇవ్వాళ మన ఇండ్లు కూలగొట్టించిందట.”

అప్పటి దాకా కడుపులో దాచుకున్న విషయాన్ని బయట పెట్టాడు.

“అంతా ప్లాన్ ప్రకారమే చేస్తుందన్నమాట.”

“మనమూ ప్లాన్ ప్రకారమే చేద్దాం” ముసలాయన ఏదో ఆలోచిస్తూ అనేసాడు.

“ఏం చేద్దాం?”

“ఏదో ఒకటి చేయాలి సార్!” అప్పటి దాకా సంభాషణ అంతా వింటున్న మహేంద్ర ముందుకు వచ్చి అన్నాడు.

“మీ చరిత్రంతా వింటుంటే ‘మంత్రాలకు చింతకాయలు రాలవని’ అర్థం అవుతుంది.”

“ధర్నా చేద్దామా?” మహేంద్ర, ప్రవీణ్ ఒక్కసారిగా అన్నారు.

“రేపు ముఖ్యమంత్రి భూమి పూజ చేస్తుంటే, అడ్డుకోవాలె.” ముసలాయన తన ఆలోచన బయట పెట్టిండు.

“రేపు ఎట్లైనా అడ్డుకోవాలె.” అందరూ మూకుమ్మడిగా అన్నరు.

“ఏం చేసినా, రేపే చేద్దాం అంటున్నారు, కనుక మీరంతా ఆలోచించి చెప్పండి,” అంటూ, ఇంటి నుండి ఫోన్ రావడంతో రఫీ వాళ్ళనుంచి సెలవు తీసుకొని బయలుదేరాడు.

ఎల్బీ కాలేజ్ దాటి వస్తోంటే, ఈ కాలేజ్ వెనుక ఇట్లాంటి ఇంకో కోణం

ఉందని రఫీకి మొదటిసారి తెలిసింది. తనకు విద్యార్థి రాజకీయాలు ఎల్బీ కాలేజ్‌లో చదువుతున్నప్పుడే పరిచయం అయ్యాయి. కాలేజ్లో సైన్స్ సెక్రెటరీగా పని చేసిన రాజ్ కిరణ్ ప్రభావంతో ఎన్నో విషయాల్ని అవగాహన చేసుకోగలిగిన దృక్పథం ఏర్పడింది. యాజమాన్యాలు ఎప్పుడూ దోపిడీ స్వభావాన్నే కలిగి ఉంటాయనేది మరోసారి రుజువయిందన్న మాట. తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలిలెవరో కాని, తాను చదువుకున్న కాలేజీకి పునాదేసిన శ్రామికులెవరో తెలుసుకోగలిగినందుకు రఫీ ఒక రకమైన అనుభూతికి గురయ్యాడు.

"కొండలు పగలేసినం
బండలనూ పిండినం
మా నెత్తురు కంకరగా
ప్రాజెక్టులు కట్టినం
శ్రమ ఎవడిదిరో
సిరి ఎవడిదిరో! ..."

చెరబండ గేయాన్ని 'హమ్' చేస్తూ రఫీ ఇల్లు చేరాడు. గడపలోనే అమ్మ ఎదురైంది. ఊరి నుంచి అమ్మ వచ్చిందని చెప్పడానికే రమీజా ఫోన్ చేసిందని అర్థం అయ్యింది. లేకుంటే ఇల్లు వదిలి ఎన్ని రోజులు వెళ్ళినా ఆమె తనను పట్టించుకోదు. అమ్మకు సలాములు చెప్పి వివరాలు అడిగాడు. మాటల నడుమ కొడుకులు ఉద్యోగస్తులైతే వాళ్ల తల్లిదండ్రులయిన వృద్ధుల పింఛన్ కట్ చేస్తున్నారని చెప్పింది. ఇప్పటికే వృద్ధులైన భార్యాభర్తల్లో ఎవరో ఒకరికి మాత్రమే ఫించను అమలు చేస్తున్నారు. దళితులకు కుటుంబానికి మూడెకరాల భూమి అన్నారు, కానీ ఇప్పటివరకు రెండు వందల పట్టాలు కూడా ఇవ్వలేదు. మరో పక్క కార్పోరేట్ శక్తులకు ఎన్మిది లక్షల ఎకరాలు కట్టబెట్టాడు. ఇంకా దేశ వ్యాప్తంగా భూస్వాముల దగ్గర ఎనభై లక్షల హెక్టార్ల భూములు భూ గరిష్ట పరిమితికి మించి ఉన్నాయని రకరకాల సర్వేలు చెబుతున్నా యంటారు. పేదలకు భూమి అంటే మాత్రం "భూమెక్కడుంది?" అంటారు. ఎన్నికల ముందు డబుల్ బెడ్ రూమ్ ఇల్లని తెలంగాణా జనాలను ఊహల్లో ఊపేసిన అయ్యవారు, ఎన్నికలయ్యాక, 'ఏరు దాటాక తెప్పతగలేసిన' సామెతను గుర్తు తెస్తున్నారు. రాత్రంతా ఇవే ఆలోచనలతోనే నిద్రపోయాడు రఫీ.

* * *

మహేంద్ర నుంచో ప్రవీణ్ నుంచో ఫోన్ వస్తుందని ఎదురు చూస్తు ఇంటి ముందు కూర్చున్నాడు, రఫీ. పొద్దెక్కింది. ఇంటి పక్కల వాళ్లంతా సకినాలు, గారెలు

గట్రా చేసుకునే ఏర్పాట్లలో ఉన్నారు.

"మీరు చేసుకోరా అన్నయ్యా? తమ లాగే పక్కింటిలో కిరాయకు ఉంటున్న అరుణ అడగడంతో, ఎందుకు చేసుకోం?" పరధ్యానంలో ఉన్నట్లు ఏదో ఆలోచిస్తూనే అనేసిండు, రఫీ.

ఇంతలో ఫోన్ మోగింది. ప్రవీణ్ గొంతు.

"అన్నా హనుమకొండ మండలాఫీసు పక్కన రోడ్డు వెంట అప్పటి కప్పుడు 'డబ్బాలు పెట్టుకొని' ముఖ్యమంత్రి ముందు "పేదోళ్ళుగా" బిల్డప్ ఇచ్చినోల్లందరికి పట్టాలు సాంక్షన్ చేసిండట. మనం కూడా దరఖాస్తు చేసుకుంటే మనకు కూడా పట్టాలు ఇస్తాడేమోనని కాలనీ వాళ్లు అంటున్నారు."

"మరైతే ధర్నా ఆలోచనను విరమించుకున్నారా?"

"ముఖ్యమంత్రి ఉద్దేశం తెలుస్తుంది, కదా, సార్?" ఈ సారి ఫోన్‌లోంచి మహేంద్ర గొంతు వినిపించింది.

"ఐదేళ్ల క్రితం కలక్టర్ ఎట్లాగూ పట్టాలు ఇచ్చి ఉన్నాడు కనుక, అది రిఫరెన్స్‌లో పెట్టి పట్టాలు పునరుద్ధరించమని అడగండి మరి."

"అట్లాగే, సార్!" మహేంద్ర ఫోన్ కట్ చేసిండు.

* * *

ఇంటి ముందరి ఏర్పాట్లలో రమీజా కూడా భాగం అయ్యింది. ఇంటి పక్క అరుణతో ఏదో ఒప్పందం కుదుర్చుకుంది. వాళ్ల చర్చల సారాంశంగా రమీజా నిర్ణయాత్మకంగా రఫీ వైపు వచ్చింది.

"అజీ, సునియే! బాహర్ జాకర్ లక్డియా ంలేకే ఆయింగే క్యా?" (బయటికి వెళ్లి కట్టెలు తెస్తారా?) రమీజా ప్రశ్నతో 'కుడితిలో పడ్డ ఎలుకలా' తయారయ్యింది, రఫీ పరిస్థితి. రమీజా కూడా సకినాలు తదితర పిండివంటల కార్యక్రమం తలపెట్టింది. చుట్టుప్రక్కల ఉన్న అందరూ పిండి వంటలు చేసుకుంటూ ఉంటే పిల్లలు అందరి ముఖాలు చూసుకుంటూ ఊరికే ఉండలేరుగా. గ్యాస్ ధర ఎన్మిది వందల యాభై రూపాయలు కావడంతో 'గ్యాస్ పొదుపు చర్యలో భాగంగా' కట్టెలతో సామూహిక పిండివంటల కార్యక్రమం పెట్టుకున్నారు క్యాంపస్ మహిళలు.

అక్కడ వాళ్ళు గుడిసెలు కూలిపోయి ఏడుస్తూ ఉంటే ఈవిడ ఈ కార్యక్రమం పెట్టడం ఎందుకో రఫీకి రుచించలేదు. చుట్టు పక్కల అందరూ ఇదే కార్యక్రమంలో ఉండడంతో కాదనీ అనలేక పోయాడు. పైగా రఫీ సకినాలను ద్వేషించేంత 'తెలంగాణవాది' కాక పోవడంతో రమీజాతో 'సరే' అని చెప్పి కట్టెలమండి వైపు

బయలుదేరిండు, సహాయంగా ఉంటాడని బైక్ మీద కొడుకు అక్రంను కూడా తోడు తీసుకెళ్లాడు.

కట్టెల కోసం బయలుదేరిండన్నమాటే కాని మది నిండా చెరబండరాజు నగర్లో కూలిన గుడిసెల దృశ్యాలే. రోడ్డు మీద ఎక్కడ జూసిన పోలీసులు, పారా మిలిటరీ బలగాలు కుప్పలు, కుప్పలుగా కనబడుతున్నారు. ప్రజలు కోరుకున్న తెలంగాణా అంటే ఇదేనా? తనకైతే ఒకప్పటి ఆటా, మాటా, పాటా బందైన తెలంగాణలా అన్పిస్తోంది. అంజనమ్మ బెదిరించినట్లు చెరబండ కాలనీలో 'భూమిపూజ' చేసి పేదల కడుపు కొట్టడు గదా, కేసీఆర్? ఆలోచనలు ఇలా సాగుతుండగానే కట్టెల మండి ఉన్న పాత బస్ డిపో వైపు పోనిచ్చిండు బైకును.

"మడుం కట్టెలు ఎంత?

"అరవై"

మడుం కట్టెలు తరాజు మీద ఏపాటి అనిపించలేదు. ఇంకో రెండు మడుమ్లు వేయించుకొని, దొరికిన తాడుతో కట్టుకొని బైక్ మీద పెట్టుకొని వెనుక కూర్చున్న అక్రంకు జాగ్రత్త చెప్పి ఇంటి వైపు తిరిగాడు. తీరా ఇంటి దాపుకొచ్చాక యూనివర్సిటీ క్రాస్ వద్ద పోలీసులు ఆపేశారు.

"ఏం తీస్కెల్తున్నారు?"

"కట్టెలు"వీటితో సర్కారుకు ఎసరు పెడతా మనుకున్టున్నారో ఏమో! మనుసులో అనుకున్నాడు, రఫీ.

"ఇంకా ఏవో తీస్కెల్తున్నారు" అంటూ అనుమానంగా బాక్స్, కవర్, జేబులు వగైరా వెతికి వదిలేశారు.

* * *

భయపడ్డట్టుగానే ముఖ్యమంత్రి పేదల గుడిసెలు కూలిన స్థలంలోనే భద్రకాళి గుడి విశ్రాంతిగృహాల కోసం భూమిపూజ చేశాడు. పేదల రెక్కల కష్టంతో చదును చేసుకున్న నేలలో పేదల పరాభవం! దరఖాస్తు ఇవ్వడానికి ముందుకు వచ్చిన వాళ్ల మీద లాఠి చార్జ్.... అంజనమ్మ బంధువు మట్వాడా సీ.ఐ. మాధవశర్మ, ఇక్కడ చురుకుగా కదులుతున్న మహేంద్ర, ప్రవీణ్‌లను గుర్తుపట్టి చితకకొట్టాడు. "పవిత్రమైన ఆలయ ప్రాంగణమ్లో ఇండ్లు కట్టుకుంటార్రా, మాదిగ లంజాకొడకల్లారా? ఏసి పారేస్తా నా కొడకల్లారా! పీక్కోలేని కేసు పెట్టి జీవితాంతం వెంటబడతా...... సీ.ఐ. పెట్రేగిపోయిండు.

* * *

ఆ రోజు **వీ6** చానల్‌లో "ఎన్నికల ముందు డబుల్ బెడ్ రూం ఇల్లు వాగ్దానం

చేసిన ముఖ్యమంత్రి, వరంగల్ లో ఇల్ల స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న దళితుల్ని ఈడ్చిపారేసిన ఉదంతం" ప్రసారం అయ్యింది.

* * *

తెల్లవారి దినపత్రికల్లో "దేవాలయ భూములను, వక్ఫ్ భూములను ప్రభుత్వ భూములుగా ప్రకటించి పేదలకు పంచాలి" అని ఉత్తర తెలంగాణ ప్రతినిధి ప్రకటిస్తాడు. అప్పుడే అక్కడికి చేరిన రఫి ఆకాశం మీదికి ఎకబాకుతున్న ఎర్రటి పొద్దును తిలకిస్తూ సాగిపోతున్న మహేంద్రను గమనిస్తాడు.

# కుక్క

## పి. వరలక్ష్మి

ఆదివారం ఉదయం బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. చలి ముదిరేకాలం కావటంతో ఎంతకూ చీకట్లు విచ్చుకోలేదు. ఎనిమిది కావస్తున్నా మంచం దిగడానికి మనసొప్పని బద్ధకాన్ని మనసారా ఆస్వాదిస్తున్నారు మగవాళ్ళు. రోజూ ఉండే పనే అయినా పరుగులు పెట్టకుండా నింపాదిగా కదులుతున్నారు ఇళ్ళాళ్ళు. పిల్లలు మాత్రం ఎప్పుడో లేచి ఆటలకు తయారైపోయారు. స్కూళ్ళు లేకుంటేనే తొందరగా లేవబుద్ధైతాది వెధవలకు అని పెద్దవాళ్ళు విసుక్కుంటున్నారు. వీధి చివర పిల్లసైన్యం సమావేశమైంది. జట్లు జట్లుగా ఎవరి ఆటల్లోకి వాళ్ళు దిగిపోయారు. ఒక గుంపు కాస్త దూరంగా పోయింది. మూడు కర్రలు పాతారో లేదో ఎక్కడి నుండో సన్నగా ఒక వింత శబ్దం వినపడసాగింది.

“బాబోయ్ దెయ్యం” బాలూ, బ్యాటూ పడేసి పరిగెత్తబోతుంటే ఒక పిల్లవాడు అటునుండే పరిగెత్తుకుంటూ వచ్చి “అక్కడెవరో ఏడుస్తున్నార్రా” అని ప్రకటించేశాడు.

వాళ్ళు పెద్దవాళ్ళు కాదు కదా. పోవాలో వద్దో నిర్ణయించుకోడానికి ఎక్కువ సమయం పట్టలేదు. రెండు నిమిషాల్లో శబ్దం వస్తున్నవైపుకు పరిగెత్తారు.

తుప్పల్లో నుంచి ఏదో మూలుగు వినిపిస్తోంది. క్షణాల్లో పదిపదైదు మంది పిల్లల గుంపు బిలబిలా పోగయ్యారు. కంపచెట్ల మధ్యలో ఉండలా చుట్టుకొని ఒక జీవి పడి ఉంది.

“కుక్కపిల్ల” “కుక్కపిల్ల కాదు, కుక్కే” నిజానికి దాని వయసు కుక్కపిల్లకూ, కుక్కకు మధ్యలో ఉంటుంది. ఇంగ్లీషులో చెప్పాలంటే పప్పీకీ, డాగ్‌కీ మధ్యలో. నలుపు, అక్కడక్కడా గోధుమరంగు కలిసిపోయిన దాని చర్మం అనేకచోట్ల దోక్కుపోయి ఎర్రగా కమిలిపోయి ఉంది. రక్తంకారి గడ్డగట్టుకు పోయిన చెవి ఎడమవైపు వేలాడుతోంది.

“ఇది రోజూ మన వీధిలో తిరిగే కుక్కేరా, పాపం ఏదో గుద్దేసింటాది. దెబ్బలు బాగా తగిలినాయ్” ఒక పిల్లవాడు దాన్ని పోల్చుకున్నాడు.

“అవును. నిన్న మా మమ్మీ చెప్తే దానికి నేనే అన్నం పెట్టినా” అంది రెండు జడల అమ్మాయి.

“మా ఇంటి దగ్గరే మొరుగుతా ఉంటే ఎవరో కొట్టినారు. అది కుయ్యో, కుయ్యో అని చానా సేపు మొరిగింది,” వాళ్ళలో కాస్త పెద్ద పిల్లవాడు చెప్పుకొచ్చాడు.

ఆ పిల్లవాడు చెప్పింది నిజమే. పోయిన రాత్రి జనం కేబుల్ టీవిలు కట్టేసి నిద్రకుపక్రమించే సమయమది. ఆ వీధిలో అక్కడక్కడా మిగిలిపోయి పడేసిన అన్నం తిని చలికి ఉండచుట్టుకొని పడుకుందా కుక్క. తల్లిపాలు మానేసింతర్వాత ఆ వీధిలోకి ఎలాగో వచ్చి పడింది. అదే దాని ప్రపంచం అయింది. అది ఎదిగే కొద్దీ తిన్న అన్నానికి విశ్వాసం చూపించడం మొదలుపెట్టింది. కొత్తవాళ్ళని చూస్తే మొరగడం, ఈ మధ్య వెంటపడటం కూడా నేర్చుకుంది. అదే దాని చావుకొచ్చింది.

వంకరగా తూలుతూ వస్తున్న ఓ మనిషికేసి మొరిగింది. ఆ మనిషి అప్పుడు మనిషిలా లేడు. తాచుపాములా బుసలు కొడుతున్నాడు. చారల ఉన్నిచొక్కాలోంచి ఎగదన్నుకొచ్చిన బొర్రలో అతను అగ్నిపర్వతమే మోస్తున్నట్టున్నాడు. అతని కళ్ళు అగ్నిగోళాల్లా మండుతున్నాయి. అతని బండపెదాలు ముద్దముద్దగా ఏదో వదరుతున్నాయి.

తక్కిన శరీరంతో సంబంధం లేనట్టు అతని బలమైన చేతులు వెడెల్పాటి భుజాల నుండి ఊరికే అలా వేలాడుతున్నాయి. మొద్దుల్లాంటి కాళ్ళు చిత్రమైన భంగిమల్లో స్లోమోషన్‌లో నాట్యం చేస్తున్నాయి. అంతకు ముందు గంట క్రితం ఆ మనిషి అచ్చం ఈ కుక్కలాగే పెద్దసారు ముందు నిలుచున్నాడు. తోకలేదు కాని తోకూపుతున్నట్టే నిలుచున్నాడు. అతని గలీజు మాటలకు మీదికి దూకాలని ఉన్నా తమాయించుకున్నాడు. ఆ రోజుకి ఇవ్వాల్సిన కాయితాలేవో ఇచ్చేసి బైకులో బర్రున ఇంటికొచ్చేశాడు. ఇంట్లో ఉండబుద్ధికాక, తినబుద్ధికాక మండుతున్న ఒంటిని మరికాసేపు చలిగాలిలో చల్లబరిచాడు. సలసల కాలుతున్న మనసునూ సేదదీర్చడానికి కాలుతున్న కడుపులోకి ఏవేవో ఒంపుకున్నా పెద్దగా లాభం లేకపోయింది.

ఆ కుక్కకు ఇవేవీ తెలీవు. ఎవరితో పెట్టుకోవాలో ఎవరితో పెట్టుకోకూడదో విచక్షణ ఉండటానికి అది మనిషి కాదు కదా! దాని డ్యూటీ అది నిజాయితీగా చేస్తోంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న మనిషికైతే కడుపులో మంట పెట్రోలు పోసినట్లు భగ్గుమంది. చేతిలో ఏమీ లేదు కానీ, ఉండింటే ఆ కుక్కది కుక్కచావే.

అయితేనేం, కసినంతా కూడదీసుకొని బూటుకాలితో దాని డొక్కలో బలంగా తన్నాడు. అది కుయ్యో కుయ్యోమని కూలబడిపోయింది. తృప్తి తీరలేదు. మళ్ళీ తన్నాడు. అది మళ్ళీ కుయ్యో అంది. ఈసారి కూత పడిపోయింది.

"ఏం చూసుకునే నీకింత కొవ్వు..." నోట్లోంచి బూతుల వరద పారింది. కానీ ఎదురుగా ఉన్నది కుక్క కదా. అతని గోల దానికి అర్థం కాలేదు. తల తిప్పేసుకొని చిన్నగా మూలిగింది. అది అతనికి ధిక్కారంలా కనిపిస్తుందని దానికి తెలీదు. ఆ మనిషి దాని తోక పట్టుకొని ఆరడుగులు పైకి లేపాడు.

ఇద్దరి ముఖాలూ ఇప్పుడు ఎదురెదురుగా ఉన్నాయి. అది కొట్టుకులాడింది. మళ్ళీ మొరిగింది. ఈసారి నరాలు బిగబెట్టినట్లు బాధగా. అతడు నవ్వాడు. గట్టిగా నవ్వాడు. తృప్తిగా నవ్వాడు. దాని తోక అలాగే పట్టుకొని గిరగిరా తిప్పి వదిలేశాడు. ఇక అది కనిపించలేదు. అతడు దర్పంగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయాడు.

* * *

"ఒరేయ్, పాపం రా. చచ్చిపోతుందేమో!" "ఏదో ఒకటి చేద్దాం రా" అనుకున్నారేగాని కట్టుకట్టడానికైనా ఒకటీ అరా దెబ్బలు కావు. ఆ వీధిలోనుండి అటుగా పోతున్న ఒక పెద్దాయన పిల్లల గుంపును చూశాడు. వాళ్ళ వాలకం చూసి ఆయనకేదో అనుమానమొచ్చింది. ఏమైందని ఒక పిల్లవాడిని అడిగిన వెంటనే పిల్లలందరూ గోలగోలగా విషయం చెప్పారు. ఆయనను చూస్తే ఏమైనా చేయగలడనిపించింది వాళ్ళకు. అతడు కుక్కకు దగ్గరగా పోయాడు. రెండు చేతులతో దాన్ని దగ్గరికి తీసుకున్నాడు. నీళ్ళు తెమ్మన్నాడు. నలుగురు వెళ్ళారు పరిగెత్తుకుంటూ. గుంపుగా చుట్టుకున్న పిల్లల మధ్యలో ఆతడు దాని నోట్లో కొద్దికొద్దిగా నీళ్ళు పోశాడు. అది సగం గ్లాసు కూడా తాగలేదు. "తాతా, డాక్టరుకు చూపిద్దాం. కుక్క డాక్టరుకు" అంది ఒక పిల్ల. కుక్క డాక్టరు కాదు, పశువుల డాక్టరుకు. సవరించాడు ఇంకో పిల్లవాడు. పెద్దాయన చిన్నగా నవ్వాడు. దానికి మందు తెప్పించాడు. గాయాలను శుభ్రం చేసి మందు రాయాసాగాడు. ఇంతలో బర్రున శబ్దం చేసుకుంటూ ఒక బైకు వాళ్ళను దాటుకుంటూ దూసుకుపోయింది.

"అతనే", అన్నాడో పిల్లవాడు. "అతనే నిన్న దీన్ని కొట్టింది" వేలుపెట్టి చూపించాడు. అది బాధగా అరుస్తున్నప్పుడు బైటికొచ్చి చూసింది ఈ పిల్లవాడే. పెద్దాయన అతన్ని పోల్చుకున్నాడు. కుక్కను తీసుకొని నేరుగా అతను పనిచేస్తున్న పోలీస్టేషన్‌కు పోయాడు. పిల్లలూ ఆయనను వెంబడించారు. కుక్కను కొట్టిన పోలీసాఫీసర్‌పై కేసు రాయమన్నాడు.

అక్కడున్నవాళ్ళు అతన్ని వింతగా చూశారు. నవ్వారు.

"పనీపాటా లేకపోతే సరి. పోవయ్యాపో. కేసంట కేసు!" కసురుకున్నారు.

"కుక్కను కొడ్తే కేసా. ఇంతలావు మనుషులకు దిక్కులేదుగాని!" అన్నది ఎవరో నిజంగా దిక్కులేని మనుషిలా ఉన్నాయన్నారు. పెద్దాయన పట్టుబట్టాడు. "దేన్నయినా కొట్టే హక్కు ఎవరిచ్చారన్నాడు". "హింస నేరం కాదా" అన్నాడు. "అడిగే వాడు లేడని కుక్కయితే మాత్రం చంపేస్తారా?" అని గట్టిగానే అడిగాడు. గట్టిగానే ఏమిటి, దిక్కులు దద్దరిల్లేలా అన్నాడు. జంతువుల్ని హింసించడం నేరమని ఏఏ చట్టాలు చెప్తాయో కూడా చెప్పాడు. 'న్యూసెన్స్' భరించలేక అతన్ని బైటికి తోశారు. పిల్లలు గోలగోలగా అరిచారు. ఆయనా ఊరుకోలేదు. స్టేషన్ ఎదురుగా రోడ్డుపై కూర్చున్నాడు. ఆయనకు తోడు పిల్లల గుంపు. విషయం తెలుసుకున్న జంతుహక్కుల సంఘాలవాళ్ళు నిమిషాల్లో అక్కడికి చేరుకున్నారు. పిల్లల అరుపులు, మీడియా హడావిడి తోడయ్యి ఆ ప్రాంతమంతా సందడిగా తయారయ్యింది.

'ఫలానా ఆఫీసర్‌పై కేసు నమోదు చేయాలి'. 'ఫలానా ఆఫీసర్ బైటికి రావాలి' అంటూ నినాదాలు మొదలయ్యాయి. రోడ్డుమీద పోతున్నవారు చోద్యం చూస్తూ నిలబడటమో, చూపు ఇటుతిప్పి వేగం తగ్గించి నెమ్మదిగా పోవటమో చేస్తున్నారు. ఎవరోగానీ విచారించి విషయం తెలుసుకోవడం లేదు. తెలుసుకున్న వాళ్ళు నోళ్ళువెళ్ళబెడుతున్నారు.

దూరం నుండే చూపు లగ్నం చేసి వస్తున్న ఒకామె నేరుగా పెద్దాయన దగ్గరికే పోయింది. వయసు ముప్పైఅయిదు, నలభై మధ్యలో ఉంటుంది. మధ్యతరగతి వాలకం. సన్నగా పాలిపోయిన రంగులో ఉంది. ఏం జరిగిందని అడిగింది. కుక్కను చూపించి విషయం చెప్పాడాయన. దానికి చేసిన సపర్యల వల్ల అప్పటికది కాస్త తేరుకుంది. బతికి బైటపడినట్లే. పెద్దాయన చెప్పేది ఆమె ప్రశాంతంగా విన్నది. పెద్దగా ఆశ్చర్యపోలేదు. పైగా ఇలాంటిదేదో జరగవలసిందే అన్నట్టుగా ఉన్నాయి ఆమె భావాలు. సాంతం విని, "నిజమే పెద్దాయనా, నువ్వు చెప్పేది రైటే. కుక్కయితే మాత్రం ఇంత దారుణంగా కొడ్తాడా. అడిగేటోళ్ళు లేరని!"

"నువ్ బాగా అర్థం చేసుకున్నావమ్మా. ఇట్లాంటివి చూస్తొ ఊరుకోగూడదు." పెద్దాయన పక్కనున్న ఒక పెద్దమనిషి కళ్ళు పెద్దవి చేసి తల కిందికీపైకి ఊపుతూ అన్నాడు. ఆమె అతనివైపు ఒకసారి చూసి అవునన్నట్టు తలూపి మళ్ళీ పెద్దాయన వైపు తిరిగింది.

"కుక్కను కొడ్తే ఇంత కొట్లాడ్తున్నారు గదా... నన్నయితే మా ఆయన రోజూ

కుక్కను కొట్టినట్లే కొడ్తడు. నా బాధ ఎవరికి జెప్పన్లే పెద్దాయనా...!" నిట్టూర్పు విడిచింది.

ఆమె కళ్ళలోకి ఆదరంగా చూశాడాయన "ఎవరుమ్మా నువ్వు? యాడుంటావు? చెప్పు. నీ భర్త ఎవరు? ఏం చేస్తంటాడు? చెప్పమ్మా."

ఆమె మౌనం పాటించింది. ఆయన వదల్లేదు. కుక్కనుకొట్టడమే తప్పంటన్నాం. మనిషిని, అందునా ఆడమనిషి కొట్టడం ఇంకెంత తప్పు అన్నాడు. ఓర్పు కూడా తప్పుల్ని ప్రోత్సహిస్తుందన్నాడు. ఆమె నోరు విప్పేవరకూ ఆయన వదల్లేదు.

"ఏం చెప్తానయ్యా! ఈ కుక్కను కొట్టినోడే రోజూ నన్ను కొట్టేది...!"

"ఆ...!!!" "అయితే నువ్వు గూడా వచ్చి కూర్చోమ్మా."

వెంటనే తేరుకొని ఎటువంటి తడబాటూ లేకుండా అన్నాడు పెద్దాయన.

(రాయలసీమ పౌరహక్కుల ఉద్యమకారుడు ఎం.జె.సుబ్బరామిరెడ్డి తడారని జ్ఞాపకానికి.)

# గూటికి చేరిన వేళ

డా॥ పి. విజయలక్ష్మి

జమున బస్సు దిగి ఇంటివైపు కదిలింది. వారం రోజుల నుంచి లంఖణాలు చేసినట్లుగా ఉంది శరీరం. ఆవేశపడి చిన్నబుచ్చుకొని మధ్యాహ్నం నుంచి నలిగీ నలిగీ మనసు నీరసపడిపోయింది. అది శరీరాన్నీ చుట్టేసింది. అడుగుల లెక్క సాగిపోతూ ఉంది గాని ఇల్లు రావటం లేదు. ఉదయం ఐదు నిమిషాల్లో ఇంటి నుంచి బస్సులోకి చేరగలిగేంత దూరమే.

అబ్బా... గోల... పాడె పిల్లలగోల. గేటు కూడా దాటిపోతూ... ఇంటి దగ్గరా ఇదే దరిద్రం. పారిపోవాలి. ఎటో దూరంగా... తలబద్ధలై పోతోంది... ఇనప ముద్దలు కట్టుకొన్నట్లు కాళ్ళు సాగవే... ఒకటీ... రెండూ... మెట్లమీద కాళ్ళీడుస్తోంది జమున.

ఇంటి ముందు పెద్ద పిల్లల గుంపు పచాయితి. కూర్చొని వంగొని నిల్చొని... మధ్యలో పిల్లల కోడిలాగ రాజమ్మ, గొంతు మాత్రమే వినిపిస్తూ... తీసే ఓపిక కూడా లేనట్లు అలాగే తలుపుకు ఆనుకొని పిల్లల వైపు దీర్ఘంగా చూస్తూ ఉండిపోయింది. జమున ఎప్పటికో పిల్లాడు గట్టిగా తగలడంతో ఈ లోకంలోకి వచ్చినట్లుగా ఇంట్లోకి కదిలింది. బ్యాగ్ పక్కన పడేసి సోఫాలో చేరగిలపడి కళ్ళు మూసుకున్నది. పది నిమిషాల తరువాత నిధీ రాజమ్మ లోపలికొచ్చారు.

"సంతోష్ చెప్పేది నిజమేననిపిస్తోందమ్మమ్మా! వాడిలాంటి పనులు అస్సలు చెయ్యడు. అమ్మో! వాళ్ళ డాడీకి తెలిస్తే... పాపం సంతోష్" నిధి ఏదో గుర్తొచ్చినట్లు గుండెలమీద చేతులేసుకొని భయంగా చూసింది.

"ఏం కాదులే నేను చెబుతాగా"

రాజమ్మ జమునవైపు పరిశీలనగా చూసి బ్యాగ్‌లో నుంచి టిఫిన్ బాక్సులు తీసుకొని వంటగదిలోకెళ్ళింది. టీకి డికాషన్ పెట్టి పాలు వేడి చేసి నిధికి తెచ్చిచ్చింది.

జమున గ్లాసువైపు చూసింది.

"రాగానే ఆటల్లో పడిందిలే."

రాజమ్మ న్యూస్‌పేపర్ తీసుకొని పెన్సిల్‌తో గుర్తుపెట్టిన అంకెలు చూపిస్తూ "ముందు మూడంకెలకి తరవాత రెండు రెండంకెలకి కామా పెడతారన్నావుగా ఇదేందిట్ట మూటి మూటికుంది" అంది.

జమున ఆ వార్త వైపు అలాగే చూస్తూ ఉందిగాని సమాధానం చెప్పలేదు.

"నాకు తెలుసు నేన్జెబుతా... నేన్జెబుతా మిలియన్లలో లెక్కపెట్టాలి" నిధి ఉత్సాహపడింది.

రాజమ్మ పేపర్ నిధి చేతికిచ్చింది. టీ తెచ్చి జమునకిచ్చి తనోకప్పు తీసుకొని నిధి పక్కన కూర్చున్నది. ఆ పిల్ల తన పాండిత్యమంతా అమ్మమ్మకి చూపిస్తోంది.

గబుక్కున తలుపు నెట్టి నవీన్ ముఖం ముందుకి నిక్కబెట్టాడు. ఏదో అతి కీలక విషయం తెలుసుకొన్నట్లుగా ముఖం వెలిగిపోతూ ఉంది.

"అమ్మమ్మో అస్సలు నరేన్‌గాడే" జమున వైపు సందేహంగా చూస్తూ తరవాతి మాట నమిలేశాడు. రాజమ్మ లేచి బైటికి నడిచింది. వెనకే జమునవైపు చూస్తూ నిధి పిల్లిలా కదిలింది.

పావు గంట తరవాత ఇద్దరూ వచ్చారు. జమున ఇంకా అలాగే కూర్చోనుంది.

"వంట్లో బాగాలేదు" రాజమ్మ జమునను పరిశీలనగా చూపింది. జమున ఉలిక్కిపడి చూసి ఏమీ లేదన్నట్లుగా తలూపింది.

"మరి కాలేజీలోనా"

జమున ఏం మాట్లాడలేదు.

కాసేపు తరవాత జమున లేచి బెడ్‌రూమ్‌లోకెళ్ళింది. బట్టలు మార్చుకొని చల్లటి నీటితో ముఖం కడుక్కున్నది. కొంచం తేలిగ్గా అనిపించింది. బ్యాగ్‌లో నుంచి వీకెండ్ ఎగ్జామ్ పేపర్స్ తీసి దిద్దసాగింది. నెలనుంచి ట్యూటర్ లేరు. ఈ అదనపు హింసని తట్టుకోవటం కష్టంగా ఉంది. పెన్ను వేగంగా సాగటం లేదు. కళ్ళు చూస్తున్నాయిగాని విషయం మనసు దాకా వెళ్ళటం లేదు. చదివిందే మళ్ళీ మళ్ళీ వెనక్కి తిరిగి చదవాల్సి వస్తోంది. రేపటి లోపల మార్కులు ఎంటర్ చెయ్యకపోతే బోనులో నిలబెట్టినట్లు ప్రశ్నలు. తల విధిలించి జమున పైకి లేచింది. అటూ ఇటూ తిరిగి టీపాయ్ మీద పేపర్ తీసి షెల్ఫ్‌లో పేపర్లపైన పెట్టింది. సోఫా మీదున్న క్లాత్ సర్దింది. బెడ్‌రూమ్‌లోకెళ్ళి బీరువా తెరిచి చూసింది. బట్టలన్నీ పద్ధతిగా సర్ది ఉన్నాయి. వాటినే మళ్ళీ సరిచేసింది. మంచినీళ్ళు తాగివచ్చి పేపర్లు తీసుకొన్నది.

"మొత్తానికి చలి కాచుకొన్నారు పో"

రాజమ్మ మాటలకి జమున తలెత్తి చూసింది. దిష్టి బొమ్మని తగలబెడుతూ జనమంతా చుట్టూ చేరి అరుస్తున్నారు. మెడలో పార్టీ కండవాలున్నాయి. దేని గురించో తెలీక జమున టీవీవైపే చూస్తోంది.

"వాటాల్లో తేడా వచ్చుంటది కాకపోతే ఇంకేంది" రాజమ్మ చానల్ మార్చింది. జమున మళ్ళీ పేపర్లు దిద్దడంలో పడిపోయింది.

"అయ్యయ్యో వీళ్ళకేం పొయ్యే కాలం"

పొలాల్లో జనం పరిగెత్తుతున్నారు. బక్కచిక్కినోళ్ళు. పనికీ ఎండకీ కాగికాగి ఎండి మసకబారినోళ్ళు... పిల్లా పెద్దా ఆడా మగా తేడా లేకుండా బతుకుజీవుడా అనుకొంటా అడ్డదిడ్డంగా పరిగెత్తుతున్నారు. పోలీసోళ్ళు దొరికినోళ్ళని దొరికినట్లు చావగొడుతున్నారు. నిధి అమ్మమ్మని గట్టిగా పట్టుకొని బిత్తరపోయి టీవీవైపు చూస్తోంది.

"అమ్మో... బ్లడ్... బ్లడ్" ఆ పిల్లకి ఏడుపొచ్చేసింది.

రాజమ్మ ఛానల్ మార్చి రిమోట్ నిధి చేతికిచ్చేసింది. కళ్ళు మూసుకొని కుర్చీలో వెనక్కి వాలింది. జమున ఎటో చూస్తూ అలాగే ఉండిపోయింది.

కాసేపు తరవాత జమున లేచి బాల్కనీలోకొచ్చి నిలబడింది. ఎదుటి ఫ్లాట్ రాధిక వంటగదిలో హడావుడిగా తిరుగుతోంది. ఇంకా బట్టలు కూడా మార్చుకోలేదు. బంధువులు వచ్చినట్లున్నారు.

వరసగా పేర్చిన కుండీల్లో పూలమొక్కలు ఆకుకూరలు కళకళలాడుతున్నాయి. మందార మొక్కకి రెండు పూలు ఎండి వేలాడుతుంటే తీసేసింది. కొత్తిమీర కుండీలో గడ్డిపోచ కనిపిస్తే చెయ్యి పట్టింది. ఆ వాసన గట్టిగా ముక్కులకి తాకింది. మొక్కల్ని చూస్తూ కొద్ది సేపు నిలబడి లోపలికొచ్చింది. నిధి ఛానల్స్ మురుస్తూ ఉంది. కూర్చొని పేపర్లు చేతిలోకి తీసుకొన్నది.

జమున ఎప్పుడో తలెత్తి చూసేసరికి 'నీయో' అక్వేరియం ట్యూబ్‌లో ఫీట్లు చేస్తోంది. బైట పడటానికి సతమతమౌతోంది. ముద్దొచ్చే ఆ కళ్ళలో ఎంత భయమో. ఇద్దరూ సినిమా చూడ్డంలో మునిగున్నారు. జమున తన పనిలో పడిపోయింది. ఆ కట్ట పూర్తి చేసి పక్కన పడేసి సినిమా చూస్తూ కూర్చుంది.

నీమో నాన్న మార్లిన్ సముద్రంలో తాబేళ్ళతో కలిసి జుయ్‌మని దూసుకు పోతున్నాడు గిరికీలు కొడుతున్నాడు. నిధి కుర్చీలోంచి ఉబికుబికి చప్పట్లు కొడుతోంది. ఆ పిల్ల ఈ సినిమాను ఎన్నిసార్లు చూసినా మొదటిసారి చూసినట్లే ఆనంద పడుతుంది.

జమున వంటగదిలోకెళ్ళి గోరుచిక్కుడు కాయలు తెచ్చుకొన్నది. కాయలు చూసి రింజమ్మ లేవబోయింది. వద్దన్నట్లుగా తలూపి వలుస్తూ కూర్చుంది. అయిపోగానే

కడిగి పోయిమీద పెట్టి టిఫిన్ బాక్సులు విప్పి కడుగుతూ ఉంది.

పక్క పోర్షన్ కాంతమ్మ తలుపు తోసుకొని లోపలికొచ్చింది. చేతిలో ఉన్న నువ్వుల చెక్క ఇద్దరికీ చెరోముక్కా ఇచ్చి వంటగదిలో కొచ్చింది. ఇంకోముక్క డబ్బామీద పెట్టి గిన్నెలన్నీ మూతలెత్తి చూసింది.

"తినేది నాలుగు మెతుకులైనా అట్టా పొయ్యిమీదనుంచొచ్చి ఇట్టా పళ్ళెంలో పడితే ఆయిదే ఏరు". మాటతో పాటు ముందు గదిలోకొచ్చింది.

"అదేం భాగ్యం ఉడుకుడుగ్గా ఒడ్డిస్తానంటే కాదనేదెవురు".

"నా బతుక్కి అంతబాగ్గెంగూడానా. మూడు పూటలకి ఒకేసారి ఉడకేస్తది. అదేమంటే ఓవెన్లో పెట్టుకోమంటది. ఊరితోనే అన్నీ పోయినియిలే".

"ఆడమాత్రం పిల్లాజెల్లాకి చూసుకోని, ఇంటి పెద్దలు కానిచ్చినంక అడుగూ బొడుగేగద మనకు మిగిలేది. యాడుండేదాడుంటదిలే". రాజమ్మ లేచి షూ తెచ్చుకోని సాక్స్ తొడుక్కో సాగింది.

"ఏందీ .... పిల్లోళ్ళ గొడవా" గుర్తొచ్చినట్లుగా కాంతమ్మ మాట సాగదీసింది.

"ఏముంది ఈ పిల్లకోతులంతా జేరి జడ్జిగారింట్లో పనసకాయలకి బ్లేడుతో గాట్లు పెట్టారంట."

"ఈళ్ళ దుంపతెగా ఏడదంతా ఎదురు చూస్తే కాసేది నాలుక్కాయలు.

ఇదుగో ఈ సంగత్తెలుసుగా మైసమ్మల్లుడి పంచాయితంటరేపు. నీకు చెప్పమన్నది."

కాంతమ్మ ఏదో గుర్తొచ్చినట్లుగా నవ్వి

"ఇదుగో జమునమ్మో ఈ మాటిను". వంటగదివైపు చూసి అనగానే జమున బైటికొచ్చింది.

"కనపడదు గాని బో చతురుంది మీ అమ్మ దగ్గిర. పిల్లని తీసకపోనని నీలగతుండడుగా. గుణంగల్ల పిల్ల, చక్కటిది అని మీ అమ్మ చెప్పబోతే. అబ్బో పెద్ద ఐశ్వర్యారాయ్‌లే అన్నాడు. ఐశర్యారాయ్ అయితే అభిషేక్ బచ్చన్‌ని చేసుకొంటందిగాని ఈ మొఖాన్నెందుకు చేసుకొంటదోయ్ అన్నది."

జమున చిన్నగా నవ్వింది.

"యదవకి నెత్తురు చుక్కలేదు మొఖాన." కాంతమ్మ నవ్వుతూ తలుపు తీసింది.

"ఏదో అలవాటులేంది ఏసుకోవాలంటే సిగ్గుగా ఉంది గాని,

కాలికి ఇబ్బంది లేకుండా ఉంటది. గొణుగుతున్నట్లుగా అంటూ బైటికి నడిచింది. వెనకే రాజమ్మ కూడా కదిలింది. నిధి గబుక్కున కుర్చీలో నుంచి లేచి.

"లిటిల్ ప్రిన్సెస్ క్వశ్చన్ ఆన్సర్స్" తలెగరేసింది అచ్చం పంతులమ్మలా.

"రాశాన్తల్లీ వచ్చాక చూపిస్తాలే" నవ్వుతూ బైటికి నడిచింది రాజమ్మ.

"ఆరి బడవా" కాంతమ్మ కూడా నవ్వుతూ తలుపు ముందుకు లాగింది.

జమున రైస్‌కుక్కర్ పెట్టేసి గోధుమ పిండి తీసుకొని కలుపుతూ కుచ్చుంది. నిధి టివి ఆపేసి

"ఇదుగో నాన్న తొందరగా వస్తానన్నాడు అప్పటిదాకానే చదివేది సరేనా కళ్ళూ పిలకలూ ఎగరేసింది. జమున తలూపింది.

నిధి రివ్వునపోయి బ్యాగ్ తెచ్చుకొని కూర్చున్నది. పిండి కలపడం పూర్తయ్యాక వంటగదిలో పెట్టి మిగిల్ని పేపర్లు ముందేసుకొన్నది జమున. హోంవర్క్ అయిపోగానే పుస్తకం ఒడిలో పెట్టుకొని ముందుకీ వెనక్కి ఊగుతూ పెద్దగా చదువుతోంది నిధి. జమున మందలింపుని పట్టించుకోలేదు. కాసేపటికి కారిడార్‌తో అడుగుల చప్పుడు వినిపించింది. పుస్తకం పక్కన పడేసి "నాన్న.... నాన్న"

ఒక్క గంతులో వెళ్ళి తలుపు తీసింది. ముఖం వేల్లాడేసుకోనొచ్చి కూర్చున్నది. కొద్దిసేపు అలాగే ఉండి, మళ్ళీ చదవడంలో పడిపోయింది.

పేపర్లు పూర్తయ్యాక చూస్తే టైమ్ ఎనిమిదైంది. నిధి పుస్తకంలో చూస్తూ ఏదో బొమ్మ గీస్తోంది.

"లేచి చేతులు కడుక్కో అన్నం పెడతా" జమున పేపర్లు బ్యాగ్‌లో సర్దింది.

"నాన్నొచ్చాక తింటా" పాప గునిసింది. జమున లేచి వంటగదిలోకెళ్ళింది. ఇక తప్పదని.

"పెరుగన్నమే తింటా" సాగదీసింది. జమున మాట్లాడలేదు. నిధి చేతులు కడుక్కోనొచ్చింది.

"రెండే రెండు ముద్దలు పప్పుతో తిను, మిగిలిందంతా పెరుగే" అయిష్టంగా ప్లేటందుకొన్నది నిధి.

రాజమ్మ లోపలికొచ్చి షూ విప్పేసి స్నానానికెళ్ళింది. బ్యాగ్‌లో ఉన్న సెల్‌ఫోన్ రింగైంది. జమున చేతిలోకి తీసుకోగానే

"నాన్నే... నాన్నే"

నిధి కుడిచేత్తో ప్లేట్ పట్టుకొని ఎడంచెయ్యి ముందుకు చాచి వాళ్ళమ్మ దగ్గరికి పరిగెత్తింది.

"అలాగే" అంటూ ఫోన్ షెల్ఫ్‌తో పెట్టింది జమున.

"నాకెందుకివ్వలేదు" కుడికాలు నేలకేసి తపతపా బాదింది నిధి. ప్లేట్‌లో అన్నం చెదిరి కిందపడింది. జమున కోపంగా చూడగానే మూలుగుతూ వెళ్ళి కూర్చుంది.

జమున పెరుగు తెచ్చేసింది. రాజమ్మ స్నానం చేసొచ్చింది.

"కిరణా ఫోన్ చేసింది. వస్తున్నాడా... ఈ రోజూ పొద్దుపోద్దా"

"ఇప్పుడే ప్రెస్‌మీట్ అయిందట, న్యూస్‌టైమ్ ఇచ్చిరావాలిగా".

"ఆ ఫోనేందో పాడైనట్లుంది. నీఫోనివ్వు అన్నతో మాట్లాడాలి."

జమున ల్యాండ్‌ఫోన్ చెవిదగ్గర పెట్టుకొని చూసింది. ఏ శబ్దమూ లేదు. నిధి పెరుగన్నంలో గీతలు గీస్తోంది.

"మింగూ" నిధిని కసిరి, సెల్‌ఫోన్ రాజమ్మ చేతికిచ్చింది. ఆమె తన రూమ్‌లోకెళ్ళి పోయింది. జమున కిందపడ్డ అన్నం తీనేసి తడిబట్టతో తుడిచింది.

"అన్నీ బాగుంటే ఈ అగోరింపెందుకురా నాకు. చేనూ చెట్టుకి దూరమై..." రాజమ్మ గొంతు గట్టిగా పలికింది. నిధి తలెత్తి, రూమ్‌వైపు చూసి మళ్ళీ అన్నం మెతుకులు లెక్కపెట్టడంలో పడిపోయింది. (నెమ్మదిగా) సలహాలు నచ్చజెప్పడాలతో ఆ సంభాషణ పది నిమిషాలు సాగింది. ముల్లూ ముడకా ఎదురైందని కాళ్లు ముందు బెట్టుకోని కూర్చొంటామా ఏందిరా... ఏడికాడికి వొయినం జేసుకొంటా సాగిపోతానే ఉండాలగాని." రాజమ్మ ఫోన్ తెచ్చి జమునకిచ్చింది.

"సంపత్ బాగా చదువుతున్నాడా"

"ఎందుకు చదవడు ఈళ్ళ చదువుల కోసం కాపరమే ఎత్తిపెట్టొచ్చారుగా"

"అమ్మమ్మా... రేణూ అక్క సెవెంత్ కదా"

"ఆ... ఈ అన్నా... అక్కా... వరసలేంటే!" నిధి చేతిలో ప్లేట్ తీసుకొని ముద్ద కలిపి నోట్లో పెట్టింది రాజమ్మ.

"ఏంటట"

"ఏముంది నల్లరాయి చేను పెసరేడి తిరుక్కోగానే మాంతంగా దానంట. ఇంకేముంది ఆరినంక మళ్ళీ దున్ని ఇత్తనం బెట్టాల్సిందే. గుంటకాడ బోరు బూడిందంట. మళ్ళీ లోడిచ్చాల. ఆరు గాలం కనిపెట్టుకోని చాకిరీ జేసే వాళ్ళకే అంతంత మాత్రం. టౌన్ నుంచి వచ్చిపోతా ఈడేం చేస్తాడు ఏం తింటారు. దాని పంతం నెగ్గిచ్చుకోవడమే తప్ప బావుకోవడమేం కనపడ్డం లేదు."

"ఇద్దరు పిల్లల్ని హాస్టల్లో పెట్టి చదివించడమంటే మాటలా"

"పోనీలే కష్టం సుఖం దిగితేనే కదా తెలిసేది."

ప్లేట్ కడిగేసి వచ్చింది రాజమ్మ. నిధి చెయ్యి కడుక్కోని మంచినీళ్ళు తాగి వీడియోగేమ్ తెచ్చుకొన్నది. కరెంటు పోయింది.

"ఇడేందియ్యాళప్పుడు" రాజమ్మ తడుముకొంటూ పోయి చార్జింగ్ లైట్ ఆన్

చేసింది. అది వెలగలేదు. విసుక్కొంటూ వచ్చి కూర్చొన్నది.

నిధి పాట ఎత్తుకొన్నది. మరాఠి జానపదగేయం. స్కూల్లో ఎవరో నేర్పినట్టున్నారు.

"ఈ పాడు కరెంటు ఇంకా రాదేంటే" జమున విసుక్కొన్నది. నిధి పాటాపేసి,

"అమ్మమ్మ మరే పొలం చాలా దూరం అన్నావుగా కరెంటుపోతే ఇంటికెలా వస్తారు భయమెయ్యదా."

ఊళ్ళల్లో ఇట్టుండదమ్మా... కన్నీకటి పడే లోపలే అందరూ ఇళ్ళకి చేరిపోతారు."

"బస్సులో వస్తారా."

"పొలాలకి బస్సులుండవు అంతా కాలినడకే... లేదండీ ఎద్దుల బండి మీద పోయిరావటమే."

"ఒకసారి సినిమాలో వస్తుంటే చెప్పావు అదే కదా."

"అవును పచ్చగడ్డి బండిమీద కూర్చోని మాటా మంతీకష్టం సుఖం కలబోసుకొంటా దారెంట సాగొస్తావుంటే... గూటికి చేరే పిట్టాపురుగు సందడొకపక్క కమ్మటి పూలవాసనల్ని తోడిచ్చి ఇకపోయిరమ్మని చల్లగా తలలూపే చెట్టూ కొమ్మా. ఇక మేం చూసుకొంటాంలే మీకేం బెంగొద్దన్నట్టు ఆకాశంలో మినుక్కుమంటూ వెన్ను తడుతున్నట్టుగా చుక్కల నేస్తాలు. బతుకంతా ఇట్టాగే సాగిపోతావుండాలనిపిస్తుంది. నిధికో జమునకో లేక తనకు తానో చెప్పుకొంటున్నట్లుగా రాజమ్మ గొంతు చిన్నగా మెత్తగా సాగిపోతూ మధ్యలో ఏదో గొంతుకు అడ్డుపడినట్లు ఆగిపోయింది.

కరెంటు వచ్చింది. జమునలేచి చపాతి చెయ్యటానికి సరంజామ తెచ్చుకొని కూర్చొన్నది. ఫోన్ మోగింది. మ్యాథ్స్ పూర్ణిమ ఫోన్ తీసుకొని బెడ్‌రూమ్‌లో కొచ్చింది.

"ఎంతైతే మాత్రం కాపీ కొట్టొద్దన్నామని, మన అమ్మలి తలుచుకొంటాడా వాడు... వాడో మనమో... కాలేజీలో ఎవరుంటారో తేల్చుకొందాం..."

"వాళ్ళుడా తెలిసీ తెలియని వయసు పూర్ణిమా! వాళ్ళని సరిచెయ్యడం పెద్ద పనికాదు. ముందు మేనేజ్‌మెంట్‌లో గట్టిగా మాట్లాడదాం. స్టూడెంట్స్ ముందు స్టాఫ్‌ని తేలిక చేసే పనులు మానుకోమని గట్టిగా చెబుదాం."

"మధ్యాహ్నం అంత బాధపడిన జమునేనా ఇట్లా మాట్లాడేది. ఈ కాలేజి కాకపోతే ఇంకోటి దొరకదా మనకి."

"ఎక్కడుండే సమస్యలు అక్కడుంటాయిలే. ముందు స్టాఫ్ అంతా కలిసి ఏం చెయ్యాలో ఆలోచిద్దాం. ఇది మనిద్దరి సమస్యేకాదుగా". జమున నెమ్మదిగా నచ్చబెబుతూ పూర్ణిమని ఒప్పించింది.

రాజమ్మ ఉత్సాహంగా ఊరి ముచ్చట్లు చెబుతూ చపాతీలు రుద్దుతోంది. నిధి

ఎదురుగా కూర్చొని అమ్మమ్మ ఉత్సాహంలో భాగం పంచుకొంటోంది.

"ఒకసారి ఊరెళ్ళొస్తావా" జమున మాట అర్థం కానట్లుగా చూసింది రాజమ్మ.

"చాలా రోజులైంది కదే" అప్పటికి మాట అర్థమైనట్లు.

"దశరా శెలవల్లో నిధిని తీసుకెళతాలే. అప్పుడైతే పొలాలలన్నీ పైర్లెక్కుంటాయి. ఎప్పటి నుంచో అడుగుతోందిగా."

"సరేలే... సండే ఔటింగ్... ఓకేనా" నిధి వైపు చూసి ఊరించినట్లుగా నవ్వింది జమున. నిధి తెగ ఉత్సాహపడిపోయింది.

"నాన్నొచ్చాక ఎక్కడికెళ్ళాలో ప్లాన్ చేద్దాం సరేనా."

కాలింగ్ బెల్‌తో ఒక్క గంతులో వెళ్ళి తలుపు తీసింది నిధి.

అలసిపోయినట్లుగా నీరసంగా లోపలికొచ్చాడు కిరణ్. కాళ్ళని చుట్టేసింది నిధి. తనని ఎత్తి ఒడిలో ఏసుకొని సోఫాలో కూర్చున్నాడు కిరణ్. నుదుటిమీద చెమటపట్టి అతుక్కుపోయిన జుట్టుని పైకి తోస్తూ ముచ్చట్లలో పడిపోయింది నిధి.

# తోడు

ఎం. శ్రీనివాసరావు

పెళ్లనేదే ఓ దురదృష్టం. లేకపోతే ఏంటి? ఈ ఒంటరి బతుకేదో అప్పటినుండే బతికేదాన్ని. అలవాటు పడుండేదాన్ని. కాకపోతే ఈ ఉద్యోగం ఉండేది కాదేమో. కష్టపడేదాన్ని. ఊళ్లోనే పనిచేసుకుంటూ ఉండేదాన్ని. ఊళ్లో ఒంటరిగా బతుకుతున్న ఆడవాళ్లు ఎంతమంది లేరు. చిన్నమ్మాయిని నా చిన్నప్పటినుండి చూస్తున్నాను. పేరుకు చిన్నమ్మాయేగాని మనిషి చాలా పెద్దదే. దీటైన శరీరం. వాళ్ల తోబుట్టువులందరిలో చిన్నదిగాబట్టి చిన్నమ్మాయనే వాళ్లు. చిన్నమ్మాయి అసలు పెళ్లే చేసుకోలేదు. ఎన్ని సంబంధాలు తెచ్చినా ఏదో ఒక వంక చెప్పేది. కాదనేది బలవంతం చేస్తే బాయిలో దూకేది. అట్లా రెండుసార్లు జరగడంతో వదిలేశారు. అలా చిన్నమ్మాయి ఒంటరిగానే బతుకుతుంది. ఇప్పుడామెకు ఏభై ఉండొచ్చేమో, కష్టపడి పని చేసుకుంటుంది. సంపాదించుకుటుంది. ఇంట్లో పడుంటుంది. ఆదివారమైతే నూకాలమ్మగుడికెళ్తుంది. అంతకన్నా మునిగిపోయేదేముంది.తను కూడా అలాగే ఉండేది. అలా ఒక్క చిన్నమ్మాయే కాదు. మేడకాడ రమణమ్మ, గవరపాలెం అంజమ్మ, చిన్న సుబ్బులు, ఒడ్డిరేణుక, మాల బిచ్చావతి. ఇలా లెక్కబెడితే చాలా మందే ఉన్నారు. అన్ని కులాల్లో ఉన్నారు. మొగుడు వదిలేసినోళ్లొకళ్లయితే, మొగుడు సచ్చినోళ్లు ఒకరు. అసలు పెళ్లే చేసుకోనోళ్ళు కొందరు. ఎవరి కారణాలు వాళ్లకున్నాయి. అందరూ ఒంటరిగా బతుకుతున్నవాళ్లే. పిల్లలున్నవాళ్లు ఆ పిల్లల్ని చూసుకుంటే లేనివాళ్లు ఏదో కాలక్షేపం చేస్తూ అలాగే బతుకుతున్నారు. ఇప్పుడెలాగూ తను కూడా ఆ గూటిలోకే చేరేటట్టుందిలే అనుకుంటుంది సుగుణ.

బస్సులో నుండి బిలబిల మంటూ అందరూ దిగుతున్నారు. చుట్టూ చూసింది. తనుదిగే బస్టాపిదే. తను కూడా గబగబా దిగిపోయింది. ఐదునిమిషాల్లో ఇంటికొచ్చింది. మంచమ్మీద పడిపోయింది. కళ్లు మూసుకుంది. ఫేను చిన్నగా,

మెత్తగా తిరుగుతుంది. మగతగా ఉన్నట్టనిపించింది. కొంచెం సేపటికి పైకి లేచింది. బైటికి వచ్చింది. సూర్యుడు పడమటి దిక్కు కొండల్లోకి వెళ్లిపోయాడు. చల్లగా ఉంది. బాత్‌రూమ్‌లోకెళ్లి ముఖం కడుక్కుంది. బట్టలు మార్చుకుంది. వంటగదిలో కొచ్చి స్టౌ వెలిగించింది. పాలు వేడి చేసుకుంది. గ్లాసులో పోసుకుని బైటికి వచ్చింది. వాతావరణం ప్రశాంతంగా ఉంది. సిటీలో ఉన్న రణగొణ ధ్వనులు ఇక్కడ ఉండవు. ఇక్కడ కొంత గ్రామీణ వాతావరణం ఉంటుంది. చుట్టూ కొండలు. కొండల మీద దట్టంగా,పచ్చగా పెరిగిన చెట్లు, పచ్చని తివాచీ పరచినట్లుగా అందంగా ఉంది. సిటీలో ఉన్న కాలుష్యం కూడా ఇక్కడ ఉండదు. చుట్టూ ఉన్న బిల్డింగుల మీదకు ఒక్కొక్కరే వస్తున్నారు. ఈ బిల్డింగ్ మీద ఒక పక్క రెండుగదుల ఇల్లు. అందులో తనుంటుంది. మరో పక్క కొంచెం విశాలంగా ఖాళీ. సాయంకాలాలు బయట కూర్చుంటే హాయిగా ఉంటుంది. అక్కడనుండి దూరంగా ఉన్న కొండలపైకి చూస్తూ ఉంది. పాలు తాగి గ్లాసు పక్కనబెట్టింది. కుర్చీలో తలవాల్చి కళ్లు మూసుకుంది. మనసంతా ఆలోచనలతో నిండిపోయింది.

సుగుణకు ఏ బాదరబందీలేదు. ఉద్యోగం ఉంది. బతకడానికి సరిపోగా బాగానే మిగులుతుంది. అంతస్వార్థపరురాలేమీ కాదు. చిన్నమ్మ,పెద్దమ్మ పిల్లలకు చుట్టుపక్కల వాళ్లకు సహాయం చేస్తుంది. ఇరుగు పొరుగుతో కలివిడిగా ఉంటుంది. అలాంటి సుగుణ అలా కళ్లు మూసుకుని ఆలోచిస్తూనే ఉంది. కృష్ణ తన దగ్గరకు ఎందుకు రావడంలేదో అర్థం కావడంలేదు. ఫోన్ చేస్తే తీయడంలేదు. వేరే నంబరు నుండి చేస్తే తీస్తాడుగాని ముక్తసరిగా మాటాడుతాడు. ఇంటికి రమ్మంటే వస్తానంటాడుగాని రాడు. ఏమీ అర్థం కావడంలేదు. ఇంతకాలం తను ఒంటరిగా లేననుకుంది. తనకూ ఓ తోడుందనుకుంది. ఇప్పుడు సందేహంగా ఉంది. బాధగా ఉంది. ఏడుపొస్తుంది. ఒంటరిగా ఉండగలననుకుందిగాని తనకెవరూలేరనుకుంటే దు:ఖంగా ఉంది. కృష్ణ కూడా అలా దూరంగా ఉంటే భరించలేకుండా ఉంది. అలా ఆలోచిస్తుంటే, జ్ఞాపకాలన్నీ తరుముకొస్తుంటే విపరీతమైన కోపమొస్తుంది.

నిజానికి తనెప్పుడో ఒక నిశ్చితాభిప్రాయానికొచ్చింది. తన వంట్లో హెచ్.ఐ.వి వైరస్ ప్రవేశించిందని తెలియగానే తను జీవితం మీద ఆశ వదులుకుంది. జీవితంలో కష్టసుఖాలు సహజమే గాని సుఖసంతోషాలకు తను నోచుకోలేదనుకుంది. నిజానికి హెచ్.ఐ.వి తనకు సోకడంలో తన తప్పేమీలేదు. తను ఒక భూస్వామి కుటుంబంలో పుట్టింది. కాని ఐదేళ్లకే అమ్మ చనిపోవడంతో పెద్దమ్మ దగ్గరే పెరిగింది. ఆలనా పాలనా అంతా వాళ్లే చూశారు. తండ్రి తాగుబోతు. ఆస్తినంతా దానికే తగలబెట్టాడు.

ఐనా తనను బాగానే చూసుకొనేవాడు. తను పదోతరగతి వరకు చదువుకుంది. పెళ్లి ఈడు రాగానే చాలా సంబంధాలే చూశారు. చివరకు ప్రభుత్వోద్యోగమని ఒకడిని ఖాయం చేశారు. తను కూడా సరేనంది. కాని వాడు జీవితం ముగిసిపోయిన దశలో ఉన్నాడని ఎవరూ చెప్పలేదు. వాడికి హెచ్.ఐ.వి ఉంది. అది ఎయిడ్స్‌గా మారిపోయింది. ఎయిడ్స్‌దశ వచ్చాక చావు తప్పదు. కాకపోతే కాస్త ముందూ వెనుక. కాపురానికెళ్లిన నెలరోజులకే మంచానపడ్డాడు. ఇంకో నాలుగు నెల్లకు చనిపోయాడు. చనిపోయిన తర్వాత చాలామంది చెప్పారు వాడికి ఎయిడ్స్ ఉందని తెలుసని. మరెందుకు చెప్పలేదంటే ఈర్ష్యతో చెప్తున్నారనుకుంటారని అన్నారు. అట్లా తను బలైపోయింది. గుడ్డిలో మెల్లగా బతకడానికి ఈ ఉద్యోగమొచ్చింది. అందువల్లనే ఆర్థికంగా ఇబ్బందిలేకుండా జీవితం గడుస్తోంది.

కళ్లు తెరిచింది. పైకి లేచి నాలుగడుగులు ముందుకు నడిచింది. పిట్టగోడ పట్టుకు నిలబడిరది. ఎదురుగా వీధిలో ఒకరు ఇద్దరు ఉద్యోగాలనుండి వస్తున్నారు. కూలిపనులకెళ్లిన ఆడోళ్లు, మగోళ్లు నలుగురైదుగురు ఖాళీ కేరియర్లతో నీరసంగా నడుచుకుంటూ వస్తున్నారు. బాగా చీకటిపడిరది. వీధిలో లైట్లు వేశారు. చుట్టూ నగరమంతా వీధిలైట్ల కాంతిలో వెలిగిపోతూ ఉంది. దాని వెలుగు పెద్ద కాంతిపుంజం పైకి చిమ్ముతున్నట్టుంది. వెనక్కి వచ్చింది. కుర్చీలో కూర్చుండిపోయింది. కళ్లు మూసుకుంది. ఇప్పుడు కొంత ఫర్వాలేదు. పదేళ్ల క్రితం ఈ వైరస్ సోకిన కొత్తలో తనను అందరూ అంటరానిదానిగా చూశారు. తన మన ఏంలేదు. అందరూ అలాగే చూశారు. ఇప్పుడందరూ మాలమాదిగలతో కలిసి మెలిసి తిరుగుతున్నారు. ఒకప్పుడుండేదా? ఉండేదికాదు. ఇప్పుడు? ఏ ఇబ్బందిలేదు. మొదట్లో తనను కూడా అంతే. ముట్టుకోడానికి కూడా సిద్ధపడేవారుకాదు. మాలమాదిగ కులాల్లో అట్టడుగుకులం కన్నా హీనం. ఆడదాన్ని కాబట్టి ఇంకా దారుణం. తన ఇంట్లో తను పెరిగిన పరిసరాల్లో, తనతో పెరిగినవాళ్లలో తను ఒక అంటరానిది. తన కంచం వేరు,తన మంచం వేరు. తన తిండి వేరు. కాని ఇప్పుడు తను సంపాదిస్తున్న డబ్బు మాత్రం అందరికీ ప్రియమే.

ఏడెందేళ్ల క్రితం కావచ్చు, డ్యూటి నుండి వస్తూ దారిలోనే కాబట్టి పిల్లల్ని చూద్దామని అక్క దగ్గరకు వెళ్లింది. వెళ్లినపుడల్లా చిన్నమ్మా చిన్నమ్మా అంటూ కాళ్లకు చుట్టుకుపోతారు. వాళ్ళతో కాసేపు గడిపితే హాయిగా ఉంటుంది. అందుకే అప్పుడపుడు అక్కడకు వెళ్తుంది. వెళ్లేటప్పటికి పెద్దమ్మ కూడా వచ్చింది. చిన్నమ్మ అంటూ ఇద్దరు పిల్లలూ చెరో పక్క కరుచుకుపోయారు. ఇద్దరికి ముద్దులు పెట్టింది. బ్యాగ్‌లో నుండి

స్వీట్ ప్యాకెట్ తీసి వాళ్లకిచ్చింది. అక్కనీ పెద్దమ్మనీ పలకరించింది. ఊళ్లో ఆ కబుర్లూ ఈ కబుర్లూ అన్నీ చెప్పింది పెద్దమ్మ. అక్క తన టైలరింగ్ షాపుగురించి, అక్కడికొచ్చే తన కష్టమర్ల గురించీ చెప్పింది. గంటపైగా మాటాడుకున్నారు. అలసటగా అనిపించి బాత్‌రూంలో కెళ్లింది. కాళ్లు ముఖం శుభ్రంగా కడుక్కుంది. టవల్‌తో ముఖం తుడుచుకుని నిలువెత్తు అద్దం ముందుకొచ్చింది. ముఖం మీద బొట్టు బిళ్ల పెట్టుకుంది. చీర సరిచేసుకుంది. కొత్తగా కొనుక్కున్న తెల్ల చీరలో తను చాలా అందంగా ఉంది. ముందు వెనుక చూసుకుంటూ ఉంది. అంతలో రేపో మాపో పొయ్యేదానివి నీకంత అవసరమా అంది అక్క. అలాగే నిలబడిపోయింది తను. అక్కవైపు చూసింది. వంటగదిలోకి వెళ్లిపోతూ ఉంది. అమ్మ వైపు చూసింది. అంతగాకేముంది అన్నట్టుగా ఉంది అమె చూపు. ఏం నేను శుభ్రంగా ఉండకూడదా? అంటుండగానే కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఒకవైపు కోపం, మరోవైపు దు:ఖం, కొంచెం వెనకా ముందుగా అందరూ పోయేవాళ్లే అని బేగ్ తీసుకుని వచ్చేసింది. అంతవయసొచ్చింది. ఎంతో జీవితానుభవం ఉంది. అమ్మ కూడా ఏమీ మాటాడలేదు. అంటే తనకూ అదే ఉద్దేశం ఉంది అనుకుంది.

ఆరోగ్యం గురించి కావచ్చు, ఇతర అవసరాల గురించి కావచ్చు, ఏదైనా సహాయం చేస్తే బయటి వాళ్లుచేశారుగాని నా అనుకున్నవాళ్ళెవరూ చేయలేదు. మొదట్లో ఉద్యోగం కోసం తిరగాలన్నా, ఆరోగ్యంకోసం హాస్పటల్‌కెళ్లాలన్నా స్నేహితులే. ఇప్పటికీ తనకు చాలామంది తన ఆరోగ్యం గురించి సూచనలు సలహాలు ఇస్తుంటారు. మరోరకం మనుషులు కూడా ఉన్నారులే. ఒకప్పుడు ఆఫీసులో తను ఇచ్చిన మంచి నీళ్ళు కూడా కొంతమంది తాగేవారు కాదు. కొంతమందైతే ఒంటరిదాన్ని, ఎంతైనా ఆడదాన్ని, చూపుల్తోనే తినేస్తుంటారు. ఈ ఎయిడ్స్ అనేదుందిగాబట్టి బతికిపోయాను గాని లేకపోతే ఎంతనరకం అనుభవించాల్సి వచ్చేదో.

ఇంటా బయటా మాటల్తో, చూపుల్తో, చేష్టల్తో ఇంత నరకం అనుభవిస్తున్నా ఏదైతే అదవుతుంది, బతికినంతకాలం బతుకుతాను అనే మొండి ధైర్యంతో తను ఇంతకాలం బతికింది. ఆ ధైర్యమే తనను ముందుకు తీసుకెళ్తుంది,తనను నడిపిస్తుంది. అట్లా గడుస్తున్నపుడు ఐదారేళ్ళ క్రితం పరిచయమయ్యాడు కృష్ణ. కొత్తగా ఉద్యోగంలో చేరాడు. తనకన్నా పై స్థాయి ఉద్యోగమే. తనొక డిపార్టమెంటు అతనొక డిపార్టమెంటు. ఎప్పుడన్నా తన డిపార్టమెంటుకొచ్చేవాడు. వచ్చినపుడు మామూలుగా పలకరించుకొనేవాళ్ళు గాని పెద్దగా పరిచయం పెరగలేదు. ఒకరోజు సడన్‌గా ఫోన్ చేశాడు. ఫోన్ రింగవుతుంటే ఎవరో కొత్తనంబర్ అనుకుంది. తీసింది. నేనండీ కృష్ణనీ అన్నాడు. ఏ కృష్ణ అంది. ఎ.ఇ కృష్ణని అన్నాడు. మీరా? ఏమిటండీ అంది,

నాకు ప్రమోషన్ వచ్చిందండి అన్నాడు. అవునా కంగ్రాట్సండి అంది. సాయంత్రం డ్యూటీ అయ్యాక చిన్న పార్టీ ఉందండి. మా ఆఫీసు దగ్గర, అందరికి చెప్తున్నాను. మీరు కూడా తప్పకుండా రావాలి అన్నాడు. సరేనండి అంది. అప్పటినుండి తరచుగా ఫోన్ చేస్తుండేవాడు. కలిసినపుడు ఎక్కువగానే మాట్లాడుతుండేవాడు. పరిచయం పెరిగి కొంచెం చనువు ఏర్పడిరది.

తన ఆరోగ్యం గురించి ఆఫీసులో అందరికీ తెలుసు. కృష్ణకు కూడా తెలిసిందని తనకు తెలుసు. ఒకరోజు సాయంకాలం ఆఫీసు టైం అయిపోతుండగా ఫోన్ చేశాడు. మీరెప్పుడైనా ఎవరితోనైనా కలిసి సినిమాకెళ్లారా? అన్నాడు. ఎందుకెళ్లలేదు. మా అక్కతో ఎప్పుడన్నా వెళ్తుంటాను అంది. వేరే ఎవరైనా ఫ్రెండ్స్ రమ్మంటే వెళ్తారా? అన్నాడు. వెళ్తాను అంది మామూలుగా. మరిప్పుడు నాతో సినిమాకొస్తారా? అన్నాడు. ఏం చెప్పాలో అర్థం కాలేదు. అట్లా అడుగుతాడనుకోలేదు. ఒక్క నిమిషమాగి అయిపోయేటప్పటికి బాగా చీకటి పడుతుంది, నేను రానంది. బండి మీద దిగబెడతానన్నాడు. అలాగే అంది. ఆఫీసుటైం అయిపోయింది. బయలుదేరింది. పరిచయం పెరిగిందిగాని సినిమాకు రమ్మనేంత చనువులేదు. ఎప్పుడూ అంత చొరవ తీసుకోలేదు. సడన్‌గా అడిగేటప్పటికి కాదని గట్టిగా చెప్పలేకపోయింది. ఆలోచిస్తోంది. ఆలోచనలతోనే బస్సెక్కింది. ఇష్టపడుతున్నాడా? ప్రేమిస్తున్నాడా? అయినా తననెవరు ప్రేమిస్తారు? ప్రేమించినా పెళ్లి చేసుకుంటారా? తనకా రాత లేదని అప్పుడే నిర్ణయించుకొంది. అందుకనే ఎవరితోను ఎక్కువ చనువుగా ఉండేదికాదు. చనువెక్కువైతే చొరవ పెరుగుతుంది. అది ఎటువెళ్ళినా కష్టమే. అందుకే తన పరిధిలో తానుండేది. ఆ పరిధిలోకి ఎవరినీ రానిచ్చేదికాదు. అయినా కృష్ణకు పెళ్ళయింది. ఒక పిల్ల కూడా ఉంది. అంత ధైర్యం చేస్తాడా? ఆఫీసులో ఆయనకొక గౌరవం,ప్రతిష్ట ఉంది. అది వదులుకుంటాడా? అంతకన్నా మించి చావు కొని తెచ్చుకుంటాడా? అనుకుంది.

ఐనాక్స్ వచ్చింది. బయటా లోపలా అంతా చూసింది. ఎక్కడా కనపడలేదు. అంతలో ఫోన్, ఎక్కడ? అని. సియంఆర్ అంది. కాదు బీచ్ ఐనాక్స్ అన్నాడు. అక్కడికి రమ్మన్నాడు. వెళ్ళింది. అక్కడ బయటే ఎదురు చూస్తున్నాడు. టైం ఆరున్నర కావస్తుంది. సినిమా ఏడున్నరకి, అలా బీచ్ దగ్గరకు వెళ్దామా అన్నాడు. సరేనంది. బీచ్ రోడ్డు వాహనాల రద్దీతో నిండుగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా జనం తిరణాలను మించిపోయారు. సిటీలో జనానికి బీచ్ ఒక పెద్ద ఎంటర్‌టైన్‌మెంట్. రోడ్డు దాటి దగ్గరకు వచ్చారు. సముద్రపు ఒడ్డున ఇసుకలో కొంతమంది పిల్లలు

ఆటలాడుకుంటున్నారు. కొంతమంది పెద్దలూ, నడివయసు దంపతులు మెట్లమీద, గోడమీద కూర్చున్నారు. కొంతమంది జంటలు ఐస్‌క్రీములు తింటూ కబుర్లాడుకుంటున్నారు. ఇద్దరూ వచ్చి చిన్నగోడ మీద ఖాళీ చూసుకుని కూర్చున్నారు. సముద్రంలో దూరంగా పెద్దపెద్ద షిప్పులు నిలబడి ఉన్నాయి. అందులో నుండి లైట్ల కాంతి బయటకు వస్తుంది. పైన కొన్ని లైట్లు బంగారు రంగులో మెరుస్తున్నాయి. రెండు మూడు రంగుల కాంతితో షిప్పులు అందంగా కనబడుతున్నాయి. పక్కనే ఉన్న బండి దగ్గర కృష్ణ రెండు ఐస్ క్రీములు తీసుకున్నాడు. ఒకటి తనకిచ్చాడు. ఇద్దరూ తింటూ కూర్చున్నారు. కృష్ణ కొంచెం దగ్గరకు జరిగాడు. ఇటువైపు చూసింది. రెండు శరీరాలు తగిలీ తగలనట్లుగా ఉన్నాయి. ఏమాలోచిస్తున్నావు అన్నాడు. ఏమీ మాటాడలేదు. చాలా విషయాలు నీగురించి తెలుసుగాని ఒంటరిగానే ఉంటున్నావనే విషయం తెలియదు. అటెండరు అప్పన్న చెప్పాడు ఏదో మాటల సందర్భంలో అన్నాడు. మీకో విషయం చెప్పనా అన్నాడు మరలా. చెప్పండి అంది. నేను వచ్చినప్పుడే మీ గురించి తెలిసి ఉంటే మిమ్మల్నే చేసుకునేవాణ్ణి అన్నాడు. కృష్ణ వైపు ఆశ్చర్యంగా చూసింది. నమ్మలేకపోతున్నారా, నిజమే చెప్తున్నాను అన్నాడు. నేను ఇక్కడకు వచ్చాకే పెళ్లి చేసుకున్నాను. తను ఒట్టి అనుమానం మనిషి. నిత్యం తన అనుమానంతో హింసిస్తుంది. ఎవరైనా ఆడవాళ్ళతో మాటాడితే అనుమానంగా చూస్తుంది. ఆఫీసు నుండి ఆలస్యంగా వస్తే సహించలేదు. అనుమానం అన్నాడు. జీవితానికి ప్రశాంతతలేదు. సరైన తోడు దొరకడమే జీవితానికి ప్రశాంతత. అదే నిజమైన అదృష్టం. నాకా అదృష్టం లేదు అన్నాడు. అలా తన గురించి చెప్పుకుంటూపోయాడు.

తను ఆ ఆశని ఎప్పుడో వదిలేసింది. తను మాటాడినపుడల్లా గౌరవంగానే మాటాడేవాడు. అందుకే రాగలిగింది. ఇంకొకరైతే వేరుగా ఉండేదేమో అనుకుంటూ ఉంది. ఏమాలోచిస్తున్నావు అన్నాడు. ఏమీలేదు అంది నా గురించి మీకంతా తెలుసు, నాకు జీవితం మీద పెద్దగా ఆశలేం లేవు. బతికినన్నాళ్ళు బతుకుతాను అనుకుంటూ బతుకుతున్నాను అంది. అలా మాటాడుకుంటుండగానే టైమైంది సినిమాకెళ్ళారు. అయిపోయేటప్పటికి పదైంది. బండి మీద ఇంటి దగ్గర వదలి వెళ్ళాడు.

అలా అప్పుడపుడు సినిమాకు తీసుకెళ్తుండేవాడు. బీచ్ దగ్గర, ఉడాపార్కు దగ్గర కలుస్తుండేవారు. సాయంత్రం ఆరుగంటలు కావస్తుంది. అందరూ డ్యూటీల నుండి వెళ్ళడానికి సిద్ధమవుతున్నారు. కృష్ణ ఫోన్ చేశాడు. రోడ్డు మీదకు వచ్చి నిలబడు, వస్తున్నా అన్నాడు. సరేనంది. వచ్చాడు. ఇద్దరూ బయలుదేరారు. నీకే కలరంటే ఇష్టం అన్నాడు. వైట్ అంది. కళామందిర్‌కి తీసుకెళ్ళాడు. తెల్లరంగులో చీరలు

తీయించాడు. నీకు నచ్చింది తీసుకోమన్నాడు. ఒకటి తీసుకుంది. బిల్లిచ్చేశాడు. బయటికొస్తుండగా ఎందుకిపుడు అంది. ఏంలేదు. నీకు చీర తీసుకోవాలనిపించింది అంతే అన్నాడు. బండి మీద ఇంటిదగ్గర దిగబెట్టాడు. రేపు ఆదివారం కదా రాకూడదా అంది. ఇంటిదగ్గర తనూరుకోదు అన్నాడు. మళ్లీ కొంచెం ఆలోచించి ఏదో ఒకటి చెప్పి వస్తాలే అన్నాడు. సరేనంది.

సరిగ్గా పదకొండు గంటలకు వచ్చాడు. అప్పుడే స్నానం చేసి వచ్చి టి.వి ముందు కూర్చుంది సుగుణ. తను చైర్‌లో కూర్చున్నాడు. టి.విలో ఏదో సీరియల్ వస్తూ ఉంది. ఫేన్ మెత్తగా తిరుగుతుంది. చీరేది కట్టుకుని చూశావా? అన్నాడు. లేదు అంది. బీరువాలోనుండి తీసిచ్చింది. కవర్‌లో నుండి బయటకు తీశాడు. గమ్మత్తైన వాసన ముక్కుపుటాలను తాకింది. కట్టుకోమని ఇచ్చాడు. ఇప్పుడేనా అంది. ఇప్పుడే అన్నాడు. పక్క గదిలో కెళ్లి కట్టుకుని వచ్చింది. దేవతలా ఉన్నావన్నాడు. అవునా? థాంక్యూ అంటూ వచ్చి కుర్చీలో కూర్చుంది. పక్కనే మంచం మీద కూర్చున్నాడు కృష్ణ. అలా చాలాసేపు మాట్లాడుకున్నారు. అది స్నేహమో, ప్రేమో తెలియదు. కష్టసుఖాలు ఒకరికొకరు పంచుకున్నారు. సంతోషం వేస్తే ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు. దు:ఖం వేస్తే ఇద్దరూ బాధపడ్డారు. కాలం అలా తనకు తెలియకుండానే హాయిగా గడిచిపోతూ ఉంది.

అలాంటి ఒకరోజు. అది ఆదివారం. ఉడాపార్కు దగ్గరకు రమ్మన్నాడు. వెళ్ళింది. పార్కులో జంటలే ఎక్కువగా ఉన్నాయి. గన్నేరు చెట్టు నిండా పూలతో పరిమళిస్తూ ఉంది. పక్కనే ఉన్న బల్ల మీద కూర్చున్నారు. నీ బర్త్‌డే ఎప్పుడు అన్నాడు. ఏమో అంది. అదేంటి అన్నాడు. మా పల్లెటూళ్లలో వీటి గురించెవరు పట్టించుకుంటారు అంది. ఈరోజు నా బర్త్‌డే అన్నాడు. అవునా చెప్పలేదేం అంది. నాకూ బర్త్‌డేలు చేసుకోవడం అలవాటులేదు. అందుకే ఎవరికీ చెప్పలేదు అన్నాడు. హేపీ బర్త్‌డే అంది. ఐస్‌క్రీం పార్లర్ దగ్గరకెళ్ళింది. రెండు ఐస్‌క్రీంలు తెచ్చింది. ఒకటి కృష్ణకిచ్చి నీ బర్త్‌డే సందర్భంగా అంది. థాంక్యూ అన్నాడు.

ఇద్దరూ ఐస్‌క్రీం తింటూ ఉన్నారు. సాయంత్రం ఐదు కావస్తుంది. సముద్రం మీద పైరగాలి హాయిగా తాకుతూ ఉంది. నీకేమైన పెద్దకోరికలున్నాయా అన్నాడు. ఉంటే చెప్పు అన్నాడు. ఎందుకు తీరుస్తావా అంది నవ్వుతూ. తీరుస్తానన్నాడు. నిజంగానా అంది. నిజంగానే తీరుస్తానన్నాడు. ఐస్‌క్రీం తింటూ కొంచెం సేపాలోచించింది. నాకు జీవితం మీద ఇంతకన్నా ఆశలేం లేవు. అంటే సెక్స్ పట్ల కూడా అంత ఆసక్తి లేదు. భర్త పిల్లలు వీటన్నింటినీ నేనాశించడంలేదు. ఈ జీవితం

ఇలా గడిచిపోతే చాలు అనుకుంటున్నాను. కాని ఒక్కోసారి జీవితం వెలితిగా ఉందేమో అనిపిస్తుంది. నాకంటూ ఒకతోడు కావాలేమో అనిపిస్తుంది అంది. కృష్ణ మౌనంగా వింటున్నాడు. తనవైపే చూస్తున్నాడు. ఆలోచిస్తున్నాడు కూడా. నాకు తాళి కట్టించుకోవాలనుంది అంది. అంటే నాతోనే ఉండాలనేంలేదు. నాకు తాళికడితే చాలు. అపుడపుడు నా మంచి చెడ్డలు తెలుసుకుంటే చాలు. ఎలాగున్నావ్ అనడిగితే చాలు అంది. బలవంతం ఏమీ లేదు. బాగా ఆలోచించి చెప్పు అంది. కొంచెంసేపు మౌనంగా ఉండిపోయాడు. తర్వాత అలాగే అన్నాడు. నీ కోరిక తీరుస్తానన్నాడు. ఐతే ఒక కండీషన్ అన్నాడు. ఏమిటది అంది. ఎవరికి చెప్పకూడదన్నాడు. చెబితే ఇద్దరికీ ఇబ్బందే అన్నాడు. మా వాళ్ళకి ఒకరిద్దరికి చెబుతానంది సరేనన్నాడు.

అలా ఇద్దరు ముగ్గురు తన తరపు పెద్దల సమక్షంలో ఒకరోజు గుళ్లో తాళి కట్టించుకుంది. అప్పుడప్పుడు ఇంటికి వచ్చేవాడు. ఇంటి పక్కవాళ్లకు పరిచయం చేసింది. కాలం ప్రవాహంలాగ అలా గడిచిపోతూ ఉంది. ఆనందంగా హాయిగా ఉంది. ఉత్సాహంగా ఉంది. ఆరు నెలలు కావస్తుంది. అలాంటపుడు ఒకసారి తనకు ఏభైవేలు డబ్బులు కావాలని అడిగాడు. అంత డబ్బు లేదంది. ఎందుకు అంది. చాలా ఇబ్బందిలో ఉన్నానన్నాడు. అదే ఏమిటా ఇబ్బంది అంది, నాతో చెప్పకూడదా అంది. ఎందుకు చెప్పకూడదు, నీతోకాక ఇంకెవరికి చెప్తాను అన్నాడు. అప్పులున్నాయన్నాడు. వాళ్లిపుడు అడుగుతున్నారన్నాడు. నా దగ్గర కొంత ఉంది గాని ఏభైవేలు కొరవైందన్నాడు. నాకు నెల నెలా ఆరోగ్యానికి కొంత ఖర్చవుతుంది. నా దగ్గర ఉంచుకున్నది కొంత అక్క, తమ్ముడు అవసరాలకు తీసుకున్నారు. ఇప్పటికిప్పుడంటే ఏమీలేవు అంది. నా చైను ఉంది, ఎక్కడైనా తాకట్టు పెట్టి అప్పుతీర్చు, తర్వాత నిదానంగా చైను విడిపించి ఇవ్వు అంది. సరేనన్నాడు. ఏంటాంటి ఇందాకటినుండి అలాగే కూర్చున్నారు అన్నాడు శేఖర్. కళ్ళు తెరిచి చూసింది ఎదురుగా అలాగే నిలబడి చూస్తున్నాడు. ఏం లేదు అంది. భోజనం చేశారా? అన్నాడు. లేదు చేయాలి అంటూ లేచింది. సరేనంటూ వెళ్లిపోయాడు.

కుర్చీ తీసుకుని లోపలకు వచ్చింది. టి.వి ఆన్ చేసింది. వంటగదిలోకెళ్ళి రెండు చపాతీలు చేసుకుంది. ప్లేటులో వేసుకుని కూరగిన్నె తీసుకుని వచ్చి టి.వి ముందు కూర్చుంది. ఇంతవరకు ఆకలి తెలియకుండా అలా కూర్చుండిపోయింది. తిన్నది అలా కడుపులోకి వెళ్తుంటే హాయిగా ఉంది. సహజంగా తనెపుడు తినకుండా ఉండదు. ప్రతిశనివారం ఒక్క పొద్దుంటుంది. రోజూ పాలు,గుడ్డు తీసుకుంటుంది. ఏదైనా బాగాలేకపోతే వెంటనే డాక్టర్ దగ్గరకెళ్తుంది. అలా ఇప్పటివరకు ఆరోగ్యం

బాగానే ఉంది. ఇప్పుడు ఎక్కువగా ఆలోచిస్తే ఏమవుతుందో? డాక్టర్ కౌన్సిలింగ్ చేసినపుడు ఎక్కువగా ఆలోచించవద్దన్నాడు. తనేమో ఆలోచించకుండా ఉండలేకపోతుంది.

టి.వి అలా మోగుతూనే ఉంది. తన మనసు టి.వి వైపు వెళ్ళడం లేదు. కొంతసేపు మౌనంగా ఉండి పోయింది. లేచి టి.వి ఆఫ్ చేసి ప్లేటును సింకులో పెట్టి సింకంతా శుభ్రం చేసింది. బైటికి వచ్చింది. చుట్టూ ప్రశాంతంగా ఉంది. లోపలికి వెళ్ళి టైం చూసింది. పదికావస్తుంది. తలుపుగడియపెట్టి వచ్చి పడుకుంది. నిద్ర పట్టడంలేదు. ఆలోచనలు ఆగడంలేదు. ఎలా జరిగిందో తెలియదు. ఏమి జరిగిందో తెలియదు. సడన్‌గా ఫోన్ చేశాడు. మా ఇంట్లో తెలిసిపోయిందన్నాడు. పెద్దగొడవైందన్నాడు. ఇక రాలేనన్నాడు. ఎలా తెలిసింది అంటుండగానే పెట్టేశాడు. ఫోన్ చేస్తే తియ్యడు. వేరే నంబరు నుంచి చేస్తే ఒకటి,రెండుసార్లు తీశాడు. పొడిపొడిగా మాట్లాడతాడు. ఏమైందో విషయం వివరంగా చెప్పడు. ఆలోచనల్తో బుర్ర వేడెక్కింది. అలా ఎప్పటికో నిద్రపట్టింది.

తెల్లవారి ఆదివారం పొద్దు బాగా పైకొచ్చింది. ఎండ తీవ్రంగా ఉంది. ఫోను మోగుతుంది. మత్తుగా ఉంది లేవబుద్ధికాలేదు. రెండోసారి మోగింది. బద్ధకంగా ఉంది. అట్లానే ఉండిపోయింది. మూడోసారి మోగింది. ఎవరా అనుకుంది. లేచి చూసింది. కృష్ణ. ఎంతో సంతోషం. ఒకింత ఆశ్చర్యం. తీసి హలో అంది. ఆ.....నేనే ..అన్నాడు. బాగున్నారా అంది. ఆ అన్నాడు. రేపు సాయంత్రం డ్యూటీ అయిపోయాక సింహాచలంలో కలుద్దామన్నాడు. సరేనంది. ఫోను పెట్టేశాడు. కొంచెంసేపు మాటాడచ్చుకదా అనుకుంది.

సాయంకాలం ఆరుకావస్తుండగా ఆఫీసునుండి బైటపడిరది. నిన్నంతా ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూసింది. ఈ రోజంతా ఎప్పుడు సాయంకాలమవుతుందా అని ఎదురుచూసింది. ఎదురుచూసిన సాయంకాలం రానే వచ్చింది. ఆఫీసునుండి నడుచుకుంటూ వస్తుంది. ఆఫీసుల నుండి ఇళ్లకెళ్ళేవాళ్ళు ఇళ్లనుండి గుడికెళ్లేవాళ్ళు గుడినుండి వచ్చేవాళ్ళు ఆ ప్రాంతమంతా రద్దీగా ఉంది. ఎప్పుడూ కలిసే దగ్గర కాకుండా ఇక్కడకు రమ్మన్నాడంటే శుభమే జరుగుతుందేమో, జరగాలని మనసులోనే దేవుణ్ణి కోరుకుంది. తను ప్రతీరోజు ఉదయం పూజచేస్తుంది. తన పూజ వృధా కాలేదేమో అనుకుంటూ నడుస్తూ ఉంది. బస్టాండు దగ్గరకొచ్చింది. బాగా రద్దీగా ఉంది. ఎక్కడి కొస్తాడో, ఎక్కడుండాలో అర్థం కాలేదు. ఫోన్ చేద్దామా అనుకుంటూ ఉంది. సత్రాలన్నీ భక్తులతో నిండుగా, రద్దీగా ఉన్నాయి. మొక్కులు

తీర్చుకునేవాళ్లు దైవదర్శనానికొచ్చినవాళ్ళతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా ఉంది. తిరిగి వెళ్ళేవాళ్ళు హడావిడిగా బస్టాండుకొస్తున్నారు. గుడికి వెళ్దామా అనుకుంది. నాలుగడుగులు వేసింది. ఫోను మోగింది. ఎక్కడున్నావ్ అన్నాడు. బస్టాండు దగ్గరలో అంది. అక్కడే ఉండు వస్తున్నా అన్నాడు. బస్టాండులో కొచ్చి పదినిమిషాలు అలాగే నిలబడిరది. వచ్చాడు. నవ్వుతూ పలకరించింది. కొంచెం పక్కకు తీసుకెళ్లాడు. తను తీసుకున్న చైను తీసి చేతిలో పెట్టాడు. తను అలాగే చూస్తుంది. ఎప్పుడు తెచ్చారు అంది. ఈ రోజే తెచ్చాను అన్నాడు. మరి డబ్బులు అందాయా అనబోతోంది. ఇప్పుడు టైం లేదు, తర్వాత మట్లాడతాను అని గబగబా వెళ్ళిపోయాడు. వెళ్తున్నవైపే అలా చూస్తూ ఉండిపోయింది.

సింహాచలం కొండమీద అర్థమానవుడు వికృతంగా నవ్వుతున్నట్టున్నాడు.

# రమాదేవి కొడుకు

## కె. సుభాషిణి

'దీన్ని పొరబాటు అనల్నా ల్యాక గ్రహపాటు అనుకోవాల్నా' కొన్ని రోజులుగా అనుకున్న మాటల్నే పదే పదే అనుకుంటోంది రమాదేవి. గ్రహపాటు అని అనిపించినపుడు 'నా టైమ్ బాగలేక ఇట్ల అయితాండాదేమో... అయినా నా టైమ్ ఎప్పుడు బాగుంది గనక' అని దిగులు పడి తనకు సంబంధించిన వాళ్లనందరిని వరుసగా గుర్తు చేసుకుంటుంది రమాదేవి. పదో తరగతి చదువుతుండగానే పెండ్లి చేసిన తండ్రిని, పిల్లల్ను తనకు వదిలేసి అర్థాంతరంగా ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయిన భర్తను, ఇప్పుడు తనను అప్పుల పాలు చేస్తున్న కొడుకును అందరిని వరుస పెట్టి తిట్టడం మొదలుపెడ్తుంది. అంతలోనే 'ఇది గుడ్డిగా ఈ నా కొడుకు మాటలు నమ్మితి'... అని తనను తాను తిట్టుకోవడం మొదలైన ఉక్రోషం కొడుకు మీద కోపంగా మారిపోతుంది.

ఇంట్లో పని చేసుకోడానికీ, ఆఫీసులో రోజుకు పదిసార్లు మెట్లెక్కి దిగడానికైనా బలవంతంగా నాలుగు ముద్దలు మింగుతోంది రమాదేవి. నీళ్లకోసమో, టీ కోసమో లేకపోతే ఫైల్స్ అటూ ఇటూ ఇచ్చి రావడానికో ఆఫీసులో రెండంతస్తుల బిల్డింగ్ ఎక్కి దిగుతూనే ఉంటుంది రమాదేవి. ఈ మధ్య కాలంలో కంటినిండా నిద్ర లేదు రమాదేవికి. ఎప్పుడూ కలత నిద్రే.

చదువు మానిపించి పెండ్లి చేస్తామని ఇంట్లో వాళ్ళు అన్నప్పుడు ఏడ్చిన ఏడుపు, భర్త చనిపోయినప్పుడు ఏడ్చిన ఏడుపు ఇప్పుడయితే రావటం లేదు కాని దిగులు, భయంతో తల్లడిల్లిపోతోంది. ఒకవైపు కొడుకు మీద ఉన్న ప్రేమ, ఇంకొకవైపు కొడుకు మీద పట్టరానంతంగా వస్తున్న కోపం రెండింటి మధ్య నలిగిపోతోంది రమాదేవి.

'ఎట్లన్నా పోనీ...! ఎంతకని పోరాడేది... ఎన్ని తిప్పలని పడేది. వాడు అడగడం ఎనకా ముందు చూసుకోకుండా వాని చేతుల్లో పెట్టడం... వాడు ఆడింది ఆట

పాడింది పాట అయిపాయా...! ఆయన పోయినాకా ఎంతమంది చుట్టాలు ఇంటికి వచ్చేటోళ్లు...? ఎట్ల డబ్బులు అడిగేటోళ్లు...? ఏనాడు ఒక్కరికి ఒక వంద రూపాయలు ఇచ్చిన పాపాన పోలేదు...! అందరూ ఎన్నెన్ని మాటలు అనుకునేవాళ్లో...!'

బంధువులు తన గురించి మాట్లాడే మాటలు రమాదేవి ఎప్పుడూ మరిచిపోదు.

'రమాదేవి చాలా గట్టిది... ఒక్క రూపాయి కూడా అనవసరంగా ఖర్చు పెట్టే రకం కాదు. ఒకర్ని అడగదు... ఇంకొకరికి ఒక రూపాయి రాల్చదు...' అది పొగడ్తో, ఎత్తిపొడుపో ఏదయినా సరే రమాదేవి దాని గురించి ఎక్కువ ఆలోచించేది కాదు. తమ మాటలకు రోషం తెచ్చుకొని రమాదేవి తమ కోసం ఖర్చుపెడుతుందేమో లేకపోతే అప్పుగా ఏమన్న డబ్బులు అడిగితే ఇస్తుందేమో అని ఆశించే బంధువులను అంత దూరంలోనే ఉంచింది. రమాదేవికి అటు పుట్టింటి వైపు చూసినా ఇటు అత్తింటి వైపు చూసినా బంధువులందరూ దాదాపు రైతులే. రైతులకు అప్పు ఇస్తే వాళ్లను మరింతగా అప్పుల పాలు చేసినట్టవుతుందని పైగా వాళ్లకిస్తే వడ్డీ కాదు కదా అసలు కూడా రాబట్టుకోలేను అని రమాదేవికి గాఢమైన నమ్మకం.

బంధువులు ఎవరైనా మాట సహాయమో లేక చేయి సహాయమో చేసిన వాళ్లయితే, వాళ్లు ఇంటికి వచ్చినప్పుడు అరకేజి శెనగబేడలు ఉడకబెట్టి బెల్లం వేసి రుబ్బి భక్ష్యాలు చేసిపెట్టేది. ఒకవేళ వాళ్లు ఆదివారం పూట కూడా నిలిచిపోతే మెత్తటి, పలుచటి జొన్న రొట్టెలు పొంగేలా చేసి అందులోకి కోడిపులుసు చేసిపెట్టేది. కారం మసాలా బాగా దట్టించి వండేది. 'రమాదేవికి మా మీద చానా ప్రేమ ఉన్నట్టుంది. అడిగితే ఏమన్నా డబ్బులు ఇస్తుందేమో ఓ రెండు రోజులు ఆగి కదుపుదాం...' అని అనుకునే వాళ్ల ఆలోచనలను ముందుగానే పసిగట్టేది. వాళ్ళకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా భర్త చనిపోతే ఒంటరిగా ఉండే స్త్రీ పడే బాధలూ, ఇంట్లో ఉండే ఇబ్బందులూ, పిల్లల చదువులూ, వాళ్ల ఖర్చులూ, పెండ్లిల్లూ... ఇలా వరుసగా ఏకరువు పెట్టి వాళ్ల ముందు కాళ్లకు బంధం వేసేది. వాళ్లను నేరుగా నొప్పించకుండా అలా మాట్లాడేది కాని లోపల మాత్రం...

'ముప్పై రెండేళ్లకే మొగున్ని పొగొట్టుకొని ఇద్దరు పిల్లలతో పాపం ఆడ కూతురు ఏం ఇబ్బంది పడ్తాందో అని నాకు చేయాల్సింది పోయి నా మీదనే పడి ఏడుస్తుండారు వీళ్లందరు... ఒకరా ఇద్దరా! ఒగరికిస్తే ఇంగొగరు వూరుకుంటారా! ఏం మేము అంత కానోళ్లమా? మామీద అంత నమ్మం లేదా... ఓయమ్మో ఒగటి కాదులే! మెత్తగా ఉంటే మొత్తుతారు. అయ్యో పాపం అనుకుంటే ఇంక అంతే సంగతులు... నేను నా పిల్లలు అడక్కతినాల్సిందే... వాళ్లకు ఇయ్యడమూ వద్దు... వాళ్ల కాడ

తీసుకోడం వద్దు...' అని ఎప్పుడో పది సంవత్సరాల కిందట నిర్ణయించుకున్న రమాదేవికి ఈ రోజు బంధువుల దగ్గర చేయి చాపి అడగడానికి ఆమె మనసు వొప్పుకోవటం లేదు.

గేట్ తీస్తుంటే టీవిలో నుండి గోలగోలగా పాటలు వినిపించాయి రమాదేవికి. దానితో పాటు ఫుల్ స్పీడులో తిరుగుతున్న ఫ్యాన్ శబ్దం...

'వీడు వచ్చినట్లుండాడు... ఇంట్లోకి అడుగు పెట్టి పెట్టిగానే ఇంగ మొదలు పెడ్తాడు... అయినా వీడు ఈ టైమ్‌లో ఇంట్లో ఎందుకున్నట్లు...'

సెల్లులో మెసేజ్ టైపు చేసుకుంటు వాళ్ల అమ్మ వచ్చింది కూడా గమనించలేదు దిలీప్. టీవి సౌండ్ తగ్గించి ఫ్యాన్ ఆఫ్ చేసింది రమాదేవి. విసుగ్గా వాళ్ళమ్మ వైపు చూశాడు.

"అవసరం ఉన్నా లేకపోయినా ఫ్యాన్ మాత్రం నీకు రేయింబగలు తిరుగు తుండాలేమో కదా? టీవీ కూడా అంత సౌండ్ పెట్టుకోవాలా? బయటకు యినిపిస్తాంది."

"ఏదో చిన్నప్పటి నుండి అట్ల అలవాటు అయిపోయింది. ఆ శబ్దం లేకపోతే ఏం తోచదు..." లేచి మళ్లీ ఫ్యాన్ వేసుకున్నాడు దిలీప్.

ఉండబట్టలేక అనాలే గాని కొడుకు వినే రకం కాదు అని రమాదేవికి తెలుసు. బ్యాగ్ తీసి అల్మారాలో పెడ్తుంటే అప్పుడు కనిపించాయి మూలకు ఒకదానిపైన ఇంకొకటి పేర్చి పెట్టిన పెద్ద పెద్ద అట్ట పెట్టెలు.

"ఏంటివిరా యివల్లా..." తెలిసినా అనుకోకుండా అడిగేసింది రమాదేవి.

"కనిపించడంల్యా... కంప్యూటర్లూ, స్కానరూ, ప్రింటరూ, ఇన్వర్టరూ..."

"ఆఫీసులో వున్నీ కుండా ఏంటికి ఇంటికి తీసుకొచ్చినావ్.."

"ఆఫీస్ లేదు... గీఫీస్ లేదు... ఎందుకు వూరికే రెంట్ దండగ..."

"అంటే ఆఫీస్ మూసేసినావా?..."

"అప్పుడే ఎందుకు మూసేస్తాను... మనది వాళ్ళ దగ్గర రెండు నెల్ల అడ్వాన్స్ ఉంది కదా!..."

కోపం, దుఃఖం, బాధ ఒకదానికొకటి తన్నుకొని వచ్చాయి రమాదేవికి. దేనికయితే భయపడుతూ వచ్చిందో, ఏదయితే జరగకూడదని కోరుకుందో ఇప్పుడు అదే జరగబోతోంది.

తల్లి ఏమీ మాట్లాడకుండా, అరవకుండా వుదాసీనంగా ఉండిపోవటం దీలిప్‌కు ఇబ్బందిగా అనిపించింది. తల్లి కోపగించుకుంటే ఏం సమాధానం చెప్పాలో దిలీప్

ముందే ప్రిపేర్ అయ్యాడు.

'ఇంత పెట్టుబడి పెట్టి ఇప్పుడు ఎనక్కు తగ్గితే ఎట్లా...? మొత్తం అంతా నష్టమే అయితాది... ఇంకొక రెండు మూడు లక్షలు పెడ్తే సెంటర్ రన్ అయితాది... మెల్లిగా నచ్చచెప్పి ఇంగొకసారి గట్టిగా అడగాలా

"మరి ఈ సామాను, పెట్టిన పెట్టుబడి ఎట్లరా మరి... ఎట్ల బయట పడ్తాం మనం...? ఉండేదంతా అయిపోగొట్టుకుంటిమి... రేపు ఏదన్నా పెద్ద అవసరం పడ్తే ఎట్లా...? చెప్తే వినకపోతివి..." నిష్ఠూరం, బాధ, భయం, కోపం అన్నీ కలగలిపి రమాదేవి గొంతులో నుండి పోటి పడి బయటకు వచ్చాయి.

'మళ్లీ నస మొదలు పెట్టింది. చెప్తే అర్థం కాదు... స్వతహాగా తెలుసుకోలేదు... అన్నిటికి భయమే... ముందుకే పోనియ్యదు... ఈమె భయంతోనూ చాదస్తంతోనూ చస్తున్నా... మొత్తానికి మహాతల్లి... ఎట్ల పుట్టిందో... మా నాన్న ఎట్ల భరించినాడో ఈమెను...? ఖర్చు పెట్టే దమ్ము లేదు... సంపాయించే తెలివి తేటలు లేవు... ఉండేటివి ఖర్చు కాకుంటే చాలు ఈమెకు... కానీ మళ్లీ కొడుకు బాగుండాల... మంచి పొజిషన్‌లో ఉండాల... డబ్బులు సంపాయించాల... సుఖపడాల... వూరికే కోరిక ఉంటే సరిపోతుందా...? ఏందో... ఈమే, ఈమె లాజిక్, ఈమె ఆలోచనలు...! ఈవిడ మారదు అంతే... మారే రకం కూడా కాదు. ఫ్యాన్ వేసుకుంటేనే ఎందుకు అనవసరంగా కరెంట్ దండగ అనే ఈమె ఇంగ జీవితంలో ఏ.సి. పెట్టిస్తుందనేది కలలో మాటే. డొక్కు డబ్బా కూలర్ ఒకటి ఏడ్చింది ఇంట్లో. ఇంక అందరికి అదే. అక్కా, బావా వస్తే వాళ్లకు కూడా అదే గతి... రేపు నా పెండ్లి అయినాక దీంతోనే అడ్జస్టు అవ్వమంటాది గ్యారంటీగా.... వీళ్ల మాదిరిగా అన్నిటికి సర్దుకొని బతికే ఖర్మ ఏం పట్టింది... వంద రూపాయలు ఖర్చు చేయాలంటే పదిసార్లు ఆలోచిస్తే ఇంక జీవితంలో ఏం ఎంజాయ్ చేస్తాం. అందరూ ఎట్లా ఎంజాయ్ చేస్తుండారు..! డబ్బులు సంపాదించాలా... ఎంజాయ్ చేయాలా... గీసి గీసి ఖర్చు పెట్టే అమ్మకేం తెలుసు ఎంజాయ్ చేయడం అంటే ఏందో... ఒగరికియ్యదు. తనకూ ఖర్చు పెట్టుకోదు...'

కొడుకు చూపులు, ముఖకవలికలు అర్థం చేసుకోలేనంత అమాయకురాలు కాదు రమాదేవి. తన మాటలు సుత్తిగా, తన చేష్టలు పిసినారితనంగా, తన భయం చాదస్తంగా దిలీప్ తీసిపారేయ్యటం రమాదేవికి నిరంతరం అనుభవంలోనే ఉన్న విషయమే.

"అట్ల భయపడితే ఎట్లమా? అందరూ మనలెక్కనే బయపడ్తాన్నారా? ధైర్యం చేయాలమా! బిజినెస్ అంటే అంతే మరి. పెట్టుబడి పెడ్తాంటేనే నడిచేది... లక్ష

రూపాయల్ను పది లక్షలు చేయడం కష్టం. అదే పది లక్షలు పెట్టినామనుకో రెండేళ్లల్లో యాభై లక్షలు మన కళ్ల ముందు ఉంటాయి... మా ఫ్రెండ్ రాజీవ్ లేడు వాళ్ల బావ మూడేండ్లల్లో ఎంత బిజినెస్ డెవలప్ చేసినాడనుకున్నావ్...! మొన్ననే యాభై లక్షలు పెట్టి ఇల్లు కట్టించినాడు... ఇల్లు ఏముండాది అనుకున్నావ్... వాళ్ళది కూడా పెద్ద సౌండ్ ఫ్యామిలీ ఏం కాదు. బయట అక్కడా ఇక్కడా తెచ్చి బిజినెస్సులో పెడ్తా వచ్చినారు... నమ్మకం ఉండాలా. భయపడేటోళ్లు బిజినెస్సుకు పనికి రారు... బిజినెస్సులో లాభాలు వెంటనే రావు... టైమ్ పడ్తుంది... కొంచెం వోపిక పట్టాలా..." రెండు చేతులు మెడ వెనుకపెట్టుకొని కుర్చీలో వెనక్కు వాలి పైన తిరుగుతున్న ఫ్యాన్ వైపు తదేకంగా చూస్తున్నాడు దిలీప్. దిలీప్ దృష్టి ఎంత సేపు విజేతలపైనే ఉంటుంది. పరాజితులను చేత కానివాళ్లు, దమ్ములేని వాళ్లు అని వెక్కిరిస్తుంటాడు. "వాళ్లు ఇంత సంపాయిచ్చినారు... వీళ్లు ఇంత సంపాయిచ్చినారు అని చెప్తాన్నావ్ బానే ఉంది... అందరికి కల్సి రావద్దా... వ్యాపారం అంటే మాటలా... పొద్దున లేసిన దగ్గర నుండి అబద్ధాలు చెప్తానే వుండాలా! ఎవరు దొరుకుతారా ఎవరి నెత్తిన చేతులు పెడ్తామా అని ఎతుకుతాండాలా...! అట్లయితేనే నెగ్గుకు రాగలవు... మనట్లా వాళ్ల చాత యాడయితాది? ఇంజనీరింగ్ చదివితివి! యాడో ఒకచోట ఉద్యోగం చూసుకో అని నెత్తిన నోరు పెట్టుకోని చెప్తి... ఏదో ఉన్న కాటికి వున్నిందుము. అప్పు సప్పు ల్యాకుండా ఆడపిల్ల పెండ్లి చేస్తిమి. నీ సదువు కూడా ఏం ఇబ్బంది లేకుండా అయిపాయా... అంతో ఇంతో మిగిలిండేది తీస్కపోయి కంప్యూటర్ సెంటర్ పెడ్తివి. కాలేజీలు పని చేయిచ్చుకుంటాయి అంటివి, వాళ్లు ఎవరూ నిన్ను అడగడం లేదని యావో కోచింగులూ, కోర్సులూ అని మొదలుపెడ్తివి... దాండ్లకు డిమాండ్ పడిపోయిందని, ఎవరూ చేరడం లేదని వద్దనుకుంటివి. మళ్లీ ఇంకా ఏందో యానిమేషన్ అంటివి. నా శక్తికొద్ది ఆ లోను ఈ లోనూ పెట్టి, చీటి పాడి నీ చేతిలో పెడ్తి... అదికూడా ఎత్తిపాయా... తర్వాత పాత సినిమాలను కలర్లలోకి మార్చాల... దీనికి తిరుగే ఉండదు అంటివి. సరే ఉండేది ఎప్పటికైనా నీకే కదా! ఉంచుకుంటే ఉంచుకో లేదా ఖర్చు పెట్టుకో అన్నట్టు పిఎఫ్‌లోనూ పెట్టి తీసి ఇస్తి... ఇన్ని చేస్తివి... బానే ఉంది. మొదలుపెట్టేతప్పుడు ఏం చెప్తివి...! మూడు లక్షలు పెడ్తే చాలుమా మూడు నెల్లల్లో నెలకు యాభై వేలు ఆదాయం ఉంటుంది. ఖర్చులన్నీ పోనూ ఎంతలేదన్న కనీసం నెలకు ముప్పై వేలు మిగులుతుంది అంటివి... ఏదీ? ఆఫీసుకు రెంట్ కోసం కూడా నా జీతంలోదే యియ్యాల్సొచ్చింది... మధ్యలో అడ్డం రావద్దు నన్ను చెప్పనీ... కొడుకు బాగుపడాలనే ప్రతి తల్లి కోరుకుంటాది. ఇప్పుడు ఇంకా

కావాలా అంటే నేను యాన్నుండి తెచ్చి యియ్యాల్నో నువ్వే చెప్పు...”

ఎప్పుడూ ఒకటి రెండు మాటలు తప్ప ఎక్కువ మాట్లాడని తల్లి అంత సుదీర్ఘంగా మాట్లాడే సరికి ఆశ్చర్యపోయాడు దిలీప్. ఏదో చెప్పడానికి ప్రయత్నించాడు. కాని ఇది సమయం కాదు అనిపించింది దిలీప్‌కు. ఇప్పుడు ఏమన్నా మాట్లాడినా తల్లి రెచ్చిపోతుందేమో అని భయపడ్డాడు. మాటలు పొడిగించడం ఇష్టం లేక రమాదేవి పక్క గదిలోకి వెళ్లిపోయింది. మూసినా తలుపుల వైపు గుబులు గుబులుగా చూసాడు దిలీప్.

అనుకున్నది తారుమారు కావడంతో దిక్కు తోచనట్టయ్యింది. ఆలోచించే కొద్దీ ఆందోళన ఎక్కువవుతోంది దిలీప్‌కు. కాళ్లు చాపి టీపాయి మీద పెట్టుకున్నాడు. టీవిలో ఏవో రంగురంగుల బొమ్మలు కదులుతున్నా, అవి తనకు సంబంధించినవిగా అనిపించడం లేదు దిలీప్‌కు. లేచి టీవీ ఆఫ్ చేయాలనిపించక అట్లే కూర్చుండి పోయాడు.

‘ప్చ్... ఏందిది ఇట్ల అయిపాయా? ఇట్ల అయితాది అని అనుకోనే లేదే...? చుట్టుపక్కల ఇంజనీరింగ్ కాలేజీలు దండిగా ఉండాయి, వాళ్లకు ఎట్లా ల్యాన్ నెట్‌వర్కింగ్ అవసరం ఉంటాది గ్యారంటీగా కాంట్రాక్ట్ మనకు కాక ఇంకేవరికిస్తార్లే అని మొదలు పెడ్తే ఖర్మకాలి మూడు కాలేజీలు ఎత్తిపాయా...! శని కాకపోతే ఈ సంవత్సరమే స్టూడెంట్స్ చేరకుండాపోవాల్నా? దరిద్రం అన్నీ అట్లే అయిపాయా?! ఎవర్ని అనాలా? ఒపెనింగ్స్ లేవని చెప్పిన సాఫ్ట్‌వేర్ కంపెనీలను అనాల్నా...? కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ లేదని భయపడిన స్టూడెంట్సును అనుకోవాల్నా? ఛ... ఛ... అంతా కూరగాయల మార్కెట్ లాగా అయిపోయింది... అంతే ఇది కూడా ఒక రకమైన మార్కెట్టే... యానిమేషన్ కూడా అంతే... ఇప్పుడు ఈ కలరైజేషన్‌కు ఫుల్ మార్కెట్ ఉందంటున్నారు. ఇంటర్‌నెట్‌లో చూస్తే కదా తెలిసింది! ఇంటర్‌నెట్‌లో ఇప్పుడు దీని హవానే నడుస్తోంది. ముందు దీన్నే మొదలు పెట్టింటే బాగుండు... ఎవరు కలగన్నారు ఇట్ల అయితాదని... కానీ... ఇప్పుడు మాత్రం ఏమయింది...? ఎట్లనోగట్ల రెండు మూడు లక్షలు ఇన్వెస్టు చేస్తే బయటపడేది గ్యారంటి...! అమ్మేమో గిమగిమ అంటే వొప్పుకోకుంది... కోపం కూడా సుమారుగా వచ్చినట్టుంది... ఆ... ఈమె కోపం ఎంతసేపులే...’

మూసిన తలుపు వైపు కొన్ని క్షణాలు అట్లే చూశాడు. మెల్లిగా లేచి ముఖం కడుక్కోని వచ్చాడు. బట్టలు మార్చుకుంటూ తల్లి ఏం చేస్తోందా అని వోరకంటితో చూశాడు. రమాదేవి అటువైపు తిరిగి చీర మడత పెట్టుకుంటోంది. తల్లి ఏమైనా

మాట్లాడుతుందేమో అని కొన్ని క్షణాలు ఆగాడు. చీరను బీరువాలో పెట్టి గదిలో నుండి బయటకు వెళ్లిపోయింది. రమాదేవి కోపం ఎక్కువ సేపు ఉండేది కాదు అని దిలీప్‌కు తెలుసు. పెదవి కొరుక్కుంటూ కాసేపు అలాగే నిలబడిపోయాడు దిలీప్.

'నేనే కొంచెం బిర్రుగుంటే, రేపు ఈ పాటికంతా మామూలుగా మాట్లాడదూ...? కొడుకు కోసం ఆ మాత్రం తగ్గదా? నాకు గాక ఇంకెవరికి చేస్తుంది? నేనైనా అమ్మను కాకపోతే ఇంకెవర్ని అడుగుతాను. ఇంకొక రెండు మూడు లక్షలు సపోర్ట్ చేస్తే చాలు గ్యారంటీగా డెవలప్ అవుతుంది. అదే చెప్పాలి అమ్మతో. ఇదే లాస్ట్ తర్వాత అడగను అని కూడా చెప్పాలి... ఎట్లనో గట్ల అడ్జస్ట్ చేస్తుందిలే... ఎన్ని దినాలు ఇట్లా గొర్రె తోక బెత్తెడు అన్నట్లు ఉండేది? ఎట్ల సంపాయించినారు అని ఎవరూ అడగరు. ఎంత సంపాదించినావు అనేదే ముఖ్యం... డబ్బులు ఉంటేనే లగ్జురీస్, కంఫర్ట్స్ ఉండేది. అట్లయితేనే ఎంజాయిమెంట్ ఉండేది...! ఎంజాయిమెంట్ లేని లైఫ్ ఏం లైఫ్? డబ్బుల్ని మిగిల్చుకోవడమే జీవితం కాదు... అందులో ఏం ఎంజాయిమెంట్ ఉంటుంది? ఉన్న డబ్బుల్ని మల్టిప్లయ్ చేయాల... కంఫర్టుగా లైఫ్ లీడ్ చేయాల... ఇల్లు ఇట్ల సాదాసీదాగా ఉంటే ఏం బాగుంటుంది... దరిద్రంగా ఉంటుంది. పెండ్లి చేసుకోడానికి ముందే మంచి ఇల్లు, సామాన్లు, కారు ఉంటే బయట నలుగురిలో వ్యాల్యూ ఉంటుంది. మెల్లిగా అమ్మకే తెలుస్తుంది. తమ ఇంట్లో లైఫ్ స్టైల్ ఎలా మారిపోతుందో... అప్పుడు అమ్మకు ఈ అటెండర్ ఉద్యోగం చేయడం ఏం ఖర్మ...! మా అమ్మ అటెండర్ అని నలుగురిలో చెప్పుకోవాలంటే కూడా ఇబ్బందిగా ఉంటుంది. ఉద్యోగం మానేయ్యమని అమ్మకు చెప్పాల... హాయిగా ఇంట్లో ఉండి ఎంజాయ్ చేస్తుంది. ఇవన్నీ జరగాలంటే ముందు అమ్మను ఎట్లన్న సరే వొప్పించాల..! వొప్పుకుంటాదిలే..! వొప్పుకోక ఎక్కడికి పోతాదిలే... అక్కా వాళ్లతో కూడా మాట్లాడాల..'

పన్నెండు దాటినా దిలీప్ ఇంటికి రాకపోయేసరికి రమాదేవికి దిక్కు తోచలేదు. అప్పుడప్పుడూ దిలీప్ ఫ్రెండ్ రూములో ఉండిపోవటం మామూలే.

"ఏం నాయనా! రాత్రికి ఇంటికి రాలేదు. అన్నం అంతా మిగిలిపోయింది." అని రమాదేవి అడిగితే.

"కొంచెం వర్క్ ఉండే... కంప్యూటర్లు చెక్ చేసి కొత్త సాఫ్ట్‌వేర్ లోడ్ చేస్తాంటిమి... లేట్ అయిపాయా... అందుకే రాత్రికి ఇంటికి రాలేదు" అని చెప్పేవాడు.

ఒక్కొక్కసారి ఆ మాటల్ని నమ్మేది... ఒక్కొక్కసారి 'వీళ్లందరు ఒక రూములో చేరి ఏం చేస్తుంటారో' అని కొడుకు మీద అనుమానంగా కూడా ఉండేది.

మగపిల్లలందరు ఒక చోట చేరితే ఏం చేస్తుంటారో రమాదేవి ఎప్పుడూ

చూడలేదు. అయితే భర్త బ్రతికుండగా అతను చెప్పిన విషయాలు గుర్తుకు వచ్చినపుడూ... ఆఫీసులో మాట్లాడుకునే మాటలు చెవిలో దూరినపుడు కొడుకు మీద కోపం వచ్చేది. అల్లరి పిల్లలతో వీనికి ఏం పని అని విసుక్కునేది. కొంప దీసి వీడు కూడా తాగడం అలవాటు చేసుకుంటున్నాడేమో అని భయం కలిగేది రమాదేవికి. దానికి తోడు ఒకసారి రమాదేవి సొంతం చెల్లెలి మొగుడు.

"వదినా! మన దిలీప్‌కు ఎవరి భయమో ఒకరి భయం ఉండాల లేకపోతే అల్లరి పట్టిపోతాడు... ఈ కాలం పిల్లోల్లని నమ్మేకి లేదు... మనోడు ఎప్పుడూ ఫ్రెండ్స్ అని వాళ్లతో భలే జోరుగా తిరుగుతాంటాడు... మొన్న రాత్రి వాని దగ్గర వాసన వచ్చింది. అందుకే చెప్తాండా" అని మరిది అన్నప్పుడు కొడుకు మీద ఉన్న గుడ్డి ప్రేమతోనే లేదా నమ్మకంతోనో మరిది పైననే కోపం తెచ్చుకొని.

"నా కొడుకు సాన పట్టని వజ్రం లాంటోడు ఎవరు చెప్పనా నేను నమ్మను. వానికి ఇంటి పరిస్థితులు తెలుసు. చిన్న వయసులోనే ఇంటి పనులు ఎన్నెన్ని చేసినాడో..." అంటూ ఆ రోజు కొడుకును వెనకేసుకొని రావడం అయితే జరిగింది కాని అనుమానం మాత్రం మరింత పెరిగింది.

వయసు వచ్చిన కొడుకుతో ఆ విషయం నేరుగా మాట్లాడకుండా, చిన్న వయసులోనే తాగుడుకు అలవాటు పడి నాశనం అయిన సంసారాలను గురించి చెప్పి బాధపడేది. వాళ్ల తాగుడు వలన యింటిల్లిపాది ఎట్ల నలిగిపోయారో ఉదాహరణలతో సహా వివరించేది.

'తండ్రి లేని పిల్లోడు అని ఏమీ అనకుండా, అర్చకుండా వీన్ని ఎక్కువ గారాబం చేసి పాడు చేశానా' అని తనలో తాను తర్కించుకోవడం మొదలు పెట్టింది.

'నీ కొడుకు మీద ప్రేమ ఎక్కువమా అనేది ఆ పాప ఎప్పుడూ...! నిజమేనేమో! వాడు ఏం చేసినా కరెక్టే అనిపించేది... అదే ఇంత పని చేసిందేమో? వీనికి ముందే గట్టిగా చెప్పింటే మానుకునేవాడేమో! మానుకునే రకమేనా వీడు? అలిగిదేతీ... రెండు రోజులు ఇంటికి రాకుండా ఉండేది... మా నానే ఉన్నింటే నా బతుకు ఇట్ల ఉండేదా అంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడేది. అసలు వీనికి ఈ ఆలోచన ఎందుకు వచ్చినట్టు? అంత డబ్బులు సంపాదించాలనే ఆశ వీనికి ఎట్ల పుట్టింది? వీని తలకాయలోకి ఎవరు ఎక్కిచ్చింటారు? ఎవరన్నా ఒకరు ఎక్కియ్యాల్నా వీళ్లకు? అందర్నీ చూస్తుంటాడు... ఇరవై నాలుగు గంటలూ టీవి ముందరన్నా కుచ్చోవాల్లా లేకుంటే కంప్యూటర్ ముందన్నా కూలబడాలా మధ్యలో సెల్లు ఒకటి! కళ్ల ముందర రకరకాలవి, కొత్తకొత్తవి కనిపిస్తాంటే వూరికే ఉండలేరు కావాలనిపిస్తుంది. వయసు అట్లాంటిది.

అందులోనూ ఈ కాలం పిల్లలు మరీ. పట్టడం కష్టమయిపోతాంది. 'రమాదేవికి దిలీప్ కోరికలు, రుచులు, ఖరీదయిన వాటి మీద ఉండే మోజు అన్నీ కలగాపులగంగా గుర్తుకు రాసాగాయి.

ఇంట్లో ఖరీదయినా సామాన్లు లేవని ఎప్పుడూ గొణుగుడే... చికెన్ పులుసు చేస్తే ముఖం అంతా గంటు పెట్టుకొని "ఏందిమా అంత యిట్లా నీళ్లు నీళ్లు ఉంది. తినబుద్దేగాదు... ఫ్రై చేయకూడదూ అనేవాడు. అరకేజి చికెన్తో ఫ్రై చేస్తే వానికొక్కనికి ఒక పూటకు సరిపోతుంది. మిగిలిన ఇద్దరి సంగతి? అదే మసాలా పెట్టి పులుసు చేస్తే ముగ్గురికి రెండు పూటలా వస్తుంది. వారం వారం కిలోలు కిలోలు చికెన్ తెచ్చి ఫ్రై జేసేకి తనకు వచ్చే జీతం ఎంతనీ? వానికి అర్థం అయ్యేదే కాదు. ప్రతిది అంతే. వొట్టి పాలతోనే టీ చేసి ఇమ్మనేటోడు. ఎప్పుడూ చూసిన ఏదో ఒకటి కావాల వానికి. బైకు కోసం ఎంత రాద్ధాంతం చేసే... ఫైనల్ ఇయర్లో కొనియ్యక తప్పలేదు. దాని కోసం లోన్. ఇది ఇంగా సగం పైన అట్టనే ఉంది. దాని ఊసే ఎత్తడు. బండో అని వాడు మొత్తుకోడం... అప్పుచేయడం.. వాని మోజు తీర్చడం... నెలకు రెండు వేలు కటింగ్... దానికి తోడూ వీడు తిరగడానికి అయ్యే పెట్రోల్ ఖర్చు... బండిలోనూ అంటే సరి, ఏదో జీతంలో నెలనెల కొంచెం కట్ అయితాది కాబట్టి ఎట్లోగట్ల తీర్చుకోవచ్చు... కాని, యాడాడో ఉన్నిందీ, ఎప్పటి నుండో మిగుల్చుకునిండేదీ అంతా మొత్తం వూడ్చుకపోయి కంప్యూటర్ల వాతన పెట్టే... ఇప్పుడు ఇంకా కావాల అంటే యాన్నుండి వస్తాయి?... వానికేం ఎవర్నయినా అడుగమని మస్తుగా చెప్తాడు... పైగా ఆర్నెల్లల్లో ఎనక్కు ఇచ్చేస్తాం అని చెప్పాలంట...! ఎట్ల తీరుస్తాడో? ఏం చూసుకొని వానికి అంత ధైర్యం వచ్చిందో అర్థం కాదు... ఇంతవరకు దాంట్లో పోయడమే గాని ఒక్క రూపాయి ఎనిక్కి వచ్చిందో లేదు...'

రమాదేవికి తలచుకోడానికి కూడా భయం వేసింది.

చర్చిలో ఒంటిగంట కొట్టింది. ఇక రాత్రికి దిలీప్ ఇంటికి రాదు అని రమాదేవికి అర్థమయ్యింది. దిగులుగా నిట్టూర్చింది. అదేదో శాపం తగిలినట్టుగా కన్ను మూత పడడం లేదు. భవిష్యత్తు కనురెప్పలను మూయనీయకుండా కాపల కాస్తోంది. దిలీప్ మాటలల్లో చేష్టలల్లో బెదిరింపు లాంటిదేదో రమాదేవికి కనబడుతోంది.

''ఎవర్నన్నా అడగడం నామోషి అనుకుంటే మాత్రం సెంటర్ మూసేసుకోవాల్సిందే!"

"ఏదీ లేకపోతే యాదో ఇంత స్కూల్లో చేరినా మూడు నాలుగు వేలు ఇయ్యకపోరు. ఎట్లనో నా జీవితం గడిచిపోతుంది." దిలీప్ మాటలు గుర్తుకు వస్తున్నాయి రమాదేవికి.

ఇంట్లో పేర్చి పెట్టిన అట్టపెట్టెలు కళ్ల ముందు కదులుతున్నాయి.

'ఏంది వీడు ఇట్లా బెదిరిస్తున్నాడు? అప్పు త్యాకపోతే ఇంగ ఇంతే సంగతులంటాడు...! అంటే ఇంతవరకు పెట్టిన ఎనిమిది లక్షలు ఆవిరి అయిపోయినట్టేనా? ఒకటా... రెండా... ఎనిమిది లక్షలు... ఎన్నేండ్ల నుండో రూపాయి రూపాయి కూడబెట్టుకుంటూ వచ్చిండేటివి... చిటీ కంతులు కట్టేటివి ఇంకా పది పైనే ఉండాయి... ఇంత ఖర్చు పెట్టి ఇప్పుడు ఏమీ ల్యాకుండా బయటకు వచ్చేది ఎట్లా? రాకూడదంటే ఇంకా పెట్టాలా...! పెట్టాలంటే ఎవరినన్నా అడగాల... ఎట్ల అడగాల? దీనికి భయపడే కదా డబ్బుల కోసం వచ్చే చుట్టాలను దూరం పెట్టింది. వాళ్లకందరికి నిష్టూరం అయ్యింది. ఇప్పుడు ఏం మొగం పెట్టుకొని వాళ్ల దగ్గరికి పోయి చేతులు చాపాల? వూరుకుంటారా? ఎప్పుడు చిక్కుతాదా అని కాసుకోని ఉండారు. వాళ్లు ఇచ్చేదేమో కాని వాళ్ల మాటల్ను తట్టుకోడం అంటే అయ్యే పనికాదు... వానికేం చానా సులభంగా చెప్తాడు. బంధువులను అడగొద్దు అనుకుంటే ఆఫీసులో అడుగు అంటాడు. వీనికేం తెలుసు ఆఫీసు సంగతి? ఆ జనాలతో ఎట్ల ఏగిందో వీడు ఏమన్నా చూసినాడా? భర్త లేని ఆడది అని ఎట్ల ఎంటబడి ఏడ్పించినారో అన్న సంగతి ఇంతవరకు వీనికి తెలియదు. తాగుబోతు క్లర్కుకు, ముసలి సూపర్నెంట్ చేతులకు చిక్కకుండా వుండేకి పడిన అగచాట్లు ఒకటా... రెండా...? వీనితో ఎట్ల చెప్పేది? పిల్లలతో చెప్పుకునే సంగతులా ఇవి?' ఎవరినయినా అడగాలంటే ఇబ్బంది. అడగకపోతే పెట్టిన ఎనిమిది లక్షలు నష్టపోవాలి... అంతకు మించి కొడుకు ఏమనుకుంటాడో, ఏమయిపోతాడో అనే భయంతో పాటు ఇంత కష్టపడి చదివించింది యా ప్రైవేట్ స్కూల్లోనో పనిచేయడానికా అన్న దిగులుతో రమాదేవి నలిగిపోతోంది.

'వాడు అన్నట్టు ఇంత డబ్బులు దాంట్లో పెట్టి ఇప్పుడు మూసేస్తే అంతా నష్టమే. అవన్నీ అమ్మితే యాభైవేలో అరవై వేలో వస్తాదంటాడు. ఉత్త పుణ్యానికి ఒక సంవత్సరంలోనే ఏడు లక్షల పైగానే దుంపనాశనం అయిపోయినట్టే...' రమాదేవి గుండె గుభేల్మంది.

గబుక్కున లేచి కూచుంది. కాళ్లు చేతులు చచ్చుపడిపోయినట్టయ్యింది. అనుకోకుండా రాబోతున్న కేకను ఎడమ చేయి అడ్డం పెట్టి బలవంతంగా ఆపేసుకుంది.

'వద్దొద్దు... ఇంత అయినాకా చేతులు ముడుచుకుంటే ఎట్లా... సర్వనాశనం అయిపోతాం... నవ్వుల పాలయిపోతాము... వీనికి ఉద్యోగం ఎప్పుడు వస్తుందో ఎవరు చూసినారు... వాడు ఖాళీగా ఉంటే ఏం బాగుంటుంది? ఏం చేస్తుండావ్

అని అందరూ అడుగుతారు...? విషయం తెలిసనోళ్లు ఎవరైనా పిల్లోనికి ఆ మాత్రం చేయకపోతే ఎట్లనుకుండావ్... మరి పిల్లోళ్లు అంటే వూరికే అయితాదా? వాడు ఏమన్నా జల్సాగా ఖర్చు పెడ్తాన్నాడా? అని అంటే అప్పుడు తలకాయ యాడ పెట్టుకోవాలా? తప్పదు ఎవర్నో ఒకర్ని అడిగి తేవాల్సిందే...! ఒకసారి ఇందులోకి దిగినాకా అంతే డబ్బులు పెడ్తూ పోతూ వుండాల్సిందే. అదృష్టం బాగుంటే బయట పడతాం లేకుంటే... మళ్లీ మళ్లీ అప్పులు తేవాల్సిందే. అప్పులు తీర్చేకి సరిపోతుంది. ఏం మిగలదు... ఉత్త మనుషులం మిగులుతాం... అప్పుడే ఏం లేనోనికి పిల్లను ఎవరైనా ఎట్లిస్తారు...? ఏమోలే అంతా సవ్యంగా జరిగితే నీకు నాకు అని వస్తారు. కట్నం కూడా దండిగా వస్తాది.'

రమాదేవికి మనసులో ఎక్కడో ఏ మూలో చిన్న ఆశ పనిచేస్తోంది.

'నిజంగానే అర్నెల్లల్లో లాభాలు వస్తాయేమో ఎవరు చూసినారు? అంత నమ్మకం లేకపోతే అంత ధైర్యంగా ఎట్ల చెప్తాడు? అన్ని డబ్బులు ఉద్దరకు వదిలేయడానికి వీడు తిక్కోడేమీ కాదు. డబ్బులంటే ఎవరికి చేదు...'

"ఎవరి దగ్గరో పని చేస్తాం. మనకు ఇంత జీతం పడేస్తారు. మొత్తం లాభాలన్నీ వాళ్లే తీసుకుంటారు. అట్లాంటప్పుడు మనమే సొంతంగా నలుగురు స్టాఫ్‌ను పెట్టుకొని రన్ చేస్తే వచ్చే లాభాలన్నీ మనకే మిగుల్తాయి కదా."

కంప్యూటర్ సెంటర్ పెట్టడానికి ముందు దిలీప్ అన్న మాటలు రమాదేవిలో ఉండే ఆశను మరింత పెంచాయి.

తనకు తెలిసిన వాళ్లల్లో తనను నమ్మి డబ్బులు ఇచ్చే వాళ్లు ఏవరా అని ఆలోచించడం మొదలు పెట్టింది. అంతలోనే చిన్న అనుమానం మొలకెత్తింది.

'అవునూ...! వీని దగ్గర పనిచేసే వాళ్లకు కూడా సొంతంగా పెట్టుకుందాం అని బుద్ధి పుడితే ఏంది గతి...? ఆ... ఏముంది నాలెక్కనే అప్పుల పాలవుతారు... అప్పుడు నాకు కూడా కొంతమంది తోడయితారు అంతే... అందరికి లాభాలు రావడం అనేది ఎక్కడైనా జరిగే పనేనా...? ఎవరో ఒకరిద్దరికి కలిసొస్తాయి యాపారాలు... మనకు వద్దురా అంటే యినకపాయె...! వానికేమయినా అమ్మ నాయన చేసిన అప్పులు ఉండాయా తీర్చడానికి...! ల్యాకపోతే ఓయమ్మా ఆడపిల్లోల్ల పెండ్లి చెయ్యాల ఎట్లబ్బ అని అనుకోడానికి...! వాని నెత్తిన ఏ బరువులు మోపలేదు. మొన్నటివరకు అంతో ఇంతో చేతిలో డబ్బులు ఉండే... ఇల్లు ఉంది ఇంత కన్నా ఇంకేం కావాల? యాదన్న ఉద్యోగం చూసుకొని నిమ్మళంగా ఉండక తిక్కనా కొడుకు కాకపోతే...! వీనికి యాడ తక్కువాయితాదో అనే కదా ఆ పాపకు ఎక్కువయ్యింది...! వీడేమో ఇట్ల చేస్తాన్నాడు.

కానీ, చూద్దాం ఏమయితాదో... ఇదే లాస్ట్ అంటాండాడు కదా... తర్వాత ఒక్క పైసా కూడా యియ్యగూడ్దు. ఎంత కొడుకు అయితే మాత్రం ఎంతకాలం భరిస్తాం. మిగిలిచ్చుకుంటే వానికే ఉంటాది ల్యాకపోతే వాని ఖర్మ... అంతా నాశనం అయిపోయినా కనీసం ఈ కొంప అన్నా మిగుల్తాది. ఇంగ దీనికి కూడా ఎసరు పెడితే ఎవ్వరూ ఏం చేయలేరు. ఇంగా పద్దైదు ఏండ్ల సర్వీసు ఉంది. తర్వాత పెన్షనూ వస్తాది ఎట్లనో నా కాలం గడిచిపోతాది. వీడు నన్ను సాకే అవసరం ఎప్పుడూ ఉండదు. జీవితకాలమంతా ఈ నా కొడుకును భరించుకుంటే చాలు... ఎట్లనోగట్ల రెండుమూడేండ్లు ఓపిక పట్టాల. తర్వాత ఇంక ఎంత కాలం తల్లి మీద ఆధారపడ్తావు... నీ కత నువ్వు చూసుకో నాయనా అని గట్టిగా చెప్పాల్సిందే. అర్థం చేసుకుంటే సరి సంతోషం. కుంటోళ్లో, గుడ్డోళ్లో అయితే అవులే పాపం అని మోసినా అర్థం వుంటాది. అన్నీ ఉండి అతికం చేస్తాంటే చూస్తూ ఉండేకి యాడయితాది? ఎవరయినా నన్నే అనొచ్చు. నిన్ను ఎవరు అప్పు చేయమంద్రి... నాచాత కాదు అని నువ్వు ముందే గట్టిగా చెప్పింటే వాని మానానా వాడు వూరుకున్నిండు... నువ్వే వాన్ని చెడగొట్టినావ్ అంటారు. ఇంతజేసి ఆ మాటలన్ని ఎందుకు పడాల? తల్లిగా వానికి ఎంత చేయాలో అంతకంటే ఎక్కువ చేశాను. ఇంక కొడుకుగా వాడు ఎంత చేయాల్నో వాడే అర్థం చేసుకోవాల్ల... నాకు చేయకుంటే మానే, వాని బతకు వాడు బతికి నలుగుర్ని ఇబ్బంది పెట్టకుంటే చాలు అంత కంటే ఇంకేం వద్దు....'

రమాదేవికి ఉన్నట్టుండి వాళ్ల పెద్దమ్మ కొడుకు అన్న మాటలు గుర్తుకు వచ్చినాయి.

"సీడ్ పత్తికి మార్కెట్టులో రేట్ బాగుందంట అకయా... అప్పోసప్పో చేసి అదే ఎచ్చాన్నా... దెబ్బతో ఈసారి అప్పులన్నీ తీరిపోతాయి..."

విరక్తిగా నవ్వుకుంది.

'రేట్ బాగుంది అని వేయడం తీరా పంట చేతికొచ్చాకా రేట్ దబాల్న పడిపోవడం... వీళ్లకేం తిక్క అనకుంటాంటిని. తిక్క వాళ్లకే కాదు వీనికీ కూడా ఎక్కినట్టుంది.

మార్కెట్టులో దీనికి బాగా డిమాండ్ వుంది అంటాడు... అంటే వాళ్లకేవరికో వీడు చేసిన పని నచ్చాలా, వాళ్లకు ఆ పని అవసరం ఉండాలా... అప్పుడు వీనికి పని ఇస్తారు. అట్లయితేనే వీడు బయట పడేది... ఓయమ్మోయ్... చానా కథ ఉందే... గాలిలో దీపం పెట్టినాం... మార్కెట్టు గాలి దయచూపితే బయటబడ్తాం... లేకుంటే మాత్రం నిలువునా కూరుకుపోతాం...'

# పెళ్లి సందర్భం...

## నల్లూరి రుక్మిణి

"శశీ నువ్వు చెప్పే ఆదర్శం వినడానికి బావుంది గానీ, ఆచరణ సాధ్యమయ్యేది కాదు. కుటుంబాలూ, పిల్లలూ సమూహంగా కలిసి వుండటం వూహించడానికే చేతకావడం లేదు. సమిష్టి కుటుంబాల్లోనే కలిసి ఉండలేని సమాజంలో – సమూహంలో కలిసి ఉంటారే! అంతా నీ భ్రమ తప్ప!"

"నిజమేనే ఉమా, నువ్వు చెప్పేది ఇప్పుడున్న ఈ కుటుంబం గురించి. అసలు ఆ కుటుంబాల అర్థమే వేరు... అసలు దాన్ని 'కుటుంబం' అని పిలవచ్చా అన్నది కూడా నాకు సంశయం."

"ఏమోనే! తల్లీ, బిడ్డ, రక్త సంబంధం అనే అనుబంధం లేకపోతే ఈ సృష్టికి అర్థమేముందే? నోరులేని జీవుల్లో కూడా ఎంత ప్రేమలుంటాయీ? నిజానికి వ్యక్తుల మధ్య ప్రేమానుబంధాలు లేకపోతే జీవితం ఎంత నిస్సారంగా ఉంటుందీ? ఆ నిస్సారమైన జీవితం కొనసాగించడం పట్ల మానవజాతికి ఆకర్షణ ఏముంటుంది?"

చిన్న నవ్వు నవ్వి! "నువ్వు చెప్పే ప్రేమానుబంధాలు ఇప్పుడెట్లా ఉన్నాయో! అవెందుకట్లా తయారయ్యాయో, అది వేరే చర్చగానీ... మానవజాతి ప్రకృతి కంటే భిన్నమైందనీ శాశ్వతమైందనీ మనలాంటి వారం అనుకుంటున్నాం! అందుకే ఈ గోలంతా! అదట్లా ఉంచుదాం కానీ నువ్వన్నట్టు ఎక్కడి వక్కడే ఎప్పట్లాగే ఉండిపోతే మనుషుల జీవితాల్లో మార్పు ఎలా వస్తుందే! స్త్రీలు స్వేచ్ఛననుభవించాలి, జ్ఞానవంతులు కావాలీ, సంపాదనపరులు కావాలీ... మంచి మాతృమూర్తులూ కావాలి? ఎట్లా మరి?" శశి ప్రశ్నార్థకంగా అడిగింది.

"భూమి గుండ్రంగా వున్న మాట నిజం కదా! బయలుదేరిన దగ్గరకే చేరుతున్నాం".

"అందులో కొత్త సంగతి ఏముందీ?"

"అవును అట్టాగే ఇది కూడా ఎన్నో యుగాలుగా అనేక మార్పులు జరిగీ జరిగీ చివరికి ఇక్కడి కొచ్చి ఆగింది మానవ సమాజం. ఈ చట్రం ఇట్లా ఇక ముందూ కొనసాగడమే మానవజాతి భవిష్యత్తు!"

ఉమ మాటలు వింటూ "మరి ఈ చట్రం ఇలానే ఉండిపోతే కులాలూ, మతాలూ, ఈ అంటరానితనాలూ, అంతరాలూ కూడా ఇలానే ఉండిపోవల్సిందేనంటావా!"... ఆశ్చర్యంగా అంది శశికళ.

ఆ మాటకు జవాబివ్వలేనట్టుగా మౌనంగా ఉండి పోయింది, ఉమ.

* * *

వేసవి శలవులు! పిల్లలిద్దరూ ఆడుకోవడానికి కిందికి వెళ్లారు. నిశాంత ఇంకా ఆఫీసు నుండి రాలేదు.

ఉమకు లంగ్స్ పాడవడంతో, బెజవాడ ఎండలకు తట్టుకోలేనట్టుగా అనిపిస్తుంటే... శశి పట్టుదలగా తన దగ్గరకు రప్పించిందామెను.

"చల్లగా, హాయిగా ప్రాణానికి సుఖంగా ఉందే! ఈ బెంగుళూరు వాళ్లు నిజంగా ఎంత అదృష్టవంతులో" అంది. అక్కడి వాతావరణాన్ని చూసి – రోజుకు పదిసార్లయినా అనుకుంటోందీ మాట.

"సరే! ఇక్కడి వాళ్ళను కదిలించి చూడు... ఇప్పుడు ఎండలు ఎక్కువయి తట్టుకోలేక పోతున్నామని వలపోస్తుంటారు... మంచి రోహిణీ కార్తెలో వీళ్ళను బెజవాడ తీసుకురావాలి".

ఉమకు నవ్వు వచ్చింది. "పాపం వాళ్ళ మీద అంత కోపమెందుకే".

శశి మాట్లాడుతూనే పిల్లలు ఎక్కడున్నారోనని ఓ కంట ఆ విల్లా గార్డెన్స్ వైపు చూస్తోంది.

శశి పిల్లల మీద చూపిస్తున్న శ్రద్ధ, ప్రేమా చూస్తుంటే ఆమెకు కమలమ్మ వద్దన్నా తలపుల్లోకి వస్తోంది.

"ఆంటీ కూడా వీళ్ళను ఇంత శ్రద్ధగానే పెంచి వుంటుంది గదా! మరి శశి తల్లితో అప్పుడెందుకలా ప్రవర్తించిందీ? అంత గ్యాప్ ఎందుకు వచ్చిందీ?" మరోసారి జవాబులేని ఆ ప్రశ్న ముందు నిలిచింది.

శశికళ, ఉమాబాల ఇంటర్ చదివేటప్పటినుండీ మంచి స్నేహితులు. ఉమ తండ్రి ఆర్.టి.సి.లో చిన్న ఉద్యోగి కావడంతో! "ఇంకా చదివితే, నీకంటే పెద్ద చదువులున్న వాడిని తేవడం కష్టం తల్లీ–మనకింత వరకు చాల్లే!" అని తన నిస్సహాయతను వ్యక్తం చేశాడు. తన పెళ్ళీ, తమ్ముడు చదువు ఎట్టాగోననుకుంటూ

– కొడుకు కష్టం గురించిన నాయనమ్మ తలపోతలు వింటూ! పోనీలే! అని ఉమ కూడా సరిపెట్టేసుకుంది.

గుంటూరు ఉమెన్స్ కాలేజీలో చదివేటప్పుడు వాళ్ళిద్దరూ టెన్నిస్ టీమ్‌లో ఉండేవాళ్ళు. తరచుగా ప్రాక్టీసు కోసం కాలేజీ వదిలాక కూడా ఉండాల్సి రావడంతో వేరు వేరు గ్రూపులయినా మంచి స్నేహం ఏర్పడింది.

శశి చలాకీగా, చొరవగా ఉండేది. ఆటల్లోనే గాక డిబేటింగ్ కాంపిటిషన్స్‌లోనూ, ఫంక్షన్స్‌లోనూ ముందుండేది. ఎవరైనా లెక్కలేనట్టుగా సూటిగా మాట్లాడేది. యాక్టివ్‌గా ఉండే శశి అంటే స్టూడెంట్స్‌లో గ్లామరుండేది.

శశికళ తల్లిదండ్రులిద్దరూ లెక్చరర్స్ కావడం వారికి ప్రోగ్రెసివ్ భావాలుండటంతో, ఆ ఇంటి వాతావరణం స్వేచ్ఛగా ఉండేది. పరీక్షల రోజుల్లో కలిసి చదువుకోవాలని వాళ్ళింటికి వెళ్ళినపుడు ఉమకు చాలా హాయిగా అనిపించేది.

'ఆడపిల్లలకు ఆటలేమిటే ఈ వయసులో! రేపు పెళ్ళయితే మొగుడికి వండి పెట్టడమెట్లా? ఇల్లు చక్కదిద్దుకోవడమెట్లా? అన్నది నేర్చుకోవాలీగానీ' అనే నాయనమ్మ సణుగుడు వినే ఉమ.... శశి ఎంత అదృష్టవంతురాలోననుకునేది.

ఉమ ఆలోచనలకు బ్రేక్ వేస్తూ పిల్లలు సాయంకాలపు ఆట విడుపు నుండి పైకి పరిగెత్తుకొచ్చారు. హాలు తలుపు తియ్యగానే ఒకరి మీద ఒకరు కంప్లైట్స్ చేసుకుంటూ మీద పడిపోయారు. వాళ్ళ గోల ఒక పట్టాన తేలలేదు. అంత అల్లరినీ భరిస్తూ ఓపిగ్గా సమాధానపరుస్తున్న శశిని చూస్తుంటే సంతోషంగా అనిపించింది.

హాయిగా నవ్వుతూ! "చేస్తూ చేస్తూ ఉన్న ఉద్యోగం ఎందుకు మానేసిందీ పిచ్చిపిల్లా! అనుకున్నాగానీ! ఉద్యోగం మానేసి మంచి పని చేశావే" అంది.

శశి నవ్వి ఊరుకుంది.

ఇంతలో నిశాంత్ రావడంతో మంచి నీళ్ళు ఇచ్చి... అతను తెచ్చిన బ్రీఫ్‌కేస్ అందుకుంది. బూట్లు విప్పి, టై వదులు చేసుకుని శశికళ ఖాళీ చేసిన కుర్చీలో రిలాక్స్‌డ్‌గా కూర్చుంటూ!..." స్నేహితుల సంభాషణకు అడ్డు వచ్చానా?" ఉమతో నవ్వుతూ అన్నాడు.

"నో! నో!... రోజంతా మాట్లాడుకుంటూనే ఉన్నాం గదా!"

"నేను ఉద్యోగం మానేసి మంచి పని చేశానని కితాబిస్తోంది."

ఓ క్షణం అతనూ ఏం మాట్లాడలేదు!... "ఉద్యోగం మానవద్దన్నానండీ!, కానీ తనే ఈ నిర్ణయం తీసుకుంది. లోకాపవాదుకు నేను భయపడుతున్నానండీ!... చిన్న నవ్వుతో చెప్పాడు.

"నువ్వేం బెంగపడకు... నింద నీ మీదకు రానివ్వనులే'

"తల్లీ, లోకం పలు కాకులు... అసలే మగవాళ్ళ రోజులు బాగాలేవు!" నవ్వాడు.

"అబ్బా! మగవాళ్ళా? ఎంత అమాయకులండీ"... స్నేహితులిద్దరూ ఒకేసారి అనడంతో... "అమ్మో! నా చర్మం వలిచేస్తారు కాబోలు"నంటూ లేచి గదిలోకి నడిచాడు. శశి నవ్వి కాఫీ కోసం వంట గదికి పోయింది.

ఉమ కూడా మొహం కడుక్కుని, జడ వేసుకుని తన గదిలోకి వెళ్ళి పుస్తకం తీసుకుని మంచం మీద వాలింది. అయితే ఆమె ఆలోచనలన్నీ ఎక్కడో తిరుగుతున్నయ్యి.

శశి ఫ్యామిలీని చూస్తూ! ఎంత ముచ్చటగా ఉన్నారూ? 'హ్యాపీ హోమ్' అనుకుంది. సంసారంలో ఇంత కంఫర్టబిలిటీగా ఉన్న శశికళ పెళ్ళికి ముందు ఎందుకంత డల్‌గా ఉంది. ఆమె కాదు అప్పట్లో ఆ ఇంటి వాతావరణమే ఒక్కోసారిగా మారిపోయింది. ఎందుకో ఇప్పటికీ అర్థం కాకుండానే ఉండిపోయింది.

ఉమ తిప్పుతున్న పేజీలల్లోఅసలు కథ ఏమోగానీ జరిగిపోయిన కథ నడుస్తోంది.

* * *

సంక్రాంతి పండగకని వచ్చింది. ఆ రోజే అరిశలు వండే పని బెట్టింది ఉమ నాయనమ్మ. ఆ పని చేస్తూ తీరిగ్గా తీరిగ్గా నాయనమ్మతో కబుర్లు చెప్పుకుంటూ ఉన్న ఉమకు అనుకోకుండా వచ్చిన శశికళను చూస్తే సంతోషంతో పాటు ఆశ్చర్యమూ వేసింది.

"ఇంకో వారం రోజులుంటాను గదా! అని రేపో, ఎల్లుండో నేనే వద్దామను కుంటున్నానే! నాయనమ్మ ఈ పని బెట్టిందిగా!" అంది.

"ఫరవాలేదులే ఉమా! అందర్నీ చూసినట్టుగా ఉంటుందని వచ్చా".

ఇద్దరూ ఇవతలకి వచ్చి ముందు గదిలో కూర్చున్నాను. ఏవో అత్తగారి కబుర్లు, కాలేజీ స్నేహితుల సంగతులూ, దొర్లిపోతున్నాయి. కొద్ది సేపటికిగానీ శశికళ పరధ్యానంగా ఉన్నట్టు గమనించలేదు.

"ఏమిటే! అలా వున్నావ్! అసలీ మధ్య చాలా ముభావంగా ఉంటున్నావ్? పోయినసారి సెలక్షన్స్ పోయిందనా?" అంది ప్రశ్నార్థకంగా! అయినా ప్రాక్టీసు కూడా తగ్గించావెందుకూ?

"ఏం లేదే! బానే ఉన్నా!" అంది ముక్తసరిగా. అయినా ఆమె మాటల్లో నిండుదనం లేకపోవడం తెలుస్తోంది.

"ఇక వెళ్తానే!".. అని వెళ్ళటానికి సిద్ధమయిన శశికళ భుజం మీద చెయ్యి

వేసి... ప్రేమగా! "నువ్వెప్పుడూ ఇట్లా లేవు శశీ..." అంది.

ఉమ స్నేహ స్పర్శకు కళ్ళల్లో నీళ్ళు తిరిగినట్టయి!.. "ప్రత్యేకంగా ఏమీలేదుగానీ ప్రపంచం కొత్తగా అర్థమవుతుంటే భయమేస్తుందే!... డబ్బూ, కులమూ మతమూ జీవన రంగాలనన్నిటినీ ఎట్లా ప్రభావితం చేసి కలుషితం చేస్తోందో గదా!" అప్పుడే లోకాన్ని చూస్తున్నట్టుగా మాట్లాడింది.

శశి మాటలు కొత్తగా అనిపించి, ఆశ్చర్యంగా!... "కొత్తగా మాట్లాడుతున్నా వేమిటీ? అవేవీ లేని లోకం ఎక్కడుందే శశీ!.. అయినా అవన్నీ మాబోటి వాళ్ళకు గానీ నీకేమిటే! డబ్బూ, పరపతి అన్నీ ఉన్న అదృష్టవంతురాలివి".

"నిజమే! అవన్నీ ఉండటంతో లోకం ఎట్లా ఉందో తెలియనే లేదు. ఇప్పుడు తెలుస్తుంటే తట్టుకోవడం కష్టంగా ఉంది".

ఇంతలో ఉమ కూతురు ఏడుస్తూ రావడంతో సంభాషణ అక్కడితో ఆగిపోయింది. శశి ఆ పిల్లను ముద్దు చెయ్యడంలో పడిపోయింది.

ఉమ తల్లి పలకరింపుగా – "ఏమ్మా! పెళ్ళి భోజనం ఎప్పుడు పెడతావు తల్లీ!" అంది.

శశి నవ్వి... ముందుకు నడిచింది.

"రెండు రోజులాగి వస్తానే"నని చెప్పి రోడ్డు దాకా సాగనంపి వెనక్కి వస్తూ! శశి తీరు చూస్తూ! 'పెళ్ళికి సంబంధించిన ఇబ్బందేమైనా ఉందా?'... అనుమానపడింది. 'ఇంటికి వెళ్ళి కమలాంటీతో మాట్లాడాలి" అనుకొంది.

రెండు మూడు రోజులాగి వాళ్ళింటికి వెళ్ళిన ఉమను కమలమ్మ హాల్లోనే కలిసింది.

"శశి ఇప్పుడే రోడ్డు మీద దాకా వెళ్ళిందమ్మా! కూర్చో!" అంది.

"ఒంట్లో బాగా లేదా? ఆంటీ! చాలా పాడయినట్టు కనబడుతున్నారూ?"

"అదేం లేదమ్మా! బాగానే ఉన్నా!" అంది నవ్వుతూ.

"లేదాంటీ! చాలా డల్‌గా ఉన్నారు... మొన్న శశి కూడా అట్లనే ఉంది" ప్రశ్నార్థకంగా అడిగింది.

కమలమ్మ ఏదో ఆలోచిస్తున్నట్టుగా నిదానంగా "మేం చేసింది మంచో, చెడో తెలియడం లేదు ఉమా! పొరపాటు చేశాం! పిల్లలు ఎదిగాక ప్రశ్నలు వేస్తారని, బాధ్యత పడాల్సి ఉంటుందనీ తెలుసుకోలేకపోయాం?"... నిర్వేదంగా ఉన్న ఆమె గొంతు ఉమకు పట్టించినట్టుగా అయింది.

ఎన్నడూ దిగులనేది ఆమెలో కనిపించేది కాదు. జ్ఞానంతో కూడిన చిరునవ్వుతో ఆమె ఎంతో అందంగా కనిపించేది. అట్లాంటి ఆంటీ ఇలా మాట్లాడుతోందేమిటీ?

ఉమకు ఆశ్చర్యంగా ఉంది.

అప్పటికి శశి రావడంతో సంభాషణ అక్కడితో ఆగిపోయింది.

ఇద్దరూ శశి రూమ్‌లో కూర్చున్నప్పుడు కావాలనే... "ఏంటి శశీ! అమ్మ అట్లా ఉందీ! జబ్బు చేసినట్టూ?" అడిగింది.

"ఊఁ" అని ఊరుకుంది శశి.

ఆమె కూడా తల్లితో ఎక్కువ మాట్లాడినట్టనిపించలేదు.

తల్లీ కూతుళ్ళు ఎంత స్నేహంగా, చనువుగా ఉండేవారూ? అనుకుంది. చిన్నబోయినట్టున్న కమలమ్మ మొహం చాలా రోజులు ఉమను వదిలింది కాదు.

ఏమిటి శశీ! ఎన్నడూ లేంది? మీరంతా ఇలా ఉన్నారేమిటీ? నా దగ్గర కూడా దాస్తున్నావా? అని!... "నువ్వేమైనా, ప్రేమా, పెళ్ళి వంటి సమస్యలు తెచ్చావా? ఏమిటి?" చనువు, హాస్యం మిళితం చేస్తూ అడిగింది.

"అదేం లేదు! నిజంగా అలా జరిగి ఉంటే ఇప్పటి ఈ సఫకేషన్ ఉండేదే కాదు! నాకు అంత కళ లేదులే!"... అంతకంటే చెప్పడానికి శశి ఉత్సుకత చూపలేదు.

ఉమ రెట్టించి అడగనూ లేకపోయింది.

శశి పెళ్ళి సందర్భం ఆ ఇంటిని ఓ కుదుపుకు గురి చేసింది. బయటి వాళ్లకు అర్థం కాలేదు గానీ... ఆ తాకిడికి వాళ్ళు చిగురుటాకుల్లా కదిలిపోయారు.

మరో ఏడాదికి గానీ శశి పెళ్ళి కుదరలేదు. పెళ్ళిలో కూడా కమలమ్మ అంత ఉత్సాహంగా ఉన్నట్టనిపించలేదు.

పెళ్ళి మండపంలో ఓ పక్కగా కూర్చోనున్నప్పుడు శశి అమ్మమ్మ కళ్ళు తుడుచుకోవడం చూసి... ఏంటి అమ్మమ్మా! హ్యాపీగా పెళ్ళి అవుతుంటే" అంది ఉమ.

"అవును గానీ! ఇవి సంతోషంగా వచ్చి కనీళ్ళు ఉమా! నేనూ పెద్దదాన్నయ్యాను, ఈ పిల్లల బాధ్యతలు కమల ఎట్టా తీర్చుకుంటుందోనని... దాని గురించే దిగులు పడ్డానమ్మా! పెద్ద బరువు దిగినట్టుగా ఉంది".

"అదేంది అమ్మమ్మా! ఆంటీకేం! చక్కగా మంచి భర్తా! ఉద్యోగం, పిల్లలూ!" నవ్వుతూ అంది.

ఉమ మాటలకు నవ్వి – అవి ఉంటే అన్ని సమస్యలూ తీరిపోతయ్యా తల్లీ! లోకం మహచెడ్డదమ్మా దాన్ని ధిక్కరించిన వాళ్ళను... నలిపి వెయ్యాలని వెయ్యి కోరలతో వెంటబడుతుంది.

ఉమ ఆశ్చర్యంగా వింటోంది, ఆమె మాటలు కొత్తగా కూడా ఉన్నాయి.

"నువ్విక్కడ లేక నీకు అన్ని సంగతులూ తెలిసి ఉండకపోవచ్చు! ఈ పిల్ల పెళ్ళితో మాకందరికీ కళ్ళు తెరుచుకున్నట్టయింది."

"అదేంది అమ్మమ్మా! శశి బంగారం కదా?"... ఆర్ద్రత నిండిన కంఠంలో అంది.

"కానీ లోకానికి అదొక్కటే చాలదు ఉమా! ముందు ముందుగానీ దాని విశ్వరూపం తెలియదు. మనం మారామని లోకం మారిపోతుందమ్మా!"

"చదువులు పెద్దగాలేని ఆ రోజుల్లో కమలను చదివించాం. అప్పుడంతా కమ్యూనిస్టుల ప్రభావం! ఆ పార్టీ వాళ్ళతో తిరిగేది. వాళ్ళ నాన్న కూడా ఏమీ అనకపోయేది! ఆయనా గాంధీ అన్నా, సుందరయ్య అన్నా ఇష్టంగా ఉండేవాడు. చదువుకుంటుండగానే 'నాన్నా! నేనూ... ఆయనా ఇష్టపడ్డాం".. అంది. మనవాళ్ళు కాదుగదా! బాగా ఆలోచించుకోమ్మా? అన్నాడే గానీ – వద్దని అనలేదు. ఇంకా నేనే ఎక్కువ బాధపడ్డాను.

"అల్లుడు బంగారం! ఇక ఏ దిగులూ లేకపోయింది. అట్లా జరిగిపోయింది కాలం. ఇదిగో ఈ పిల్ల పెళ్ళికి అన్నీ తవ్వుకోవాల్సి వచ్చింది! పోనీ ఎలాగో జరిగిపోయింది!" అంది నిట్టూర్చి.

ఉమకు కూడా బాధనిపించింది. శశి పెళ్ళి అంత సమస్యయిందా?

అక్కడితో మళ్ళీ ఆ ప్రస్తావన ముగిసిపోయింది.

శశి పెళ్ళి, పిల్లలూ, అప్పుడప్పుడూ పుట్టింటికి వెళ్ళినప్పుడు తలవడంగానే సాగిపోయింది. ఇప్పుడు తలచుకుంటుంటే!

'ఆ గతంలో ఇంకేం ఉందీ? అట్లా ప్రేమించి చేసుకున్నందుకు కమలాంటీదేం తప్పా? ఆమెట్లా కార్నర్ చెయ్యబడిందీ?... తల్లీ బిడ్డల మధ్య అంత ఎడబాటు ఎందుకు కలిగిందీ?... కొత్త ప్రశ్నేదో ముందుకు వచ్చింది.

దాన్ని తోసివేస్తూ! 'పోనీలే! అదంతా గతంలో కలిసిపోనే పోయింది! భర్తా పిల్లలతో హ్యాపీగా ఉంది...' ఉద్యోగం మానేసి పిల్లల్ని చక్కగా పెంచుకుంటోంది. 'శశి చాలా మంచి పిల్ల!' అనుకుంది మరోసారి. ఆ మాట అనుకుంటుంటే తమ స్నేహ పరిమళాలు మరింత గాఢమైనట్లనిపించింది. మనసు ప్రశాంతమైంది.

గదిపై కప్పులో మెర్క్యురీ చంద్రుడు, చుక్కలూ మెరుస్తుండగా బెజవాడ ఆకాశాన్ని తలచుకుంటూ నిద్రలోకి జారింది.

* * *

రాత్రి పొద్దుపోయి నిద్రపోవడంతో మెలకువ వచ్చేటప్పటికి ఏడు కావస్తోంది. "అబ్బా! చాలాసేపు పడుకున్నాననుకుంటూ రూమ్‌లో నుండి హాలులోకి వచ్చింది.

ఆడవాళ్ళకు పొద్దుటి పూట చచ్చిపోవడానికి కూడా తీరికుండదన్న సామెతకు శశికళ కూడా మంచి ఉదాహరణే. పిల్లలకు స్కూళ్లు తెరిచి రెండు రోజులవడంతో వాళ్ళ పనిలో హడావిడిగా ఉంది. స్కూలు బస్సు ఏడున్నరకు గేటు దగ్గరకు వస్తుంది. పిల్లాడిని ఏడుంబావు కల్లా గేటు దగ్గరకు తీసుకుపోవాలి. పిల్ల మరో స్కూలు. ఆరింటికి పిల్లాడిని లేపడానికి నానా తంటాళ్ళు పడుతుంది. లేచిన దగ్గర నుండి జెట్ వేగంతో గంటలో అన్నీ అయిపోవాలి మొహం, టాయిలెట్, టిఫిన్, స్నానం – అన్నీనూ!

మొహం కడుక్కొని కాఫీ తాగి... నీ హడావిడి కానీ! ఈ లోపు కిందికి పోయి వస్తా! అని బయలుదేరింది. విల్లాలో గార్డెన్ చాలా అందంగా ఉంటుంది. గులాబీలు, బంగళాబంతీ అక్కడా ఉంటాయి... కానీ ఇక్కడెంత నవనవలాడుతున్నాయ్! ఈ రోజుల్లో కూడా! అనుకుంటా! చల్లని గాలిని ఆస్వాదిస్తూ గార్డెన్ చుట్టూ రౌండ్లు వేసింది.

శశి హడావిడి అయిపోయి ఉంటుందనుకుని లిఫ్ట్ ఎక్కి పైకి వచ్చింది. పిల్లలు వెళ్ళిపోయారు. నిశాంత్ టిఫిన్ తిని ఆఫీసుకు రెడీ అవుతున్నాడు. పనమ్మాయి ఇంకా రాలేదు. ఉమ కోసం చూస్తూ బాల్కనీలో ఉంది శశికళ.

ఇద్దరూ కలిసి టిఫిన్ తిన్నారు. నిశాంత్ బ్రీఫ్ తీసుకుని గదిలో నుండి రాగానే... కారేజీ బాగ్ అందించింది శశికళ.

''వస్తానండీ ఉమగారూ!''... ''రాత్రి ఆగిపోయిన సంభాషణ తిరిగి మొదలెట్టుకోండి"... నవ్వుతూ అని – శశికి 'బై' చెప్పి వెళ్ళిపోయాడు.

ఉమ పేపరు తీసుకుని చదువుతూ విసుగ్గా! "ఈ మధ్య వార్తలే చదవ బుద్ధికావడం లేదే! అన్నీ చచ్చూ పుచ్చూ వార్తలు" అంది. పేపరు తీసి అవతల పారేసి. "ఈ పది రోజులూ పది గంటల్లా గడిచిపోయాయి. చల్లగా హాయిగా ఉండటంతో నాకూ తేలిగ్గా అనిపించింది. ఇక ఫరవాలేదులే... అక్కడ కూడా ఎండలు తగ్గివుంటాయ్! పిల్లలూ ఇబ్బంది పడతారు. రెండు మూడు రోజుల్లో బయలు దేరుతాను."

"అబ్బో! బెజవాడ ఎండలు చల్లబడటమే! చాల్లే! అయినా అంత తొందరగా టికెట్స్ దొరకవు తల్లీ! పది రోజుల ముందున్నా బుక్ చేసుకోవాలి ఇన్ని రోజులూ నీకు హుషారుగా లేదని బయటికెక్కడికీ తీసికెళ్ళలేదు. కనీసం సిటీ అన్నా చూపిస్తా! వచ్చే సండే ఔటింగ్ పెట్టుకుందాం."

"అమ్మో అన్ని రోజులే"

ఉమ ఎక్స్‌ప్రెషన్ చూసి శశి నవ్వింది. ఇంతలో పనమ్మాయి రావడంతో చెయ్యాల్సిన పనులు పురమాయించడానికి వంటింటి వైపు వెళ్ళింది శశికళ.

ఉమ బాల్కనీలో నిలబడి కిందికి చూస్తోంది. 'నిజంగా ఈ ఎపార్ట్‌మెంట్స్ ఎంత ఆశ్చర్యం'... ఒక్కో ఫ్లోరు ఆరు అంతస్తులు, ఎనిమిది బ్లాకులు, ఏడు వందల ఇళ్ళు, కుటుంబాలు, కానీ ఎంత నిశ్శబ్ద... ఎంత శుభ్రం... ఆరు గంటల నుండి పనివాళ్ళు లోపలికి వస్తూ కనబడతారు. పిల్లలూ, ఉద్యోగస్తులూ వరసలుగా బయటికి పోతూ కనబడతారు. అంతే! ఒక్కమాట వినబడదు. ఆ తరువాత గార్డెనింగ్ వాళ్లు ఊడ్చేవాళ్ళు సెక్యూరిటీ వాళ్ళు తప్ప మరో పురుగు కనబడరు. ఏ ఒక్క ఇంటి నుండీ మాటలు గానీ కేకలు గానీ వినబడవు, మనుషులు కనబడరు.

రోజంతా నిశ్శబ్దంతో బిక్కు బిక్కుమంటున్నటుండే విల్లా సాయంత్రం అయిదు అయిందంటే పిల్లలతో, పెద్దలతో అంతా కోలాహలం... ఎక్కడెక్కడి పక్షులు ఎగిరి వచ్చి వాలినట్టు గార్డెన్ అంతా పంచెవన్నెలతో నిండుకుంటుంది... వాకింగ్ చేసే యువతులు, టీనేజ్ పిల్లలు, వృద్ధులు, చంటి పిల్లల అరుపులతో, పరుగులతో ఫుట్‌బాల్ మోతలతో అదో అద్భుత ప్రపంచం! అందాల హరివిల్లులా శక్తిని నింపే ఉత్సాహం! తోటి మనుషుల ఉనికే కదా! మనిషిని సజీవంగా ఉంచేదీ!

అందుకే ఈ విల్లా నుండి మారాలంటే ఇష్టంగా అనిపించదు, గానీ చాలా రెంట్, మామూలు వాళ్ళు భరించలేం! పిల్లల కోసమని వుండిపోతున్నా! సిటీస్‌లో 'బాల్యం' కరువైపోద్ది. ఇక్కడ ఆటలు, ఏవో ఫంక్షన్స్, యాక్టివిటీస్ ఎప్పటికప్పుడు ఏవో చేస్తూనే ఉంటారు. పిల్లల కోసమే నేనసలు ఉద్యోగం మానేశాను.

'ఏం ఉద్యోగం చేసేవాళ్ళం పిల్లల్ని పెంచుకోవడం లేదూ?"

"పెంచుకుంటారు! ఎందుకు పెంచుకోరూ? మనమూ రోజంతా పనితో అలిసిపోయి! వాళ్ళేదన్నా అడిగారంటే, కాస్త విసిగించారంటే! రెండు వెయ్యటమూ నాలుగు కేకలో! అంతే గదా!

అయినా మా అమ్మతో మేం ఏం గడిపాం! అంతా మా అమ్మమ్మతోనే రోజంతా గడిచిపోయేది. అందుకే నా పిల్లల్ని నేనే పెంచాలని ఈ నిర్ణయం తీసుకున్నా!

ఆశ్చర్యపోయింది ఉమ. "అదేంటే! మీ ఇంట్లో మీకున్న స్వేచ్ఛలో నాలుగో వంతు కూడా మేం చూడలేదు! నువ్వే అలా అనుకుంటే మేమింకేమనుకోవాలీ?"

"నిజమే! కానీ దాని సంగతి కాదుగా! నేను చెప్పేది! మాతో ప్రశాంతంగా గడపడానికి అప్పుడు అమ్మకు తీరికేదీ? కాలేజీతో సరిపోయేది! ఎండాకాలం వచ్చిందంటే పేపర్లు దిద్దనుపోయేది. ఎప్పటికప్పుడు ఏవో సెమినార్లని, థీసీస్‌లని బిజీగా ఉండేది. అందుకే మేం ఎక్కువగా అమ్మమ్మతోనే గడిపాం! ఇంట్లో అమ్మమ్మ ఉండటంతో ఇల్లంతా ఆమె మీద వదిలేసింది... అందులో మమ్మల్ని కూడా!"

"అంటే, ఉద్యోగం వల్ల మీకు అటెండ్ కావాల్సినంత కాలేదనా నీ అభియోగం?"

శశి ఏం మాట్లాడలేదు.

"నిజమేగానీ! నీకున్న పరిస్థితులు మీ అమ్మకు లేవేమో? ఆలోచించావా? నీ పిల్లలకు తల్లిగా ప్రేమగా, దగ్గరుండి చూడాలనుకుంటున్నావు. ఉద్యోగం మానేసినా ఇబ్బంది లేకపోయింది... కానీ అప్పట్లో మీ అమ్మకు ఈ వెసులుబాటు లేకపోయిందేమో? ఉద్యోగం తప్పని సరైందేమో? అయినా ఆమె అలా చెయ్యబట్టేగా మీకూ కొంత వసరు ఇవ్వగలిగింది. లేకపోతే నాలాగే అర్థాంతరంగా చదువు ఆపాల్సి వచ్చేది కాదా?"

ఉమ చెప్తూ చెప్తూ ఆగిపోయింది.

ఓ క్షణం ఆగి!... "పిల్లల్ని ప్రేమిస్తున్నామని నిరూపించుకోవడానికికైనా డబ్బుండాలే! పిల్లలు అడిగింది ఇవ్వలేని తల్లిదండ్రులు తమ ప్రేమను ఎట్లా రుజువు చేసుకోగలరూ?"

శశికళ నిశ్శబ్దంగా వింది.

కారిడార్‌లోకి ఎండ పొడ వచ్చింది. పనమ్మాయి ఇల్లు తుడిచి వెళ్ళిపోయింది. "ఆరిపోయిందిలే లోపలికి పోదాం! రా" అని లేచి వంటింటి వైపు దారి తీసింది.

టీ తాగుతూ టీవీ ఆన్ చేసింది. ఏవేవో ఛానల్స్ తిప్పింది ఛీ! ఒక్కటి మంచి దుండదు. సినిమాలు, లేదంటే అత్తా కోడళ్ళ సీరియల్స్... ఛస్తున్నాం, ఈ తెలుగు ఛానల్స్‌తో అని విసుగ్గా కట్టేసి, రిమోట్ అవతల పడేసి! సోఫాలో వొరిగింది.

శశిని చూస్తూ రోజూ ఎలా గడుపుతున్నావే! "బోరుగా లేదూ!"

"ఉంది! ఉంటోంది! అయినా నన్ను నేను బలవంతంగా ఎంగేజ్ చేసుకుంటున్నా! ఇంకో ఐదేళ్ళయినా ఇలా ఉండాలని! పిల్లలకు తల్లి స్పర్శ, ఆత్మీయత పూర్తిగా అనుభవంలోకి రావాల్సిన వయస్సది. అవి అందించాల్సినంత వాళ్ళకు అందకపోతే, అసంతృప్తి మిగిలిపోతుంది. పిల్లల్లో వచ్చే సైకలాజికల్, బయలాజికల్ మార్పులు అర్థం చేసుకునే సమయం ఉంటేనే... వాళ్ళకు మనం న్యాయం చెయ్యగలం!"... "పిల్లలకు ఆత్మవిశ్వాసం, స్థిరత్వం ఏర్పడి వ్యక్తిత్వాలు నిర్మాణమవుతాయి."

"నేనూ అలసిపోయి, పిల్లలతో శాంతంగా వ్యవహరించలేకా! ఎందుకొచ్చిందీ? అనుకున్నా!... పైగా ఈ ఇప్పటి ఉద్యోగాలూ, ఈ టైమింగ్స్ వేరు ఉమా! పిల్లలనుకుంటే మనమో! మనమనుకుంటే పిల్లలో లాస్ కావాల్సిందే! తప్పదు. ఇందులో ఎవరి ప్రిఫరెన్స్ వాళ్ళదే!"

"మన చుట్టూ రవ్వంత మారకుండా – మనం మాత్రమే మారితే, చైతన్యమయితే

సంఘర్షణ తప్పదు ఉమా! కుటుంబంలోనైనా, సమాజంలోనైనా అంతే!" పిల్లల్లో ఈ వయస్సులో అసంతృప్తి, అస్థిమితం వాళ్ళ మనస్సులో చొరబడితే... అవి జీవితాంతం వాళ్ళని వదలవు, వ్యక్తిత్వాలు ధ్వంసమవుతాయి."

శశి మాటలు వింటూ... తను వచ్చిన దగ్గరనుండి ఆమె పిల్లలతో వ్యవహరించే తీరు తలచుకుంటూ! "మొత్తం మీద పిల్లల సైకాలజీ మీద బాగు స్టడీ చేసినట్టున్నావే" అని నవ్వింది.

శశి దానికేం బదులివ్వకుండా! "అందుకే నిన్న అన్నాను గుర్తుందా! అదో వైరుధ్యమని! దాని అర్థం ఇదే మరి! కుటుంబం స్త్రీల భుజాల మీద ఉన్నంత కాలం.. స్వేచ్ఛగా రూపొందడం కుదరదు. పిల్లల పెంపకం స్త్రీల ఆలోచలనకు పరిమితి విధిస్తుంది. భద్రతలేని వారి భవిష్యత్తు ఆందోళనకారకమవుతుంది. అవే మన జీవితాన్ని శాసిస్తుంది."

ఉమ మౌనంగా వింటోంది.

"నువ్వు నిన్నో మాట అన్నావు... సమూహంలో ఉండిపోతే ప్రేమలెట్లా ఉంటాయని! నిజమే మన ఆలోచనలకు అంతవరకే అందుతున్నాయి. అసలు పది మందీ ఒకరికొకరు అరమరికలు లేకుండా ఉండే స్నేహాన్నీ, ఆనందాన్నీ మనకు సమాజం ఎక్కడ ఇస్తుంది?" వెనక నుండీ ఈ వ్యక్తిగత కుటుంబాలే ఉన్నయ్యా! ఇన్ని యుగాలుగా మానవుడు భవిష్యత్తులోకి నడవటం లేదూ? మారుతూ, మారుతూ ఇక్కడి కొచ్చాం! రేపు ఇది కూడా మారిపోయే రోజు రావచ్చు నేమో!"

"అవన్నీ బాగాలేవనే గదా! ఇక్కడి కొచ్చి ఆగింది? వ్యక్తులు వికాసం పొందుతారనేగా!"

"ఏడ్చారు! ఆ చెప్పిన వాళ్ళు మనుషుల్ని మాయ చేయడానికి తప్ప! అసలు వ్యక్తిగత కుటుంబాలే వద్దని నా వాదన, సొంతంగా కుటుంబ నిర్వహణ వంటావార్పూ స్త్రీలకు నష్టం కలిగిస్తాయి. ఇందులోనే వుంటాం గానీ ఇవి మాత్రం బాగుపడాలని తిట్టుకుంటే ఏం ప్రయోజనం? ఆడవాళ్ళకైనా?"

"నిజానికి పిల్లల చదువులూ, భవిష్యత్తుకు భద్రత అంతా సమాజానిదే అయితే మనం దేనిని విచారించాలీ? ఇక సొంత ఆస్తులు దేనికీ? సొంత ఆస్తులు ఆడవాళ్ళకు శత్రువే! వాటిని కాపాడటం, పిల్లలకు అందించడం మగవాడిదంటారు గానీ... వీటికి నిజమైన కాపలా ఆడవాళ్ళదే! మగవాడి ఆధిపత్యాన్ని స్థిరపరుస్తోంది ఏమిటీ? ఈ కుటుంబాలు కాదూ! నాలుగు చీరలూ, రెండు నగలూ ఇవేగా! వీళ్ళు సుఖపడుతున్నారనడానికి గుర్తులూ!" " ఈ వ్యామోహం ఎప్పుడు పోతుందో? ఏమో?

అప్పుడే సుఖపడతారు."

"ఏమిటో! ఏదో, ఎక్కడో రష్యాలోనో, చైనాలోనో జరిగినట్టు జరగాలనా ఏమిటీ?"

రష్యా కాదూ! పాడూ కాదూ! ఉన్న సంగతి చెప్తున్నా! ఈ సిస్టమ్‌లో నువ్వెన్ని ఆదర్శాలు, హక్కులూ అని అరువుగాక... ఫలితం లేదు. మిగిలిన సంగతటుంచు! ఆడవాళ్ళకు మాత్రం ఏ ప్రయోజనం లేదు. అసలు స్త్రీల కోసం వచ్చిందేనే ఈ చట్రం. దీన్ని మార్చకుండా నువ్వు తెచ్చే ఏ మార్పు అయినా తాత్కాలిక ఉపసమనాలే తప్ప! మళ్ళీ అన్నీ యధావిధీ! మామూలే!"

చాలా కాలమై దాదాపు కాలేజీ నుండి విడిపోయిన వాళ్ళిద్దరూ ఇన్ని రోజులు కలిసి ఉండింది లేదు. శశికళ మాటలు వింటూ ఎంత ఎదిగిపోయిందీ! అని అబ్బురంగా అనుకుంది.

"సరేగానీ! ఎప్పటినుండో నిన్నో ప్రశ్న అడగాలని ఉంది! ఇన్నాళ్ళూ తీరిగ్గా కలవడమే అవలేదు. ఈ పది రోజులుగా చూస్తున్నా! నిశాంత్ పట్ల ఎంత ప్రేమగా ఉంటున్నావో! నాకు చాలా సంతోషంగా ఉంది! అయితే మరి పెళ్ళికి ముందు ఎందుకే అలా ఉన్నావ్! పైగా పెళ్ళంటే భయమేస్తుందే! అన్నావు. అమ్మమ్మ అయితే ఏదో భారం తీరినట్టుగా ఫీల్ అయింది!" చాలా ఏళ్ళుగా ఉన్న సందిగ్ధం తీర్చుకోవాలన్న కుతూహలం ఆపుకోలేక పోయింది.

"నువ్వు ఫరవాలేదు గానీ... అమ్మ అప్పటినుండీ అలానే వుంది... పైగా అమ్మమ్మ పోయాక మరీ వంటరిదైపోయినట్టుగా అన్పిస్తోంది."

ఇద్దరి మధ్యా నిశ్శబ్ధం అలముకుంది.

ఉమ మాటలతో శశి కళ్ళు నిండుకున్నయ్యి.

"సారీ శశీ! నువ్వింతగా బాధ పడతాననుకోలేదు," క్షమాపణ స్వరంతో అంది.

"ఛ! ఛ! అదేం లేదు. నీక్కూడా చెప్పని రహస్యమేం కాదే"

"... నాకు ఊహ తెలిసీ పాతికేళ్ళ దాకా నేను పెరిగిన ప్రపంచం విలువలు, ప్రశ్నార్థకంగా నిలబడితే! భరించలేకపోయాను. దానికంతా మా అమ్మే కారణమన్నట్టు ఆమె మీద కినుక వహించాను. ఆ పొరపాటు ఇప్పటికీ అలాగే ఉండిపోయింది! ఆ గండి పూడ్చలేనట్టయింది."

"మా బాగోగులే ముఖ్యమని తపన పడ్డ ఆమెను ఒకవేపు నుండే చూసి అర్థం చేసుకుని పొరపాటు పడ్డాను!... ఎంతైనా తల్లులంటే తేలిక కదా!" అని చిన్న నవ్వు నవ్వింది.

ఉమ ఆసక్తిగా వింటోంది.

"మా అమ్మ, నాన్న వాస్తవ ప్రపంచాన్ని అర్థం చేయించీ, చూయించీ వుంటే, బావుండేది! అంత ఘర్షణ పడకపోయేవాళ్ళం. నిజానికి వాళ్ళు చేసిన ప్రయోగపు ఫలితాలను నేలమీద నిలబడి ఆలోచించినట్లయితే! ఇద్దరికే మేలు జరిగేది. నిరంతరం జాగరూకతతో ఉండాల్సిన దాని గురించే వాళ్ళు మర్చిపోయారు. అదే అసలు సమస్య."

"అమ్మా, నాన్నే కాదు ఇట్లా కులాంతర వివాహాలు చేసుకున్న వాళ్ళు... జీవితాల్లో ఆదర్శాన్ని ఎత్తి పట్టిన మాట నిజమే! కానీ ఆ తరవాతే చైతన్యవంతంగా నిరంతరం అప్రమత్తతతో ఉండాల్సిన పని గురించి అవగాహనా లేదూ! అర్థం చేసుకోనూ లేకపోయాగా."

"ఈ రోజు ఇక్కడ నిలబడి ఇంత స్థిమితంగా మాట్లాడుతున్నాను గానీ! అప్పట్లో నేనెంత ఘర్షణ పడ్డానో నీకు తెలియదు. మానసికంగా కుంగిపోయాను. ఇది పైకి చెప్తే అర్థమయ్యేది కాదు ఉమా!"

శశి కంఠం జీరబోయింది. గతం తాలూకా వేదనేదో పొంగుకొస్తున్నట్టుగా ఉంది. నిశ్శబ్దంగా ఉండిపోయింది.

శశిని వదిలిపెట్టి కుక్కర్ పెట్టడానికి వెళ్ళింది ఉమ.

* * *

భోజనాలు చేసి చిన్న కునుకు తీసేటప్పటికి శశికళ తేరుకుంది. అప్పటికి మూడున్నర దాటింది. పిల్లలొస్తారిక అనుకుంది.

ఉదయం సంభాషణ కదిలించాలనుకోలేదు ఉమ.

అయితే శశికళే తనలో గూడుకట్టుకుని ఉన్న వ్యథను తీర్చుకోవాలనుకుంది. "ఏం లేదు ఉమా! మా అమ్మా వాళ్ళు చదువుకునేటప్పుడే తెలియడం వల్ల స్వేచ్ఛగా చనువుగా ఉండేవారు. పెళ్ళి తరువాత కూడా అవి వాళ్ళను నడిపించాయి. మా ఇంటిలో ఎప్పుడూ కులప్రస్తావన వచ్చేదే కాదు. తేడాగానూ ఉండేది కాదు."

మా అమ్మమ్మ ఎప్పుడూ మా దగ్గరే ఉండటంతో బంధుత్వాలన్నీ అటు వేపే పెరిగాయి. ఆ కల్చర్‌కీ మేమూ అలవాటు పడ్డాం. ఎవరన్నా బయటవాళ్ళు అడిగినా తెలియకుండానే అమ్మవాళ్ళ క్యాస్ట్ చెప్పేవాళ్ళం.

మొదటిసారి యూనివర్సిటీ చేరినప్పుడు అక్కడ కులం గొడవలు ఎలా ఉంటాయో తెలిసి వచ్చింది. అంతపెద్ద చదువులు చదువుకున్న ఆ ప్రొఫెసర్లే వాటిని పెంచి పోషిస్తుంటే అసహ్యమనిపించేది. అయితే నేను పట్టించుకోలేదు. వెంటనే ఉద్యోగంలో పడిపోయేను.

"మొదటిసారిగా కులమేమిటో, దాని పట్టు యేమిటో తెలిసి వచ్చింది – పెళ్ళి

ప్రస్తావన సందర్భంగా!. అమ్మ కులం వాళ్ళు నువ్వు నాన్న కులం కదా! అన్నారు. నాన్న కులం వాళ్ళు! అమ్మో తల్లి అగ్రకులం కదా! అత్తమామల్ని ఏం గౌరవిస్తుందీ?” అన్న అపనమ్మకంతో చూశారు. ఇది ఎంత అవమానంగా ఉండిందో ఉమా! చివరికి నాకు పెళ్ళి చేసుకోవడం మీద విసుగొచ్చింది. కాలికింద నేల కదిలిపోయినట్టుగా అయింది.”

“అదే కాదు నా మీద నాకే అనుమానం వచ్చింది. నేను పెరిగిన వాతావరణం వల్ల... నాన్న వాళ్ళ కులంలో చేసుకుని సర్దుకుపోగలనా! అట్లా నన్ను నేను అనుకోగలనా? అని ఘర్షణ పడ్డాను, దుఃఖం ముంచుకొచ్చేది. అప్పట్లో ఎంత బాధ ననుభవించానో ఆ దేవుడికే తెలియాలి. ఇది ఎవరు ఎట్లా తీరుస్తారు ఉమా! ఒకరికి చెప్పుకునేదా? ఎంత అర్థరహితంగా ఉంటుందీ?”

“ఏమో! ఆ రోజులు ఎట్లా గడిచాయో ఉమా! ఎన్నడూ లేనిది మా ఇల్లంతా నిశ్శబ్దం అలుముకుంది”... జరిగిపోయినా కాలం దృశ్యమానమవుతుండగా అంది.

“అప్పట్లో దీనికంతా మా అమ్మే కారణమన్నట్టు ఎంత కోపంగా ఉండేదో! అమ్మనూ అదే అడిగాను మాకెందుకు అర్థం చేయించలేదు? అనీ... నిజానికి నా కోపం ఎవరి మీద చూపించగలనూ? అందుకే ఆమె టార్గెట్ అయింది. ఆమెతో అసలు మాట్లాడకపోయేదాన్ని! అవి చాలా కష్టపెట్టాయామెను. దానితో అమ్మ బాగా కుంగిపోయింది. అన్నిటికంటే తల్లుల్ని వేధించేవి బిడ్డల చర్యలే ఉమా!”

“ఇంతలో అమ్మమ్మ చనిపోవడంతో అమ్మ మరింత వంటరిదైపోయింది. సరిగ్గా అర్థం చేసుకోలేకా, అవగాహన కాక నేను ఇబ్బంది పడి ఆమెనూ బాధపెట్టాను” పశ్చాత్తాపం నిండిన గొంతుకతో అంది.

కాలింగ్ బెల్ ఆగకుండా మోగుతుండటంతో... ఆం వచ్చినట్టున్నారు రాక్షసులు అనుకుంటూ తలుపు తియ్యడానికి పోయింది శశికళ.

* * *

‘ఆ రాత్రి పడుకుందేగానీ ఉమకు నిద్రపట్టలేదు. కులం మనుషుల్ని ఇంతగా వేటాడుతుందా? తనకు అనుభవంలో లేని సంగతులివన్నీ.’

ఎట్లా ఉండేవాళ్ళు! ఎలా అయిపోయారూ? అందరూ ఎంత మంచివాళ్ళూ?... కానీ మనుషుల మంచితనాలే వాళ్ళ సుఖసంతోషాలకు పనికి వస్తాయనుకోవడం ఎంత పిచ్చితనం? మనిషికి సంబంధం లేని విషయాలెన్నో మనుషుల మీద రుద్దబడటం ఎంత దురదృష్టం.

అట్లా అనుకుంటుంటే కమలమ్మ కళ్ళ ముందు నిలిచింది. ఎత్తుగా, దానికి తగ్గ

లావుతో ఛామనఛాయకు మించిన రంగుతో ఎంత డిగ్నిఫైడ్‌గా ఉండేదీ? అట్టా చూడబుద్దయ్యేది, కానీ తరువాత మొహం పీక్కుపోయి ఎలా అయ్యారూ?

అమ్మమ్మకు బాగా లేదని చూడటానికి వెళ్ళినపుడు ఆమె ఎంత దుర్భరంగా తన్ను తాను హింసించుకుంటున్నారూ? అప్పుడు తలచుకుంటున్నా! 'అయ్యో' అని మనసు విలవిలవుతుందామెకు.

ఆ రోజు – ఉమ వెళ్ళేటప్పటికి కమలమ్మ తల్లిదగ్గరే లోపలి గదిలో ఉంది. వంటిల్లు పూర్తిగా ఇతరులకు అప్పచెప్పేసింది. ఎవరన్నా వచ్చినా తల్లి ఉన్న గదిలో కొచ్చే మాట్లాడిపోయేవాళ్ళు. ఉమతో మాట్లాడుతుండగానే అమ్మమ్మ సన్నగా మూలుగు ప్రారంభించింది.

"ఏమై ఉంటుందీ? నొప్పిగాని ఎక్కువయిందేమో ఆంటీ?"

ఉమ మాటలు వినిపించుకున్నట్టే లేదు. "నువ్వు అవతలకి పోతావా? ఉంటావా?"

"ఫరవాలేదు.. మీకేమన్నా సాయం పట్టాలేమో!"

నీ సహాయం అవసరం రాదులే… ఇంత శరీరాన్ని దేవుడు ఎందుకిచ్చాడు? అంటూనే తల్లి మీద దుప్పటి తీసి… టాయ్‌లెట్ పాడ్ విప్పి చూసింది. "సరే, సరే అందుకే మూలిగింది" అని పైకే అని! – తల్లిని చంకల కింద రెండు చేతులూ వేసి మంచం మీద నుండి దించి పక్కనే ఉన్న బాత్‌రూమ్‌కి తీసుకుపోయింది.

పనమ్మాయిని పట్టుకోవడానికి కేకేసింది… అట్లా ఉమ చూస్తూండగానే తల్లిని క్లీన్ చేసి తిరిగి మంచం మీద పడుకోబెట్టింది. ఇదంతా ఓ గంటపైనే పట్టింది. అప్పటికి చీకటి పడిపోయింది. అయినా ఉమకు కదలాలనిపించలేదు. తెలియకుండానే ఏదో బరువు మోస్తున్నట్టుగా ఫీలింగ్‌కు గురైంది.

'ఆంటీ ఎందుకిలా చేస్తోంది? తనను తానెందుకిలా హింసించుకుంటోందీ? మనసు కెలికినట్టయింది. ఎందుకింత ఆవేదనపడుతోంది?'

కమలమ్మ తల్లికి సేవ చేస్తుందన్న తృప్తి కన్నా, ఆ చెయ్యడంలో తాను పోగొట్టుకోబోతున్న స్వంత వస్తువును… ఇంకా భద్రంగా ఉంచాలన్న తపన కనిపిస్తోంది.

అంత సేపూ అస్థిమితంగా తిరుగుతూ!… "చెప్తే వినదమ్మా! టైం ప్రకారం అన్నీ ఆ ట్యూబ్ ద్వారా ఎక్కిస్తుంది! ఎందుకు కమలా? ఆవిడనింకా హింసిస్తావ్! అంటే వినదూ! ఆవిడను కాలం పెరిగే కొద్దీ బాధేగానీ, తగ్గేదికాదుగా! ఏమిటో మీ ఆంటీ" ఆందోళనగానూ, బాధగానూ ఉందాయన స్వరం.

ఉమకు ఆ వాతావరణమంతా కొత్తగానూ! దేనినో, ఎందుకో బలవంతంగా

అణిచిపెట్టే ప్రక్రియ సాగుతున్నట్టుగానూ అనిపించింది.

"ఎందుకాంటీ? అంత శ్రమ పడుతున్నారూ ఒక్కరే?... బాధేస్తుంది చూస్తుంటే"

"సరే లేరా! నాదనే వస్తువు అదొక్కటేగా! దాన్ని మాత్రం ఎన్నాళ్ళని కాపాడగలనూ"...

ఆమె ఆమాట పలికిన తీరు ఉమకు దుఃఖం వచ్చింది.

"'ఇన్నేళ్ళుగా ఈ ఇల్లు నాకర్థమే కాలేదు. కానీ లోలోపలి వ్యథలేనో తొలుస్తున్నయ్యి? ఏమిటవీ! పైకి తెలియకపోయినా అంకుల్‌తో ఏవైనా ఇబ్బందులెదురయ్యాయా?" మొదటిసారిగా సందేహం కలిగింది.

చాలాకాలం ఉమకు ఆనాటి సాయంకాలం వెన్నాడుతూ ఉండేది.

ఎన్నడో జరిగిపోయిన ఆ దృశ్యం కళ్ళల్లో మెదిలి దిగులుగా అన్పిస్తుంది, ఆ క్షణం ఆమెకు. నిజంగా సమాజం ఎంత కఠినమైంది. ఈ ఉక్కు చట్రాన్ని తెంచుకోలేనంత కట్టుదిట్టంగా ఎట్లా ఏర్పాటు చేశారు?

* * *

"ఈ రోజు నేను వంట చేస్తానే! ఊరికే తిని కూర్చుంటే బోరుగా ఉంది. మాపల్లెటూరి వంట కూడా రుచి చూసినట్టూ ఉంటుంది" ఉమ లేస్తూనే అంది.

"అమ్మో! ఇప్పుడు వద్దు! అందరూ వెళ్ళాక ఆలోచిద్దాం! ఈ టైంలో వంటింట్లోకి వచ్చావంటే నా పనంతా కంగాళీ అవుతుంది. మధ్యాహ్నం తీరిగ్గా తినడానికైనా చేసుకుందాం!"

శశి ఎక్స్‌ప్రెషన్ చూసి ఉమ నవ్వి... వంటింట్లో నుండి బయటకు వచ్చి పుస్తకాల అల్మరా దగ్గరకు పోయింది. అన్నీ తిరగేసి రంగనాయకమ్మ 'బలిపీఠం' తీసుకుని, బాల్కనీలోకి వచ్చి కూర్చుంది.

రంగనాయకమ్మ ఎలాగైనా ముందు చూపున్న రచయిత్రి. మిగిలిన వాళ్ళంతా 'కలల హీరో'లను గురించి రాస్తున్న రోజుల్లో... 'కులం' గురించి ఆలోచించడమే గొప్ప విషయం కదా! పేజీలు తిరగేస్తూ కొత్తా, పాత పీఠికలు చదువుతోంది.

"ఏమిటక్కడ కూర్చున్నావ్! రా! హాల్లోకి! అందరూ వెళ్ళిపోయారు ఆకలేస్తోంది టిఫిన్ తిందాం"... పిల్చింది శశికళ.

టిఫిన్ తిని గార్డెన్ వైపు బాల్కనీలో చేరారిద్దరూ!

"చాలా పాతబడిపోయింది. పేజీలు చిరిగేటట్టున్నయ్యి" అంది తిరిగేస్తూ.

"అమ్మ వాళ్ళు కొన్నారు! ఆ మధ్య ఇంటికి పోయినపుడు తెచ్చా! ఇంట్లోనే వుంటున్నానుగా... చదువుకుందామని! ఇంకా ఏవేవో తెచ్చాను! పాత పుస్తకాలు

చదువుతుంటే ఇప్పటికంటే అప్పుడే చాలా నయమనిపిస్తోంది. ఏవో విలువలతో బతికేవాళ్ళు.”

“అవును! లేకపోతే మంచా? చెడా! అన్న ప్రశ్న అట్లా ఉంచుగానీ... తాళి కోసం చివరి దశలో తపించిపోతున్న మనిషికి ఊరటకోసమే అయినా ఆ పని చేశాడు గదా?”

“ఇప్పుడు చేస్తున్నారు లేవే!.. ఆస్తి ఉందంటే చచ్చిపోయే వాళ్ళనైనా తట్టుకోవడానికి అందరూ సిద్ధమవుతున్నారు.”

“అవును! కానీ బలిపీఠంలో ఆ పిల్లకు ఏముందీ?”

ఏవో ఆలోచనలతో ఇద్దరూ అలా ఉండిపోయారు.

“బలిపీఠంలోలా అవసరానికో ఆపద సమయంలోనో చేసుకునే పెళ్ళిళ్ళలో చైతన్యం లేకపోతే అర్థం చేసుకోవచ్చు గానీ! విద్యార్థి సంఘాల్లోనో, వృత్తి సంఘాల్లోనో ప్రజా సంఘాల్లోనో ఉండి.. అజ్ఞానంలో ఉండే వాళ్ళను ఏమనాలీ? నిన్ననన్నాను గుర్తుందా! ఆదర్శంగా చేసుకోవడమే కాదు ఆ ఆదర్శాలను నిలుపుకోవడంలోనూ మనుషుల కృషి ఉండాలని!... అదిగో అది లోపించడం వల్లనే మా కుటుంబంలో అంత సంక్షోభం వచ్చింది.”

శశికళను చూస్తూ వింటోంది ఉమ.

“ఏం! లేదు ఉమా! ఆ రోజుల్లో కాలాన్ని బట్టి వీళ్ళూ ఆదర్శంగా చేసుకున్నారు. అందుకు వాళ్ళనెప్పుడూ నేను గౌరవిస్తాను. కానీ మాకు జీవితం గురించీ, సమాజం గురించీ, నేర్పాల్సిన తెలియచెప్పాల్సిన అవసరాన్ని వాళ్ళు గుర్తించలేదు. అసలు వాళ్ళకే ఆ స్పృహ లేదు. ‘కులం’ పట్టు మన సంఘు మీద ఎంతగా ఉందో గ్రహించాలి కదా!... ఏదో చేసుకున్నామంటే చేసుకున్నాం! అనుకుంటే ఎలా? ఎంత జాగరూకతతో ఉండాలీ?”

“అదేం లేదు! ఇక పిల్లలూ, భవిష్యత్తు.. ఈ తపనలో పడిపోయారు. సమాజం విధించిన విలువల్లో ఇమిడిపోయారు. అది మాకే కాదు! వాళ్ళకీ ఎంత నష్టం.” మన చుట్టూ ఏమీ మార్పులేకుండా మనం ఒంటరిగా చేసే చిన్న ప్రయత్నమయినా ఎంతగా ఘర్షణకు గురి చేస్తుందీ?”

“అది తెలుసు కదా! అయినపుడు మీ అమ్మతో ఎట్లా ప్రవర్తించారూ? అమ్మమ్మ వాళ్ళ వైపు నుండి బంధుత్వాలు పెరగటానికి ఆమె మాత్రమే కారణమని ఎలా అనుకున్నారు? నిజానికి మీ అమ్మ వైపు నుండి ఆమె ఘర్షణను అర్థం చేసుకుని ఉండాల్సింది. కులాంతర వివాహంతో ఆమె పుట్టి పెరిగిన కుటుంబం... అలవడిన

సంస్కారం నుండి బయటకు నెట్టివేస్తుంటే ఎంత అభద్రతకు గురై ఉంటుందో? ఆమె బంధువులు ఆమె పట్ల ఎలాంటి వైఖరి ప్రదర్శించారో! సమాజం ముందు మనిషిగా తనను తాను నిరూపించుకోవడానికి ఎంత తపన పడి ఉంటుందో ఎన్నడైనా ఆలోచించావా? అందువల్ల మీకూ ఆ కల్చర్ అలవాటయి మీరు కూడా అగ్రకుల భావనకు లోనయ్యారు... అది తప్పే కావచ్చునేమో! అందుకు ఆమెనొక్కదాన్నీ అంతలా బాధపెడతారా?"

శశి వింటూ "అవును, నాన్న కూడా చాలా సార్లు ఆ మాటే అనేవాడు! ఇందులో అమ్మ తప్పేముందమ్మా! అందరం కలిసే సాగించిన ఈ ప్రయాణంలో అందరికీ ఎంతో కొంత పాత్ర ఉంది. నిజానికి నాదే ఎక్కువ తప్పు! జీవితం ప్రశాంతంగా గడిచిపోతుందనుకున్నానేగానీ! ఇంత దూరం ఆలోచించలేదమ్మా! లేకుంటే నా తరపు వాళ్ళతో బంధుత్వాలు రాకపోకలు, ఇంకా ఎక్కువగా కొనసాగించేవాళ్ళం... అయినా మనం ప్రత్యేకించి వదిలివేసిందేమీ లేదు తల్లీ! తాతావాళ్లు పల్లెటూర్లో ఉండటం, వ్యవసాయదారులు కావడంతో రాకపోకలకే సగం అవరోధమైపోయింది!"

"మీ నాన్న మాట చాలా నిజం శశీ... మీవేమో చదువులూ, ఉద్యోగాలతో టౌనులో పై మధ్య తరగతి జీవితాలు... నిజానికి మీ నాన్న తరపు వాళ్ళతో సంబంధాలు ఉన్నా! మీరేమాత్రం కలిసి పోయేవాళ్ళా! ఇప్పుడు మా పిల్లలు మా అమ్మ వాళ్ళతో ఏం కలుస్తున్నారూ?" కుటుంబాలు నడిచే పద్ధతులూ, డబ్బువల్ల వచ్చే వనరులూ ఇవి బంధువులతో నైనా, స్నేహితులతోనైనా సన్నిహితత్వం పెరగడానికి దోహదపడతావేమో?"

"నిజమేనే! ఈ మధ్య కాలంలో నేను ఏ ఇద్దరు కలిసినా వాళ్ళను పరిశీలనగా చూస్తున్నా! ... నా పెళ్ళి దాకా నాకు ఆ ఆలోచనే ఉండేది కాదు. ఈ కులం గొడవ ఉంటే ఇన్నాళ్ళు మనం ఇట్లా ఉండగలిగే వాళ్ళమా?... అయితే నాకు అనిపించేదేమిటంటే కులాంతర వివాహాలలో అన్ని చోట్లా ఘర్షణలు లేవే"...

"అంతే శశీ!... అందరూ గొడవలు పడి విడిపోయినట్లయితే... ముందు ముందు వాళ్లు ఎలా చేసుకుంటారే! అట్లా ఏం లేదుగా ఇంకా ఇట్లాంటి పెళ్ళిళ్ళు జరుగుతూనే ఉన్నాయి కదా? అది వాళ్ళ స్వభావాలను బట్టి ఉంటుంది కానీ."

"నిజమేగానీ! స్వభావాలు మాత్రమే కాదే అసలు కారణం... మనకు తెలియకుండానే, మన చుట్టూ ఉన్న సమాజం ప్రభావం పడి... లోపల్లోపల ఘర్షణ పడుతుంటామే! అది ఏదో రూపంలో ఎదుట వాళ్ళ మీద చూపిస్తాం".. ఇలా గొడవలు పడే కుటుంబాలు నాకు తెలిసీ ఎక్కువ కులం అమ్మాయి, చాలా సందర్భాల్లో తక్కువ

కులం వాళ్ళను చేసుకున్నప్పుడు జరుగుతుందే".

"ఏదైతేనేం! కులాంతరం అంటేనే... మామూలు బంధుత్వాల పరిధిలో ఉండదు కదా!.. ఇక ఎక్కువేందీ? తక్కువేందీ?"

అది కాదే, సమాజం అగ్రకుల పురుషుడిని చేసుకున్నప్పుడు గౌరవించేదానికి... నిమ్నకులం వాడిని చేసుకుంటే గౌరవించే దానికి చాలా తేడా చూపుతుంది! దీని ప్రభావం మనుషుల మీద పడకుండా ఉండటం సాధ్యమా!

"నువ్వు మరీ ఎక్కువ ఆలోచిస్తున్నావ్ శశీ!"

"అదేం లేదు ఉమా! నీకు కులం గురించి ఆలోచించే అవసరం రాకా, లేక అలా అనుకుంటున్నావు. సంస్కృతీ సాంప్రదాయాలు కలవక... ఆర్థికంగా తేడాలుండటం వల్ల కలవలేకపోతున్నారని నీ అభిప్రాయం. అదే నిజమైతే పెద్ద పెద్ద చదువులూ, ఉద్యోగాలూ ఉన్న చోట కూడా ఈ ఘర్షణలు ఎందుకు వస్తున్నాయి?"

"అదేం కాదు అసలు ఈ సోషల్ సిస్టమ్ మనల్ని విడదీసిందిట్లా! నేను చూసినంత వరకు నా అనుభవమిదే! మా ఆఫీసులో ఓ అమ్మాయి ఓ 'రెడ్డి' కులస్తుడిని చేసుకుంది. ఆ అమ్మాయి మాట్లాడినప్పుడల్లా మాటకు ముందు 'మారెడ్డిగారు' మాటకు వెనుక మారెడ్డిగారు' అంటుంది. అసలు ఆ రెడ్డిగారి పేరు ఏమిటో మాకెవరికీ తెలియకుండా పోయింది. ఆ కులం వాళ్ళు ఆ అమ్మాయిని ఎంత ఓన్ చేసుకుంటారో చెప్పలేను. అదే ఓ కమ్మ అమ్మాయి ఓ దళిత్‌ని చేసుకుంది... ఆ పిల్లను పాపం అంటారు! కొందరైతే ఏమిటో? అని పెదవి విరుస్తారు. 'ఆ కులం' వాళ్ళు ఆ పిల్లను ప్రస్తావనలోకి కూడా తీసుకురారు. ఇదే కాదు, ఇలాంటివి ఒకటీ రెండు నా స్వానుభవంలో చూశాను." ఇదంతా దేన్ని సూచిస్తుంది?

"ఓ దళితుడ్ని చేసుకుని! ధీమాగా తల ఎగరేసి తిరగగలగాలంటే ఎంత గుండె ధైర్యం, ఎంత చైతన్యం కావాలీ? సమాజాన్ని ఎదుర్కోవడం మాటలా ఉమా?

"నా పెళ్ళి కాదు గానీ... అప్పుడు ఈ లోకాన్ని చూస్తే కళ్ళు తిరిగిపోయింది. ఎట్టాగో నిశాంత్ తల్లిదండ్రులూ ఇంటర్ క్యాస్ట్ కాబట్టి నేను బతికిపోయాను."

"ఏమిటో ఈ వైరుధ్యం ఓపక్క కార్పొరేట్ ఉద్యోగాలు వచ్చాయి. గతంలో వున్నంత 'రిజిడిటీ' ఇప్పుడు లేదు, నచ్చితే కులం, గిలం చూడకుండా చేసుకుంటున్నారని గొడవ బడిపోతున్నారు. మరోపక్క కులపిచ్చి మరింత ముదిరి పోతుంది" అర్థం కావడం లేదు.

"అవును ఉమా! ఉద్యోగాల కోసం బెంగుళూరో, అమెరికానో పోతున్నారు అక్కడ ఇవన్నీ ఎవడు పట్టించుకుంటాడూ! నచ్చినవాళ్ళను చేసుకుంటున్నారు... మరి పిల్లలలా

చెడిపోతున్నారని చదువులకు ఉద్యోగాలకు పంపకుండా ఉంటారా? అట్లా అని ఇవి అంగీకరించనూ లేరు. డబ్బులు కావాలి... కులమూ, సాంప్రదాయమూ కావాలీ! ఎట్లా కుదురుద్ది? అందుకే కుటుంబాల్లో ఘర్షణలు జరుగుతున్నాయి."

"ఉమా! నీదో చిన్న ప్రపంచమే! అందులో ఏ మార్పు లేకుండా సాగుతున్నావు. నీకే ఘర్షణలు తాకవు' నిజానికి కులం, ఆస్తి, ఉద్యోగం అన్నీ చూసుకుని చేసుకుంటున్నారే ఈ కాలం పిల్లలు... ఎవరో ఒకరిద్దరు తప్ప! స్నేహాలకు కులం అఖ్కరలేదు. పెళ్ళికి కులం కావాల్సిందే!

ఉమకు జవాబు చెప్పటానికి కూడా లేక శశిని వింటోంది.

"ఇది ఎప్పటికీ పోని పుట్టుమచ్చ ఉమా!... మనువు భారతీయుల నుదిట మీద రాసిన పాషాణపు రాతలు... ఏ కులం వాడు, ఏ కులం వారిని చేసుకుంటే ఏ కులం సంక్రమిస్తుందో రాసిపెట్టి మరీ పోయాడు."

ఆ గాడిద చాలా తెలివి కలవాడే... ప్రపంచంలో అంత వికృతమైన తెలివి మరెవ్వరికీ లేదు... మనుషులను ఎప్పటికీ... శాశ్వతంగా కలవకుండా ఉండే సూత్రం కనిపెట్టి మరీ రాసిపోయేదు. ఒకే శాఖల మధ్య, ఒకే గోత్రాల మధ్య, రక్త సంబంధాల మధ్య వివాహాలు నిషేదించాడు. ఎందుకూ సంతానం ఆరోగ్యకరమైనవారు కలగరని!... కానీ అతి జాగ్రత్తగా ఒకే కులంలో పెళ్ళిళ్ళు నిషేదించకుండా వదిలేశాడు? ఎందుకనీ?"

నిజానికి 'ఒకే కులం' మధ్య పెళ్ళిళ్ళు నిషేదించి ఉంటే ఈ దశకు ఇంతలా 'కులం' కరుడుకట్టి పోయేదికాదు. అసలు కులమే లేకుండాపోయేది.

దీనికి చట్టాలు కూడా తోడయ్యాయి. ఆయా మతాచారాలను బట్టి ఏర్పడ్డ కుటుంబ చట్టాలు కులాలనూ, మతాలనూ మరింత కరుడు కట్టించాయి. ఆస్తులు వారసత్వంగా 'కొడుకుల' కందించాలనే స్వార్థం వల్ల మగవాడు కేంద్రమయ్యాడు. మగవాడి కులం ముఖ్యమైపోయింది.

"ఇన్ని ఉద్యమాలూ, ఇన్ని సంస్కరణలూ ఏం చేశాయి? ఏం డిమాండ్ చెయ్యగలిగాయి?... ఒకే కులంలో వివాహాలు చట్ట విరుద్ధమనీ, శాస్త్ర విరుద్ధమనీ రాజ్యాంగంలో రూపొందించమని ఎందుకు డిమాండ్ చెయ్యలేదూ? కులరహిత సమాజమని చెప్పే వీళ్ళంతా కులాన్ని ముట్టుకోరు... మనువు మనవళ్ళు. కమ్యూనిస్టులు సహితం రాజ్యాంగంలో ఈ మార్పు రావాలని ఎందుకు ప్రచారం చెయ్యలేదూ?"

"ఈ దేశంలో కడుపులో పడ్డ పిండానికి ప్రాణం కంటే ముందు కులం వస్తుందే! ఉమా!" శశి ఆవేశం ప్రవాహమయింది. ఎన్నాళ్ళగానో గుండెల్లో గూడు కట్టుకున్న

కోపం లావాలా పొంగుతోంది.

ఉమ మౌనంగా శశికళను చూస్తోంది.

శశికళ హఠాత్తుగా ఆగిపోయింది. తనను తాను కంట్రోలు చేసుకుంటూ మౌనం వహించింది.

"చట్టంలో మార్పు తేవడం అంత తేలికా శశీ! తెచ్చినా మనుషులు మారతారా?"

శశికళ ఇంట్లోకి పోయి మంచినీళ్ళు తాగి వచ్చింది. కొంత తేరుకున్నట్టయింది... స్థిమిత పడి నెమ్మదిగా మాటల్లోకి వచ్చింది.

"నిజమే! అంత తేలికైంది కాదు! నాకూ తెలుసు... కానీ ఒక ప్రక్రియ జరగాలంటే ఓ ప్రచారం ప్రారంభించాలి... ఆ మార్పు కోసం మనుషులను ఎట్లా ప్రేరేపించవచ్చో అన్వేషించాలి... ఓ క్రమం జరగాలిగా! ఓ దళిత్‌ని చేసుకున్న అమ్మాయికి రిజర్వేషన్ ఉద్యోగంలో, పిల్లలకు రిజర్వేషన్ ఓ రెండెకరాల భూమి ప్రభుత్వం తరఫున... అట్లా ఏదో చెయ్యవచ్చుగా?"

మనువనేవాడు భౌతికంగా చచ్చిపోయాడు గానీ! ఉమా ఈ భూమిమీద అణువణువూ వ్యాపించి ఉన్నాడే! భూమి లోపల గంధకం కొండలు పగిలి భూమి పేలిపోతే గానీ... లేదూ ప్రళయం వచ్చి మునిగిపోయి తిరిగి నూతన జీవం ఏర్పడితే తప్ప! ఈ సమాజం బాగుపడదే!"

"అట్లా ఎందుకనుకోవాలి శశీ! ఈ ప్రపంచం, ఈ మట్టీ ఎన్ని మార్పులు చూసిందీ?... సమాజంలో మార్పులు వచ్చినపుడు ఆపడం ఎవరి తరమూ? భవిష్యత్తులో మరిన్ని మార్పులు రావా?" వెనకటిలాగా ఉందా? మారలేదు?

"నువ్వన్నట్టు ఈ కుటుంబాలూ, ఆస్తులూ అన్నీ పోయినపుడు ఈ కులాలు పట్టుకు వేళ్ళాడతాయా?"... "మంచి కోసం కలలు కనాలి" నిజం చేసుకోవాలే... ఎప్పుడూ, ఏ యుగంలోనూ మానవజాతి ముందుకే పోయింది శశీ! ఇప్పుడైనా అంతే!

(మే 2013 అరుణతార ప్రత్యేక సంచికలో 'మెలకువ' అనే పేరుతో ప్రచురించబడిన కథకు సవరించిన రూపం.)

# బాధ్యత

## తాయమ్మ కరుణ

"వాణీ! అమ్మను, నాన్నను తీసుకెళ్లవే" గోపాల్.

"లేదన్నయ్యా. ఎక్కడ ఉండాల్సిన వాళ్లు అక్కడ ఉంటేనే మంచిదన్నయ్యా" వాణీ.

"ఇవ్వాళ గుర్తొచ్చినాదే నీకు. ఇన్నాళ్లు అమ్మవాళ్లతో పని చేయించుకుని, ఈ రోజు నీతులు చెప్తున్నావా?" కోపంగా గోపాల్.

"నీతులు చెప్పేటంతదాన్ని కాదుగానీ అన్నయ్యా, నేను అన్నదాంట్లో తప్పేముంది".

వాణీ మాటలకు విసురుగా ఇంట్లోకి వెళ్లి, ప్యాంటు, షర్టు వేసుకుని బయటకు వెళ్లిపోయాడు.

గోపాల్ వెళ్లడంతో ఎక్కడివాళ్లు అక్కడే ఏమీ మాట్లాడకుండా ఉండిపోయారు. సమస్య తెంచాల్సింది గోపాల్ లేదా వాణీ. ఈ పది రోజులుగా ఎవరి లెక్కలు వారివే. ఎవరి సంప్రదింపులు వారివే. ఈ రోజుకుగానీ కూర్చుని మాట్లాడే వరకు వచ్చింది. ఆఖరికి ఎటూ తేలలేదు. కొద్దిసేపు తర్వాత దర్వాజకు ఆనుకుని నిలబడ్డ వాణీ వచ్చి నానమ్మ మంచం మీద కూర్చుంది. వాణీ, గోపాల్‌ల తల్లి నిర్మలమ్మ, తండ్రి అప్పారావు కుర్చీల్లోంచి కదల్లేదు. కదిలిస్తే ఏడ్చేలా ఉన్నారు. మధ్య రూము గడప మీద కూర్చున్న గోపాల్ భార్య నీరజ వంటింట్లోకి వెళ్లింది.

వరుసగా ఉన్న మూడు రూముల్లో ముందురూములో గోపాల్ నానమ్మ ఉంటుంది. చివరి రూము కిచెన్. మధ్య గదినే బెడ్ రూమ్‌గా వాడుకుంటున్నారు. గోపాల్‌కు ఇద్దరు కూతుర్లు. పెద్దమ్మాయి నాలుగో తరగతి అయిపోయింది. వేసవి సెలవులు అయిపోతే ఐదో తరగతిలో జాయిన్ చేయాలి. చిన్నపాపది సెకండ్ క్లాస్ పూర్తయింది. థర్డ్‌లో జాయిన్ అవ్వాలి.

చిన్నపాప పుట్టే వరకూ చెల్లెళ్ల పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీర్చాడు గోపాల్. ఈ

మధ్యే కొంచెం ప్రశాంతంగా ఉంటున్నాడు.

"ఇద్దరు ఆడపిల్లలు, వాళ్ల చదువులు, పెళ్లిళ్లు. ఎంతో కొంత వెనకేసుకోకపోతే కష్టం. మీ నాయినమ్మను ఎలాగూ చూస్తున్నాం. మీ అమ్మా నాన్న కూడా ఉంటే మళ్లీ అప్పులు చెయ్యడమే. వాళ్లను మళ్లీ మీ చెల్లెలి దగ్గరికి పంపండి" భార్య నీరజ పోరు.

గోపాల్ తండ్రి అప్పారావు వాళ్ల తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. ముగ్గురు ఆడపిల్లల తోడ గోపాల్ కూడా ఒక్కడే. తాత ఆస్తేమీ ఇవ్వలేదు. ఇల్లొకటితప్ప. ఏ వ్యాపారం చేసినా గోపాల్ తండ్రి అప్పారావుకు ఎందుకనో కలిసి రాలేదు. చేసిన అప్పులు, ఇంటి చుట్టూ తిరిగే అప్పులోళ్లు, వాళ్ల తిట్లు. అప్పారావు బడ్డీ కొట్టు నడిపితే ఆయన భార్య నిర్మలమ్మ సాయంత్రం దోసెలు, బజ్జీలు వేసేది. ఈలోపు ఎదిగిన గోపాల్ చదువుకుంటూనే ప్రైవేటు ఉద్యోగం. ఎలాగో అప్పులు తీర్చగలిగారు. ఇల్లు అమ్మి పెద్దమ్మాయి పెళ్లి చేశారు. ఇంతో అంత వెనకేసిన డబ్బు, కొంత అప్పుతో రెండో అమ్మాయి పెళ్లి చేశారు. ఆ అప్పు తీరేలోపు చిన్నమ్మాయి వాణీ ఎదిగొచ్చింది. డిగ్రీ పూర్తైన రెండేళ్లకు ఉద్యోగం చేస్తున్న వాణీకి రఘుతో పెళ్లి చేశారు – మంచి సంబంధమని, పోతే రాదని. మొత్తం అప్పుతోనే పెళ్లి చేయాల్సి వచ్చింది.

* * *

వాణీకి పెళ్లైన మూడు సంవత్సరాలకు బాబు పుట్టాడు. తర్వాత ఏడాదికి పాప. వాణీ కూతురు, గోపాల్ పెద్దకూతురు సమవయస్కులు.

వాణీ అత్తవాళ్లవి కూడా అంతంత మాత్రపు జీవితాలే. అప్పులు లేవు, అట్లని వెనకేసుకుందీ లేదు. వాణీ భర్త రఘు చేసే కష్టం మీదనే ఇల్లు గడవడం. ఎందుకనో చిన్నవయసే అయినా వాణీ మామగారు కూడా ఏ పనీ చేసేవారు కాదు. అద్దె కొంప. వాణీకి బాబు పుట్టడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. నెలల బాబును వదిలేసి ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం వెతుక్కుతుంది వాణి. ఉద్యోగం, బాబును చూసుకోవడం. ఏడాదికే పాప పుట్టడం. రెండు నెలలాగి మళ్లీ ఉద్యోగం. కొడుకూ కోడలు కష్టపడుతున్నా వాణీ మామగారు మాత్రం ఇల్లు కదిలేవారు కాదు. అత్తకా నోరు పెద్దది. కూరలు సరిగా వండరాదని, తల్లి ఏం నేర్పిందని, మగరాయుడిలా పెంచిందని సతాయింపు.

అప్పటికి పెళ్లై ఎనిమిది సంవత్సరాలు, పాపకు నాలుగో సంవత్సరం. ఉద్యోగం నుంచి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో వాణీ భర్త రఘు చనిపోయాడు.

నష్టజాతకురాలైన కోడలు వల్లే తన కొడుకు చనిపోయాడని అత్త శాపనార్థాలు.

వాణీ అవేవీ పట్టించుకునే స్థితిలో లేదు. ఊహించని ఘటనకు షాక్‌లో ఉండిపోయింది. కనీసం ఏడ్వలేదు. వార్త తెలిసి వచ్చిన వాణీ తల్లిదండ్రులు, అక్కలు, అన్నయ్య గోపాల్‌కు వాణీని చూసేసరికి గుండెచెరువైంది.

పదో రోజు ఖర్మకాండలన్నీ పూర్తయ్యాక తిరుగు ప్రయాణం అయ్యారు. వాణీని అమ్మవాళ్లు తీసుకెళ్తామన్నారు. “అంతకంటే భాగ్యం ఏముందీ” దీర్ఘం తీసింది వాణీ అత్త. “అమ్మా, అది ఒక్కసారి గట్టిగా ఏడిస్తే బాగుండమ్మా. లేదంటే అది చచ్చిపోతుందే” అని వాణీ చిన్నక్క ఏడ్చింది.

మూడు నెలలకు తిరిగి వచ్చిన వాణీని తిట్టిపోసింది అత్త. ఒక్క చిల్లి గవ్వ ఇవ్వనంది. ఉన్నన్నీ రోజులూ వెళ్లిపొమ్మని పోరు. పిల్లలను తీసుకుని, కట్టుబట్టలతో తల్లిగారింటికి వచ్చింది వాణీ. గోపాల్ చెల్లెలిని ఆదరించి, అక్కున చేర్చుకున్నాడు.

అన్నావదినకు భారం కాకూడదనుకుంది. ఉద్యోగానికి వెళ్లడం మొదలుపెట్టింది. ఓ రెండు నెలలకు అన్నయ్య వాళ్ల ఇంటికి దగ్గరలోనే ఇల్లుని అద్దెకు తీసుకుంది. తల్లిదండ్రులు గోపాల్ దగ్గర ఉన్నా వాణీ పిల్లలను కనిపెట్టుకుని ఉండేవారు.

భర్త చనిపోయిన దుఃఖం ఎప్పుడూ వెన్నంటే ఉన్నా పిల్లల భవిష్యత్తు... ఎడతెగని ఆలోచనలు. ఎలా పెంచిపెద్ద చెయ్యాలి. రెక్కలు తప్ప ఏమీ లేవు. తండ్రిలేని లోటు రాకుండా చూసుకోవాలి. ఈ ఉద్యోగంతో నెట్టుకురావడం కష్టం. వేరే ఉద్యోగ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. దానికితోడు డిగ్రీ చదివే రోజుల్లోనే టైపు, షార్ట్‌హ్యాండ్ నేర్చుకుంది వాణీ. అవి ఇప్పుడు పనికి వచ్చాయి. జర్నలిస్టుగా ఉద్యోగంలో చేరింది. ఐదువేల వేల జీతం నుంచి ఎనిమిది వేలకు చేరింది. కానీ ఆఫీసు దూరం. రాత్రుళ్లు ఇంటికి రావడం కష్టంగా ఉంది. అందుకని ఆఫీసుకు దగ్గరలో తీసుకుంది. తను ఉద్యోగానికి వెళితే పిల్లలను బడి నుంచి తీసుకువచ్చేవాళ్లు, తను వచ్చేవరకు చూసుకునేవాళ్లు కావాల్సి వచ్చింది.

“అన్నయ్యా నీకు తెలియనిదేముంది. రెక్కలు తప్ప నాకేమీ లేవు. బాబు పెరుగుతున్నా కొద్దీ వాడి స్కూలు ఫీజూ పెరుగుతుంది. పాపను కూడా స్కూలుకు పంపుతున్నా. జీతం మూడు వేలు పెరిగిందనే కానీ ఖర్చులు అంతకంటే పెరిగాయి. నేను ఉద్యోగానికి వెళితే పిల్లలను చూసుకోవడానికి ఇంట్లో ఎవరైనా ఉండాలఅన్నయ్యా.”

చెల్లెలు మనస్తత్వం గోపాల్‌కు తెలుసు. చెల్లెలంటే జాలి. చిన్నవయసులో భర్త చనిపోయాడు. ఒక్కర్తీ కష్టపడుతోంది. అత్తింటివాళ్ల నుంచి ఏమీ ఇప్పించలేకపోయాడు. తనూ ఆర్థిక సాయం చేసే స్థితిలో లేదు. ఇంట్లో నెమ్మదిగా మొదలైన సణుగుడు.

భార్య నీరజ కూడా చెడ్డదని కాదు. ఇల్లు గడవడం కష్టమవుతోంది. పరిస్థితిని అర్థం చేసుకున్న చెల్లెలే వేరే ఇల్లు తీసుకోవడం, వెళ్లిపోవడం. మనసులోనే చెల్లెలికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు ఆనాడు.

"అమ్మా నాన్నను తీసుకెళ్లు. నాకు ఇంట్లో నీరజ ఉంది. నీరజ ఎక్కడికైనా వెళ్లినా నానమ్మ ఉండనే ఉంది కదా." గోపాల్.

"అంతేనా అన్నయ్యా" వాణీ కదల్లేదు.

"అమ్మా నాన్నల కోసం నెలకు ఎంతో కొంత నేను సర్దుతాను." గోపాల్.

* * *

అమ్మా, నాన్నలు పిల్లలతో ఇల్లు మారింది వాణీ.

తండ్రి అప్పారావు బడ్డీ కొట్టుకు అంతంత మాత్రంగానే వెళ్తున్నాడు. పిల్లలను బడికి తీసుకుపోవడం, తీసుకురావడం, ఇంట్లోకి సరుకులు తేవడం. దీంతోనే అలసటగా ఉంటోంది. ఏళ్ల తరబడిగా పేరుకుంటున్న దిగులు. ఏనాడూ కాళ్లు బార్లా చాపుకుని 'హమ్మయ్య!' అని అనుకున్న రోజు లేదు. తమ కళ్ల ముందే కూతురు ఇలా బతకడం.. చూస్తూ. ఏమీ చేయలేని నిస్సహాయత.

వాణీ భర్త చనిపోయిన రెండేళ్లకు "చిన్న వయసు. మళ్లీ పెళ్లిచేసుకోమ్మా. పిల్లలను మేం చూసుకుంటాం." తల్లి వాణీని ఒప్పించే ప్రయత్నం చేసింది.

పిల్లలను అమ్మానాన్న దగ్గర వదలడమంటే వాళ్లను అనాథలను చెయ్యడమే అనుకుంది. అయినా ఏం పెట్టి పోషిస్తారు – పిల్లలను? అన్నయ్య ఆర్థిక ఇబ్బందులు తెలియనివా. పెళ్లి చేసుకొమ్మని పైకి అంటుంది కానీ, మాటవరసకు తను 'సరే' అని అంటే తల్లి గుండె పగులుతుందని వాణీకి తెలుసు. అలాగని తల్లి కొట్టుకులాట అర్థం కాకుండా పోలేదు.

మొదటిసారి పెళ్లికే అప్పు చేశారు. ఇంక రెండో పెళ్లినా? అయినా రఘును మరిచిపోవడం సాధ్యమేనా? వచ్చేవాడు ఎలాంటి వాడు వస్తాడో? చిన్నపిల్లలను వదిలి తన స్వార్థం తను చూసుకో గలదా? నిజమే తనదీ చిన్నవయసే. కానీ పిల్లల పరిస్థితి ఏంటి? ఏ ఆలోచనలూ వద్దు. పిల్లలకు లోటు రాకుండా చూసుకోవాలి. అదే నిశ్చయంతో ఆఫీసులో పని, ఇంటికి వచ్చాక మిషన్ కుట్టడం. పనిలో మునిగిపోయింది వాణీ. ఆర్థికంగా ఇబ్బంది లేకుండా నడుస్తోంది – పత్రికలో చేరిన ఈ నాలుగేళ్లుగా డబల్ అయిన జీతం. ఇంట్లోకి గిన్నెలు, మిక్సీ, వాషింగ్‌మిషన్, ఫ్రిజ్.. ఒకొకటిగా కొన్నది.

మంచి చీర కట్టుకుని పొందికగా తయారైన రోజు కూతురిని చూస్తే నిర్మలమ్మలో

బాధ మెలిపెడుతుంది – దీని బతుకు ఇట్లా తెల్లారిపోతుందే అని. "పెళ్లి చేసుకోరాదే. నీ పిల్లలను కూడా చూసుకునే మంచివాడే దొరుకుతాడేమో." అంటుంది. "అలాంటి వాళ్లు దొరికినప్పుడు చూద్దాంలే అమ్మా" అని దాటవేస్తుంది వాణీ.

గోపాల్ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయాడు. తన చేతిలో ఉన్న కాంట్రాక్టు పని పోయింది. ప్రైవేటు కాలేజీలో క్యాషియర్‌గా జాయిన్ అయ్యాడు. ఇల్లు గడవడం అంతంత మాత్రంగానే ఉంటోంది.

నిర్మలమ్మకు, అప్పారావుకు అనారోగ్యం వచ్చినప్పుడు మాత్రం ఎంతో కొంత ఇస్తున్నాడు గోపాల్. అన్నయ్య డబ్బులివ్వడం లేదు అని వాణీకి మనసులో ఉన్నా.. ఏం చేస్తాడు. వాడికీ అంతంత మాత్రంగానే ఉందికదా అనుకుంది. దానికితోడు తనకు ఆర్థికంగా ఇబ్బందిలేకపోవడం. ఈ మధ్యకాలంలో తండ్రి బడ్డీకొట్టుకు వెళ్లడం పూర్తిగా మానేశాడు. కొడుకును మంచి స్కూల్‌లో జాయిన్ చేసింది – ఎక్కువ ఫీజు అయినా. దాంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి.

మరో కాంట్రాక్టు దొరకకపోవడం, పిల్లలు ఎదుగుతుండడం, క్లాసులు పెరుగుతుండడం, నానమ్మ మంచం మీంచి కదలలేకపోవడం, ఆమెను ఆస్పత్రికి తిప్పాల్సి రావడం.. ఈ నాలుగేళ్లుగా గోపాల్‌కు ఆర్థికంగా భారం పెరిగింది. ఏడాదిగా తల్లిదండ్రులకు డబ్బులివ్వడం పూర్తిగా మానేశాడు.

నానమ్మకు విరేచనాలు పెట్టినప్పుడో, జ్వరం వచ్చినప్పుడో తల్లి నిర్మలమ్మ వచ్చి చేస్తోంది.

అయితే నిర్మలమ్మను వంటింట్లోకి రానివ్వడం లేదు కోడలు నీరజ. నిర్మలమ్మ నాలుగు రోజులో అయిదు రోజులు సేవలు చేయడం, బాగైనాక కూతురు వాణీ దగ్గరికి వెళ్లడం. అన్నయ్య తల్లిదండ్రులకు జబ్బుపడ్డప్పుడు కూడా డబ్బులు ఇవ్వకపోవడం వాణీ గమనిస్తూనే ఉంది. అప్పుడప్పుడు తల్లిని గానీ లేదా తండ్రిని గానీ అన్నయ్య దగ్గరకు పంపి కొద్ది రోజులు ఉంచుతోంది. వాళ్లకు బాగాలేనప్పుడు అన్నయ్య ఇంటికే పంపుతోంది.

'అత్త లేని సుఖం'కు అలవాటు పడ్డ నీరజ వాళ్లు వచ్చి ఉన్నప్పుడల్లా ఇబ్బందిగా ఫీలవుతుంది. అసలు ఆడపడచు వాణీ వారిని ఎందుకు తమ దగ్గరికి పంపుతుందో అర్థమవుతూనే ఉంది.

"ఏవండీ, పది రోజులవుతుంది మీ అమ్మగారు వచ్చి. మీ నానమ్మకు జ్వరం తగ్గినా వెళ్లడం లేదు." ఓ రోజు రాత్రి నీరజ.

గోపాల్ గమ్మున ఉండిపోయాడు.

"చెప్పేది వింటున్నారా?" నీరజ

"వింటున్నా. కని ఏం చేయను?"

"మీ చెల్లెలి వ్యవహారం గమనిస్తున్నారా. మీ అమ్మనాన్నలను మన దగ్గరికి ఎందుకు పంపుతున్నారనుకుంటున్నారు?"

"నేనూ ఏమీ చేయలేకపోతున్నా. ఇంకో మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా దొరకడం లేదు. వేరే కాంట్రాక్టూ దొరకలేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు."

"రోజురోజూకూ ఇల్లు గడపడం కష్టంగా ఉంటోంది. ఇప్పుడే ఇలా ఉంటే రేపెలా? ఆవిడకా బాబు ఎదిగి వస్తున్నాడు. ఐదారు సంవత్సరాల్లో చేతికి అందివస్తాడు. కూతురా ఒక్కతే. మనకేమో ఇద్దరమ్మాయిలు. పెళ్లిళ్లు మాటలు కావు."

తలకింద చేతులు పెట్టుకుని, పైకప్పుకేసి చూస్తున్న గోపాల్ ఏమీ మాట్లాడలేదు.

మళ్లీ నీరజనే కొనసాగించింది. "మీ నానమ్మకు ఎలాగూ ఖర్చు చేస్తున్నాం. మీ అమ్మానాన్నలా పెద్దవాళ్లయిపోతున్నారు. వాళ్లకు జబ్బులు పెరిగేవే కానీ తగ్గేవి కావు. మనం ఈ రాజమండ్రి వదిలి, భీమవరానికి పోదాం."

"పోతే..?"

"మీ అమ్మానాన్నల బాధ తప్పుతుంది."

"మరి మా వాణీ మీద పడదా భారం?"

"మీ చెల్లెలు మనకంటే బాగానే ఉన్నారు. ఇంట్లోకి ఒక్కొక్క సామాను కొనుక్కుంటున్నారు. అంతేనా ఈ మధ్య ఎన్నెన్ని చీరలు కొందనీ?"

"చాల్లే. దాని డబ్బులతో అది కొనుక్కొంటుంది. నలుగుర్లోకి వెళ్లాల్సి వచ్చినప్పుడు తప్పదు." కోపంగానే అన్నాడు గోపాల్.

"అంటే నేను ఉద్యోగం చేయడం లేదనా మీరనేది"

"నేను అలా అన్నానా?"

"మొన్నటి వరకు చంటి పిల్లలతోనే సరిపోయిందా. ఇప్పుడేమో మీ నానమ్మ మంచం పట్టిందా. ఇంట్లో కూచుని పైసా పైసాకు ఎదురుచూడాల్సిన పని నాకేముంది? ముసలామె చనిపోతే నేనూ ఏదైనా ఉద్యోగం చూసుకో వచ్చనుకున్నా. మీ అమ్మా నాన్న రావడం మొదలైంది. ఎప్పటికీ నా బతుకింతే." దుఃఖం పొంగుకొచ్చింది నీరజకు.

"ఇది కావాలని అది కావాలని నువ్వు ఎన్నడూ ఏదీ అడగలేదు. నాకు తెలియదా. ఆ మాత్రం అర్థం చేసుకోలేననుకున్నావా. బట్టలుతికే బాధ తప్పుతుందని ఓ వాషింగ్ మిషన్ కొందామని ఎన్నాళ్లుగానో అనుకుంటున్నా. ఏం చేయను. ఎప్పటికప్పుడు

ఏదో ఒకటి అవుతోంది.” భార్యను దగ్గరికి తీసుకున్నాడు.

“అయినా మీ చెల్లెలి పెళ్లికి చేసిన అప్పును మనమే కదా తీర్చాం. మీ నాన్న బడ్డీకొట్టు తీసినన్నాళ్లు అట్టిపెట్టుకుంది. పిల్లలు పెద్దగవుతున్నారు కదా. ఇప్పుడు మీ అమ్మా నాన్నల అవసరం కూడా లేదు. అందుకే ఇలా చేస్తుంది. మనమేమన్నా ఉండి ఇవ్వడం లేదా?” నీరజ.

ఆలోచిస్తూ ఉండిపోయాడు గోపాల్. ఈ లోగా పిల్లలు వేసవి సెలవు వచ్చాయి. పిల్లలను తీసుకుని నీరజ పుట్టింటికి వెళ్లిపోయింది. నిర్మలమ్మ అత్తను చూసుకోవడానికి కొడుకు ఇంటికి వచ్చింది. తండ్రి వాణీ దగ్గరే ఉన్నాడు.

ఓ నెల రోజుల తర్వాత గోపాల్ వాణీకి ఫోన్ చేసి, “భీమవరంలో ఉద్యోగం వెతుక్కున్నానే. పిల్లలను బడిలో చేర్పించే సమయానికి వెళదా మనుకుంటున్నా” అన్నాడు.

“అలాగా అన్నయ్య.” అని “నేను ఇంటికి వచ్చాక ఫోన్ చేయనా. ఆఫీసులో బిజీగా ఉన్నాను” అంది. ఆ వార్త వినగానే గుండెలో రాయిపడింది. అందుకే బిజీగా ఉన్నానని చెప్పింది. కాలూ చెయ్యి ఆడడంలేదు. ఆఫీసులో వార్తలను గబగబా ఎడిట్ చేయలేకపోయింది. వార్తను చదువుతుందనే కానీ మనసు పరిపరి విధాల ఆలోచించసాగింది. పేజీలను ప్రింటింగ్ పంపించేసరికి రోజుకంటే లేటయ్యింది. రాత్రి 11.30 గంటలకు గానీ ఆఫీసు నుంచి కదల్లేకపోయింది.

ఇంటికి వచ్చినా నిద్రపట్టలేదు. ఏం చేయాలి? అన్నయ్య ఎందుకిలా చేస్తున్నాడు. ఆడపిల్లను ఒక్కదాన్ని నెట్టుకొస్తున్నానే. నేను లేకపోతే అమ్మా నాన్నను చూసుకునేవాడు కాదా? కొడుకుగా తల్లిదండ్రులను చూసుకోవడం తనవంతు కాదా? తనకు అమ్మానాన్న సాయంగా ఉన్నారని బాధ్యతంతా తన మీదే వదిలేస్తాడా? ఏదో ఒకటి తేల్చుకోవాలి. లేదంటే తనకూ కష్టమే. రోజురోజుకూ చిన్నపిల్లలయ్యే అమ్మా నాన్నలకు చేయడం తనవల్లకాదు. ఏమిటీ చెయ్యడం...? తెల్లవార్లూ ఆలోచనలు.

పొద్దుటే పెద్దక్క, చిన్నక్కలతో సంప్రదించింది. “ఆడపిల్లవు. అమ్మానాన్న బాధ్యత నీదెలా అవుతుందే. అంతకైతే అందరం కూర్చుని మాట్లాడుదాం. నెలకు ఎంతో కొంత ఇప్పించేలా చూద్దాం. గోపాల్ తనవల్ల ససేమిరా అంటే అమ్మానాన్నల ఖర్చు అందరం భరిద్దాం.” అన్నారు.

ఇద్దరక్కల పరిస్థితి అంతంత మాత్రమే. వాళ్ల వరకు వాళ్లు బతకగలరు.

తెల్లవారినా వాణీ ఫోన్ చేయలేదు. గోపాల్ ఫోన్ చేశాడు.

“ఆ.. చెప్పన్నయ్యా. నేనే చేద్దామనుకుంటున్నా. నువ్వు చేశావు” అంది వాణీ.

నిజానికి తను ఫోన్ చెయ్యొద్దనుకుంది. ఏదో ఒకటి అటునుంచే రావాలనుకుంది. ఇప్పుడు కచ్చితంగా లేకపోతే ఎప్పటికీ తన మీద భారం తప్పదనుకుంది. ఏడాదికేడాది పెరుగుతున్న అద్దెలు, తిండి సరుకుల ధరలు. ఏది ముట్టుకున్నా మండిపోతున్నాయి.

"అదే. నేను భీమవరం వెళుతున్నానని చెప్పాను కద. పిల్లలను అక్కడ స్కూళ్లో జాయిన్ చేయడానికి మీ రిపోర్టర్ ద్వారా ఏమైనా కనుక్కుంటావేమో నని" గోపాల్.

"కనుక్కుంటానన్నయ్యా." అని, "ఎవరైనా రాజమండ్రికి వస్తారు... మీరేమో భీమవరం వెళదామనుకుంటున్నారా?" ఆలోచిస్తూ ఆచితూచి అంది వాణీ.

"నాన్నగారు ఏం చేస్తున్నారే" మాటమార్చాడు గోపాల్.

"మీ దగ్గరికి రావడానికి బయలుదేరారు. బహుశా ఇంకో పావుగంటలో వస్తారనుకుంటా."

"అవునా, నాన్నగారు వస్తున్నట్టు నాకు చెప్పలేదేం."

"చెప్పానుకదన్నయ్యా, నీకు ఫోన్ చేద్దామనుకుంటున్నా అని. ఈ లోగా మీరు చేశారు."

చెల్లెలు చాలా స్పీడ్‌గా పావులు కదుపుతోందని అర్ధమైంది గోపాల్‌కి.

"సరే. నేనుంటా" అని ఫోన్ పెట్టేశాడు గోపాల్.

సాయంత్రం నాలుగ్గంటలకు ఆఫీసుకు వెళ్లేటప్పుడు తల్లికి ఫోన్ చేసి, "అన్నయ్య ఏమన్నా అన్నాడా నీతో?" అడిగింది.

"ఏమీ అనలేదే. అవును వాణీ నాన్నగారిని ఎందుకు పంపావే. ఒక్కదానికి కష్టం కాదూ"

"ఏం కష్టం లేమ్మా. పిల్లలు కూడా అక్కవాళ్లింటికి వెళ్లారు. నేనొక్కదాన్నే కదా. ఫర్వాలేదు." అని "అమ్మా ఆఫీసుకు వెళుతున్నా. తర్వాత చేస్తాను" అని ఫోన్ పెట్టేసింది వాణీ.

మూడు రోజుల తర్వాత గోపాల్ మళ్లీ ఫోన్ చేసాడు వాణికి.

"కనుక్కున్నావా వాణీ"

"అక్కడి రిపోర్టరు ఎవరూ కాంటాక్టులోకి రాలేదన్నయ్యా." అని "ఎప్పుడు వెళదామనుకుంటున్నారు?"

"ఏమో ఇంకా వెళ్లి ఇల్లు వెతుక్కోవాలి. స్కూళ్లు అవీ దొరకాలి"

ఫోన్ పెట్టేసాడు గోపాల్.

అన్నయ్య కూడా తనకు తనుగా మాట్లాడేలా లేదు అనుకుంది వాణీ. ఇంకా కొన్ని సంవత్సరాలు తనకు అమ్మానాన్నల అవసరం ఉంది. వాళ్లు లేకపోతే తనకు

గడవదు. ఉద్యోగమూ పిల్లలనూ చూసుకోవడం కష్టం. ఏదో ఒకటి మాట్లాడితే కదా.. ఇదీ అన్నయ్యా, ఇలా చేద్దామని చెప్పొచ్చు. అసలు ఏదీ మాట్లాడనిదే. మనసులో ఏమనుకుంటున్నాడో బయట పెట్టనిదే. మొత్తం తన మీదే వేద్దామనుకుంటున్నాడా? లేదూ. అలా అనుకుని ఉండకపోవచ్చు. ఎప్పుడు ఏ కష్టం వచ్చినా తను ఆదుకున్నాడు. అన్నయ్య లేకపోతే ఈనాడు ఇలా ఉండేది కాదు. మనసులో ఎక్కడో ఏదో ఓ మూల 'ఏమో..' అనే ఆలోచన దగ్గరికి వచ్చి వాణీ ఆలోచనలు ఆగిపోయేవి.

మళ్లీ మరుసటి రోజు రాత్రి 11 గంటల సమయంలో చేశాడు.

"ఇల్లు దొరికింది వాణీ."

"భీమవరం ఎప్పుడు వెళ్లావన్నయ్యా?"

"నీరజ వాళ్ల పిన్ని ఒకామె భీమవరంలో ఉంటున్నారట. తనకు చెపితే వెతికి పెట్టారు."

"అలాగా. అద్దె ఎంత అన్నయ్యా"

"ఇక్కడికీ అక్కడికీ పెద్ద తేడా లేదు"

"ఈ సారి మా ఓనర్ ఒకేసారి ఐదు వందలు పెంచుతానని మొన్ననే చెప్పింది. కష్టంగా ఉందన్నయ్యా."

"నాలుగు వేలు అద్దె పెట్టి అక్కడ ఉండాలా వాణీ"

"తప్పనిసరి పరిస్థితిలో కాదా అన్నయ్యా నేను ఇటువైపు అద్దెకు తీసుకుంది. అది కూడా ఎన్నో రోజులు వెతికితే కద ఇది దొరికింది."

"అయినా ఈ మధ్య నువ్వు ఖర్చులను పెంచేసుకుంటున్నావు."

"అన్నయ్యా, నేను దుబారాగా ఒక్క పైసా ఖర్చు పెట్టడం లేదు. నాకు సాయమందించే వేరే చెయ్యీ లేదు. సరే, ఉంటాను"

తను ఇంట్లోకి తీసుకున్న వస్తువుల గురించే కదా అన్నయ్య మాట్లాడేది. వాషింగ్ మెషిన్ కొన్నందుకు తనకు కొంత సమయం చిక్కుతోంది. ఆ మేరకు మిషన్ కుట్టుకోగలుగుతుంది. ఫ్రిజ్ కొన్నందుకు రోజూ కూరగాయల కోసం వెతుక్కోవల్సిన అవసరం తప్పింది. బహుశా ఇది అన్నయ్య ఆలోచన అయ్యి ఉండదు. వదిన ఈర్ష్య పడుతుందనుకుంటా. ఎందుకనుకోవాలిగానీ రఘు చనిపోయినప్పుడు తను తోబుట్టువులా కడుపులో దాచుకుంది. పిల్లలను పట్టకుండా అలా కూర్చుండిపోతే తనే చూసుకుంది. ఇప్పటికీ పిల్లలకు జ్వరం వచ్చినా, స్కూళ్లో జాయిన్ చెయ్యాలన్నా ముందుగా తనే అన్నయ్యను తరుముతుంది.

అయినా తనకు తోడంటూ ఎవరూ లేరే. తన కష్టంతో కదా కొనుక్కుం టుంది.

హూ.. ఆడపిల్లను, ఇద్దరు పిల్లలతో నెట్టుకొస్తున్నానని ఆలోచించలేక పోయిందేం. ఆలోచిస్తూ తెల్లవారుజామున ఎప్పటికో నిద్రపోయింది. తెల్లవారి ఎనిమిదైనా లేవాలనిపించలేదు. అలాగే పడుకుండిపోయింది.

* * *

పదవుతుండగా గోపాల్ ఫోన్ చేశాడు – సాయంత్రం ఇంటికి రమ్మని. ఆ రోజు ఆదివారం. వాణీకి సెలవు.

సాయంత్రం వెళ్లేసరికి నీరజ పిల్లలను తీసుకుని వచ్చి ఉంది. వదిన వచ్చిందని అమ్మైనా ఫోన్ చేయలేదే. వచ్చారని తెలిస్తే పిల్లలకు ఏమైనా తీసుకువచ్చేది కదా అనుకుంది. పోగానే పిల్లలు 'అత్తా' అంటూ అల్లుకుపోయారు. "ఎప్పుడొచ్చారు తల్లీ" అని చిన్నదాన్ని ఎత్తుకుని ఇంట్లోకి వెళ్లింది. పలకరింపులు అయ్యాయి. అమ్మానాన్నా కూడా ముక్తసరిగా ఉన్నారు. బహుశా వాళ్లకూ విషయం తెలిసిందేమో.

నీరజ టీ చేసుకుని వచ్చి అందరికీ ఇచ్చింది. టీ తాగాక సరాసరి విషయంలోకి దిగాడు గోపాల్.

"వాణీ నా జీతం, నా ఖర్చులు నీకు తెలియనివి కావు. నానమ్మ, అమ్మా, నాన్న ముగ్గురినీ చూసుకోవడం నా వల్ల కాదు. అందుకని నానమ్మను నా వెంట తీసుకువెళ్తాను."

"మరి అమ్మా, నాన్నగారు" వాణీ.

"ఏమో నాకు తెలియదు."

"తెలియదంటే ఎలా అన్నయ్యా"

"రఘు చనిపోయిన దగ్గరి నుంచి నీ దగ్గరేగా ఉంటున్నారు." నీరజ.

"నిజమే, నాకు వాళ్ల అవసరముండి తీసుకెళ్లా. కానీ నా పరిస్థితీ మీ కంటే భిన్నంగా లేదుగా"

"ఇన్నాళ్లు ఉండగా లేనిది ఇప్పుడేమైంది?" నీరజ.

"అమ్మను మీ దగ్గరికే పంపుదామని ఎప్పటికప్పుడు అనుకుంటూనే ఉన్నా. అమ్మను వంటింట్లోకి రానివ్వరు, వంట చేయనివ్వరు. చుట్టంగా ఎన్ని రోజులుంటామని అమ్మ అంటుంది. అందుకే ఏమనలేకపోయా."

"ఇప్పుడూ అలాగే అనుకో" నీరజ

"నా అవసరానికి అట్టిపెట్టుకున్నాననా అన్నయ్యా ఇలా మాట్లాడు తున్నారు. రఘు ఉంటే తనకీ వెతుకులాట ఉండేది కాదుకదా." వాణీకి గొంతు జీర బోయింది.

"అంతేగా మరి" కటువుగా నీరజ.

"మీ కంటూ ఏ బాధ్యతా లేదా" వాణీ.

"ఉంది కాబట్టే అమ్మా నాన్నను నీ దగ్గరకు పంపాను" గోపాల్

"అవును, పంపారు. పంపే ముందు నెలకు ఎంతో కొంత ఇస్తానని, ఏ ఒక్క నెలా ఇవ్వలేదు".

"వాణీ నా పరిస్థితి నీకు తెలియనిదానే. నానమ్మను నేను తీసుకువెళ్తున్నాగా." ఆగిపోయాడు గోపాల్.

"అమ్మానాన్న నాకు భారం కాదు. కానీ నా పరిస్థితీ అంతంత మాత్రమే కదా."

"నాకు మాత్రం భారమా? ముగ్గురు పెద్దవాళ్లను చూసుకోవడమంటే ఈ స్థితిలో..." గోపాల్ గొంతు జీరపోయింది.

"ఎందుకర్రా పోట్లాడతారు. మేమిద్దరం ఎటన్నా వెళ్లిపోయి బతుకుతాం." ఎవరిదీ తప్పని చెప్పలేక తండ్రి అప్పారావు. నిర్మలమ్మ ఒక్కమాట మాట్లాడలేదు. కొంగు నోటికి అడ్డం పెట్టుకుని కూచుంది.

తండ్రి మాటలను వాణీ, గోపాల్ పట్టించుకోలేదు.

అన్నయ్య మాటలకు తను కరిగిపోకూడదు. ఏమీ మాట్లాడకుండా గమ్మున ఉండిపోయింది వాణీ.

కొద్దిసేపటికి సర్దుకుని "అమ్మా నాన్నలను తీసుకెళ్లవే."

"లేదన్నయ్యా. ఎక్కడ ఉండాల్సిన వాళ్లు అక్కడే ఉండాలి."

* * *

బయటకు వెళ్లి ఆలోచిస్తూ రోడ్డు వెంట తిరిగాడు. ఎక్కడా కూచోవాలనిపించలేదు. ఇప్పటికే అప్పులు చేయాల్సిన పరిస్థితి. మంచి ఉద్యోగమో, కాంట్రాక్టో దొరికితేనే గానీ ఇల్లు గడిచేలా లేదు. నాన్న బడ్డీ కొట్టు నడిపినన్నినాళ్లు అట్టిపెట్టుకుంది. తనకు ఏ ఖర్చూ లేకుండా వంటమనిషిగా అమ్మా, బయటి పనులకు నాన్న పనికొచ్చారు. ఈ రోజు నాన్న పనికి వెళ్లకపోయేసరికి భారంగా తయారయ్యారు. ఇంకో ఐదారు సంవత్సరాలైనా అమ్మానాన్న లేకపోతే దానికి గడవనే గడవదు. ఈలోగా తనకూ ఇబ్బందులు తొలగుతాయి. అవసరం తనది. నా దగ్గిరి నుంచి ఆశిస్తోంది. ఏనాడన్నా తను ఒక్క పైస వెనకేసుకుంది లేదు. ఎప్పుడూ అప్పులు తీర్చడంతోనే సరిపోయింది. ఓ గంట అటూ ఇటూ తిరిగి ఇంటికి వెళ్లాడు గోపాల్.

నీరజ వంట చేస్తోంది. అమ్మా బాగా ఏడ్చినట్టుంది. వాణీ ప్రశాంత వదనంతో నానమ్మతో మాట్లాడుతోంది. నాన్న కుదేలై కుర్చీలో కూచున్నారు. పిల్లలు టీవీలో కార్టూన్స్ చూస్తున్నారు.

లోపలికి వెళ్లి లుంగీ కట్టుకుంటూ వంట చేస్తున్న నీరజ దగ్గరికి వెళ్లి కళ్లలోకి చూశాడు – ఏమన్నా చెప్పిందా అన్నట్టు.

పెదవి విరిచి తల అడ్డంగా తిప్పింది నీరజ.

ముందు రూములోకి వచ్చి కుర్చీలో కూచున్నాడు. తల్లీ తండ్రీ మొఖంలోకి చూడలేకపోయాడు. చూసి తను ఏమీ చేయలేడు.

"ఏం ఆలోచించావే వాణీ"

"నేను ఆలోచించడానికి ఏమీ లేదన్నయ్యా".

"వైజాగ్ నుంచి అక్కా, హైదరాబాద్ నుంచి చెల్లీ వీణ వస్తున్నామని ఫోన్ చేశార్రా" తండ్రి గోపాల్.

"ఆహా.. అలాగా" గోపాల్. ఇన్నాళ్లు గుట్టుగా ఎవరితో చెప్పించుకోలేదు. మెలిపెట్టే బాధ గోపాల్‌ను ఆవరించింది. లేచి వెళ్లి బెడ్ మీద పడుకుండిపోయాడు.

# ఒక పారో కథ

*బి. అనూరాధ*

నిద్రపట్టక అసహనంగా అటూ ఇటూ దొర్లాను. "దొర్లాను" అనేది ఏదో మాటకన్నాను కాని, దొర్లడానికి ఇదేమీ డబుల్‌కాట్ కాదు. ఐదున్నర అడుగుల పొడవు రెండడుగుల వెడల్పు గల పక్క. కాళ్ళు కొంచెం నిటారుగా చాచితే గోడ తగులుతుంది. కొంచెం పైకి జరిగానా అవతలి వైపు వాళ్ళకి తగులుతాను. అయినా ఈ అసౌకర్యమైన పక్కకాదు నా నిద్రలేమికి కారణం. పట్టపగల్లా రాత్రంతా వెలుగుతూ చికాకు కలిగించే లైట్లు కూడా కాదు. జైల్లో వున్నానన్న యాదార్ధం అంతకన్నాకాదు. నేననే కాదు దాదాపు మా వార్డులోని చాలామంది మహిళల పరిస్థితి ఇదే! మేము నిద్రపోలేకపోవడానికి కారణం–వెధవపిల్లులు! ఆ... పిల్లులే!

గత కొంతకాలంగా పిల్లులతో ఓ పెద్ద సమస్య వచ్చిపడింది. అవి వచ్చి మా తిండి దొంగిలిస్తేనో, లేదా పిల్లల పాలు తాగిపోతేనే ఇంత దిగులు ఉండేది కాదు. వాటి గురించి ఏదో ఒక రక్షణోపాయం ఆలోచించి ఉండేవాళ్ళం. అసలే చలికాలం. పైగా ఈ హజారీబాగ్‌లో చలి విపరీతంగా వుంటుంది. వెచ్చగా మా కాళ్ళ దగ్గర కంబళ్ళమీద రాత్రంతా పడుకొని ఉదయాన్నే మేం గాఢ నిద్రలో వున్నపుడు అవి కాస్తా ఆ కంబళిమీదే దొడ్డికిపోయి పారిపోతాయి. తాజాగా కంబళి మీదనించి ముక్కపుటాలదరగొడుతూ ఆ దుర్గంధం మా ముక్కులకి చేరి ఉలిక్కిపడి నిద్రలేచేలోపు అవి మాయమవుతాయి. ఖర్మకాలితే బట్టలమీదకి కూడా జారి ఖరాబు–ఖరాబు అయిపోతాయి. ఆ పక్కబట్టలన్ని కటకటాల్లోంచి బయటికి పారేసి లాకప్ తెరిచేవరకూ చలిలో వణుకుతూ వుండాల్సిందే. దాదాపు ప్రతి ఉదయం ఎవరో ఒకరు కెవ్వున అరిచి లేస్తుంటారు. ఈ అనుభవం ఒకసారి అయ్యాక ఇక ప్రశాంతంగా నిద్రపోయే అవకాశం లేనేలేదు. మరుసటిరోజు వాటిని ఉతికి, ఎండ ఎటు తిరిగితే అటు కంబళ్ళను తిప్పుతూ ఆరపెట్టుకుంటూ ఉండాలి. ముఖ్యంగా ఖైదీలకిచ్చే పక్క అంటేనే

ఒక గోనెపట్టా, దానిమీద రెండు కంబళ్ళు మడతపెట్టి ఒత్తుగా పేర్చుకొని ఒక దుప్పటి పరుచుకోవడం. చలికాలం కాబట్టి మరోరెండు కంబళ్ళు కప్పుకోవడానికి వుంటాయి. వీటిని ఉతకడం ఎంత కష్టంగా అనిపిస్తుందో, వాటిని ఈ చలికాలంలో ఆరబెట్టటం అంతకన్నా కష్టమైన పని.

ఒకసారి ఆ అనుభవం చవిచూసిన నాలాంటి వాళ్ళకి నిద్రదూరమై కాపలాకాసే అలవాటు అయ్యింది. ఇక లాభంలేదు. పుస్తకమైనా చదువుదాం అనుకొంటూ పుస్తకం తీశాను.

"దీదీ! నువ్వు పడుకో ఈరోజు డ్యూటీ నాది. " అంది సకీనా. రేపు బక్రీద్. ఈరోజు సకీనాకి ములాకత్‌కి (ఇంటర్వ్యూ) వచ్చారు. వాళ్ళు తెచ్చిన "స్పెషల్" తిండి పెట్టిన పాలిథీన్ కవర్ తీసి చేతిలో పట్టుకుని "ఈరోజు ఆ బిల్లయ్యా (పిల్లి) ఎలాగూ నాదగ్గరికి వచ్చితీరుతుంది. " అంటూ– "దీనిని ఆపైన తగిలించవా" అని నన్ను అడిగింది. సకీనా పొట్టిగా వుంటుంది. ఈ వార్డులో అందరికన్నా పొడుగు నేనే! ఆ సంచి తీసి పైన ఉన్న మేకుకి తగిలించాను.

కంబళిలో దూరి పైకప్పుకేసి చూస్తుంటే పారో గుర్తుకొచ్చింది. ఇపుడు పారో వుండింటే ఎంత బాగుండును? ఈ పిల్లుల ఆగడాలిట్లా వుండేవి కాదు అనే ఆలోచన అప్రయత్నంగా కలిగిన మరుక్షణం అలా కోరుకున్నందుకు అపరాధ భావన కలిగింది. ఒకటా రెండా పదహారేళ్ళ జైలు జీవితం గడిపి విడుదలయ్యింది పారో! తనింకా జైల్లో ఉంటే బాగుండునని పొరపాటునైనా అనుకోవడం ఎంత అన్యాయం అని మనసు ఆక్రోశించింది!

* * *

ఓ రాత్రిపూట నేను ఈ జైల్లో అడుగుపెట్టాను. ఆ మరునాడు ఉదయం ఇతర రాజకీయ ఖైదీలను పరిచయం చేస్తానంటూ రీలామాల నన్ను మూడవ నెంబరు వార్డుకి తీసుకుపోయింది. తను మావోయిస్టు రాజకీయ ఖైదీ. అక్కడ వాళ్ళతో చేతులు కలుపుతుండగానే అందరూ చుట్టూ మూగారు. వాళ్ళు ఆత్రుతగా ఏవేవో అడిగేస్తుంటే ఆ హిందీనిపోలిన కొరతా భాష అర్థం కాక అయోమయంలో రీలామాల కేసి అసహాయంగా చూస్తూ వుండిపోయాను. నాతరుపున తనే అందరికీ నా వివరాలు చెప్పింది. ఇంతలో ఎవరో రెండు జిలేబీలు తీసుకొచ్చి ఇచ్చారు. నేను మొహమాట పడుతూనే వద్దంటే ఏమనుకొంటారో అనుకొంటూ తీసుకుని అంతమంది ముందు వాటిని తినాలేక, పంచాలేక గిన్నె లోనే వుంచి పక్కగా పెట్టాను.

"మనం బావి దగ్గరికి పోయి స్నానం చేసి వద్దాం" పదమంటూ రీలామాల

లేవదీస్తే నేనూ, తనూ, సరితా బట్టలవీ తీస్కుని పోయాం. బట్టలు ఉతుక్కుని స్నానం చేసి వచ్చేసరికి దాదాపు గంటపైనే అయ్యింది. సరిత ఉన్న మూడవ నెంబరు వార్డులోకే నడిచాం. నా దగ్గర నా వస్తువులంటూ ఏం లేకపోవడం వల్ల కూడా నేనూ అక్కడికే వెళ్ళాను. తన చోటుకి వెళ్ళేసరికి వార్డులో వరుసగా పేర్చి వున్న పక్కల మధ్య దారిలో ఖాళీగా పడివున్న జిలేబీల గిన్నె. దానిమీద మూతగా వుంచిన మరో గిన్నె పక్కనే పడివుంది. జిలేబీలు మాయం!! నేను అవాక్కయి చూస్తుండిపోయాను. ఏంటిది? ఇలానే వుండబోతుందా జైలు జీవితం? అడుగు పెట్టీపెట్టగానే దొంగతనం.

రీలామాల వొంగి నేలమీద చూస్తూ గిన్నెలన్ని తీసి పక్కన పెడుతుండగా ఆమె పెదవులపై చిరునవ్వు మెరిసినట్టనిపించింది. లేక నేను పొరపడ్డానో! నా వెనుకనే వచ్చిన సరిత పరిస్థితినంతా ఒక్క క్షణంలో గ్రహించేసి "ఆ బద్మాష్" రుదన్ పనే ఇది. . ఈ రోజు కాళ్ళు విరగ్గొడతాను రానీ" అంటూ కోపంతో బయటికి సుడిగాలిలా దూసుకుపోయి "ఏయ్ పారోదీ! బయటకిరా! చూశావా నీ బేటా (కొడుకు) నిర్వాకం? ఊర్కుంటే మరీ రెచ్చిపోతున్నాడు!"అంటూ రంకెలేసింది.

నా వెన్ను భయంతో జలదరించింది అరె, ఎవరో పిల్లలు తీస్కున్నదానికి ఈమేంటి ఇంతలా అరుస్తోంది? ఇప్పుడు ఎంత పెద్ద దెబ్బలాట అవుతుందో ఏమో! అనుకుంటూ ఆందోళనగా నేనూ బయటికి నడిచాను. వెనుకవైపు ఆవరణలో ఎడమవైపు బాత్రుమ్‌లూ, కుడి మూలలో బావి వున్నాయి. మధ్యలో ఒక చిన్న అవుట్‌హౌస్ లాంటి పాడుపడిన గది. దానిని "కమానీఘర్" అంటారని తరవాత తెలిసింది. (శిక్ష పడి శ్రమ చేసే ఖైదీలని కమానీలంటారు. వాళ్ళపేరు దానికి "కమానీఘర్" అని వచ్చింది. ) నల్లగా పొట్టిగా, నూనెపెట్టి నున్నగా దువ్వి. . బిగుతుగా అల్లినజడ, మడమలపైకి కట్టుకున్న పూల పూల చీరలో ఒక చెయ్యి నడుంమీద పెట్టుకుని కమానీఘర్ గుమ్మంలో నిలబడి వున్నామెనే పారో అని అర్థం అయ్యింది. ఆవరణలో ఒకేలాంటి బట్టలు వేసుకొన్న చాలమంది పిల్లలే గోలగోలగా ఆడుకుంటున్నారు. వాళ్ళలో ఆమె కొడుకు ఎవరై వుంటారో అని గుర్తించడానికి ప్రయత్నించి విఫలమవుతూ సరితని వారించాలని ప్రయత్నిస్తూ – "పోన్లెద్దూ ఏదో చిన్నపిల్లాడూ" అనే మాటలు మనసులోనే సరిగ్గా అనువాదం చేయలేకపోవడంతో పెదవిదాటి బయటికి రాలేదు. ఇదేం పెద్ద విషయం కాదన్నట్టు నిలబడి వుంది రీలామాల. ఇలాంటి టెన్షన్ టైం లో కూడా ఆమె పెదాలమీద చెరగని చిరునవ్వు నాక్కొంచెం చిరాకనిపించింది.

"ఏడీ నీ బేటాను పిలువ్!" అని సరిత అలా మొహం ఎర్రగా చేస్కుని పిలుస్తూంటే నాకు చాలా అవమానంగానూ అక్కడినుంచి మాయమైపోతే బాగుండును అనే ఫీలింగ్‌ని

కలిగించాయి.

పారో మాత్రం సరితని, సరిత అరుపుల్ని ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా నాకేసి ఆసక్తిగా చూస్తూ " కొత్తబందీనా?" అని అడిగింది. అవునన్నట్టుగా చిరునవ్వు నవ్వాను. కొరతాలో ఏదో అడిగింది. ఒక్కముక్క అర్థం కాలేదు. రీలామాల హిందీలో జవాబు చెప్తూ "ఆ ... ఇక్కడామెకాదు. చాలా దూరం. హిందీ రాదు సరిగ్గా! అంటూ నా వివరాలు చెప్తుంటే ఆమె ఆశ్చర్యంగా నావైపు చూస్తూ ఇంకా ఏవేవో అడుగుతూనే వుంది. నాకు పారోని చూస్తే చాలా ఆశ్చర్యమేసింది. తన కొడుకు గురించి అలా సరిత గొడవ చేస్తుంటే ఆమెకు కోపమన్నా వచ్చినట్టు లేదు. ఆమె ఏం తల్లి? అని ఆశ్చర్యంగా వుంది నాకు. రీలామాలతో పారో సంభాషణలో విరామం కోసం అసహనంగా ఎదురుచూస్తూ నిలబడింది సరిత. మొట్టమొదటి అవకాశం రావడంతోటే ఆమె మళ్ళీ పారోని నిలదీసింది. నేనెలాగో ధైర్యం చేసి " ఛోడ్ దీజీయేనా" (వదిలెద్దూ!) అన్నాను. " ఏం ఎందుకు వదిలెయ్యాలి? ఛస్తే వదిలిపెట్టను. "ఏయ్! పారోదీ ఎక్కడ నీ బేటా?" అని రెట్టించింది.

అప్పటికి ఇక తప్పనట్టుగా పారో సరితవైపు చూసి "ఏం చేశాడేంటి?" అన్నది. "నా జిలేబీలు దొంగలించి తినేశాడు"!

"అరెవో రుదనవా! ఆ... రే బేటా!" (అరె ఓ రుదన్ రారా బిడ్డా!) అని ఆమె జైల్లోని మూడు వార్డులూ దద్దరిల్లేలా కేకపెట్టింది. అధాటుగా వుండటంతో తుళ్ళిపడ్డాను నేను. ఇంతలో ఎక్కడ్నుంచో గెంతుకుంటూ వచ్చి తన... ముందు కాళ్ళమీద... . నిలబడిరదో!... పిల్లి!! బహుశ రుదన్ ! "బద్మాష్"! ఏం తెలీనట్టు ఎంత అమాయకంగా కూర్చున్నాడో చూడు అని సరిత అంటుంటే... తన మ్యావ్ మ్యావ్ భాషలో ఏమేమో చెప్తున్న రుదన్ అనబడే ఆ పిల్లిని నోరెళ్ళ బెట్టుకుని చూస్తూ వుండి పోయాను, నేను. అప్పటివరకూ జీవితంలో నేన్నెడూ ఒక పిల్లి అంత విధేయత తో కూర్చుని తన వాదన వినిపించడం చూడలేదు. నాకేం తెలీదమ్మా" అంటున్నట్టే వుంది.

"బద్మాష్! ఆకలయితే నన్నడగొద్దూ!" అని ముద్దుగా విసుక్కొని, సరితవైపు తిరిగి "నీ జీలేబీలు జాగ్రత్తగాపెట్టుకోడం చాతకాదా? నోరూరించే జిలేబీ చూస్తూ నువ్వే ఊరుకోలేవు. వాడెంత!" అని కోప్పడింది. అలా అంటూనే లోపలికి వెళ్ళి బిస్కట్ తెచ్చి రుదన్ వైపు ఒకటి విసిరింది. దాన్ని కిందపడకముందే పట్టుకుని గబగబా తినేసి ఇంకా కావాలన్నట్టు మ్యావ్, మ్యావ్ మనసాగింది. ఈ సారి ఆభాష నాకూ అర్థం అయ్యింది. పారో రుదన్ విన్నపాలు పట్టించుకోకుండా "అరె బుధాన్, సుదాన్ ఆ... రే!" అంటూ అరిచింది. మరుక్షణంలో అక్కడ మరో రెండు పిల్లులు

ప్రత్యక్షమయ్యాయి. "అరె లంగడా (కుంటోడా) ఇధర్ ఆ... రే" అంటుంటే ఆమెవైపు గెంతుకుంటూ వస్తున్న పిల్లి కుంటడం గమనించాను. ఇక ఒకరి తర్వాత ఒకరు నాకు ఆ పిల్లుల ప్రతాపాలు వివరించడం మొదలుపెట్టారు. జైలు తిండి ఆఖరుకి పిల్లులు కూడా ముట్టవు. వాటికి పారో క్యాంటీన్ నుంచి బిస్కట్లు, మైదాతో చేసిన నమ్కిన్ వంటివి తెప్పించి పెట్టేది. ఎవరికి ఇంటినుంచి ములాకాత్ వచ్చినా వాటికి తెలిసిపోయేది. క్యాంటీన్ నుండి తెప్పించుకున్నా సరే ఇక అక్కడే తిరుగుతూ వుంటాయి.

తర్వాత రోజుల్లో నాకూ వాటిని గమనించడం ఒక నిత్యకృత్య మయిపోయింది. ఉదయం చాయ్‌గంట మోగినపుడూ నాస్తా పేరిట ఇచ్చే నానబెట్టిన శనగలు తీసుకోడానికీ, అన్నం తీసుకోడానికీ పారో వెంట ఎస్కార్ట్ పార్టీలా నడుచుకుంటూ వెళ్తాయి. తమ వంతు వచ్చేవరకూ అల్లరిచెయ్యకుండా వేచి వుంటాయి. వాటి క్రమశిక్షణ చూస్తే ముచ్చటేసేది. పారో ఒక్క అదిలింపుతో అవి బుద్ధిగా నడుచుకొనేవి. చలికాలంలో మాత్రం రాత్రిపుట వార్డులోనే వచ్చిపడుకొనేవి. ఒక మూల పారో వాటికి రెండు గోనెపట్టాలు పరిచి పెట్టేది. మనుషులు కప్పుకొన్నట్టే ఒక గోనెపట్టాని వంటిమీదకి లాక్కుని పడుకొనేవి.

అన్నిటికంటే కష్టమైనకాలం జైలులో వుండే ఖైదీల పిల్లల కోసం పళ్ళు, పాలు పంచే టైం. ఆ సమయంలో వాటికి ఎంత అసహనంగా వుండేదో... ! పాతికమంది దాకా పిల్లలున్నారు. పారో తొందరగా వెళ్ళకపోయినా వేరేపనిలోవున్నా... . వెళ్ళి... మ్యావ్ మ్యావ్ అని గోల చేస్తుంటాయి. అమ్మా అమ్మా అంటున్నట్టే వుంటుంది. అయినా తమ వంతు వచ్చేవరకూ పారోతో పాటు లైన్లో నిల్చుంటాయి. వాటిని అంత క్రమశిక్షణతో ఎలా వుంచ గలిగిందో?

పారో పిల్లలెవరూ జైల్లో లేరు. అయినా ఆమెకూడా గిన్నెతీస్కుని పోయేది. మొదట్లో ఇవ్వడానికి ఒప్పుకోలేదట కాని పిల్లల పాలు తాగేస్తున్నాయని పిల్లల తల్లులు మొత్తుకొన్నాక ఒప్పుకొన్నారట. ఇది ఒక కథనం కాని, ఇతర తల్లుల విన్నపాలు కంటే పారోనోటికి ఝడిసి ఇచ్చారనేది మరో కథనం. అదే నిజమని నేను తొందరలోనే గ్రహించాను. పారో ఎవరినన్నా తిట్టడానికి నోరు తెరిచిందంటే మర్యాదస్తుల మాట వదలిపెట్టండి, పచ్చిబూతులు తిట్టేవాళ్ళుకూడా చెవులు మూసుకుని పరిగెత్తాల్సిందే! ఏ మాట కామాటే చెప్పుకోవాలి. పారోకి వంకపెట్టడానికి లేదు. ఆమె అకారణంగా ఎవ్వరినీ తిట్టేది కాదు. ఉదయం లాకప్ తెరవగానే పావుగంటలో కాలకృత్యాలు తీర్చుకుని కొంగు బిగించి చీపురుపట్టుకుని పనిలోకి దిగిందంటే నడుం ఎత్తకుండా పనిచేసేది. వెనుకవైపు ఆవరణ ఊడ్చేపని ఆమెది. ఎంత శుభ్రంగా ఊడ్చేదంటే... .

. అంత కష్టపడ్డాక కొందరు ఏ మాత్రం జ్ఞానం లేకుండా అవీ ఇవీ చెత్తపారేయడమో లేదా పొరపాటునే ఒలికిపోయినవాటిని అలాగే వదిలెయ్యడమో లేదా పిల్లల్ని ఎక్కడ పడితే అక్కడ దొడ్డికి కూర్చోబెట్టడమో చేసేవాళ్ళు. ఇక పారో మొదలుపెట్టేది. అటు ఏడు తరాల్ని ఇటు ఏడు తరాల్ని తూర్పార బట్టేది. పారేసిన వాళ్ళెవరో తెలీకపోతే మొత్తం బందీలందరినీ ఉద్దేశించి తిడుతూనే వుండేది. మొదట్లో ఆమె ఎందుకలా తిడుతుందో అర్థంకాక చాలా చికాగ్గా అనిపించేది. అప్పట్లో నాకు హిందీ అంతబాగా వచ్చేదికాదు కాబట్టి ఆమె తిట్లకి అర్థం తెలిసేదికాదు. ఆ రకంగా బతికిపోయాను. కేవలం ఆ శబ్దాలే వినేది. చాలా ధ్యాసతో వింటేనే నాకు ఎవరైనా మాట్లాడేది అర్థ అయ్యేది. కాబట్టి ఇవరైనా తిడుతున్నారంటే అసలు మెదడులోకి ఒక పదాన్ని కూడా ఎక్కించుకోను. పిల్లుల గురించి తప్ప పారో గురించి నాకు పెద్ద ఆసక్తి లేకుండేది.

చాలా తొందరలోనే నేను పారో గురించి పట్టించుకోవాల్సి వచ్చింది. అక్టోబర్ లోని చలికాలంలో నేను జైలుకి వచ్చాను. ఇక్కడి చలి తీవ్రత అలవాటులేక డిసెంబర్ మాసం వచ్చేసరికి అల్లల్లాడిపోయాను. ఉదయంపూట వెనుకవైపు ఆవరణలో కూర్చుని పేపరో పుస్తకమో చదువుతూ వుండేదాన్ని. అలాంటి ఓ ఉదయాన పారో నడుంమీద చేతులు పెట్టుకుని ధాటీగా ఏదో చర్చిస్తోంది. ఆమె చుట్టూ 5, 6 మంది నిలబడి అవునా అవునా అంటున్నారు. నా పక్కనుండే రుదన్ పరుగెత్తాకొని పోయి కొంచెం దూరంలో మట్టివాసన చూసి ముందరికాలితో దువ్వడం మొదలు పెట్టాడు. కుక్కలు అట్లా చేయడం చూశాను కాని పిల్లులు అలా చేయడం నేనెప్పుడూ చూడలేదు. అందుకే నా దృష్టి అటుపోయింది. రుదన్ ఒక చిన్న గొయ్యిలా చేసి దానిలో దొడ్డికిపోయాడు. అంత చర్చలో వున్నప్పటికీ పారో వీపుకి కళ్ళున్నట్టుగా – ఒకసారి రుదన్ వైపు చూసి “ఢక్ దే బేటా” (కప్పెయ్యి బిడ్డా!) అని అరిచింది. రుదన్ బుద్ధిగా పని అయిపోగానే మళ్ళీ ముందరి కాలితో మట్టేసి గొయ్యి కప్పేశాడు. నేను ఆశ్చర్యం నుంచి తేరుకోనేలేదు. రుదన్ ఆడుకోడానికి వెళ్ళిపోయాడు. ఎట్లా ఆమె వాటికి అలాంటి శిక్షణ ఇచ్చిందో? ఎట్లా ఆమె భాష వాటికి అర్థం అవుతుందో అనుకొంటుంటే ఆమె తన పిల్లల్ని ఎలా పెంచి వుంటుందో ఊహించడానికి ప్రయత్నించాను.

“దీదీ ని అడుగుదాం కావాలంటే” అని వాళ్ళతో పారో అనడం వినిపించి ఆలోచనల్లోంచి తేరుకున్నా. రాజకీయఖైదీని కావడం, అదనంగా “పెద్ద” చదువులు చదువుకొన్న వ్యక్తిని కావడం తో వయసు తేడాలు పాటించకుండా అందరూ నన్ను దీదీ అనే పిలుస్తారు. కాబట్టి సహజంగానే పారోకి కూడా నేను దీదీనే.

“నిన్న వార్తల్లో కోర్టు గురించి చెప్పారు కదా!” హఠాత్తుగా అలా అడిగేసరికి

ఒక్కక్షణం నా బుర్ర పనిచేయలేదు. కోర్టు గురించి ఏం చెప్పారబ్బా? అని ఆలోచనలో పడ్డాను. నన్నడగ్గానే ఠక్కున నేను "అవునని" తనని సమర్థిస్తానని ఆశించినట్టుంది. నాకు గుర్తు రాకపోయేసరికి చాలా నిరాశపడిపోయింది. ఆ తర్వాతనే నేను అనుకోకుండా ఓ విషయం గమనించాను. నేనుండే ఒకటో నెంబరు వార్డు పెద్ద డార్మిటరీలా వుంటుంది. కనీసం డెబ్భైమంది వుంటాం. ప్రధానంగా రెండు భాగాలుగా వుంటుంది. మధ్యలో తలుపుల్లేని ద్వారాలు అనేకం వున్న ఒక పెద్దగోడ, హాలుని రెండు భాగాలుగా విభజిస్తుంది. రెండో భాగంలోనే టీవి వుంది. డి. డి. ప్రసారాలు మాత్రం వస్తాయి. పక్కభాగంలో వుండే వాళ్ళు టీవి చూసేందుకు ఇటువైపు వస్తారు. వార్తల సమయానికి ఠంచనుగా వచ్చి ముందు వరసలో కూర్చుని వింటుంది పారో. ఆమె వార్తలు వినడమే కాదు మరుసటి రోజు ఉదయం 2, 3 నెంబరు వార్డులోని వాళ్ళతో ఆ విశేషాలు ముచ్చటించేది. వాళ్ళకి టీవి లేదు. తొందరలోనే నాకు పారో గురించిన ప్రాథమిక విషయాలు తెలిశాయి. మర్డర్ కేసులో భార్యా భర్తలిద్దరికీ యావజ్జీవ శిక్ష పడింది. దాదాపు పదిహేనేళ్ళనించీ జైలులోనే వుంది. చాలా ధైర్యం గలది.

కొద్దిరోజులకి పారోకి ఆసక్తి కలిగించే విషయాలు ఏంటేంటో నాకర్థం అయ్యింది. 8 గంటలకి వచ్చే ఇంగ్లీషు వార్తల్ని సైతం శ్రద్ధగా చూసేది. సుప్రీంకోర్టు బొమ్మ వస్తే వెంటనే గుర్తుపడుతుంది. ఖైదీ, వకీలు, జైలు, బెయిలు, జడ్జి, శిక్ష ఇలాంటి పదాలు ఏం విన్నా వెంటనే నా దగ్గరికి వచ్చి వివరాలు తెలుసుకొనేది. చాలా తంచుగా అడిగేప్రశ్న, యావజ్జీవ ఖైదీల విడుదల గురించి ఏమన్నా చెప్పారా అనే విషయం. వేరే ఖైదీల తో వార్తల్లోని ఇతర విషయాలు కూడా చర్చించేది. ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడా అరెస్ట్ అయ్యి జైలుకి పోయినపుడయితే ధాటీగా ఉపన్యాసమే ఇచ్చింది. అలా మాట్లాడినప్పుడు దగ్గరలో నన్ను చూస్తే సిగ్గుపడిపోయేది. మొత్తానికి అలా పారో తనవైపు నా దృష్టిని పట్టిలాగింది. నేను శ్రద్ధగా వార్తలు వినడమే కాదు గుర్తు పెట్టుకోవడం కూడా మొదలు పెట్టాను. రోజూ మధ్యాహ్న సమయం కమానీఘర్ లో కూర్చుని లేద్రా కుడుతూ (చలికాలంలో కప్పుకోడానికి పాత బట్టలని దుప్పటి సైజులో పేర్చి వాటిని అందంగా బొంతలా కుడతారు. జైలులో చాలా మంది మహిళలకి ఇదొక వ్యాపకం. వార్తలు గురించి ముచ్చట్లు పెట్టేది పారో. మెల్లగా పారో సిగ్గుపడటం మానేసి నన్నూ పిలవడం మొదలుపెట్టాక రోజూ ఆ టైంలో అక్కడొక గుంపు తయ్యారయ్యేది. వార్తలతో మొదలుపెట్టి మా చర్చలు ఎటెటో పోయేవి. కాని సాధారణంగా అందరూ తమ తమ కేసు విషయాలు, న్యాయసలహాలు అక్కడ చర్చించేవారు. అలా నాలోని ఆర్గనైజర్‌కు పారో కొత్తపద్ధతులు నేర్పింది. నా భాషా

సమస్యని అధిగమించి నాకు వాళ్ళందరితో కలిసిపోవడానికి చాలా ఉపయోగపడింది. తొందరలోనే మాకదో రచ్చబండ అయ్యింది.

* * *

ఎండలు చెరగడం మొదలుపెట్టాక మధ్యాహ్నాల పూట వార్డువదిలి బయటికి వెళ్ళేవాళ్ళం కాదు. అలాంటి ఒక మధ్యాహ్నం పారో నా దగ్గరికి వచ్చింది. కళ్ళు ఎర్రబారి వున్నాయి. బాగా ఏడ్చిందని అర్థమవుతూనే వుంది. కూర్చోడానికి చోటు ఇచ్చి, ఏమయ్యిందని ఆందోళనగా అడిగాను

"రాత్రి నుంచి నా బిడ్డ ఒకటే యాదికొస్తంది దీదీ! మనసంతా కల్లం కల్లం అయితంది. ఒక "పటీసన్" రాస్తావా?" అన్నది.

పిటీషన్ అని పొరపాటున అన్నదేమో అనుకుని "ఇంటికి ఉత్తరం రాయాలా?" అన్నాను. ఊహు!... . అని తల అడ్డంగా ఊపి తన చేతిలో వున్న ఒక పాత ప్లాస్టిక్ కవరు తీసింది. దానిలోంచి పాతపడిన పేపరు కటింగూ, ఒక ఫోటో బయటికి తీసింది. ఫోటోచూస్తే దాదాపు ఒకే వయసులో వున్న 14, 15 ఏళ్ళ పిల్లలు నలుగురు నిలబడి వున్నారు. వారిలోంచి ఒకమ్మాయిని చూపి "నా బిడ్డ" అన్నది. ఆ తర్వాత పేపరుకటింగ్ ఇచ్చింది. అందులోనూ అదే ఫోటో. "మిషనరీల సహకారంతో కొత్త జీవితం" అన్న హెడ్డింగ్ కింద వార్త వెంట నాకళ్ళు పరుగులు తీశాయి. నేనది చదివి నిర్ఘాంత పోయి నోటమాట రాకుండా వుండిపోయాను.

కళ్ళనుండి జలజలరాలిన నీళ్ళని తుడుచుకుని పారో చెప్పడం మొదలు పెట్టింది. "హా! దీదీ! రెండేళ్ళ పిల్లని తీస్కుని నేనూ వాళ్ళ నాయనా మర్డర్ కేసు మీన జేలుకొచ్చినం. యావజ్జీవం పడినాది. బిడ్డను ఎక్కడొదల్ను? దీనికన్నా పెద్ద బిడ్డున్నాది. గుండె రాయి చేస్కుని ఇంట్లనే వదిలిపెట్టిన. నా యారాల చేతిలో పెట్టి వచ్చిన. ఎట్లున్నదో, షాదీ అయిందో లేదో ఏం తెలవది. ఒక్క నాడన్నా ఎవ్వరు ములాకాతీకి రాలే. ఈ చిన్న బిడ్డని తెచ్చుకున్న ఐదేళ్ళదాకే వుంచుకోనిస్తమన్నరు. ఆతర్వాత యేడకి పంపాలె? ఎవరన్నా వస్తే కదా! అపుడు నేను భాగల్‌పూర్ (బీహార్) జైల్ల వుంటి. సాహెబ్ (సూపరింటెండెంట్) కాళ్ళు పట్టుకుంటి. నా బిడ్డను ఎక్కడికీ పంపకు సారూ! అని. నాలాగే పొట్టిగా వుంటది కదా! వయసు అంత తెల్వకపోతుండె. అయినా బయటినుంచి ఎవరన్నా వస్తే ఎనకాల దాపెట్టేది. అట్లనే పన్నెండేళ్ళు నాతోని జేల్లనే వుంది. పద్నాలుగేళ్ళ వయసు వచ్చేసింది. మిగతా పిల్లలూ వుండిరి. మొత్తం నలుగురు పిల్లలు ఇట్ల వయసోళ్ళు అయిపోయిన్రు ఇక్కడనే".

" ఒక దినం మిసనోళ్ళు వచ్చిన్రు. పిల్లల్ని సదివిస్తమన్నరు. హాస్టల్ల పెడ్తమన్నరు.

సాహెబ్ చానా నచ్చచెప్పిండు. వాళ్ళను పంపకుంటే తన నౌఖరీ ఖతమన్నడు. పేపరోళ్ళు వచ్చిన్రు మీ పిల్లకేం గాదు. సక్కగ సదూకొంటది. మిషనోళ్ళు మంచోళ్ళు పంపమంటిరి. నేను నెత్తీనోరు కొట్టుకున్న. కానూను కానూనే కదా! ఏం జేస్త? షర్తువెట్టిన. నా పిల్లని యేడాదికొక్కసారన్నా తెచ్చి చూపాలన్న. సరేనంటిరి. పతా (అడ్రసు) రాపిచ్చుకున్న".

ఒక్కక్షణం ఆగి ఒక కాగితం తీసి చూపించింది. "సెయింట్ మేరీస్ అనాథబాలల వసతిగృహం" అంటూ అడ్రస్ రాసి వున్నది. ఒక సిస్టర్ పేరు కూడా ఉన్నది.

నా బిడ్డ కూడా ఎంతో ఖుషీ అయ్యింది. "మయ్యా! మంచిగా సదుకుంటా!" అన్నది. జైల స్కూల్ల టీచర్ కూడా మా మున్నీని బాగా సదూతది అని తారిఫ్ చేసేది. (మెచ్చుకొనేది. ) నాక్కూడా పేరు రాసుడు నేర్పించింది మామున్నీ" అంత దిగుల్లోనూ ఆమె కళ్ళు ఒక్కక్షణం మెరిసాయ్.

"ఎప్పుడన్నా తీసుకొచ్చి చూపిన్రా" అని అడిగాను.

"హా దీదీ! ఒకసారి మొదటి యాడాది గడిపినంక ఆ పతా మీదనే చిట్టీ పంపిన. బిడ్డని తెచ్చి చూపించి పోయిన్రు. రెండేళ్ళాయె. ఏ కబురులేదు. మస్తు ఫికరయితుందీ దీదీ! నా బిడ్డని పిలిపియ్యమని సాహెబ్‌కు "పటీసన్" రాయి. అన్నది.

సరేనని అడ్రసు, వివరాలు నోట్ చేసుకుని పారోకి ధైర్యం చెప్పి పంపాను. ఆ రాత్రి నాకు చాలా సేపటివరకూ నిద్రపట్టలేదు.

ఇది ఎంత అన్యాయం? రెండేళ్ళ పిల్లగా జైల్లోకి అడుగుపెట్టి పన్నెండేళ్ళపాటు జైలులో వుండటం. కళ్ళు తిరిగినట్టయ్యింది నాకు. అదీ ఏ నేరమూ చేయకుండానే ఒక జీవితకాలపు శిక్ష! జైలు లోపలి జైలు లాంటి ఈ మహిళా వార్డులో బయటి ప్రపంచం అంటే ఏం తెలీకుండా పన్నెండెళ్ళపాటు పెరగడం! జైళ్ళలో ఐదేళ్ళ వయసు వరకే పిల్లలని వుండనిస్తారు, అనేదే నాకు తెలిసిన విషయం. కాని వాస్తవాలు వేరుగా వున్నాయి. సాధారణంగా ఇంట్లో చూసేవాళ్ళు ఎవరూ లేనివాళ్ళని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే గవర్నమెంట్ హాస్టల్స్‌కో, అనాథాశ్రమాలకో పంపుతుంటారు. ఇలా పంపకుండా ఈ మున్నీలని బయట ప్రపంచానికి దూరంగా వుంచిన జైలు అధికారులది పారో అనుకుట్టు మంచితనం అనుకోవాలో బాధ్యతా రాహిత్యం అనుకోవాలో అర్థంకాలేదు.

అన్నేళ్ళపాటు బయటి ప్రపంచాన్ని చూడని మున్నీ మొదటిసారి బయటకు వెళ్ళినపుడు ఎలా ఫీల్ అయ్యుంటుంది? తన జీవితంలో ఎన్నడూ చూడని, అన్ని రకాల వాహనాలు, రోడ్లు! బిల్డింగులు, మనుషులూ ఆమెని ఎంత కలవరపాటుకి

గురిచేసి వుంటాయి? జీవితంలో ఎన్నడూ సైకిల్ గానీ, రిక్షాకానీ, బస్సుగానీ ఎక్కకుండా మొదటిసారి బస్సుఎక్కినప్పుడు ఎలా ఫీలయ్యి వుంటుంది?

కొద్ది రోజుల క్రితమే ధన్‌బాద్ నుంచి శిక్షపడి వచ్చిన భాను చెప్పిన అనుభవం గుర్తుకొచ్చింది. ఆమె ఆర్నెల్ల పసిపిల్లను తీస్కుని జైలుకొచ్చింది. రెండున్నరేళ్ళ తర్వాత శిక్షపడి అప్పటికి మూడేళ్ళ వయసున్న కూతురు రోషిణిని తీస్కుని కేంద్రకారాగారానికి వచ్చింది. ఇక్కడ చుట్టు పక్కల జిల్లాలలో ఎవరికి శిక్షపడినా హజారీబాగ్ కేంద్రకారాగారానికి పంపుతారు. దారంతా రోషిణి కదులుతున్న బస్సు పడిపోతుందని భయంతో వాళ్ళమ్మని గట్టిగా కావలించుకుని ఏడుస్తూనే వున్నదట. కనీసం ఇప్పటికాలంలో జైళ్ళలోకి కూడా టీవీలు వచ్చాయి. అప్పట్లో టీవీలు కూడా లేవు కనుక మున్నీ చూసిన ఆ చిన్ని ప్రపంచంలో పిల్లులూ, ఎలుకలూ, బొద్దింకలూ, పావురాలు, గోరింకలే తప్ప మరేమీ లేవు. బావిలో కప్ప సముద్రంలో పడినట్టయి వుంటుందా?

ధైర్యం చెప్పడానికి పక్కనలేని అమ్మా నాన్న! తానేం కష్టాలు అనుభవించిందో, ఎలాంటి జీవితం గడిపిందో ఊహకి కూడా అందని బయటి ప్రపంచపు తన ఈడు పిల్లలతో ఆమె ఎలా వ్యవహరించి వుంటుంది? ఇంత చిన్న విషయం కూడా తెలీని వాళ్ళుంటారా? అని ఆశ్చర్యపోయి గేలిచేసి వుంటే ఆ చిన్నారి మున్నీ ఎలా తట్టుకుని వుండొచ్చు? ముసురుకుంటున్న ఆలోచనలు వదిలించుకొందామన్నా వదిలించుకోలేని నిస్సహాయతనుంచి పెరుగుతున్న అశాంతి. అంపశయ్యలా తోస్తున్న పక్కమీద ఆరోజూ ఇలానే పొర్లాను.

మున్నీ జాడ కనుక్కొనే భాగీరథ్ప ప్రయత్నం మొదలుపెట్టాం నేనూ... పారో. మొదలు నేను పారోకి నచ్చచెప్పి ఆ సిస్టర్ పేరున ఒక ఉత్తరం రాశాను. రెండు వారాల పాటు ఎదురు చూశాం. ఈ సారి జైలు సూపరింటెండెంట్ ద్వారా పిటీషన్ పంపాం. నెలరోజులు గడిచిపోయాయి. ఏ జవాబూలేదు. సూపరింటెండెంట్‌ని ఫోన్ చేయమని అడిగాము. నెంబర్ తెలీదు అన్నాడు. జైలర్ రౌండ్స్‌కి వచ్చినపుడల్లా పారో అడుగుతూనే వుండేది. చివరికి ఒకసారి జిల్లాజడ్జీ, ఇతర జడ్జీలు, వకీళ్ళు, సిబ్బంది తో కలిసి జైలు సందర్శించాడు. ఆయనని గట్టిగా నిలదీసింది పారో. నేను సంక్షిప్తంగా విషయం వివరించి ఏం చేయాలో కనీసం చెప్పమని అడిగాను. చివరికి ఆయన అంతావిని ఆ జిల్లా ఎస్. పి. కి ఫిర్యాదుచేసి ఆమె అచూకి కనుక్కోమని పిటీషన్ ఇవ్వమన్నాడు. వెంటనే పిటీషన్ రాసి పంపాం. మూడు నెలలు గడిచిపోయాయి. ఈ లోపు పారో ఎవరొచ్చినా గొడవ చేస్తూనే వుంది. నేను మరొక

పిటీషన్ రాద్దామనుకొంటుండగా పారోని కార్యాలయానికి రమ్మని కబురొచ్చింది. పారో వాపసు వచ్చేవరకూ నేనూ ఉద్విగ్నంగా ఎదురు చూశాను.

అరగంట తర్వాత పారో బూతులు తిట్టుకుంటూ వచ్చింది. బడాబాబుని (హెడ్‌క్లర్కు), ఎస్. పి. నీ, మిషన్ వాళ్ళని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూ వుంటే ఏం జరిగిందని అడగడానికి మనస్కరించక తానే చెప్తుందని వూరుకుండిపోయాను. తిట్టి, తిట్టీ అకస్మాత్తుగా "ఎవన్నడిగి పంపిరు? ఎందుకు పంపిరు? రివాన్ కి పంపిరట, అట్లెట్ల పంపిరు? నువ్వు చెప్పు" అని గద్దించింది. నాకు ఒక్క ముక్క అర్థంకాలేదు "రివాన్‌కా? అదెక్కడా?" అన్నాను. "దేవఘర్" అంది. సివాన్‌లాగా రివాన్ కూడా ఒక వూరిపేరా అని అనుమానం వచ్చింది. పక్కన వేరేవాళ్ళని అడిగాను. ఓ అరగంట పారోని రకరకాలుగా ప్రశ్నించాక ఆమె బిడ్డని దేవఘర్ "రిమాండ్ హోం" కి పంపారని అర్థమయ్యింది. దేవఘర్‌లోని ఈ రిమాండ్ హోంలో బాలనేరస్థులని వుంచుతారు. బడాబాబుని ఎందుకు తిడుతోందని మెల్లగా కనుక్కొన్నాను. ఆయన "నీ బిడ్డ ఏదో నేరం చేసివుంటుంది. అందుకే మిషన్ వాళ్ళు కేసుపెట్టి వుంటారు. నువ్వు బెయిల్ మీద విడిపించుకోవాల్సి వుంటుంది" అని చెప్పాడట.

పారోకి కోపం నషాళానికి అంటింది. నా బిడ్డ ఏం తప్పు చేసిందని రివాన్‌కి పంపినవ్ సాలా!" అని మొదలుపెట్టి తాను ఎట్లెట్ల తిట్టిందీ చెప్పింది. ఆమె కోపం మెల్లగా దు:ఖం లోకి మారింది. "నా బిడ్డ ఏ తప్పు చేయ్యదు దీదీ ! చానా చక్కనిపిల్ల, చోరీగీరీ చేసే పిల్లకాదు. ఇంత అన్నేయం యేడనన్నా వుందా?" అని భోరున ఏడ్చింది. లాకప్ టైం అయిపోవడంతో నేనింక ఏమీ చేయలేక పోయాను. పారోని ఓదార్చి మరుసటిరోజు కనుక్కొంటానని వాగ్దానం చేశాను. నేను మరుసటి రోజు హెడ్‌వార్డర్‌ని విషయం కనుక్కోమని చెప్పాను. జవాబుగా ఆయన ఒక కాగితం తెచ్చి నా చేతిలో పెట్టాడు. "పారో దేవికి అర్థం చేయించండి" అని వెళ్ళిపోయాడు. చూస్తే ఎస్. పి. ద్వారా సంబంధిత ఠాణాకి చెందిన ఇన్స్‌పెక్టర్ పంపిన దర్యాప్తు వివరాలు.

దర్యాప్తు చేయవలసిన సదరు మున్నీ కూమారి ఫలానాకేసు నెంబరు విషయంలో సెక్షన్ 376 కింద మెజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇవ్వడానికి హాజరుకాగా ఆమె తల్లిదండ్రులుగానీ గార్డియన్ గానీ ఎక్కడున్నారని మేజిస్ట్రేట్ విచారించారనీ, వాళ్ళు జైలులో వున్నారని తెలిసి వేరే గార్డియన్ ఎవరూ లేని పరిస్థితిలో ఆమెని ప్రభుత్వ సంరక్షణలో దేవఘర్ రిమాండ్ హోం కి పంపమని మేజిస్ట్రేట్ ఆదేశించారని ఆ రిపోర్టు సారాంశం.

నేను పారోని ఏడ్వద్దని గట్టిగా మందలించాను. ఆ బడాబాబు తెలిసీ

తెలియకుండానే ఏమేమో తప్పులు చెప్పాడనీ, మున్నీ మీద ఏ కేసూ లేదని, ఆమెనే ఎవరి మీదనో కేసుపెట్టిందనీ, వాగ్మూలం ఇవ్వడానికి మేజిస్ట్రేటు దగ్గరికి వెళ్ళిందని చెప్పాను. ఏంకేసో నాకూ అర్థం కాలేదు. ఆ సెక్షన్ ఏంటో కనుక్కోవాలి. అదేమాట పారోతో చెప్పాను. కానీ పారోతోపాటు నన్నూ వదలని సందేహాలు పట్టి పీడించాయి. తీసుకుపోయిన మిషన్ వాళ్ళు లోకల్ గార్డియన్లు కదా! మరి వాళ్ళేమయినట్టు? ఆమెని తమ దగ్గర ఎందుకుంచుకోలేదు? వాళ్ళ మీద భరోసాతో కదా తన బిడ్డని పంపింది? కనీసం ఆమె మైనారిటీ తీరేవరకైనా వాళ్ళు బాధ్యత వహించాలి కదా! అబ్బా! ఏమయ్యిందో తెలిస్తే ఎంత బాగుండును? నాకే ఇంత అశాంతిగా వుంటే ఇంక పారో మాట చెప్పాలా?

ఇంత టెన్షన్ లోనూ పారో పిల్లుల్ని ఏ మాత్రం నిర్లక్ష్యం చెయ్యలేదు. వాటికి తిండిపెడుతూ ముద్దు చేస్తూ, కోప్పడుతూ పనుల్లో పడిపోయింది. రోజూ చేసే పనులేవీ వదిలిపెట్టి ముసుగుతన్నలేదు. వాటిల్లోనే తన పిల్లల్ని చూసుకుంటుందేమో అనిపించింది.

కోర్టుకు పోతూ కార్యాలయంలో ఆగినప్పుడు, సిబ్బంది ఒకర్ని "376 సెక్షన్ కిందికి ఏ నేరం వస్తుంది?" అని అడిగాను. అతను ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూసి "రేప్ కేసు" అన్నాడు. నిశ్చేష్ఠురాలినైపోయాను. ఇన్నాళ్ళూ తన రెక్కలకింద పొదువుకొని కాపాడుకున్నది పారో తనబిడ్డను. ఈదెబ్బను ఎలా తట్టుకుంటుందో! ఆమెను నేను ఓదార్చగలనా? నాకంత శక్తి వుందా? ఆమెకి ఏం ధైర్యం చెప్పాలి? రకరకాలుగా ఆలోచిస్తూ కోర్టుకు వెళ్ళాను. అక్కడ మనస్కరించక బెంచి క్లర్కుని కూడా మరోసారి అడిగి తెలుసుకున్నాను.

మనసంతా భారంగా అయిపోయింది. ఏమిటీసమాజం? మరోసారి జీవితంలో ఏ నేరమూ చేయకుండానే జైలుకి వెళ్ళింది మున్నీ. అసలు ఆమెకి గార్డియన్ లేకపోతే కూడా మేజిస్ట్రేట్ ఆమెని రిమాండ్‌హోం కి ఎలా పంపాడు? మహిళా శిశు సంక్షేమ శాఖ ఏంచేస్తున్నట్టు? వాళ్ళు నడిపే వసతి గృహాలేమయినట్టు ? బాధితురాలూ ఆమే! ఇప్పుడు నిందితురాలు కాకుండానే జైలుపాలయిందీ ఆమెనే. తన తప్పు లేకుండానే, ఏ కేసూలేకుండానే ఇలా పదే పదే జైలు జీవితం గడపాల్సిరావడం ఎంతటి అన్యాయం? ఏం ప్రజాస్వామిక దేశం ఇది ? పైగా అది పెద్ద ప్రజాస్వామిక దేశం అని పేరొకటి!

కోర్టునుంచి రాగానే అలిసిపోయి వున్నానని పారో నన్ను ఏం అడగలేదు. కానీ నాకు తెలుసు ఆమె ఎంత వ్యథ చెందుతూ వుండిరటదో! వెంటనే ఆమె దగ్గరికి

వెళ్ళాను. పారో నన్ను చూస్తూనే "అయ్యో దీదీ నువ్వు ముందు కాళ్ళూ చేతులూ కడుక్కో. అన్నంతిను. తర్వాత నింపాదిగా చెప్పు ఏం కాదు. " నేనెంత వారిస్తున్నా పారో నామాట వినలేదు. బలవంతంగా నన్ను పంపేసింది. ఎందుకంటే లాకప్ కావడానికి ఎంతో సమయం లేదు. ఒకసారి లాకప్ అయిపోతే ఇక కాళ్ళూ చేతులూ కడుక్కోనే అవకాశమే వుండదు. తానంత టెన్షన్ లో వుండి కూడా ఎంత ఆలోచించింది ! కాని లాకప్ అయిపోతే నేను తనతో మాట్లాడడం ఎట్లా ? ఆమె తో విడిగా మాట్లాడే అవకాశమే వుండదు. అందరూ మూగిపోతారు. ఆమెతో ఈ విషయం వంటరిగానే మాట్లాడాలి. లేకపోతే తలొకరూ తలొకమాట అని ఇబ్బంది పెట్టేస్తారు. నా మనసు గ్రహించినట్టుగా ఫరవాలేదు రేపు ఉదయం మాట్లాడదాం అన్నది.

నాకు అశాంతిగా ఇబ్బందిగా ఎలానో వుంది. ఒకలాంటి అపరాధ్భ భావన. తెలిసీ వెంటనే చెప్పకపోవడం సరైందేనా? ఆమె ప్రైవసీని కాపాడాలి కాబట్టి ఫరవాలేదా? నా నెత్తిన టన్ను బరువు పెట్టినట్టు భారంగా తోచింది.

* * *

కమానీఘర్‌లో కూర్చుని లేద్రా కుడుతున్న పారో ఎదురుగా కూర్చుని ఎలా మొదలుపెట్టాలా అని ఆలోచిస్తూ సాధ్యమైనంత సున్నితంగా చెప్పాలని అప్పటికే అనేకసార్లు రిహార్సిల్స్ వేసుకున్న వాక్యాల్నే ధైర్యం చేసి అనేశాను.

"పోలీసులు దర్యాప్తు చేశారు. మున్ని మీద ఏ కేసూలేదు. తానే కేసు పెట్టింది ఎవరి మీదనో... . . ఆమెమీద అత్యాచారం జరిగింది. " ఎలానో చేప్పేశాక పారో గుండెలు బాదుకుంటుందా? పిడుగుపడ్డట్టు స్థాణువైపోతుందా అనే భయంతో చూస్తుండిపోయాను. నేను ఏమాత్రం ఊహించని రియాక్షన్ పారోలో కనిపించింది.

"నా బిడ్డ కేసుపెట్టింది కదా! అంటే వాన్ని జైలుకి పంపివుంటారు కదా!" అంది. "బహుశ!" అన్నాను.

"నాకు తెలుసు. నా బిడ్డకు చానా ధైర్యం. మంచిపని చేసింది. " ఆమె ముఖంలో ఒక రిలీఫ్. ఆ సరికి నేను కూడా కొంత తేరుకుని "అవును" మంచి పనిచేసింది. మేజిస్ట్రేటు ముందు వాంగ్మూలం ఇచ్చింది. ఆయన గార్డియన్ లేరని దేవఘర్ పంపాడు. " అన్నాను. అప్పుడు చూశాను పారో ముఖంలో కోపం.

"సాలా లోగ్ – ఈ మిషనోళ్ళని ఎంత నమ్ముకుని నా బిడ్డను పంపాను! నా బిడ్డకు కష్టమొస్తే అక్కున చేర్చుకోవాల్సిన వాళ్ళు అనాధలా ఎట్ల వదిలేసిన్రు? తీస్కపోయినోళ్ళు "గార్జియన్లు" గారా? ఆళకేం ఫర్జు (బాధ్యత లేదా! ఆ సిస్టర్ మీన కేసు పెడతా! హా దీదీ ! కేసు పెట్టచ్చుకదా "పటీషన్ రాస్తవా?"అంది.

"మొదలు దేవఘర్ చిట్టీ పంపుదాం. అసలేం జరిగిందీ మొత్తం రాయమందాం. తెలుసుకున్నాకనే కేసు విషయం ఆలోచించగలం గదా!" అన్నాను.

"అయ్యో ! నా మతిమండా! హా ! దీదీ, ఒక చిట్టి రాసిపెట్టు. " అంది. ఏం రాయను? అని అడిగితే "నువ్వు అన్నీ తెలిసిన దానివి నువ్వేరాయి" అంది. ఆ రాత్రి కష్టపడి హిందీలో ఒక ఉత్తరం రాశాను. ఆమెను ధైర్యంగా వుండమనీ ఏం జరిగిందో మొత్తం రాసిపంపమని. కేసు పెట్టి మంచిపని చేసిందని రాశాను. మరురోజు పారోకి చదివి వినిపిస్తే ఆరోగ్యం జాగ్రత్త అనీ ఏమన్నా ఇబ్బంది అయితే అక్కడ అధికారులకి విషయం చెప్పి డాక్టర్‌కి చూపించమని రాయమంది. నిజమే! నేనెంతసేపూ ఆమె అవమాన పడాల్సిన పనిలేదని, ధైర్యంగా వుండాలనీ రాశాను తప్ప ఈ విషయం రాయలేదు. ఆమె తల్లి మనసు ఎంత సరిగ్గా ఆలోచించింది! అని మెచ్చుకోకుండా వుండలేకపోయాను. నేను లేవబోతుంటే పారో "ఒక్క క్షణం" అంటూ నన్ను ఆపింది. మరోముక్క జోడించమంది.

"నా ప్రాణాలన్నీ నీ మీదనే పెట్టుకున్నా బిడ్డా! నువ్వు బతికున్నవ్ సాలు! బతికుంటే మిగిల్నియ్ సక్కజేసుకోవచ్చు కొట్లాడాలె బిడ్డా! హిమ్మత్ రఖ్!" ఆ మాటలు నాకు ఎంతో ఉత్తేజాన్నిచ్చాయ్ నేను పారోకి ధైర్యం చెప్పడం కాదు. పారో నాకు చెప్తున్నట్టనిపించింది. నాకే కాదు. మరుసటి రోజు ఆమె తన భర్తని కలసి అతనికి కూడా ఆమెనే ధైర్యం చెప్పాల్సి వచ్చింది. అతనీ విషయం తెలిసి కుప్పకూలిపోయాడు. పారోనే శతవిధాల ధైర్యం చెప్పింది. రోజులు గడిచిపోతున్నాయి. మున్నీ నుంచి అయితే ఏ కబురూ లేదు. ఉత్తరం అందిదో లేదో ఏం తెలీలేదు. కానీ ఒకరోజు వార్తల్లో శిక్ష పూర్తి చేసుకున్న వాళ్ళను విడుదల చేయలని ఝార్ఖండ్ లోని వివిధ జైళ్ళలో నిరాహారదీక్షలు చేపట్టినట్టు వార్త. అది పెద్ద సంచలనమే కలిగించింది. ఇక అందరూ తమ తమ శిక్షల విషయం మాట్లాడడానికి నా దగ్గరికి రావడం మొదలుపెట్టారు. చూస్తుండగానే పెద్ద మీటింగ్ లాగా అయిపోయింది. చివరికి మహిళా వార్డులో 14 యేళ్ళు లేదా అంతకుమించి జైలు జీవితం గడిపినది ఒక్క పారోనే అని అర్థం అయ్యింది. అప్పటికప్పుడు పారో, పారోకి మద్దతుగా మేం అందరం నిరాహారదీక్ష చేయాలని నిర్ణయం అయిపోయింది. మరుసటి రోజు కోర్టుకి పోయే వాళ్ళ ద్వారా మగవాళ్ళ వార్డువైపు కబురు చేయాలని నిర్ణయించుకున్నాం. ఇంకా మిగిలిన వార్డుల వాళ్ళతో మాట్లాడాలి. కాబట్టి ఒకరోజు సమయం తీస్కుని పిటీషన్ తయారుచేసి అందరితో సంతకాలు, వేలిముద్రలు వేయించేసరికి ఒక రోజంతా పట్టింది. 24 గంటలముందు నోటీసు ఇవ్వాలనే నిబంధనని పట్టించుకోకుండా

నోటీసు పంపించాం. ఒక్క మహిళకోసం మహిళలందరూ నిరాహారదీక్ష నోటీసివ్వడం వల్ల వెంటనే పిలుపొచ్చింది.

కొంతమంది ఖైదీలను తీస్కుని జైలర్‌తో మాట్లాడడానికి వెళ్ళాం. జైలరు ఒక్క వారం టైమివ్వమని అడిగాడు. ఇస్తే ఏంచేస్తారని అడిగాం. ఆయన తన టేబుల్ మీదకి అప్పుడే వచ్చిన లిస్టులు చూపాడు. 33 మంది మగవాళ్ళు ఒక స్త్రీ (అనుకొన్నట్టుగానే ఆ ఒక్క స్త్రీ పారోనే) కలిపి 34 మంది విడుదలకు అర్హులనీ వారిని విడుదల జేయమని సిఫారిష్ చేస్తూ జైలు నుంచి పంపబోతున్న దరఖాస్తు చూపాడు. అందులో తన పేరు ఎక్కడ వుందో పారోకి చూపాను. అప్పుడు సంతృప్తిగా తలూపి "సరే సారూ! వారం కాదు పదిరోజులు సమయం తీస్కో పదకొండో రోజు మళ్ళీ నీకు "పటీసన్" ఇవ్వం నేరుగా అన్‌సన్ (నిరాహారదీక్ష) చేస్తం. తయ్యారుగుండు. "అన్నది. జైలర్ మరోసారి భరోసా మాటలు చెప్పి పంపించాడు.

వారం రోజుల పాటు ఇక అవే విడుదల కబురు.్ల ప్రతిరోజూ ఉదయాన్నే అందరూ పనసచెట్టు కింద చేరి పేపరులో ఏమన్నా వచ్చిందా అని ఆతృతగా అడిగేవారు. వారం తర్వాత పేపర్లో అనేక మంది పేర్లు వచ్చాయి. ఇక్కడి జైలునుండి 34 మంది విడుదలవుతున్నట్టు వార్తని ఆరోజు నేను బహుశ ఓ వందసార్లు చదివి వినిపించి వుంటాను, తమపేరు వుండదని తెలిసినా సరే ప్రతి ఒక్కరూ శ్రద్ధగా అడిగి అడిగి చదివించుకుని విన్నారు. ఒకటే పండగ వాతావరణం. మామూలుగా విచారణలో వున్న ఖైదీలు విడుదలైతేనే ఎక్కడి పనులు అక్కడ వదిలిపెట్టి అందరూ గేటు వరకూ సాగనంపడానికి వస్తారు. ఇక పదహారెళ్ళ తర్వాత విడుదలవుతుందంటే పెద్ద జాతరే అయ్యింది. పారో దోస్తులు అరగంటలో సామాను సర్దేశారు. ఇక పారోని పలకరించి ఆమె కాళ్లుమొక్కి తాముకూడా తొందరగా విడుదలవ్వాలనే ఆశీర్వాదం కోరుకుంటూ వున్నారు. పెద్ద ఎత్తున ఖైదీలు విడుదల కావడం. పైగా వివిధ జైళ్ళలో నిరాహారదీక్షలు కూడా జరగడం వల్ల మీడియా ఉత్సాహంగా కవర్ చెయ్యసాగింది. ఫోటోలు, జైలు అధికారుల వీడ్కోలు ఉపన్యాసాలు, అన్నీ అయ్యాయి. అలా నేను చూసిన మూడేళ్ళలో ఎవ్వరూ పొందని భారీ వీడ్కోలు అందుకొని పారో వెళ్ళిపోయింది. పేరు పేరునా అందరికీ చెప్పి పోయింది.

మరుసటి రోజు పేపర్లలో ఫోటోలు కుడా వచ్చాయి. బహుశ వెంటనే దేవఘర్ వెళ్ళివుంటారు కావచ్చు అనుకొంటూ వున్నాను. నాలుగైదు రోజుల తర్వాత పిల్లలు గోలగా అరుస్తూవుంటే ఏంటో చూద్దామని వెళ్ళాను. పారో ముద్దుగా "లంగ్‌డా" అని పిలుచుకొనే "బుధన్" శవమై పడివున్నాడు. మనసంతా ఎలానో అయిపోయింది.

పిల్లులు నామీద ఎగబడి మరీ చెప్పడం మొదలు పెట్టాయి. పారో వెళ్ళిననాటి నుండీ ఏం తినడం లేదట. పిల్లలు పాలు తీస్కుపోయి పెడితే కూడా అవి తాగలేదట. కమానీఘర్ చుట్టూ తిరుగుతుండేవి అని చెప్తుంటే నాకు అప్రయత్నంగా పారో పిల్లలు, గుర్తుకు వచ్చారు. కనీసం వాళ్ళు ఇప్పుడు సంతోషంగా వుండివుంటారు కదా అనుకొన్నాను. ఇన్నేళ్ళ తర్వాత తన పెద్ద బిడ్డను కలిసి వుంటుంది కదా ఎలా అన్పించి వుంటదో? అసలు పారో గుర్తుపట్టగలదో లేదో! ఐదేళ్ళ పిల్లగా చూసి, ఇప్పుడు 21 ఏళ్ళ వయసులో చూసి తల్లి బిడ్డలు ఒకర్నొకరు గుర్తు పట్టుకోగలుగుతారో? మనసులో ఆక్రమించిన విచారం మాత్రం పెరుగుతూనే వుంది.

ఆ రాత్రంతా రుదన్, సుదన్ లు చంటి పిల్లల్లా ఏడ్చినట్టే మ్యావ్ మ్యావ్ మంటూ అరుస్తూనే వుండి మమ్మల్నెవరనీ నిద్రపోనివ్వలేదు.

* * *

ఉదయం పేపరు చదువుతుంటే రీలామాల హిందీ పేపరు పట్టుకొచ్చి చిన్న వార్త చూపించింది. "ఇటీవల సెంట్రల్ కారాగారం నుంచి విడుదలైన పారోదేవి పదహారేళ్ళ తర్వాత ఇంటికి చేరగా తెలిసిన విషయం ఆమె పెద్ద బిడ్డ తను అరెస్టైన ఏడాదిలోపునే మరణించిందనీ, 15 యేళ్ళ తర్వాత మాత్రమే ఈ విషయం తెలుసుకున్న పారో దేవి కన్నీరుమున్నీరయ్యింది" అనేది ఆవార్త. తల పట్టుకుని కూర్చుండి పోయాను.

మున్నీ గురించి ఆ వార్తలో ఏ ప్రస్తావనా లేదు. కాని పారో మీద నాకు పూర్తి నమ్మకం వుంది. ఇప్పుడు మున్నీకి అండగా కొండంత పారో వుంది. కానీ పారో అండలేని రుదన్, సుదన్‌లు మాత్రం గుండె చెదిరిపోయిందేమో ఎక్కడికో పారిపోయాయి. బహుశా ఆమెని వెతుక్కుంటూనేమో!

ఇప్పుడు కొత్త కొత్త పిల్లులు వచ్చాయి. వాటికి క్రమశిక్షణ నేర్పేందుకు పారో లేదు. అవి ఉత్త పోకిరీ పిల్లుల్లా తయారయ్యాయి. పారో తనతోపాటే మా మనశ్శాంతినీ తీసుకుపోయింది. అయితేనేం పారోలాంటి తల్లులు జైలు బైటనే ఉండాలి–మున్నీలకి కొండంత అండగా !

# డిసెంబర్ - 3

## *ఆర్. శశికళ*

2007 - నవంబర్ 5వ తేదీ "చిల్డ్రన్స్ డే" ఏర్పాట్లలో బిజీగా ఉన్నా - శ్రీలత ఫోన్ చేసింది. 'శశీ! నాకు అనంతపురం ప్రమోషన్‌పై ట్రాన్స్‌ఫర్ అయింది. త్వరలోనే నిన్ను కలుస్తా," అంది - "నేనూ ఎదురు చూస్తున్న" అన్నాను. తర్వాత పరామర్శలు, ఫోన్ పెట్టేశాను.... కాఫీ తాగుతూ ఆలోచిస్తున్నా. ఆమెను గురించి తల్చుకొంటూనే స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

వినడం తప్ప, కలిసి మాట్లాడుకోవడం ఇప్పటి దాకా కుదరలేదు. కర్నూలు ఉద్యోగినులు ఎన్నో సమస్యలపై పోరాటాలు చేసి విజయం సాధించారట - 'వర్కింగ్ ఉమెన్స్ అసోసియేషన్' అక్కడ చాలా బలంగా పనిచేస్తోంది. వ్యక్తిగత సమస్యలు, కుల సమస్యలు, ఈ పనిచేసే స్థలాల్లో ఆ మహిళలపై అవమానాలకు వ్యతిరేకంగా ఇలా చెప్తూ పోతే పెద్ద లిస్టే తయారవుతుంది. అనంతపురం వచ్చి ఉద్యోగంలో చేరి 20 రోజులయింది ఇంకా కలవటం కుదరలేదు. శనివారం సాయంత్రం ఫోన్ చేసి ఆదివారం వస్తానంది శ్రీలత... "మహేష్ కూడా వచ్చాడు." ఇద్దరం వస్తాం అంది.

ఇద్దరూ వచ్చారు పొద్దున్నే.

'ఇన్ని రోజులయిందీ నీకు తీరిక దొరక్క' అదిగో - మా బంధువుల ఇంట్లో దిగాను - ఆఫీస్, ఇంట్లో పనిలో ఊపిరాడక, రాలేకపోయాను.

"ఇక్కడికి వస్తావనుకున్నా ఎందుకు అక్కడ దిగావు? నీవు వచ్చినట్లు చెప్పలేదు" అన్నాను కాస్త కోపంగా...

ఇప్పుడా లగేజి తెప్పిస్తా ఇక్కడే ఉంటా.. కొన్ని రోజులు

"అదీ బస్టాండ్ దగ్గర రూం దొరికితే షిఫ్ట్ అవుతా సరేనా!" అంది శ్రీలత.

'నీవెన్ని నెలలున్నా నాకు సంతోషమే' అన్నాను.

'ఎవర్నీ ఇబ్బంది పెట్టటం నాకిష్టం లేదు' శ్రీలత.

వంట మొదలెట్టాను.

"నీకు సాయం చేయనా నేను చాలా రకాల వంటలు చేస్తాను, నన్ను నమ్ము, రుచిగా కూడా చేస్తాలే" అంది శ్రీలత, ఇంతలో

శ్రీలత స్నానానికి ఏర్పాటు చేశా. బాత్‌రూంలో కుర్చీపెట్టా బక్కెట్, సోప్ అన్నీ అందుబాటులో ఉంచాను.

"తువాల్ అక్కడే పెట్టా... చూడు..." చెప్పాను.

"ఇదేంటి నీవే స్నానం కూడా చేయించేట్టున్నావే చూస్తుంటే" అంది నవ్వుతూ

"నాకు అనుమతిస్తే అలాగే" అన్నా వంట అయింది – భోజనం చేస్తుంటే మెల్లగా అసలు విషయం చెప్పింది – వాళ్ళ బాబాయి వాళ్ళింట్లో – ఎలా తను గడిపింది చెప్తుంటే – చాలా బాధగా అనిపించింది.

శ్రీలతతో పనులు చేయించాలని చూడటం – నలుగురున్నారు.

అందరూ పెద్దవాళ్ళే – ఎవరికీ అనారోగ్యం లేదు

వంట, వూడ్వటం, పాత్రలు కడగటం ఈమెకే వదిలేసేవాళ్ళు – సమయానికి చేసుకోలేక సతమతమయ్యేదట.

ఈ ఇరవై రోజుల్లో కనీసం నాలుగైదు సార్లు రావాలని అనుకున్నా పని వత్తిడిలో రాలేకపోయింది.

అన్నీ అందరికీ అమర్చి తిట్టించుకోవటం నుండి నాకు శ్రీలత లాంటి వాళ్ళకు విముక్తి లేదా? అనుకున్నా మనసులోనే.

"మీ ఇంట్లో ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తువుంటారు.

నేనూ నీ పనికి అదనం అవుతా" అని ఆలోచించాను అంది శ్రీలత...

పోనీ వదిలేయి అవన్నీ ఆలోచించవద్దు.

'మీ విశేషాలు వినడానికి ఎదురు చూస్తున్నా'

"కాసేపు రెస్ట్ తీసుకో, సాయంత్రం కబుర్లు మొదలెడదాం" అన్నాను. శ్రీలత ప్రశాంతంగా నిద్రపోయింది.

గది తలుపులు దగ్గరగా వేశాను.

మహేష్ అన్నాడు, "నేను బయల్దేరతానమ్మా వచ్చే ఆదివారం వస్తా – లేదంటే తనే వస్తుంది"...

"సరే", తలుపులేశాను – నేనూ పుస్తకాలను బయటికి తీశాను. శ్రీలత ఇంటికొచ్చి వారం, ఎంత త్వరగా గడిచిందో తెలియటం లేదు. ఆమె అనేక ఆసక్తికరమైన విషయాలు చెప్పేది. మహిళలను కదిలించటంలో ఉండే ఇబ్బందులు, పోరాటాల్లో

విజయాలు, వైఫల్యాలు, అవమానాలు అన్నీ అద్భుతంగా వివరిస్తుంటే నేను ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టి చూస్తుండే దాన్ని...

సోమవారం ఉదయం శ్రీలత కోసం క్యారియర్ సర్దిపెట్టా –

శ్రీలత, నేను ఒకే ఆటోలో బయల్దేరాం – నన్ను స్కూల్ దగ్గర వదిలేసి తను వెళ్ళిపోయింది...

11 గంటలవుతోంది... శ్రీలత ఫోన్ చేసి, "నీవు అర్ధగంటలో ఇంటికి రాగలవా? నేను వస్తున్నా?" అంటే – ఏదో ఆదుర్దా కనిపించింది ఆ గొంతులో, "సరే, సరే వస్తున్నా" అన్నాను... ఆమె కంటే ముందే ఇంట్లో ఉన్నాను.

ఆటో దిగి, లోనికి వచ్చి సోఫాలో నిస్సత్తువగా కూలిపోయింది.

నేను, "ఆ ఊత కర్రలు పక్కకు జరిపి సర్దుకొని ఫ్రీగా కూర్చో. ఎందుకు అలా ఉన్నావు". అంటూ మంచి నీళ్ళు అందించాను.

గ్లాసు నీళ్ళు తాగేసింది – "నేను ఇంత బతుకు బతికి ఆ వెధవ నాయాళ్ళతో మాటలు పడాల్సి వస్తోంది' – ఒకటే అవమానిస్తున్నారు – కొత్తగా వచ్చిన ఆఫీసర్ గారు ఒకటే సణుగుతున్నాడు. 'ఇట్లాంటోళ్ళు ఆఫీసర్లంటా పనిరాదు, పాడురాదు' అని తిడ్తున్నాడు.

అందరికంటే నేనే ఎక్కువ పని చేసేది – ఎ.పి.జి.ఎఫ్. ఆఫీసు కావటంతో జీవితాంతం దాచుకొన్ని డబ్బులు రిటైర్ అయ్యాక తీసుకొంటారు. వాళ్ళను తిప్పించి తిప్పించి సగం చావగొట్టి టేబుల్ కింద చేయి పెట్టి – ఆ తర్వాత క్లెయింఫారం ముట్టుకుంటారు. నాకివన్నీ అసహ్యం... తొందర తొందరగా ఎన్నో పరిష్కరించి ఇచ్చేస్తున్నాను. రాత్రి ఏడు, ఎనిమిది వరకు ఆఫీసులోనే ఉంటున్నా... వాళ్ళకిది నచ్చలేదు. నన్నేదో ఒకటి ఇరికించాలని తంటాలు పడ్తున్నారు. సాధ్యం కాక నన్ను పర్సనల్‌గా ఏడిపిస్తున్నారని భోరున ఏడ్చేస్తోంది...'

"నేను బ్రతికి లాభం లేదు. ఇక ఆత్మహత్య నాకు మార్గం –" అంటూ అవమానం భరించలేక వెక్కిల్లు పెడ్తూనే ఉంది... ఓదార్చేందుకు ప్రయత్నించా, చైతన్యంతో ఇతరుల కోసం కూడా పని చేసే శ్రీలత అలా మాట్లాడుతోంది. నాకేం చేయాలో అర్థం కాలేదు.

రత్న, ప్రభ కూడా వచ్చారు. కుమార్‌ను పిల్చాను.

"పద, ఆఫీసర్‌తో సరాసరి మాట్లాడదాం – పద –– నువ్వు ధైర్యంగా ఉండు మేమంతా నీకండగా ఉంటాం."

రానంటే రానంది. చివరకు కదిలింది.

ఆమెను సీట్లోకి పంపించి ఆఫీసర్ దగ్గరికి పోయాం.

"ఏమండి ఎంత మీ క్రింది ఆఫీసర్ అయితే మాత్రం మహిళతో ఇలాగా మీరు ప్రవర్తించేది?"

కుమార్ సీరియస్ అయ్యాడు. మమ్మల్ని పరిచయం చేసుకున్నాం – అతడు కాస్త కంగారు పడ్డాడు, శ్రీలతను పిలిపించాడు. "ఏమండీ! వీటిని ఆఫీస్‌లోనే ఇలాంటివి పరిష్కారం చేసుకోవాలంటే ఇలా ప్రజా సంఘాలు, బయటి వాళ్ళు వస్తే మేము ఎందుకు?" అన్నాడు.

మేం ఉండటం చూసి, శ్రీలత ఇంక పూర్తిగా గట్టిగా గొంతు పెంచి, అది వరకు ఆమెను అవమానించిన వారిపై ఏ యాక్షన్ తీసుకుంటారో చెప్పమని నిలదీసింది.

'తప్పులుంటే చెప్పండి' వెంటనే సరిదిద్దుకొంటా – టీ అని అదని, ఇదని నేను బయటికి పోలేను. పైగా ఇంటికి పోయే సరికి రాత్రి 7 గంటలవుద్ది. ఒక్కరంటే ఒక్కరిని నేను చేసిన తప్పు ఏదో చెప్పమనండి ఇప్పుడే తేలిపోవాలి. మీతో అలాగే ప్రవర్తిస్తారా?

నా ముఖంపై తాళాలు అడించి విసిరేసిపోయాడు' అతడు. చెప్పిన మాట వినకుండా తిరిగి లిటిగేషన్ల గేమ్ ఆడుతున్నాడు ఆ వెంకటేశ్వర్లు – చెప్పండి సార్ నా తప్పేం ఉంది? "పని ఆలస్యం చేయకుండ ఫైల్ పుట్‌అప్ చేయమంటే కూడా తప్పేనా?" అంది కోపంతో వూగిపోతూ.

అతడు తగ్గాడు – అతనితో క్షమాపణ చెప్పిస్తానని చెప్పాడు. "సెలవు పెట్టేడట అతడు" అన్నాడు.

మేం వెంటనే పిలిపించమన్నాం, అందాకా అక్కడే ఉంటామనే సరికి,

అతడు ఒక అవకాశం ఇవ్వమని అడిగాడు.

శ్రీలత ఒప్పుకొంది – ఆమెకు ధైర్యం చెప్పి వచ్చేశాం.

తర్వాతర్వాత ఆఫీసులో పరిస్థితులు మారిపోయాయి.

శ్రీలత వాళ్ళ ఆఫీసర్ ట్రాన్స్‌ఫర్‌పై వెళ్ళిపోయాడు.

శ్రీలత ఇన్‌ఛార్జ్ కావటంతో ఆఫీస్ స్టాఫ్ కాస్త తోకలు ముడుచుకున్నారు. ప్రశాంతంగా వస్తూ, పోతుంది.

బస్టాండ్ దగ్గరే రూంలోకి షిఫ్ట్ అయింది... ఆమెను చూసుకోలేక పోయానే అని బాధపడ్డాను. మరి శ్రీలత అభిమానం అలాంటిది... ఏం చేస్తాను...

స్కూల్‌లో డిసెంబర్ 3 అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం కోసం ఏర్పాట్లు

చేస్తున్నాం...

8, 9వ తరగతి పిల్లలను సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని, ఇతరుల సమస్యలను అర్థం చేయించే ప్రొగ్రామ్ మా స్కూల్‌లో ఉంటుంది. అందుకోసం 'సోషల్ వెల్ఫేర్ ఫండ్'కు ప్రతి నెలా జమ చేస్తుంటారు. పిల్లలు నెలకు 1 రూ॥ టీచర్లు 2 రూ॥ కొంత పొగవ్వగానే ఏదో కార్యక్రమం చేస్తుంటాం.

సాయినగర్ సమీపంలోనే అమ్మాయిల (వికలాంగుల) కోసం ప్రత్యేకంగా ఒక ప్రభుత్వ హాస్టలుంది.

విభిన్నంగా పనులు చేయగల్గిన ఆ పిల్లల్లో రకరకాల వైకల్యంతో బాధపడ్తున్న వాళ్ళున్నారు. పిల్లలు, టీచర్ల కమిటీ నుండి ఇద్దరు ఆ హాస్టల్ వెళ్ళారు.

వారితో మాట్లాడి వారి అవసరం మేరకు ఏదో ఒకటి చేయాలని నిర్ణయం. వాళ్ళు తిరిగొచ్చేశారు.

సాయంత్రం కమిటీ సమావేశమయింది. వాళ్ళిద్దరూ ప్రతిపాదన పెట్టారు. అలాగే చేయాలని నిర్ణమయింది.

శ్రీలతకు ఫోన్ చేశాను. డిసెంబర్ 3 కార్యక్రమం గురించి చెప్పాను. 'నేనూ పాల్గొంటా' అంది. రావాల్సిన అడ్రస్, సమయం చెప్పాను.

మరుసటి రోజు పనుల్లో మునిగిపోయా.

10 మంది పిల్లలు, 6గురు టీచర్లు అంతా కలిసి ('డిఫరెంట్లీ ఏబుల్డ్') విభిన్నంగా పని చేయగల ఆ అమ్మాయిల హాస్టల్‌కు వెళ్ళాం. ఉదయం 10 గంటలవుతోంది.

ఇద్దరమ్మాయిలు బట్టలుతుకుతున్నారు. నలుగురైదుగురు అక్కడే కనబడ్డారు. ఇద్దరు ప్లేట్లు కడుగుతున్నారు. హాస్టల్ వార్డెన్‌ను కలిసి మేము వచ్చిన పని వివరించాం – అందర్ని సమావేశపరిచాడు –

వాళ్ళ పనులు వదిలేసి, బయట వేపచెట్టు క్రింద చాపలు పరిచారు. మా స్కూలు పిల్లలు వాళ్ళతో కలిసి కూర్చున్నారు. టీచర్లకు కుర్చీలు వేశారు. రాజు సార్ వారికివ్వాల్సిన వస్తువులు తేవటం కోసం బయటికెళ్ళాడు – ఈ లోపల పిల్లలు, టీచర్లు వాళ్ళతో మాటలు పెట్టారు –

శ్రీలత కోసం బయట ఎదురు చూస్తున్నాను. తను ఆటోలోంచి దిగింది...

కర్రలు అందించాను. తన వెంటే లోపలికి నడిచాను.

"మంచి పని చేస్తున్నారబ్బా" ఇటువంటి కార్యక్రమాలంటే నాకూ చాలా ఇష్టం, అందుకే వచ్చేశాను అంది.

'ఈ రోజు నీవే ముఖ్య అతిథివి' అన్నాను.

అందరికీ పరిచయం చేశాను. పిల్లలు ఆసక్తిగా వింటున్నారు. ఆమెను గమనిస్తున్నారు. పెద్ద బొట్టు పెట్టుకుంది. తెల్లని దేహచ్ఛాయ – ఎర్రంచు తెల్లచీర, మరింత అందంగా, ఆత్మవిశ్వాసంతో వెలిగిపోతోంది – ప్రశాంతంగా ఉంది.

నేనూ శ్రీలతను గమనించాను – ఎటువంటి కల్లోలాలు లేవు. పరిచయాలు అయ్యాక స్వీట్లు, క్యారియర్లు పంచిపెట్టాం – శ్రీలత గమనిస్తోంది, "క్యారియర్లు ఎందుకు?" అనడిగింది.

దీని వెనుక పెద్ద కథ ఉంది – చెప్పాను.

'కమిటి ఇక్కడికి వీళ్ళతో మాట్లాడాలని వచ్చినప్పుడు ఒకమ్మాయి – మెల్లగా అడిగిందట –

అప్పటికి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలు కాలేదు – ప్రొద్దున ఒకపూట వండేవాళ్ళు హాస్టల్‌లో, సాయంత్రం అంటే రాత్రికి భోజనం. అర్ధాకలితో బాధపడేవాళ్ళు.

ప్రొద్దున వండి వడ్డించిన అన్నంలోనే కొంత క్యారియర్‌లో పెట్టుకుని తీసుకొని వెళ్ళి ఆకలి తీర్చుకోవాలనుకున్నారు. అందుకే ఎన్నో అడిగిన తర్వాత వారికి క్యారియర్ అవసరం ఎంత ఉందో చెప్పారు. అవును ఇది సరైంది అనిపించిందని – వివరించాను.

'పిల్లలు ఈ విషయం రాజు సార్‌తో చెప్పినప్పుడు అతనెంత బాధ పడ్డాడో కమిటీ సమావేశంలో చెప్పాడు. ఆయన కళ్ళవెంట నీళ్ళొచ్చాయి. అందరం ఆవేదనతో కదిలిపోయాం"... అన్నాను.

"మేడం ఫ్రెండ్, శ్రీలత ఈ జిల్లాకు పెద్ద ఆఫీసర్‌గా వచ్చారు. ఆమె మనకు ముఖ్య అతిథి, ఇప్పుడు ఆమె మాట్లాడుతారు" అని కమిటీలో సభ్యురాలైన శ్యామల చెప్పింది, పరిచయాలు ముగిసాయి. శ్రీలత వైపు చూశాను... "మీరేం చేస్తారో చూడాలని నేను వస్తే నన్నిట్లా ఇరికించారు, నేనేం మాట్లాడేది," అంది దీనంగా నా వైపు చూస్తూ. "తప్పదమ్మా తప్పదు – నీ గురించే చెప్పు – చాలు, ఎంతో బాగుంటుంది," అన్నాను.

మెల్లగా మొదలు పెట్టింది – మా స్కూల్‌లో చదువుతున్న పిల్లలు, టీచర్లు, అక్కడున్న పిల్లలందరితో కలిసి దాదాపు నూరుమంది. ఆమె శ్రోతలయ్యాం.

ఇతరులపై ఎంత వీలయితే అంత ఆధారపడరాదు ఎంత చేతనయితే, అంతగా చదువుకోవాలి – మనల్ని వికలాంగులని హేళన చేసేవాళ్ళు – అసలైన వికలాంగులని గుర్తించాలి, శరీరం బాగుండి – మనసు వక్రంగా ఉంటే వాళ్ళెవరికి మేలు చేస్తారు? అటువంటి వాళ్ళ వలన ఈ సమాజానికి ఎంతో నష్టం జరుగుతుంది.

99% స్వతంత్రంగా ఆలోచించటం నేర్చుకోవాలి. మరో కోణంలో మనకంటే తెల్సిన వాళ్ళతో మన సమస్యలు చర్చించాలి. రకరకాల విషయాలు చదువుతుండాలి. చదువుతో పాటు ఇవీ అవసరమే. మంచి పుస్తకాలు మీకు దారి చూపిస్తాయి. ఎందరో స్ఫూర్తిదాతలు మనకు మంచి బాటలు వేసి పోయారు. అనుక్షణం మనతో మనం పోరాడుతూ ఉండాలి.

చెడు ప్రభావాలకు లొంగి పోరాదు. నేనిప్పుడు పూర్తిగా బయటపడ్డాను. నాకు జీవితంలో ప్రతి అడుగు పోరాటమే, దుఃఖమే. కానీ ఏదో ఆశ నన్ను నడిపిస్తోంది. నేనిప్పుడు ఇతరుల కోసం ఆలోచిస్తున్నా, పని చేయగల్గుతున్నా... నన్ను చూస్తున్నారు గదూ!"

ఆమె ఎంతగా మాట్లాడిందంటే, పిల్లలు అంతా నిశ్శబ్దంగా శ్రద్ధగా విన్నారు. తర్వాత వాళ్ళకోసం తను తీసుకొచ్చిన పుస్తకాలు, కథలు, దేశ నాయకుల చరిత్రలు లాంటివి – పంచి పెట్టింది.

"ఇవన్నీ వేరు, వేరు మీరు పంచుకొని అన్నీ చదవండి. మీరేం చదివారో నాకు చెప్పాలి... త్వరలోనే నేను మిమ్మల్ని మళ్ళీ కలుస్తాను..." అని ముగించింది.

మేమంతా అలా చూస్తుండిపోయాం.

'సెల్యూట్ తల్లీ నీకు' మనసులోనే అనుకున్నాను.

# కొన్ని రంగులు.. ఒక కల

స్వాతి

సమయం సాయంత్రం 4.30. యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ నుంచి లైబ్రరీకి ఎంత తొందరగా నడిచినా 10 నిమిషాలు పడుతుంది. లైబ్రరీ 5.30 కల్లా మూసేస్తారు. నాకు మిగిలేది 50 నిమిషాలు. ఏంటో జీవితం. ఆ పవన్‌గాడు, రాముగాడు లాస్ట్ క్లాస్ ఎగ్గొట్టి వెళ్ళారు. నేను సిన్సియర్ సింతకాయలా క్లాస్ అటెండ్ చేశా. ప్రొఫెసర్స్ ముందు మంచోడనే పేరు తెచ్చుకుంటే ఎంత టార్చరో.. ఇంకెప్పటికీ మంచితనం మెయింటెన్ చేయాలి. అబ్బ లైబ్రరీని ఆర్ట్స్ బ్లాక్ పక్కన ఎందుకు కట్టలేదో.. ఫ్రీగా వచ్చిందని కొండఅంతా కట్టేశారు. ఒక్క గుట్టమీద ఒక్కబ్లాక్ కట్టి చావకపోతే అన్నీ ఒకదగ్గర ఏడవచ్చు కదా..

* * *

ఇరానియన్ ఆర్కిటెక్చర్‌తో ఎంతో అందంగా హుందాగా లైబ్రరీ బిల్డింగ్. సుమారు 20 మెట్లెక్కి పోవాలి లోపలికి. లైబ్రరీ ఎదురుగా లాండ్ స్కేప్. ప్రధాన ద్వారానికి ముందు రోడ్డు మీద మోకాలెత్తు గోడ. దానిమీద అప్పటికే ఆసీనమై ఉన్నారు నా ఫ్రెండ్స్ ఇద్దరు. చాలా పరీక్షగా లైబ్రరీ వైపు చూస్తున్నారు. అసలు విషయం తెలీనివారు ఎవరైనా వీళ్ళను చూస్తే.. లైబ్రరీ గోడలపైన ఏదైనా విశేషం ఉందని తప్పకుండా తలతిప్పి చూస్తారు. మా క్యాంపస్‌లో అందరికీ విషయం తెలుసు. అందుకే ఈ గోడ మీద వాళ్ళను కానీ.. లైబ్రరీని కానీ ఎవరూ చూడరు.

'ఏరా.. క్లాస్ అయిపోయిందా..?' నన్నుచూడగానే అడిగాడు పవన్.

'ఆ.. అయిపోయింది' అంటూ పిట్టగోడ మీద సెటిల్ అయ్యా.

'ఈ రోజు సాటర్‌డే.. ఓన్లీ ఎంబిఎస్' నిరాశగా చెప్పాడు రామూ.

ఎవరి దృష్టి లైబ్రరీ నుంచి మారడం లేదు. నిమిషాలు గడుస్తున్నాయి.

సరిగ్గా 5 గంటలకు కాస్త సందడిగా అనిపించింది. 'ప్చ్.. లైఫ్ సైన్సెస్.. వేస్ట్' చప్పరించాడు పవన్.

మరో రెండు నిమిషాలకు ఐదారు మంది అమ్మాయిలు లైబ్రరీ నుంచి బయటికి వస్తూ కనిపించారు. ఏదో గట్టిగట్టిగా ఇంగ్లిషులో మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు దాదాపు మెట్లన్నీ దిగేసమయానికి అందరూ వెనక్కి తిరిగి లైబ్రరీ వైపు చూశారు. ఒక అమ్మాయి చేతినిండా పుస్తకాలతో కంగారుగా వీళ్ళవైపు వస్తోంది. ఏదో చెపుతోంది.

ఎప్పటిలానే నా కళ్ళు ఆ అమ్మాయిని స్కాన్ చేస్తున్నాయి. నల్లని కురులు. కనిపించీ కనిపించనంత చిన్న స్టిక్కర్, పెద్ద కళ్ళు.. గుండ్రటి చామనఛాయ ముఖం.. వైట్ టాప్.. బ్లూ జీన్స్..

ఏదో తేడా ఉంది.. స్కానింగ్‌లో ఎక్కడో కొడుతోంది. ఏమిటబ్బా.. మనసులో అనుకుంటూనే బయటికి అనేశా..

నా పక్కనున్న మిత్ర ద్వయం ఇదేది పట్టించుకోవడం లేదు.. ఆ అమ్మాయిల కేసి సీరియస్‌గా.. కన్నార్పకుండా చూస్తున్నారు.

'ఏరా ఏదో తేడాగా లేదు..' ఇద్దరినీ ఉద్దేశించి మళ్ళీ అన్నా.

'ఏం తేడారా..?' కాస్త అసహనంగా అడిగాడు పవన్

'ఎంబిఏ ఫైనల్ ఇయర్స్..' సమాధానంగా చెప్పాడు రాము.

'అది తెలుసులేరా.. కానీ ఆ లాస్ట్ వచ్చిన అమ్మాయి ఏదో తేడాగా ఉందిరా..' అన్నా..

'ఏరా బానే ఉందిగా...?' సందేహంగా మొఖం పెట్టాడు పవన్.

ఈ లోపు వాళ్ళు ఎల్‌ఎచ్‌వైపు వెళ్ళిపోయారు. మేం తిరిగి లైబ్రరీవైపు ముఖం తిప్పాం.

సాటర్‌డే అంత వర్కౌట్ కాదు.. 5.30 అయ్యింది. లైబ్రరీ మూసేసే పనిలో హడావిడిగా ఉన్నారు స్టాఫ్. మేం ఇక పనైపోయిందనుకుని హాస్టల్ వైపు అడుగులేశాం.

* * *

యూనివర్సిటీకి వచ్చి అప్పుడే 6 నెలలు గడిచింది. మొన్నే ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు పూర్తైయ్యాయి.

డిగ్రీ చదివే రోజుల్లో క్యాంపస్‌లో చదవాలని ఎన్నో కలలు కనేవాడిని.. డిగ్రీ సెకండియర్‌లో స్పోర్ట్స్ కోసం క్యాంపస్‌కి మొదటిసారి వచ్చా. అప్పటి నుంచి 'ఈస్ట్‌మన్ కలర్‌లో యూనివర్సిటీ ఆడిటోరియం.. గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ తీసుకోవడం.. మర్చిపోయా.. ఫుల్ కాస్ట్యూంస్‌లో.. ఎన్ని వందల సార్లు ఇదే కల

వచ్చేదో..' సరిగ్గా రెండేళ్ళకు యూనివర్సిటీలో కూర్చుని మరో కొత్త కల కోసం శ్రమపడుతున్నా.

మొదట్లో క్యాంపస్ చాలా విచిత్రంగా అనిపించేది. ఎన్నో రంగుల.. జాతుల పక్షులు ఒక చెట్టుమీద వాలినట్టు. అంతా కొత్త మనుషులు.. కొత్త వాతావరణం. హాస్టల్ చేపల మార్కెట్‌లా ఉండేది. రూంలోకి ఎవరు వస్తున్నారో.. ఎవరు పోతున్నారో కూడా తెలిసేది కాదు. రానురాను అలవాటైంది.

మా ఊర్లో ఇలా ఉండేది కాదు. రోజు బుద్ధిగా కాలేజీకి వెళ్ళడం. సాయంత్రం అక్కడి నుంచి సరాసరి బాషా ఆప్టికల్ షాపు.. అదే మా అడ్డా. శ్రీశ్రీ కవిత్వాన్ని కమ్మని ఇరాని చాయ్‌లో కలిపి ఆస్వాదించేవాళ్ళం. ఆదివారం వస్తే... లైబ్రరీలో కాశ్మీరీ హక్కులు.. ఆఫ్ఘన్‌పై అమెరికా దాడులు.. ఆధునిక తెలుగు సాహిత్యం..తో స్టడీ సర్కిల్. ఎంతో ఉద్వేగం.. ఉద్రేకంతో రాజకీయాలు.. సాహిత్యం.. గురించి చర్చించుకునేవాళ్ళం. ఇక్కడ అలాంటివేమీ లేవు.. ఏకాకినైపోయానేమో అనిపిస్తుంది..

అప్పుడప్పుడు... ఊరి నుంచి ఫ్రెండ్స్ రాసే ఉత్తరాల కట్ట... వాటితో కూడా వచ్చే పుస్తకాల పార్సిల్ కాస్త ఊరట. పవన్.. రాములు పరిచం అయ్యాక క్యాంపస్‌లో. అప్పుడప్పుడూ.. సిటీ దాకా షికార్లు మొదలయ్యాయి.

'ఆర్ట్స్ స్టూడెంట్స్ అంటే పెద్ద కష్టపడనవసరం లేదు.. ఎగ్జామ్స్ ముందు నైటౌట్ చేస్తే 60 పర్సెంట్ గ్యారెంటీ.. ఈ టైపు వీళ్ళిద్దరూ.. మనుషులు మాత్రం చాలా ఫ్రెండ్లీ. కానీ వచ్చిన చిక్కల్లా ఒకటే.. రాజకీయాలు మాట్లాడరూ.. సాహిత్యం చదవరు. ఏదో టైంపాస్ చేయొచ్చు. కానీ క్యాంపస్‌లో ఎన్నిసార్లు టీ తాగినా ఊరి చాయ్‌లోని కమ్మదనం మిస్ అయిన ఫీలింగ్.

* * *

హాస్టల్‌కేసి నడుస్తున్నా.. ఆలోచనలన్నీ లైబ్రరీ మెట్ల మీదే ఉన్నాయి. 'ఏదో తేడాగా ఉంది..'.

పవన్ డిగ్రీ సంగతులేవో చెపుతున్నాడు.. రాము వాటికి ఊ.. కొడుతూ.. మధ్యమధ్యలో సెటైరేసున్నాడు. ఇవేవీ చెవిని దాటిపోవడం లేదు.. లైబ్రరీ మెట్లమీద కనిపించిన అమ్మాయి చేతుల దగ్గర ఆలోచనలన్నీ చిక్కుపడిపోతున్నాయి. ఎదురుగా వచ్చిన మనిషి ఢీ కొట్టే వరకూ నన్ను వీళ్లు పట్టించుకోలేదు.. తూలి కిందపడిపోతుంటే.. పట్టుకున్నాడు రాము..

'ఏరా..! అంత మనిషి కనిపించలే...' కంగారో.. కోపమో అర్థం కాని గొంతుతో ప్రశ్నించాడు.

'ఏమోరా.. చూసుకోలే....'

నా సమాధానం విని ఫ్రెండ్స్ ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

హాస్టల్‌కి వెళ్ళాక కూడా అదే సందేహం.. తినేప్పుడు.. రాత్రి టెర్రస్‌పైన పచార్లలో అదే సందేహం.. పడుకుని కళ్లు మూసుకుంటే.. లైబ్రరీ మెట్లమీది సీన్ రిపీట్ అవుతోంది..

* * *

ఆదివారం ఉదయాన్నే సిటీకి వెళ్లా. కొన్ని రోజులుగా ఆదివారం సిటీలో పెద్దాయన్ని కలవడం అలవాటైంది. చైనీస్ కల్చరల్ రెవెల్యూషన్ గురించి మాట్లాడారు. ఈ మధ్య వస్తున్న కవిత్వాన్ని తీవ్ర స్థాయిలో విమర్శించారు. మధ్యలో కనీసం 20 సిగరెట్లు తగలెట్టి ఉంటాడు. నాకు సిగరెట్ అంటే ఎంత అసహ్యమైనా.. సాహిత్య విమర్శను.. రాజకీయ పరామర్శను వినే అవకాశం కోసం భరిస్తున్నా.

సాయంత్రం 6 గంటలకు క్యాంపస్‌లో అడుగుపెట్టేసరికి.. నిన్న వదిలేసిన సందేహం యూనివర్సిటీ బోర్డుకు వేలాడుతూ కనిపించింది.

* * *

సోమవారం ఉదయం టిఫిన్ తినేప్పుడు.. పవన్‌తో ప్రస్తావించా.. వాడు.. కొంటెగా నవ్వి.. 'ఆ.. ఇది అదిలే..' అన్నాడు.. వీడికి రామూ తోడు.. ఇద్దరూ క్లాస్‌కి వెళ్ళే వరకూ ఏడిపిస్తూనే ఉన్నారు. క్లాస్ ఏమీ వినబుద్ధి కావడం లేదు.. మధ్యాహ్నం లంచ్ బ్రేక్‌లో లైబ్రరీ వైపు వెళ్ళా.. లోపలికి అడుగు పెట్టగానే కాళ్ళు అలవాటుగా ఎకనామిక్స్ సెక్షన్ వైపు నడిచాయి. వెనక్కి తిరిగి.. లిటరేచర్ ర్యాక్స్ వైపు వెళ్ళా ఇంగ్లిష్.. హిందీ.. సంస్కృతం.. ఉర్దూ.. తెలుగు.. కళ్ళతోపాటు కాళ్ళు ఆగిపోయాయి. అరల మధ్య కాసేపు అటూ ఇటూ తిరిగా.. మళ్ళీ ఇంగ్లిషు ర్యాక్ దగ్గరికి వెళ్ళి చూశా.. ఉక్కపోతగా.. ఊపిరాడనట్టు అనిపించింది. బయటికి వచ్చేశా. మధ్యాహ్నం ఈడ్చికొడుతోంది ఎండ. లైబ్రరీ ఎదురుగా ఉన్న చెట్టు నీడన కూర్చున్నా..

'ఆహా.. అప్పుడే క్లాస్‌లు బంక్ కొట్టేదాకా వచ్చిందన్నమాట సంగతి..' అంటూ వెనక నుంచి వచ్చారు ఫ్రెండ్స్ ఇద్దరూ..

'అరే పేరన్నా తెలుసునారా..?' పవన్ సందేహం.

'అయినా ఎంబిఏ సెకండ్ ఇయర్ రా.. నీకు సీనియర్.. ఏడాది పెద్దది.. వర్కౌట్ కాదు..' బోధిస్తున్నట్లు చెప్పాడు రాము.

'ఈ రోజుల్లో రెండేళ్లు.. ఐదేళ్ళు పెద్దవాళ్ళనే చేసుకుంటున్నారు.. వన్ ఇయర్ పెద్ద మ్యాటరేం కాదు..' నాకేదో ధైర్యం చెపుతున్న ఫీలింగ్‌లో పవన్ చెప్పాడు.

వీళ్ళ మాటలు నాకు చాలా డిస్టర్బింగ్‌గా అనిపించాయి. నేను లేసి మౌనంగా

హాస్టల్‌కి వచ్చేశా. మరో రెండు రోజులు ఇదే రొటీన్.. కానీ 'ఆ అమ్మాయి' మాత్రం మళ్లీ కనిపించలే.

'ఎంబిఎస్‌కి సెమిస్టర్ బ్రేక్..' నెక్ట్స్‌మంత్ ఫస్ట్ వీక్ దాకా రారు. ఆ అమ్మాయి కూడా ఊరు వెళ్ళి ఉంటుంది. ఇన్ఫర్మేషన్ ఇచ్చాడు పవన్. ఇంక చేసేదేముంది.. బుద్ధిగా క్లాస్‌కి వెళ్ళడం మొదలుపెట్టా..

నాలుగు రోజులు వరుసగా సెలవులు వస్తే రాము.. పవన్ ఊరికి వెళ్ళారు. నాకు వెళ్ళబుద్ధి అవలేదు. రోజు లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు చదవడంలో పడ్డా. రోజుకో పుస్తకం తినేసేంత ఆకలి.. ఊరి నుంచి వచ్చిన పుస్తకాలు అయిపోయాయి. సమయానికి పెద్దాయన ఎక్కడికో క్యాంపేశాడు. ఒంటరిగా క్యాంపస్‌లో ఏం చేయాలో తెలీలేదు.. లైబ్రరీలో అడుగుపెట్టా.. మనసు తెలుగు సెక్షన్‌వైపు లాక్కెళ్ళింది. ర్యాక్స్ మధ్యలో తిరుగుతుంటే.. ఏడు తరాలు కనిపించింది. పట్టుకుని క్లర్క్ దగ్గర నోట్ చేయించి.. బయట లాన్‌లోకి నడిచా.. ఓ చెట్టు నీడన సిమెంట్ బెంచీ మీద కూర్చుని పుస్తకంలోకి తలదూర్చా.. వెనక నుంచి 'ఎక్స్‌క్యూజ్‌మీ..' అంటూ సన్నటి స్వరం వినిపించింది. ఎవరా..? అనుకుంటూ.. తలెత్తి చూశా.. 'ఆ.. అమ్మాయి..' ఎంబిఎ సీనియర్.

'ఏంటీ..!' అన్నట్లు మొఖం పెట్టా.. 'మీరు తీసుకున్న ఏడు తరాలు..' అంటూ ఆగిపోయింది. నాకు అర్థం కాలేదు.. ఇది ఈమెదా.. లేకపోతే ఇంకేదైనా కారణం ఉందా? మళ్ళీ క్వశ్చన్ మార్క్‌ఫేస్ పెట్టా.

'మీరు ఏమీ అనుకోకపోతే ఈ పుస్తకం ఇస్తారా.. టూడేస్ రోజుల్లో ఇస్తా..' గబగబా అడిగింది. నేను ఇంకా ఆశ్చర్యంలోనే ఉన్నానేమో.. లేదా.. నా ఎక్స్‌ప్రెషన్స్ అర్థం కాలేదో.. మరింకేమైనా అనిపించిందో.. తెలీదు.. నా పేరు స్వప్న. ఎంబిఎ ఫోర్త్ సెమ్. ఫైనాన్స్.. నేను రెగ్యులర్‌గా లైబ్రరీకి వస్తా.. రెండు రోజుల్లో తప్పకుండా మీ బుక్ ఇచ్చేస్తాను. అంటూ నన్ను కన్విన్స్ చేసేందుకు ప్రయత్నిస్తోంది. నేను ఈ లోకంలోకి వచ్చా. వెంటనే పుస్తకం ఆ అమ్మాయి చేతిలో పెట్టా. 'చాలా థ్యాంక్స్ అండీ..' 'చాలా చాలా థ్యాంక్స్..' నాకు నెక్ట్స్ వీక్ నుంచి ఎగ్జామ్స్ ఉన్నాయి. మీరు రిటర్న్ చేసేదాకా ఆగలేక.. అడిగాను ఏమీ అనుకోకండి.. అంటూ వెనక్కు తిరిగింది. మళ్లీ ఏదో గుర్తొచ్చిన దానిలా నా వైపు తిరిగి.. అయ్యో మీ పేరు అడగడం మర్చిపోయా.. అంటూ చిరునవ్వు నవ్వింది.

'నా పేరు సూరజ్.. పొలిటికల్ ఎకానమీ.. సెకండ్ సెమ్..' అంటూ పరిచయం చేసుకున్నా.

బుక్ లేదుగా.. అక్కడ ఏం చేయాలి.. అనుకుంటూ బయల్దేరా.. స్వప్న నావెంటే వచ్చింది.'

మిమ్మల్ని చాలా సార్లు క్యాంపస్‌లో చూశా.. ఎప్పుడూ తెలుగు లిటరేచర్ చదువుతూ కనిపిస్తారు. అందుకని లిటరేచర్ స్టూడెంట్ అనుకున్నా..' అంది.

'మీరు కూడా లిటరేచర్ చదువుతారు.. కదా..?' అన్నా.

'నిజమే.. చేతిలో బుక్ చూసి.. ఒపీనియన్‌కి రాకూడదు..' అంది సంజాయిషీగా..

'ఏ డిపార్ట్‌మెంట్ అనే ఒపీనియన్‌కి మాత్రమే...' సరిచేశా..

'హా.. అవును.. అవును..' అంది గబగబా..

ఇద్దరం ఎల్‌హెచ్ వరకూ నడిచి వచ్చాం. తను నేను వెళతానండీ.. బై అని చెప్పి వెళ్ళిపోయింది.

నేను కాసేపు ఎల్‌హెచ్ గేటు వైపు చూసి రూంకి బయలుదేరా..

వెంటనే ఫోన్ తీసి పవన్‌గాడికి కాల్ చేశా..

'ఏరా ఏం చేస్తున్నావ్..' అవతల నుంచి పవన్ మాట్లాడుతున్నాడు..

నేను ఇవేవి పట్టించుకోకుండా.. 'నే చెప్పలే.. ఆ అమ్మాయి తేడా రా అని.. మీరు ఓ.. అని మోసేశారు. ఈ రోజు ఆ అమ్మాయి నాతో మాట్లాడింది..' అన్నా..

'నిజమా..?' పవన్ అవతల నుంచి అరిచేశాడు..

'అవును. పేరు స్వప్న.. ఎంబిఎ సెకండ్ ఇయర్..' చెప్పా.

'అది మాకు కూడా తెలుసు..' మధ్యలోనే అడ్డొచ్చాడు పవన్.

'కానీ పేరు స్వప్న అని తెలీదు కదా.. లిటరేచర్ అంటే ఇష్టమని.. నా దగ్గర బుక్ అడిగి తీసుకుందనీ.. తెలీదు కదా..' నేను చిన్నపిల్లాడిలా అల్లరి చేశా..

'అహా.. అయితే చాలా దూరం వెల్లిందన్న మాట సంగతి..' అన్నాడు పవన్.

'అంత సీన్ లేదురా.. ఆ రోజు కూడా ఆ అమ్మాయి చేతిలో కొన్ని తెలుగు కవిత్వం పుస్తకాలు..

సీరియస్ ఇంగ్లిషు నవలలు చూశా.. మీరు ఎంబిఎ అన్నారు.. ఎంబిఎకి.. ఈ పుస్తకాలకు ఏమైనా సంబంధం ఉందా... అందుకే తేడాగా ఉందిరా.. అన్నా.. మీరేమో.. ఓ.. అని మోశారు.

ఇప్పుడు అర్థమైందా.. తేడా ఏంటో.. నాకు అయితే కన్ఫర్మ్.. ఆ పిల్ల తేడానే..'

ఏమనుకున్నాడో ఏమో.. పవన్ ఇంకేమనలేదు.. తర్వాత చాలా సేపు సొల్లు ఏదో చెప్పుకున్నాం.

* * *

రెండు రోజులు అయిపోయాయి.. నేను లైబ్రరీ మెట్ల దగ్గర పిట్టగోడ మీద కూర్చున్నా. స్వప్న బుక్ ఇస్తుందేమో అని.. ఊహూ.. రాలేదు. బుక్ ఇవ్వలేదు..

మరో రెండు రోజులు గడిచిపోయాయి. క్లాసులు మొదలయ్యాయి. మరి నాలుగు రోజుల ఏదో పనిలోపడి లైబ్రరీ వైపు వెళ్ళలేదు. నా కోసం ఎదురు చూసి వెళ్ళిపోయి ఉంటుందా..?ననుకుంటూ.. డిపార్ట్‌మెంట్ తెలుసు కదా.. వచ్చి ఇవ్వచ్చు కదా... అనుకుంటూ లైబ్రరీకి వెళ్లా.. ఊహూ అడ్రస్ లేదు..

ఎల్‌హెచ్ దగ్గరకు వెళ్ళి.. లోపలికి వెళ్ళే వాళ్ళకు 'స్వప్న ఎంబిఎ సెకండ్ ఇయర్' అని చెప్పా. ఓ అరగంట నిరీక్షణ తర్వాత వచ్చింది. కొంచం మొఖమాటం.. కొంచం అసౌకర్యం కలగలిపిన ముఖం వేసుకుని.. 'ఏమీ అనుకోకండి.. నేను చదవడం పూర్తి అవ్వలేదు.. అయితే.. నేనే తెచ్చి ఇస్తా...నసుగుతూ చెప్పింది..' ఇంకేం మాట్లాడతాం. సరే అని తలూపి తిరిగి వచ్చా. వారం రోజులు గడిచిపోయాయి. మధ్యలో ఒక రోజు 'ఏడుతరాలు' గుర్తొంచింది. వెంటనే 'నేనే తెచ్చిస్తా' అంటూ నొక్కిచెప్పిన మాటలు గుర్తొచ్చాయి. మళ్ళీ వెళితే.. వెంటబడుతున్నాడు.. అనుకునే ప్రమాదం ఉంది. ముందే మంచోడు అనే పేరు చెడగొట్టుకోవడం ఇష్టం లేక ఆగిపోయా.. 10 రోజులు గడిచిపోయాయి.. నా ఫ్రెండ్స్ 'ఏదో తేడా..' అంటూ ఏడిపిస్తున్నారు. 15 రోజులైంది... నాకు అనుమానం వచ్చింది. కొంపదీసి ఈ పిల్ల నా బుక్ జాతీయం చేయలేదు కదా.. వెంటనే టెన్షన్ వచ్చింది. 'అమ్మో.. బుక్ నా పేరు మీద తీసుకున్నా. ఇప్పుడు బుక్ రిటన్ చేయకపోతే.. నాకు నోడ్యూస్ ఇవ్వరు. నోడ్యూస్ లేకపోతే.. హాల్‌టికెట్.. ఎగ్జామ్స్.. అమ్మో ఎలా..?

'ఏం కాదు ఫైన్‌కట్టచ్చులేరా..' పవన్ అభయం ఇచ్చాడు.

ఈ ధైర్యవచనాలతో కాస్త కుదుటబడినా.. 'నా ఫేవరెట్ బుక్‌ని నా చేతిలోంచి గద్దలా తన్నుకుపోయినందుకు.. నేను ఫైన్ కట్టాల్సిన పరిస్థితి వచ్చినందుకు స్వప్నమీద మాత్రం చాలా కోపం వచ్చింది. ఈ కోపంలోనో.. ఇంటర్నల్స్ వల్లనో.. లైబ్రరీ వైపు వెల్లలేదు.. స్వప్న నా దగ్గర నుంచి బుక్ తీసుకుని నెల రోజులు గడిచిపోయాయి.

ఓ రోజు క్లాస్ నుంచి హాస్టల్‌కి బయలుదేరుతుంటే.. డిపార్ట్‌మెంట్ బయట స్వప్న కనిపించింది.

నా కోసం ఎదురు చూస్తున్నట్లు నిలుచుంది. ముఖంపై ఆర్టీఫీషియల్ చిరునవ్వు ఒకటి తగిలించుకుని ఆమెవైపెళ్ళా..

'అయితే మేం వెళతాం.. నువ్ వచ్చెయ్ రా..' వెనక నుంచి పవన్ అరిచి చెప్పాడు...

'ఉండు రా.. నేను కూడా వస్తా..' అని సమాధానం చెప్పి.. స్వప్నవైపు చేయిచాచా...

'మీతో రెండు నిమిషాలు మాట్లాడాలి..' అంది స్వప్న.

డిపార్ట్‌మెంట్ దగ్గర ఓవర్ యాక్షన్ చేస్తే బాగోదని.. 'సరే పదండి..' అంటూ... 'మీరు వెళ్ళండిరా.. నే 10 మినిట్స్‌లో వస్తా.. అని వెనక్కు తిరిగి కేకేశా..

ఇద్దరం లైబ్రరీ దగ్గరున్న చాయ్ కొట్టువైపు వెళ్ళాం. సాయంత్రాలు అక్కడ ఎవరూ ఉండరు. రాత్రి మాత్రం స్టూడెంట్స్ గుంపులు గుంపులుగా చాయ్ తాగడానికి వస్తారు. మేం వెళ్ళేసరికి ఇద్దరు ముగ్గురు స్టూడెంట్స్ టీ, సిగరెట్లూ తాగుతూ కనిపించారు. స్వప్న ఓ రాయి చూసి కూర్చుంది.. నాకు తప్పదన్నట్లు నేను కూడా ఓ రాయిపై సెటిల్ అయిపోయా. తనతో బయలుదేరినప్పటి నుంచి ఎన్నో సందేహాలు.. 'ఏంటీ ఈ అమ్మాయి.. బుక్ ఇచ్చి పోకుండా.. మాట్లాడాలంటుంది.. అయినా నిన్నగాక మొన్న పరిచయం అయిన వాళ్ళతో మాటలు ఏం ఉంటాయి? కొంపదీసి బుక్ పోయింది అంటుందా..? ఇట్లా ఎన్ని సందేహాలో.. నేను సెటిల్ అయినా మనసు మాత్రం సెటిల్ అవ్వలేదు.

'సారీ అండీ.. చాలా లేట్ అయ్యింది.' అంది మెల్లిగా..

'ఫర్వాలేదు.. అసలు బుక్ పోయింది అంటారేమో అని భయపడ్డా..' అన్నా నిష్ఠూరంగా... కొంచం ఇబ్బందిగా ముఖం పెట్టి 'టోఫెల్ రాయడానికి చెన్నయ్ వెళ్ళా.. అక్కడ టైఫాయిడ్ వచ్చింది. తిరిగి హాస్టల్‌కి వచ్చేసరికి నెల పట్టింది. త్రీడేస్ బ్యాక్ మీకు బుక్ ఇద్దామని లైబ్రరీకి వెళ్ళా.. మీరు ఉంటారేమో అని.. మీరు రాలేదు..'

'కొంచం బిజీ ఉండి.. లైబ్రరీ వైపు రాలేదు..'

'ఈ రోజు బుక్ ఇచ్చి సారీ చెపుదాం అని డిపార్ట్‌మెంట్‌కి వచ్చా..'

'ఇట్స్ ఓకే..'

'నాకు పుస్తకాలంటే పిచ్చి.. మా ఇంట్లో చిన్నసైజు లైబ్రరీ ఉంది. మా నాన్న ఇంగ్లిషు లిటరేచర్ చదువుతారు... అవే ఉంటాయి ఎక్కువగా.. కానీ తెలుగులో చదివిన ఫీలింగ్ రాదండీ.. నేను రూట్స్ ఇంగ్లిషులో చదివా.. తెలుగులో ఉంటే ఎంత బాగుండో అనుకున్నా.. మీ చేతుల్లో చూశాక..' గలగలా చెప్పుకుంటూ పోతోంది.

'అబ్బా సూపర్ అండీ.. ఎంత బాగుందో.. ఎన్నిసార్లు చదివినా.. ఏడుపు ఆగదు..' సారీ మీరు బుక్ చదవలేదు కదూ.. సూపర్ బుక్ మీరు తప్పకుండా చదవండి.. తర్వాత మాట్లాడుకుందాం.. అంది.

'నేను రెండు సార్లు చదివాను..' అన్నా.

'ఓ.. అయితే ఓకే.. మీరు చదవలేదేమో అని ఫీల్ అయిపోయా..'

'నా ఫేవరెట్ బుక్స్‌లో ఇది ఒకటి.. అమెరికా అసలు రంగును ఎంత బాగా వివరిస్తుందో...'

'నాకు కుంటా కింటే అంటే చాలా ఇష్టం.. స్వేచ్ఛ కోసం ఎంత తపన పడతాడు.. ఎంత స్ట్రగుల్ చేస్తాడు.. తన సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలని ఎంత గొప్ప ఆలోచన... తన జాతి మూలాలను తన కూతురు మరిచిపోకూడదనే చైతన్యం.. ఎంత గొప్పగా ఉంటాయో..'

'తెల్ల జాతీయులకు లొంగకూడదనే పట్టుదల ఎంత అద్భుతంగా వ్యక్తీకరిస్తాడో..'

కొనసాగింపుగా అన్నా..

'తెల్లవాళ్ళను ఎదిరించడం తనకు సాధ్యం కాదని తెలిసినా.. తప్పించుకోవడానికి చేసే స్ట్రగుల్ సూర్ అండీ..' అంది ఉద్వేగంగా..

'అవును.. కానీ.. మనం నవల చదివి.. సూపర్ అని.. ఒక విజిల్ కొట్టి.. ఇంటికి వెళ్ళి.. టోఫెల్‌లు.. జిఆర్ఇలు రాస్తాం..' ఎందుకనో అనుకోకుండా నోట్లోంచి మాటలు వచ్చేశాయి.. స్వప్న షాక్ తిన్నదానిలా చూసింది నా వైపు.

'అంటే ఏమిటి మీ ఉద్దేశం.. అమెరికాలో ఎప్పుడో.. నల్లవారిపై దౌర్జన్యం జరిగిందని.. ఇప్పుడు అక్కడ చదవకూడదా..?' ఆవేశంగా అంది.

'నేను అలా అనలేదు.. అయినా.. ఆదేశం ఇప్పటికీ ఏమీ మారలేదు.. అప్పట్లో వాళ్ళకు పొలాల్లో పని చేసేందుకు బలమైన జాతి కావాలి.. అందుకని ఆఫ్రికా నుంచి బలమైన జాతిని దౌర్జన్యంగా తీసుకెళ్ళారు. ఇప్పుడు.. వాళ్ళకు 'సేవ' చేసేందుకు 'తెలివైన వాళ్ళు' కావాలి.. తీసుకెళ్ళే పద్ధతి కాస్త మారింది.. అంతే'

'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశాన్ని అలా అనకు..'

'ప్రజాస్వామ్యం వాళ్ళకు.. వాళ్ళ దేశానికి ఊడిగం చేయడానికి మేధో వలస పోయిన వాళ్ళకే..'

'వాళ్ళు అమెరికా రమ్మని బలవంతం చేయలేదే..' మొండిగా అంది స్వప్న

'ఎందుకు చేయరు..? వాళ్ళదేశంలో పనిచేయడం గొప్ప అని మనతోనే అనిపిస్తారు.. అక్కడికి వెళ్ళలేని వాళ్ళు వేస్ట్ ఫెలోస్‌లాగా మనల్ని మనం చూసుకునేలా చేస్తుంది.. వాళ్ళ ప్రొడక్ట్‌లకు మార్కెట్ కోసం మన అమ్మాయిలకు అందాల కిరీటాలు ఇస్తుంది. తనకు కావాల్సిన ముడిపదార్థాల కోసం దేశాలను విముక్తి చేస్తుంది. తన మిలట్రీ బేస్‌ల కోసం ప్రపంచ శాంతి కోసం స్వతంత్ర్యంగా ఉన్న దేశాలపై యుద్ధం ప్రకటిస్తుంది. అంతే.. అన్నీ ప్రజాస్వామ్యం కోసం.. ప్రపంచ శాంతి కోసం మాత్రమే..'

నాకు తెలిసిన ఉపన్యాసం ఇచ్చేశా. తనేదో మాట్లాడబోయింది. నేను మళ్ళీ.. 'మీరు ఇంత పెద్ద చదువులు చదువుతున్నారు కదా.. సాహిత్యం కూడా తెలుసు కదా.. కాస్త బుర్రపెట్టి ఎందుకు ఆలోచించరు.. ఒక పక్క అమెరికన్స్ అక్యుపై వాల్ స్ట్రీట్ అంటుంటే.. మీరు డెమోక్రసీ అని ఎట్ల అంటారు..' అన్నా..

'నేను పాలిటిక్స్ అంతగా పట్టించుకోలేదు...' అంది..

నేను మరీ సీరియస్‌గా క్లాస్ పీకుతున్నానా అనిపించింది.. ఫీల్ అయ్యుంటుందా.. అని కూడా అనిపించింది. మీరు రెండు మహానగరాలు చదివారా అని టాపిక్ డైవర్ట్ చేశా.. ఇంగ్లిషులో చదివా అంది.. తెలుగులో కావాలంటే... లైబ్రరీలో ఉంది అని చెప్పా..

నెక్ట్స్ వీక్ తీసుకుంటా అంది...

మీరు ఎంబిఎ కదా.. ఖచ్చితంగా చదవాల్సిన బుక్ 'ఎ కన్ఫెషన్ ఆఫ్ ఎకనమిక్ హిట్ మాన్' అది తెలుగులో కూడా ఉంది. నేను తెచ్చి ఇస్తా అని చెప్పా..

సరే అండీ చాలా లేట్ అయ్యింది. నేను హాస్టల్‌కి వెళ్ళాలి.. అంటూ లేచింది. ఇద్దరం యూనివర్సిటీ రాజకీయాలు మాట్లాడుకుంటూ.. ఎల్‌హెచ్ వరకూ నడుచుకుంటూ వెళ్ళాం.

స్వప్న నావైపు చెయ్యిచాచి..

'బై సూరజ్.. గుడ్‌నైట్..' చిరునవ్వుతో విష్ చేసింది.

'బై.. గుడ్‌నైట్..' అనిచెప్పి నేను హాస్టల్‌వైపు నడిచా..

* * *

జనవరి నెల.. చలి చావగొడుతోంది. గబగబా మెస్‌కి వెళ్ళి భోంచేశా. సాయంత్రం నుంచి నాలో నేను ఎన్నిసార్లు మాట్లాడుకుని ఉంటానో.. ఎలాంటి రుచీపచీ లేని సాంబార్‌లాంటి పప్పు చాలా టేస్టీగా అనిపించింది. రూంకి వెళ్ళి.. బెడ్‌పై చేరి.. నిండా ముసుగుతన్ని.. నిద్రకు ఉపక్రమించా.. మళ్ళీ.. సాయంత్రం సంభాషణ గుర్తొంచ్చింది. చిన్న నవ్వు పెదాలపైకి వచ్చి మాయమైంది. ఆలోచనల్లో ఉండగానే నిద్ర పట్టేసింది. నిద్రలో కల.. కలలో పెద్ద ఊడలమర్రి. మర్రిచెట్టు మీద ఎన్నో రంగుల.. భాషల పిట్టలు ఉన్నాయి. వాటి ముఖాలు నాకు బాగా తెలిసిన వాటిల్లా అనిపించాయి. ఇంతలో ఒక ముదురు ఎరుపు రంగులో ఉన్న పక్షి వచ్చి కొమ్మపై వాలింది.. భారంగా ఊపిరి పీలుస్తోంది. దాని ముఖం పరిశీలనగా చూద్దును కదా.. దాని ముఖంలో అచ్చం మా పెద్దయన పోలికలు కనిపించాయి. కాస్త లేత ఎరుపు రంగులో పిట్టొకటి కిచకిచలాడుతోంది.... దానికి అచ్చం నా పోలికలు

ఉన్నాయి. ఇంతలో నా పక్కన ఒక పిట్ట వాలింది. దాని శరీరం లేత గులాబీ రంగులో ఉంది. దాని తల ఎరుపు రంగులో ఉంది. దానికి స్వప్న పోలికలు చాలా ఉన్నాయి. కిచకిచమంటూ నాతో ఏదో చెపుతోంది. నేను చూస్తూ ఉండగానే.. దాని శరీరమంతా ముదురు ఎరుపురంగులోకి మారిపోతోంది.. ఇంతలో పెద్ద శబ్దంతో కుదుపొకటి వచ్చింది. నాకు మెలకువచ్చింది. కళ్ళు తెరచి చూస్తే.. నేను మంచం పక్కన కింద ఉన్నా.. నిద్రలో పడిపోయినట్లున్నా.. లేచి మళ్ళీ మంచంపై పడుకున్నా.. నిద్రలో వచ్చిన కల గుర్తొచ్చింది.. దీని అర్థం ఏమై ఉంటుందబ్బా.. అని ఆలోచిస్తూ.. మళ్ళీ నిద్రలోకి జారుకున్నా...

# సింహంగా మారిన కుందేలు కథ

## కె వి కూర్మనాథ్

ఆ రోజు సాయంత్రం అడవిలో పండు వెన్నెల కాచింది.

కుందేలు పిల్ల నాయకత్వంలో క్రూరమైన సింహం చిత్తైన ఆ రోజు అడవిలో నెమళ్ళు కొత్త నృత్యం చేసాయి.

ఇంటికో పిల్లని, లేదా తల్లిని, లేదా తండ్రిని మట్టుబెడుతున్న సింహం ఇక లేనందుకు జంతువులకు వేయి పండుగలు ఒకేసారి వచ్చినట్టు అనిపించింది. ఏ రాత్రి ఏ పాలుగారే పాపని పోగొట్టుకోవాలో అని బెంగటిల్లిన తల్లులకు, తండ్రులకు ఆ రాత్రి వాళ్ళు మళ్ళీ పుట్టినట్టు అనిపించి పిల్లల్ని దగ్గరకు తీసుకుని హత్తుకుని తనివితీరా ముద్దుపెట్టుకున్నాయి. పొదివిపట్టుకున్నాయి.

ఏ రోజు కన్నతండ్రిని, లేదా తల్లిని పోగొట్టుకోవాలో తెలియని భయంలో నిద్రలేని రాత్రులు గడిపిన పిల్లలు కొందరు వాళ్ళ తల్లిదండ్రుల గుండెల్లోకి ఇమిడిపోయారు.

ఆ రాత్రి, మృగరాజు నేలకొరిగిన రాత్రి అక్కడ గొప్ప వేడుక జరిగింది.

తమ బతుకుల్ని చిదిమేసిన, తమ పిల్లల రక్తం తాగిన సింహం రాజు నీట మునిగేక ఆ అడవిలో ఆశల హరివిల్లు విరిసింది. వాళ్లకది యుగాదిలా తోచింది.

ఆ రాత్రి అడవి పూల వర్షం కురిపించింది. మిగతా కుందేళ్ళు వింత గెంతులు గెంతేయి. కోతులు ఏనుగుల వీపులనెక్కి జారుడుబండ జారేయి. నక్కలు ఊళలు మానేసి కూని రాగాలు తీసాయి. ఆ రాత్రి కోకిలలు కొత్త పాటలు పాడేయి.

సింహాన్ని ఓడించిన కుందేలుని జింక పిల్లలు ముద్దు చేసాయి.

చిరకాల శత్రువుని మట్టుపెట్టినందుకు, చీకట్లని తరిమివేసి వేల ఉషస్సులతో మనసుల్ని వెలిగించినందుకు ఎనుబోతు ఒకటి ఆ కుందేలు చెవుల్ని వాటంగా పట్టుకుని ఎత్తుకుని తనివితీరా నిమిరింది.

మృగరాజు చచ్చిన ఆ రాత్రి ఆ అడవిలో గొప్ప కేరింతలు వినబడ్డాయి.

వేలాది జంతువుల రక్తసిక్త ఆక్రందనల్ని మౌనంగా చూసిన మద్ది చెట్లు రెల్లుగడ్డిలా హాయిగా, విలాసంగాఊగాయి. వింత ఆకుల చెట్లు, తీగలు గొప్ప సువాసనల్ని వెదజల్లాయి.

అక్కడి పూలుకొన్ని ఆనాడు కొత్త రంగులతో వెన్నెల్లో చిత్రంగా మెరిశాయి.

నిద్రపట్టక ఎగురుతున్న ఓ పిల్ల మబ్బొకటి ఆ ముచ్చట చూసి అక్కడే నిలబడి పోయి చూస్తోంది, ఆ గొప్ప సందడిని చూసి. దాన్ని చూసి మరికొన్ని మబ్బుతునకలు వచ్చి చేరాయి. పచ్చటి వెన్నెల వాటి మీద పడి అవి భారీ విద్యుద్దీపాల వలె ఆకాశాన్ని చల్లగా వెలిగిస్తున్నాయి. చంద్రుడి పిల్లలవలె మెరుస్తున్నాయి.

ఆ రాత్రి దిక్కులేని జంతువుల్ని అడవితల్లి పొదివిపట్టుకు ముద్దుపెట్టుకుంది.

ఆ రాత్రి పిల్లల్ని కోల్పోయిన తల్లులు, తల్లుల్ని చూడని పిల్లలు ఇక చావుల్లేని, బెంగల్లేని, భయాల్లేని రోజులొస్తాయని ఆశపడ్డాయి. తమ పిల్లలు హద్దుల్లేని ఉత్సాహంతో గెంతవచ్చని, ఎగరవచ్చని, హాయిగా నదుల్లో మునిగి తేలవచ్చని, అలవికాని హద్దుల్లేని స్వేచ్ఛతో ముచ్చట్లు పెట్టుకోవచ్చని అని సంతోషించాయి.

అమావాస్య తొలగిన ఆ రాత్రి, నిద్రలోకి పోబోతూ ఓ లేడిపిల్ల వాళ్ళ అమ్మని అడిగింది, “అమ్మా, మరి నేను రేపు ఈ చివరినుంచి ఆ చివరి వరకూ ఉరుకుతా రేపు మా ఫ్రెండ్స్ తో. నువ్వు అడ్డుచెప్పకు,” అని.

“సరే, కన్నమ్మా,” అని ముద్దుపెట్టుకు పడుకోబెట్టింది.

* * *

సింహాన్ని ఓడించిన కుందేలుకు ధైర్యం రాత్రికి రాత్రే రాలేదు. సింహం దెబ్బకు నలిగిన, సింహం చేతిలో చిత్తయిన ఎన్నో జంతువులు ఆ కుందేలుకు అండగా నిలబడ్డాయి. పాడుబడ్డ నుయ్యి జాడని కుందేలుకి చూపెట్టేయి. ధైర్యం చాలని కుందేలుకి అవే ధైర్యం చెప్పి నడిపించాయి దుర్గమమైన ముళ్ళ మార్గంలో.

పోరాటానికి అదే మొదలు కాదు. ఆ మహారణ్యం భీకరపోరాటాలు చూసింది. ఆ మొక్కలు కొన్ని, ఆ తీగలుకొన్ని, ఆ జంతువులు కొన్ని, ఆ మానులు కొన్ని, ఆ సూదంటు రాళ్ళు కొన్ని అక్కడి పోరాటాలకి సాక్షులు. ఆ అడవికి శత్రువులు కొత్త కాదు.

కుందేలు బంధువులు కొందరు, అడవిగుర్రం తమ్ముళ్ళు కొన్ని, సింహాలు కొన్ని, పులులు కొన్ని, నెమళ్ళ అక్కలు ఇంకొన్ని, దుప్పి తాతలూ, లేళ్ళ పిల్లలూ తమను పీడించే సింహాలతో, పులులతో ఎప్పటినుంచో పోరాడుతూ వున్నాయి.

ఒక్క మృగరాజే కాదు, తమ రక్తం తాగే, తమ ఉసురు తీసే జంతువుల జాతి

మొత్తం ప్రమాదమని, కాటు వేసే, విషప్పురుగులూ ఎప్పటికైనా ప్రమాదమనీ చెప్తున్నాయి. అవి ఆ అడవిలోనే కాదు, ఆ చుట్టుపక్కల అడవుల్లో కూడా అదే చెప్తున్నాయి. పోరాడుతున్నాయి. అవి శత్రువుల వాడి కోరలకి బలయ్యేలోగా, దొంగ దెబ్బలకు పడిపోయేలోగా కొంచెం ధైర్యం, కొంచెం నమ్మకం పిల్లలకి వదిలి పోయేవి. పోతున్నాయి. పిల్లలా ధైర్యాన్ని వారసత్వాన్ని అందుకుని పోరాడుతూనే వున్నాయి. ప్రాణాలు సింహాలకవి ఎన్నడూ భయపడలేదు. పంజదెబ్బలకు పిల్లల్ని చంపివేసే పులులకవి ఏనాడూ వెన్ను చూపించలేదు. అడవి దున్నల వలె అవి కొమ్ముల్ని అడ్డుపెట్టి పోరాడేయి. పోరాడుతున్నాయి. ద్రోహాలకి అవి ఎన్నడూ వెరవలేదు.

ఆ ధైర్యపు తోడుతోనే, ఆ ఉపాయపు మద్దతుతోనే కుందేలు గెలిచింది. మృగరాజుని మట్టుబెట్టింది.

ఆటలన్నీ అయ్యాక, పాటలన్నీ సద్దుమణిగేక, కేరింతలు పూర్తిగా ఆగిపోయాక "ఇక నువ్వే మాకు రాజు"వని అక్కడి జంతువులు కుందేలుని అన్నాయి. ఆ కుందేలుకు తెలుసు తనే ఇక రాజునని. ఆ కుందేలుకు తెలుసు ఇక తానే అన్నీ అని. తన మాటకి ఇక తిరుగే లేదని.

* * *

విషపు పురుగులతో, మాటువేసి దెబ్బతీసి కాల్చుకుతింటున్న, పిల్లల్ని మాయం చేస్తున్న, బతుకుల్ని దుర్భరం చేస్తున్న సింహాలతో, వాటి తొత్తులతో ఎక్కడెక్కడి అడవుల్లో పోరాటం చేస్తున్నలేళ్ళు, నెమళ్లు, కుందేళ్ళు, కొన్ని సింహాలు, ఇంకొన్ని పులులు ఏమరుపాటుగా లేవు.

రాజుల బూజు దులపకపోతే జీవితంలో ఏం మార్పు వస్తుందని అన్నారు.

సింహం చచ్చింది కానీ మన రక్తపు రుచి మరిగిన మిగతా క్రూర మృగాలు హాయిగా తిరుగుతున్నాయని గుర్తు చేశాయి. మనల్ని వేపుకు తినే పొయ్యా, పెనమూ ఇంకా అలానే వున్నాయి అని చెప్పేయి. ఏం మార్పు వుందని ప్రశ్నించాయి.

సింహం చచ్చింది కానీ దాని అనుయాయులు అలానే వున్నారు కదా అని అడిగాయి.

కుందేలు రాజుకి ఇది నచ్చలేదు. కొత్త మృగరాజుకి ఇది ఇంపుగా అనిపించలేదు.

"వీళ్ళు ఎవరు? ద్రోహులు," అన్నది.

"వీళ్ళు చచ్చిన సింహానికి దోస్తులు," అని కూడా ప్రకటించింది.

సింహం చచ్చిన సంతోషంలో ప్రపంచం మారిపోయిందనుకున్న జంతువులు కొన్ని ఇపుడు రాజ్యం మనదే కదా బాధేమిటని అడిగాయి.

"కాదు, కాదు. రాజు ఎప్పుడూ రాజే. రాజు మనకి ఎన్నడూ శత్రువే. ఆ అడవి అయినా, ఏ అడవి అయినా. పెనం పట్టుకున్న చెయ్యే మారింది కాని, పెనం ఇంకా పొయ్యిమీదే వుందని, మనం ఇంకా పెనంలోనే వున్నామని, అన్ని అడవుల్లోని జంతువులన్నీ చేతులుకలపాలి," చెప్పేయవి.

ఈ విషయాన్ని మళ్ళీ మళ్ళీ చెప్పాలి, నలుగురికీ, నాలుగు చోట్లా. "మేం చెబుతాం అందరికీ. ఈ అడవిలో, ఆ అడవిలో, ఏ అడవిలోననైనా ప్రజలే రాజ్యం చేయాలని మేం చెబుతాం, పోరాడుతాం," అని అన్నాయవి.

కుందేలు రాజుకి తెలుసు. చెయ్యిమారిన పెనంగురించి ఎక్కువమందికి తెలిస్తే తన ఆరోగ్యానికి మంచిది కాదని. ఆ ఆలోచనలు నలుగురికి తెలిస్తే కష్టమని దానికి తెలుసు. నలుగురు వింటే కష్టమనీ తెలుసు.

అందుకే చెప్పిందది, "మనం స్వర్గంలో వున్నాం. నరకపు మాటలు వెనకటివి. ఎవరు చెప్పినా వినకండి. ఎవరైనా విందామనుకున్నా, మేం చెప్పనివ్వం. మాట్లాడనివ్వవం. మాది స్వర్గం కాదన్న వాడల్లా ఈ అడవికి శత్రువు. శత్రువుకి మిత్రుడు," అని ప్రకటించింది.

రాత్రికి రాత్రి, నోరు విప్పిన కుందేళ్లని, మాట్లాడిన పులుల్ని, వాటికి గొంతు కలిపిన లేళ్లని, మాట కలిపిన నెమళ్లను ఎక్కడికక్కడ బంధించింది. కలుగుల్లో, గుహల్లో వుంచింది. వీళ్ళు రాజ్య వ్యతిరేకులు అని ప్రకటించింది. స్వర్గాన్ని కూలదోయడానికి వచ్చిన నరకలోకపు ప్రతినిధులని దండోరా వేయించింది.

ఆ రాత్రి అడవి కొద్దిగా వణికింది.

ఆ రాత్రి అడవిలో పాత రాత్రుల నీడలు నాగుపాముపడగల్లా ఊగాయి.

ఆ రాత్రి అడవిలో పీడకలలు తీతువు పిట్టల్లా అరిచి బయటపెట్టాయి.

అటువైపు వెళ్తున్నమబ్బుల్ని వింత భయాలు చుట్టుకున్నాయి.

ఆ రాత్రి అడివిని పాత స్మృతులు చుట్టుముట్టాయి.

ఆ పొద్దున్న జంతువులు కలలోంచి బయటికొచ్చాయి.

అడవిలో ఆ పూట కొందరికి కుందేలు సింహమని అర్ధమయ్యింది. అది ఆ అడవిలో నైనా, పక్క అడవిలోనైనా సింహాలకు మాత్రమే మిత్రుడని తెలుసుకున్నారు. కొన్ని పులులూ, ఇంకొన్ని నక్కలూ, మరికొన్ని సర్పాలూ దానికి కావలిసిన వాళ్ళని అర్ధం చేసుకున్నారు.

తమ పోరాటానికి ఆ రాత్రి ఓ చిన్న ఒక విరామం మాత్రమే కానీ ముగింపు కాదని తెలుసుకున్నారు.

# ఏ4

## పాణి

ఆమెను దురదృష్టం వెంటాడిందని చెప్పాలా? అదృష్టం వరించిందని చెప్పాలా? ఆడవాళ్ల జీవితంలో చాలా విపత్కరమైన ప్రశ్న ఇది. కాకపోతే ఇవాళ్టి వైభవానికేగాక పరాభవానికి కూడా అదే కారణం కావట్టి ఇప్పటి నుంచి దాన్ని దురదృష్టమని చెప్పడమే సబబు. ఆయనకు నమ్మకమైన మిత్రుడు కావడం వల్లనో, లేక ఆ స్థానాన్ని ఆయన సంబంధీకులైతేనే గెలుచుకురాగలరని అంచనా వల్లనో గాని సదరు నాయకుడు ఆ వేళ ఇంటికి వచ్చాడు. అంటే.. భర్త ఆమెను ఇల్లాలిగా చూస్తే, సదరు నేత గెలుపు గుర్రంగా చూశాడు. గాంధీ భవన్ చుట్టూ డజన్ల సంఖ్యలో గుర్రాలు, గాడిదలు తిరుగుతూ ఉంటే ఆ నేత.. చక్కగా ఈమెను వెతుక్కుంటూ వచ్చాడు.

చెల్లెమ్మా.. అని ఆత్మీయంగా తల మీద చెయి వేసి లాలించాడు.

ఆయన అంతే. ఆమెను అట్లాగే పిలుస్తాడు.

భర్త చనిపోయిన రోజున హృదయపూర్వకంగా వాగ్దానం చేశాడు. నేను ఉన్నానని ఏనాడూ మర్చిపోకమ్మా. నేను నీకు సొంత అన్నలాంటి వాడ్ని అన్నాడు.

ఆమె గుర్తు పెట్టుకున్నాదో, మర్చిపోయిందో తెలియదు.

రాజకీయాల్లో తలపండిపోయిన నాయకుడైనా వాగ్దానభంగం చేసుకోలేదాయన. అదే అతడి గొప్పతనం. ఆనాడు ఎలా చెప్పాడో.. ఈనాడూ అదే వాత్సల్యంతో అమ్మా.. నీ కోసమే వచ్చాను. నీ దుఃఖాన్ని నేను బాపలేను కాని, నీవు ఇట్లా ఇంట్లోనే తన జ్ఞాపకాలతో కుమిలిపోతూ ఉండేందుకు వీల్లేదు. నేను అట్లా ఉండనీయను. నీవు పార్టీకి చాలా అవసరం. ఈ నియోజకవర్గం మీ ఆయనది. అంటే ఇప్పుడు నీది. ఆయనకు చెందినవి ఏవైనా పార్టీకి చెందాలి. అంటే నీకూ చెందాలి. అందుకే నీవు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నావు. ఈ మాట నీ దగ్గరికి వచ్చి చెప్పడం అన్నగా నా బాధ్యత. అందుకే ఇంత హడావుడిలో కూడా వచ్చాను. నామినేషన్ వేయడానికి

మనవాళ్లు ఏర్పాట్లు చేస్తారు. అని ఆమె మరో మాట మాట్లాడటానికి వీల్లేకుండా వెళ్లిపోయాడు.

ఆమె నామినేషన్ పత్రాల మీద సంతకం పెట్టింది.

ఆ తర్వాత మరో సంతకం పెట్టి ఎన్నికల అధికారి నుంచి విజయ పత్రం తీసుకుంది.

మధ్యలో అభిమానులు చాలా హడావుడి చేశారు.

అప్పటి దాకా ఆమెకు కొంచెం వ్యాపార వ్యవహారాలు కొంచెం తెలిసినా రాజకీయాలు తెలియవు. రాజకీయాల్లో కూడా లాభాలుంటాయి గాని, అంత మాత్రాన వ్యాపారంలో, రాజకీయాల్లో పర్‌ఫామెన్స్ ఒకటే కాదుగదా? అందుకే తెలివిగా వ్యాపార లావాదేవీలు చూడగలిగినా రాజకీయాల గురించి కొండొకచో అమాయక వ్యాఖ్యలు చేస్తుండేది.

ఆవిడుకుండే సగటు ఇల్లాలి పాత్ర వల్ల ఇంటికి వచ్చిపోయేవారికి మర్యాదలు చేస్తూ, అప్పుడప్పుడు రాజకీయాలకు సంబంధించిన వాళ్లను భర్త పరిచయం చేస్తే మర్యాదపూర్వక అభివాదం చేసి సరిపెట్టుకొనేది. ఒక్కోసారి చాలా గంభనంగా నాలుగు మాటలు మాట్లాడేది.

నిత్యం రాజకీయ కోలాహలంగా ఉండే ఆ ఇంట్లోకి ఏ వేళైనా నేను సరసరా వేళ్లేదాన్ని. ఆ సమయాన ఆయన హాల్లో ఎంత మంది మధ్య, ఎంత బిజీగా ఉన్నా నేను అలా పోతూ ఉంటే ఆయనే కల్పించుకొని నన్ను అక్కడ ఉండే వాళ్లకు పరిచయం చేసేవాడు.

ఈమె ఫలానా.. మా ఆవిడకు చిన్నప్పటి ఫ్రెండ్.. అని చెప్పడం, ఒక్కోసారి వాళ్లు.. సోఫాల్లోంచి కొంచెం పైకి లేచి నాకు నమస్కరించడం పరిపాటి. ఈ ముచ్చటకు ఒక అక్కర ఉంది. ఆ ఇంటితో నాకు ఉండే సాన్నిత్యం చెప్పడం వల్ల నేను చెప్పబోయే కథకు సాధికారత దక్కుతుందనే.

నాకూ, తనకూ కాస్త ఖాళీ దొరికినప్పుడల్లా నేను ఆ ఇంటికి వెళ్లడం ఆమెకు చాలా ఇష్టంగా ఉండేది. ఎందుకంటే – ఆయన రాజకీయాలేమిటో తను నేరుగా తెలుసుకొనే ప్రయత్నం చేయదని నాకు పదే పదే తెలిసి వచ్చేది. అందువల్ల ఆయన రాజకీయ ప్రపంచానికి ఆమె సరిహద్దుల్లో ఉండేది. అందువల్ల ఏదైనా ఘటన జరిగినప్పుడు, లేదా పత్రికల్లో వార్తలు చదివినప్పుడు మేమిద్దరమే మాట్లాడుకొనేవాళ్లం. ఒక్కోసారి ఆమె.. ఆయన రాజకీయాల మీద, వ్యవహారాల మీద విసుర్లు విసిరేది. జోకులు వేసేది. పెద్దగా శబ్దం రాకుండానే పగలబడి నవ్వేది. అందులో కొంచెం

చతురత ఉన్నా, అమాయకత్వం కూడా ఉండేది. చతురత లోకజ్ఞానం వల్ల కలిగిందే.

ఇలాంటి మనిషికి అనుకోకుండా పుట్టెడు కష్టం వచ్చింది. ఆయన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఆ తర్వాత ఎన్నికలు వచ్చాయి. అన్నయ్య ఆదరంగా సీటు ఇవ్వడంతో ఇప్పుడామె ఈ కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టింది.

ఆ రోజు నా కోసం ఆమె ఎదురు చూసిందో లేదోగాని, అనుకోకుండానే వెళ్లాను. అన్నయ్య చెప్పిన సంగతి నాకు చెప్పింది. నన్నేమీ సలహా అడిగినట్టుగా కాదు. చెప్పాలని మాత్రమే. వ్యాపార వ్యవహారాలు కూడా ఇంతే. బహుశా అవన్నీ ఆయన తన మీదే వదిలేసినందు వల్ల, వాటిని చక్కబెట్టగలననే ధీమా తనకు ఉండటమే కాదు. మనకూ కల్పించగలదు. అందువల్ల అడగకపోయినా నాకు ఎన్ని చెప్తుందో.. చెప్పనివి అంతకంటే ఎక్కువగానే ఉంటాయని నాకు ఎరుకే. అయినా మా స్నేహానికి ఏ ఢోకా రాలేదు. ఎందుకంటే అది అటు వ్యాపారానికి గాని, ఇటు రాజకీయాలకుగాని సంబంధించింది కాదు. అదొక లోకం. అక్కడ ఎలా నడుచుకోవాలో మా ఇద్దరికీ బాగా తెలుసని పరస్పరం కూడా తెలుసు. అంటే దాన్ని నమ్మకం అనవచ్చు. లేదా హద్దులు అని కూడా అనవచ్చనుకుంటాను.

* * *

నామినేషన్ వేస్తున్న రోజు కూడా ఫోన్ చేసి చెప్పింది.

ఆ వ్యవహారంతో నేనెలాంటి సంబంధం పెట్టుకోనని తనకు బాగా తెలుసు. అయినా చెప్పింది. అదీ తన పద్ధతి. నేను ఆ సంగతి విననట్లే.. ఈ బిజీ తీరాక వస్తాన్లే.. అన్నాను. దానికి తాను ఏమీ అనుకోదని నాకూ తెలుసు. మామూలు వాళ్లయితే ఎంత గింజుకుంటారు? నేనొకటి చెప్తుంటే మరోటి మాట్లాడుతుందేమిటి? అని. ఆమె లౌక్యురాలని మీరు అనుకున్నా నేనేమీ అడ్డు చెప్పను.

అట్లా ప్రచారం, పోలింగ్ అన్నీ అయిపోయాయి. తను పెద్దగా ఓట్ల కోసం బైట తిరిగినట్టు పేపర్లలో కనిపించలేదు. అయితే రాజకీయుల మధ్య ఎలా తిరగాలో కొంచెం నేర్చుకుంది. కుటుంబ రాజకీయాల్లో ఆడవాళ్లకు ఈ శిక్షణ అనివార్యం. బొత్తిగా గడప దాటని వాళ్లకయినా, ఇదుగో.. ఈ మాత్రం లోకం తెలిసిన ఆడవాళ్లకయినా కష్టం తప్పదు.

మొత్తం మీద గెలిచాక భారీ ఎత్తున ఊరేగింపు జరిగింది. నేను గమనించినంత వరకు నామినేషన్ తర్వాత అదే తన భారీ పబ్లిక్ అప్పీరెన్స్. ఆనాటికల్లా.. చేయి ఎత్తి ఎలా విజయ సంకేతం చూపాలి... ఎట్లా అందరికీ అలుపెరుగకుండా నమస్కరించాలి.. ఎంత అలసటలోనైనా చిరునవ్వును అనుక్షణం ఎలా అలంకరించుకుంటూ ఉండాలి..

అనేవి చాలా వరకు నేర్చుకోగలిగిందని నేను టీవీలో చూసి అర్థం చేసుకున్నాను. నిజానికి అంతగా ఆసక్తి లేని వాటికి దూరంగా ఉండటం తన నైజం. అందుకే ఆయన ఉన్నవాళ్లు రాజకీయాల వైపు తల తిప్పి చూడలేదు. ఏదైనా అంతే. బహుశా ఇదే మొదలు, ఇంతకూ తనకు ఆసక్తి లేకుండానే ఇందులోకి దిగిందా? అని నాకకు అప్పటి దాకా ఉండిన సందేహాన్ని ఆనాటి ఊరేగింపులోని తన హావభావాలను చూసి స్వయంగా తొలగించుకున్నాను.

ఆసక్తి లేనివాటిని ఆసక్తికరంగా మార్చుకోవడం అనే వైనం తనకు తెలిసినట్టుంది. చుట్టూ ఉన్నవాటిని తనవిగా తీసుకోవడం కూడా అలవర్చుకున్నట్టుంది. పరిస్థితులని గుర్తించడం అంటే.. అందులో ప్రతికూలత ఉంటుందని అంగీకరించడమే. ఆ ఎరుక చాలు.. ఎలా వ్యవహరించాలో, ఎందుకలా వ్యవహరించాలో తెలుసుకున్నట్లే. ఆమెకు ఇప్పుడిప్పుడే ఇది తెలిసి వస్తోందని నేను గమనించాను.

ఒక పల్లెటూరి సంపన్న కుటుంబం నుంచి అలాంటి కుటుంబానికే వచ్చిన ఆమెకు ఇంత వరకు ఇష్టం లేని పని చేయాల్సిన అగత్యం ఉండకపోవచ్చు. కొత్తవి అలవర్చుకోవడం అనేది దానికదే ఒక ప్రపంచం. ఇప్పుడు ఆమె ఆ ప్రపంచంలోకి తనంత తానుగా చేరుకున్నదని నాకు అర్థమైంది. ఇట్లా అలవర్చుకోవడమంటే కేవలం తెలియనిది తెలుసుకోవడం మాత్రమే కాదని, నేను అనే అహం గురించి ఎరుక కలగడం మామూలు విషయం కాదు. ఒకసారి నేను.. గురించి తెలిసిందంటే ఇక ఎవ్వరికైనా అంతక ముందులా ఉండటం సాధ్యం కాదని నేను ఆమె ద్వారానే తెలుసుకున్నాను. ఇగో.. ఆమెను సరికొత్త ప్రక్రియలోకి తీసికెళ్లింది. అందువల్ల ఇది ఆమె జీవితంలో ముఖ్యమైన మలుపు అని గుర్తించాను. ఆనాటి నుంచి ఆమె ప్రతి కదలికా నాకు కొత్తగా కనిపించడం మొదలైంది. ఇది భ్రమ కాదు. నిజమే.

* * *

ఆ మర్నాడే నేను వెళ్లాను.

తను నిండు పేరోలగంలో ఉన్నది. చాలా ఆశ్చర్యం.. ఏడాదిన్నరగా ఆ ఇంట్లో ఏది లోపించిందో ఇప్పుడది భర్తీ అయినట్టు కనిపిస్తోంది. సరిగ్గా అదే కళ.. అదే వైనం.. అదే నిండుదనం.. ఆయన ఎల్లప్పుడూ కూర్చుంటూ ఉండే సీట్లో తను కూర్చొని ఉంది. అంత దర్పంగా, యథేచ్ఛగా కాకపోవచ్చు. బహుశా తనకు ఇగో.. గురించిన ఎరుక కలగనంత వరకు.. అంటే.. ఈ ఏడాదిన్నరలో ఏనాడూ సింహాసనం వంటి ఆ కుర్చీలో కూర్చోవాలనే ఆలోచన వచ్చి ఉండదని, అదొక పూజా స్థానమని, తనకే సంబంధించిన జ్ఞాపకమని నేను ఘంటాపదంగా చెప్పగలను. ఈ రెంటిలో

అధికారపు ఛాయలు లేకపోగా పూర్తిగా బంధపు, అనుబంధపు సారంగా ఉండేది.

ఇప్పుడు ఎంత ఆశ్చర్యం! కుర్చీలోంచి లేచి.. ఒకటి రెండడుగులు నా వైపు వేసి, చేయి పట్టుకొని, అక్కడ ఖాళీగా ఉన్న కుర్చీ వైపు తీసికెళ్లింది. అక్కడ ఉన్నవాళ్లెవరెవరో నాకు తెలియదు.

తను నా స్నేహితురాలు.. అని క్లుప్తంగా పరిచయం చేసింది. కాసేపయ్యాక అక్కడ నేనెందుకు? అనిపించింది. బహుశా పరిస్థితుల వల్ల నేను అవాంఛనీయ వ్యక్తినేమో అనిపించింది. చాలా లోతైన సమాలోచనం అక్కడ సాగుతున్నదని అర్థమై మళ్లీ వస్తానని చెప్పి వచ్చేశాను. తను లేచి బైటి గేటు దాకా వచ్చింది. గతంలో అయితే.. నవ్వులు, విసుర్లు, వెటకారాలు, కలబోతలు అయ్యాక.. టైం అయింది.. ఇక నేను వెళ్లాలి అంటే.. సరే.. అని కూర్చున్నచోటి నుంచి కదిలేది కాదు. వెల్లడం, తిరిగి రావడం నాకూ తనకూ మామూలు విషయం. ఇప్పుడు గేటు దగ్గర ఉండే వాళ్లనెవర్నో దూరం నుంచే ఆటో పిలుపు..! అని చెప్పి, నేను ఎక్కేదాకా ఉండి సాగనంపింది.

రెండో రోజు ప్రమాణ స్వీకారం.. తను గనుల శాఖ మంత్రి.

ఆ రోజు మిగతా అందరిలో తను బెరుకుగా, అభద్రంగా కనిపించింది. మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసినవాళ్లలో ముదుర్లు చాలా మంది ఉన్నారు. అంత కాకపోయినా బాగా నలిగినవాళ్లూ ఉన్నారు. అనూహ్య ఆశ్చర్యం వల్ల కలిగిన కలవరం తన ముఖంలో టీవీల్లో చూడగలిగాను. అంతక ముందు కూడా ఫైర్‌లాంటి దాన్ని తన ముఖంలో ఏనాడూ లేదుగాని, మంద్రమైన ఆత్మవిశ్వాసం లీలగా కనిపిస్తుండేది. కొంప తీసి అది ఈ సంరంభంలో కోల్పోయిందా? ఏమి అనే సందేహం కలిగి కొంచెం ఆందోళనపడ్డాను. నేనే కాదు.. సదరు ముఖ్యమంత్రి కూడా తన ప్రమాణ స్వీకారం తర్వాత మంత్రుల ప్రమాణాన్ని క్రీగంట శ్రద్ధగా తిలకిస్తూ.. ఆమెలోని కలవరాన్ని గమనించినట్టుంది. తెలుగులో ప్రమాణం చేశాక ఆమె.. అన్నయ్య దగ్గరికి వచ్చి.. ఆయన పాదాలకు కొంచెం దూరంగా కిందికి వంగి నమస్కరించింది. అప్పుడాయన ఎప్పటి వలెనే తలపై ఆప్యాయంగా చేయి పెట్టాడు. గొప్ప భరోసా ఉంది అందులో. దాన్ని కొందరు గమనించే ఉంటారు. నా మనసులో అది చెదరని దృశ్యంగా మిగిలిపోయింది. ఎందుకంటే ఆ క్షణానకి, ఆ తర్వాత కొంత కాలంపాటు తనెట్లా నెగ్గుక వస్తుందా? అని ఆలోచిస్తుండిపోయాను. తన గురించిన ఆలోచన అంటే అదే కావడం వల్ల ఆ దృశ్యంతో నాకు సంబంధం ఏర్పడిపోయింది.

ఆనాడు ఆమె అలా వంగి అభివాదం చేయడం.. అన్నయ్య తలపై చేయి వేసి

ఆశీర్వదించడం.. చాలా అర్థోక్తిగా నాలో నిలిచి పోయింది. కొంత కాలానికి ఆ దృశ్యం నా మదిలో మనసకబారిందేమోగాని.. కాలం ఎంత మహమ్మారి అంటే ఈ మధ్య వార్తలు వింటున్నప్పుడల్లా తన గురించి తలచుకుంటే అదే దృశ్యం తిరిగి వెంటాడుతోంది. తన మకాం నగరం కావడం, అంతులేని బిజీ కావడం వల్ల పెద్దగా కలిసింది కూడా లేదు. కానీ ఇప్పుడు తన గురించి కించింత్ విచారం కలుగుతోంది. ఆనాటి దృశ్యంలో తన తలపైని హస్తం ఇప్పుడు నాకు భస్మ హస్తంలా స్ఫురిస్తోంది. తానెలా అనుకుంటుందో చెప్పలేనుగాని, ఇప్పటి కథకు.. దానితో సంబంధం ఉన్నందున నాకు అలా అనిపించడం సహజమే అనుకుంటాను.

ఈ పూర్వ రంగం గురించి క్లుప్తంగానే చెప్తాను. ఒక వేళ నేను వక్రీకరించినా అందరికీ చప్పున తెలిసేదే. అన్నయ్య పాలన మీద పూర్తి భిన్నాభిప్రాయాలున్నాయి. రామ రాజ్యమని పొగిడిన వాళ్లే ఎక్కువ. అసలు అలాంటిది ఒకటి ఉందా? ఉంటే ఎలా ఉంటుందని తెలియని వాళ్లు కూడా కీర్తించారు. ఆ సంగతి ఎలా ఉన్నా ఈమె మాత్రం తన మంత్రిత్వాన్ని నల్లేరు మీది బండిలా నడిపించింది.

* * *

ఒకసారి.. నాలుగైదుమార్లు ఫోన్ చేశాక తన పీఏ ఆమెకు అందించాడు. అంతక ముందులాగే మాట్లాడింది. ఓసారి రావచ్చుగా అనింది. తాను పిలవకపోయినా నేను పోదామనే అనుకున్నాను. తను చెప్పిన టయానికే వెళ్లాను. తన ఆఫీసు బైట కూర్చున్నాను. మర్యాదలన్నీ బాగానే అయ్యాయి. లోపల తను ఏదో మీటింగ్‌లో ఉంది. అంతకు ముందే సీఎం గారి కార్యాలయం నుంచి వచ్చిందని చెప్పారు. పేపర్ తిప్పేస్తుంటే కనిపించింది. ఆ ఉదయం నాలుగైదు విదేశీ కంపెనీలతో ముఖ్యమంత్రి సమావేశం ఉన్నదనీ. తూర్పు తీరంలో మైనింగ్ గురించిన వ్యవహారం అనీ రాశారు. అట్లాగే ఆ కంపెనీలతో జరగబోయే ఒప్పందాల మంచి చెడ్డల గురించీ రాశారు. కింద బాక్స్ ఐటంలో ఆ ప్రాంతం నుంచి మావోయిస్టుల ప్రకటన వేశారు. దానికీ దీనికి సంబంధం ఏమిటా? అనుకున్నాను. తమ ఏరియాలో మైనింగ్‌ను ప్రతిఘటిస్తామని వాళ్లు చెట్లకు పోస్టర్లు వేలాడదీశారని రాశారట. తూర్పు అనగానే నాకు అలనాటి మన్నెం వీరుడి మిరపకాయ టపా గురించి పుస్తకాల్లో చదువుకున్నది గుర్తుకు వచ్చింది.

నేను ఆ ఆలోచనల్లో ఉండగా లోపలికి పిలుపు వచ్చింది.

చల్లటి గదిలో ఆమె అంతక ముందటి కంటే మరింత ప్రసన్న వదనంతో నన్ను ఆహ్వానించింది. ఎంతగానంటే పీఏ స్వయంగా బయటికి వచ్చి నన్ను పిలుచుకొని

వెళ్లాడు. తలుపు దాటి లోపలికి వెళ్లే సరికి తాను కుర్చీలోంచి లేచి అక్కడిదాకా వచ్చి ఉన్నది.

ఎలా ఉన్నావు? అనాల్సింది పోయి ఎలా ఉంది? అని అడిగాను.

నా మాటను ఆమె సరిగానే అర్థం చేసుకుంది.

అన్న ఉన్నాడు గదా? లేకుంటే నాలాంటి వాళ్లకు ఇక్కడ కష్టమే. అన్నీ తను శ్రద్ధగా చెప్తుంటాడు. అధికారులతో, మంత్రులతో సమావేశం అయ్యాక రోజూ ఎంత బిజీలో ఉన్నా ఫోన్ చేసి మళ్లీ ఓసారి అన్నీ అర్థమయ్యేలా చెప్తాడు. ఆయన ఎంత జీనియస్ అంటే.. ఒక్కోసారి తను చెప్తున్నవి నాకు అర్థం కావడం లేదని టక్న గుర్తిస్తాడు. కంగారు పడేదేం లేదే తల్లీ.. నీకే అన్నీ తెలుస్తాయి.. అంటాడు. అప్పుడప్పుడు ఫైల్ తనే తయారు చేయించి పంపిస్తాడు! అని చెప్పుకపోయింది.

అప్పుడామే చాలా రిలీఫ్‌గా కనిపించింది.

మీడియా ముందు ఒక్కోసారి కనిపించే తత్తరపాటు ఇప్పుడు కనిపించడం లేదు. ఎవరో చెప్పిన మాటలు ముక్తసరిగా, గుర్తు చేసుకుంటున్నట్లు మాట్లాడటం ఆమె మంత్రిత్వానికి వెలితిగా కొట్టవచ్చినట్లు కనిపిస్తుంటుంది. అయితే అదే తనకు భరోసాగా ఉన్నట్లుంది. తన ఆఫీసు కావడం వల్ల మాటల్లో కొంచెం గుంభనం కనిపిస్తోంది. చక్కగా ఇమిడిపోయిందని సహృదయంతోనే అనుకున్నాను. దాంతో ఎలా నెట్టుకొస్తోందో అని ఎప్పుడైనా నాకు కలిగే చింత తీరిపోయింది. అన్నయ్య ఉన్నాడు గదా? అనే సంగతి తెలియడం వల్ల ఆమె టీవీలో కనిపించినప్పుడల్లా ఆమె ఏం మాట్లాడుతున్నా.. దీని మీద అన్నయ్య ఇలా అనుకున్నాడన్న మాట.. అని నాకు తెలియకుండానే నా మెదడులో దానికొక అర్థ వ్యాఖ్యానం ప్రతిధ్వనిస్తూ ఉండేది.

అయితే ఏం పోయింది? చెల్లెమ్మ సంగతి వదిలేద్దాం.. మిగతా మంత్రులు మాత్రం తమ శాఖల్లో సర్వం సహాధికారాలను వెలగబెడుతున్నారా ఏమి? అనిపించింది. సీఎంగారు తన ఊళ్లో, ఎస్టేట్‌లో ఎలా అధికారం నిర్వహించారో.. సరిగ్గా అట్లాగే ముఖ్యమంత్రిత్వాన్ని కూడా నిర్వహిస్తున్నారని, తాను తప్ప మరేమీ లేకుండా సోహం.. అనే పద్ధతిలో నడుస్తోందని వాళ్లూ వీళ్లూ అనడం అందరి చెవునా పడుతూనే ఉన్నాయి.

రాష్ట్రం ఏమై పోయినా ఆ అయిదేళ్లూ ఆమె నిష్పూచీగా తన మంత్రి పదవిని కొనసాగించింది. ఏడాదికేడాదికి వ్యవహార శైలికి పదును పెట్టుకుంది. మాటలో, పలుకులో తన స్వరం వినిపించడం నేర్చుకుంది. కొత్త అనే ఫీలింగ్‌ను తను క్రమంగా వదులుకున్నట్లే జనం కూడా వదిలేశారు. ఆ సంగతి ఎవ్వరికీ గుర్తు కూడా లేనంతగా

కాలం పరుగులు తీసింది. మామూలుగా మంత్రులందరి మీద వచ్చినట్లే తన మీదా ఏవో కొన్ని విమర్శలు వచ్చాయి. అధికార ఫలాలకు ఈ విమర్శలు ఉప ఉత్పత్తి లాంటివి గదా? పత్రికా స్వేచ్ఛలో భాగంగానే ఇవన్నీ రాస్తున్నారని సరిపెట్టుకున్నాను. అధికారం ఎలాంటిదంటే – చుట్టూ ఎవరు ఎన్నయినా మాట్లాడుతూ ఉండవచ్చు.. కానీ అసలు కత మాత్రం బయటికి రాదు. అధికారం అంటే – సత్యంపై వేసిన కాంక్రీట్ వంటిది. నేనీగొడవలు పట్టించుకోలేదు. మధ్యలో ఫోన్ చేస్తే కొడుకు ప్రయోజనకుడయ్యాడని కొంచెం సంతోషంగానే చెప్పింది. తల్లి మనసు గదా! ఇప్పుడే చదువు ముగించి వ్యాపారాలు చూసుకుంటున్నాడట.

## 2

ఇంతలో మళ్లీ ఎన్నికలు.. ఆమె అదే పద్ధతిలో ఘనంగా గెలవడం.. ఈసారి మరింత ఆశ్చర్యకరంగా హోంశాఖ ఇవ్వడం.. చకచకా జరిగిపోయాయి.

ఏం ఫర్వాలేదు.. ఆమె దేన్నయినా లాగించేయగలదు.. అన్నయ్య ఉన్నాడు గదా? అని అందరూ అనుకుంటుండగా..

గాలిలోకి ఎగిరే బెలూన్ పట్.. మని పేలిపోయింది.

జోరుమీదున్న రథ చక్రం నిలువునా విరిగిపోయింది

తిరుగులేదనుకున్న నమ్మకం మంచు బిందువులా కరిగిపోయింది.

విమాన ప్రమాదంలో సీఎం చనిపోయారు.

న్యాయంగా తానే ముఖ్యమంత్రి అవుతానని సీఎం కొడుకు అనుకున్నాడు. అందరూ అదే అనుకున్నారు. ఆమె కూడా అనుకుంది. కానీ కాలేదు. గొడవలు మొదలయ్యాయి. ఆయన తిరుగుబాటు చేశాడు. అధిష్టానం ఈ అవిధేయతను భరించలేకపోయింది. పార్టీ రెండు శిబిరాలయింది. ఎవరు ఏ పక్షమో ఎవరికీ తెలియని గందరగోళం. సహజంగానే ఆమె సీఎం కొడుకు పక్షాన నిలబడింది. సీఎం కొడుకు పెట్టిన కొత్త పార్టీ వైపే ఆమె మొగ్గని అందరికీ తెలిసినా బయటపడలేదు. బైటపడ్డా పదవికి ముప్పు రాకుండా చూసుకుంది. ఆమె పరిణతి, వ్యవహారశైలి ఇట్లా రుజువైంది. ఈలోగా సీఎంగారి పాపాల పుట్ట పగిలి రకరకాల పాములు బయటపడ్డాయి. కంచుకోట అనుకున్నది గాలి మేడగా మారింది.

ఒకటి కాదు.. రెండు కాదు.. వేల కోట్లు, లక్షల ఎకరాలు..

గ్రానైట్.. సిమెంట్.. సెజ్‌లు.., ఓడ రేవులు.. ఒకటేమిటి భూమి దేనికి దేనికి అవసరమో అన్నిటికీ ఇచ్చాడని, ప్రతిఫలంగా ఆయన కొడుకు కంపెనీల్లోకి వేల

వేల కోట్ల రూపాయలు ప్రవహించాయని సాక్షాధారాలు బయటికి వచ్చాయి. స్వర్ణయుగమని కీర్తించినవారే అవినీతి మయం అన్నారు. దీనికి ఆయన ఒక్కడే కాదు, ఆనాటి మంత్రి మండలి అంతా బాధ్యత పడాలని అన్నవాళ్లూ ఉన్నారు. ఆయన చేసిన వాటితో మాకేమీ సంబంధం లేదని ఆనాటి మంత్రులందరూ అన్నారు.

అవినీతి.. అవినీతి.. అని రామనామంలాగా నింగీ నేలా, తరులు గిరులూ ఘోషించాయి.

శాలివాహన శకమని.. ఇంకా ఫలానా శకమని చరిత్రను గణిస్తారు గదా.. ఇది కుంభకోణాల శకం. ఎన్ని కుంభకోణాలు జరిగిందీ రోజూ రెండు మూడు పత్రికలు శ్రద్ధగా చదివినా అర్థం కావడం కష్టమే. నిజాలేవో.. అబద్ధాలేవో ఎవరికీ తెలియని మాయాజాలం. ఒక పత్రికలో కుంభకోణమని రాస్తే మరో పత్రిక దాన్నే మహత్తర ప్రజా యజ్ఞమని కీర్తించింది. అంతా వేల కోట్ల మీద లెక్కలే. లెక్కబెట్టుకోడానికి చేతకానన్ని అంకెలు, అర్థం కాని జీవోలు.. వాటిలో జీవో ఏదో.. సదరు అన్నయ్య నోటి మాట ఏదో.. ఆ కాలంలో దేన్ని ఎవరు ఎలా భావించారో.. సంతకాలు ఎవరు పెట్టారో, ఎవరు పెట్టమన్నారో.. ఎవరు ఏ ప్రయోజనం పొందారో అంతా గారడీయే. భూములు పోవడమూ, సంపద పోగేసుకోవడమూ మాత్రమే వాస్తవం. ఫైళ్లు, సంతకాలు అనే విషయాల మీదనే బోలెడు చర్చ జరిగింది. సంతకాలు మావే.. కానీ మాకేం సంబంధం లేదని ఆనాటి మంత్రులంతా అన్నారు. వాళ్లలో కొందరు అంతక ముందు మంత్రి పదవి చేసినవాళ్లే, ఇప్పుడూ చేస్తున్నవాళ్లే. ఇంత పెద్ద భూ సమారాధన గురించి వడ్డించినవాళ్లే తమకేమీ తెలియదని స్కూల్ బాయ్స్‌లాగా చెప్పారు. పెద్ద చేతుల పందేరం అంటారు గదా.. ఇది చేతులకు కూడా తెలియని పందేరం. మునివేళ్లకైనా తెలియని సంతకాల గురించి వైనవైనాలుగా చెప్పుకున్నారు.

* * *

ఆ మధ్య కొడుకు వ్యవహారాల గురించి పత్రికలు రాశాయి. తండ్రి చనిపోయే నాటికి చిన్నవాడు. చదువులు పూర్తి చేసుకొని పెద్దవాడైనట్టే వ్యాపారాలూ పెరిగి పెద్దవయ్యాయి. వాటికి ఆమె తన అధికారంతో ఫేవర్ చేస్తోందనే వందంతులు మొదలయ్యాయి. తన రాజకీయాలకు కొడుకు తగిన సమీకరణాలను కూడగడుతున్నాడనీ పత్రికలు రాశాయి. ఆయన వైపు బంధువులు ఈమె అధికారాన్ని చూసుకొని దందాలు చేస్తున్నారని ఏవేవో రాశారు. అవన్నీ వింటూ ఉంటే బాధేసింది. ఇవీన్ని నిజమేనా? అనిపించింది. తన వైపు నుంచి అసలు వర్తమానమే లేక ఎంత కాలమైందో! కనీసం ఎలా ఉన్నావనే పలకరింపు కూడా లేదు. తన వార్తలు నాకు తెలుస్తుంటాయని, నా గురించి తను ప్రయత్నిస్తేగాని తెలియవని ఆమెకు

తెలియకపోదు. సంబంధం అంటే.. ఇతరుల వైపు నుంచి చూడటం కాదు. వాళ్లు మనతో ఎలా ఉన్నారో పసిగట్టి, అంచానా వేసి అట్లా వ్యూహాత్మకంగా నడిపే పాచిక కాదు. సంబంధం అంటే.. వాళ్లతో మనం ఎలా ఉండాలో మనంతకు మనం నిర్ణయించుకునేది మాత్రమే. దానిపై ఎట్టి పరిస్థితిలోనో అవతలి వాళ్ల వ్యవహారశైలి ప్రభావితం చేయకూడదు. అప్పుడు సంబంధాల్లో ఇతరులు నిర్ణయించే వాళ్లయిపోయి, మన స్థానం తోలు బొమ్మలా ఎటైనా మారిపోవచ్చు. నాకు ఇది అంగీకారం కాదు.

అందువల్ల నా అంతకు నేనుగా వెళ్దామనుకున్నాను. ఫోన్ చేయకుండానే తను ఉంటుందనే నమ్మకంతో బయల్దేరాను. నా మనసులో ఉన్నదేదో బాపుకోవడం నాకు అవసరం. నేను గేటు దాటుతోంటే ఆమె కొడుకు ఎక్కడికో పోతున్నవాడల్లా నన్ను చూసి కారు దిగి ఆత్మీయంగా, ఒకింత వేగంగా నా దగ్గరికి వచ్చాడు. ఎప్పటికంటే ప్రేమగా పలకరించాడు. చూడక ఎన్నేళ్లయిందో. ఎంత పెద్దవాడయ్యాడు?

నా వెంట లోపలి దాకా వచ్చాడు. ఎవరికో చెప్పాడు.. నేను వచ్చానని. లోపలి నుంచి తను వచ్చింది. ఒకటి రెండు నిమిషాలుండి బై చెప్పి వెళ్లిపోయాడు. అప్పుడు తను చాలా బిజీగా ఉన్నట్లుంది. అయినా ప్రశాంతంగా నన్ను స్వాగతించింది. అక్కడున్న వాళ్లకు ఏవేవో పురమాయించింది. కొందరిని సాయంకాలం రమ్మని చెప్పింది. నన్ను లోపలికి తీసికెళ్లింది. నా అంతకు నేనుగా ఇంటికి పోవడంతో ఆనందించింది. అది చాలా స్వచ్ఛంగా తోచింది. సుమారు రెండు గంటల సేపు నాతో గడిపింది. మా ఇద్దరికి తెలిసిన మనుషుల గురించి, మేమే పంచుకొనే ఊసుల గురించి గతంలాగే పంచుకున్నది. టైం అవుతోందని గాని, బయట తన కోసం ఎవరో ఎదురు చూస్తుంటారనిగాని ఆ క్షణాన తాను మర్చిపోయిందా? అనేంత సహజంగా నాతో గడిపింది. కాని నాకు లోపల ఒకటి ఒత్తుకుంటోంది. తన ఆత్మీయతతో నిజానికి నేను అది అంతక ముందులాగా పట్టించుకోలేదోమో మరి. అంత సేపు ఉన్నా – కొడుకుపైన, తనపైన ఆరోపణలు వచ్చేయనిగాని, అవి నిజమని గాని, అబద్ధమని గాని ఏమీ ప్రస్తావించలేదు. చాలా సరదాగా, చాలా మామూలుగా అంతక ముందు ఊర్లో ఉన్నప్పటిలాగే మాట్లాడింది.

* * *

ఆనాటి గనుల కాగితాలన్నీ బయటికి వచ్చాయి. సీఎం కొడుకును అరెస్టు చేశారు. ఆయన అక్రమ ఆస్తుల కేసులకు ఆ కాలంలో మరి దేనికీ లేని ప్రాశస్త్యం వచ్చింది. కొత్త సీఎంను ఢిల్లీ వాళ్లు ఖరారు చేసినా సీఎం కొడుకు మాత్రం ఈయనే.

ఇది కలియుగమని, భగవంతుడు అధర్మనిధనానికి కల్కి అవతారంలో అవతరిస్తాడని, ఆ శుభ గడియల కోసం ఎదురు చూస్తున్న వాళ్లకు సరిగ్గా అలాంటి

పారవశ్యం కలిగేలా సీబీఐ జాయింట్ డైరెక్టర్ అవతరించాడు. అలాంటి వ్యక్తి ఒకరు ఉన్నట్లు అంత వరకు ఎందరికి తెలుసోగాని ఇప్పుడు ఆయన అవతార విశేషాన్ని జెడీ అనే కుప్ల నామంతో భూనభోతాంతరాలన్నీ శ్లాఘిస్తున్నాయి. ప్రభుత్వంలో ఎన్ని విభాగాలు లేవు? వాటిలో ఎందరు జాయింట్ డైరెక్టర్లు లేరు? కానీ జేడీ.. జేడీ అని ఆయనను పత్రికలు, టీవీ ఛానళ్లు, ఉదయం పూట వాకింగ్‌లో కలిసేవాళ్లు, సాయంకాలాలు కలిసే రిటైర్డ్ వృద్ధులు, వీధి కోళాయి దగ్గర నీళ్ల కోసం పడిగాపులు కాస్తున్న వాళ్లు, అవినీతి పోవాలని కోరుకునేవాళ్లు.. అందరూ జేడీనామ స్మరణే. గుర్రం మీద కత్తి పట్టుకొని కల్కి వస్తాడనే నమ్మకం ఉన్నవాళ్లకు ఈ జేడీ టక్ చేసుకొని చేతిలో ఓ ఫైల్ పట్టుకొని లక్ష్యం దిశగా సాగిపోయే బాణంలా నడుస్తున్న ఆయన విజువల్స్ టీవీల్లో చూసి పారవశ్యం కలిగేది. అధికార అధిష్టానం చేతిలో కీలుబొమ్మ ఈ జేడీ.. అని సత్యానికి ఆవలి కోణాన్ని కొందరు వెలుగులోకి తీసుకొని వచ్చారు.

ఆయన గత ప్రభుత్వ కాలంలోని దస్త్రాలన్నిటికీ దుమ్ము దులిపాడు. దాని వల్ల జరిగిన మేలు ఒకటి ఉంది. అదేమంటే.. ప్రభుత్వాలు నడిచే తీరు ఎలా ఉన్నదో జనరంజకంగా తెలిసిపోయింది. కన్యాశుల్కంలో గిరీశం జంధ్యం వల్ల కూడా ఉపయోగం ఉంటుందని చెప్పినట్లు. ప్రభుత్వం గురించి ప్రజలకు ఇప్పుడు గదా పారదర్శకంగా తెలిసింది అని చాలా మంది అనుకున్నారు. ప్రభుత్వం అనే మూట విప్పితే గనులు, భూములు, కంపెనీలు.. అనే మూడు అంతర్ ప్రపంచాల పునాదులన్నీ బట్టబయలయ్యాయి. సీఎం కొడుకు జెయిలుకు వెళ్లిన కొద్ది దినాలకు ఆనాటి గనులశాఖ సెక్రటరీని అరెస్టు చేశారు.

జేడీలాంటి మరో క్లుప్త నామమే ఓఎంసీ. దీని గురించి అన్ని పత్రికలు పొగడుతూ, తిడుతూ రాసిందంతా కలిపితే చాట భారతమంత అవుతుంది. ఇదొక మైనింగ్ సంస్థ. సింధూ నాగరికత తవ్వకాల్లో అలనాటి నాగరికత, సంస్కృతి బైటపడ్డాయని చరిత్రకారులు బోధించినట్లు ఈ మైనింగ్ తవ్వకాల్లోంచి రాజకీయాలన్నీ గుట్టలు గుట్టలుగా బైటికి వచ్చాయి. తవ్వేకొద్దీ అవినీతి.. దాంట్లోంచి ప్రముఖ ఐఏఎస్‌లు, మంత్రులు బైటికి వచ్చారు. ఆనాటి ముఖ్యమంత్రి తమ్ముళ్లు, అల్లుళ్లు, ఆత్మీయులు, అయినవాళ్లు, ఊరివాళ్లు బైటికి వచ్చారు. ప్రతివాళ్లకూ ఫలానా చార్జిషీట్‌లో ఒక నెంబర్ వచ్చింది. ఇప్పుడు వాళ్లు ఆ నెంబర్‌తోనే సుప్రసిద్ధులయ్యారు. అంతేకాదు, ఆ నంబర్‌తోపాటే వందల ఎకరాల భూములు, వందల కోట్ల రూపాయలు వాళ్ల కొండ గుర్తుగా ప్రచారంలోకి వచ్చాయి. ఇది ప్రచార వాస్తవం కాదు, వాస్తవ ప్రచారం. అట్లా అలనాటి గనుల మంత్రి, ప్రస్తుత హోం మంత్రి పేరు కూడా వినిపించింది.

చార్జిషీట్‌లోకి ఎక్కిందనే అనుకున్నారు. ఎక్కినట్లే ఎక్కి తప్పించుకుంది. ఆవిడ హమ్మయ్య అనుకుంటుండగా దాల్మియా సిమెంట్స్ గనుల కుంభకోణంలో ఏ4 అని అన్నారు. అన్నట్లే రాసేశారు. రాజులు తలుచుకుంటే దెబ్బలకు కొదువా.. అన్నట్లు జేడీ తలుచుకుంటే చార్జిషీట్‌లకు కొదువా అన్నట్లయింది. చాలా మందికి ఏ జేడీ అవతారమే అర్థం కాలేదు. తస్మదీయులను జెయిళ్లలో తోస్తున్నాడని కొందరు ఆరోపిస్తూ ఉంటే, అస్మదీయులను, అధిష్టాన దేవతకు ఇష్ట భక్తులను కూడా జెయిలుకు పంపిస్తున్నాడు.

స్వర్ణయుగం నాటి వాన్‌పిక్ అనే గుప్త నామం గల ఓడ రేవుకు వేలాది ఎకరాలు కట్టబెట్టిన కేసులో ఎక్సైజ్ మంత్రిగారు కేసుల్లో ఏడాదిన్నరగా జెయిల్లో ఉన్నారు. భూములు వ్యవసాయానికా, ఓడ రేవుకా? అంటే ఓడరేవుకే అనే కంఠోక్తి స్వర్ణయుగం నాటిది. తీర ప్రాంతంలోని గ్రామాల రైతులకు ఈ ఉదంతం తెలిసేసరికల్లా వాళ్ల తాతల నాటి భూములన్నీ వాన్‌పిక్ భూములయ్యాయి. రెవెన్యూ మంత్రి కూడా ఈ భూముల అమ్మకంలో చార్జిషీట్‌లోకి ఎక్కారు. ఆయన తన సచ్ఛీలసతకు ఇది అగ్ని పరీక్ష అని, తాను నిప్పుల గుండంలో దిగి కూడా బైటికి రాగలనని ప్రతిజ్ఞ చేశారు. అందుకని ముందు షరతుగా రాజీనామా చేశారు. రాజీనామా అంటే వదిలేయడమనే అర్థం! కానీ రాజీనామా చేసినా రాజకీయాల్లో ఏదీ దూరం కాదు. అదే మతలబు. తెలంగాణ కోసం రాజీనామా చేసినా, అవినీతి కళంకంతో రాజీనామా చేసినా పదవికి మాత్రం భరోసానే. ఆయన రాజీనామా గురించి పత్రికలు అప్పుడప్పుడు ఆయనకు చిర్రెత్తుకొచ్చేలా గుర్తు చేస్తుంటాయి. అట్లా ఆయన, ఆయన పదవీ త్రిశంకు స్వర్గంలో ఉన్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో త్రిశంకు స్వర్గమనే సరి కొత్త పొజిషన్ ఆయన రాజీనామాతో అవతరించింది. అలనాటి మంత్రి మండలిలో ఆ ఇద్దరూ కాక ఈమె, మరో ఇద్దరి పేర్లు చార్జిషీట్ కాగితాల లోపల దాగి ఉన్నాయి. ఈ పంచ మంత్రుల్లో ఇద్దరు మహిళలు ఉండటం డెమోక్రసీలోని మహిళా సాధికారతకు గుర్తని చమత్కరించేవాళ్లూ ఉన్నారు. ఆమె ముద్దాయా? హోంమంత్రా? అనే విచికిత్స పెరగడంతో అధికార పార్టీకి సంక్షోభం తలెత్తింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హోం మంత్రికి డీజీపీ ఎట్లా సెల్యూట్ చేస్తాడని ఓ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ఏ ఊరికి వెళ్లి ప్రెస్ మీట్ పెట్టినా చెప్పడం మొదలు పెట్టాడు. ఆయనకు ఇదో శక్తివంతమైన నైతిక విమర్శ అనిపించింది. అందులో ఒక అంతరార్థం దాగి ఉంది. ఇక ఈ రాజకీయాలను రాజకీయంగా ఏమీ చేయలేం. నైతిక కోణంలో ఎదుర్కోవాల్సిందే అనేది ఆయన దృఢ విశ్వాసం.

* * *

ఆ రోజు పేపర్లో ఏ4 వార్త చదివి మనసు అదోలా అయింది. తనను సొంతం

ఎరుగుదును. బయటి నుంచే కావచ్చు.. తను లోపలి నుంచీ నాకు తెలిసిన కాలం ఒకటి ఉన్నది. అది కరిగిపోయింది. నేను బయటికి వచ్చానో.. తను లోపలికి వెళ్లిపోయిందో.. తెలియదు. అంత ఎత్తు నుంచి ఇలా..! తలుచుకోడానికే నాకు ఇబ్బందిగా ఉంది. ఈ పెరగడమేమిటి? ఇప్పుడిలా చేజారి పోతుండటం ఏమిటి? ఆ రోజు మాత్రం తాను కోరుకున్నది కాదు. కానీ.. ఆ తర్వాత..? ఏం జరిగిందో? ఎందుకు ఇలా జరిగిందో? నాకు తెలియకపోవచ్చుగాని, ఆమె తానే అధికార స్వరూపంగా మారిపోవడం, ఒక మహా అధికారంలో సంలీనమైపోవడం దగ్గరిగానే చూశాను. ఆమె అలా మారిపోవడమో, నాకు ఆ సంగతి తెలియడమో.. నాకు భారంగా పరిణమించింది. తన గురించి నాకు ఏ సంగతులు తెలుసో.. తను ఎప్పటికప్పుడు పసిగడుతూ వచ్చేది.

ఫోన్ చేద్దామనుకొని కూడా ఊరుకుండిపోయాను. ఏదో ఇబ్బంది అనిపించింది? అరెస్టు చేయవచ్చనే వదంతులు కూడా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిలో ఏం పలకరించాలి? ఆ రోజూ, మర్నాడు తను బైటికి ఇంట్లోంచి రాలేదని వార్తలు వచ్చాయి. విషాదమో, అవమానమో.. ప్రస్ఫుటిస్తోంటే ఆమె సీఎం కార్యాలయానికి వెళ్లి రావడం మాత్రమే టీవీల్లో చూశాను. రిజైన్ చేస్తానని అంటే సీఎం ఒప్పుకోలేదట.. సన్నిహిత మంత్రులందరితో సమావేశం కూడా జరిగిందట. వాళ్లూ తొందరపడొద్దని అన్నారట.

ఈ వార్తలు చదువుతూ ఇక ఉండబట్టలేక ఫోన్ చేశాను.

రింగ్ పూర్తి కాకముందే తనే ఎత్తింది.

ఈ సారి ఎలా ఉన్నావని అడిగాను.

ఖాళీగా ఉంటే రారాదు అని తనే అడిగింది. ఆ మాటలో ఏ భావమూ లేదు. రమ్మనడం తప్ప. ఈ స్థితిలో నేను వెళ్లినా ఏం మాట్లాడగలను? ఆ గొడవలేమిటో, ఎందుకు జరుగుతున్నాయో నాకేం తెలుసు. కొత్తగా ఇప్పుడు వివరాలు తెలుసుకున్నా వాటిపై అభిప్రాయాలు ఏర్పరచుకోడానికి సిద్ధంగా లేను. కానీ నాకు ఒకటే సందేహం. ఇది తనకు విషాదమా? అవమానమా? చేసిన తప్పు బయటపడితే ఒకలాంటి బాధ ఉంటుంది. చేయని నేరం ఆరోపిస్తే మరోలాంటి దుఃఖం ఉంటుంది. బాధకూ, దుఃఖానికి ఉండే సున్నితమైన తేడాలో స్థితిని బట్టి విపరీత అనుభవంగా మారుతుంది. ఇంతకూ ఆమెది ఎలాంటి స్థితి? ఇదే నన్ను వెన్నాడుతోంది.

అయినా వస్తానని అన్నాను.

తను చెప్పినట్లు మర్నాడు పొద్దునే ఇంటికి వెళ్లాను. అసలే చాలా సాదాసీదాగా ఉండే మనిషి మరింత మామూలు కుటుంబ మహిళలాగా వంట గదిలోంచి వస్తూ కనిపించింది. ఆ రెండు రోజులు ఇంట్లో పనివాళ్లను కూడా మాన్పించినట్లుంది.

ఒక్కతే ఉందని తెలుస్తోంది. ఏదో భారం బాపుకోడానికి ఒంటరితనం అవసరం అనుకుందేమో. కానీ ఉదయం పేపర్లో మాత్రం బోలెడు కథనాలు వచ్చాయి. ఈ కేసు నుంచి తప్పించుకోడానికి స్వయంగా తానే ఏవేవో ప్రయత్నాలు చేస్తోందని, మరో శాఖలోకి వెళ్లడానికి ప్రయత్నిస్తోందని కూడా రాశారు. రాజీనామా చేసే ఉద్దేశం లేదని, అంతా ఉత్తిత్తదే అనే విరుపు కూడా అందులో ఉంది. కానీ మనిషిని చూస్తే చాలా వైరాగ్యంగా కనిపిస్తోంది. భర్త హటాన్మరణమప్పుడు మళ్లీ కోలుకుంటుందని అనుకోలేదు. దుఃఖమూ, వైరాగ్యమూ ఆవరించాయి. నాకెందుకో చాలా అసందర్భంగా అదంతా గుర్తుకు వచ్చింది. మౌనంగా వెళ్లి ఎదుట కూర్చున్నానను. ఆనాటివి తగని జ్ఞాపకాలని ఎంత అనుకుంటున్నా అవే ముసురుకుంటున్నాయి. ఒక స్థితి మరో స్థితిని తలపుకు తేవడం, వాటి మధ్య పోలిక చూసుకోవడం మనిషికి తప్పదేమో. బహుశా సాన్నిహిత్యంలోనూ కొంచెం ఎడంగా ఉండగలిగితే ఈ తేడా చూడటం సాధ్యమవుతుందా? అనిపించింది. తను కొన్ని క్షణాలు అట్లా కూర్చుండిపోయింది. ఏదన్నా ప్రస్తావిస్తే మాటకలపవచ్చనుకున్నాను. కొంచెం గంభీరంగా ఎటో చూస్తూ ఉండిపోయింది. నేను అటూ ఇటూ ఇల్లంతా చూస్తుండిపోయాను. రెండు మూడు నిమిషాలే కావచ్చు, చాలా భారంగా, వొత్తిడిగా గడిచిపోయాయి. నేను ఇబ్బందిగా కూర్చున్నానని తెలుసుకున్నట్లుంది. టీ తెస్తా అని లోగొంతుకతో అని లేచి వంట గదివైపు వెళ్లింది.

ఆనాడు జీవితంలో తాను ఎదుర్కొన్న విషాదంలో కొంచెం బేలతనం, సహజాతమైన అమాయకత్వం కూడా ఉండేవేమో అనుకున్నాను. ఇప్పుడది లోపించడం నాకు స్ఫురించి కొంచెం కలవరం కలిగింది. ఇది పరిణతి అనుకోవాలా? పరిణామమనుకోవాలా? అని ఆ రెంటి మధ్య కూడా ఉండే తేడాలోని అర్థం ఏమిటి? ఆలోచనలు క్షణకాలంలో ఆ దిక్కున అల్లుకపోయాయి. ఇప్పటి తనను అర్థం చేసుకోడానికి నాకే స్పష్టం కాని ఆలోచనలెన్నో ఉక్కిరిబిక్కిరి చేశాయి. బహుశా అర నిమిషంలో నన్ను నేను అప్రమత్తం చేసుకున్నాను. నాకు ఎందుకిలాంటి దృష్టి కలిగింది? ఇదేమైనా అమానుషమా? అని కూడా పరీక్షించుకున్నాను.

లేచి లోపలకి వెళ్లాను. తను యంత్రంలాగా స్టౌ వెలిగించి టీ పెడుతోంది.

ఏదో మాట కల్పించుకోవాలని.. ఎవరూ లేరా? అన్నాను.

కొన్ని క్షణాలయ్యాక నావైపు చూసి ఆ.. ఏ ఏవో పనులున్నాయని పనివాళ్లు రావడం లేదు..! అన్నది. అప్పుడామె నిజం చెప్పడం లేదని ఆ చూపే పట్టించింది. అందరిని వద్దని ఒంటరిగా ఉండాలనుకున్న ఈ సమయాన నన్ను రమ్మని పిలిచిందని స్ఫురించగానే బరువైంది.

ఒకటి రెండు నిమిషాలయ్యాక ఏమనుకుందో.. నేను అడగకపోయినా బాబు.. వారం కింద లండన్ వెళ్లాడు.. ఇందాకే ఫోన్ చేస్తే నీవొస్తున్నట్లు చెప్పా.. అన్నాను. మామూలుగా అయితే కొడుకు గురించిన ఏమాట అయిన కొంచెం ఉత్సాహంగా చెప్తుంది. ఇప్పుడది లేదు.

రెండు టీలు తీసుకొని బయటికి వచ్చింది. నాకు ఒకటి ఇచ్చి తను తాగుతోంది. అప్పుడు కూడా ఏమీ మాట్లాడలేదు. కాకపోతే నేను వెళ్లినప్పటికంటే ఈ పది నిమిషాల్లోనే కాస్త తేటగా, తేలికగా మారినట్లు కనిపించింది. ఆ రకంగా నేను వచ్చినందుకు నాకు సంతోషమే. కానీ నాకే బరువుగా ఉంది. టీ అయిపోయేదాకా ఇద్దరి మధ్య మౌనమే.

ఇక ఉండలేక ఏమైంది? ఏమిటి? ఇదంతా? అని అడిగాను.

దానికి ఆమె ముఖం కొంచెం వివర్ణమైంది. బహుశా నాలుగైదు క్షణాలు మాత్రమే. రాత్రి నిద్రపోలేదేమో మరి.. కళ్లకింద నల్లటి చారలు పడ్డాయి. ఇప్పుడు ఆ కండ్లల్లో కూడా నీడలు. కాసేపట్లో అవీ మాయమయ్యాయి.

ఏం కాదు. ఇక్కడ ఇలాంటివి మామూలే. ఏవేవో జరుగుతూ ఉంటాయి. అసలు కంటే ఎక్కువ ప్రచారమవుతుంది.. అంది.

అది సరే.. అరెస్టు.. అదీ ఏం జరగదు కదా? అని పొడి పొడిగా అడిగాను.

దానికి ఆమె చిన్నగా నవ్వింది.

ఎప్పుడు ఏదైనా జరగవచ్చు. అన్నయ్య అంటే నాకుండే దాన్ని బట్టి.. నేను ఇక్కడే ఉంటానా? ఆ ఇంటి తలుపు తడతానా? అనే పరీక్ష ఇది. అటుపోతావేమో జాగ్రత్త అని బెదిరింపు ఇది. నేను ఇక్కడే ఉండటం వాళ్ల అవసరం.. కేసులు తప్పించుకోవాలంటే ఇక్కడ ఉండటం నాకూ అవసరం. ఇచ్చిపుచ్చుకోగలమనే నమ్మకం ఉన్నంత కాలం ఏ ఇబ్బంది ఉండదు. ఇలాంటివాటిని తట్టుకొని ముందుకు పోవాల్సిందే.. అన్నది.

చాలా మామూలుగానే ఈ మాట అన్నది.

చాలా మౌనం తర్వాత ఒక్కసారిగా ఇంత బారుగా మాట్లాడేసరికి నాకు చప్పున అర్థం కాలేదు. ఇప్పుడు ఇక్కడ నేనెందుకు? అనిపించింది. తన మాటల్లోని అర్థాన్ని అందుకోడానికి ఇద్దరం ఒకే తావున లేం గదా? అని మాత్రం బోధపడింది. మరో అయిదు నిమిషాలు పొడి పొడి మాటలయ్యాక లేచి బయల్దేరాను.

# విభ'జనరేఖలు'

## జి. వెంకటకృష్ణ

రాజీవ్‌గాంధీ సర్కిల్ దాకా రాగలిగాడు ఉమామహేష్. రాజీవ్‌గాంధీ తల, తళతళలాడుతోంది. 'నిప్పంటించిన తలకు మొన్ననే కొత్తగా రంగువేసారు. యిప్పుడు ఆయన చుట్టూ వెండిరంగు ముళ్ళతీగె. ఉదయం పదిగంటలు అందుకే ఎండ కూడా తళతళ లాడుతోంది. చెమటతో ఉమామహేశ్ తల చిత్తడి చిత్తడిగా వుంది. అతని ముందు వందల వాహనాలు ఆగివున్నాయి. అటూయిటూ కూడా, ఒక వాహన సముద్రం మధ్య బిక్కు బిక్కు మంటూ 'అమ్మ'ను తలుచుకుంటున్నాడు. అన్ని వందల మందీ, ముందుకో, వెనక్కో వాళ్ళ దారుల్లో వాళ్ళు వెళ్ళాలనే ఆతృత. అయితే సాధ్యం కావడం లేదు. అందుకేనేమో హారన్ల మోత మోగిస్తున్నారు. అందుకేనేమో అందరికీ అందరిమీదా కోపంగా వుంది. అసహనంగా వుంది. ముందు భాగంలో బాగా అల్లరి జరుగుతోంది. వాహనదార్లు తలల్ని నిక్కించి నిక్కించి చూస్తున్నారు. ఒక్క పెట్టున కేకలూ, చప్పట్లూ, అరుపులూ, తిట్లూ అదొక హోరు. జనానికి యీ బాధ కల్గి యాభై రోజులైపాయ. రోజులో బయటికొచ్చే ప్రతివొక్కరూ ఏదో ఒక పొద్దు దీన్ని ఎదుర్కోక తప్పడం లేదు. ఇప్పుడు యిక్కడ అసహనం పడుతున్న వాళ్ళే, రేపు యిక్కడే వేరే యింకొకరికి అసహనం కల్గించవచ్చు! చెప్పలేం.

మహేష్ మాత్రం అర్జంటుగా ఆసుపత్రి వెళ్ళాలి. వాళ్ళమ్మ అనారోగ్యంతో ఎన్.ఆర్.పేట 'నోబెల్' ఆసుపత్రిలో వుంది. నిజానికి యింత సీరియస్ అవుతుందనుకోలేదు. మలేరియా అనుకున్నారు. అయితే బేదులు పట్టుకున్నాయి. అది కాస్తా కిడ్నీ ఫెయిల్యూర్ దాకా వెళ్ళింది. నడిపన్న నాగేశ్వర్ దగ్గర వుండేది 'అమ్మ'.

ఆయన తన పొలాల్లో తుంగభద్ర అవతలిగట్టున నడిగడ్డలో వుంటాడు. పిల్లల్ని చదివించడానికి కర్నూల్‌లో యిల్లు తీసుకున్నాడు. తనది పెద్ద సంసారం. కొంచెం యిరుకిల్లు.

"అనాగరికుడు అమ్మను సరిగా చూసుకోవడం లేదు" అని పెద్దన్న కంప్లయింట్.

'అమ్మ'ను ఆసుపత్రిలో చేర్పించిన నాలుగు రోజులకి పెద్దన్న రాఘవరావొచ్చి 'అమ్మా అమ్మా' అంటే కళ్ళెత్తి చూసి, నిరసనగా ముఖం తిప్పేసుకుందట ఆమె. వీడు వదుల్తాడా గంటకు వొకసారి ఆమె పలక్కున్నా పలకరించడం, కేసు చూస్తున్న డాక్టర్ శ్యామలను ప్రిస్కిప్షన్ గురించి విసిగించడం.

అది భరించలేక 'అమ్మ' నాగేశ్వర్‌ను పిలిచి, "వాణ్ణెవడు పిలిచాడు, వాడి దారిన వాణ్ణి పొమ్మనరా..." అంది. ఆమాట ఎట్లా చెప్పాలా... అని సంశయిస్తూ చెప్పలేక పోయాడు నాగేశ్వర్. అప్పుడు మహేష్‌కు ఫోన్ చేసాడు.

"రేయ్ ఉమా నువ్వు త్వరగా రారా..." అని. ఉమామహేశ్వర్ ఎడారి దేశంలో వున్నవాడు, రెక్కలు కట్టుకొని వాలాడు. ఎంతైనా అమ్మ. డెబ్బై ఆరేండ్లు అమ్మకు పెద్ద వయసే కానీ బాగా ఆరోగ్యంగా వున్నదే, ముందునుంచీ కష్టజీవి. తన రెక్కల బలంతోనే సేద్యం పనులూ, మిల్లు పనులూ ఒక్కతే చూసుకొంది. ఎన్నడూ యింత నొప్పి ఎరుగదు. ఎప్పుడో నలభై ఏండ్ల క్రింద ఒక్కసారి. అదీ భర్త ఆకస్మిక యెడబాటు జరిగినప్పుడు ఒక కుదుపు ఎదుర్కొంది. ఆ తర్వాత యిక ఏదీ ఆమెను కుంగదీలా. పగలనకా రాత్రనకా కష్టపడి సంసారాన్ని ఎక్కిచ్చింది. నిన్నటిదాకా మనవళ్ళకు వండి పెట్టింది కూడా.

హోరన్ల హోరు. మహేష్ వెనుకాముందూ శబ్దాల హోరులో వుక్కిరి బిక్కిరి అయిపోతున్నాడు. కాలం స్తంభించినట్లుందీ ప్రాంతంలో. మానవజీవితం ఒక్క కుదుపుకు గురి అవుతోంది. అది మంచికో చెడుకో తెలియట్లేదు. బస్సులూ ఆఫీసులూ సంపూర్ణంగా బంద్. రోడ్ల అంచులో అక్కడక్కడా టెంట్లు. వాటిలో రకరకాల గుంపుల వాళ్లవి రిలే నిరాహారదీక్షలూ, నిరంతర ఉపన్యాస పరంపరలూ. రకరకాల సెక్షన్ల వాళ్ళు రోజూ వీటిలో పాలు పంచుకుంటున్నారు. ఎవరెవరివో – తమకు దుఃఖం కల్గించారని దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తున్నారు. అలజడి అలజడిగా దిగులు చెందుతున్నారు. ఎవరినోట విన్నా ఒకటే విషయం.

"ఎవడబ్బసొత్తని గుండుగుత్తుగా వాళ్ళకే యిచ్చేస్తానంటాంది ఆయమ్మ. మా పిల్లలు యాటికి పోవల్లా. మాసంసారలన్నీ రోడ్లో పడాల్నా, మేం అడక్కతినాల్నా..."

"మన వుసురు తగిలే ఆరోగ్యం పాడై అమెరికాకు ఎత్తినారు.." ఆ వుక్రోషపు మాటలు వింటూ మహేష్ వూరికే వుండలేక పోయాడు.

"మరి యీ సంగతులు జరగబట్టి పదేండ్లాయ కదా, అప్పుడు వూరికే ఎందుకుంటిరి. ముందునుంచీనే మేం వొప్పుకోం అని అనాల్సింది కదా. వీళ్ళూ –

వాళ్ళూ, యింకో వీళ్ళూ – వాళ్ళూ పొత్తులు పెట్టుకొంటుంటే వూరికే వుంటిరి. అవతల పక్కోల్లకీ ఏమీ యీకుండా అన్నీ మన వాళ్ళకే యిస్తాంటేనూ న్యాయమా, అన్యాయమా అని చూడక పోతిరి... అందరూ అభిప్రాయం చెప్పిరి కాబట్టి ఆమె అభిప్రాయం ఆమె చెప్పింది...”

“అవు చెప్తుంది, చెప్తుంది, కొడుక్కి పట్టం కట్టడానికి యేమన్నా చెప్తుంది.”

“అది వుత్తమాటలేన్నా, అయినా యిన్నేండ్లు కలిసున్నాం ఏం వొరిగిందీ, బాగు పండింది పెద్దన్నలే కదా...”

“శ్రీకృష్ణ చెప్పినాడంట కదా రెండోవాడూ అభివృద్ధి అయినాడని, వాళ్ళ దగ్గరుండే మహానగరం యింకా అభివృద్ధి అయ్యిందంట గదా, అందుకే వాళ్ళు, నగరం వాళ్ళ పక్కనుందనే పక్కకు పోతామంటుండేది...”

“అదే శ్రీకృష్ణ మనం అందరికన్నా వెనుక పడినాం అని చెప్పినాడు కదా...”

“అందుకే మమ్మల్నీ అభివృద్ధి చేసి విడిపోమంటున్నాం...”

“మనం అభివృద్ధి కావాలంటే నీళ్ళు కావాలా, మన ఎదురుగా వున్న నీళ్ళను మనకివ్వకుండా తీసుకు పోతున్నది పెద్దన్నలే కదా. ఈ మాట అడగాల్సింది పెద్దన్ననే కదా...” ఆ మాటకు చుట్టూ వున్న వాళ్ళు మహేష్‌ను కొరా కొరా చూసారు. ఈ జనాలకు నిజాలు ఎప్పుడు తెలుస్తాయో, ‘జాతి’ అనే మత్తులో పడిపోయారే అనుకున్నాడు మహేష్. అంతలో ముందు వాహనాలు కదలడం ప్రారంభమైంది, మెల్లగా, మెల్లగా రెండు వైపులా కదలికలు. మహేష్ హోండా స్టార్ట్ చేసి సర్కస్ ఫీట్లు చేస్తూ కదలసాగాడు. యింతలో సెల్ ఫోన్ రింగైంది.

“హలో...”

“రేయ్ ఎక్కడున్నావ్‌రా...”

“అన్నా వుద్యమంలో యిరుక్కుపోయినా, ఏదారిలో రావాలన్నా చుట్టూ ధర్నాలే... అంతా మానవహారాలే... అక్కడికీ సి–క్యాంకు దాటుకొని కృష్ణానగర్‌లో పడి వద్దామని పోతే ‘బిర్లా ’ దగ్గర అడ్డుపడిరి. మళ్ళీ వెనక్కొచ్చి రాజీవ్ సర్కిల్‌లో యిరక్కపోతి, యిప్పుడే కదుల్తున్నాయి, వచ్చేస్తున్నా...”

“రారా... వీంది చానా మోపైంది. ‘అమ్మ’ వీడుంటే మందులు కూడా వేసుకోను అని నిరసన చేస్తోంది. ఆ మాట డాక్టర్ శ్యామలతో కూడా చెప్పింది. డాక్టర్ వాంతో మాట్లాడి ‘బయటుండండి’ అంటే, మా అమ్మా మీద నాకు హక్కులేదా. పొమ్మంటే మాత్రం పోతానా. నన్ను తిడితే మాత్రం అమ్మ కాకుండా పోతుందా, వీడొకడేనా కొడుకు అంటూ, పెద్దోడు చూరుకు వేలాడుతున్నాడ్రా. అమ్మను చానా హింస

పెడుతున్నాడు. ఏదో ప్లాన్ మీద వున్నాడ్రా.."

"వస్తున్నా, వస్తున్నా... ఆయన సంగతి తెలిసిందే గదా. నేను చూసుకుంటాలే వుండు..."

కలెక్టరేట్ ముందు మహా వుధృతంగా వుంది. వుద్యోగస్తులు రకరకాలుగా నిరసనలు తెలియజేస్తున్నారు. ముందుకు వెళ్ళేవాళ్ళూ, వెనక్కు నడిచేవాళ్ళూ, నెత్తిమీద తట్టలతో నృత్యం చేసేవాళ్ళూ, చెవిలో పూలు పెట్టేవాళ్ళూ, రోడ్డుమీదే వండీ – వార్చేవాళ్ళూ. ఇట్లా యీప్రాంతంలో ప్రజలు రోడ్లమీదకు రావడం కనీసం రెండుతరాలుగా లేదు. యిది కూడా ఒకందుకు మంచిదే. ఇప్పుడు జరుగుతున్నది ఎక్కడి కన్నా వచ్చి ఆగనీ, యీ చైతన్యాన్ని యింకోవైపుకూ తీసుకోపోవచ్చని నమ్మకమైతే కల్గుతోంది. ఆ రోజు యిది మంచి దారిలో లేకపోవచ్చు, రేపైనా పడాల్సిన దారిలో తప్పక పడుతుంది అనుకున్నాడు మహేష్.

మహేష్ కలెక్టరేట్‌ను కష్టంగా దాటుకొని, హంద్రీనది ముందు వరకూ రాగలిగాడు. ఇక అక్కడ్నుంచీ రాజ్‌విహార్ దాకా వాహనాలు నిలిచిపోయాయి.

"జై... జై... సమై...."

"నయ్ చోడింగే నయ్ చోడింగే ... హై..."

"లుచ్చా లుచ్చా... సో.... లుచ్చా లుచ్చా"

"ర్. ఫోర్ ట్వంటీ ఫోర్ ట్వంటీ.... కేసీ... ర్ ఫోర్ ట్వంటీ"

హంద్రీ బ్రిడ్జి ముందు కృష్ణదేవరాయల విగ్రహం దగ్గర అన్ని రకాల వారివీ 'టెంట్లు... రకరకాలుగా తిట్ల దండకాలూ... ఏవేవో వుపన్యాసాలతో కలగాపులగంగా ఉంది. ఎవరో లాయర్ అంటున్నాడు గట్టిగా చెవులు గింగురుమనేలా,

"యాభై యారేండ్లు సంసారం జేసి, మొగుడు యిప్పుడు ముసలి వయసులో వున్నెపుడు, శరీరంలో సత్తువంతా వాడు ఖర్చుపెట్టి యిబ్బడిముబ్బడిగా సంపద పెంచితే, దాన్నంతా మూటగట్టుకొని, సంసారం వదిలేసి పో అంటే యాటికి పోవాలా... సంపాదిచ్చే కొడుకునూ, ఆదాయమొచ్చే వనర్నూ అంతా నువ్వే పెట్టుకొని వెళ్ళిపో అంటే వెళ్ళిపోయేదానికి అంత తిక్కనాకొడుకా వీడేమన్నా... విడాకులు యిచ్చేల్లేదంటే యిచ్చేల్లేదు. యాకోర్టు యిప్పిస్తుందో చూస్తాం...."

మహేష్‌కు దిమ్మ తిరిగిపోయింది. అసలు యీ మొగుడూ పెళ్ళాల పోలికే బాగాలేదు. ముగ్గురన్నదమ్ముల పోలికైతే బాగుంటుంది. నిజానికిది ఒక తల్లీ– ముగ్గురు కొడుకుల కథ కదా అన్పించింది. వెంటనే వాళ్ళమ్మ గుర్తొచ్చింది. ఎప్పుడెప్పుడు ఆమెకు కన్పించి, ఆమె కష్టాన్ని పంచుకోవాలనీ... పెద్దన్న విషయమేందో తెలుసు

కోవాలనీ ఆరాటపడుతూంటే, యిక్కడ అడుగడుగునా అడ్డంకులే.

తమ వుమ్మడి సంసారంలో కూడా పెద్దన్నకే భాగమెక్కువ, అతని ఎత్తులన్నీ మహేష్‌కు అవగతమే, బుద్ధెరిగినప్పట్నుంచీ, తనను బాగా చూసుకునే వాడు, అది తనను అడ్డుపెట్టుకొని నడిపన్నను లొంగదీసుకోవడానికేనని అర్థమైనాక అతనికి దూరం జరిగాడు.

మహేష్ కొంచెం ముందుకు రాగలిగాడు, వాహనాలు మెల్లిగా కదలు తున్నాయి. హంద్రీ బ్రిడ్జిమీదకు రాగలిగాడు. ఇవతల ఒక టెంటు. రాయలసీమ విద్యావంతుల వేదికది. ఈ టెంటు కూడా వుందా ఫరవాలేదే, అనుకున్నాడు. వీళ్ళు కొంచెం తక్కువ మంది వున్నా గట్టిగనే అరుస్తున్నారు.

"జై ... రా.... జై. జై.... రా... సీమా."

"కబ్బు తెరవండీ కళ్ళు తెరవండీ
పెద్దన్న దురన్యాయాన్ని చూడండీ.
కళ్ళు తెరవండీ కళ్ళు తెరవండీ
యాభై యారేండ్లుగా మనకేం మిగిలింది.
కరువూ కన్నీళ్ళు"

"మనదికాని నగరాన్ని వదలనంటావు
మన నీటిని వదిలేస్తున్నావూ
కళ్ళు తెరూ కళ్ళు తెరూ"

"నయ్ చోడింగే నయ్ చోడింగే; కృష్ణా జల్ నయ్ చోడింగే"

ఈ టెంట్లో నినాదాలు ఆగిన తర్వాత, ఒక తెల్లగడ్డపు యువకుడు ఒక కథ చెప్తున్నాడు...

"అనగనగా ఒక అన్న, అనగనగా తమ్ముంటికి పోయేనంటా. వాళ్ళిద్దరిదీ ఒకే కుదురు. అన్నను చూసి తమ్ముడు సంబరపడి వచ్చిన అన్నకు మంచిగా ఖుషీ చేసేనంటా. మూడు దినాలాయా, నాలుగు దినాలాయా, వారాలాయా, అన్న కదలడంట. తమ్మునికేమో సంబరం దిగలా, రాక రాక వచ్చిన చుట్టం కలిసిన ఎప్పటిదో బంధం, నొచ్చుకోకూడదని మర్యాదలు చేసేనంటా. ఇంక మెల్లగా అన్న తమ్మునింట్లో చిన్నా చితకా పనులు చేయబట్టెనంటా, అయ్యో అన్నా ఎందుకిట్లా అని తమ్ముడంటే, తినీ కూచుంటే ఎట్లా అవుతుంది, నన్నూ వొగచేయి వేయనీ, నీ యిల్లు నాది కాకుండా పోతుందా అన్నెంటా, 'అన్నా ఎప్పుడు పోతావని' తమ్ముడు అడగలేక పోయెనంటా. నెలలు గడిచా, సంవత్సరాలు గడిచా తమ్మునింట్లో అన్న

స్తిరపడిపోయా. తమ్ముడు ఎప్పుడన్నా గట్టిగా అడగాలని చూస్తే, అన్న కనీళ్ళు పెట్టుకొని, మనిద్దరమూ ఒకే జాతి వాళ్ళం తెలుగుజాతి మనదీ– వెలుగు జాతి మనదీ, దాని ఐక్యతా ఆత్మగౌరవమూ కాపాడుకోవాల, అని ముక్కు చీదేవాడంట. అరే ! తీ ! వీడూ మనోడే వుండనీ, అని తమ్ముడు మెత్తబడేటప్పటికి, ఒక రోజు వూర్లో పంచాయితీ పెట్టిచ్చి. యీ యిల్లు నాది. మా జాతి వారసత్వంగా వచ్చింది. దీన్ని అభివృద్ధి చేసింది నేనే, కావాలంటే తమ్ముడ్ని వేరే యిల్లు చూసుకోమనండి అన్నెంటా. అది విని తమ్ముడు దిమ్మతిరిగి దబ్బున కింద పడెనంట. అక్కడితో ఆగలేదు. ఆ అన్న, మన వూర్లక్కూడా వచ్చినాడు. ప్రేమ నటించి, మన నదుల నీళ్ళు మళ్ళించుకొని పోయినాడు. మన భూములు బీళ్ళు అయినాయి. అదొక పెద్ద కథ...”

ఆగిన వాహనాల మీద నుండీ వింటున్న వాళ్ళు. “వీళ్ళు ద్రోహులు, వీళ్ళు ద్రోహులు, చెడబుట్టినారు” అంటున్నారు.

నిజాలు చెప్తే ద్రోహులా? జనాలు యీ మాయనుండీ ఎప్పుడు బయటపడతారో అనుకున్నాడు మహేష్.

రాజ్‌విహార్ సెంటర్లో మానవహారం సడలినట్లుంది, వాహనాలు కదల బారినాయి. మహేష్ కూడా రద్దీని ఛేదించుకొని, త్వరత్వరగా నోబెల్‌కు చేరినాడు. బయట రిసెప్షన్ దగ్గరే పెద్దన్న కూచున్నాడు. గోతికాడ గుంటనక్కలాగా కన్పించాడు మహేష్‌కు. ఆ పోలిక స్ఫురించినందుకు బాగా నొచ్చుకున్నాడు. ఎంతైనా వీడూ అన్న కదా, ఆమె బిడ్డడే కదా, ఎట్లా వెళ్ళిపొమ్మంటాం, వుండనీ, అనారోగ్యం పాలైన అమ్మను చూడనీ, వీడి వంతు సేవ వీడూ చేయనీ, అనుకుంటుంటే.

“అరే, మహేషూ, ఏందిరా యిదీ, ఆయమ్మ నాతో మాట్లాడనే మాట్లాడదు. కన్పిస్తానే నాకు మనశ్శాంతి లేకుండా చేయడానికి వచ్చినావా... వెళ్ళిపో అంటుంది. వీడు.... నడిపోడు యేవో వశీకరణ మందులు పోసినాడురా... ఆమెకు సరియైన ట్రీట్‌మెంట్ యిప్పించాలా, మీకు తెలీదు, సైక్రియాట్రిస్టుకు చూపించి ఆ మందులు వేయాలా, మన అమ్మమ్మ కూడా యింతే యిట్లాగే ప్రవర్తించేది నేను చూసినా... అమ్మక్కూడా ఆరోగమే...” చెప్పుకుపోతున్నాడు. మహేష్‌కు రెండు నిమిషాల కిందట, అన్న మీద కల్గిన అభిమానం మాయమైంది.

‘ఈయన మారడు, యీయనకు అనుకూలంగా వుంటేనే మనుషలు, లేదంటే వాళ్ళకు లేనివన్నీ ఆపాదిస్తాడు... అమ్మ సైకిక్ మారిందంటావా... అరే ఎంతకు తెగిస్తావురా...’! అనుకున్నాడు. ఆయనకు సమాధానమివ్వకుండా లోనికి వెళ్ళాడు. మహేష్‌ను చూస్తూనే అమ్మ కళ్ళు మెరిసాయి. మొఖంలో ఎక్కడలేని వెలుగు...

రెండు చేతులు చాచి కొడుకును పుణికింది. అస్పర్శతో మహేష్ పులకించి పోయాడు. వొక్కసారిగా దుఃఖం కట్టలు తెంచుకుంది... వయసును మరచి ఎక్కిళ్ళు పెట్టాడు. తర్వాత ఒక్క క్షణంలో అమ్మ మొఖంలో కవళికలు మారుతుంటే, మహేష్ ఆశ్చర్యంగా వెనుదిరిగి చూస్తే, నీడలా నిలబడిన రాఘవరావు. అమ్మ వికృతంగా అరుస్తూ వాడిని పొమ్మంటూ, చేత్తో సైగ జేసింది. ఎందుకు అతడ్ని చూస్తే అమ్మ అట్లా ప్రవర్తిస్తుంది. స్వంత కొడుకే కదా! మహేష్‌కు గతమంతా గిర్రున తిరిగింది.... ఈ పెద్ద కొడుకు ఏనాడన్నా యింటి బాధ్యతలు మోసాడా, ఇద్దరు తమ్ముళ్ళూ, యిద్దరు చెల్లెళ్ళూ, వాళ్ళు బాల్యంలో వుండగానే, పెద్ద సంసారానికి దుడిసి పెట్టాల్సి వస్తుందని, రెక్కలొస్తానే ఎగిరిపోయే పక్షిలాగా, వేరే సంసారం పెట్టాడు. అమ్మా నాన్నా నలుగురు పిల్లలూ ఒక సంసారం, అన్నా వదినా వాళ్ళ కొడుకుతో ఒక సంసారం. అప్పుడే ఆస్తి కూడా పంచుకున్నాడు. వ్యాపారాలు చేసాడు. వచ్చిన లాభాలను మద్రాసు సినిమా కంపెనీలో పెట్టాడు. అక్కడ నష్టాలొచ్చాయని హైద్రాబాద్ మకాం మార్చి ఫ్యాక్టరీ పెట్టాడు. తండ్రి మరణిస్తే చుట్టపు చూపుగా వచ్చి పరామర్శించాడు. తమ్ముళ్ళు, స్వంతంగా సంబంధాలు వెదికి యిద్దరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేస్తేనూ చుట్టపు చూపుగానే వచ్చి, ఎక్కడ డబ్బులు ఆడుగుతారోనని, మద్రాసు సినిమా నష్టాల్ని తలుచుకొని ఎక్కిళ్ళు పెట్టాడు. అమ్మ ధైర్యంగా నిలబడి చెట్టంత సంసారాన్ని నిలబెట్టుకుంది. చేదోడవ్వాల్సిన పెద్ద కొడుకు సారం పీల్చుకునే పురుగు అయినందుకు నొచ్చుకుంది. ఏనాడూ నోరిడిచి అడగలా. హైదరాబాద్‌లో కంపెనీ పెట్టినపుడు, పెద్దన్న , తండ్రి తనకు ఆస్తి సరిగా పంచివ్వలేదని తగువు పెట్టుకొని, బంధువులతో ఏడ్చీ మొత్తుకొని పంచాయితీ పెట్టించి యింకొంత గుంజాడు. తండ్రిలేని పిల్లలే... నిరంతరం కష్టపడుతున్నతల్లి చాటు వాళ్ళే.. వాళ్ళకేమైనా సహాయం చేద్దాం, అనుకోకుండా... వికారంగా యీ పంచాయితీ లేంది అని అమ్మ ఆరోజు నుండీ అతణ్ణి పురుగును అసహ్యించుకున్నట్టు అసహ్యించు కుంటుంది. ఆమె అలా చేయడంలో న్యాయముంది.

మహేష్ ఇంజనీరింగు చదివి వుద్యోగాన్వేషణలో వున్నప్పుడు, పెద్దన్నకు నమ్మకమైన పనివాడు కావాల్సి వచ్చి, అతన్ని ఫ్యాక్టరీకు మేనేజర్‌ను చేసుకున్నాడు. చాలా కొద్దికాలంలోనే, మహేష్, తను అన్న ఫ్యాక్టరీలో కేవలం కావలికుక్కలాగా వున్నానని గ్రహించి, అన్నకు గుడ్‌బై చెప్పి ఎడారి దేశాలకు ఎగిరిపోయాడు. 'నేను పంపిస్తా, నువ్వు కష్టపెట్టుకోవద్ద'ని అమ్మను అనునయించి, పెద్దన్నతో పాటు బయటికొచ్చి, ఆసుపత్రి క్యాంటీన్‌లో నిల్చున్నారు. ఎదురుగా రోడ్డు – రద్దీలేనిది కాఫీ ఒక సిప్ తర్వాత అన్న ప్రారంభించాడు....

"చూడ్రా మహేష్ అమ్మపేరుమీద చాలా ఆస్తి వుంది, అంతా విడే రాయించుకునేలా వున్నాడు. జాగ్రత్త పడదాం.... అమ్మను సైక్రియాటిస్టుకు చూపించి, ఆ మందులు వాడితేనే, ఆ నడిపోడి మాయనుంచీ బయటపడుతుంది. నువ్వు కోఆపరేట్ చేస్తే, అమ్మను నేను తీసుకెల్తా, వీందగ్గర ఏ సౌకర్యాలూ లేవు. అమ్మకు ఆ మందులు వాడి మామూలు మనిషిని చేద్దాం... నువ్వు వూ అనూ, మనం యిద్దరం, వాడొకడూ, మనల్ని యేం చేస్తాడు, ఆస్తి మనం రాయించుకుందాంరా..."

వికృతంగా మాట్లాడుతున్నాడు. వీడు కొడుకుగా ఎలా పుట్టాడు. తల్లి మీద గౌరవం లేదు. ప్రేమ లేదు. తమ్ముళ్ళపట్లా, చెళ్ళెళ్ళ పట్లా అభిమానం లేదు, అనుబంధం లేదు, వీడికి కావల్సింది కేవలం డబ్బేనా... ఎలా సాధ్యం యింతటి, మృగ ప్రవృత్తికి మించిన – స్వార్థం... ఎట్లా సాధ్యం. తల్లిని మోసం చేస్తూ, తమ్ముళ్ళను పణంగా పెట్టి, కేవలం సంపద గడించడం మాత్రమే లక్ష్యం... యిది ఎట్లా సాధ్యం... మహేష్‌కు అన్న పట్ల ప్రేమ, కోపం, అసహ్యం అన్నీ కలగలసి ఎగిసెగసి పడుతున్నాయి....

"అరే మహేష్ ఏరా మాట్లాడవు... నిన్ను ఎలా చూసుకున్నారా... నీ ఇంజనీరింగ్ అయిపోయాక, ఎవ్వరూ నిన్ను ఆదుకోనప్పుడు, యీ మట్టి పిసుక్కునే నడిపోడు, దమ్మిడీకి కొరగానోడు, నీకు ఏం సాయం జేసాడ్రా, నేను గదరా నిన్ను మన ఫ్యాక్టరీకి మేనేజర్ను చేసాను.... అది మరచి పోవద్దురా... అంతే కాదురా నువ్వు ఎమిరేట్స్‌కు పోవడానిక్కూడా నా స్నేహితుడే కదరా సాయం జేసింది. నీ అభివృద్ధిలో నన్ను వుపయోగించుకొని, అమ్మలా నువ్వూ నన్ను పుల్లలా తీసి పారేయొద్దురా...

నువ్వెట్లానూ బాగా సంపాయిచ్చుకుంటావు, నాకు తెలుసు, ఇది నీకెట్లానూ లెక్కలోకి రాదు. అదేదో నాకిచ్చెయిరా... ఎందుకు వాడికి వదిలేస్తావు"

మహేష్‌కు మండిపోయింది... 'వీణ్ణి దేంతో కొట్టాలా... ఎడమకాలిదైనా సరే తాకడానికి వీడు అర్హుడేనా, పురాతన నైపుణ్యం నిండిన మానవ హస్తాలతో, ఏ పొలం దున్ని పంటలు పండించిన ఎద్దో మరణించీ యిచ్చిన చర్మంతో తయారైన దాంతో కొడితే, ఆ మానవ హస్తాల్నూ ఆ ఎద్దునూ అగౌరవపరచినట్లు కాదూ... యీ అధిపత్యపు పెద్దన్న గాడిని.... వీడ్ని... వీడ్ని..." అనుకొంటుంటే తిరిగి అన్న కొనసాగించినాడు.

"అరే మహేషూ... నీకు నేను నీచంగా కనబడుతున్నాను కదా... చిన్నప్పుడే ఆస్తి పంచుకుని పోయి, మళ్ళీ మళ్ళీ ఆస్తికోసమే వస్తున్నానని కోపం కదా.... నా పరిస్థితి నీకు తెలీదురా... నాయనిచ్చిన ఆస్తి నేను పొగొట్టుకున్న దాంట్లో ఎంతరా... యిల్లు పంచిచ్చిన ఆస్తిని మద్రాసులో పెట్టిని అది కాస్తా జారిపాయా, హైదరాబాద్

కొస్తిని, యేందో ప్రశాంతంగా వుందనుకుంటే యిప్పుడు యీ వుపద్రవమొచ్చా.... లాభాలొస్తాయని, ఫాక్టరీ లాభాలన్నీ, రియలెస్టేట్‌లో పెడ్తిని. మూటాముల్లే సర్దుకొని పొమ్మంటున్నారు. యీ విభజనతో బిజినెస్ అంతా డౌన్ అయిపాయ... రేపు యేం అవుతుందో తెలీదు. నేనైతే నిండా మునగడం గ్యారెంటీ, మళ్ళీ యిక్కడికే రాక తప్పదేమో, అమ్మపేరుమీద ఆస్తిలో నాకు భాగం రావాలా, దాంతో యీడనే వ్యాపారం చేద్దామను కుంటుండా... నీ సహాయం కావాలా మనిద్దరం వొకటైతే... యీ నడిపోన్ని వొంచుకోవచ్చు.... ఏమంటావ్...."

మహేష్ తాగుతున్న కాఫీ, గొంతును పొలమార్చింది.

"నువ్వు నిఖార్సైన పెద్దన్నలాగే మాట్లాడుతున్నావన్నా... నీ ఆశకు అంతం లేకుండా వుంది, నిన్నెవడు మద్రాసులో నష్టపొమ్మన్నాడు... ఎవడ్ని అడిగి హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టావు, దానికి మేం బాధ్యులమా, ఫాక్టరీలో లాభాలొచ్చిన్నాడు మాకేమన్నా పంచావా, నీ నష్టాలు గురించి మేం వినడానికి, అయినా ఎంత సేపూ నీ వ్యాపారాలూ, నీ లాభాలూ మాత్రమేనా, అన్నదమ్ములూ, అనుబంధాలూ, వాళ్ళ బాధలూ, భద్రతలూ నీకు పట్టవా. యింత స్వార్థంగా ఎట్లా తయారయ్యావు.... యింకా నన్ను నువ్వు బాగా చూసుకున్నావా, నీ ఆత్మను అడుగూ, నీ పొలాలకు నీళ్ళు పారించే పెద్ద జీతగానిలాగా కాదూ నువ్వు నన్ను చూసుకుందీ... యింకా అంతకంటే హీనంగా... అందుకు నేను నీకు రుణపడి వుండాలా... తల్లినీ, తమ్ముళ్ళనీ పిచ్చివాళ్ళను చేసి దోచుకోవాలని చూస్తున్నావే... సిగ్గులేదూ... నీకెట్లాగూ లేదులే... నీతో సమైక్యంగా జతకట్టడానికి నాకూ లేదనుకున్నావా... వెళ్ళు యిక్కడ్నుంచీ... నువ్వూ నీ సినిమా కన్నీళ్ళూ... నా దగ్గర నడవవు.... యింత నటనా... యింత నటనా..."

పెద్దన్న రాఘవ రావు బిత్తరపోయాడు. తమ్ముడిలో యీ తిరుగుబాటు అతడు వూహించ లేకపోయాడు. వీడు అమాయకుడైనా, మంచి దక్షుడు, వీడ్ని బుట్టలో వేద్దాం, నమ్మిన బంటుగా మలచుకుందాం అనుకున్నాడు. ఇట్లా అవుతుందనుకోలా... అయినా ఆశ చావక.

"మన్నిద్దరం వొకటిగా వుండాల్సిన అవసరం వుందిరా... యిద్దరికీ ప్రయోజనముంటుంది. ఆలోచించు..." అన్నాడు.

"ఛీ, వెళ్ళూ... మాతృద్రోహీ..." మహేష్ కళ్ళు నిప్పులు కురిపించాయి.

వినలేకపోయాడు రాఘవరావు. 'ఛా కథ అడ్డం తిరిగిందే' అనుకుంటూ వెనుదిరిగాడు.

‘ఎదురుగా రోడ్డుమీద “జై రాయలసీమ” నినాదాలు చేస్తూ ఒక చిన్న గుంపు వెళ్తోంది.

“పెద్దన్నల మాయమాటలు; నమ్మకండి నమ్మకండి”

“కృష్ణాజలాలు రాయలసీమ; జన్మహక్కు జన్మ హక్కు”

“పెద్దన్నల మాయోపాయాలు; తిప్పి కొట్టండి తిప్పి కొట్టండి”

ఆ నినాదాలు వింటుంటే మహేష్ ఆత్మ శాంతించింది

పెద్దన్న కనుమరుగవగానే, అమ్మను చూడ్డానికి ఆసుపత్రిలోకెళ్ళాడు.

# కాంత పున్నం వెన్నెల

## పద్మకుమారి

కాంత నిస్సత్తువగా కూర్చుండిపోయింది.

తన ఎదుట పదడుగుల దూరంలో అప్పుడే పూడ్చిన బొంద. దాని పైన నాలుగు మూలల బరువు పెట్టి కప్పిన ఎర్రగుడ్డ. ఆ పక్కనే చెట్టుకు తగిలించిన జెండాలు. అవి గాలికి విషాదంగా రెపరెపలాడుతున్నాయి. ఆ ప్రాంతమంతా పచ్చని పొలాలు, కనుచూపు మేర అడవి, కొండలు.

ఆమె బొంద వైపే చూస్తూ ఉంది.

ఉదయం పదకొండు గంటలు. కాని టైం ఎంతైందో ఆమెకు తెలియదు. ఒకసారి తలెత్తి పైకి చూసి, సూర్యుడు తనకు ఎడమ చేతి వైపునే ఉన్నాడనుకుంది. ఎంతో యాతనపడి ఇక్కడి చేరుకుంది. ఊరి పొలిమేరల్లోకి రాగానే అంతా అయిపోయిందని, అందరూ వెళ్లిపోయారని అర్థమైంది.

ఆ క్షణాన ఆమె చుట్టూ గాలిలో స్మశాన వైరాగ్యం ఆవరించినట్టనిపించింది. అచేతనంగా అక్కడే కూర్చుండిపోయింది. కానీ ఆలోచనలు చాలా దూరం సాగుతున్నాయి.

ఇప్పుడు ఊళ్లోకి వెళ్లాలా? అక్కడ తనకెవ్వరూ తెలియదు. అసలు నువ్వెవ్వరు అని అడిగితే ఏం చెప్పాలి? దళంలో ఉన్నప్పుడు ముక్కూ మొహం తెలియని వాళ్లూ వస్తే ఊళ్లలో వాళ్లు మర్మం ఇచ్చే వాళ్లు కాదు.

ఊళ్లోకి వెళ్లాలనే ఆలోచనను విరమించుకుంది.

ఎంతో ఆశతో ఇక్కడికి బయల్దేరింది. రవిని కనీసం కడ చూపు అయినా చూడాలని ఆరాటపడిరది. అదీ దక్కలేదు. రవి అప్పుడు చెప్పిన మాటను ఆయనతోనే కలబోసుకొని, ఒక దారి వెతుక్కోవాలనుకుంది. ఆ అవకాశమే రాలేదు. నిజానికి ఇప్పుడు రవి కోసమే కాదు, వాళ్లూ కలుస్తారనే ఆశ. వాళ్లు వచ్చి వెళ్లారనే ఆనవాళ్లను

కాంత ఆ జెండా రెపరెపల్లో పోల్చుకుంది.

“ప్చ్, ఈసారి కూడా కలుసుకోలేకపోయాను...”

కాంత ఆలోచనల నుంచి బైటికి వచ్చింది. సూర్యుడు తల మీదికి వచ్చాడు. తన నీడ తనలోనే కలిసిపోతున్నది. లేచి ఊరి దారిపట్టింది.

## 2

నడుస్తూ ఉన్న కాంత కాళ్లకు చల్లని నీళ్లు తాకడంతో ఆగిపోయింది. చుట్టూ చూసింది. సన్నగా పారుతున్న వాగు అడ్డంగా వచ్చింది. నీళ్లను, తన ఒంటిని చూసుకుంది. ఆమె వంటి మీద చెమట ధారలు కట్టి తెల్లని చారికలు కనిపిస్తున్నాయి. కిందికి వంగి కాళ్లూ చేతులు, ముఖం కడుక్కుంది. దోసిలితో నీళ్లు తాగింది.

అప్పటికి శరీరం... దాంతోపాటు మనసూ కొంచెం కుదుటపడ్డాయి.

నేరుగా వెళ్లి ఉంటే రోడ్డు వచ్చేది. అక్కడి నుంచి ఆటోలో సాయంకాలానికల్లా తన ఊరు చేరుకొనేది. కానీ కాంత ఆ దారి మధ్యలో ఓ పక్కగా ఉండే మేనత్త ఊరికి వెళ్లాలనుకుంది. ఈ రాత్రి అక్కడే ఉండి తెల్లారి పోవాలనుకుంది. దాంతో నడుస్తోంది. కడుపులో ఏదో బాధగా ఉంది. అది ఆకలో, దు:ఖమో తెలియడం లేదు. అయినా ఆమెకు అలాంటి బాధ మామూలే. ఈ వైపు మళ్లీ ఎప్పుడు వస్తానో.. ఒకసారి కలిసిపోతే ఎందుకైనా మంచిది అనుకుంది.

ఇంకొంచెం దూరం వెళ్లేసరికి ఆ అడవి దారుల్లో రెండు వైపుల నుంచి వచ్చిన పశువులు అక్కడ కలిశాయి. అవి ఊళ్లోకే నడుస్తున్నాయి. వెనుక ఎవరైనా ఉంటారేమో అని తిరిగి చూసింది. ఎవ్వరూ కనిపించలేదు. పశువుల కాపర్లు మందలో అదిలిస్తున్నారు. వాళ్లు ఎక్కడున్నారో రేగిన దుమ్ములో తనకు కనిపించడం లేదు. పశువుల వెనుకే నడిచింది.

సాయం సంధ్య... ఇండ్ల కప్పుల మీద పొగ లేస్తోంది. ఊళ్లోకి రాగానే మంద పలుచబడసాగింది.

మేనకోడల్ని చూసి సమ్మక్క ఒక నిమిషం బిత్తరపోయింది. ఏం జరిగిందో అనుకుంటూ ఎదురుగా వెళ్లింది.

“ఏందే పిల్లా! అంతా మంచిదేనా?” అని అడిగింది. అత్త కంగారు కాంతకు అర్థమైంది.

“జర పనుండి తుపాకుల గూడేనికి పోయి వస్తున్న” అంది.

సమ్మక్కకు అంతా అర్థమైంది. “రవన్న కాడికి పొయి వస్తున్నవా? ఇటొచ్చింటే

నేనూ నీతో వచ్చేదాన్ని" అన్నది.

కాంత ఏమీ మాట్లాడకుండా కాళ్లు కడుక్కోని లోపలికి వెళ్లింది. బయటి నుంచే సమ్మక్క "పోరీ! జెర సక్కెర, చాయి పత్తా తెస్త. పొయిలో కట్టెలు ఎగెయ్యి" అంటూ బయటకు వెళ్లిపోయింది.

కాంత మూలనున్న పొయి దగ్గరికి వెళ్లి కూచుంది. బుసబుస పొంగుతున్న అన్నంపై మూత తీసి పక్కన పెట్టింది.

మనసేమీ బాగా లేదు. మండుతున్న నిప్పుల్లాగా, మరుగుతున్న అన్నం ఎసరులాగా ఉన్నది. "ఇంక ఎన్ని రోజులు వెతకాలి? అడవిలో ఉన్న వాళ్లను కలవడం తనకు కష్టం కాదు. ఎప్పుడూ కూతవేటు దూరంలో ఉన్నట్టే. ఇప్పుడంటే ఆలస్యమవుతోంది. కానీ వీళ్లను కలవడమే ఎట్లనో తెలియడం లేదు."

%పొయిలోకి కట్టెలు ఎగదోసింది. మంట గుప్పుమంది.

సమ్మక్క దుకాణానికి పొయిందనేకాని కాంత గురించే ఆలోచిస్తోంది. "ఈ పిల్ల బతుకేంది ఇట్లయింది ? ఈ తిరగడం ఏంది? ఇంటికి కాకుండా, అడవికి కాకుండా. ఎటో ఒక దిక్కు తేల్చుకొని ఉంటే ఈ యాతన అన్నా తప్పేది. దాని మెడకు ఒక పోరి ఆయె..అసలు ఆ పిల్లే లేకుంటే దీని బతుకు ఇట్లయ్యేదే కాదు.." అనుకుంటూ ఇంటికి తిరిగి వచ్చింది.

అత్త అడుగుల చప్పుడుకు కాంత తిరిగి చూసి, అక్కడి నుంచి కదిలింది.

సమ్మక్క పొయ్యి పక్కనే గోడకున్న దీగూట్లో చెక్కర, చాయిపత్తి పెట్టి, అన్నం మీది మూత తీసి చూసి గిన్నె దించేసింది.

కాంత అక్కడే ఉన్న గిన్నె తీసుకొని రెండు గ్లాసులు నీళ్లుపోసి అత్త చేతికి అందించింది.

"మీ చెల్లె ఎట్లుందే?" అని అడిగింది సమ్మక్క.

తెల్లారంగా లేచి వస్తున్నప్పుడు గుర్రుగా చూసిన నీల ముఖం కాంతకు గుర్తుకు వచ్చింది.

"ఆ దానికేం మంచిగనే ఉంది" అంటూ అత్త చేతికి ఖాళీ గ్లాసులు ఇచ్చింది కాంత.

"చిన్నపిల్ల బడికి పోతున్నదా?" సమ్మక్క

"పోతందత్తా. నీవు చూడక శానా దినాలాయెగదా. ఇప్పుడు పెద్దగైంది. ఒకసారి రారాదూ" అని చాయి గ్లాసు తీసుకుంది.

"కూర అయిందాత్తా?" అని అడుగుతూ చాయ్ గుక్క పీల్చుకుంది.

"పొద్దున నూరిన చింతపండు తొక్కు ఉంది. చిక్కుడు కాయల కూర ఉంది.."

"కాయలు బాగనే కాస్తున్నయా?" అంటూ కాంత వాకిట్లోకి వచ్చింది. వెనుకే సమ్మక్క కూడా.

ఇంటి చుట్టూ ఉన్న దడికి పెనవేసుకొని చిక్కుడు కాయలు, పూత నిండుగా కనిపించింది. జాలారి బండ దగ్గర వంకాయ చెట్లు, తమాట చెట్లు గుత్తులు గుత్తులుగా కాశాయి. వాటి పక్కనే ముద్ద బంతి చెట్లు విరగబూశాయి. చారెడేసి మందాన సీతమ్మ జడ పూలు ముదురు ఎరుపులో ఉన్నాయి.

సందె చీకట్లు ముసురుకున్నాయి. చలి మొదలైంది. అరుగు మీద అట్లాగే కూర్చున్నారు.

"మామ ఏడి? ఇంకా రాలేదు" అని అడిగింది కాంత.

"పని మీద పోయిండు. రాత్రికి వస్తడో రాడో.." అన్నది సమ్మక్క.

దారిన వెళ్తున్న ఆడవాళ్లు అత్తా కోడళ్లను చూసి లోపలి దాకా వచ్చారు.

"ఏమే కాంత.. మంచిగున్నవ? బిడ్డ మంచిగున్నదా?" అని ఒకామె అడిగింది.

ఆ మాటకు కాంత బదులు ఏమిస్తున్నదో వినకుండా అరుగు మీద కూచొని, ఆమె చెవిలో "తుపాకుల గూడెం పోయి వస్తున్నవ బిడ్డా" అని అడిగింది.

దానికి కూడా కాంత ఏమంటుందో వినకుండా మళ్లీ తనే "ఈ కాల్ల నొప్పులు లేకుంటే నేనూ పొయ్యేదాన్నే. ఊర్లో సగం మంది పోయింద్రు. పొద్దుగాల కార్యం కావడంతో, తిరిగి వచ్చి పనులకు కూడా అందుకున్నరు. శానా గూడేల నుంచి, పల్లెల్నుంచి జనాలు కలిసింద్రంట. అన్నీ కనుక్కున్న" అన్నదామె.

కాంత "ఆ... ఊ" అంటూ ఉంటే... ఆమె ఇంకా కొనసాగించింది.

"కాలం మారిపోయింది బిడ్డా. ఇప్పుడు చావుకు పోవుడంటే బయం లేదు. శానా మంది కలుస్తున్నరు. బయటి నుంచి సంగపోల్లు వచ్చింద్రంట. ఊరేగింపు దీసింద్రంట..." అన్నది.

కాంత అప్పట్లో దళంతోపాటు ఇదంతా తిరిగింది. ఆ సంగతులు అన్నీ గుర్తుకు వచ్చాయి. చాలా మారిపోయింది. ఎవ్వర్నీ నమ్మడానికి లేకుండైపోయింది. ఎప్పుడు ఎక్కడి నుంచి శత్రువు వచ్చి పడతడో తెలియదు. ఊళ్లలో సంఘాలు లేకుండా చేసిండు. మనుషులను రకరకాలుగా చీలదీసి ఒకరికొకరు కాకుండా చేసిండు. ఎక్కడికక్కడ అల్లుకొని పోయిండు. కదలకుండా మెదలకుండా చేసిండు. అయినా ఎక్కడ శవంపడ్డా జనాలు ఉసిళ్లపుట్ట లెక్క కదులుతున్నరు. కన్నీళ్లను పంచుకోడానికి ఎగబడుతున్నరు.

కాంత కొన్ని నేరుగా చూసింది.. కొన్ని విన్నది.

ఇంతలో మామ రాజయ్య వచ్చాడు.

"మామా మంచిగున్నవ? నువు రావేమో అన్నది అత్త.." పలకరించింది కాంత.

"ఆ.. రాననుకున్నగాని, పని అయింది..." అని ఆయన భుజం మీది తువాల దులుపుకొని, అక్కడున్న గడంచను వాల్చుకొని కూచున్నాడు. అది కిర్రున శబ్దం చేస్తూ అటూ ఇటూ ఊగి ఆగిపోయింది. అందరి చూపు దాని కోళ్ల మీదే పడిరది.

ఆయనకు యాభై ఏళ్లుంటాయి. దృఢంగా ఉంటాడు.

"ఏంది పిలగా.. గడంచ ఇరగ్గొడతవా?" అంటూ ఆ వచ్చిన ఆడవాళ్లలో ఒకామె పరాచికాలాడిరది.

రాజయ్య అదేమీ పట్టించుకోలేదు. సమ్మక్క నీళ్లు తెచ్చిస్తే తాగాడు. గ్లాసు కిందపెడుతూ.. తనలో తాను మాట్లాడుకుంటున్నట్లుగా, "ఎంత అన్యాయం..?" అన్నాడు.

అక్కడున్న వాళ్లకు అర్థమైపోయింది. ఆయన రవి గురించి మాట్లాడుతున్నడని. నిన్న పొద్దటి నుంచి ఊళ్లో ఏ ఇద్దరు కలిసినా ఇదే ముచ్చట. అందరికీ ఏదో పోగొట్టుకున్నట్లు ఉంది.

రాజయ్య ఆ మాట అంటూ కోడలి కళ్లలోకి చూశాడు. "అక్కడికి పొయి వస్తున్నవా?" అన్నట్లు.

ఆ తర్వాత తనే మొదలు పెట్టాడు.

"మొన్న తెల్లారంగ ఒక ఊళ్లో మాట్లాడి వచ్చేటప్పుడు ఎంటపడ్డరంట. ఇప్పుడు ఎక్కడ చూసినా వందల మంది కదా. దేశంలోని పోలీసులంతా ఈడికే వచ్చిరి. మనోల్లు కాల్చుతూనే తప్పించుకున్నరంట. ఆ కొండ పక్కనే ఉన్న కోయ సింగన్న చేన్లకి పోయిన్రంట. పొద్దుగుంకినంక అలికిడి లేదని బయటికి వచ్చిర్రంట. వీళ్లు బయటికి రాగానే వందల మంది మీదపడి కాల్చింర్రంట. మంచె మీద ఉన్న సింగన్న కళ్ల ముందే ఇదంతా జరిగిందంట. మిగితా వాళ్లు తప్పించుకున్నా, రవన్నను కాపాడుకోలేకపోయింర్రు"

%మామ మాటలనే కాంత వింటూ ఉండిపోయింది. అక్కడున్నవాళ్లంతా ఊపిరి బిగబట్టి ఆయన చెప్పేది విన్నారు.

కాంతకు అప్పుడు అర్థమైంది. ఈ సమాచారం కనుక్కోడానికే మామ పొయి వచ్చాడని. అందుకే మట్టి చేయడానికి వెళ్లినట్టు కూడా లేదని. నీటి మడుగులో రాయిపడ్డట్లుగా అలలు అలుగా లోపలా బయటా ఈ వాతావరణం యుద్ధ తీవ్రతను

తెలియజేస్తున్నది.

చలి తీవ్రత పెరిగింది. ఆ వచ్చిన ఆడవాళ్లు లేచి ఇళ్లకు బయల్దేరారు. వీళ్లు ముగ్గురూ ఇంట్లోకి వచ్చారు.

అన్నం తింటూ.. "ఈ రోజైనా వాళ్లు కలిసింద్రా?" అని రాజయ్య కోడల్ని అడిగాడు.

నోట్లో అన్నం ముద్ద పెట్టుకోబోతున్న కాంత ఆగిపోయింది. తల అడ్డంగా తిప్పుతూ, "నేను పోయేటప్పటికే అందరూ వెళ్లిపోయింద్రంట. ఈ పట్నపోళ్లను పట్టుకోవడం మనకేడైతది? ఈసారైనా ముందుగా పోవాలి" అన్నది కాంత.

కాసేపు ఆగిన తర్వాత "నువ్వే ఏదైనా ప్రయత్నం చేయి మామా" అన్నది.

రాజయ్య ఏమీ మాట్లాడలేదు.

అన్నం తిని అత్తా కోడలు ఒక మంచం మీద పడుకున్నారు. రాజయ్య ఇంకో మంచంలో పడుకున్నాడు. ఆయన కాంత గురించే ఆలోచిస్తున్నాడు. పిల్లలు లేని తమకు కాంతే ఆ లోటు తీర్చింది. చిన్నప్పటి నుంచి ఇక్కడే పెరిగింది. పెద్దదైనంక ఊరుపోయింది. సరిగ్గా పదేళ్ల కింద ఇట్లాంటి చలికాలంలో వరి కోతలప్పుడు దళంలోకి వెళ్లిపోయింది. కాంతకు పాటలంటే ఇష్టం. పొలాల్లో, బతుకమ్మ పండుగల్లో పాడేది. ఆ తర్వాత దళం ఏ ఊరికి వచ్చినా ఆమె గొంతు మార్మోగిపోయేది.

ఆదివాసీ, మైదాన సరిహద్దు గ్రామాల్లో ప్రజలు భూములను సాధించుకోడానికి, షావుకార్ల, భూస్వాముల, అధికారుల ఆగడాలను ఎదిరించడానికి ప్రజలకు దళం అండగా నిలబడిరది. ఆటుపోట్ల మధ్యనే ప్రజాపోరాటాలను ఉన్నత రూపంలో మలచాలనుకుంటున్నది. ప్రజల అధికారం కోసం గ్రామరాజ్య కమిటీలు ఏర్పడుతున్నాయి. అన్నిట్లో మహిళలు కదులుతున్నారు. కాంత వీటిలో భాగమైపోయింది.

కాంత లోపలికి వెళ్లిపోయిన ఆర్నెల్లకు రాజయ్య ఆమెను కలిశాడు. ఎంత మారిపోయిందో. యూనిఫాంలో తుపాకి పట్టుకొని సెంట్రీ చేస్తూ కాంతే దళంలో అందరికంటే ముందు కనిపించింది.

ఆట్లా ఆలోచిస్తూ.. అలసటతో నిద్రలోకి జారుకున్నాడు.

కాంత పడుకుందేగాని ఆమె ఆలోచనలన్నీ పున్నం చుట్టూ తిరుగుతూ ఉన్నాయి.

సరిగ్గా తొమ్మిదేళ్ల కింద.. అంటే తను లోపలికి వెళ్లిన ఏడాదికి పున్నం కలిశాడు. తను ఆ జిల్లా కమిటీ సభ్యుడు. ఒకరంటే ఒకరికి ఇష్టం కలిగింది. ఆ తర్వాత ఏడాదికి పెళ్లి చేసుకున్నారు. పున్నం వాళ్ల గూడెం దళం ఏరియాలనే ఉంది. ఇద్దరు

అక్కలకు, ఇద్దరు అన్నలకు అతనంటే ప్రాణం. అప్పటికే ఉద్యమంలోకి వచ్చి నాలుగేళ్లయింది. గురుకుల హాస్టల్లో ఉండగా అక్కడికి దళం వచ్చేది. అట్లా పరిచయాల్లోకి వెళ్లి లోపలికి వెళ్లిపోయాడు. ఒకరు ఆదివాసీ తెగ నుంచి, మరొకరు దళితకులం నుంచి వచ్చినా విప్లవ జీవితంలో సులభంగానే కలిసిపోయారు.

పున్నం చేయించుకున్న వాసెక్టమీ ఆపరేషన్ ఫెయిల్ కావడంతో కాంత గర్భవతి అయింది. దీంతో అబార్షన్ చేయించుకోవాలనుకుంది. కానీ నిర్బంధం. ఎటూ కదలడానికి వీల్లేదు. అట్లాగే నెలలు గడిచిపోతున్న కొద్దీ కాంతకు ఆందోళన మొదలైంది. ఇది అనుకున్నది కాదు. ఆశించిందీ కాదు. బయటపడ్డం ఎట్లాగో తెలియడం లేదు. దీనికి తోడు రాను రాను నీరసం పెరిగిపోయింది. దళంతో నడవడం, పనులు చేయడంలో వెనకబడిపోయింది. ఒంట్లో ఇట్లా ఉంటే కడుపు తీసేస్తే పెద్ద ప్రాణానికే ప్రమాదం అని గూడెంలో ఒక మంత్రసాని చెప్పింది. స్క్వాడ్ డాక్టర్ వసంత కూడా ఇదే మాట చెప్పింది. ఇంత ఆందోళనలోనూ పుట్టబోయే బిడ్డ గురించి ఆమెలో ఎన్నెన్నో ఊహలు మొదలయ్యాయి. తల్లిని కాబోతున్నాననే ఆలోచనతో లోపల్లోపల ఆనందంగా ఉంది. చివరికి కొంచెం వీలు దొరకగానే డాక్టర్ దగ్గరికి పంపించారు.

రేపు ప్రయాణం ఉండగా, రాత్రి పున్నం చెప్పిన మాటలు కాంతకు ఎప్పటికీ గుర్తుంటాయి.

కాంత పుట్టబోయే బిడ్డపట్ల ప్రేమ పెంచుకుంటోందని, అది సహజమేనని పున్నంకు అర్థమవుతోంది. కానీ ఉద్యమంలో అది సాధ్యంకాదు. అతి సహజమైన మాతృత్వంపట్ల కూడా పార్టీ కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సిందే. అందుకే ఇలా చెప్పాడు.

“కాంతా..నీవు బిడ్డపట్ల మమకారం పెంచుకుంటున్నావని నాకు అర్థమవుతోంది. కానీ మనం ఎంచుకున్న దారిలో ఇది పెద్ద అడ్డంకి. ఉద్యమకారులు మాతృత్వం వంటి వాటికి లొంగిపోకూడదు. ఈ విషయంలో పార్టీకి కఠినమైన నిర్ణయం ఉన్నా ఒక స్థాయి వరకే వర్తింపచేసింది. నీ విషయంలో పార్టీ నీ నిర్ణయానికే వదిలేస్తుంది. అయితే ఒక దళ సభ్యురాలిగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి అబార్షన్ చేయించుకోడమా? లేక బిడ్డను కనడమా? అనేది నువ్వే తేల్చుకో. అసలు ఈ మొత్తంలో నా పాత్ర ఉన్నా స్త్రీగా దీని పర్యవసానం నీవే మోయాల్సి వస్తున్నది. ఇది నన్ను వేధిస్తోంది. అయినా ఏమీ చెయ్యలేను. ఈ సమస్య మన బంధాన్ని, మన ఉద్యమ జీవితాన్ని కూడా చిందరవందర చేసేది. ఈ ఘర్షణలో చివరికి మనల్ని మనం నిలుపుకోవడమే

కష్టమైపోతుంది. బాగా ఆలోచించుకో. ఇప్పటికీ డాక్టర్‌ను అడిగి ఏ కొంచెం అవకాశం ఉన్నా తీసేయించుకోవడమే మంచిదేమో..” అన్నాడు. మాటలకన్నా పున్నం కంఠస్వరంలోని మృదుత్వం ఆమె మనసును చుట్టేసింది. వ్యక్తిగతానికి, రాజకీయ జీవితానికి మధ్య సంఘర్షణ మొలకెత్తింది.

కాంతకు కూడా ఏదో అర్థమవుతోంది. బిడ్డ మీది మమకారంతోపాటు తను ఆందోళనపడుతున్నదీ, పున్నం చెబుతున్నదీ రెండూ ఒకటే. తన మనసు ఇలా ఊగిసలాడుతోంటే, కంట్లో కన్నీరు కూడా బయటికి రాలేదు. అట్లని లోలోపలే ఇంకి పోకపోవడంతో భారంగా కదిలాడిరది. ఇక ఆ రాత్రి ఇద్దరి మధ్య ఒక్క మాట కూడా నడవలేదు. జల్లీలో అట్లాగే ఒరిగిపోయింది.

ఆ రోజు కనుకొలుకుల నుంచి జారిన కన్నీటి తడి ఇప్పటికీ అట్లాగే ఉందేమో అని కాంత అప్రయత్నంగా చెంప తడిమి చూసుకుంది. వ్యక్తిగత జీవితం-రాజకీయ జీవితం చుట్టూ అల్లుకొని ఉండే విషయాలు పున్నం చెప్పలేదు. బహుశా అప్పుడు చెప్పినా తనకు పట్టేది కాదని ఇప్పుదర్థం అవుతోంది.

పక్కన అత్త గాఢంగా నిద్ర పోతోంది. మామ గురక వినిపిస్తోంది. పడుకోబోయే ముందు కరెంట్ పోవడంతో అత్త దీపం వెలిగించి గూట్లో పెట్టింది. తలుపు సందు నుంచి ఒక గాలి కెరటం దూసుకొని రావడంతో దీపం ఆరిపోయింది. ఇంట్లో అంధకారం అలుముకుంది.

ఆ చీకట్లో కాంత మళ్లీ గతంలోకి జారుకుంది.

దళం నుంచి బయటికి వస్తున్నప్పుడు వీడ్కోలు ఇస్తూ అందరికీ చేయి కలిపింది. దళ జీవితంలో ఇలా వీడ్కోళ్లు, కలవడాలు ఎప్పుడూ ఉండేవే అయినా ఆ రోజు తాను ఒంటరిని అయిపోయినట్టనిపించింది. ఇంత వరకు తను చేసిన పనులన్నీ అందరూ కలిసి తీసుకున్న నిర్ణయాల ప్రకారం చేసినవే. కానీ ఇప్పుడు డాక్టర్ దగ్గరికి వెళ్లాక తానొక్కతే నిర్ణయం తీసుకోవాలి. చివరికి పున్నం కూడా తనకే వదిలేశాడు. చాలా కష్టమనిపించింది. దళంలోకి రావడం, పున్నంను పెళ్లాడటం తన సొంత నిర్ణయం ప్రకారమే చేసినా.. అప్పుడు ఒక నమ్మకం, ఆనందం, స్వేచ్ఛ అనిపించింది. ఈ నిర్ణయం ఒక్కతే తీసుకోవాల్సి రావడం ఎంత దుర్భరం? ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేని అశక్తురాలిగానే ఉంది. అయితే ఏం జరిగినా సరే ఈ వరుసలో సహచరులతో కలిసి నిలబడాలని గట్టిగా అనుకుంది. చివరికి పాపతోనైనా.

చివర్లో నిలబడ్డ పున్నం ఆమె కళ్లలోకి గాఢంగా చూస్తూ గట్టిగా కరచాలనం చేశాడు. ఆ స్పర్శకు అర్థం ఏమిటో కాంతకు తెలుసు.

## 3

లోపలి నుంచి వచ్చిన రోజే డాక్టర్ పరీక్షించి, రక్తహీనత ఉందని, అబార్షన్ చేయడం కష్టమని తేల్చేసింది. కాదూ కూడదంటే మీ ఇష్టం చేస్తాను అని చెప్పింది. దీంతో ఏ కొంచెమైనా అవకాశం ఉంటే.. అనే పున్నం చెప్పిన మాటకు ఆస్కారమే లేకుండాపోయింది. పార్టీ తన నిర్ణయానికి వదిలేయడం వల్ల కాంత బిడ్డను కనాలనే అనుకుంది. అప్పటి వరకు ఎటూ తేల్చుకోలేక యాతన పడ్డ విషయం ఇలా పరిష్కారమైంది. ఆస్పత్రి నుంచి బయటికి వస్తున్నప్పుడు కాంతకు తోడుగా ఉన్న మిలిటెంట్ జోగారావుతో డాక్టర్ "ఈమె దళంలో పని చేయడం కష్టం సుమా. చాలా బలహీనంగా ఉంది. ఈ మందులు వాడుతూ రెస్టు తీసుకుంటే ప్రసవానికి ఇబ్బంది ఉండదు..." అన్నది.

జోగారావు ఐటీడీఏలో టీచర్. ఆయన, ఆయన భార్యా ఆర్నెల్లపాటు కాంతను తమ ఇంట్లో ఉంచుకోడానికి సిద్ధపడ్డారు. "కాన్పయ్యే వరకు ఆమె మన దగ్గరే ఉంటుంది. చుట్టుపక్కల వాళ్లకు ఏం చెప్పాలో నీవు ఆలోచించు. మన వాళ్లకు డాక్టర్ చెప్పిన సంగతి రాసి పంపిస్తాను.." అన్నాడు జోగారావు. సహచరి యోగక్షేమాలు అడుగుతూ పున్నం ఈ ఆర్నెల్లలో రెండు మూడు ఉత్తరాలు జోగారావుకు రాశాడు.

అట్లా కాంత అక్కడే ఉండి పురుడు పోసుకుంది.

నాలుగు గదులున్న ఓ చిన్న ఆస్పత్రిలో కాంత. పక్కనే పసిబిడ్డ. ఆర్నెల్ల కింద విడిపోయిన సహచరులు గుర్తుకు వస్తున్నారు. వాళ్లను మర్చిపోయింది ఎప్పుడు? కాకపోతే ఈ చిన్నారి కొత్తగా పక్కన చేరిన ఈ క్షణంలో మరోసారి గుర్తుకు వస్తున్నారు. మందంగా, మెత్తగా ఉన్న పాప నల్లటి వెంట్రుకల్ని సవరిస్తూ దీని కోసమేగా? ఈ ఆర్నెల్లుగా అందరికీ దూరమైపోయింది. గుండెల్లోంచి మాతృత్వం ఎగసిపడుతోంటే చాలా విచిత్రమైన సంఘర్షణకు కాంత లోనైంది.

డిస్చార్జి అయిన వారం పదిరోజులకల్లా కాంత బయల్దేరడానికి సిద్ధమైంది. జోగారావుకు, ఆయన భార్యకు కాంత ఇట్లా అప్పుడే వెళ్లిపోవడం ఇష్టం లేదు. పాప పుట్టినట్లు పున్నంకు ఉత్తరం రాశాడు. ఇంకా సమాధానం రాలేదు. పాపతో లోపలికి వెళ్లితే ఎలా అనే సందేహం, భయం వాళ్లను పీడిరచాయి. కానీ కాంత ఉండలేకపోయింది. రోజులు గడిచే కొద్దీ పాప పుట్టిన ఆనందం కూడా కరువైపోయి ఒక్కతే కూర్చొని మధనపడటం చూడలేకపోయారు. ఈలోగా లోపలికి పంపించడానికి అవకాశం రావడంతో.. "ముందు లోపలికి వెళ్లిపోతే ఏ సంగతీ పార్టీనే తేల్చుతుంది గదా?" అనుకున్నాడు జోగారావు.

నెల కూడా నిండని చంటిబిడ్డను ఎత్తుకొని కాంత బయల్దేరింది. జోగారావు భార్య పాపకు కొన్ని బట్టలు ఇచ్చింది. అవసరం ఉంటుందని రెండు మూడు చీరెలు అదనంగా సంచిలో సర్దింది. పాపను వదలడం వాళ్లకు చాలా కష్టమైపోయింది.

## 4

అడవిలోకి రాగానే తల్లి ఒడిలోకి చేరిన పసిబిడ్డలా మనసు కేరింతలు కొట్టింది. ఆ పచ్చటి వాతావరణంలో, చల్లటి గాలికి చెట్ల కింద కాసేపు కూచోవాలనిపించింది. ఇన్ని నెలల ఎడబాటు తర్వాత పాపను తీసుకొని ఇట్లా అడవిలోకి అడుగుపెట్టడం కాంతకు ఏదో వింత అనుభూతిగా ఉంది. పాపను అలా కాసేపు గడ్డిలో పడుకోబెట్టింది. సంచి చెట్టు మొదట్లో పెట్టింది. చల్లటి గాలి తగలగానే పాప ఆనందంగా కాళ్లూ చేతులు ఆడిరచింది.

ఇంకో గంట నడిస్తేగాని ఆ గూడెం రాదు. అక్కడ అయిదు గుడిసెలే ఉంటాయి. తను మొట్టమొదట ఆ గూడెంలోనే దళ జీవితంలోకి అడుగుపెట్టింది. తొలిసారి ఈ గూడెంలో ఉన్నప్పుడే యూనిఫాం ధరించింది. దళ నాయకుడు తనకు ఇచ్చిన తుపాకీని అపురూపంగా చేతుల్లోకి తీసుకుంది. తూటాల మాలను నడుంకు కట్టుకుంది. కాసేపు అలా ఆ గూడెం జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయింది.

పాపను చేతుల్లోకి తీసుకొని బయల్దేరింది.

నేరుగా చివర్లో ఉండే గుడిసె వద్ద నిలబడిరది. తన కోసమే ఎదురు చూస్తున్నట్లు ఆ ఇంటక్క బయటికి వచ్చి.. కాంతను లోపలికి తీసుకొని వెళ్లింది. ఆమె చేతుల్లో ఉన్న పాపను చూసి ఆశ్చర్యపోతూ “ఎవరక్కా ఈ బిడ్డ?” అని అడిగింది.

వాల్చి ఉన్న మంచంలో పాపను పడుకోబెడుతున్న కాంత కొన్ని క్షణాలు తికమకపడిపోయింది.

“నా బిడ్డే..” అన్నది.

ఈసారి ఆ ఇంటక్క మరింత ఆశ్చర్యపోయింది. ఈ పసి గుడ్డుతో దళంలో...? ఏవో సందేహాలు కలిగాయి. పాపను ఆప్యాయంగా చేతుల్లోకి తీసుకుంది. ఇంతలో ఏదో గుర్తుకు వచ్చినట్లు.. పాపను తీసి కాంత వడిలో పడుకోబెడుతూ.. “మురళన్న చేన్లో ఉన్నడు”.. అంటూ బయటికి వెళ్లిపోయింది.

మురళి వచ్చాక ప్రయాణం మొదలైంది. కాంతకు అలసటగా ఉన్నా దళం దగ్గరికి వెళ్తున్నాననే ఆనందంతో వడివడిగా నడుస్తోంది. మురళి సంచి తీసుకొని రెండడుగులు ముందు నడుస్తోంటే.. కాంత చిన్నారిని భుజం మీద మార్చుకుంటూ

వెనుక నడుస్తోంది.

ఏదో అలికిడి కావడంతో మురళి బాట పక్కన ఉన్న పొదల్లోకి వెళ్లాడు. ఆయన భుజానికి ఉన్న ఏకే చేతిలోకి వచ్చింది. పొజిషన్ తీసుకొని చెట్టు పక్కనిలబడ్డాడు. కాంత ఆయన వెనక్కి వెళ్లింది.

ఏదో అసౌకర్యానికి గురై పాప కేరుమన్నది. ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఇద్దరి గుండెలు జల్లుమన్నాయి. మురళి ఆందోళనగా కాంత వైపు చూశాడు. అప్రయత్నంగానే పాప పెదవులపైకి ఆమె చేయి వెళ్లింది. ఆ చిన్న ప్రాణం ఊపిరాడక గిలగిలలాడుతూ కాళ్లతో నిగ్గదంతూ పెనుగులాడిరది. చెంపల్లోకి రక్తం ఎగజిమ్మింది.

పొలం నుంచి వెళ్తున్న ఆదివాసీ రైతులు అటే వెళ్లిపోయారు. ఆ సంగతి అర్థమయ్యాక మురళి దారి మీదికి వచ్చాడు. పాప ఏడ్పు ఆపింది కాని కాంతకు ఏదోలా అయిపోయింది. పాప యాతన చూసి గుండె ఆగినంత పని అయింది. పాపతోనే అయినా దళంలోనే ఉండాలనుకుంటూ ఇంత దూరం వచ్చింది. కానీ.. ఇప్పుడు పాపను ఎత్తుకొని నడవడమే చాలా అభద్రతగా తోచింది.

మురళి ఇదేమీ జరగనట్టే ముందుకు కదిలాడు.

నడిచీ నడిచీ దళం దగ్గరికి చేరుకున్నారు. అందరికీ చేయి కలుపుతూ ఉన్నప్పుడు అంత దాకా ఉన్న అలజడి తీరిపోయినట్టయింది. కానీ చాలా విచిత్రంగా ఉంది. ఎప్పటిలా ఈ బిగి పిడికిళ్లతోపాటు భుజానికి తుపాకీ లేదు. ఇప్పుడు తన చేతుల్లో మెత్తటి పువ్వులాంటి పాప ఉంది. చూపులతోనే ఎలా ఉన్నావ్ ? అని కాంతను పున్నం పలకరించాడు. అతని ముఖంలోని ఉద్విగ్నతకు గుండెలు గుబగుబలాడాయి. అది దు:ఖమో, సంతోషమోగాని కళ్లలో నీళ్లూరాయి.

అక్కడున్న వాళ్లంతా చాలా మామూలుగా కాంతను రిసీవ్ చేసుకున్నారు. ఆ తర్వాత రెండు నిమిషాల్లో పాప వాళ్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. అక్కడే ఉన్న మరో జిల్లా కమిటీ సభ్యుడు రవి ఆనందంగా “ దళంలోకి కొత్త కామ్రేడ్ వచ్చేసిందోచ్..” అని అరిచాడు. ఆయన అప్పటికే పక్కనున్న వాళ్ల చేతుల్లోంచి పాపను అపురూపంగా దగ్గరికి తీసుకున్నాడు. వాతావరణం కొంత తేలికపడిరది.

వాళ్లట్లా రిసీవ్ చేసుకోవడంతో కాంతకు పూర్తిగా భారం తీరిపోయినట్టనిపించింది. తన ఊహకు అందనిది ఏదో అక్కడ జరుగుతున్నట్లుంది. ఈ ఆర్నెల్లుగా తన వంటరి సమస్య అనుకున్నది ఇప్పుడు సమిష్టిలో భాగమైంది.

పాపను ముద్దాడుతున్న దళ సభ్యులను, కాంతను ఓ పక్కగా నిలబడి పున్నం, జిల్లా కమిటీ బాధ్యురాలు కమల తదేకంగా చూశారు.

ఆ కారడవిలో, తుపాకులు వేసుకున్న గెరిల్లాల చేతుల్లో పసిపాప అమాయకంగా, పిడికిళ్లు బిగించి, చెవులు రుద్దుకుంటూ, కళ్లూ, నోరూ మూస్తూ తెరుస్తూ ఉంది. మధ్య మధ్యలో కదిలాడి కేర్ మనడం, మానుకోవడం.. ఆ పచ్చటి ప్రకృతి మధ్య కుటుంబ బంధాలను తెంచుకొని వచ్చిన విప్లవకారులు సంబరంగా పాపతో ఆడుకోవడం వాళ్లు గమనించారు.

పున్నంకు తానట్లా దూరంగా ఉండటం నచ్చలేదు. వెళ్లి పాపను అందుకుందామనుకున్నాడు. కానీ తాను బాధ్యుడినని గుర్తుకు వచ్చింది. తన వల్ల జరిగిన పొరబాటుకు కాంత ఇంత కాలం ఇబ్బందిపడిరది.. అనే సంగతి మరోసారి గుర్తుకు వచ్చింది. తన అజాగ్రత్తకు కాంతను మళ్లీ క్షమాపణ కోరాలి. ఆలోచిస్తూ వెళ్లి జల్లీలో కూర్చున్నాడు.

కమల గమనించింది. అతడి వెనుకే వచ్చి పక్కన కూర్చుంటూ భుజం మీద చెయి వేసింది. కృతజ్ఞతగా పున్నం ఆమె వైపు చూశాడు.

“కాంతతో మాట్లాడుదామా? ” అన్నాడు పున్నం.

“ఒద్దొద్దు.. తను ఇప్పుడే వచ్చింది కాదా. తొందరేముంది?” అన్నది కమల.

నిజానికి కాంతను దగ్గరిగా చూడాలని, పాపను తాకాలని మనుసు ఆరాటపడుతోంది.

దూరంగా లక్ష్మి, మణి పాపతో ఆడుకుంటున్నారు. అది కేర్ కేర్ మంటోంది. కమల అటువైపు చూస్తూ.. “లక్ష్మీ పాపను నాక్కూడా కాసేపు ఇస్తారా?” అని అడుగుతూనే లేచి వెళ్లి చేతుల్లోకి తీసుకుంది.

తాను జారవిడుచుకున్నదేదో మళ్లీ అపురూపంగా చేతుల్లోకి వచ్చినట్లు ఉందామెకు. ఆ స్పర్శకు క్షణ కాలం మైమరిచి పాపను గుండెలకు హత్తుకుంది.

ఇంకాస్త దూరంలో దళ కమాండర్‌తో మాట్లాడుతున్న కాంతతో “కాంతా.. పాపకు ఏం పేరు పెట్టావు?” అని అడిగింది. దానికి ఆమె లేదన్నట్టుగా తల ఊపి మాటల్లో పడిపోయింది. కమల పాపను తీసుకొని పున్నం దగ్గరికి వచ్చి “బలే ముద్దుగా ఉంది కదూ” అన్నది.

ఔను అన్నట్టు చూస్తూ పున్నం పాపను చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ క్షణాన పున్నంకు వాళ్లమ్మ గుర్తుకు వచ్చింది. చిన్నప్పటి నుంచి పిల్లలను ఇలా దగ్గరిగా చూసిన సందర్భాలు గుర్తుకు వచ్చాయి. బిడ్డల్ని వదిలి ఉద్యమంలోకి వచ్చిన ఎందరో తల్లిదండ్రులు గుర్తుకు వచ్చారు. తమలాంటి పరిస్థితుల్లోనే మాతృత్వానికి చేరువైనా దృఢ చిత్తంతో బిడ్డను సానుభూతిపరులకు ఇచ్చి ఉద్యమంలో నాయకత్వ స్థాయిలోకి

ఎదిగిన కమలక్క ఎదురుగానే ఉంది.

ఏక కాలంలోనే అనేక దృశ్యాలు, అనేక ఆలోచనలు.

పాపను చెంపలకు ఆనించుకున్నాడు. పాప కళ్లు చిలికిస్తూ తన చిన్నారి చేతులతో పున్నం ముఖం మీద తాకింది. ఏదో అనుభూతి.. ఇంత కాలం దీని గురించే ఆలోచించలేదు. ఇప్పటికీ ఇది స్థిరంగా ఉండాలనే కోరిక కూడా లేదు. ఏదో భావోద్వేగం. పరిసరాలను మరింపజేసింది. ఇందాకటి దళ సభ్యుల్లాగే తనూ పాపను హాయిగా గుండెలకు హత్తుకున్నాడు.

దానికి వత్తిడి అనిపించిందేమో. చిన్నగా కదిలి పున్నం ఛాతీపై కాళ్లతో తంతూ కేర్ మన్నది.

అది కమల చూస్తూ.. "పిల్లల ప్రతి చర్యా ఎంత అపురూపం! అందుకేనేమో తల్లులు, ఈ లోకమూ పిల్లలకూ, వాళ్ల మురిపాలకూ దాసోహమయ్యేది. ఇది ఎంత బలం? అందుకే ఆడవాళ్లకు ఎన్ని నిస్సహాయతల్లో అయినా బతకాలనే కాంక్ష ఉంటుంది. మాతృత్వం చుట్టూ సమాజం వల్ల కలిగిన అనేక బలహీనతలకూ అదే కారణం..." అనుకుంది.

పాప ఎందుకో అసహనంగా కదులుతూ కీచుగా ఏడుపు అందుకుంది. "ఆకలైందేమో.." అని మళ్లీ " ఏమో మనం అమ్మలం కాదు గదా? మనకేం తెలుసు?" అంది కమల.

"కాదక్కా.. తడిగా ఉంది.." అన్నాడు పున్నం అరచేయి చూసుకుంటూ. దాని కింద ఉన్న పలుచటి గుడ్డ పసుపుపచ్చగా మారిపోయింది.

"కాంతను పిలుద్దామా?" అన్నాడు పున్నం.

"ఇన్ని రోజులు తనొక్కతే చూసుకుందిగా.." అని చిన్నగా నవ్వుతూ కమల పాపను అందుకోబోయింది. పున్నం వారిస్తూ లేచి పాపను పక్కకు తీసుకొని పోయాడు.

ఒక చేత్తో వాటర్ క్యాన్ వంచుకొని నీళ్లు పోస్తోంటే.. కమల వెళ్లి నీళ్లు పోస్తూ "తుపాకుల్ని శుభ్రం చేసినంత సులభం కాదు పిల్లల పని చేయడం.." అన్నది పున్నంను రెచ్చగొడుతూ.

పున్నం వంతగా నవ్వుతూ పని పూర్తి చేశాడు.

## 5

ఆ రాత్రి కాంతను చేతుల్లోకి తీసుకుంటూ "ఎలా ఉన్నావు?" అని అడిగాడు. కాంతకు ఒక్కసారిగా దు:ఖం ముంచుకొచ్చింది. పున్నం ఛాతీ మీద వాలిపోయి

ఏడవడం మొదలుపెట్టింది.

"వద్దు వద్దు ఏడవద్దు...పాప లేస్తుంది.." అని పున్నం ఓదార్చాడు. అతని ఒళ్లో తలపెట్టుకొని ఆకాశం వైపు చూస్తూ సేదతీరింది.

కాసేపయ్యాక "ఇన్ని దినాలు మీ అందరికి దూరంగా ఉండటం ఎంత కష్టమైందో. నన్ను నేను నిలబెట్టుకోడానికి ఎంత యాతన పడాల్సి వచ్చిందో. అయినా పాప సంగతి ఇంత వరకూ ఒక నిర్ణయానికి రాలేకపోయాను. ఇక్కడికి వచ్చాక అనిపించింది.. పాపను వీలైనంత తొందరగా మీ అమ్మకు పెంచుకోడానికి ఇచ్చేద్దాం.." ఆ చివరి మాటలు అంటున్నప్పుడు ఏడుపు వచ్చింది. చిన్నగా రోదించింది.

పున్నంకు చాలా బాధనిపించింది. కానీ డివిజన్‌లో ఊపిరి తీసుకోడానికి కూడా వీలుకాని పరిస్థితి. చుట్టుముట్టిన శత్రు నిర్బంధం మధ్య నీళ్లలో చేపలాగా కదలికలు. గెరిల్లా పోరాటం కత్తి అంచు మీద నడక. అనేక ఒత్తిళ్ల మధ్య కాంత సమస్య కూడా.

కాసేపయ్యాక కాంత తేరుకుంది. పొద్దటి నుంచి పార్టీ నిర్ణయం ఎలా చెప్పాలా ? అని మథన పడుతున్నాడు. ఇప్పుడు కాంత మాటలు విన్నాక కొంచెం తేలికనిపించింది. పాపను కనాలనే ఇష్టం ఉండే కాంత అబార్షన్ చేయించుకోలేదుమో.. అనే సందేహం ఉండేది. బయటికి వెళ్లేటప్పుడు ఊగిసలాటతోనే వెళ్లింది. కానీ ఈ చివరికే చేరుకుంది.

తేలికైన మనసుతో ఇద్దరూ పాపకు చెరో వైపు పడుకున్నారు. వీటి వేటితో సంబంధం లేదన్నట్లు పాప కీకారణ్యంలో గడ్డి పొత్తిళ్ల మీద, చుక్కల పందిరి కింద హాయిగా నిద్రపోతోంది.

## 6

రెండు రోజులయ్యాక పాపను పున్నం వాళ్లింట్లో ఇవ్వడానికి కాంత బయల్దేరింది. ఈ వ్యవహారమంతా చూడటానికి జిల్లా కమిటీ సభ్యుడు రవికి పార్టీ బాధ్యత అప్పగించింది. రవి తన గార్డు ప్రకాశ్‌తో కాంత వెంట బయల్దేరాడు. గూడెం చివర్లో ఉన్న మొక్కజొన్న చేను దగ్గరికి పున్నం కుటుంబసభ్యులంతా వచ్చారు. పున్నం తల్లి పాపను చూసి మురిసిపోయింది. ఆ చిన్నారిలో కొడుకు పోలికలు వెతుక్కుంటోంది. పాప కోసమైనా కోడల్ని ఇంట్లో ఉంచుకుంటే, కొడుకు కూడా తిరిగి వస్తాడని ఆమె అనుకుంటోంది.

వాళ్లకు కాంత అసలు సంగతి చెప్పింది.

"నీ కొడుకు పంపిస్తేనే వచ్చిన. బిడ్డను నీకు ఇచ్చెయ్యమన్నడు. మా అమ్మ

సాదుతది అన్నడు నీ కొడుకు" అంది.

"ఈ పసి గుడ్డును నేనెట్ల చూసుకొనేది? కూలి పనికి పోతేనే ఎల్లదాయె. అయినా తల్లి లేకుండా పిల్లను చూసుకోడం మాటలా? నా వల్ల యాడైతది?" అని ఆమె తేల్చేసింది. పున్నం వాళ్ల పెద్దక్క అందుకొని "బైట ఏం బాగలేదు. వచ్చే పోలీసులు, పొయ్యే పోలీసులాయె. మీ కోసం పెట్టే కష్టాలే అన్నీ ఇన్ని కావు. చిన్నోడినే వాళ్లకు దొరకకుండా కాపాడుకోడం యాత్తనైపోయింది. మీరు లోపల ఉంటే దీన్ని సాదుకోడం ఎట్ల?" అని ఆ ఊహే భయం అనిపించిందేమో ఆగిపోయింది.

పున్నం తల్లి తన అసహాయతను బయటపెట్టుకున్నది కాని, ఆ మాట చెప్పాల్సి వచ్చినందుకు బాధగా ఉంది. చిన్నగా ఏడుస్తోంది. కొడుకు ఎడబాటు, మనవరాలిని అక్కున చేర్చుకోలేకపోవడం వల్ల ఆమె తల్లడిల్లుతోందని కాంత అర్థం చేసుకుంది.

ఇక్కడికి బయల్దేరుతున్నప్పుడు పాపను ఇచ్చేసి ఒట్టి చేతులతో తిరిగి రావాల్సిందే గదా? అనే దిగులుతోనే వచ్చింది. నెల నిండని బిడ్డ కోసమే తను ఇంత ఆరాటడుతోందే.. పాతికేళ్లు కొడుకును పెంచుకున్న ఈ తల్లిది ఇంకెంత బాధ? అనిపించింది కాంతకు.

ఇంక అక్కడ పని కాదని తేలింది. ఏం చేయాలో తేల్చుకోలేని అయోమయంలో పడిరది. అది గమనించి పున్నం తల్లి.. కాంత చేతులు పట్టుకొని "ఏమాలోచిస్తున్నవ్ బిడ్డా. నువ్వయినా రారాదు ఇంటికి" అన్నది కళ్ల నీళ్లు పెట్టుకుంటూ.

అంత వరకు గట్టిగా ఉన్న కాంతకు ఒక్కసారిగా ఏడుపొచ్చింది. నిబ్బరంగా ఉండాలనుకున్నా చేతకాలేదు. ఒకరి ముఖాల్లోకి ఒకరు చూసుకుంటున్నారుగాని దు:ఖపు పొరలే. మసకబారిన దృశ్యాలే.

అక్కడ ఎక్కువ సేపు ఉండటం ప్రమాదమని రవి గుర్తు చేశాడు. కాంత పాపను తీసుకొని బయల్దేరింది. నాలుగడుగులు వేశాక వెనుక వైపు నుంచి అలికిడి కావడంతో ఆగింది. పున్నం తల్లి దగ్గరికి వచ్చి ముడుతలు పడి నలిగిపోయిన రూపాయి కాగితాలు తీసి కాంతకు ఇచ్చింది. ఆ ఆదివాసీ వృద్ధురాలి చేతి నుంచి చెమటతో తడిసిన ఆ కాగితాలు తీసుకున్నప్పుడు చల్లగా తగిలాయి. అనుకున్నది అనుకున్నట్లు జరిగి ఉంటే తిరుగు ప్రయాణం ఇంకోలా ఉండేది. కానీ ఇప్పుడు మళ్లీ బిడ్డ తల్లిలాగే బయల్దేరింది. తన ముందు నడుస్తున్న ప్రకాశ్‌ను, రవిని చూసి వాళ్లతోపాటు నడవగలనా? అనిపించింది. ఇంత కాలం అడవిలోని ఏ దారి గుండా అయినా రాత్రుళ్లు దళానికి దారి చూపే పైలట్‌గా పేరు తెచ్చుకుంది. అది ఎంతో గర్వంగా ఉండేది. తల్లిదండ్రులను, తోబుట్టువులను వదులుకున్నంత తేలిక కావడం లేదే ఇంత చిన్న

పిల్లను వదులుకోవడం? ఇది తన శక్తినంతా హరించి వేస్తున్నట్టుంది. కొంత దూరం వెళ్లాక ముందు నడుస్తున్న రవిని ఆగమని చెప్పింది. "ఈ వాగు దాటి మా ఊరికి వెళ్దామా? చీకటి పడుతోంది కదా. అక్కడ తిని పొద్దున బయల్దేరవచ్చు.." అడిగింది కాంత. రవి రెండు క్షణాలు ఆలోచించి సరే అన్నాడు.

వాగు దగ్గరికి పోతుండగా పాప ఏడుపు అందుకుంది. "ఏమైందక్కా...?" అని రవి అడిగాడు.

"బట్టలు కరాబు చేసుకుంది. వాగు దగ్గర కాసేపు ఆగుదాం.." అన్నది కాంత.

కాంత పాపను శుభ్రం చేస్తోంటే రవి, ప్రకాశ్ దోసిళ్లతో నీళ్లుపోశారు. చిన్నవాడైన ప్రకాశ్ అమాయకంగా ముఖం పెట్టి ఇంత చిన్న శరీరానికి స్నానం చేయించడం ఎంత కష్టమైపోయింది? అన్నాడు. కాంతకు నిజమే అనిపించింది. అంతకంటే దు:ఖంగా ఉంది. తను ఎంచుకున్న జీవితంలో పాప పొసగదుగాక పొసగదు అనిపించింది. వాగు ఒడ్డున కూర్చొని పాపకు పాలిస్తుంటే తన ప్రాణాన్ని పాపలోకి వంపుతున్నట్లుగా ఉంది.

దీపాలు పెట్టే వేళకు ఊరు చివరి మర్రి చెట్టు వద్దకు చేరుకున్నారు.

"రవీ, మా చెల్లెని, మరిదిని ఆ చివర ఉన్న కాశన్న ఇంటికి రమ్మందామా? " అన్నది కాంత.

రవి తన గార్డు ప్రకాశ్‌తోసహా వెళ్లిపోయాక కాంత అక్కడే కాస్త చదునుగా ఉన్న చోట కాలితో చెత్తా చెదారం పక్కకు తోసేసి కింద కూర్చుంది. నడిచి వచ్చినందున అలిసిపోయి, అక్కడే నడుం వాల్చి పాపకు పాలిస్తూ చిన్నగా కునుకు తీసింది.

కాసేపటికల్లా "అక్కా.. అక్కా" అని పిలుస్తోంటే తెలివిలోకి వచ్చింది. దాదాపుగా చీకటి పడ్డట్టే. కాశన్న కొడుకు ఎదురుగా నిలబడి ఉన్నాడు. ఎంత పెద్దోడయ్యాడో.. అనుకుంది.

"అక్కా రా మా ఇంటికి పోదాం... రవన్న వచ్చిండు" అన్నాడు.

ఆ మసక చీకట్లో కూడా ఆ పిల్లవాడి చూపులన్నీ కాంత చేతిలోని పాప మీదే. కాంత గమనించింది. తుపాకీ వేసుకొని తిరిగే తన చేతిలో ఈ పసిబిడ్డ ఏమిటి? అని అందరికీ వింతే..

ఆ ఇంట్లోకి వెళ్లే సరికి చెల్లెలు నీల, మరిది వచ్చి ఉన్నారు. అందరికంటే ముందు ఆ ఇంటి అక్కే కాంతను ఆప్యాయంగా పలకరించింది. చెల్లెలు వచ్చి పాపను చేతుల్లోకి తీసుకుంది.

"రవీ చెప్పేశావా?" అంటూ కాంత అతను కూర్చున్న గడంచ మీద కూర్చుంది.

"పున్నం వాళ్ల అమ్మను కలిసిన సంగతి కూడా చెప్పినా. నీకు కొంచెం సులువు అవుతుందని" అని రవి మెల్లగా అన్నాడు. కాంత అతని వైపు కృతజ్ఞతగా చూసింది. పున్నం వాళ్లమ్మ మాటలు విన్నాక పాప విషయంలో తాను ఇక ఒంటరి అయిపోయినట్టేనా? అనే భయం పట్టుకుంది. కానీ తన ఆలోచనా భారాన్ని రవి కూడా పంచుకుంటున్నాడని కాంతకు అప్పుడు తెలియదు.

అందరూ ఒక దగ్గరే కూర్చున్నారు. పాపా ఆ ఇంటి ఇల్లాలి చేతిలో ఉంది. ప్రకాశ్, కాశన్న కొడుకు బయట సెంట్రీ చేస్తున్నారు. చెల్లెలు నీల ఏవేవో మాట్లాడుతోంది కానీ అసలు విషయంలోకి రావడంలేదు. చివరికి కాంత కల్పించుకొని... "నీలా ! రవి చెప్పిండంటగా..." అన్నది.

నీల క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా "నాకేదైతదక్కా. నీవు లోపల ఉండుకుంటూ నేను పాపను పెంచుకోవడం మాటలా? కొన్నేళ్లు నీవు బయటే ఉండి, ఆ తర్వాత మళ్లీ పోతే అప్పుడు అంత ఇబ్బంది ఉండదు కాని.." అంది.

ఆమె భర్త కూడా అట్లాగే చూశాడు. అక్క లోపలికి పోవడమే నీలకు ఇష్టం లేకుండె. ఇద్దరే అక్కచెల్లెళ్లు. అమ్మా నాయినలు చనిపోయారు. పాప కోసమన్నా అక్క బయటే ఉంటే బాగుంటుందని నీల కోరిక.

కాంత ఒక్కసారిగా నీరు గారిపోయింది.

అది చూసి "ఇక ఏదైనా మళ్లీ పార్టీ దగ్గరే నిర్ణయం కావాలి" అని రవి అనునయంగా చెప్పాడు. తెలతెలవారుతుందగా అక్కడి నుంచి అడవిలోకి బయల్దేరారు.

## 7

కాంత నిద్ర పోతోందో, మెలకువలో ఉందో తెలియడం లేదు.

కరెంట్ ఎప్పుడు వచ్చిందో? ముఖంపై వెలుతురు పడటంతో ఈ పక్క నుంచి ఆ పక్కకు తిరిగి పడుకుంది. ఇంతలో బయట ఏదో అలజడి రేగింది. ముందు మామే నిద్ర లేచి, మంచంలో కూర్చున్నాడు. వాకిలి దాకా వెళ్లి కూడ వెనక్కి వచ్చాడు. ఇంట్లో కాంత ఉంది గదా? అని క్షణం తటపటాయించాడు. కిటికీ దగ్గరికి వెళ్లి నక్కి విన్నాడు.

బయట పోలీసుల అలజడి. ఆ అరుపులు రాజయ్యకు అలవాటే. హిందీలో క్రూరమైన స్వరంతో మాటలు సాగుతున్నాయి. వందల కొద్ది ఉన్నట్టుంది. బూట్ల చప్పుడు అటూ ఇటూ దగ్గరవుతూ తిరిగి దూరమవుతూ..ఉంది. కాంత శరీరమంతా చెవులు చేసి ఆలకిస్తోంది. అత్త కూడా నిద్ర లేచింది. ఏం కాదులే అన్నట్లు రాజయ్య

చేతులతోనే మిగతా ఇద్దరికి సైగ చేసి భరోసా చెప్పాడు. మరో రెండు నిమిషాలయ్యాక మళ్లీ పై నుంచి పోలీసుల గుంపు ఒకటి ఇంటి పక్క నుంచే వెళ్లిపోయినట్లు అలికిడి అయింది.

ఆ తర్వాత ఏమీ లేదు. కాసేపయ్యాక రాజయ్య తలుపు తీసి బయటకు వెళ్లాడు. వీధి లైటు వెలుతురులో ఎదురుగా ఉన్న ఇంటి అరుగు దగ్గర నిలబడ్డ ఆ ఇంటి ముసలాయన రాజయ్యను చూసి ఏం లేదు.. అంతా వెళ్లిపోయారు..నీవు లోపలికి వెళ్లు అన్నట్లు చేతులు ఊపి చెప్పాడు.

రాజయ్య లోపలికి వచ్చి తలుపు పెట్టేశాడు. "ఇంతకు ముందు పదీ ఇరవై మంది మాత్రమే వచ్చేవాళ్లు. ఇప్పుడు మిలటరీ వాళ్లు వందలకొద్దీ దిగుతున్నారు. ఎప్పుడు ఏమవుతుందో తెలియదు.." అనుకుంటూ మంచం మీద పడుకొని నిద్రకు ఉపక్రమించాడు.

కాంత ఆలోచనలు ఇంకా సాగుతూనే ఉన్నాయి.

పాపతో కాంత తిరిగి రావడం చూసి పున్నం పెద్దగా ఆశ్చర్యపోలేదు. ఇలాంటిది ఏదో జరిగే అవకాశం ఉందని కమల కూడా అనుమానించింది. దారిలో తమ ఊరికి వెళ్లి చెల్లెల్ని కలిసిన సంగతి కూడా కాంత చెప్పింది. ఇంకా ఏమైనా అవకాశాలున్నాయా? అని ఆలోచించారు. రెండు మూడు రోజుల తర్వాత పాపకు దళంలో తీవ్రమైన అసౌకర్యాలు ఎదురయ్యాయి. అవి దళ జీవితానికి కూడా ఇబ్బందిగా మారాయి. వాటిని అందరికంటే కాంతే ఎక్కువగా అర్థం చేసుకుంది.

పాపతోపాటు కాంతను ఏదైనా టెక్ వర్క్‌లో పెడితే ఎలా ఉంటుందని కమల ఆలోచించింది. అయితే దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయడానికి టైం పడుతుంది కాబట్టి ముందు కాంత పాపతోపాటు బయటికి వెళ్లిపోవాలని నిర్ణయం జరిగింది.

ఈ నిర్ణయంతో కాంత తల్లడిల్లిపోయింది. కానీ తనకే అర్థమవుతోంది. ఇక్కడ కష్టమని.

కాంత బయటికి వెళ్తున్నప్పుడు పున్నం నిలువునా కుంగిపోయాడు. నిగ్రహించుకోవడం కష్టమైపోయింది. "కాంత ఎవరైనా సానుభూతిపరులకు పాపను ఇచ్చేస్తే బాగుండు. కానీ తను ఆ వైపు ఆలోచించలేకపోతోంది. తల్లిదండ్రులను, బంధువులను కాదనుకొని వచ్చిన కాంతేనా? అనే సందేహం కలిగింది. ఈ రోజు పాప కోసం ఇట్లా ఉద్యమాన్ని, తననూ వదులుకోడానికి సిద్ధమవుతోంది. విప్లవంలో మాతృత్వ అనుభూతికి అటంకం లేని విముక్తి ప్రాంతాలను సృష్టించే రోజు వస్తే..!" ఆ దిశగా చాలా ఆలోచించాలనుకున్నాడు పున్నం.

బైట ఏదో లాగా స్థిమితపడటానికి ప్రయత్నిస్తుంటే కాంత జీవితాన్ని పెను విషాదం చుట్టుముట్టింది. నెల తిరగక ముందే పున్నం ఎన్‌కౌంటరయ్యాడు. ఆ నెలలో తను బయట ఉండటానికి, మనుషుల్లో పడి తిరగడానికి ఎంత యాతన పడాల్సి వచ్చిందో. అదేదీ ఒక దారికి రాకముందే ఈ అఘాతం. కాంత తట్టుకోలేకపోయింది. ఉద్యమానికి దూరమైన అసంతృప్తే ఉన్నా జీవితభాగస్వామి ఎక్కడో ఒక చోట ఉన్నాడనే ఆనందం ఉండేది. ఇప్పుడు అదీ తుడిచిపెట్టుకపోయింది.

పున్నం చెప్పేవాడు.. "కాంతా.. మనం ఎంచుకున్న దారిలో చావు ఎక్కడ పొంచి ఉందో మనకు తెలియదు. వాడు మనల్ని చుట్టుముట్టి ఏరిపారెయ్యడానికి సిద్ధపడ్డడు. ఈ సంకుల సమరంలో ఎవరు ఉన్నా లేకపోయినా మిగిలిన వాళ్లు విప్లవంలో మాత్రం ఉండాల్సిందే. ఈ సంగతి మర్చిపోవద్దు" అనేవాడు. ఇప్పుడు కాంతకు అవే మాటలు గుర్తుకు వస్తున్నాయి. పున్నం చనిపోయినా కూడా లోపలే ఉంటే పార్టీ అండ దొరికేది. ఇప్పుడు ఇక్కడ.... ఇంత నిర్బంధం మధ్య బయట ఎవరు ఎట్లా ఉన్నారో తెలియక ఇబ్బందిగా ఉంది. ఆ టయంలో కమల ఒక ఉత్తరం రాసింది. ఆ ఉత్తరం చదవడం వల్ల అంతులేని శక్తి వచ్చింది.

పున్నం అత్యక్రియలకు వెళ్లినప్పటి నుంచి పోలీసుల వేధింపులు మొదలయ్యాయి. ఇంత కష్టాల్లో కూడా పున్నం తల్లిదండ్రులు కాంతను అక్కున చేర్చుకున్నారు. పాప బలహీనంగా ఉన్నా కూడా పాలు, మందులు ఇప్పించలేని స్థితి పున్నం తల్లిదండ్రులది. పూట గడవడమే కష్టం. పార్టీకి, తన సహచరుడి ఆదర్శాలకు విరుద్ధం కనుక బతుకు ఎంత భారమైనా పోలీసులు ఇచ్చే రివార్డు తీసుకోకూడదని గట్టిగా నిర్ణయించుకుంది. పున్నం మాటల్లో చెప్పాలంటే "కష్టాల్లోనే పార్టీ పద్ధతికి కట్టుబడి ఉన్నారా లేదా అనేది తేలుతుంది."

%పున్నం ఎడబాటులోని దు:ఖాన్ని దిగమింగుకుంటూనే కూలీ పనికి వెళ్లేది. పాప ఒక్కతే తన జీవితంలో మిగిలి ఉన్న వెన్నెల. అందుకని వెన్నెలా.. అని పిలుచుకుంటోంది. కానీ కూలీ డబ్బులతో పాప అవసరాలు తీర్చలేకపోతోంది.్ల ఎట్లాగయినా పాప కొంచెం పెద్దయ్యాక చెల్లెలికి ఇచ్చేసి మళ్లీ లోపలికి వెళ్లాలని మొదటో అనుకుంది. కానీ పాపతో పెరిగిన అనుబంధం వల్ల ఇక తను లోపలికి వెళ్లలేనని తనకే మెల్లగా అర్థం కాసాగింది. అంతకు మించి బయటి జీవితం అలవాటైపోయింది. ఇక్కడ సుఖం ఏమీ లేకపోయినా ఈ బతుకు తెరువే ఒక పరిమితి అయిపోయింది. అయితే ఏదో వెలితి ఆమెను వెంటాడుతోంది. రవి ఇప్పుడు జిల్లా కమిటీ బాధ్యుడయ్యాడు. అప్పుడప్పుడు పిలిపించుకొని మాట్లాడుతూ ఉన్నాడు. అతను

కాంతలో వచ్చిన తేడా గమనించకపోలేదు.

రవి ఓసారి కాంతతో చెప్పాడు. "కాంతా.. నేనూ పున్నం ఒకే కమిటీలో పని చేశాం. మన దళంలోకి పాప వచ్చిన దగ్గరి నుంచి మనం చేసిన అన్ని ప్రయత్నాల్లో విఫలమయ్యాం. ఎట్లా జరిగినా ఇది నీ వ్యక్తిగత సమస్య కాదు. దీన్ని రాజకీయంగా ఆలోచించాలి. పార్టీ నిర్ణయం తీసుకోడానికి లేటయ్యింది. నిర్బంధం, నిర్మాణం పెరగడంతో ఉద్యమం మరో రూపం తీసుకున్నది. పాపను వేరే వాళ్లకు ఇవ్వలేకా, బయట ఉండలేకా నీవు ఎంత ఒత్తిడి అనుభవిస్తున్నవో నాకు తెలుసు. ఇది నీ సమస్య మాత్రమే కాదు. పార్టీది. విప్లవంలో మాతృత్వం గురించి ఇంకా మనం చాలా నేర్చుకోవాలి. దీనికి పరిష్కారం ఉంటుంది. లేకపోతే ఇది మహిళల సమస్యే అయిపోతుంది. ఉద్యమంలో చనిపోయిన మన కామ్రేడ్ల కుటుంబ సభ్యులు బయట ఏర్పాటు చేసుకున్న సంఘం ఉంది. నీవు అందులోనైనా పని చేయి. ఆ రకంగానైనా నీవు ఉద్యమంతో ఉంటే నీకు ఈ ఒంటరితనం తీరుతుంది. వెలితి బర్తీ అవుతుంది.మన చైతన్యాన్ని నిలబెట్టుకోడానికి ఏదో ఒక పని అవసరం. లేకపోతే చాలా కష్టం. నీవు పని చేద్దామనుకుంటే వాళ్లను కలిసే మార్గం వెతుక్కో. ముందు నీవు ఈ సంగతి ఆలోచించాలి..." అని గట్టిగా చెప్పాడు.

నిజంగానే కాంత ఆలోచనల్లో పడిరది. ఆమెకు మొదటి నుంచీ రవి మాటలంటే గురి ఉండేది. పున్నం, రవి మంచి స్నేహితులుగా ఉండేవారు. ఇంటికి వచ్చాక కాంత చాలా రోజులు ఆలోచించింది. ఇప్పుడిప్పుడే పోలీసుల వొత్తిడి తగ్గిపోయింది. మళ్లీ సంఘాలతో తిరిగితే ఏమవుతుందో.. అనే సందేహం కూడా ఉంది. అయితే తాను ఇప్పటికే అనేక మెట్లు కిందికి వచ్చానని, ఇంతకంటే ఇంకా కిందికి పోకుండా ఉండాలి. దానికి ఒక ఆసరా కావాలి. బహుశా రవి అందుకే ఈ సలహా చెప్పాడేమో... అనుకుంది.

కాంతకు జీవితమంతా ఖాళీ అయిపోయినట్టుంది. పున్నం లేని జీవితం బరువైపోయింది. వెన్నెలకు ఏడేళ్లు నిండాయి. చెల్లెలి ఇంటి పక్కజాగాలో గుడిసె వేసుకొని ఉంటోంది. పాప ఇద్దరి మధ్య తిరుగుతూ పెద్దదవుతోంది. కాంత పాడుతోంటే వెన్నెల ఎంతో ఇష్టంగా వినేది. బయట డప్పుల చప్పుడైతే పరిగెత్తిపోయేది. రానురాను తన కంటే నీలకే అనుబంధం పెరిగిపోయింది. ఎప్పుడు తన దగ్గర ఉంటుందో, ఎప్పుడు నీల దగ్గర ఉంటుందో చెప్పడం కష్టం. పిల్లలు లేని నీల ఇక తనకూ ఇదే లోకం అన్నట్టుంది.

కోడి కూతతో కాంత ఆలోచనలకు స్వస్తి చెప్పి, అత్త మామలకు వెళ్తున్నానని చెప్పి ఊరికి బయల్దేరింది.

## 8

పున్నం లేని ఖాళీలో కాంతకు వెన్నెలే ఓదార్పు. కానీ రాను రాను కాంత ఈ స్థితి నుంచి బయటపడిరది. గడచిన జీవితమంతా ఆమెను నిరంతరం వెంటాడుతోంది. ఎంత మార్పు జరిగిపోయింది. జీవితమంతా రాజకీయాలే అనుకొని లోపలికి వెళ్లిపోయింది. ఈ పేగు బంధం కోసం జీవిత సహచరుడ్ని, ఉద్యమ సహచరులను వదులుకోవాల్సి వచ్చింది. తనను ఎంతగానో అభిమానించే ప్రజలకు కూడా దూరం కావాల్సి వచ్చింది.

ఈ లోకంలో ఎన్నో కారణాలతో పిల్లల్ని వీధుల్లో వదిలేసి వెళ్లిపోయే తల్లిదండ్రులు ఉన్నారు. అట్లా తన పాప అనాథ కాకూడదనే ఆలోచనతో తను విప్లవ జీవితం నుంచి విడిపోయి అనాథగా మారింది. ఎందుకు కమలక్క లాగా తను ఆలోచించలేకపోయింది? లేదు తప్పక ఈ మాతృత్వపు ప్రేమ నుంచి బయటకు రావాల్సిందే. ఉద్యమాన్ని, చివరికి దాంపత్యబంధాన్ని కూడా ఈ ప్రేమ కోసం దూరం చేసుకున్నాను గదా? అనే ఆలోచనతో ఆమె తల్లడిల్లిపోయింది.

ఈ అసంతృప్తికి ముగింపు పలకాలి. తిరిగి మళ్లీ అంత దూరం పోలేకపోయినా ముందు ఈ పరిస్థితి నుంచి బయటికి రావాల్సిందే.

రవి మరణం తర్వాత కాంత మరింతగా మధన పడుతోంది. అంత్యక్రియల కోసం వెళ్లి.. చివరికి అందుకోలేకపోయినా ఆయన బొంద దగ్గర కూలబడి ఆలోచించింది. రోజులు గడుస్తున్నా దాని నుంచి బయటికి రాలేకపోతోంది.

సరిగ్గా వారం రోజులకు ఓ రోజు రాజయ్య మామ వచ్చాడు. రాగానే వెన్నెలను దగ్గరికి తీసుకున్నాడు. నీల, ఆమె భర్త పనికి వెళ్లిపోయారు. రెండు రోజుల నుంచి వొంట్లో బాగా లేకపోవడంతో కాంత ఇంటి దగ్గరే ఉండిపోయింది.

“ఒక ముచ్చట చెప్పాలని వచ్చినా. నిన్న పేపర్లో చూసినా. సంగం వాళ్లు వరంగల్‌లో రవి సంస్మరణ సభ పెడుతున్నరంట.. నేను, మీ అత్త కూడా పోతున్నాం. నీకు చెప్దామని వచ్చినా. ఎల్లుండి పగలంతా జరుగుతుంది...” అన్నాడు.

కాంత సంభ్రమంగా ఆయన వంక చూసింది. “నిజమా?” అని అడిగింది. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నది చేరువైనట్టు ఆనందించింది.

వెళ్లి సంఘం వాళ్లను కలవాలి. రవి చెప్పినట్లు ఏదో ఒక పని చేయాలి. తను చెప్పినట్టు చేస్తే పార్టీ సంతోషిస్తుంది.

## 9

ఆ రోజు కాంత వెన్నెలను తీసుకొని బయల్దేరింది. ఈ నగరం చూడక ఎన్నేళ్లయిందో. ఎప్పుడో ఉద్యమంలో ఉండి అవసరాల కోసం వచ్చినప్పుడు చూసిందే. చాలా కొత్తగా అనిపించింది. ఒకటే జనం.. ఎక్కడికి పోతున్నారో.. ఎక్కడికి పరిగెడుతున్నారో.. అయోమయంగా ఉంది. బస్సు దిగి రాజయ్య మామ చెప్పినట్లు ఆటో ఎక్కింది.

రోడ్డుకు ఆ పక్క ఆటో డ్రైవర్ దింపేసి వెళ్లిపోయాడు. తలెత్తి అవతలి వైపు చూసింది. మీటింగ్ అక్కడే అని అర్థమైంది. కష్టం మీద రోడ్డు దాటి అవతలికి చేరింది. ఎదురుగా చిరునవ్వులు చిందిస్తున్న రవి నిలువెత్తు బ్యానర్. ఎందుకో కాంతకు లోలోపల పొగలు రేగినట్టనిపించింది. కళ్లలో నీళ్లు తిరుగుతుండగా పాపను ఎత్తుకొని "మీ నాన్నకు, నాకు దోస్తు.. కామ్రేడ్ రవి" అని ఉద్విగ్నంగా చెప్పింది.

తల్లి కళ్లలోకి చూసి వెన్నెల ఏం అర్థం చేసుకున్నదోగాని "పదమ్మా" అన్నది.

తల్లీ బిడ్డలిద్దరూ మీటింగ్ హాల్లోకి, మందిలోకి ప్రవేశించారు. స్టేజీ మీద పాటల హోరు సాగుతున్నది. వెన్నెలకు ఉత్సాహంగా ఉన్నది. లయబద్ధంగా మెడ, భుజాలు ఆడిస్తూ కనురెప్పవేయకుండా చూస్తుండిపోయింది.

యుద్ధంలో పుట్టి పెరుగుతున్న వెన్నెల మనసులో ప్రశ్నలెన్నో? హోరెత్తే పాటలెన్నో??

(ఖమ్మంలో నవంబర్ 16,17 తేదీల్లో జరిగిన విరసం వర్క్‌షాపులో చదివి, సవరించిన కథ)

**Kathala Panta - 3**
*Virasam*

# కథల పంట 3

విరసం కథా వర్కుషాపులు నిర్వహించి ఆ వర్క్‌షాపుల్లో చదివి పరిష్కరించుకున్న కథలను సంకలనంగా తెస్తున్నది. ఈ వరసలో ఇది మూడవ రచయితల సమిష్టి సేద్యపు కథల పంట. ఈ వర్కుషాపుల నిర్వహణలో రాష్ట్ర వ్యాపితంగా ఉన్న విరసం రచయితలతోపాటు మిత్ర రచయిత/త్రులు–ఏ ప్రాంతంలో నిర్వహిస్తే అక్కడి వాళ్లు పాల్గొంటున్నారు. ఈ వర్కుషాపుల వలననే కథకు సంబంధించిన విస్తృతి, అధ్యయనం పెరిగి–ప్రాంతాలవారిగా, జిల్లాలవారిగా కథా సాహిత్యం సేకరణ, అధ్యయనం ముందుకు వచ్చాయి.

ఈ పందొమ్మిది కథల్లో సాంప్రదాయక పద్ధతితోపాటు–భిన్నంగా, గతితార్కికంగా, మూలాల్లోకి వెళ్లి ఆలోచించే కథలు ఉన్నాయి. ఇది ఒక రకంగా విప్లవ కథా సాహిత్యంలో ఒక గుణాత్మకమైన మార్పు. సమిష్టి అధ్యయనం ద్వారా నేర్చుకోవడం కథల్లో కనిపిస్తుంది. కొత్త కథా ఆవరణంలోకి ముఖ్యంగా, ఎక్కువగా రచయిత్రులు ప్రవేశించి కథను పరిపుష్టం చేయడం ఈ సంకలనంలో కనిపిస్తుంది.

– అల్లం రాజయ్య